పద్య సప్తశతి

శ్రీ సీతారామ కల్యాణము

శ్రీమద్రామాయణము - బాలకాండము


పద్యానువాదము



అష్టావధాని
కోట రాజశేఖర్



చం. సతతము నీదు నామమె ప్రశస్త మటంచు జపించుచుంటి, నా
తత శుభదాయక మ్మనుచుఁ దావక గాథ రచించుచుంటి, నీ
కతమున మోక్షసంపద సుఖమ్మున నందగ నుంటి, నీకు నం
కితమిడుచుంటి దీనిఁ బరికించి గ్రహింపుము జానకీపతీ!





శ్రీ సీతారామ కల్యాణం గ్రంథ ముద్రణకు నిధులను సమర్పించిన రామభక్తులు
శ్రీ అడవికొలను వేంకట్ (వేంకటేశ్వర్లు) USA గారు,
వారి ధర్మపత్ని శ్రీమతి జ్యోత్స్నాకుమారి గారు,
వారి కుమారుడు చిరంజీవి రోహిత్ గారు.

పద్య సప్తశతి

శ్రీ సీతారామ కల్యాణము

శ్రీ మద్రామాయణము – బాలకాండము

పద్యానువాదము



అష్టావధాని

కోట రాజశేఖర్

విశ్రాంత సంస్కృత ఉపన్యాసకులు

రామకృష్ణా జూనియర్ కళాశాల

అల్లూరు, నెల్లూరు జిల్లా

శ్రీ సీతారామ కల్యాణము

శ్రీమద్రామాయణము – బాలకాండము
అనువాదము – పద్య సప్తశతి

'అష్టావధాని'

కోట రాజశేఖర్

శంకరాభరణం ప్రచురణలు – 51
ప్రథమ ముద్రణ : జనవరి 2022
ప్రతులు : 500
వెల : ₹ 350

ప్రాప్తిస్థానం :
1. 'అష్టావధాని' కోట రాజశేఖర్
ఇంటి నెం. 4–338, 3వ అడ్డరోడ్డు, మొదటి వీధి,
కె.ఆర్.ఆర్. నగర్, పడుగుపాడు,
కోవూరు మండలం,
పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా
(చరవాణి : 99662 36604)

2. జయభాస్కర ప్రచురణలు
ఎస్3, సాయి కల్యాణ్ అపార్ట్ మెంట్స్,
రోడ్ నం.4, రాధాకృష్ణ హౌసింగ్ కాలనీ
డా. ఎ.ఎస్. రావు నగర్,
హైదరాబాద్ – 500062
(చరవాణి: 8555082034)

డి.టి.పి. : శ్రీ కంది శంకరయ్య (75698 22984)
కవర్ డిజైన్ : శ్రీ విట్టుబాబు (85550 82034)
ముద్రణ : కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాదు

శ్రీ సీతారామ కల్యాణ కావ్య ముద్రణకు
నిధులను సమర్పించిన రామభక్తులు

శ్రీ అడవికొలను వేంకట్ (వేంకటేశ్వర్లు) గారికి

శుభాకాంక్షలతో నవరత్నములు



సీ. శ్రీరమ్యచిత్తమ్ము శ్రీమాన్యచరితమ్ము
శ్రీకర సజ్జన సేవనమ్ము
సద్భక్తితత్త్వమ్ము సత్సంగమార్గమ్ము
పావనమ్మౌ దివ్యజీవనమ్ము
పూరుష సుగుణాలు పూర్ణమ్ముగా వెల్గు
పాత్రుడు శ్రీ చక్రపాణిరావు
సహనమ్ము సత్యమ్ము సౌజన్యభావమ్ము
ఘనముగా గల సాధ్వి కల్పవల్లి
ఆ.వె. పుణ్యదంపతులుగ పుడమి నుండగ, వారి
పుత్రరత్న మగుచు పుట్టినట్టి
అడవికొలను వేంకటాఖ్యా! మహాశయా!
రామభక్త! సుగుణధామ! శుభము.

సీ. శ్రీ సరస్వతి యను గృహనామమున వెల్గు
వేంకటరామయ్య విబుధమణికి
సంగీత సాహిత్య సత్కళాదుల మెచ్చు
వేంకటలక్ష్మియన్ విమలసతికి
పుణ్యాల పంటయై పుత్రికారత్నమై
ప్రభవించి బహునృత్యసభల మించి
గురుకృపన్ విద్యలన్ గొప్పగా రాణించి
మహి కీర్తి నందిన మహితసుదతి
ఆ.వె. సుమతి నీదు పత్ని జ్యోత్స్నకుమారి, మీ
సుతుడు రోహితుండు హితులు మీకు
అడవికొలను వేంకటాఖ్యా! మహాశయా!
రామభక్త! సుగుణధామ! శుభము.

సీ. లక్ష్యమ్ము సాధింప లలితాసహస్రమున్
సౌందర్యలహరిని శాస్త్రములను
విమలగీతమ్ముల నమకమున్ చమకమున్
స్తుతులను త్రిశతిని సూక్తములను
రమణీయ రామాయణమును భారతమును
భాగవతమ్మును భక్తి చదివి
తావకపత్ని జ్యోత్స్నకుమారినిఁ గూడి
ధర్మయుక్తమ్ముగా తత్త్వమరసి
ఆ.వె. తలచుచును తరించి తరియింపఁజేసెడి
బుధ! మహానుభావ! పుణ్యమూర్తి!
అడవికొలను వేంకటాఖ్యా! మహాశయా!
రామభక్త! సుగుణధామ! శుభము.

సీ. ఘన సనాతనధర్మమును దెల్పు జ్ఞానమున్
వ్యాపింప జేసెడి భాగవతుడ!
ప్రథిత సద్ధార్మికగ్రంథప్రదాత! ది
వ్యాధ్యాత్మ సేవల యందు ఘనుడ!
పేదసాదలపట్ల ప్రీతితో బహుదాన
ముల జేయు సౌజన్యమూర్తి! బుధుడ!
సుతుడగు రోహిత్ ను, స్నుష నెరిన్, మనుమల
కిల్లియన్ రోరీల నుల్ల మలర
ఆ.వె. గనుచు, పత్ని జ్యోత్స్న అనురాగ మందుచు
ఇలను ధర్మకార్యములను జేయు
అడవికొలను వేంకటాఖ్యా! మహాశయా!
రామభక్త! సుగుణధామ! శుభము.

మ. "నిధి సౌఖ్యమ్ము నొసంగునా? తెలుపుమా నీ" వన్న "శ్రీరాము స
న్నిధియే సౌఖ్య మొసంగు" నంచు మదిలో నేర్పొప్ప భావించుచున్
నిధులన్ గూర్చితి వీవు రామకథకై, నిన్ బ్రోచు నా రాముడే
బుధ! జ్యోత్స్నాపతి! వేంకటేశ్వర! కృపన్ ముక్తిన్ బ్రసాదించెడిన్.

మ. తను వా రాముని కంకిత మ్మనుచు సీతారామకల్యాణ గా
థను సంపూర్ణముగా పఠించి, సరిగా తత్త్వమ్ము లోనెంచి, పా
వన కార్యమ్మని గ్రంథముద్రణవిధిన్ భాగ్యమ్ముగా నెంచి, రా
ముని సేవించిన వేంకటేశ్వర! మిమున్ బ్రోచున్ సదా రాముడే.
తే.గీ. అమెరికాదేశ వాసివై యలరుచున్న
మదిని భారతసంస్కృతిన్ మరువకున్న
అడవికొలను వంశాగ్రణి! అవని నెన్న
సారమతి! వేంకటేశ్వర! మీరె మిన్న.

కం. శ్రీమన్! భాగవతోత్తమ
హేమ! అడవికొలను వేంకటేశ్వర! ధీమన్!
క్షేమము నిడి మిము నా శ్రీ
రాముని కృప కవచమగుచు రక్షించు సదా!

తే.గీ. ఆయురారోగ్య భాగ్యమ్ము లమరుగాక!
అతులభక్తి జ్యోత్స్నసతి యమరుగాక!
అలఘుమతి పుత్రపౌత్రుల కమరుగాక!
సుమతి! రాముని కృప సదా అమరుగాక!

కృతజ్ఞతాపూర్వక శుభాకాంక్షలతో...
'అవధాని' కోట రాజశేఖర్
12-12-2021 అల్లూరు, నెల్లూరు.



విషయ సూచిక

ఆశీస్సులు, అభినందనలు

పీఠిక

శ్రీ సీతారామ కల్యాణము (బాలకాండము)



శ్రీశ్రీశ్రీ శ్రీహరితీర్థ స్వాములవారు
శ్రీసత్యానందాశ్రమ పీఠాధిపతులు
శ్రీసత్యానందాశ్రమము, ఇనమడుగు
నెల్లూరు జిల్లా - 524137

ఓం నమో భగవతే శ్రీసత్యానందాయ

మంగళాశీర్వచనములు

శ్రీసత్యానందాశ్రమ ఆస్థాన పండితులు శ్రీ కోట రాజశేఖర్ గారు 2019 లో భాగవత సప్తాహము ఏర్పాటు జేసినప్పుడు తాము శ్రీసీతారామకల్యాణ కావ్యరచన చేయుచున్నట్లు చెప్పినారు. ఆ మాట విని నేను చాల సంతోషించినాను. కాలమును మంచి కార్యములయందు గడుపవలయు నని పెద్దలు చెప్పియున్నారు. కావున ఈ కరోనా కాలములో ఎచటికి వెళ్ళకుండ పరమార్థవ్యాసంగమునందు గడుపుట విశేషమైన విషయము.

శ్రీబాలగంగాధర్ తిలక్ గారు జైలులో ఉన్నప్పుడు గీతా రహస్యమును వ్రాసినారు. ఇప్పుడు అది ఎంతో మంది సాధకులకు ఉపయోగపడుచున్నది. ఆలాగుననే ఈ కరోనా కాలమును వీరు సద్వినియోగపరచినారు.

శ్రీరామచంద్రుడు జగత్ప్రభువు. దయాసముద్రుడు. మర్యాదాపురుషోత్తముడు. తన ఆచరణ ద్వారా ప్రపంచమునకు ధర్మమును మానవత్వమును బోధించినవాడు. తన అడుగుజాడలలో నడుచుటకు ప్రజలకు అనువైన మార్గమును ఏర్పఱచిన ధర్మమూర్తి. తల్లిదండ్రులు గురువులు అన్నదమ్ములు బంధువులు అనుచరులు మొదలగువారి యెడల, రాజ్యపరిపాలనము నందు తన కర్తవ్యాన్ని సంపూర్ణంగా నెరవేర్చేవాడు. భృత్యులయెడల, తనను శరణు కోరి ఆశ్రయించినవారియెడల, ఎలా ఉండవలయునో ఆచరించి చూపించిన ఆదర్శమూర్తి. మానవుడుగా అవతరించి మహోన్నత వ్యక్తిత్వముతో ఈ భూమిపై సంచరించిన ఆ శ్రీరామచంద్రుని బాల్యవిశేషములను పద్యకావ్యముగా వ్రాయుటలో కాలమును సద్వినియోగ పఱచిన మా కోట రాజశేఖర్ గారు ధన్యాత్ములు.

శ్రీరామచంద్ర మహాప్రభువు ఆర్తత్రాణ పరాయణమనే వ్రతమును ఎంత చక్కగ చెప్పి దానిని అమలు చేసి చూపించినారో ఈ క్రింది వాల్మీకి మహర్షి శ్లోకము తెలియజేయుచున్నది.

శ్లో. సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే,
అభయం సర్వభూతేభ్యో దదా మ్యేత ద్వ్రతం మమ ॥ (6-18-35)

వాల్మీకి మహర్షి విరచితమైన ఈ శ్లోకమునకు మా రాజశేఖర్ గారి కలమునుండి తేటతెలుగునందు పద్యము హృద్యముగ చక్కగా ఎట్లు జాలువారినదో చూడండి.

ఉ. ***శ్రీరఘురాము డుత్తముడు, శిష్టజనావనతాయశస్వితా***
ధారుడు, లోకమోహనుడు, "తావక దాసుడ" నన్న చాలు సం
సార పయోధి దాటుటకు సాయముఁ జేయును, రామనామమే
తారకమంత్రమై తనరి ధన్యతఁ గూర్చు జపించువారికిన్. (14)

ఈ పద్యమునందు భగవంతుని ఎందుకు ఆశ్రయింపవలయునో, ఆశ్రయించువారు ఏమి ప్రయోజనమును పొందగలరో చక్కగా తెలిపియున్నారు. లోకమునకు శ్రేయస్సును చేకూర్చు ఇటువంటి కవిత్వము నిజమైన కవిత్వము అని పెద్దలు చెప్పియున్నారు.

ఈ సీతారామకళ్యాణ గ్రంథమునందు శ్రీవాల్మీకి ప్రణీతమైన మూలశ్లోకములను తనకు అవసరమైనంత మేర పొందుపఱచి తాత్పర్యమును అందించి తెలుగు పద్యములుగా ఎంతో సుందరముగ అనువదించి ఇందు ఇమిడిపోయేటట్లు చేసినారు. ప్రతిపద్యము హృద్యమే. ప్రతి పలుకు రమ్యమే. చక్కని అనువాదము కావున దీనికి మరల వ్యాఖ్యానము అవసరములేదు. అలతి అలతి పదాలతో, అందమైన అద్భుతమైన భావాలతో అల్లిన రమణీయమైన కవిత్వము మా రాజశేఖర్ గారిది అనడం వాస్తవం.

చెఱకు ఎక్కడి నుండి తిన్నా తీయగానే ఉంటుంది. అలాగే శ్రీరాముని గాథ ఎక్కడినుండి చదవడం ప్రారంభించినా అది అమృతమే. శ్రీరామ సాగరములో మునకలు వేస్తే ఎన్నో రత్నాలు, మణులు, మాణిక్యాలు దొరుకుతాయి. ఈ శ్రీరామాయణ మహాసాగరములో మానవాళి జీవన స్రవంతికి కావలసిన రత్నములు కోకొల్లలుగా ఉన్నవి.

వాల్మీకి మహర్షి తాను విరచించిన శ్రీమద్రామాయణంలో ప్రతి వేయి శ్లోకములకు ఒక గాయత్రీమంత్రాక్షరమును నిక్షిప్తం చేసిన విషయం అందఱికీ తెలిసినదే. బాలకాండలో మూడుచోట్ల అంటే తపఃస్వాధ్యాయ నిరతం... (1-1-1) స హత్వా రాక్షసాన్... (1-30-23) విశ్వామిత్రస్తు... (1-67-12) అను శ్లోకములలో మొదటి అక్షరాలుగా 'త' 'స' 'వి' అను గాయత్రీమంత్రాక్షరములు ఉన్న విషయం గాయత్రీరామాయణం ద్వారా విదితమౌతుంది.

శ్రీ కోట రాజశేఖర్ గారు పై సందర్భములలో వ్రాసిన పద్యములలో 1 వ పద్యము - "తపమున్ జేసెడి వాడు..." 1-1-1 (బాలకాండ – 1 వ శీర్షిక - 1వ పద్యము), 228 వ పద్యము - "సవము సమాప్తంబగుటకు..." 1-30-11, 568 వ పద్యము - "వినయమున నటు జనకుడు..." 1-67-7 అను పద్యములలో మొదటి అక్షరములుగా ఆ అక్షరములే ఉండటం ఒక విశేషం అని చెప్పవచ్చు.

పరమసాధ్వి, పతివ్రతామతల్లి సీతమ్మవారు భర్తయెడల ఉత్తమ ఆచరణమును ఎలా కలిగియుండెడిదో ఈ పద్యమునందు మనం గమనించవచ్చు.

చం. ప్రణయము ప్రీతియున్ భయము భక్తియు సిగ్గు దలిర్ప సీత రా
ముని మదిలోని భావములఁ బూర్ణముగా నెఱుగంగ; రాముడున్
గనుగొనసాగె సీతమదిఁ గల్గెడి భావములన్, బరస్పర
మ్మును గుణరూపశీలములఁ బూర్ణత నందిరి యిర్వురున్ దమిన్. 1-77 (738)

అన్యోన్య దాంపత్యమంటే ఇదే. ఇట్టివారి జీవితములో ఎంత పెద్ద కష్టము వచ్చినా అది సమసిపోయి ఆ దంపతులు పరమానంద సౌఖ్యజీవితమును గడిపెదరు.

ఈ శ్రీ రామాయణమునందు ఇవియే మనము నేర్చుకోవలసిన సుగుణములు, సంపాదించుకోవలసిన రత్నములు. వీనిని ఆచరణ యందు పెట్టినచో మన జీవితము ఆనందమయమే. ఆనందము కొఱకే అన్ని ప్రాణులు పాకులాడుచున్నవి గదా!

సీతమ్మవారు ఇలాంటిదైతే శ్రీ రాముడు ఎలాంటివాడో ఈ పద్యమునందు చక్కగ నుడివియున్నారు. మన జీవనమునకు చక్కగా ఉపయోగపడునట్టి ఉపదేశ రత్నములను మనము ఈ రామాయణమునుండి సమకూర్చుకో వలయును.

చం. అనిశము ధర్మ మెంచుచు, ప్రజావళికిన్ బ్రియమాచరించుచున్,
జనకుని యాజ్ఞ జేయుచు, బ్రశస్తముగా దన తల్లు లందఱిన్,
మనమున నెంచి సేవల సమంచిత రీతుల గొల్చువాడునై,
ఘన గురువర్య కార్యములఁ గాంక్ష నొనర్చెడి రాము డాదటన్. 1-77 (733)

ఇట్టి అన్యోన్య సంబంధ బాంధవ్యముల వలన చక్కగ జీవనము సాగిపోవును. ఇట్టి జీవన విధానమును అలవరచుకొని అనంతసౌఖ్యమును చదువరులు పొందుదురుగాక!

పాఠకులు ఈ గ్రంథమును చదివి నిత్యజీవితమునందు ఇందులోని ధర్మములను ఆచరించినప్పుడే శ్రీరాజశేఖర్ గారి పరిశ్రమ నిజముగ సాఫల్యము నొందును. వీరు ఇంకను ఇలాంటి ప్రజోపయోగకర సాహిత్యమును పరిఢవింపజేసి సద్గురు శ్రీసత్యానందమహర్షులవారి శ్రీబ్రహ్మానందతీర్థస్వాములవారి అనుగ్రహమునకు పాత్రులగుదురుగాక!

శ్రీ శ్రీ సీతా రామభద్రుడు అనేకానేక భద్రములను ప్రసాదించునుగాక! ఇతి శమ్.

24-12-2021



ప్రముఖ అవధానకవి,
హంస పురస్కార గ్రహీత
శ్రీ నరాల రామారెడ్డి గారు
ప్రొద్దుటూరు

కళ్యాణం కమనీయం

నేను ప్రొద్దుటూరులో శ్రీమలయాళ స్వామి ప్రాచ్య కళాశాలలో ఆంధ్రోపన్యాసకుడుగా ఉద్యోగం చేస్తున్నపుడు చి॥ కోట రాజశేఖర్ 1972 సంవత్సరంలో A విద్వాన్ కోర్సులో ప్రవేశించి సంస్కృతాంధ్ర భాషల్లో అధ్యయనం చేసి మంచి పాండిత్యాన్ని సంపాదించుకొన్నాడు.

విద్యార్థి దశలోనే పద్యరచన ప్రారంభించిన రాజశేఖర్ కొన్ని అష్టావధానాలు కూడా చేశాడు. అవధాన ప్రక్రియ నిర్వహించే కాలంలో రాజశేఖర్ పద్యాల్లో పరిపక్వత లేదు. 2012 సం॥ తర్వాత చక్కని శైలిని సాధించి సమస్యలను, దత్తపదులను పూరిస్తూ సహృదయుల ప్రశంసల్ని అందుకొన్నాడు. 'శంకరాభరణం' వంటి బ్లాగుల్లో రాజశేఖర్ పద్య రచనా ప్రావీణ్యం కంది శంకరయ్య గారి ప్రోత్సాహంతో అందరి దృష్టినీ ఆకర్షించింది. నెల్లూరులో జరిగిన 'రోజుకో పద్యం – శంకరాభరణం (పద్య కదంబం)' ఆవిష్కరణ సభలో రాజశేఖర్ ఆహ్వానాన్ని అందుకొని పాల్గొన్నాను. అప్పుడు రాజశేఖర్‌తో "ఏదైనా మంచి ఇతివృత్తాన్ని తీసుకొని కావ్యం రచిస్తే బాగుంటుంది" అన్నాను.

నా ఉపదేశాన్ని అంగీకరించి, నా పేరున్న కథానాయకుని ఇతివృత్తాన్ని స్వీకరించి 'శ్రీ సీతారామ కల్యాణం' అనే మధురకావ్యాన్ని రచించి తెలుగు భాషాభిమానులకు కానుకగా అందించిన రాజశేఖర్ రమణీయ కృషిని మనసారా అభినందిస్తున్నాను.

కావ్యరచనా సందర్భంలో రాజశేఖర్ వినయ వర్తనంతో విద్వత్కవులు శ్రీ సూరం శ్రీనివాసులు గారితో, అప్పుడప్పుడు నాతో పద్యరచనలో మెలకువలను తెలుసుకొంటూ ఉండటం అభినందనీయం.

సంస్కృత భాషలో మహాకవి వాల్మీకి రచించిన శ్రీమద్రామాయణ మహాకావ్యంలోని బాలకాండను రాజశేఖర్ తెలుగుబాసలో 'శ్రీసీతారామ కల్యాణం' పేరుతో పద్యానువాదం చేయడం విశేషం. మాన్యులు వావిలికొలను సుబ్బారావు గారు వాల్మీకి రామాయణాన్ని యథాతథంగా, మూలవిధేయంగా, సంపూర్ణంగా అనువాదం చేశారు. రాజశేఖర్ కేవలం సీతారామ కల్యాణం వరకే 741 పద్యాల కావ్యంగా తీర్చి దిద్దారు. మొల్ల కవయిత్రి సంపూర్ణంగా రచించిన రామాయణంతో సమానమైన పరిమాణం.

రాజశేఖర్ రచించిన శ్రీ సీతారామ కల్యాణ కావ్యం మృదులమైన, మధురమైన శైలిలో సాగింది. ఇతివృత్తంతో పాటు వృత్తరచన ధారాళంగా ప్రవహించింది. వ్యర్థపదాలు లేకుండా, అన్వయక్లిష్టత లేకుండా ప్రతి ఘట్టాన్నీ తీర్చిదిద్దిన రాజశేఖర్ కృషిని అభినందించక తప్పదు.

వాల్మీకి సంస్కృత శ్లోకాలను అందమైన తెలుగులో అనువదించిన రాజశేఖర్ ప్రతిభను ప్రతిబింబించిన పద్యాలెన్నో ఉన్నాయి.

కౌసల్యా సుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే ।
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్ ॥ (1-23-2)

ఈ శ్లోకాన్ని రాజశేఖర్ తెలుగులో అందంగా కందంగా తీర్చి దిద్దిన పద్యమిది...

కౌసల్యాసుప్రజ రా
మా! సుందర! పూర్వసంధ్య యమరె, నృశార్దూ
లా! సుమతీ! దైవికమున్
భాసుర మాహ్నికముఁ జేయవలె నిక లెమ్మా! (161)

రాజశేఖర్ రచించిన శ్రీసీతారామ కల్యాణంలో 77 ఘట్టాలున్నాయి. అన్ని ఘట్టాలను రాజశేఖర్ ప్రత్యేక శ్రద్ధ వహించి చక్కని శైలిలో రచించాడు.

రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు జన్మించిన తర్వాత దశరథుని ఉదాత్తతను చిన్న తేటగీతిలో చిత్రించిన వైనం అభినందనీయం. ఆ పద్యమిది...

నాల్గు ముఖములతో బ్రహ్మ వెల్గునట్లు,
నాల్గు వార్ధుల వరుణుడు వెల్గునట్లు,
నాల్గు భుజముల విష్ణువు వెల్గునట్లు,
వెల్గె నల్వురు పుత్రులు గల్గ విభుడు. (116)

'గంగావతరణ' ఘట్టంలో భూమండలానికి చేరిన మందాకినీ మనోహర గమనాన్ని మత్తేభంలో నేత్రపర్వంగా వర్ణించిన తీరు ప్రశంసనీయం.

ఒకచో నేగును గంగ వేగముగఁ, దా నొక్కొక్క చో మెల్లగా,
నొకచో నాయతతం జనున్, గుటిలగా నొక్కొక్క చో, దూకుగా
నొకచో, నూర్ధ్వముగాఁ జరించు నొకచో నుద్భూతగా, నమ్రగా
నొకచోటన్ బ్రవహించుఁ, బావనముగా నొప్పారుచున్ ధాత్రిపై. (353)

'శివధనుర్భంగ' ఘట్టంలో శ్రీరాముడు శివధనుస్సు నెత్తిన విధానంలో రాముని ధీరవర్తనం ప్రతిబింబించిన పద్యమిది...

ఇనకులజుండు రాముడు మహేశుని చాపముఁ జేరినాడు, దా
నిని బరికించినాడు, కరనీరజ మెత్తుచుఁ బట్టినాడు, వీ
రుని వలె నెత్తినాడు; గుణరోచులఁ గోటిని వంచి, మేటి నా
రిని వెసఁ జుట్టి, దాని సవరించు గుణాత్ము డితండె చూడుడీ. (572)

దశరథుని నలుగురు కుమారులు రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు వరుసగా సీత, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తి కన్యలను వివాహమాడి అయోధ్యకు బయలుదేరిన సందర్భంలో మిథిలానగర ప్రజలు శ్రీరాముని మనోహర రూపాన్ని చూచి ఇలా అనుకొన్నారట...

ఈ రాముడే కదా క్రూరరాక్షసియగు
తాటకన్ జంపిన ధైర్యమూర్తి
యీ రాముడే కదా ఋషివర్యుయాగమున్
లీల రక్షించిన బాలమూర్తి.... (673)

ఇలా సాగుతుంది సీసం. అందమైన విన్యాసం. ఈ పద్యాన్ని చదివినప్పుడు మనకు స్మృతిపథంలో పోతన భాగవతంలో మధురాపురంలో ప్రవేశించిన శ్రీకృష్ణుని వీక్షించిన మగువలు అనుకొన్న మాటలు స్ఫురిస్తాయి.

"వీడటే రక్కసి విగతజీవిగఁ జన్ను
బాలు త్రావిన మేటి బాలకుండు
వీడటే నందుని వెలదికి జగమెల్ల
ముఖమందు జూపిన ముద్దులాడు..."

(పోతన భాగవత దశమస్కందం – 1250)

చిll కోట రాజశేఖర్ కవితా కృషీవలుడుగా శ్రీ సీతారామ కల్యాణం వంటి ప్రాచీన కథావస్తువులతో రచనా పాటవాన్ని ప్రదర్శించటం ప్రశంసార్హం. అలాగే ఆధునికమైన ఇతివృత్తాలను తీసుకొని సామాజిక దృక్పథంతో రచనలు సాగించాలని ఆశిస్తున్నాను. మనసారా ఆశీర్వదిస్తున్నాను.

చిక్కని తేనె పుల్లసరసీజమునుండి స్రవించినట్లు నీ
చక్కని శైలి పద్యముల సాగగ; పావన రామగాథపై
మక్కువ పొంగిపోవ రసమంజుల కావ్యము వ్రాసినావు – సొం
పెక్కిన నీదు కైత వికసించెను నందన పారిజాతమై.

నరాల రామారెడ్డి

ప్రొద్దుటూరు,

10-12-2021.



వ్యాస మహాభారత అనువాదకులు
డా. సూరం శ్రీనివాసులు గారు
విశ్రాంత ప్రధానాచార్యులు,
ఓరియంటల్ కాలేజి, తిమ్మసముద్రం

పన్థానస్సన్తు తే శివాః

ఏ భాషకైనా పరిమిత సంఖ్యలోనే అక్షరాలు ఉంటాయి. అన్ని భాషలకూ ఒకే వర్ణమాలను తయారుచేసినా వంద అక్షరాలు కూడా కాలేదు. ఆ అక్షరాలను ఒకదానితో మరొక్కదానిని కూర్చటంతో పదాలు అర్థవంతాలే అనంతంగా తయారయ్యాయి. ఆ కూర్పులోని ఆనుపూర్వికి చేసే అర్థనిర్ణయమే భిన్నభాషలనూ తయారు చేస్తుంది. ఒక క్రమం తెలిసిన వాడికే మరొకక్రమం అర్థం కాకుండానూ చేస్తుంది.

మనకు అంకెలు తొమ్మిదే ఉన్నాయి. సున్నాను కూడా కలుపుకుంటే పది. కానీ ఆ పదింటితో అనంతసంఖ్యలను తయారుచేస్తున్నాం. లెక్కించి ఉచ్చరించటానికి కూడా వీల్లేనంత పెద్ద సంఖ్యలనూ తయారుచేస్తున్నాం.

రంగులు అయిదు, ఆరు లేదా ఏడు. రుచులు ఆరు. కానీ వీటి కలయికలు వర్ణ రుచి భేదాలను ఏర్పరుస్తున్నాయి.

ఇదంతా ఎందుకు చెప్తున్నానంటే మనమైనా త్రిగుణాలతో ఏర్పడుతున్నవాళ్ళమే. ఆ త్రిగుణాలలోని కలయికలోని భేదాలు రూప భావాలలో అనంత భేదాలను కల్పిస్తున్నాయి. ఆ కారణంగానే తిన్నదానినే తిన్నా, చూచినదానినే చూచినా, విన్నదాన్నే విన్నా మనకు అరుచి లేదు, అభిరుచికి భంగపాటు లేదు.

ఆ నేపథ్యంలో చూస్తే శ్రీరామకథను తెలుగులో ఎంతమంది వ్రాశారో, ఎన్నెన్ని రకాలుగా వ్రాశారో లెక్కే తెలియదు. ఒకే కథకు ఇన్ని రూపాలా? అంటే కథ ఒక్కటే అయినా కథకులు వేరు, కథనరీతులు వేరు, కథనకాలం వేరు. తిక్కన కాలానికి తిక్కన నిర్వచనోత్తర రామాయణాన్ని తనదైన శైలిలో రచిస్తే తిక్కన తరువాతి అయ్యలరాజు రామభద్రుడు తిక్కన శైలిని కూడా అనుకరిస్తూ రామాభ్యుదయాన్ని రచించాడు. కథనకాలం వేరైనందువల్ల ఏర్పడిన ఆనుకూల్యమిది. అదే ప్రాతికూల్యం కూడా కావచ్చు సమర్థత లోపిస్తే.

వ్రాస్తే రామకథనే వ్రాయాలన్న సంకల్పం కొందరిదైతే కథ తెలిసిందే కదా వ్రాద్దామన్న భావం కొందరిది. ఆ కొందరిలో కవీ, పాఠకుడూ ఇద్దరూ ఉంటారు. ఇక భక్తి పారమ్యంతో రామకథను వ్రాసేవారు కొందరు. కథ ప్రసిద్ధమైతే కల్పనలోని అవకతవకలకు అవకాశం ఉండదు. ఆ ఊతంలో ప్రసిద్ధ రామకథను వ్రాశారు కొందరు. నిజమే! మామూలుగా

కల్పనలో అయితే హనుమంతుడు సముద్రాన్ని దాటడాన్ని పాఠకుల చేత ఒప్పించటం అంత తేలికేమీ కాదు.

ఈ కారణ నేపథ్యంలో ఒకటో, కొన్నో, అన్నియో కలిసి చి॥ కోట రాజశేఖర్‌ను సీతాకళ్యాణ కావ్య నిర్మాణానికి ప్రోత్సహించాయి. సీతాకళ్యాణమంటే శ్రీమద్రామాయణంలోని బాలకాండ కథ.

శ్రీరాముడు ఆదర్శమానవుడు. రూపు కట్టిన ధర్మం, ఆశ్రిత రక్షకుడు. ఇవన్నీ జగమెరిగిన లక్షణాలు. వీటినే మరల గుర్తు చేయటమంటే వాల్మీకి రామాయణం చాలు. మన భాష కాదు కదా అంటే తెలుగులో కూడా రామాయణాలు కుప్పలు కుప్పలు. అయితే అవేవీ రాజశేఖర్ మాటలు కావు. రాజశేఖర్ తన మాటల్లో కూడా శ్రీరాముని ప్రదర్శించాలంటే రాజశేఖర్ మాటలే కావాలి.

మాటలలోని విలక్షణత ఏమిటంటే ఒకే పదాన్ని ఒకరు పలికితే నచ్చకపోయినా మరొకరు పలికితే నచ్చుతుంది. మరొకరి అన్వయంలో నచ్చుతుంది. మరొకరి పదానుపూర్విలో నచ్చుతుంది. వాల్మీకి శ్లోకం నచ్చని వాడికైనా ఒక్కోసారి రాజశేఖర్ పద్యం నచ్చవచ్చు ఆయా సంస్కార విశేషాలను బట్టి. అందుకే ఒక మంచిమాటను నలుగురూ చెప్పే ప్రయత్నం చేయాలి. ఎవరికి ఎవరి మాట నచ్చుతుందో తెలియదు గదా! నచ్చటమే అవసరం. అందుకే అందరి ప్రయత్నం.

రాజశేఖర్ బాలకాండ అనువాదం యథాతథం కాదు. ఇది యథావసర యథాతథానువాదం. వాల్మీకిని అనుసరించినంత మేర. అక్కడక్కడ అమూలకాలైన పద్యాలూ కనిపిస్తాయి. అమూలక భావాలూ కనిపిస్తాయి. అన్యత్ర ప్రసిద్ధమైన భావాలకు అనుకరణ రూపాలే అవి. అయితే సముచితాలు.

వాల్మీకిని తానర్థం చేసుకొని మనకు అర్థమయ్యేలా చెప్పటం రాజశేఖర్ చేపట్టిన పని. తాను ఆశించినంత మేర కృతకృత్యుడయ్యాడు. వాల్మీకి రచించిన బుల్లిబుల్లి శ్లోకాలను ఆంధ్రపద్యీకరించటంలో తత్తద్భావానుగుణంగా విభిన్నచ్ఛందస్సులను స్వీకరించి శ్లోకాలను కలుపుకుంటూ (అవసరమైన తావుల) పద్యరచన చేశాడు. ఈ విషయంలో మందర మార్గాన్ని కూడా అనుసరించాడు రాజశేఖర్.

డాంబిక శైలిని కానీ, డాంబిక పదాడంబరాన్ని కానీ ప్రదర్శించకుండా పద్యరచన సాగించాడు. సహజ శైలీ మాధుర్యంతో అక్కడక్కడ కనిపించే శబ్దాలంకార స్పర్శ అప్రయత్న సిద్ధమే కానీ దానికై కవి తాపత్రయపడ్డట్టు అనిపించదు. ఏతావాతా ఒక సరళమైన సీతాకళ్యాణ సందర్భమిది.

17-12-2021 **సూరం శ్రీనివాసులు**



'పంచసహస్రావధాని'

డా. మేడసాని మోహన్ గారు

తిరుపతి

ఆనందాక్షరి


సీ. ధన్యమాన్యంబు సీతారామ కళ్యాణ
కృతి వినిర్మాణ వరిష్ఠయశుఁడు
సుప్రసన్న కవిత్వ శోభిత ప్రతిభా వి
భూషిత భావుక బుద్ధిబలుఁడు
అవధాన సువిధాన వివిధాంశ ధిషణా ప్ర
పూర్ణ విజ్ఞాన సమ్మోదితుండు
శ్రీరామచంద్ర పాదారవింద మరంద
సేవనానంద సంభావితమతి

తే.గీ. సంస్కృతాంధ్ర సాహిత్య విశారదుండు
మహదధీతి బోధాత్మ సమంచితుండు
నిత్య వాఙ్మయోపాసనా నిష్ఠితుండు
కోట రాజశేఖర కవీట్కుంజరుండు.

17-12-2021

మేడసాని మోహన్





'సమస్యా పృచ్ఛక చక్రవర్తి'

శ్రీ కంది శంకరయ్య గారు

'శంకరాభరణం' బ్లాగు, వాట్సప్ సమూహ నిర్వాహకులు

వరంగల్

శుభాభినందనలు

"ఏదైనా మంచి ఇతివృత్తాన్ని తీసికొని ఒక పద్యకావ్యం వ్రాయాలి" అని సూచించారట శ్రీ నరాల రామారెడ్డి గారు. దానిని శిరసా వహించారు శ్రీ కోట రాజశేఖర్ గారు. రామకథను మించిన మంచి ఇతివృత్తం వారికి తట్టలేదు, తట్టదు కూడా! ఎందుకంటే వారు త్రికరణ శుద్ధిగా శ్రీరామభక్తులు. 'శంకరాభరణం'లో ఎటువంటి సమస్యకైనా రామాయణపరంగా పూరణ పద్యాన్ని చెప్పడం వారి ప్రత్యేకత. అచంచల రామభక్తి, నిరంతర సజ్జన సాంగత్యం, ఆధ్యాత్మిక ప్రవచనాలతో కాలాన్ని సద్వినియోగం చేసుకొనే రాజశేఖర్ గారికి రామకథ తప్ప మరొకటి ఎలా తోస్తుంది? 'మరల నిదేల రామాయణంబు?' అన్న ప్రశ్నకు అవకాశమే లేదు. రామకథను ఎందరు, ఎన్ని విధాల, ఎన్నిసార్లు చెప్పినా తనివి తీరదు. అందుకే కోట వారు తామూ రామకథనే ఎన్నుకున్నారు. కేవలం సీతారామ కల్యాణ గాథనే చెప్పాలని సంకల్పం చేసినా అది మొత్తం బాలకాండనే చెప్పించింది. రామకథా ప్రాధాన్యం అటువంటిది. శ్రీరామ జననం నుండి కళ్యాణం వరకు ప్రధాన కథ అయితే ప్రాస్తావికంగా చెప్పబడిన కథలు ఎన్నో. అన్నింటినీ కావ్యబద్ధం చేశారు రాజశేఖర్ గారు.

వీరి పద్యాల మాధుర్యం నాకు క్రొత్త కాదు. కొన్ని సంవత్సరాలుగా శంకరాభరణంలోని సమస్యలకు అద్భుతమైన పూరణలు అందిస్తున్నారు. తాము చెప్పదలచుకొన్న భావానికి ఏ ఛందస్సైనా లొంగిపోవలసిందే. అందుకు వారి ఛందో వ్యాకరణ పరిజ్ఞానం, విస్తార పదసంపద దోహదం చేస్తాయి. ఎక్కడా వ్యర్థ పదాలు కాని, ఊత పదాలు కాని కనిపించవు. అద్భుతమైన ధారతో వీరి పద్యాలు మనోహరంగా ఉంటాయి. వీరి పద్యాల వలెనే వీరి వ్యక్తిత్వం కూడా సౌమ్యంగా ఉంటుంది. నన్ను ప్రభావితం చేసిన వ్యక్తులలో వీరొకరు.

ఇంతటి మధురమైన కావ్యాన్ని సాహితీలోకానికి అందించినందుకు రాజశేఖర్ గారిని అభినందిస్తూ, వీరు బాలకాండతో ఆపకుండా రామాయణ రచన కొనసాగించి పూర్తి చేయాలని ఆకాంక్షిస్తున్నాను. కనీసం సుందరకాండ అయినా వీరి పద్యాలలో చదవాలని ఉంది. మర్యాదా పురుషోత్తముడైన శ్రీరామచంద్రుడు, చదువుల తల్లి వాణీదేవి వీరికి అందుకు తగిన ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రార్థిస్తూ... స్వస్తి!

1-1-2022

కంది శంకరయ్య



అవధాన భారతి, సాహితీ చతురానన, ఛందో వైవిధ్య నిష్ణాత,
స్వర్ణకంకణ – కవి గండపెండేర సత్కార గ్రహీత,
విద్వాన్ చక్రాల లక్ష్మీకాంత రాజారావు గారు
విశ్రాంత సంస్కృతోపన్యాసకులు
హైదరాబాదు

మనోఽభిరామం

సహృదయులు, రసహృదయులు, సరస కవితా మందారవన విహారులు, అవధాన వరేణ్యులు, బుధవంద్యులగు శ్రీ కోట రాజశేఖర కవి రచించిన 'శ్రీసీతారామ కల్యాణము' అను నీ కావ్యమును పరిపూర్ణ భక్తి చిత్తముతో, అమితానందముతోఁ జదివితిని. పరవశుఁడనైతిని.

కథాగమనమున, రచనా విధానమున, పదప్రయోగ వైచిత్రీ విషయమున, పద్య శైలీకరణమున – వీరు చూపిన ప్రతిభకు ముగ్ధుఁడనయితిని.

కథాంశము సుప్రసిద్ధము. ఆదికవి వాల్మీకి మహర్షి విరచిత రామాయణమున బాలకాండ కథావిశేషము. దానిని తెనుగున వ్రాయవలెనను దృఢసంకల్పము శ్రీ రాజశేఖర కవిని ఏతత్కావ్య రచనకుఁ బురికొల్పినది. దానికి ముందు 'శంకరాభరణము' నందలి సమస్యలు, దత్తపదులు – ఇత్యాదులందుఁ దమ బుద్ధికిఁ బదును పెట్టి, పద్య రచనలందు వైవిధ్య విధానములను నేర్చి, అందుఁ బ్రతిభావంతులై వీరు తమ గురువుల, మిత్రుల సలహా మేరకు ఈ పద్యకావ్య రచనకుఁ బూనుకొన్నారు. తద్రచనయందు సఫలీకృతులయ్యారు.

ఇందు ప్రతిపద్యము మనోహర శైలీ భాగ్య శోభితము. సందర్భోచిత పదములతో, వివిధచ్ఛందములతోఁ గావ్యము సొగసులు దిద్దుకొన్నది. ఆంధ్రవాల్మీకి అను బిరుదముతో నొప్పారు కవులలో వీరిని కూడ చేర్చి ప్రశంసించవచ్చు. వీరి కలము నుండి మరికొన్ని కావ్యములు రావాలని కోరుకొందాం.

శ్లో. కోట గృహాబ్ధి సంజాతః రాజశేఖర సత్కవిః ।
శ్రీసీతారామ కల్యాణం వ్యలిఖత్ రసవత్ పదైః ॥

శ్లో. రామాయణ కథావృత్తం భక్తి సాహిత్య సంభృతమ్ ।
కావ్యమిదం బుధస్తుత్యం పఠ పాఠక! శ్రద్ధయా ॥

హైద్రాబాద్, బుధజన విధేయుడు

15-11-2021 **చక్రాల లక్ష్మీకాంత రాజారావు**

9291333880



'పద్యభారతి'

శ్రీ చదలవాడ లక్ష్మీనరసింహారావు గారు

అధ్యక్షులు, జాతీయ సంస్థ, పద్య సారస్వత పరిషత్

ఒంగోలు

ఆశీరభినందన

శ్రీ కోట రాజశేఖర్ గారి పద్యగ్రంథం 'శ్రీ సీతారామ కల్యాణము (రామాయణము – బాలకాండము) ముద్రణకు ముందే సాహిత్యలోక ప్రశంసలను పొందడం ముదావహం. పద్యకవిత్వ ప్రగతికై నిరంతరం కృషి చేసే జాతీయ పద్య సారస్వత పరిషత్ వారిచే నిర్వహించబడు 'పద్యభారతి' వాట్సప్ ఛానల్‌లో ఈ గ్రంథము రచనలో నుండగానే ఒక సంవత్సర కాలం ధారావాహినిగా ప్రసారమై సాహితీ రసజ్ఞుల అభినందనలు పొందగలగటం సత్కృతమే. గత శ్రీరామ నవమి పర్వదిన సందర్భమున ఈ కావ్యములోని శ్రీ సీతారామ కల్యాణ ఘట్టము పద్యభారతిలోని పదకొండు మంది ప్రఖ్యాత గాయకులచే పద్య సంగీత రూపకముగా వీడియో గానం చేయబడటం, అది 'భక్తి ప్రపంచం' వారిచే యూట్యూబులో ప్రసార మొనరించబడి సంగీత సాహితీ వేత్తల, భక్తవరేణ్యుల విశేషాదరణ నొందటం శ్లాఘనీయము. బహుశా ఆధునిక కాలమున ప్రచురణకు ముందే ఇంతటి ప్రతీతి బడిసిన గ్రంథములు అరుదుగ నుండవచ్చునేమో!

శ్రీరామ నామరసం మధురం. రామకథ రమ్యం, కరుణారసాత్మకం, చిత్త మాలిన్య క్షాళనం, పురుషార్థ సాధకం, మానవ జీవన పథ నిర్దేశకం, ఇహపర సౌఖ్య ప్రదాయకం, భారత సంస్కృతి పరిరక్షణలో ప్రజల హృదయాలలో సజీవం. రామాయణ కథా రచనం, శ్రవణం, పఠనములకు చిత్త సంస్కారం కావాలి, జన్మాంతర సుకృతం ఉండాలి. కవిత్రయం వారి నుండి ఆధునిక ప్రఖ్యాత కవుల వరకు పెక్కుమంది ఏదో ఒక రూపములో రామాయణ కథను పలికినవారే. శ్రీ రాజశేఖర్ గారికి కూడా అట్టి ప్రసిద్ధి దక్కటం సంతోషకరం.

శ్రీ రాజశేఖర్ గారు సంస్కృతాంధ్ర భాషా విశారదులు, విద్వత్కవితావధాన ప్రతిభాసంపన్నులు, సుస్వర సుమధుర గళ శోభితులు, మనోహరాకృతీ విలసితులు, సహృదయ సత్త్వ గుణాంచితులు. అన్నీ పూర్వ సుకృత సంప్రాప్తములే.

శ్రీ సీతారామచంద్రుల సత్యాపాసిద్ధిచే రామాయణంలోని ఇతర కాండలు కూడా పద్యకావ్యములుగా వారి లేఖిని నుండి వెలువడాలని మా ఆకాంక్ష. పరాత్పరుడు వారికీ, వారి కుటుంబమునకు చిరాయురారోగ్యైశ్వర్యాలను కటాక్షించాలని మా ఆశ, ఆశయం, ఆశంస.

13-11-2021 **చదలవాడ లక్ష్మీనరసింహారావు**



'గురుప్రపూర్ణ'
డా॥ చీమకుర్తి వేంకటేశ్వర రావు గారు
విశ్రాంత ఆంధ్రోపన్యాసకులు
ప్రధాన కార్యదర్శి, పద్య సారస్వత పరిషత్, నెల్లూరు శాఖ.

పద్య సుమహారం

యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే ।
తావద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి ॥ (1-1-36)

అని మహాకవి వాల్మీకి తన రామాయణ శాశ్వతత్వాన్ని పేర్కొన్నారు. ఆ మహాకవి పల్కిన అక్షరసత్య ఫలితంగా ఎందరో మహాకవులు వివిధ భాషలలో రామాయణ కథను వివిధ ప్రక్రియలలో వెలయించారు. నేటికినీ రచిస్తూ ఉన్నారు. ఆ శ్రీరామచంద్రుని ఆదేశానుసారం నెల్లూరు జిల్లా అల్లూరు రామకృష్ణ జూనియర్ కళాశాలలో సంస్కృతోపన్యాసకులుగా పనిచేసిన శ్రీయుత కోట రాజశేఖర్ గారు శ్రీమద్రామాయణంలోని బాలకాండను అందమైన తెలుగు పద్యాలలో ఒక పుస్తకంగా ముద్రిస్తున్నారు. వీరు సంస్కృతాంధ్ర భాషాకోవిదులు. అవధాన విద్యాప్రవీణులు. అనేక అవధాన సమస్యలను అంతర్జాలంలో పూరించి వాటిని 'రోజుకో పద్యం - శంకరాభరణం' పేరిట ఒక పుస్తకంగా వెలువరించి ఉన్నారు. పెద్దల ప్రోత్సాహంతో తనకు గల అచంచల శ్రీరామ భక్తి ప్రేరణతో శ్రీసీతారాముల కల్యాణాన్ని పద్యరూపంలో హృద్యంగా రచించారు. మహర్షి వాల్మీకి హృదయాన్ని అవగాహన చేసుకుంటూ, వివిధ ఛ్చందాలలో, సందర్భోచిత భాషాపటిమతో, సరళ సంస్కృత సమాస ఘటితంగా, యజ్ఞదీక్షా దక్షతతో, భక్తి ప్రపత్తులు పెనగొనగా శ్రీసీతారామ కల్యాణ కావ్యాన్ని మూలానుగుణంగా రచించి, అందంగా ముద్రించుచున్నారు. వ్రాస్తున్న సమయంలోనే ఈ కావ్యాన్ని నేను అప్పుడప్పుడు చదవడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నాకు తోచిన సలహాలనిస్తే సహృదయతతో స్వీకరించేవారు. సంస్కృత భాషా పాండిత్యం ఉన్నా, సుందర కవితా కళా కౌశలం ఉన్నప్పటికీ, అవధాన కళా చాతుర్యం ఉన్నా, సుమధుర కంఠస్వర శోభితులై పద్య పఠనం చేస్తూ శ్రోతలను రంజింపజేస్తూ ఉన్నా, పురాణ ప్రవచనా దక్షులైనా గర్వం లేక వినయగుణంతో శోభిస్తూ పెద్దల యెడ గౌరవం ప్రదర్శిస్తూ మంచి పేరు తెచ్చుకున్నారు. సుప్రసిద్ధ అవధాన వరేణ్యులు శ్రీ నరాల రామారెడ్డి గారి వద్ద విద్యాభ్యాసం చేసి ఆంధ్రభాషాధ్యయనంతో పాటు, అవధాన విద్యా రహస్యముల నెఱిగి, విజయవంతంగా అష్టావధానాలు పూర్తి చేశారు.

ప్రస్తుతము 'శ్రీ సీతారామ కల్యాణము' కావ్యాన్ని పాఠకుల సౌలభ్యమునకు, సౌకర్యమునకై మూలంలోని శ్లోకాలు, వాటి తాత్పర్యాలతో హృద్యమైన తన పద్యములను అందించి ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచుతూ ఉన్నారు. ఇది పండిత పామర జన మనోరంజకమై శ్రీమద్రామాయణం వలె కలకాలం నిలిచి ఉంటుందని నా దృఢ విశ్వాసం.

చక్కని సరళమైన పద్యాలతో, సందర్భానికి వన్నె దెచ్చే శైలితో వీరు పద్యరచన చేశారు. ఏడు వందల పద్యాలను ఎంతో ఓపికతో రచించి, వానిని ప్రతిరోజు అంతర్జాలంలో నింపి అనేకులగు పద్యాభిమానులకు హృదయాహ్లాదాన్ని కలిగించారు. వివిధ దేవతల ప్రార్థనలతో భక్తి విశ్వాసాలను ప్రకటించుకొన్నారు. శ్రీరాముని షోడశ గుణాలను, ఆయా మహర్షుల సందేశాలను, శ్రీ సీతారాముల కల్యాణ ఘట్టాన్ని రసోచితంగా, వర్ణించి బ్రహ్మానందాన్ని కలిగిస్తూ ఉన్నారు. శ్రీరాముని వర్ణించడంలో ఈ కవిగారి ఆసక్తి, ఆ శక్తి మనం తప్పక తెలుసుకోవాలి.

రాముడు జగదభిరాముడు
రాముడు శుభలక్షణుండు రఘుకులవరుడున్
రాముడు దనుజవిరాముడు
రాముడు కోదండధరుడు రాజాగ్రణియున్. (7) అట్లే...

హతశత్రుండును వేదవేత్తయు నదీనాత్ముండు రాజన్యులం
దతిసౌజన్యుడు ధీరుడున్ సమవిభక్తాంగుండు సాధుండు సం
తతలోకప్రియకారకుండు హితుడున్ ధన్యాత్ముడున్ మాన్యుడున్
బ్రతిభావంతుడు స్నిగ్ధవర్ణుడు సదారాధ్యుండు నీ రాముడే. (12)

స్థాలీపులాక న్యాయముగా రెండు పద్యాలను ఉదహరించాను.

ఇటువంటి కావ్యాన్ని రచించిన శ్రీయుత కోట రాజశేఖర్ గారికి, వారికి సహకరించిన వారి సతీమణి శ్రీమతి కోట గిరిజాకుమారి గారికి భగవంతుడు సదా ఆయురారోగ్యాలను ప్రసాదించాలని, ఇతోధికమైన సాహిత్య సేవ జరగాలని ప్రార్థిస్తున్నాను. ఈకావ్యం శ్రీసీతారాములకు సమర్పింపబడిన పద్య సుమహారం.

రమ్యమైనరీతి రామాయణమ్మును
రాజశేఖరుండు రచన చేసె
రాగరంజితంబు రసరమ్య పఠనంబు
వినిరి బుధులు కోకిలనిరి కవిని.

24-11-2021 **డా॥ చీమకుర్తి వేంకటేశ్వర రావు**



'అవధాన కళానిధి'
శతావధాని
శ్రీ ఆముదాల మురళి గారు
తిరుపతి

ఋషి ఋణ విముక్తి

వ్రాసిన రామచంద్రు కథ వ్రాసితివం చనిపించుకో వృథా
యాసము గాక కట్టుకథ లైహికమా? పరమా? యటంచుఁ దాఁ
జేసిన తండ్రి యాజ్ఞయును జీవుని వేదన రెండు నేకమై
నా సకలోహవైభవసనాథము నాథ కథన్ రచించెదన్

(విశ్వనాథ – కల్పవృక్ష అవతారిక)

కట్టుకథ లెన్ని వ్రాసినా ప్రయోజనం లేదని, ధర్మమూర్తి రామచంద్రుని కథ మాత్రమే ఇహపర ఫలప్రదమని కవిసమ్రాట్ విశ్వనాథ వారు పేర్కొన్నారు. శ్రీ కోట రాజశేఖర అవధాని గారు ఆశుకవితా ధురీణులై, రసవత్కవనస్రష్టలై, వేగాతివేగోక్తితో జనరంజకంగా అవధానాలు చేశారు. 'పరుగు ఆపడం అసలు కళ'... ఆపారు. భౌతిక ప్రపంచంలో కీర్తిమంతుడై పారమార్థిక ప్రపంచంలో పట్టభద్రుడై వెలుగొందాలని కోరుకొనని మానవుడు 'పుట్టలోని చెదలు...' వర్గానికి చెందుతాడనడంలో విప్రతిపత్తి లేదు.

నవవిధ భక్తి మార్గములలో కీర్తనం కూడా ఒకటి. పైగా 'కలౌ నామసంకీర్తన' మని పేరెన్నిక గన్నది. సహజ కవిసత్తములకు కీర్తన సులభోపాయం. విశ్రాంత జీవితాన్ని విరామమయంగా కాక శ్రీరామారామంగా గడపాలన్న నిశ్చయబుద్ధి కలుగడం పూర్వపుణ్యపరిపాకం. అదే శ్రీ కోట రాజశేఖర్ గారిని రామకథా రచనకు పురిగొల్పినది. "అథవా కృత వాగ్ద్వారే వంశేఽస్మిన్ పూర్వసూరిభిః" అన్న కాళిదాసు మాటలు పరమమంత్రంగా గ్రహించారు. "ఈ సంసార మిదెన్ని జన్మలకు నేనీ మౌని వాల్మీకి భాషాసంక్రాంత ఋణంబు దీర్పగలదా..." అన్న విశ్వనాథ వారి మాటలు ఎంతగా ప్రేరణ కల్గించాయో 'ఋషిఋణం' తీర్చుకొనే పనికి పూనుకొన్నారు. 'సర్వ శిల్పభూమి' యైన వాల్మీకి రామాయణానికి కట్టుకథ లంటుగట్టకుండా 'నాన్యః పంథా' అన్నట్లు నడిచారు.

వాల్మీకి కేవలం కవి కాదు, తపస్సంపన్నుడైన మహర్షి. ఆయన కృతిని అనువదించడమంటే నిజంగా సాహసమే. గతంలో ఈ సాహసం చేసినవారు వావిలికొలను సుబ్బారావు గారు. పాఠకులు ఎంత వద్దనుకొన్నా బేరీజు లక్షణం జనించకపోదు. ఎవరి శైలి వారిది, ఎవరి భక్తి వారిది. శ్రీ కోట రాజశేఖర అవధాని గారి రచన సరళ సుందరంగా ఉన్నది.

మూలమును సాకల్యంగా ఆకలింపు చేసుకొని 'నామూలం లిఖ్యతే...' అన్న వ్యాఖ్యాతృ చక్రవర్తి మల్లినాథుని మార్గంలో రచన గావించారు.

తెలుగు భాషకు ప్రత్యేకమైన పదబంధాలను, నుడికారాన్ని విస్తృతంగా ప్రయోగించడం ద్వారా కావ్యభాషకు, కావ్యరచనకు స్థానికతను కల్పించారు. తద్వారా మూలాన్ని పరిహరించి చూసినప్పుడిది అనువాద కావ్యం వలె కాక స్వతంత్ర కావ్యంగా భాసిస్తున్నది. ఋషి హృదయానువాద సత్క్రతువు రసబంధురంగా జరిగింది. విషయాన్ని అనుసరించి ఛందస్సును ఎన్నుకోవడంలో కవి చూపిన ప్రతిభ, ఆయా పద్య రచనలో పాటించిన శైలి శబ్దరహస్యవేత్తలగు పాఠకులకు ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. చాలా సహజంగా ఛందస్సుకోసం కాకుండా భావంకోసం చేసిన సమాస ఘటన శ్రీ కోట రాజశేఖర్ గారి ప్రత్యేకశైలికి నిదర్శనంగా చెప్పవచ్చు.

కావ్యనిర్మాణంలో తమ శక్తిసామర్థ్యాలను చాటుకొంటూనే శ్రీరామచంద్రుని పట్ల ప్రదర్శించిన భక్తిప్రపత్తుల వల్ల ఇహపర ప్రయోజనాలను రెంటినీ శ్రీ రాజశేఖర అవధాని గారు సాధించుకొన్నారు. శ్రీ నరాల రామారెడ్డి, శ్రీ సూరం శ్రీనివాసులు గారల రూపంలో వారికి గురుబలం కూడా ప్రాప్తించినది. 'కల్యాణానాం పరంపర' తామర తంపరగా శ్రీ కోట రాజశేఖర్ గారికి వశీకృతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. వారి వాత్సల్య పూర్వకమైన మైత్రి కారణంగా పిన్ననైన నేను ఈ నాలుగు మాటలు వ్రాశాను. మకరందం ఎలా ఉంటుంది? తియ్యగా ఉంటుంది. తీపి ఎలా ఉంటుంది? ఆస్వాదిస్తే తెలుస్తుంది. కావ్యమకరందం కూడా అంతే. పాఠక మహాశయులకు శ్రీ కల్యాణ రాముని కృప సిద్ధించు గాక! ఇక స్వాగతం... చదవండి...

సీ. *ఇక్ష్వాకు వంశ పూర్ణేందుని సత్కథా*
కర్తయై వాల్మీకి ఘనతకెక్కె
ఋషిమార్గమందున కృషి సల్పి శ్రీ కోట
రాజశేఖర కవి రాటుదేలె
పదమార్దవంబు సత్పథమార్దవంబుచే
రామకల్యాణంబు వ్రాసినాడు
తేనెలో నూరించి తీసిన గతి పద్య
ఫలములు నిర్వాణఫలము లయ్యె

తే.గీ. *భక్తి సురభిళమైన చిద్భావములకు*
పుట్టినిల్లుగ కావ్యమున్ బుట్టి పట్టి
దారి దప్పక నడిపిన సూరివరుడు
కోటి కొక్కడు సూడ మా కోట బుధుడు.

తే.గీ. అతుకు లెరుగని సహజమౌ యతులతోడ
ప్రాణగండము గానట్టి ప్రాసలొప్ప
మకిలి పదములు లేని సమాసగతుల
పద్యవిద్యకు క్రొత్త నిర్వచనమయ్యె.

చం. సురతరు పుష్ప సౌరభ విశుద్ధికి నుద్ది యనంగ, గద్దెపై
సురుచిర పద్యయుక్తమగు శోభన రామచరిత్ర కావ్యమున్
స్థిరముగ నిల్పె పండితులు దెల్ప శుభంబులు; కోట రాజశే
ఖర కవి; సర్వదిక్తటుల గాంచు యశస్సు నితోఽధికంబుగన్.

కార్తిక ఏకాదశి - 2021

ఆముదాల మురళి

9440432683





'అవధానిశిల్పి, అవధానికిరీటి'
శతావధాని
శ్రీ కొండపి మురళీకృష్ణ గారు
నెల్లూరు

కల్యాణ తిలకం

అవధానములను నిర్వహించి, అవధాన సాహిత్య సరస్వతీ పరివస్యను గావించిన విద్వదవధాని శేఖరులు శ్రీ కోట రాజశేఖర్ గారు. 'రోజుకో పద్యం శంకరాభరణం' పద్య పంచశతి నందించి రసజ్ఞుల హృదయాలను గెలిచిన కవిశేఖరులు శ్రీ రాజశేఖరులు. విద్వత్కవివరేణ్యులు శ్రీ సూరం శ్రీనివాసులు గారు, అవధాన కవి శ్రీ నరాల రామారెడ్డి గారి వంటి దిగ్గంతులకు శిష్యుడై పద్య కవితా నిర్మాణ శిల్ప కల్పనలను మెరుగు పెట్టుకొంటూ, కవితా రూప తపస్సును సమాచరిస్తూ సాహిత్య రంగంలో ప్రకాశించే సాహిత్య తపస్వి శ్రీ కోట రాజశేఖర్ గారు.

వాల్మీకి మహాకవి రామాయణములో బాలకాండమునకు సుందర పద్యానువాదము చేసి శ్రీసీతారామ కల్యాణము పేర సుమధుర మనోజ్ఞ కావ్యము నందిస్తున్నారు రాజశేఖర కవిశేఖరులు. పావన రామగాథ ఆంధ్రజాతిలో, ఆంధ్ర సాహిత్యములో భాగంగా, రసయోగంగా పరిమళించుటకు, పరిణమించుటకు తెనుగు సాహిత్యములో వెలసిన అనేకానేక రామాయణములే ప్రబల సాక్ష్యము. రామాయణ కల్పవృక్షములో "మరల నిదేల రామాయణం బన్నచో..." అని ప్రశ్నించుకొని, దానికి సమాధానం చెబుతూ శ్రీ విశ్వనాథ వారు 'తనదైన యనుభూతి తనది గాన... తన భక్తి రచనలు తనవి గాన' అంటూ వివరిస్తారు. ఆ మార్గంలోనే రామభక్తిని, కవితాశక్తిని మేళవించి ఈ రామ కళ్యాణ గాథను కావ్యంగా, అమృత కలశంగా అందిస్తున్నారు రాజశేఖరులు.

సతతము నీదు నామమె ప్రశస్త మటంచు జపించుచుంటి, నా
తత శుభదాయక మ్మనుచుఁ దావక గాథ రచించుచుంటి, నీ
కతమున మోక్షసంపద సుఖమ్మున నందగ నుంటి, నీకు నం
కితమిడుచుంటి దీనిఁ బరికించి గ్రహింపుము జానకీపతీ! (పీఠిక – 25)

అంటూ రామ కల్యాణ కథా కావ్యమును జానకీపతికే వినిపించి అంకితము చేసి కావ్యానికి, తమకు ధన్యత్వాన్ని సముపార్జించుకున్న కవిరాజశేఖరులకు నా అభినందనలు, నమస్సుల నందజేస్తున్నాను. 77 శీర్షికలతో, 741 పద్యములతో ప్రతిపద్య రమణీయముగా, భక్తి భావనా కమనీయంగా, రసబంధురంగా, అలంకార సుందరంగా, ఔచిత్య సముల్లసితంగా, కవితాశిల్ప భరితంగా ఈ కావ్యాన్ని తీర్చిదిద్దారు కవి రాజశేఖరులు. వాల్మీకి మహాకవి హృదయాన్ని యథాతథంగా ఆంధ్రీకరించి అందించారు. అణువణువునా కావ్య నిర్మాణ

కౌశల్యాన్ని ప్రదర్శించారు. దశరథ మహారాజునకు కలిగిన కుమారులను చూచుటకు వచ్చినవారు ఏమనుకుంటున్నారో ఈ అద్భుతపద్యంలో చిత్రీకరించారు.

"లీలగ విష్ణువునకు గల
నాలుగు భుజములన వెలసినారలు వీరల్,
మేలన భువి ధర్మమ్మున
బాలించెద" రనిరి చూడ వచ్చిన వారల్. (109)

శ్రీ మహావిష్ణువు రామచంద్రునిగా సపరివారంగా అవతరించిన విషయాన్ని స్ఫురింపజేస్తూ, రామరాజ్యం ఎంత ధర్మభూయిష్టంగా, ప్రజారంజకంగా ఉంటుందో ప్రతిబింబింప జేస్తూ, భావి కథా సూచనను గావిస్తూ ధ్వనిమంతంగా సాగిన యీ పద్యము కవి కవనశక్తికి అద్దం పడుతున్నది.

శివధనుస్సును ఎక్కుపెట్టే సందర్భములో గురుదేవుని వాక్యాన్ని అందుకొన్న రామచంద్రమూర్తి గురించి...

వేల కొలందిగా నరులు వింతగఁ జూడగ, మౌనివాక్యమున్
బాలన చేయుచున్ ధనువుఁ బట్టుచుఁ దా నవలీల నెత్తఁ, ద
ల్లీలను జూచువారపుడు లేచిరి విస్మయమంది, రామునిన్
బాలకరీంద్రసన్నిభుని భాసురమూర్తిని మెచ్చి రీ విధిన్. (571)

అంటూ అందంగా, జగద్విస్మయకరంగా శివధనుర్భంగాన్ని గురించి దర్శించారు.

కళ్యాణరాముడై సీతాసమేతంగా విచ్చేసిన రామంచంద్రునికి స్వాగతం పలడానికి అయోధ్యానగరము సర్వాంగసుందరముగా, ఆనంద తుందిల మందిరముగా సాలంకృతమైనది అంటూ...

"శ్రీకరరమ్యపతాకాధ్వజమ్ముల
నలరెడిపురమయోధ్యాపురంబ
యూహింప శ్రావ్య తూర్యోద్ఘుష్టనాదాల
నలరెడి పురమయోధ్యాపురమ్ము" (721) అని అయోధ్య పులకించిపోయిన విధమును మధురంగా అభివర్ణించారు.

సీతారాముల దాంపత్యజీవన పావిత్ర్య మాధుర్యమును అందమైన గీతంలో వర్ణించారు.

దేవతలఁ బోలు దివ్యమౌ తేజ మొప్పఁ
గమ్రరూపమ్మునన్ లక్ష్మికళయు నొప్ప
రామపదములఁ బ్రేమానురాగ మొప్ప
నాథుఁ గూడె జానకి సుగుణాల కుప్ప. (739)

సీతాదేవి లక్ష్మ్యంశ సంభూత అనే విషయాన్ని స్ఫురింపజేస్తూ, ఆ సుగుణాల కుప్పను సీతమ్మ తల్లిని సువర్ణసుందరంగా పద్యంలో ఆవిష్కరించారు కవి.

ఈ విధముగా కావ్యమంతా అమృతస్రవంతియే, పరమ రమణీయంగా సాగిన రసకలశమే. ఇంత మనోహరంగా, సుందరంగా, సీతా కళ్యాణ గాథను కావ్యంగా అందించిన శ్రీ రాజశేఖర్ గారికి నా కవితాభినందనలు, నమస్సులు.

ఉ. *ప్రాకట కావ్యధార రసరంజిత లీలను పర్వులెత్తగా*
శ్రీకర భక్తి భావ లహరీ సువిలాసము చిందులాడ, వా
ల్మీకి వచస్సునన్ దెలుగు లేపనమద్ది, యనల్ప శిల్ప రే
ఖా కమనీయ మాధురులు గ్రమ్మగ వ్రాసితివయ్య సత్కృతిన్.

సీ. *పద్యమా ధారావిభాసిత సుకుమార*
సుందర పదబంధ శోభితమ్ము,
వ్యాఖ్యానమా నవ్య భావనా పరిపూర్ణ
తాత్పర్య బోధా విధాన పథము,
గాత్రమా సుస్వర కమనీయ రాగవత్
శ్రావ్య మంజుల మనోరంజకమ్ము,
గాథయా లోకైక కల్యాణ కారక
జానకీరామ కల్యాణ గాథ,

తే.గీ. *యెంత పుణ్యభాగ్యమ్మొ యింకెంత ప్రతిభ*
రాజశేఖర! కవివరా! రమ్యఫణితి
నాథగాథ రచించి గానమ్ము చేసి
యందఁ జేయుచుంటివి రసానంద ఫలము.

ఉ. *ప్రాకట దివ్యగాథ రఘురాముని పావన సచ్చరిత్ర వా*
ల్మీకి వచించె, తత్పదవరేణ్యపథమ్మును వీడకుండ, శో
భాకర పద్యరీతి ననువాద మొనర్చుచునుంటివయ్య! య
స్తోక విశేష పుణ్యఫల శోభను పొందుచు రాజశేఖరా!

చం. *జలజల కొండకొమ్మలను జాలుగ నేరులు పారినట్లు, నిం*
పలరగ చంద్రరేఖ గగనాంగణమున్ విడి కూర్మితోడ నా
కలువనుఁ జేరినట్లు, కడు కమ్మని పద్యము పర్వులెత్తుచున్
లలిత ముదంబుఁ గూర్చినది రామ కథాకృతి రాజశేఖరా!

13-12-2021 **కొండపి మురళీకృష్ణ**



అష్టావధాని

శ్రీ చిటితోటి విజయకుమార్ గారు

హైదరాబాదు

"కావ్యం ఏతత్ జయేత్ చిరమ్"

శ్రీసీతారామకల్యాణ కావ్యమేతత్ సమర్పితమ్ |
అష్టావధానినా కోట రాజశేఖర సూరిణా ||

మధురైర్మఞ్జులైశ్శబ్దైర్బాలకాణ్డమనూదితమ్ |
వాల్మీకేర్హృదయం జ్ఞాత్వా సర్వపాఠక రఞ్జకమ్||

అన్వర్థ పద సంయుక్తం ద్రాక్షాపాక విభాసితమ్ |
హృద్యపద్యాత్మకం వన్ద్యం కావ్యమేతజ్జయేచ్చిరమ్ ||

సౌజన్యమూర్తిమద్భావం వదాన్యమవధానినమ్ |
శంసామి ప్రవచఃకల్పం రాజశేఖర సత్కవిమ్ ||

స్తువన్తం జానకీ రామం భక్తిపూర్ణైః పదైర్ముదా |
కీర్తయే సుకవిశ్రేష్ఠం శ్రీ కోట రాజశేఖరమ్ ||

7-1-2022

చిటితోటి విజయకుమార్



సంస్కృతాంధ్ర కవి పండితులు
శ్రీ పండి ఢిల్లీశు గారు
విశ్రాంత తెలుగు పండితుడు
రాజపురం, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా.

శుభవాణి

"శ్రీరామ జయం" అంటూ చిఱునవ్వుతో పలుకరించే మధుర సౌహార్ద సంపన్నులు, పెద్దలు శ్రీ కోట రాజశేఖర కవివరేణ్యులు శ్రీమద్వాల్మీకి రామాయణం బాలకాండను సంప్రదాయ తెలుగు పద్యకావ్యంగా అనువదించారు.

'శ్రీసీతారామ కళ్యాణము'... చక్కని పేరు! శ్రీమద్రామాయణాన్ని అనేకులు అనేక భాషల్లో అనేక విధాలుగా అనువదించారు. తెలుగులో పద్యకావ్యాలు, ద్విపదలు, నాటకాలు, గేయాలు, వాగ్గేయకారుల కృతులు, చలనచిత్రాలు... ఇంకా ఎన్నో విధాలుగా రామకథ వెలసింది. ఒక్కొక్కరిది ఒక్కొక్క మార్గం. ఒక్కొక్కరిని చదువుల తల్లి ఒక్కొక్క విధంగా అనుగ్రహించింది.

ఆంధ్ర గీర్వాణ భాషలలో నిష్ణాతులుగా, ప్రవచన కర్తగా, అష్టావధానిగా భాషా సాహిత్యాలకు ఎనలేని సేవ చేసి ఎంతో ఖ్యాతి నార్జించిన శ్రీ రాజశేఖర కవీంద్రులు రామకథను తమ కావ్యరచనకు ఇతివృత్తంగా స్వీకరించి కృతార్థులైనారు.

వేదమే రామాయణము – రాముడు వేదపురుషుడు. సీతారాములు ఆదర్శ దంపతులు. రాముడు ధర్మస్వరూపుడు. రామనామము తారకమంత్రము. రామాయణము జాతికి జీవనాడి. రామచరితము పట్టుతేనె – పుట్టతేనె.

"వాల్మీకేర్వదనారవిందగళితం రామాయణాఖ్యం మధు" ప్రసన్న మధురంగా, శ్లోకాలకు పద్యానువాదం చేసి తెలుగు సాహితీ లోకానికి అందించారు ఈ ఉదాత్తకృతిని కవి గారు.

సరళ సుందరమైన భాష... శ్లోకం - పద్యభావం - పద్యం... ప్రతివాక్యంలో, ప్రతిపద్యంలో చదివించే గుణం... తెలుగు భాషపై ఆసక్తి, అభిమానం పెంపొందించే సరళ సుందర కృతి 'శ్రీసీతారామ కళ్యాణం'

ఇది బాలకాండం మాత్రమే. అయినా దీని సత్ఫలితం దీనికుంది.

చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్ ।
ఏకైక మక్షరం ప్రోక్తం మహాపాతక నాశనమ్ ॥ అని గదా!

గ్రంథారంభంలో ఇష్టదేవతా స్తుతి చేస్తూ సమకాలీన ఆధునిక కవులను సైతం భక్తితో పేర్కొన్నారు. తల్లిని, తండ్రిని వేరు వేరు పద్యాలలో కీర్తించారు. గురువులను ప్రత్యేకించి శ్రీ నరాల రామారెడ్డి గారిని, శ్రీ సూరం శ్రీనివాసులు గారిని పేర్కొనటం విశేషం.

తప్పులు నాడు చేసితిని, ధర్మము తప్పి చరించినాడ, నా
తప్పుల నేడెఱింగితిని, తావక సన్నిధి నాశ్రయించితిన్,
తిప్పలు పెట్టకుండ ననుఁ దీరిచి దిద్దుము నీకు మ్రొక్కెదన్,
గొప్ప మనస్సుతోడ సమకూర్పుము మోక్షము జానకీపతీ. (పీఠిక – 4)

అంటూ శ్రీరామచంద్రుని చరణముల నాశ్రయించి, తమ వినయాన్ని, నిగర్వతను చాటుకున్నారు.

రామాయణం అన్ని కాండల పద్యానువాదం ఈ సత్కవి కలంనుండి జాలువారి, వీరు భాషామతల్లికి మఱిన్ని సేవలందించాలనీ, అందుకు అన్ని విధాలా శ్రీసీతారాములు అనుగ్రహించి, ఆయురారోగ్య భాగ్యము లందించాలనీ ఆకాంక్షిస్తున్నాను.

సరస పద ప్రయోగముఁ బ్రసాద గుణంబునుఁ జూచి, సత్కవీ
శ్వరులునుఁ గోవిదాగ్రణులు చాల నుతింపఁగ, బాలకాండ కా
వ్యరచన చేసి యీక్రియఁ గృతార్థుఁడ వైతివి, కోట రాజ శే
ఖర కవి! రామచంద్రుఁ డిడుఁ గావుత నీకు నభీష్ట సంపదల్.

పదముల పొందికన్ మధుర భావములన్ మృదులార్థ సంపదల్
పొదలఁగ జానకీ రమణు పుణ్య చరిత్రము బాల కాండమున్
హృదయమెలర్పఁ జెప్పితివి, యెల్లరకున్ ముదమావహిల్ల, శ్రీ
ప్రదుఁడయి రాఘవుం డిహ పరంబుల నీకు సుఖంబు లీవుతన్.

సుకుమారంబుగ శబ్ద మర్థ చయమున్ శోభిల్ల, విద్వన్మణుల్
సుకవిశ్రేణియుఁ జూచి మెచ్చ, భువన స్తుత్యంబుగా నిట్లు ప
ద్య కవిత్వంబునఁ దెన్గుకబ్బముగ సీతారామ కల్యాణ గా
థ కడున్ హృద్యముగా వచించితి వహో ధన్యుండవై సత్కవీ!!

13-12-2021

విబుధ విధేయుడు

పండి ఢిల్లీశు



'అవధాని శేఖర'

శ్రీ మైలవరపు మురళీకృష్ణ గారు

సంస్కృతోపన్యాసకులు

ఆం. ప్ర. గురుకుల కళాశాల, వెంకటగిరి

కమనీయ కావ్యం... శ్రీసీతారామ కల్యాణము

శ్రీకరమైన, పరమ పవిత్రమైన, ఇహపర సుఖకారకమైన, భవసాగరతారకమైన, మహిమాన్వితమైన, మధురమైన మంత్రరాజం శ్రీరామనామం. లౌకిక విషయాలతో పూర్తిగా నిండిపోయిన మనస్సులో ఏదో ఒక మూల రవ్వంత అవకాశమేర్పరచుకొని ఈ నామం ప్రవేశించినచో అది ఒక రసాయనమువలె మాలిన్యమును శుద్ధిచేసి, క్రొత్తగా మెరుగుపెట్టి జీవితమును తళతళలాడిస్తుంది. అందరినీ ఆకర్షింపజేస్తుంది. పలుకులో, పదములో, పాటలో, ఆటలో శ్రీరామనామమును మరువము మరువము అని ఆనందానుభూతినందుచూ జీవితమును ధన్యము చేసుకొన్న మహనీయులు శ్రీవాల్మీకి మహర్షి మొదలుగా ఎందరెందరో ఉన్నారు. అట్టివారి పదసరోజములకు ముందుగా ప్రణమిల్లుచున్నాను.

శ్రీ కోట రాజశేఖర్ గారు తన్మయముతో రచించిన శ్రీరామాయణ పద్య సప్తశతి కావ్యమును ఆమూలాగ్రము పఠించి ఆస్వాదించి అమందానందము ననుభవించి మీతో నాలుగు మాటలు ముచ్చటించుచున్నాను.

అవధానిశేఖరులు శ్రీ కోట రాజశేఖర్ గారు నాకు అత్యంత ఆత్మీయులు, గురుతుల్యులు. లబ్ధప్రతిష్ఠులు అవధానకవులునైన శ్రీ నరాల రామారెడ్డి గారికి ప్రియశిష్యులు. పద్యానికి గీటురాయివంటి వారి శిక్షణలో, రక్షణలో, పర్యవేక్షణలో పద్యరచనలో రాటుదేలినవారు. వినయసంపన్నులు. అన్నింటికీ మించి రామభక్తి మెండుగా కలవారు. మేము సంస్కృత ప్రశ్నాపత్ర మూల్యాంకన విధిలో నుండగానే ఎప్పుడూ శ్రీరామనవమి పండుగ వచ్చేది. ఆ దినము వారు "దాశరథీ! కరుణాపయోనిధీ!" అంటూ ఆర్తిగా పాడి వినిపించిన పద్యాలు ఎప్పటికీ మా చెవులలో మార్మోగుతుంటాయి.

శ్రీ వాల్మీకిమహర్షి రచించిన దివ్యమైన శ్రీరామాయణములోని బాలకాండను "శ్రీసీతారామ కల్యాణము" అనెడి కావ్యముగా సరళసుందరముగా తెలుగు పద్యములలో రచించి సార్థకజన్ములైనారు. అవతారికలోనే దైవస్తుతిలో 4వ పద్యములో "సమకూర్పుము మోక్షము జానకీపతీ!" అని ప్రకటించినారు. ఈ కావ్యములో ప్రతిపద్యము చక్కని శైలితో, ధారాశుద్ధితో, భావమరందసంయుతమై భాసిల్లుచున్నదనుట అతిశయోక్తి కాదు. అవసరమైనచోట వాల్మీకి శ్లోకాలను కూడా పొందుపరచి పఠితలకు సులభగ్రాహ్యం

చేసినారు. బాలరామునికి భామలు జోలపాడుటలో 105 వ పద్యములో “రామాలాలి! మేఘశ్యామలాలి!, జో అచ్యుతానంద! జోజో ముకుందా!” అనే కీర్తనలు లయాన్వితమైన సీసపద్యములో అందంగా ఒదిగిపోయాయి.

విశ్వామిత్రుడు రాముని తనతో పంపుమని కోరగా దశరథుడు తన అశక్తతను తెలుపుచూ ప్రాధేయపడిన పద్యం

రాముం డెన్నగ చిన్నిబిడ్డడు సుమీ! రాజీవనేత్రుండు, కా
డా? మౌనీ! పదునాఱు వర్షములు నిండన్ లేదు, సంగ్రామమన్
నామంబున్ వినలేదు, బాలకుడు కానన్ జూడనే లేదు, త
ద్భీమోద్దామ నిశాచరావళి నెటుల్ వేధించి భేదించెడిన్? (134)

అద్భుతమైన సన్నివేశాన్ని కనులముందు నిలుపుతోంది. తాటకావధ, సిద్ధాశ్రమవర్ణన, గంగావతరణం, క్షీరసాగరజనిత వస్తువిశేషములు, అహల్యావృత్తాంతము, త్రిశంకుని చరిత్ర, శునశ్శేపుని కథ... ఇలా ఈ కావ్యములో అన్ని విశేషాలు యథావాల్మీకం చక్కగా నిక్షేపింపబడినవి. ‘శైలవిదారకృచ్చటులశబ్దము’ వంటి శబ్దప్రయోగాలతో శివధనుర్భంగఘట్టం చక్కగా వర్ణించబడినది. రమణీయముగా ఇక్ష్వాకువంశవర్ణనము జరిగింది. ‘ఇయం సీతా మమ సుతా...’ అనే శ్లోకానికి తెనుగు సేత...

ఈయమ సీత నాదు సుత యిప్పుడు నీ సహధర్మచారిణీ
స్థాయి వెలుంగుఁ, గైకొనుము సాధ్వి కరమ్మును నీ కరమ్ముచే,
శ్రేయముఁ గూర్చ నిన్ననుసరించు ఛాయ యనంగ” నంచు, దాఁ
దోయము ధారగా విడిచెఁ దుష్టినిఁ దజ్జనకుండు ప్రేముడిన్ (663)

వంటి పద్యాలతో అద్భుతముగా సాగింది. ఇలా ప్రతిపద్య రమణీయముగానున్న ఈ శ్రీసీతారామకల్యాణము కమనీయముగానున్నది.

శ్రీ రాజశేఖర్ గారికి అనేక అభినందనలు ధన్యవాదములు. ఫలశ్రుతిలో వారు పల్కినరీతి ఈ కావ్యము రక్షాకవచముగా కాపాడుననుట యథార్థము.

సారవచోవిలాసగుణసాంద్రకవిత్వము రంగరించి, వి
స్తారముగా రచించితివి చక్కని కావ్యము బాలకాండమున్!
శ్రీరఘురామమూర్తి విరచించి శుభావళి ధన్యతన్ గొనన్
గూరిమి బ్రోచుగాత మిము కోట కులాగ్రణి! రాజశేఖరా!!

6-12-2021 **మైలవరపు మురళీకృష్ణ**

9490778485



అవధాన శిరోమణి, మధురకవి

విద్వాన్ పైడి హరనాథరావు గారు

శ్రీకాకుళము

ఆప్త వాక్యం

శ్లో. వేద వేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే ।
వేదః ప్రాచేతసాదాసీత్ సాక్షాద్ రామాయణాత్మనా ॥

వేదములచేఁ దెలియబడు పరమ పురుషుడగు శ్రీమన్నారాయణుడు దశరథాత్మజుడగు శ్రీరామ చంద్రునిగా భూలోకము నందవతరింపగా, వేదములే వాల్మీకి మహర్షి చేత సాక్షాత్ రామాయణముగా నవతరించినవి. అనగా రామాయణము కథారూపములో నున్న వేద సారమని చెప్పవచ్చును.

ఆది కవి వాల్మీకి మహర్షి రచించిన రామాయణ మహాకావ్యమును మన పూర్వీకులు ఇతిహాసగ్రంథమని నుడివియున్నారు.

శ్లో. ధర్మార్థ కామ మోక్షాణా ముపదేశ సమన్వితమ్ ।
పూర్వ వృత్తం కథాయుక్త మితిహాసం ప్రచక్షతే ॥

చతుర్విధ పురుషార్థముల గురించి ఉపదేశయుక్తముగా నొక పూర్వవృత్తాంతమును కథారూపముగా చెప్పిన గ్రంథమును ఇతిహాసమందురు.

శ్లో॥ ధర్మాదర్థః ప్రభవతి ధర్మాత్ ప్రభవతే సుఖమ్ ।
ధర్మేణ లభలే సర్వం ధర్మసారమిదం జగత్ ॥

ఈ జగత్తంతయు ధర్మమాధారముగా నడచుచున్నది. కావున వాల్మీకి మహర్షి ధర్మము యొక్క గొప్పతనమును లోకమునకు తెలియ జేయవలెనని తలంచెను. నారద చతుర్ముఖుల ప్రేరణచే "రామో విగ్రహవాన్ ధర్మః" అన్నట్లు ధర్మమూర్తియగు శ్రీరామచంద్రుని చరిత్రను లోకమునకు నందింప దలంచి శ్రీమద్రామాయణ మహా కావ్యమును రచించెను. శ్రీరాముడు పరిపూర్ణ మానవునిగఁ బ్రవర్తించి, ఎన్ని కష్టములు వచ్చినను స్వధర్మమును విడువక ధర్మపథము ననుసరించి లోకమునకు ధర్మ మహత్త్వమును తెలియ జేసినట్లు రామాయణ మహా గ్రంథమును వాల్మీకి మహర్షి రచించెను.

రామాయణము భారత దేశములో గల అన్ని భాషలలోనికి అనువదింపబడినది. ఎందువలన ననగ సారపు ధర్మము, విమలసత్యము విజయము చేకూర్చుననునది మన సంస్కృతిలో నంతర్భాగము కనుక. భారతీయ భాషలలోనే కాక ప్రపంచములోని ప్రముఖ

భాషలతో వాల్మీకి రామాయణము అనువదింప బడినది. ఇంతటి గొప్ప గ్రంథమును మన తెలుగు కవులు అనువదింపకుండ ఉండగలరా? తెలుగు భాషలో నున్నన్ని రామాయణములు మరియే భాషలలోను లేవనుట యతిశయోక్తి కాదు. ఎందుకనగ "శ్రీరామ" అని శ్రీకారము చుట్టనిదే మన తెలుగువారు ఏ పని తలపెట్టరు గనుక. అందులోను గ్రంథరచనకు పూని ముందుగా రామాయణమును ప్రస్తావించక ఇతర గ్రంథములను రచించ రనునది అనూచానముగా వచ్చిన ఆచారము. మన తెలుగు కవులు వాల్మీకి మహర్షి రామాయణ రచనోద్దేశమును తమ తరువాతి కాలము వారికి నందింప దలచుటయే వారి తపన.

ఈ సంకల్ప దృష్టితో విద్వాన్ శ్రీ కోట రాజశేఖరావధాని గారు వాల్మీకి రామాయణము నందలి 'బాలకాండము'ను 'శ్రీ సీతారామ కల్యాణము' అను గొప్ప గ్రంథమును యథానువాదము చేసియున్నారు. వారి అనువాదము సరళము. శైలి అద్భుతము. ఛందో వ్యాకరణ నియమములను అనుసరిస్తూ, ఔచిత్య పద ప్రయోగములను నిక్షిప్తము గావించిరి. ఇది వారి పూర్వజన్మ సుకృతి అని చెప్పక తప్పదు. వారు అనువదించిన 'శ్రీసీతారామ కల్యాణము' ఆద్యంతము మనోరంజకము. వారు కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణములో గల శ్రీకృష్ణ గీతాశ్రమములోని శ్రీ మలయాళ స్వామి ప్రాచ్య కళాశాలలో విద్వాన్ చదివి యున్నారు. ఉభయ భాషలలో పరిపూర్ణ పాండిత్యము కలిగియున్నారు. వారు చదువుకొనిన ఆశ్రమ ప్రధాన ద్వారముపై "విద్యాతపోభ్యాం పూతాత్మా" అను సూక్తి, ఆశ్రమ ముఖకుడ్యముపై "పురోభివృద్ధిని కోరువారు పూర్వవృత్తాంతమును మరచిపోరాదు" అను సూక్తియు లిఖింపబడినవి. వాటిని నిత్యము మననము చేయుచు తమ జీవితమును తీర్చిదిద్దుకొని యుండిరనుటలో సందేహము లేదు. ఆ ప్రభావమే ఈ 'శ్రీసీతారామ కల్యాణము' గ్రంథ రచనకు మూలము. వారి జీవితము ఆదర్శప్రాయము, అనుసరణీయము, ఆచరణాత్మకము.

వారు అనువదించిన 'శ్రీసీతారామ కల్యాణము' ఆద్యంతము మనోరంజకము. వారి పద్యశైలి పాఠకులకు హృదయానందము కలిగించును. మచ్చునకు జనక మహారాజు విశ్వామిత్రునితో శివకార్ముకము యొక్క గొప్పతనమును వర్ణించిన సందర్భములో

ఉ. ***"పూతము దివ్యశక్తిపరిపూర్ణమునౌ శివకార్ముకమ్ము వి***
ఖ్యాతము, తెచ్చి చూపెద, మహాత్ముడు రాముడు దాని నెక్కిడన్
జేతము పొంగ దివ్యవరసిద్ధినిఁ బొంది, మదీయపుత్రికన్
సీత నొసంగెదన్ గుణవిశిష్టతమోర్మికి రామమూర్తికిన్" (560)

వాల్మీకి మహర్షి చెప్పిన అంశమును ఎంత అద్భుతముగ ననువదించిరో మనము గమనింప వచ్చును. ఇదే శైలిలో మొత్తము గ్రంథమంతయు నడచినది. పద్యశైలి పరిశుద్ధతను పాటించుటలో మన ప్రాచీన కవుల మార్గము ననుసరించియున్నారు.

ఇటువంటి అద్భుత గ్రంథమునకు 'ఆప్తవాక్యము' వ్రాయు భాగ్యము కలిగించినందులకు నా జన్మ ధన్యమైనదని నేను భావించుచున్నాను. వారు ఇంకను మిగిలిన కాండములను గూడ యథానువాదము గావించి లోకమునకు అందించగలరని భావించుచు అటువంటి శక్తి యుక్తులను వారికి ప్రసాదించ వలెనని ఆ శ్రీరామచంద్రుని ప్రార్థించుచున్నాను.

కం. మధురకవి రాజశేఖరు
మధురమునగు బాలకాండ మహిమ రచనయున్
బుధులందరు పఠియింప వ
సుధను యశము నందుదురుగ శుభములు గలుగన్.

ఉ. కమ్మని కంఠముం గలిగి గానము సేతువు రాగయుక్తి, ని
త్యమ్మును శ్రేష్ఠకావ్యముల ధారణఁ బట్టుచు నేర్చుచుందువే
నమ్మియుఁ దల్లి వాణి చరణమ్ములఁ బద్యము లల్లువాఁడవై
నెమ్మది సాగుమో సఖుఁడ! నిర్మల కీర్తిని రాజశేఖరా!

కం. గాయత్రీ మంత్రాక్షర
గేయంబై బాలకాండ కృతిగా మీచే
వ్రాయబడె తెలుగుభాషన్
శ్రీయుత శ్రీ కోట రాజశేఖర శుభమౌ.

తేది : 21-11-2021

పైడి హరనాథ రావు



నివేదన

శ్రీరాముని దయతో సీ
తారాముల గాథ వ్రాయ దలచితి పద్య
శ్రీ రాజిల, గురువులు మన
సారన్ దీవింపఁ దలతు శారదను మదిన్.

రామమందిరం సమీపంలో బాల్యాన్ని గడిపిన నేను మా తల్లిదండ్రులైన శ్రీమతి కోట సక్కుబాయమ్మ, శ్రీ కోట సారంగపాణి గార్ల ఆశీస్సులతో షష్టిపూర్తి తరువాత ఇప్పుడు వాల్మీకి మహర్షి విరచిత శ్రీమద్రామాయణంలోని బాలకాండను శ్రీ సీతారామ కల్యాణం పేర పద్యకావ్యంగా వ్రాయగలగడం అంతా శ్రీ రామచంద్రస్వామివారి కృపాకటాక్షంతోనే అని సంపూర్ణంగా విశ్వసిస్తూ ఉన్నాను.

మా గురువర్యులు ప్రముఖ అవధానకవి శ్రీ నరాల రామారెడ్డి గారు 2018 లో నేను వ్రాసిన 'రోజుకోపద్యం శంకరాభరణం – పద్య కదంబం' అనే గ్రంథాన్ని ఆవిష్కరించి, నన్ను ఆశీర్వదించి "ఏదైనా మంచి ఇతివృత్తాన్ని తీసికొని ఒక పద్యకావ్యం వ్రాయి" అని ఉపదేశించారు.

గురువర్యులు, సంస్కృతాంధ్రవిద్వత్కవులు, సుప్రసిద్ధ వ్యాకరణ పండితులు వ్యాస భారతమును వచనరూపంలో సరళ సుందరంగా ఆంధ్రీకరించిన పండితులు శ్రీ సూరం శ్రీనివాసులు గారు, అవధానభారతి శ్రీ చక్రాల లక్ష్మీకాంత రాజారావు గారు, ఆంధ్రోపన్యాసకులు డా. చీమకుర్తి వేంకటేశ్వరరావు గారు మొదలైన పెద్దలు కూడా నన్ను ప్రోత్సహించడంతో నేను ఒక పద్యకావ్యరచనకు సాహసించాను.

1994 లోనే ప్రముఖ కవి శ్రీ నాగభైరవ కోటేశ్వరరావు గారు నెల్లూరులో ఒక సభలో నా పద్యములను విని సంతోషించి "మీ పద్యాలు హృద్యాలు. మీరొక చక్కని కథాకావ్యం వ్రాయండి" అని శుభాశీస్సులతో లేఖ వ్రాసినారు. శ్రీరాముని దయచే ఆ మాట ఇప్పటికి ఫలించినదని భావిస్తున్నాను.

సీతారామకల్యాణములను భక్తితో జరిపించే శ్రీ నారపశెట్టి విజయకృష్ణ గారు 2019 లో పరిచయం కాగా నేను శ్రీ సీతారాముల కల్యాణం పేర పద్యకావ్యం వ్రాయాలని సంకల్పించుకొన్నాను.

ప్రొద్దుటూరులోని మలయాళస్వామి వారి ఓరియంటల్ కళాశాలలో ఉపన్యాసకులుగా ఉండిన మా గురువర్యులు విద్వత్కవితిలక బిరుదాంచితులు శ్రీ బండ్ల రమణయ్య గారు 'జానకీపరిణయమ్' అనే పేరుతో సంస్కృతకావ్యాన్ని 1397 శ్లోకములతో విరచించినారు. అందులో వారు పూర్తిగా బాలకాండ విషయమును వర్ణించినారు. ఆ కావ్యాన్ని చూచిన నేను కూడా సీతారామకల్యాణం పేర శ్రీమద్రామాయణంలోని బాలకాండను తెలుగు పద్యములుగా అనువదించాలని నిశ్చయించుకొన్నాను.

'సమస్యా పృచ్ఛక చక్రవర్తి' శ్రీ కంది శంకరయ్య గారు నిర్వహిస్తున్న శంకరాభరణం వాట్సాప్ సమూహంలో 2018 లో ప్రతిరోజూ సమస్యాపూరణలను సిద్ధంచేస్తూ పద్యరచనలో కొంత అనుభవాన్ని పొంది 2019 నవంబరు 3 వ తేదిన నా పుట్టినరోజున శ్రీరాముని దయచేత శ్రీ సీతారామ కల్యాణం అనే పద్యకావ్యాన్ని ప్రారంభించినాను.

ప్రతిరోజూ నేను వ్రాసే పద్యములను గురువర్యులు శతావధాని శ్రీ నరాల రామారెడ్డి గారికి, శతావధాని శ్రీ సూరం శ్రీనివాసులు గారికి, అవధానభారతి శ్రీ చక్రాల లక్ష్మీకాంత రాజారావు గారికి, మిత్రవరులు అష్టావధాని శ్రీ చిటితోటి విజయకుమార్ గారికి పంపేవాడిని. వారు అవసరమైన సూచనలను అందజేస్తూ ఉండినారు.

ముఖ్యంగా సౌమనస్య గ్రంథకర్తయైన శ్రీ సూరం శ్రీనివాసులు గురువర్యులు రెండు సంవత్సరాలుగా ప్రతి పద్యమును ప్రతి అంశమును పరిశీలించి ఎప్పటికప్పుడు సవరణలను సూచిస్తూ మార్పులను చేర్పులను తెలియజేస్తూ ఉన్నారు.

వాల్మీకిమహర్షియొక్క హృదయమును తెలిసికొనే ప్రయత్నంలో భాగంగా శ్రీమద్రామాయణమును ఆంధ్రీకరించి మందర వ్యాఖ్యానమును కూడా రచించిన ఆంధ్రవాల్మీకి వావిలికొలను సుబ్బారావు గారు, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు, తొలి తెలుగు కవయిత్రి మొల్ల మొదలగు మహాకవులు విరచించిన రామాయణములను యథాశక్తి పరిశీలించినాను.

పద్యభారతి బిరుదాంచితులు పెద్దలు శ్రీ చదలవాడ లక్ష్మీనరసింహారావు గారు శ్రీ సీతారామకల్యాణం పద్యములను తాము 2020 లో ప్రారంభించిన పద్యభారతి సమూహంలో ప్రతిరోజూ రెండు చొప్పున ఉంచవలసినదిగా కోరగా ఒక సంవత్సరకాలంపాటు వాల్మీకిమహర్షి విరచిత శ్లోకములను, నా పద్యములను, భావములను నేను గానం చేసిన ఆడియోలను పంపి సభ్యులందఱి అభినందనలను పొందినాను.

శ్రీ సీతారామకల్యాణ కావ్యంలోని కల్యాణఘట్టములోని 22 పద్యములను ఎంపికచేసి ఆ పద్యములను 12 మంది సుప్రసిద్ధ గాయకులచే గానం చేయించి పద్యభారతి సమూహంలో కల్యాణభారతి పేర వీడియోగా ప్రసారం చేయడంద్వారా కూడా శ్రీ చదలవాడ వారు నన్ను ప్రోత్సహించినారు.

శ్రీ సీతారామ కల్యాణము అనే పేరుతో నేను ఒక వాట్సాప్ సమూహమును ఏర్పాటుచేసి పద్యభారతికి పంపినట్లే నా పద్యములను పంపుతూ సహృదయులైన అవధాన కవి పండితవరుల, సభ్యుల మన్ననలను పొందినాను.

1997 లో కావలిలో నా అవధాన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన విజ్ఞులు, క్యాలికట్ యూనివర్శిటీ ప్రొఫెసర్, సావిత్రి గ్రంథ రచయిత అయిన ఆచార్య తంబిశెట్టి రామకృష్ణ గారు ఇటీవల నెల్లూరులో కలిసి నాచే వ్రాయబడిన శ్రీ సీతారామకల్యాణ కావ్య పద్యములను చదివి ఆనందించి వారి మిత్రులైన శ్రీ అడవికొలను వేంకట్ (వేంకటేశ్వర్లు) U S A గారికి పంపగా

రామభక్తులైన వేంకటే గారు శ్రీ సీతారామకల్యాణ కావ్య ముద్రణకు అవసరమైన నిధులను సంపూర్ణంగా సమకూర్చినారు.

నెల్లూరు జిల్లాలోని ఇనమడుగు గ్రామంలో వెలసియున్న శ్రీసత్యానంద ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ శ్రీహరితీర్థస్వామి వారు శ్రీ సీతారామకల్యాణ కావ్యమును చూచి ఆదర్శ దంపతులుగా జీవించిన సీతారాముల గొప్పదనమును వివరిస్తూ నాపై గల ఆదరభావంతో **'మంగళాశీర్వచనములు'** అందజేసినారు. స్వామీజీకి భక్తిపూర్వక ప్రణామములను సమర్పించుకొంటూ ఉన్నాను.

52 సంవత్సరములుగా ఇనమడుగులోని శ్రీసత్యానందాశ్రమంలో ఉంటూ గ్రంథముద్రణ మొదలైన అనేక బాధ్యతలను నిర్వహిస్తూ ఉండి కూడా శ్రీ సీతారామ కల్యాణ కావ్యమును ఆద్యంతం ఆసక్తితో పఠించి ప్రత్యక్షరపరిశీలన గావించి అచ్చుతప్పులు లేకుండుటకు శ్రమించిన శ్రీ పురుషోత్తమ తీర్థస్వామివారికి కృతజ్ఞతాపూర్వక ప్రణామములను సమర్పించుకొంటూ ఉన్నాను.

'కల్యాణం కమనీయం' శీర్షికతో ఈ కావ్యములోని కొన్ని పద్యములను ప్రస్తావిస్తూ, పద్యరూప అభినందనలతోపాటు ఆశీస్సుల నందజేసిన గురువర్యులు ప్రముఖ అవధానకవి శ్రీ నరాల రామారెడ్డి గారికి హృదయపూర్వక ప్రణామములను సమర్పించుకొంటూ ఉన్నాను.

'పన్థానస్సన్తు తే శివాః' శీర్షికతో ఈ కావ్యములోని పద్యరచనా విశేషములను వివరిస్తూ వాత్సల్యంతో దీవెనలను అందజేసిన సంస్కృతాంధ్రవిద్వత్కవులు, శతావధాని అగు శ్రీ సూరం శ్రీనివాసులు గురువర్యులకు హృదయపూర్వక ప్రణామములను సమర్పించుకొంటూ ఉన్నాను.

'ఆనందాక్షరి' శీర్షికతో నాపై గల ఆదరంతో ఎంతో ప్రీతితో అభినందనలు తెలుపుతూ ఒక సీసపద్యరత్నమును అనుగ్రహించిన పంచసహస్రావధాని అవధాని సమ్రాట్ శ్రీ మేడసాని మోహన్ గురువరులకు హృదయపూర్వక ప్రణామములను సమర్పించుకొంటూ ఉన్నాను.

'శుభాభినందనలు' శీర్షికతో శ్రీ సీతారామ కల్యాణ కావ్యమును అభినందిస్తూ దీవెనలను అందజేసిన సమస్యా పృచ్ఛక చక్రవర్తి శ్రీ కంది శంకరయ్య గురువరులకు హృదయపూర్వక నమోవాకములను అందజేస్తూ ఉన్నాను.

'మనోఽభిరామం' శీర్షికతో ఈ కావ్యమును ప్రశంసిస్తూ శ్లోకరత్నద్వయంతో ఆశీస్సుల నందజేసిన అవధానభారతి, ఛందో వైవిధ్య నిష్ణాత శ్రీ చక్రాల లక్ష్మీకాంత రాజారావు గురువరులకు హృదయపూర్వక నమోవాకములను అందజేస్తూ ఉన్నాను.

'ఆశీరభినందన' శీర్షికతో ఈ కావ్యమును అభినందిస్తూ ఆశీస్సులను, పద్యరత్నమును అందజేసిన పద్యసారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షులు, పద్యభారతి శ్రీ చదలవాడ లక్ష్మీనరసింహారావు గురువరులకు హృదయపూర్వక నమోవాకములను అందజేస్తూ ఉన్నాను.

'పద్యసుమహారం' శీర్షికతో ఈ కావ్యములోని కొన్ని పద్యములను ఉదహరిస్తూ అభినందిస్తూ ఆశీస్సులను అందజేసిన పద్యసారస్వత పరిషత్ (నెల్లూరు) ప్రధానకార్యదర్శి డాక్టర్ చీమకుర్తి వేంకటేశ్వరరావు గురువరులకు హృదయపూర్వక నమోవాకములను అందజేస్తూ ఉన్నాను.

'ఋషి ఋణ విముక్తి' శీర్షికతో ఈ కావ్యమును ప్రశంసిస్తూ మిత్రభావంతో ఆదరంతో పద్యరత్నత్రయమును అందజేసిన శతావధాని శ్రీ ఆముదాల మురళి గారికి హృదయపూర్వక ధన్యవాదములను సమర్పించుకొంటూ ఉన్నాను.

'కల్యాణతిలకం' శీర్షికతో ఈ కావ్యములోని కొన్ని పద్యములను ఉదహరిస్తూ ప్రశంసిస్తూ ఆదరంతో పద్యరత్నములను అందజేసిన శతావధాని శ్రీ కొండపి మురళీకృష్ణ గారికి హృదయపూర్వక ధన్యవాదములను సమర్పించుకొంటూ ఉన్నాను.

'కావ్యమేతజ్జయేచ్చిరమ్' శీర్షికతో శ్లోకపంచకంతో అభినందించిన నిరంతర శ్రేయోభిలాషి అవధాని శ్రీ చిటితోటి విజయకుమార్ గారికి హృదయపూర్వక ధన్యవాదములను తెలియ జేసికొంటూ ఉన్నాను.

'శుభవాణి' శీర్షికతో శ్రీమద్రామాయణ మహిమను వివరిస్తూ ఈ కావ్యములోని కొన్ని పద్యములను ఉదహరిస్తూ అభినందనలను అందజేసిన సంస్కృతాంధ్ర కవిపండితులు శ్రీ పండి ఢిల్లీశు గారికి హృదయపూర్వక నమోవాకములను సమర్పించుకొంటూ ఉన్నాను.

'కమనీయకావ్యం' శీర్షికతో ఈ కావ్యములోని కొన్ని పద్యములను ఉదహరిస్తూ మిత్రభావంతో ఒక పద్యరత్నముతో అభినందనలను అందజేసిన అవధాని శేఖరులు శ్రీ మైలవరపు మురళీకృష్ణ గారికి హృదయపూర్వక నమోవాకములను సమర్పించుకొంటూ ఉన్నాను.

'ఆప్తవాక్యం' శీర్షికతో ఈ కావ్యమును ప్రశంసిస్తూ సహపాఠకులుగా ప్రొద్దుటూరులోని మలయాళస్వామి ఓరియంటల్ కళాశాలను గుర్తుచేస్తూ మూడు పద్యాలను అందజేసిన అవధాని శ్రీ పైడి హరనాథరావు గారికి హృదయపూర్వక నమోవాకములను సమర్పించుకొంటూ ఉన్నాను.

రోజుకోపద్యం శంకరాభరణం - పద్యపంచశతిలోని 22 పద్యములకు గతంలో వీడియో చిత్రీకరణ చేసిన సహృదయులు తెలుగుపండితులు జోగులాంబ గద్వాల జిల్లా నివాసి అయిన శ్రీ నాయుడుగారి జయన్న గారు. ఇప్పుడు శ్రీ సీతారామ కల్యాణంలోని అవతారిక పద్యములను ఇరవై మూడింటిని వీడియోలుగా చిత్రీకరించిన శ్రీ నాయుడుగారి జయన్న గారికి కృతజ్ఞతా పూర్వక ప్రత్యేక ధన్యవాదములను సమర్పించుకొంటూ ఉన్నాను.

రామాంకితంగా (77 సర్గల బాలకాండ 77 శీర్షికలు కాగా) 25 + 741 = 766 పద్యములుగా వ్రాయబడిన ఈ శ్రీ సీతారామకల్యాణకావ్యము

1. వాల్మీకిరామాయణ బాలకాండ శ్లోక -పద్య భావ – పద్యకావ్యముగాను, (ఈ పుస్తకము)

2. బాలకాండ పద్యకావ్యము గాను,

3. బాలకాండ వచనకావ్యము గాను,

4. ఆడియో సీడీ రూపము గాను,

5. అవతారిక పద్యముల చిత్రీకరణలతో వీడియో సీడీ గాను

పంచముఖాలతో రూపొంది వెలుగులోనికి రావడం అంతా ఆ శ్రీరాముని దయచేతనే అని సవినయంగా విన్నవించుకొంటూ ఉన్నాను.

వచనకావ్యంగా ఉన్న శ్రీ సీతారాముల కల్యాణమును నా విజ్ఞప్తి మేర పరిశీలించి తగిన సూచనలను అందజేసిన శ్రీ వడ్లపట్ల సీతారామరాజు, హైదరాబాదు గారికి ధన్యవాదములను తెలియజేస్తూ ఉన్నాను.

ఈ విధంగా ఐదు విధములుగా రూపొందిన శ్రీ సీతారామ కల్యాణ కావ్యముయొక్క ముద్రణ కొఱకు రామకార్యంలో ఉడతాభక్తి అని భావించి నిధులను సమకూర్చిన శ్రీ అడవికొలను వేంకట్ (వేంకటేశ్వర్లు) USA గారికి, వారి సహధర్మచారిణి శ్రీమతి జ్యోత్స్నకుమారి గారికి, వారి కుమారుడు శ్రీయుత రోహిత్ గారికి, కోడలు శ్రీమతి ఎరిన్ గారికి, వారి మనుమలు చిరంజీవులు కిల్లియన్, రోరీలకు, వారి సోదరీమణి శ్రీమతి పోలూరి పద్మావతి గారికి శ్రీ సీతారాముల కృపాకటాక్షములు సదా ఆయురారోగ్య భోగభాగ్యముల నొసంగి రక్షించును గాక!

'శ్రీ సీతారామ కల్యాణము' వాట్సాప్ సమూహంలో అప్పుడప్పుడు ప్రశంసా పద్యములను అందజేసిన అవధాన కవి పండిత మిత్రులకు ప్రత్యేక ధన్యవాదములు.

దైవభక్తి, పరోపకారము, సహనము మొదలగు సహజ సుగుణాలతో విరాజిల్లుతూ, సదా నా పద్యరచనను ప్రోత్సహిస్తూ నాకు తోడుగా నీడగా ఉన్న నా సహధర్మచారిణి శ్రీమతి విద్వాన్ కోట గిరిజాకుమారికి, నిత్యం రామాయణ రచనను ప్రోత్సహిస్తూ పుత్రోత్సాహమును కలిగించే పుత్రద్వయంలో జ్యేష్ఠపుత్రుడు చి. కోట రూపానంద కుమార్ (USA) కి, కనిష్ఠపుత్రుడు చిరంజీవి కోట సారంగపాణి (USA) కి సర్వ శుభములను కలిగించవలసినదిగా నా ఆరాధ్యదైవం శ్రీ రామచంద్రమూర్తిని ప్రార్థిస్తూ ఉన్నాను.

పై కావ్యత్రయమునకు డి.టి.పి పనిని ఎంతో ప్రీతితో నిర్వహించిన శ్రీ కంది శంకరయ్య గురువరులకు హృదయపూర్వక ధన్యవాదములు.

కావ్యత్రయమునకు ముఖచిత్రములను సిద్ధంచేసి ఆడియో, వీడియో డీవీడీలను అందంగా రూపొందించిన చిరంజీవి పంతుల విట్టుబాబు (హైదరాబాదు) గారికి, శ్రీ ఆకురాతి బుచ్చిబాబు (నెల్లూరు) గారికి హృదయపూర్వక ధన్యవాదములు.

మూడు గ్రంథములను ముచ్చటగా ముద్రించిన కర్షక్ ప్రింటర్స్ (హైదరాబాదు) వారికి హృదయపూర్వక ధన్యవాదాలు.

సహృదయులైన పాఠకులు ఈ శ్రీ సీతారామ కల్యాణ కావ్యమును మూల శ్లోకాలను, తాత్పర్యాలను, వాటి పద్యానువాదాలను చదివి నన్ను ఆశీర్వదించి శ్రీరామచంద్రస్వామివారి అనుగ్రహమును పొందుదురుగాక.

కం. క్షేమము నిడు నీ సీతా | రాముల కల్యాణ గాథ రక్తిఁ జదివినన్
ప్రేమగ వినినన్ వ్రాసిన | రాముని కృప కవచ మగుచు రక్షించు సదా. (741)

3-11-2021. **'అవధాని' కోట రాజశేఖర్**

శ్రీ సీతారామ కల్యాణము

శ్రీమద్రామాయణము - బాలకాండము

అనువాదము - పద్య సప్తశతి



దైవ స్తుతి

శ్రీరామ స్తుతి

శా. శ్రీరామా! పితృవాక్యపాలనకళాశ్రీధామ! సన్మానుషా
ధ్వా! రామా! సుగుణాభిరామ! వర సీతారామకల్యాణ మన్
బేరన్ గావ్యము వ్రాయఁ బూనితి, నిదే నీ గాథ నీ లీల, నిన్
జేరంగోరితి దైవమా! యినకులశ్రీరామ! పాలింపుమా. 1

ఉ. పావననామ! రామ! చనె బాల్యము సర్వము నాటపాటలన్,
యౌవన మంతయున్ జనియె నాశల దారసుతాదులన్, భవ
ద్భావన లేక సాగు జర వర్ధిలె చింతలు, నీదు చింతనల్
గావగఁ జాలు నం చెఱుక గల్గెను దాసుని నన్నుఁ బ్రోవుమా! 2

చం. శ్రవణము కీర్తనమ్ము మనసా స్మరణమ్మును పాదసేవ వా
స్తవమగు నర్చ వందనము దాస్యము సఖ్యము నాత్మయందు సం
భవమగు దివ్యమౌ నెఱుక భద్రము గూర్చును గాన, సర్వదా
నవవిధ భక్తిమార్గముల నమ్మి చరించెద రామ! ప్రోవుమా. 3

ఉ. తప్పులు నాడు చేసితిని, ధర్మము తప్పి చరించినాడ, నా
తప్పుల నేడెఱింగితిని, తావక సన్నిధి నాశ్రయించితిన్,
తిప్పలు పెట్టకుండ ననుఁ దీరిచి దిద్దుము నీకు మ్రొక్కెదన్,
గొప్ప మనస్సుతోడ సమకూర్పుము మోక్షము జానకీపతీ! 4

మ. మదియే మర్కటమై చెలంగినది, కామక్రోధలోభాలకున్
సదనమ్మైనది, రామ! మోహమదమాత్సర్యమ్ములున్ రేగె, నా
కిదియే నిత్య పరీక్ష యయ్యెఁ; తగునా యీరీతి నన్ జూడ? నిన్
వదలన్, గెల్చెడి దారి జూపు మరిషడ్వర్గమ్ము నీ చిత్తమున్. 5



సరస్వతీ స్తుతి

చం. అజుని వరించినా, వతని యాస్యమునందు వసించినావు, పం
కజమునఁ గూరుచుండుదు, సుఖమ్ముగ వీణను మీటుదీవు, నీ
రజమును బుస్తకమ్మును గరమ్ములఁ దాల్చెద వక్షమాలతోఁ,
బ్రజలకు విద్య లిచ్చెదవు, భక్తి నినున్ దలతున్ సరస్వతీ. 6



శ్రీహరి స్తుతి

ఉ. శ్రీపతి! విష్ణుమూర్తి! సురసేవితపాద! ముకుంద! ధర్మసం
స్థాపన జేయగాఁ దలచి, ధారుణిలో ప్రభవించి, శిక్షణన్
బాపుల నుద్ధరించెదవు, భద్రముఁ గూర్తువు సాధుకోటికిన్,
నీ పదముల్ భజింతు గణనీయముగా స్థితికారకా! హరీ! 7



శివ స్తుతి

శా. భూతేశా! లయకారకా! శివ! కృపాపూర్ణా! యపర్ణాప్రియా!
భూతిన్ గైకొనినావు హాలహలమున్ బూర్ణమ్ముగా, విశ్వమున్
బ్రీతిన్ గాచెడి చంద్రశేఖర! హరా! విశ్వేశ! మృత్యుంజయా!
చేతుల్ మోడ్చెద నీశ్వరా! పురహరా! శ్రీకంఠ! గంగాధరా! 8



బ్రహ్మ స్తుతి

ఉ. నాలుగు మోములన్ గలిగి, నాథుడుగా వరభారతీసతిన్
లీలగ నాల్కపై నిలిపి, ప్రీతిని వేదచయమ్ముఁ జేతిలోఁ
దాలిచి, సృష్టిఁ జేసెడి పితామహు, ధాతను, భావిరేఖలన్
ఫాలమునందు వ్రాయగల బ్రహ్మను గొల్తు నభీష్టసిద్ధికై. 9



గణపతి స్తుతి

ఉ. శ్రీ గణనాయకా! విజయసిద్ధివిధాయక! విఘ్ననాశకా!
యాగక భూప్రదక్షిణము నద్భుతలీల ముగించినావు, నీ
వాగక వ్యాసభారతము నంత యెటింగి లిఖించినావు, నే
నాగక సాగునట్లు శుభ మంచు వచింపుము, నీకు మ్రొక్కెదన్. 10



పరమేశ్వరీ స్తుతి

ఉ. అమ్మలఁ గన్నయమ్మ వని, యందఱి నేలెడి లోకమాతవం,
చమ్మలఁ గన్న యమ్మవని, యా పరమేశ్వరు వామభాగ వం,
చమ్మవు నాకటంచు, భవదాశ్రయమే గతియంచు, నెమ్మదిన్
నమ్మితినమ్మ! మ్రొక్కెదను నన్ను దయన్ గనుమమ్మ యీశ్వరీ! 11



శ్రీలక్ష్మి స్తుతి

ఉ. క్షీరసముద్రజాతవయి, శ్రీహరినే వరియించి, సర్వదా
శ్రీరమవై వెలుంగుదువు, శ్రీల నొసంగెడి శ్రీహరిప్రియా!
సారసవాసినీ! కమల! చంద్రసహోదరి! లోకమాత! యా
ధారము మూల మీవెగద, తల్లి! కృపన్ గనుమమ్మ! మ్రొక్కెదన్. 12



మారుతి స్తుతి

మ. హనుమా! తారక రామనామ జపలీలాసక్త! భక్తాగ్రణీ!
వినుమా నాదగు ప్రార్థనన్, శరణు నీవే గంధవాహాత్మజా!
కొనుమా! పూజల నంజనాతనయ! కైకొమ్మార్తరక్షావిధిన్,
గనుమా! సత్కృప, రామబాణమ! ననున్ గాపాడుమా మారుతీ! 13



కుమారస్వామి స్తుతి

ఉ. తాపముఁ దీర్పగా, నసురుఁ దారకుఁ జంపగ, దేవకోటికిన్
దీపముగాగ, నగ్నిసమతేజముగా, శివపార్వతీమనో
రూపముగా జనించితివి, లోకములన్ వెసఁ గాచినావు, నీ
రూపము నెంచి కొల్చెదను, రుద్రకుమార! కుమార! షణ్ముఖా! 14



కవి స్తుతి

ఆదికవి వాల్మీకి మహర్షి స్తుతి

సీ. రామాయణమ్మును ప్రప్రథమమ్ముగా
సంస్కృతమ్మున వ్రాసి జగతి వెలిగె
రామరాజ్యమును శ్రీ రామచంద్రునిఁ గని
నుడువగ సమకాలికుడుగ మెలగె
రామ యనుమన మరా మరా యని తప
మొనరించి ఋషివర్యు డనగ జెలగె
రామాయణమ్మును లవకుశులకు నేర్పి
రామనామ జపానురక్తిఁ బరగె

తే.గీ. పఠన గానానుగుణ కావ్యఫణితిఁ గూర్చె
విశ్వమున రామమహిమను విశదపరచె
నట్టి ప్రాచేతసుని మనసారఁ దలతు
నాదికవియగు వాల్మీకి కంజలించి. 15

ఇతర సంస్కృత కవుల స్తుతి

ఉ. వ్యాసుడు కాళిదాసకవి బాణుడు శూద్రకుడున్ మయూరుడున్
భాసుడు దండి భర్తృహరి భారవియున్ భవభూతి మాఘు డా
హా సురవాణి వ్రాసి రితిహాస పురాణ నిబద్ధ కావ్యముల్
చేసెద వందనాలు రససిద్ధులు వారల కాదరంబునన్. 16

ప్రాచీన ఆంధ్రకవుల స్తుతి

సీ. ఆంధ్రమ్ములో భారతామ్నాయ మందింప
నాద్యుడై నన్నయ్య యవతరించెఁ
బాత్రు డుభయకవిమిత్రుడు ఘనుడు క
విబ్రహ్మ తిక్కన వెలసి మించె
వరు డెఱ్ఱన ప్రబంధపరమేశ్వరుడు శంభు
దాసుడు కీర్తికాంతను వరించె
శ్రీహర్షనైషధశ్రీఁ జాటి తెనుగున
శ్రీనాథుడు మనకమృతముఁ బంచె
భాగవతము వ్రాసి బమ్మెర పోతన
తెలుగుకవిగ తెల్గు విలువఁ బెంచె

ఆ.వె. రమ్యరీతి వ్రాసి రామాయణమ్మును
మొల్ల కవనఫణితి భువి రచించె
నిట్టి పూర్వకవుల నెల్లర గణియించి
స్తవ మొనర్తు వారి తత్త్వ మెంచి. 17

ఆధునిక ఆంధ్రకవుల స్తుతి

సీసమాలిక

రామాయణము వ్రాసి రచి వాసుదాసు తా
నాంధ్రవాల్మీకి విఖ్యాతి నందె
ఋషియైన శ్రీపాద కృష్ణమూర్తియు శతా
ధికగ్రంథకర్తగాఁ దేజమందె
గరిమ రామాయణ కల్పవృక్షము వ్రాసి
విశ్వనాథుడు జ్ఞానపీఠ మందె
విధి గడియారము వేంకట శేషశా
స్త్రియు శివభారత సృష్టిఁ జేసె
పింగళి కాటూరి సంగతి సౌందర
నందమన్ కావ్యమ్ము నందజేసెఁ
బానశాల రచించి వర కవికోకిల
దువ్వూరి జగతి సంతుష్టిఁ గూర్చె
సత్కావ్యనిర్మాత జాషువా నవయుగ
కవిచక్రవర్తియై ఖ్యాతి నందె
జంధ్యాల పాపయ్య శాస్త్రి పుష్పవిలాప
హేల కరుణరసశ్రీల విరిసె

నల పుట్టపర్తి నారాయణాచార్యులు
శివతాండవమ్మును సృష్టి జేసె
నాంధ్రపురాణమ్ము నందించిన మధునా
పంతుల కల్హాణ ప్రథ వహించె
రసరమ్య కవిత నరాల రామారెడ్డి
'అవధానకవి'గ విఖ్యాతి నందె
సౌమనస్యగ్రంథ సంధాత సూరము
శ్రీనివాసులు గురుసిద్ధి నందె

ఆ.వె. నిట్టి నేటి కవుల నెల్లఱ గణియించి
శిష్టులైన కవుల సేవ లెంచి
యందఱికి నమస్సు లర్పింతుఁ బులకించి
స్తవ మొనర్తుఁ గవుల తత్త్వ మెంచి. 18

మాతృ వందనము

ఉ. సమ్మతితోడ సంతతికి సర్వవిధమ్ముల మేలుగల్గగా
నెమ్మది గోరునట్టి మహనీయకు, సాధ్వికి, మాన్యయైన మా
యమ్మకు, నాదిదైవమున, కాశ్రితులన్ దయఁ జూచు సక్కుబా
యమ్మకు మ్రొక్కెదన్ సవినయమ్ముగ భక్తిప్రపత్తు లొప్పగా. 19

పితృ వందనము

మ. అనఘుండున్ జనవంద్యుడున్ గురువుగా "అల్లూరు" గ్రామమ్ములో
వినుతిన్ గాంచుచుఁ జక్కగాఁ జదువుఁ జెప్పెన్ ప్రీతచిత్తుండునై,
ఘనతన్ జెప్పెఁ బురాణగాథలను దీక్షన్, 'కోట సారంగపా
ణి' నయోదారుడు నాదు తండ్రి యతనిన్ నిత్యమ్ము నేఁ గొల్చెదన్. 20

గురు స్తుతి

ఉ. ఆలన లేక బిడ్డ నడయాడెడి వేళలఁ బ్రేమ పొంగగా
ప్రేలినిఁ బట్టి లీల నడిపింతురు తల్లియుఁ దండ్రి, యట్టులే
జాలము లేక నా రచన చక్కగ సాగగ, దారిఁ జూపుచున్
బాలనఁ జేయు సూరులను బ్రాజ్ఞుల నెంతు గురుత్వభావనన్. 21

ప్రముఖ అవధానకవి
శ్రీ నరాల రామారెడ్డి గురువర్యుల స్తుతి

సీ. పదియారు వర్షాల పసిడిప్రాయమునందె
యవధాన రంగాన నడుగుపెట్టెఁ
బాండిత్యగరిమకుఁ బ్రాధాన్యమీయక
భావకవన శైలి పాదుకొలిపెఁ
దెల్గు రాష్ట్రమ్ముల దేశవిదేశాల
నవధాన సాహస్ర మధిగమించె
నవధానకేళిలో ననువాదశైలిలో
సవ్యసాచిత్వమ్ము సంతరించె
తే.గీ. హేల గాథలనున్న యందాల దింపె
సురుచిర వధాన సౌరభఝురులు నింపె
వర నరాల రామారెడ్డి గురువరుండు
విమల వాక్కుల నన్ను దీవించు సతము. 22

వ్యాస మహాభారత అనువాదకులు
శ్రీ సూరం శ్రీనివాసులు గురువర్యుల స్తుతి

సీ. వచనగేయము గాని పద్యకావ్యము గాని
సత్కవితాధార జాలువారు
నమరభాషనుగాని యాంధ్రమ్మునను గాని
యసమాన పాండిత్య మతిశయిల్లు
నవధానమునగాని ప్రవచనమునగాని
ప్రజ్ఞాసముద్రమ్ము ప్రస్తరించు
బరిశోధనను గాని పాఠ్యబోధన గాని
పరిపూర్ణతత్త్వంబు పరిఢవిల్లు
తే.గీ. రూపుగొన్నట్టి వాత్సల్యరోచి యాత
డవధి లేనట్టి సౌమనస్యం బతండు
సూరముకులకంధివిధుండు సూరి యట్టి
శ్రీనివాసులు గురువర్యు బ్రీతి నెంతు. 23

గ్రంథకర్త పరిచయము

సీ. నెల్లూరు దాపున 'అల్లూరు' గ్రామమ్ము
పంటలల్లూరు నాన్ బ్రథిత మందు
రామమందిర వర ప్రాంత నివాసియౌ
సారంగపాణియన్ సాధుమతికి
సక్కుబాయమ్మయన్ సాధ్వీలలామకు
నారవ సంతానమై జనించి

సంస్కృతాంధ్రమ్ముల సరణి నెఱుంగుచు
నుత్తమ గురు కీర్తి నొందినాడ
తే.గీ. హృద్యమౌ వాణికృపఁ బద్యవిద్యనొంది
బుధులు మెచ్చగ నవధానములను జేసి
యుక్తి మెలగు కంచెర్ల గోత్రోద్భవుండ
'కోట రాజశేఖరుడ', నిన్ గొలుతు రామ! 24

అంకిత పద్యము



చం. సతతము నీదు నామమె ప్రశస్త మటంచు జపించుచుంటి, నా
తత శుభదాయక మ్మనుచుఁ దావక గాథ రచించుచుంటి, నీ
కతమున మోక్షసంపద సుఖమ్మున నందగ నుంటి, నీకు నం
కితమిడుచుంటి దీనిఁ బరికించి గ్రహింపుము జానకీపతీ! 25



శ్రీ సీతారామ కల్యాణము

(బాలకాండము)

1. వాల్మీకి మహర్షికి నారద మహర్షి చెప్పిన రామకథ

తపస్స్వాధ్యాయ నిరతం తపస్వీ వాగ్విదాం వరమ్।
నారదం పరిపప్రచ్ఛ వాల్మీకి ర్మునిపుంగవమ్॥ {1.1.1}

❃ తపస్సును సదా చేసేవాడు, స్వాధ్యాయమునందు ఆసక్తి గలవాడు, వాక్యవిశారదుడు, దేవర్షి అగు నారదుడు వాల్మీకి మహర్షిని సమీపించగా వాల్మీకి ఆ దేవర్షిని కీర్తించి సత్కరించి "ఓ నారద మహర్షీ! నా ప్రశ్నకు సమాధానం చెప్పు" అని ఇలా అడుగసాగినాడు.

మ. తపమున్ జేసెడివాడు, సంతతము స్వాధ్యాయమ్మునున్ సల్పగా
దపనన్ బొందెడి వాగ్విదుండు, ఘనవిద్వాంసుండు, దేవర్షియున్
గృప వాల్మీకి మునీంద్రుఁ జేర, నతనిన్ గీర్తించి వాల్మీకి "నా
కిపు డీ ప్రశ్నకు నుత్తర మ్మిడుము స్వామీ! నారదా!" యంచనెన్. 1

కోన్వస్మిన్ సాంప్రతం లోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్।
ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో ధృఢవ్రతః॥ {1.1.2}
చారిత్రేణ చ కో యుక్తః సర్వభూతేషు కో హితః।
విద్వాన్ కః క స్సమర్థశ్చ కశ్చైకప్రియదర్శనః॥ {1.1.3}
ఆత్మవాన్ కో జితక్రోధో ద్యుతిమాన్ కోఽనసూయకః।
కస్య బిభ్యతి దేవాశ్చ జాతరోషస్య సంయుగే॥ {1.1.4}

❃ ఈ లోకంలో గుణవంతుడు, వీర్యవంతుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యవంతుడు, సర్వభూత హితుడు, దృఢవ్రతుడు, సచ్చరిత్రతో కూడినవాడు,

ప్రియదర్శనుడు, ఆత్మతత్త్వవేత్త, విద్వాంసుడు, కోపమును జయించినవాడు, ద్యుతిమంతుడు, సమర్థుడు, అసూయ లేనివాడు, యుద్ధం చేసే సమయంలో కోపాన్ని ప్రదర్శించి దేవతలను కూడా భయపెట్టగల శూరుడు ఎవడు? అట్టి మహనీయుని గురించి నాకు తెలియజేయి.

సీ. ఎవ్వడు గుణవంతు డిల వీర్యవంతుండు
ధర్మజ్ఞు డెవడు కృతజ్ఞు డెవడు
సత్యవంతుడెవండు సర్వభూతహితుండు
నెవడు దృఢవ్రతుం డెవ్వ దరయ
సచ్చరిత్రయుతుండు సౌందర్యమునఁ బ్రియ
దర్శనుండును నాత్మతత్త్వవేత్త
ఘనతరవిద్వాంసుడును జితక్రోధుండు
ద్యుతిమంతుడును సమర్థుండెవండు
తే.గీ. జనుల కృత్యముల నసూయఁ గననివాడు
వేడ్క రణమునఁ దాను గోపించినపుడు
సురలనైనను భయపెట్టు శూరవరుడు
నెవ్వడాతనిఁ గూర్చి నాకిపుడు చెపుమ. **2**

ఏత దిచ్ఛా మ్యహం శ్రోతుం పరం కౌతూహలం హి మే।
మహర్షే! త్వం సమర్థోఽసి జ్ఞాతు మేవంవిధం నరమ్॥ {1.1.5}
శ్రుత్వా చైతత్ త్రిలోకజ్ఞో వాల్మీకే ర్నారదో వచః।
శ్రూయతా మితి చామంత్ర్య ప్రహృష్టో వాక్య మబ్రవీత్॥ {1.1.6}
బహవో దుర్లభా శ్చైవ యే త్వయా కీర్తితా గుణాః।
మునే వక్ష్యా మ్యహం బుద్ధ్వా తై ర్యుక్తః శ్రూయతాం నరః॥ {1.1.7}

❁ ఈ సుగుణములతో విరాజిల్లే మానవుని గురించి తెలిసికొనవలెనని నాకు ఎంతో కుతూహలంగా ఉన్నది. ఇప్పుడు తెలిపిన పదునారు సుగుణములు

గలవానిని గురించి తెలుపగలవాడవు నీవే. దయతో తెలియజేయి " అని వాల్మీకి మహర్షి ఎంతో వినయంగా నారదమహర్షిని ప్రశ్నించినాడు.

ఆ విధంగా వాల్మీకి మహర్షి దేవర్షిని వేడగా నారదుడు సంతోషపడి ఇలా చెప్పసాగినాడు. "ఓ వాల్మీకి మహర్షీ! నీవు తెలిపిన గుణములు దుర్లభమైనవి. ఆ సుగుణములను కలిగియుండి వాటికి వన్నె చేకూర్చే మానవుడు ప్రజాపాలకుడైన రాముడే. ఆ శ్రీరాముని గుణగణములను వర్ణిస్తాను. విను "

తే.గీ. ఇట్టి గుణముల రాజిల్లు నట్టి నరుని
నరయ నెంతో కుతూహలం బయ్యె నాకు
నతనిఁ దెలుపఁగలట్టి మహర్షి వీవె
యనుచు వేడెను వాల్మీకిమునివరుండు. 3

మ. అని వాల్మీకి మహర్షి వేడ, వినుమయ్యా! యంచు నా నారదుం
డనియెన్ మోదము పల్లవింప మదిలో, నాశ్చర్యమున్ గూర్చుచున్
"వినగా దుర్లభమౌ గుణమ్ము లవి భావింపంగ, నే విన్న త
ద్గుణరాశిన్ వెలుగొందఁజేయు జననాథున్ రాము వర్ణించెదన్" 4

ఇక్ష్వాకువంశ ప్రభవో రామో నామ జనైః శ్రుతః।
నియతాత్మా మహావీర్యో ద్యుతిమాన్ ధృతిమాన్ వశీ॥ {1.1.8}
బుద్ధిమాన్ నీతిమాన్ వాగ్మీ శ్రీమాన్ శత్రునిబర్హణః।
విపులాంశో మహాబాహుః కంబుగ్రీవో మహాహనుః॥ {1.1.9}

❀ ఇక్ష్వాకు వంశమునకు చెందిన రాజు శ్రీరాముడు. రాముడు ప్రజలచే కీర్తింపబడుచున్నవాడు. సాటిలేని తేజస్సు కలవాడు. జితేంద్రియుడు. నియతాత్ముడు. ధైర్యగుణంతో ప్రకాశించే వాడు. ధర్మజ్ఞుడు. దానపరుడు. నీతిమంతుడు. మహాబాహుడు. శత్రువినాశనమును చేయగలవాడు. శుచిగా ఉండెడివాడు (ఋజుప్రవర్తన కలవాడు). శ్రీమంతుడు. మాటనేర్పరితనము కలవాడు.

మ. కల డిక్ష్వాకు కులమ్మునందు జనవిఖ్యాతుండు రాముండు ని
స్తులతేజస్వి జితేంద్రియుండు నియతాత్ముండున్ ధృతిన్ వెల్గు వా
డిల ధర్మజ్ఞుడు ధాత నీతిగలవా డెన్నన్ మహాబాహుడై
చెలగున్ శత్రునిబర్హణుండు శుచియున్ శ్రీమంతుడున్ వాగ్మియున్. 5

మహోరస్కో మహేష్వాసో గూఢజత్రు రరిందమః।
ఆజానుబాహు స్సుశిరాః సులలాటః సువిక్రమః॥ {1.1.10}

❀ శ్రీరాముడు అలఘుపరాక్రముడు. కంబుగ్రీవుడు. సులలాటుడు. సుశిరస్కుడు. విచక్షణాజ్ఞానము కలవాడు. బలసంపన్నుడు. దృఢమైన వక్షస్థలము కలవాడు. జగదభిరాముడు. శుభలక్షణుడు. రఘుకులతిలకుడు. దనుజవిరాముడు. కోదండధరుడు. రాజులలో అగ్రగణ్యుడు. ధర్మాత్ముడు. సుందరరూపుడు. ప్రతిభావంతుడు. సుజనుడు. మునిసన్నుతుడు. వసంత ఋతువు వలె లోకమునకు హితమును ఆనందమును కలిగించెడివాడు. అందరికీ ఆప్తమిత్రుడు.

కం. అలఘుడు కంబుగ్రీవుడు
సులలాటుడు రామవిభుడు సుశిరస్కుండున్
దలపగ విచక్షణుండును
బలసంపన్నుండు పీనవక్షస్కుండున్. 6

కం. రాముడు జగదభిరాముడు
రాముడు శుభలక్షణుండు రఘుకులవరుడున్
రాముడు దనుజవిరాముడు
రాముడు కోదండధరుడు రాజాగ్రణియున్. 7

కం. రాముడు ధర్మాత్ముండును
రాముడు సుందరతముండు ప్రతిభాయుతుడున్

రాముడు సుజనుడు మునినుతు
డామని వలె లోకహితుడు నాప్తసఖుండున్. **8**

ధర్మజ్ఞః సత్యసంధశ్చ ప్రజానాం చ హితే రతః।
యశస్వీ జ్ఞానసంపన్నః శుచి ర్వశ్యః సమాధిమాన్॥ {1.1.12}

❀ *శ్రీరాముడు ప్రియదర్శనుడు. సుగుణాభిరాముడు. వీర్యవంతుడు. సత్యసంధుడు. సమర్థుడు. కృతజ్ఞుడు. శూరుడు. దృఢవ్రతుడు. విద్వాంసుడు. ఆర్యుడు. పాత్రుడు (యోగ్యుడు). ధీమంతుడు. తత్త్వవేత్త. ఎఱిగిన విషయములను మరువనివాడు. విశాలాక్షుడు.*

మ. నుడువంగాఁ బ్రియదర్శనుండు గుణవంతుండున్ మహావీర్యవం
తుడు శ్రీరాముడు సత్యసంధుడు సమర్థుండున్ గృతజ్ఞుండు నా
తడు శూరుండు దృఢవ్రతుండు ఘనవిద్వాంసుండు నార్యుండు పా
త్రుడు నాత్మజ్ఞుడు సర్వభూతరతి శశ్వద్వ్యక్త చారిత్రుడున్. **9**

ప్రజాపతిసమః శ్రీమాన్ ధాతా రిపునిషూదనః।
రక్షితా జీవలోకస్య ధర్మస్య పరిరక్షితా॥ {1.1.13}
సర్వశాస్త్రార్థతత్త్వజ్ఞః స్మృతిమాన్ ప్రతిభానవాన్।
సర్వలోకప్రియః సాధుః అదీనాత్మా విచక్షణః॥ {1.1.15}

❀ *శ్రీరాముడు అందఱికీ భద్రములను సమకూర్చువాడు. గొప్పదైన కోదండమును ధరించువాడు. భక్తసులభుడు. సర్వశాస్త్రవిశారదుడు. అందఱినీ సమానంగా చూచేవాడు. ధైర్యవంతుడు. ప్రతాపవంతుడు. ధనుర్విద్యావిశారదుడు. కలిగినదానితో సంతృప్తి చెందువాడు. నిత్యసాధనాపరుడు. సమాధిస్థితిలో ఉండగలుగువాడు. కారణజన్ముడు. ధీరులలో అగ్రగణ్యుడు. దుష్టశిక్షణ శిష్టరక్షణ చేయుటకు అవతరించిన శ్రీహరి. ఈ లోకంలో దశరథమహారాజునకు కుమారుడుగా జన్మించి సాక్షాత్తూ*

లక్ష్మీదేవియైన సీతాదేవిని వివాహమాడి రావణాసురుని సంహరించి విజయలక్ష్మితో కూడినవాడై ధర్మసంస్థాపన చేసిన ధర్మమూర్తి.

సీ. భద్రప్రదుడు మహేష్వాసుండు సులభుండు
సర్వశాస్త్రవిదుండు సర్వసముడు
ధైర్యవంతుండు ప్రతాపవంతుడు ధను
ర్వేదనిష్ఠుండు సంతృప్తిపరుడు
సాధనాపరుడు సమాధిమగ్నుండును
గారణజన్ముండు ధీరవరుడు
దుష్టశిక్షణఁ జేయ శిష్టరక్షణఁ జేయ
నవతరించిన యట్టి హరి యతండు
తే.గీ. జగతి దశరథసుతుడుగా జనన మొంది
లక్ష్మియౌ సీతతోడ కల్యాణ మొంది
రావణుని వధించి విజయలక్ష్మి నొంది
ధర్మమును నిల్పె రాముడు ధర్మమూర్తి. **10**

రక్షితా స్వస్య ధర్మస్య స్వజనస్య చ రక్షితా।
వేదవేదాంగ తత్త్వజ్ఞో ధనుర్వేదే చ నిష్ఠితః॥ {1.1.14}

❊ శ్రీరాముడు తనను ఆశ్రయించిన వారికి అభయమును ఇచ్చేవాడు. ఆజానుబాహుడు. గొప్పవైభవం కలవాడు. శత్రువులను శిక్షించగల వీరుడు. సమదృష్టి కలవాడు. విజ్ఞానసంపన్నుడు. శుభప్రదుడు. శుభలక్షణములు కలవాడు. విపులాంసుడు. విశాలమైన వక్షస్థలము కలవాడు. అందఱికీ నాథుడు. సంపదలకు అధిపతి. ధర్మమూర్తి. ఇట్టి ఉత్తమ గుణములు గల శ్రీరాముడు భూమండలమును పాలించుచున్నాడు.

మ. అభయ మ్మిచ్చెడు నా౹్రశితావళికిఁ, దా నాజానుబాహుండు, స
ద్విభవౌన్నత్యు, దరిందముండు, సముడున్, విజ్ఞానసంపన్నుడున్,
శుభదుండున్, శుభలక్షణుండు, విపులాంసుండున్, మహోరస్కుడున్,
విభుడున్, శ్రీపతి, ధర్మమూర్తిగనుఁ బృథ్విన్ బ్రోచు నీ రాముడే. 11

సమః సమవిభక్తాంగః స్నిగ్ధవర్ణః ప్రతాపవాన్।
పీనవక్షా విశాలాక్షో లక్ష్మీవాన్ శుభలక్షణః॥ {1.1.11}

❀ శ్రీరాముడు శత్రువుల నందఱినీ సంహరించినవాడు. వేదవేత్త. ఎన్నడునూ దీనభావమును పొందనివాడు. రాజు లందఱిలోనూ ఉత్తముడు. ధీరుడు. సమవిభక్తాంగుడు. సాధుమూర్తి. ఎల్లప్పుడూ లోకకల్యాణమును కోరెడివాడు. అందఱి యొక్క హితమును కోరెడివాడు. ధన్యాత్ముడు. మాన్యుడు. ప్రతిభావంతుడు. నిగనిగలాడు శరీరవర్ణము కలవాడు. అందఱిచే ఆరాధింపదగినవాడు.

మ. హతశత్రుండును వేదవేత్తయు నదీనాత్ముండు రాజన్యులం
దతిసౌజన్యుడు ధీరుడున్ సమవిభక్తాంగుండు సాధుండు సం
తతలోకప్రియకారకుండు హితుడున్ ధన్యాత్ముడున్ మాన్యుడున్
బ్రతిభావంతుడు స్నిగ్ధవర్ణుడు సదారాధ్యుండు నీ రాముడే. 12

సర్వదాభిగతః సద్భిః సముద్ర ఇవ సింధుభిః।
ఆర్యః సర్వసమశ్చైవ సదైకప్రియదర్శనః॥ {1.1.16}
స చ సర్వగుణోపేతః కౌసల్యానందవర్ధనః।
సముద్ర ఇవ గాంభీర్యే ధైర్యేణ హిమవానివ॥ {1.1.17}
విష్ణునా సదృశో వీర్యే సోమవత్ ప్రియదర్శనః।
కాలాగ్నిసదృశః క్రోధే క్షమయా పృథివీసమః।
ధనదేన సమ స్త్యాగే సత్యే ధర్మ ఇవాపరః॥ {1.1.18}

❁ శ్రీరాముడు గాంభీర్యమున సముద్రము వంటివాడు. ధైర్యమున హిమాలయము వంటివాడు. వీర్యసంపదయందు విష్ణుమూర్తితో సమానుడు. ప్రియదర్శనమున చంద్రుని వంటివాడు. కోపమును ప్రదర్శించునప్పుడు ప్రళయకాలాగ్నితో సమానమైనవాడు. క్షమాగుణంలో భూమాతతో సమానుడు. త్యాగ గుణంలో కుబేరునితో సమానుడు. సత్యవాక్పాలనలో యమధర్మరాజుతో సమానుడు. సత్యపరాక్రముడు. తన సుగుణములచేత పండితుల అభిమానమును పొందెడువాడు. అన్ని నదులకు సముద్రమే గమ్యము ఐనట్లుగా సజ్జనుల సమూహమునకు ఆ శ్రీరామచంద్రుడే దిక్కు.

సీ. గంభీరగతుల సాగరుడు, ధైర్యమ్మునఁ
దుహినాద్రిశృంగోన్నతుం డతండు
వీర్యసంపదలందు విష్ణుసముండగుఁ
బ్రియదర్శనమున రేవెలు గతండు
ఘనకోప మందునఁ గాలాగ్నిసదృశుండు
దివ్యమౌ క్షమనుఁ బృథ్వీసముండు
త్యాగగుణమ్మున ధనదుండు, సత్యవా
క్పాలన సమవర్తి వలె ఘనుండు,
తే.గీ. విక్రముండును సత్యపరాక్రముండు
రామచంద్రుండు సుగుణాభిరక్తబుధుడు
నబ్ధి యెల్లనదుల గమ్యమైన రీతి
నాతడే గతి సజ్జన వ్రాతమునకు. **13**

సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే।
అభయం సర్వభూతేభ్యో దదా మ్యేతద్వ్రతం మమ॥ {6.18.35}

❁ రఘువంశమున జన్మించిన శ్రీరాముడు నరోత్తముడు. సాధుజనరక్షణతో సత్కీర్తిని పొందినవాడు. జగన్మోహనమైన రూపము కలవాడు. "రామా! నేను నీ

దాసుడను" అని అంటే చాలు, ఈ సంసారసముద్రమును సులభంగా దాటేందుకు సహాయం చేయగలడు. శ్రీరాముని నామమును జపించేవారికి అది తారకమంత్రమై ధన్యత్వాన్ని చేకూర్చగలదు.

ఉ. శ్రీ రఘురాము డుత్తముడు శిష్టజనావనతాయశస్వితా
ధారుడు లోకమోహనుడు, "తావక దాసుడ" నన్న చాలు సం
సార పయోధి దాటుటకు సాయముఁ జేయును, రామనామమే
తారక మంత్రమై తనరి ధన్యతఁ గూర్చు జపించువారికిన్. 14

న పుత్ర మరణం కించిత్ ద్రక్ష్యంతి పురుషాః క్వచిత్।
నార్య శ్చావిధవా నిత్యం భవిష్యంతి పతివ్రతాః॥ {1.1.91}
న చాగ్నిజం భయం కించిత్ నాప్సు మజ్జంతి జంతవః।
న వాతజం భయం కించిత్ నాపి జ్వరకృతం తథా॥
న చాపి క్షుద్భయం తత్ర న తస్కరభయం తథా। {1.1.92}

❊ తల్లిదండ్రులు బిడ్డల మరణాన్ని చూడవలసిన దుర్గతి రామరాజ్యంలో లేనేలేదు. మహిళలు సుమంగళులుగానే విరాజిల్లేవారు. విధవ అనే మాట ఎప్పుడునూ వినబడదు. అగ్నిభయము వాయుభయము జ్వరభయము వ్యాధిభయము దొంగభయము లేనేలేవు. మాట తప్పి ప్రవర్తించడము లేనేలేదు. ఆకలిబాధ దుర్భిక్షము లేనేలేవు. ప్రజలందఱూ ఆనందంగా జీవిస్తూ ఉన్నారు. అందఱికీ భద్రమును సౌభాగ్యమును సమకూరుస్తూ శ్రీరాముడు ఈ భూమిని ప్రజారంజకంగా పరిపాలిస్తూ ఉన్నాడు.

సీ. పౌత్రులు పితరులు పుత్రుల మరణమున్
గనెడి దుర్గతి లేదు, వినుట లేదు,
మంగళకరముగా మహిళలు రాజిల్ల
విధవయన్ బదమెందు వినగ రాదు
వహ్నిభయము లేదు, వనగండములు లేవు
మాట తప్పుట యన్న మాట లేదు

వాయుభయమ్మును జ్వరభయమ్మును లేదు
క్షుద్బాధ యనియెడి క్షోభ లేదు
తే.గీ. వ్యాధి తస్కర దుర్భిక్ష భయము లేదు
హర్షజీవనులై ప్రజ లలరుచుండ
భద్రములనిడి నిత్యసౌభాగ్య మిడుచు
రాముడేలును ధరఁ బ్రజారంజకముగ. 15

నగరాణి చ రాష్ట్రాణి ధనధాన్యయుతాని చ।
నిత్యం ప్రముదితాః సర్వే యథా కృతయుగే తథా। {1.1.93}
దశవర్షసహస్రాణి దశవర్షశతాని చ। {1-1-97}

❃ ఓ వాల్మీకి మహర్షీ! నీవు పదహారు గుణములను తెలిపి ఈ సుగుణములు కలవాడు ఎవడు అని అడిగినావు. శ్రీరాముడు నీవు అడిగినదానికంటే శతాధికంగా అంటే నూటపదహారు గుణములతో విరాజిల్లే సుగుణాభిరాముడు. మహిమాన్వితమైన సూర్యవంశమున ఉద్భవించిన రాజశ్రేష్ఠుడు. అటువంటి శ్రీరాముని రాజ్యపరిపాలనము ఎంతో అద్భుతమైనది. రాముని పరిపాలనలో ప్రజలకు ఎటువంటి బాధలూ లేవు. వారు నిత్యసంపదలతో అభయసిద్ధులతో అలరారుతూ ఉంటారు. ఈ త్రేతాయుగంలో, రామరాజ్యంలో కృతయుగధర్మం విలసిల్లుతూ నాలుగుపాదములతో ధర్మదేవత సంచరిస్తూ ఉన్నది. శ్రీరాముడు పదకొండువేల ఏండ్లు ప్రజారంజకముగా రాజ్యమును పరిపాలించగలడు.

కం. షోడశసద్గుణములు గల
వా డెవడని యడుగుచున్న వాల్మీకిమునీ!
తేడు శతాధిక గుణముల
వా డా రాముండు సూర్యవంశోద్భవుడున్. 16

తే.గీ. నగరములు రాష్ట్రములును ధనమ్ముతోడ
ధాన్యరాసులతోడను ధన్యతఁ గన

లీల వెలుగుచుఁ బదకొండు వేల యేండ్లు
పాలనము సేయు రాముడు భద్రములిడు. 17

తే.గీ. అట్టి శ్రీరాము పాలన మద్భుతమ్ము
బాధలను వీడి నిత్యసంపదలఁ గూడి
యభయ సిద్ధుల సంతృప్తు లచటి ప్రజలు
తలపఁ ద్రేతలోఁ గృతయుగధర్మ మమర. 18

అశ్వమేధశతై రిష్ట్వా తథా బహుసువర్ణకైః॥ {1-1-94}
గవాం కోట్యయుతం దత్త్వా విద్వద్భ్యో విధిపూర్వకమ్।
అసంఖ్యేయం ధనం దత్త్వా బ్రాహ్మణేభ్యో మహాయశాః॥ {1-1-95}
రాజవంశాన్ శతగుణాన్ స్థాపయిష్యతి రాఘవః।
చాతుర్వర్ణ్యం చ లోకేఽస్మిన్ స్వే స్వే ధర్మే నియోక్ష్యతి॥ {1-1-96}
రామో రాజ్యం ఉపాసిత్వా బ్రహ్మ లోకం ప్రయాస్యతి॥ {1-1-97}

❊ శ్రీరాముడు సువర్ణదానములను చేయును. అశ్వమేధయాగములను నిర్వహించును. నాలుగు వర్ణములకు సంరక్షకుడుగా మెలగును. స్వధర్మమును కాపాడును. అసంఖ్యాకంగా రాజ్యమును విస్తరింపజేయును. రాజ్యమును తనకు దైవముగా భావించి సేవించి సత్కీర్తినొంది చివరకు బ్రహ్మలోకమును చేరుకొనును.


ఉ. రాముడు స్వర్ణదానముల రాజిలుఁ, జేసెడి నశ్వమేధముల్
రాముడు నాల్గు వర్ణముల రక్షకుడౌను, స్వధర్మరక్షణన్
రాముడు రాజ్యరాజిని విరాజిలఁ జేయును, దైవభావనన్
రాముడు రాజ్యమున్ గొలిచి, ప్రస్తుతిఁ జేరును బ్రహ్మలోకమున్. 19

ఇదం పవిత్రం పాపఘ్నం పుణ్యం వేదైశ్చ సంమితమ్।
యః పఠేద్రామచరితం సర్వ పాపైః ప్రముచ్యతే॥ {1-1-98}

ఏతదాఖ్యానమాయుష్యం పఠన్ రామాయణం నరః।
స పుత్ర పౌత్రః స గణః ప్రేత్య స్వర్గే మహీయతే॥ {1-1-99}

❊ ఈ రామాయణము వేదసమ్మితము. రమణీయము. పాత్రము. విమలము. పుణ్యదాయకము. పాపములను నశింపజేయు పావన కావ్యము. మంచి బుద్ధితో దీనిని పఠించువాడు ఈ భూమిపై పుత్రపౌత్ర బంధువర్గముతో కూడినవాడై, అంత్యకాలమున స్వర్గమును చేరి సుఖముగా ఉండును.

మ. రమణీయమ్మిది వేదసమ్మితము శ్రీరామాయణం బర్థమున్
విమలంబున్ ఘనపుణ్యదాయకము భావింపంగఁ బాపఘ్నమున్
సుమతిన్ దీనిఁ బఠించువాడు వసియించున్ బుత్రపౌత్రాది వ
ర్గముతో, ధాత్రి సుఖించుఁ, దా నమరలోకమ్మందు నంత్యమ్మునన్. 20



2. బ్రహ్మ రామాయణమును వ్రాయవలసినదిగా వాల్మీకిని ఆదేశించుట

యథావత్ పూజితస్తేన దేవర్షి ర్నారద స్తదా।
ఆపృష్ట్వై వాభ్యనుజ్ఞాతః స జగామ విహాయసమ్॥ {1.2.2}
స ముహూర్తం గతే తస్మిన్ దేవలోకం ముని స్తదా।
జగామ తమసాతీరం జాహ్నవ్యా స్త్వవిదూరతః॥ {1.2.3}
తథా తు తం ద్విజం దృష్ట్వా నిషాదేన నిపాతితం।
ఋషే ర్ధర్మాత్మన స్తస్య కారుణ్యం సమపద్యత॥ {1.2.13}

❊ అని ఆ నారదమహర్షి శ్రీరాముని చరితమును మొదటినుండి చివరివఱకూ చెప్పి వాల్మీకి మహర్షిని దీవించినాడు. వాల్మీకి మహర్షి చేసిన పూజలను స్వీకరించి సంతోషంతో ఆకాశమార్గాన వెళ్లిపోయినాడు. వాల్మీకి మహర్షి నదీస్నానము చేయదలచి తమసానదీతీరం చేరుకొని అచ్చట ఒక బోయవాడు క్రౌంచపక్షుల జంటలో మగపక్షిని చంపివేయగా విలపిస్తూ ఉండిన ఆడుపక్షిని, చచ్చిపడియున్న మగపక్షిని చూచినాడు.

మ. అని యా నారదమౌని రామచరితం బాద్యంతమున్ జెప్పి, మౌ
నిని దీవించి, తదర్పితమ్ము గొని, విన్వీథిన్ జనెన్ బ్రీతుడై;
మునియున్ గ్రుంకులిడంగ నేగి, తమసామూలమ్మునన్ గ్రౌంచప
క్షిని వ్యాధుండు వధింప, దాని, మరి క్రౌంచిన్ గాంచె శోకమ్మునన్. 21

తతః కరుణవేదిత్వాత్ అధర్మోఽయ మితి ద్విజః।
నిశామ్య రుదతీం క్రౌంచీమ్ ఇదం వచన మబ్రవీత్॥ {1.2.14}

❊ "ఇక నాకు దారి ఏది" అని తన జతగా ఉండిన మగపక్షిని చూస్తూ క్రుంగిపోతూ విలపిస్తూ ఉండిన ఆడుపక్షిని చూచి, శోకమును పొందిన వాల్మీకి మహర్షి వ్యాకులపాటుతో కూడిన మనస్సు కలవాడై ఆ బోయవాడిని

నిందించినాడు. శోకంతో కూడిన ఆ మాటలే శ్లోకంగా మారినవి. ఆదికవిత్వరూపంగా రూపొందినవి.

ఉ. నా కెది దారి యన్నటుల నాథునిఁ జూచుచుఁ గ్రుంగిపోవుచున్
శోకిలుచున్న పక్షిఁ గని, శోకము నందిన మౌని, తత్క్షణ
వ్యాకుల చిత్తుడై నిశితవాక్కుల దూఱె నిషాదు, నప్పు డా
శోకమె శ్లోకమై తనరె, సూక్తిగ నాదికవిత్వరూపమై. 22

మా నిషాద ప్రతిష్ఠాం త్వమ్ అగమః శాశ్వతీః సమాః।
యత్ క్రౌంచమిథునా దేకమ్ అవధీః కామమోహితమ్॥ {1.2.15}

❋ "ఓ నిషాదుడా! ప్రేమతో క్రీడిస్తూ ఉండిన ఈ క్రౌంచ పక్షులపై జాలిని దయను చూపలేకపోయావా? నేనే బలవంతుడను అని గర్వించి ఈ పక్షి మిథునంలో ఒక పక్షిని నేల కూల్చినావు. ఇలా చేయడం వలన పాపం కలుగుతుంది కదా అని ఆలోచింపలేకపోయావు. ఇలా చేయడం ధర్మమేనా? నీవు అప్రతిష్ఠ పాలగుదువు గాక! నీ ఆయుష్షు క్షీణించును గాక!

మ. తలపుల్ పండగ నానృశంస్యము నిషాదా! చూపగా లేవొకో?
యలఘు ప్రేమ మెలంగు క్రౌంచమిథున మ్మందొక్క పక్షిన్ మహా
బలవంతుండ నటంచుఁ గూల్చితివి, పాపమ్మంచు యోచింపవా?
యల వౌనా? యిక నప్రతిష్ఠ యగు, దీర్ఘాయుష్షు లేకుండెడిన్. 23

చింతయన్ స మహాప్రాజ్ఞః చకార మతిమాన్ మతిమ్।
శిష్యం చై వాబ్రవీద్ వాక్యమ్ ఇదం స మునిపుఙ్గవః॥ {1.2.17}
పాదబద్ధోఽక్షరసమః తంత్రీ లయ సమన్వితః।
శోకార్తస్య ప్రవృత్తో మే శ్లోకో భవతు నాన్యథా॥ {1.2.18}

❋ వాల్మీకి మహర్షి ఆ బోయవాడిని ఆ విధంగా నిందించినవాడై తన మాటలను తానే పరిశీలించుకొని చెంత ఉన్న శిష్యుని చూచి "ఓ భరద్వాజా! శోకముతో

నేను పలికిన మాటలు శ్లోక పాదముల వలె ఉన్నవి. ఒక ప్రత్యేకమైన లయతో కూడియున్నవి. అన్ని పాదములలో అక్షరములు సమాన సంఖ్యలో ఉన్నవి. వింతగా ఏదో ఒక రాగమునకు అనుగుణముగా ఉన్నవి" అని పలుకుతూ ఆశ్చర్యమును వ్యక్తపరచినాడు.

మ. అని వాక్రుచ్చి స్వవాక్యమున్ దలచి, యాహా పాదబద్ధమ్ముగాఁ
విన నయ్యెన్ లయతో, సమాక్షరముగా విద్యాఫలమ్మొచుఁ జే
రినదై రాజిలె, శ్లోక మౌచు వరతంత్రీబద్ధతన్ వింతగాఁ
దనరెన్ వత్స! యటంచుఁ బల్కెను భరద్వాజున్ సమీక్షించుచున్. 24

శిష్యస్తు తస్య బ్రువతో మునే ర్వాక్య మనుత్తమమ్।
ప్రతి జగ్రాహ సంహృష్టః తస్య తుష్టోఽభవ ద్గురుః॥ {1.2.19}
ఆజగామ తతో బ్రహ్మా లోకకర్తా స్వయం ప్రభుః।
చతుర్ముఖో మహాతేజాః ద్రష్టుం తం మునిపుఙ్గవమ్। {1.2.23}
తమువాచ తతో బ్రహ్మా ప్రహసన్ మునిపుంగవమ్॥{ {1.2.30}
శ్లోక ఏవ త్వయా బద్ధో నాత్ర కార్యా విచారణా।

❋ అంతట వాల్మీకి మహర్షి తమసానదిలో స్నానము చేసి రాగా, శిష్యుడైన భరద్వాజుడు "ఓ మహాత్మా! మీ వాణి నాకు కంఠస్థమైనది" అని తెలిపినాడు. వాల్మీకి మహర్షి ఎంతగానో సంతోషించి తన ఆశ్రమమునకు చేరుకొనగా చతుర్ముఖుడైన బ్రహ్మదేవుడు అచ్చటికి వచ్చి ముని చేసిన పూజను అందుకొని, ఆతిథ్యమును స్వీకరించి "ఓ వాల్మీకి మహర్షీ! నీవు పలికిన మాటలు ఒక శ్లోకరూపమున ఉన్నవి" అని తెలియజేసి ఆ మహర్షిని దీవించి ఇంకనూ ఇలా పలుకసాగినాడు.

మ. తమసాస్నానముఁ జేసెఁ దాపసి, భరద్వాజుండు "కంఠస్థమ
య్యె మహాత్మా! భవదీయ వాణి" యన, మౌనీంద్రుండు సంతుష్టి నా
శ్రమమున్ జేరఁ, జతుర్ముఖుం డతని జేరన్ వచ్చి, యాతిథ్య మం
ది, "మునీ! పల్కితి వీవు శ్లోక" మనుచున్ దీవించి తా నిట్లనెన్. 25

మచ్ఛందా దేవ తే బ్రహ్మన్ ప్రవృత్తేయం సరస్వతీ।
రామస్య చరితం సర్వం కురు త్వం ఋషిసత్తమ॥ {1.2.31}
ధర్మాత్మనో భగవతో లోకే రామస్య ధీమతః।
వృత్తం కథయ ధీరస్య యథా తే నారదాచ్ఛ్రుతమ్॥ {1.2.32}
వైదేహ్యాశ్చైవ యద్వృత్తం ప్రకాశం యది వా రహః।
తచ్చా ప్యవిదితం సర్వం విదితం తే భవిష్యతి॥ {1.2.34}

❈ "ఓ వాల్మీకి మహర్షీ! నీవు ఒక శ్లోక రూపమున మాట్లాడుట అనునది నా సంకల్పము వలననే జరిగినది. శ్రీరాముడు అఖిలజగములకూ నాథుడు. బుద్ధిసంపద కలవాడు. ధర్మమూర్తి. గుణవంతుడు. ధీరుడు. నారద మహర్షి నీకు వివరించిన విధంగా శ్రీరాముని చరిత్రను ఒక పద్యగ్రంథంగా వ్రాయి. రామాయణ విషయములు అన్నీ స్పష్టంగా నీ మనస్సునకు గోచరించగలవు.

శా. నా సంకల్పమె నీదు శ్లోకము, జగన్నాథుండె శ్రీరాముడన్
ధీసంపన్నుడు ధర్మమూర్తి గుణియున్ ధీరుండు వాచంయమా!
వాసిన్ రామచరిత్ర నెంచుము లిఖింపన్ నారదోక్తమ్ముగా,
భాసించున్ భవదీయ చిత్తమున సుస్పష్టమ్ముగా సర్వమున్. 26

న తే వాగనృతా కావ్యే కాచి దత్ర భవిష్యతి।
కురు రామ కథాం పుణ్యాం శ్లోకబద్ధాం మనోరమామ్॥ {1.2.35}
యావత్ స్థాస్యంతి గిరయః సరితశ్చ మహీతలే।
తావ ద్రామాయణకథా లోకేషు ప్రచరిష్యతి॥ {1.2.36}

❈ దశరథ మహారాజు యొక్క కుమారుడైన శ్రీరాముడు వేదముల ద్వారా ఎఱుగదగినవాడు. విశ్వమున కంతటికీ హితమును కలిగించగలవాడు. రామకథ రమణీయమైనది. పుణ్యప్రదమైనది. అందఱికీ ఆనందాన్ని కలిగిస్తుంది. నీవు రామకథను రచింపుము. నీ వాక్కు సత్యము కాగలదు. నీవు వ్రాయబోవు రామాయణము కొండలు నదులు ఉన్నంతకాలం వర్ధిల్లును గాక!"

ఉ. వేదవిదుండు దాశరథి విశ్వహితుండు నరోత్తముండు, స
మ్మోదముఁ గూర్చు రామకథ పుణ్యము రమ్యము వామలూరుజా!
నీదగు వాక్కు సత్య మగు, నీవు రచింపుము రామగాథనే,
నీదగు కావ్య మీ గిరులు నిర్ఝరు లుండెడిదాక యుండెడిన్. 27

ఇత్యుక్త్వా భగవాన్ బ్రహ్మా తత్రైవాంతరధీయత।
తతః సశిష్యో వాల్మీకిః ముని ర్విస్మయ మాయయౌ॥ {1.2.38}
కావ్యం రామాయణం కృత్స్నం సీతాయా శ్చరితం మహత్।
ఉదారవృత్తార్థపదై ర్మనోహరైః
తతః స రామస్య చకార కీర్తిమాన్। {1-2-42}

❈ అని దీవించి బ్రహ్మదేవుడు అంతర్ధానం కాగా మహర్షికి చాలా ఆశ్చర్యం కలిగింది. సంపూర్ణంగా శ్రీరాముని చరిత్రను మనసులో చక్కగా భావించిన వాల్మీకి మహర్షి శ్రీమద్రామాయణమును ప్రసిద్ధమైన ఛందస్సులలో సంపూర్ణంగా రచించినాడు. ఆ రామాయణమును సీతాదేవి చరిత్ర అని పౌలస్త్యవధ అని కూడా అంటారు.

మ. అని దీవించి విరించి యచ్చటనె తా నంతర్హితుం డయ్యె, న
మ్ముని వాల్మీకియు విస్మయమ్ముఁ గని సంపూర్ణమ్ముగా నెంచి పా
వన రామాయణమున్ రచించెను సదా వర్ధిల్లు శ్రీరామ గా
థను శ్లోకమ్ములలోఁ బ్రసిద్ధమగు ఛందమ్మందు రమ్యమ్ముగా. 28



3. సంక్షిప్త రామాయణము

రామలక్ష్మణసీతాభిః రాజ్ఞా దశరథేన చ।
సభార్యేణ సరాష్ట్రేణ యత్ ప్రాప్తం తత్ర తత్త్వతః॥ {1-3-3}

❋ రామ లక్ష్మణుల విషయములను, జానకీదేవి విషయములను, దశరథుని విషయములను, ముగ్గురు రాణుల విషయములను చక్కగా భావించిన వాల్మీకి మహర్షి శ్రీరామగాథను విరచించెను.

తే.గీ. రామలక్ష్మణ గమనవిక్రాంతి నెఱిగి
జానకీచరిత నిరూఢి సార మెఱిగి
దశరథేశుని, రాణులఁ దత్త్వ మెఱిగి
వ్రాసె మౌని వాల్మీకి శ్రీరామగాథ. 29

స యథా కథితం పూర్వం నారదేన మహర్షిణా।
రఘువంశస్య చరితం చకార భగవాన్ ఋషిః॥ {1-3-9}

❋ ముందుగా నారదమహర్షి చెప్పిన విషయములను గుఱించి ఆలోచించి, బ్రహ్మవాక్కులను కూడా తలంచి వాల్మీకి మహర్షి దర్భాసనముపై కూర్చుండి రఘువంశీయుడగు శ్రీరాముని గాథను విరచించినాడు.

తే.గీ. ఎంచుచున్ బ్రహ్మవాక్కుల మించుచుండి
తలపులన్ నారదోక్తులన్ దలచుచుండి
కూర్మి దర్భాసనమ్మునన్ గూరుచుండి
వ్రాసె మౌని వాల్మీకి శ్రీరామగాథ. 30

జన్మ రామస్య సుమహద్ వీర్యం సర్వానుకూలతామ్।
లోకస్య ప్రియతాం క్షాంతిం సౌమ్యతాం సత్య శీలతామ్॥ {1-3-10}
నానా చిత్ర కథా శ్చాన్యాః విశ్వామిత్ర సమాగమే।

జానక్యాశ్చ వివాహం చ ధనుషశ్చ విభేదనమ్॥ {1-3-11}
రామ రామ వివాదం చ గుణాన్ దాశరథేః తథా।
తథాఽభిషేకం రామస్య కైకేయ్యా దుష్ట భావతామ్। {1-3-12}
విఘాతం చాభిషేకస్య రాఘవస్య వివాసనమ్। {1-3-13}

❈ వాల్మీకి మహర్షి నారదుడు చెప్పిన విషయములను స్మరిస్తూ తన రామాయణ మహాకావ్యంలో అనేక ఘట్టములను సమగ్రంగా వర్ణించినాడు. రామజననమును, రాముని శౌర్యమును, అందఱికీ అనుకూలముగా వ్యవహరించే రాముని హృదయమును, లోకప్రియత్వమును, సత్యము శీలము క్షమ సౌమ్యత మొదలగు సుగుణములను, విశ్వామిత్రుని రాకను, యజ్ఞసంరక్షణమును, శివధనుర్భంగమును, సభ్యుల ప్రశంసలను, జానకీకల్యాణమును, రామ పరశురామ వివాదమును, రామ పట్టాభిషేక సంకల్పమును, కైక దుర్బుద్ధిని, పట్టాభిషేక విఘ్నమును, రామ వనవాస గమనమును క్రమంగా విశదీకరించినాడు.

సీ. రామజన్మమ్మును రామశౌర్యమ్మును
సర్వానుకూలతన్ సాధుమతిని
సాకేతరాముని లోకప్రియత్వమున్
సత్యశీలక్షమాసౌమ్యతలను
గాధిజురాకను ఘనయజ్ఞరక్షణన్
శివధనుర్భంగమున్ శ్రీగ్రహణము
జానకీకల్యాణసంరంభశోభను
రామరామవివాదధామకథను

తే.గీ. ఘనత రామాభిషేకసంకల్ప ఘటనఁ
గైక తలపున విఘ్నమున్ గలుగు విధము
రామవనవాసగమనమున్ గ్రమముగాను
వ్రాసె వాల్మీకి నారదవాక్యసరణి. **31**

రాజ్ఞః శోకవిలాపం చ పరలోకస్య చాశ్రయమ్॥ {1-3-13}
ప్రకృతీనాం విషాదం చ ప్రకృతీనాం విసర్జనమ్।
నిషాదాధిపసంవాదం సూతోపావర్తనం తథా॥ {1-3-14}
గఙ్గాయాశ్చాపి సంతారం భరద్వాజస్య దర్శనమ్।
భరద్వాజాభ్యనుజ్ఞానాత్ చిత్రకూటస్య దర్శనమ్॥ {1-3-15}
వాస్తుకర్మనివేశం చ భరతాగమనం తథా।
ప్రసాదనం చ రామస్య పితుశ్చ సలిలక్రియామ్।
పాదుకాగ్ర్యాభిషేకం చ నందిగ్రామనివాసనమ్। {1-3-16}
దణ్డకారణ్యగమనం విరాధస్య వధం తథా।
దర్శనం శరభఙ్గస్య సుతీక్ష్ణేన సమాగమమ్। {1-3-17}

❊ ప్రియతమ పుత్రుడైన రాముడు అడవిలో నివసించుటకు వెళ్లగా దశరథుడు పుత్రశోకంతో స్వర్గస్థు డగుటను, రాముడు దూరమగుటచే ప్రజలకు కలిగిన దుఃఖమును, రాముని ప్రయాణమును, గుహుని సేవను, గంగానదిని దాటుటను, భరద్వాజుని దర్శించుటను, చిత్రకూట వసతిని, భరతుని ఆగమనమును, పితృకార్యములను, పాదుకాగ్రహణమును, భరతుడు నందిగ్రామమున నివసించుటను, సీతారామలక్ష్మణులు దండకారణ్యమున ప్రవేశించుటను, విరాధుని వధను, శరభంగుని దర్శనమును క్రమంగా వాల్మీకి మహర్షి విరచించినాడు.

సీ. పుత్రుడు కానకుఁ బోవగా శోకించి
యాజి తా స్వర్గస్థుడైన గతినిఁ
బ్రజల విషాదమున్ రాముని గమనమున్
గొండలరాయని గుహుని సేవ
గంగను దాటుటన్ ఘన భరద్వాజునిఁ
గూడుటయును జిత్రకూట వసతి
భరతాగమనమును వరపితృకార్యమున్
ఘనతరమౌ పాదుకాగ్రహణము

తే.గీ. భరతవిభుని నందిగ్రామ వాససరణి
రామచంద్రుని దండకారణ్యవసతి
వర విరాధునివధ, శరభంగుఁ గనుట,
వ్రాసె వాల్మీకి నారదవాక్యసరణి. 32

అనసూయా సహాస్యామప్యంగరాగస్యచార్పణమ్॥
అగస్త్యదర్శనం చైవ జటాయోరభిసంగమమ్।
పంచవట్యాశ్చ గమనం శూర్పణఖ్యాశ్చ దర్శనమ్॥ {1-3-18}
శూర్పణఖ్యాశ్చ సంవాదం విరూపకరణం తథా।
వధం ఖరత్రిశిరసో రుత్థానం రావణస్య చ॥ {1-3-19}
మారీచస్య వధం చైవ వైదేహ్యా హరణం తథా।
రాఘవస్య విలాపం చ గృధ్రరాజనిబర్హణమ్॥ {1-3-20}
కబంధ దర్శనం చైవ పంపాయాశ్చాపి దర్శనమ్। {1-3-21}

❋ సుతీక్ష్ణ మహర్షి దర్శనమును, అత్రి అనసూయల అతిథిసేవను, అగస్త్యుని చెంతకు చేరుటను, జటాయువును సందర్శించుటను, పంచవటీ నివాసమును, శూర్పణఖను చూచుటను, ఖరాది రాక్షసుల వధను, మారీచవధను, సీతాపహరణమును, రఘురాముని శోకమును, జటాయువు మరణమును, కబంధుని దర్శనమును, పంపానదిని చూచుటను క్రమముగా వాల్మీకి మహర్షి విరచించెను.

సీ. సాధువైన సుతీక్ష్ణు సందర్శనాదుల
నత్ర్యనసూయల యతిథి సేవ
నంత నగస్త్యుని చెంతకుఁ జేరుటన్
ధన్య జటాయు సందర్శనమును
బంచవటీప్రాంత వాసమున్ శూర్పణ
ఖాదర్శనమ్మును ఖరముఖ వధ,

నంత మారీచుని నంతమ్ము చేయుటన్
సీతాపహరణమున్ శ్రీ రఘువరు
తే.గీ. శోకమును, జటాయువు మృతిన్, వీక నడవి
ఘన కబంధుని దర్శనమును, జలకళ
నలరు పంపను గాంచుట నతులరీతి
వ్రాసె వాల్మీకి నారదవాక్యసరణి. 33

శబర్యా దర్శనం చైవ హనూమద్దర్శనం తథా॥ {1-3-22}
ఋశ్యమూకస్య గమనం సుగ్రీవేణ సమాగమమ్। {1-3-23}

❋ శబరిని దర్శించుటను, హనుమంతుని దర్శనమును, ఋశ్యమూక గమనమును, రామ సుగ్రీవ మైత్రిని క్రమంగా వాల్మీకి మహర్షి విరచించినాడు.

ఆ.వె. శబరిదర్శనమును సామీరిఁ గనుటను
ఋశ్యమూక గమన మెన్నగాను
శుభముఁ గూర్చు రామ సుగ్రీవ మైత్రిని
వ్రాసె నాదికవి వికాసభణితి. 34

వాలిప్రమథనం చైవ సుగ్రీవప్రతిపాదనమ్।
తారావిలాపం సమయం వర్షరాత్రనివాసనమ్॥ {1-3-24}
కోపం రాఘవ సింహస్య బలానాముపసంగ్రహమ్।
దిశః ప్రస్థాపనం చైవ పృథివ్యాశ్చ నివేదనమ్॥ {1-3-25}
అఙ్గులీయక దానం చ ఋక్షస్య బిల దర్శనమ్।
ప్రాయోపవేశనం చాపి సంపాతేశ్చాపి దర్శనమ్॥ {1-3-26}
పర్వతారోహణం చాపి సాగరస్యాపి లఙ్ఘనమ్।
సముద్ర వచనాచ్చైవ మైనాకస్య చ దర్శనమ్। {1-3-27}
సింహికాయాశ్చ నిధనం లఙ్కా మలయ దర్శనమ్।
రాత్రౌ లంకా ప్రవేశం చ ఏకస్యాపి విచింతనమ్। {1-3-28}

ఆపాన భూమి గమనం అవరోధస్య దర్శనమ్।
దర్శనం రావణస్యాపి పుష్పకస్య చ దర్శనమ్। {1-3-29}
అశోక వనికాయానం సీతాయాశ్చాపి దర్శనమ్।
అభిజ్ఞాన ప్రదానం చ సీతాయాశ్చాభిభాషణమ్॥ {1-3-30}
రాక్షసీ తర్జనం చైవ త్రిజటా స్వప్న దర్శనమ్। {1-3-31}

❊ వాలివధను, వానరుల సీతాన్వేషణ ప్రయాణమును, హనుమ అంగుళీయకమును గ్రహించుటను, సాగర లంఘనమును, మైనాకుని సేవను, సింహిక వధను, లంకాప్రవేశమును, అశోకవన సందర్శనమును, సీతాదేవిని కనుగొనుటను, సీతకు అంగుళీయకమును ఇచ్చుటను, త్రిజటాస్వప్నమును, సీతామాత హనుమకు శిరోమణిని ఇచ్చుటను, వనభంగమును క్రమముగా వాల్మీకి మహర్షి విరచించెను.

సీ. వాలివధన్, ఘనవానరసేన సీ
తాన్వేషణముఁ జేయ నరుగు విధిని,
నంగుళీయకదాన మనెడి యంశమ్మును,
సాగరలంఘన వేగగతిని,
మైనాకసేవను, మహిత సింహికవధన్,
లంకాప్రవేశమున్, లంకలోన
భవ్యమైన యశోకవనదర్శనమును, సీ
తాదర్శనమ్మును, మోద మిడెడు
తే.గీ. నుంగరమ్మును సీతకు నొసగురీతిఁ,
ద్రిజట కాంచిన స్వప్నమున్, బ్రీతి సీత
తన శిరోమణి నిడుటను, వనవిభంగ
మును లిఖించెను వరుసగా మునివరుండు. 35

రాక్షసీవిద్రవం చైవ కింకరాణాం నిబర్హణమ్।
గ్రహణం వాయుసూనోశ్చ లంకాదాహాభిగర్జనమ్॥ {1-3-32}
ప్రతిప్లవన మేవాథ మధూనాం హరణం తథా।
రాఘవాశ్వాసనం చాపి మణినిర్యాతనం తథా॥ {1-3-33}
సంగమం చ సముద్రేణ నలసేతోశ్చ బంధనమ్।
ప్రతారం చ సముద్రస్య రాత్రౌ లంకావరోధనమ్॥ {1-3-34}
విభీషణేన సంసర్గం వధోపాయనివేదనమ్।
కుంభకర్ణస్య నిధనం మేఘనాదనిబర్హణమ్॥ {1-3-35}
రావణస్య వినాశం చ సీతావాప్తి మరేః పురే। {1-3-36}

❋ అశోకవనములో రాక్షసవధను, హనుమ బంధింపబడుటను, లంకాదహనమును, హనుమ సముద్రమును దాటి రాముని చేరి ఓదార్చుటను, శిరోమణిని రాముని కిచ్చుటను, రాముడు వానరములతో సముద్రమును సమీపించుటను, నలుడు సేతుబంధనమును చేయుటను, సముద్రమును దాటుటను, విభీషణునికి ఆశ్రయము నిచ్చుటను, కుంభకర్ణవధను, మేఘనాథుని వధను, రావణాసురవధను, సీతాసాధ్వి శ్రీరాముని చేరుటను, క్రమముగా వాల్మీకి మహర్షి విరచించెను.


సీ. రాక్షసజన సంహరణమును, హనుమను
గట్టివేయుట, లంకఁ గాల్చుటయును,
దిరిగి సాగరమును దరియించుటన్, రాము
నోదార్చుటను, మణి నొసగు రీతి,
వార్ధినిఁ జేరుటన్, వానరుండు నలుండు
సేతుబంధనమునుఁ జేయు విధిని,
సాగరతరణమున్, సజ్జనుడగు విభీ
షణుని సంసర్గమున్, సంగరమున
తే.గీ. మేటి కుంభకర్ణుని వధన్, మేఘనాదు
వధను, రావణాసురు వధన్, బరమసాధ్వి

సీత రాముని౯ జేరుటన్ శ్రేయము నిడు
గాథగా వ్రాసె వాల్మీకి కావ్యముగను. 36

విభీషణాభిషేకం చ పుష్పకస్య చ దర్శనమ్। {1-3-36}
అయోధ్యాయాశ్చగమనం భరతేన సమాగమమ్।
రామాభిషేకాభ్యుదయం సర్వసైన్యవిసర్జనమ్॥ {1-3-37}

❋ లంకకు రాజుగా విభీషణుని పట్టాభిషేకమును, పుష్పక విమానంలో అయోధ్యకు వెళ్లుటను, రామ భరత సమాగమమును, అయోధ్యలో శ్రీరామ పట్టాభిషేకమును క్రమంగా వాల్మీకి మహర్షి విరచించెను.

తే.గీ. శ్రితు విభీషణు పట్టాభిషేక విధి౯
బుష్పకమున నయోధ్యకు౯ బోవు విధము,
హర్షమును గూర్చు భరతసమాగమమును,
రామపట్టాభిషేకమున్ వ్రాసె సుకవి. 37



4. కుశలవులు రామాయణమును గానము చేయుట

చతుర్వింశత్ సహస్రాణి శ్లోకానా ముక్తవాన్ ఋషిః।
తథా సర్గశతాన్ పంచ షట్కాండాని తథోత్తరమ్॥ {1-4-2}

❋ వాల్మీకి మహర్షి ఇరువదినాలుగు వేల శ్లోకములతో, ఐదువందల సర్గలతో, ఆరు కాండములతోను, ఉత్తరకాండముతోను విరాజిల్లు రామాయణమును విరచించెను.

తే.గీ. వెల్గ శ్లోకము లిరువదినాల్గు వేలు
సాగగా, నైదువందల సర్గ లమర,
కాండములు నారు, నుత్తరకాండ మమర,
లీల రామాయణమును వాల్మీకి వ్రాసె. 38

కావ్యం రామాయణం కృత్స్నం సీతాయా శ్చరితం మహత్।
పౌలస్త్యవధ మిత్యేవ చకార చరితవ్రతః॥ {1-4-7}

❋ శ్రీమద్రామాయణము అను పేరుతో ప్రసిద్ధి కెక్కునట్లుగా, దివ్యమైన సీతాదేవి చరిత్రము అని పిలువబడునట్లుగా, పౌలస్త్యవధ అని కూడా పిలువబడునట్లుగా వాల్మీకి మహర్షి శ్రీరాముని గాథను విరచించెను.

తే.గీ. వేడ్క రామాయణమ్మను పేరు కలుగ
ధరణి దివ్య సీతాచరితముగఁ జెలగఁ
బథముఁ జూపెడి పౌలస్త్యవధ యనంగ
వ్రాసె మౌని వాల్మీకి శ్రీరామగాథ. 39

పాఠ్యే గేయే చ మధురం ప్రమాణై స్త్రిభి రన్వితమ్। {1-4-8}
రసైః శృంగారకారుణ్యహాస్యవీరభయానకైః।
రౌద్రాదిభిశ్చ సంయుక్తం కావ్య మేత దగాయతామ్॥ {1-4-9}

❊ వాల్మీకి మహర్షి తన ఆశ్రమములోనే ఉన్న కుశలవులకు రామాయణమును నేర్పగా వారు మధురాతిమధురంగా నవరసభరితంగా వీనులవిందుగా ఆ రామాయణమును గానం చేసినారు.

తే.గీ. చదువుచుండగ నెద నిండ ముదము గలుగ,
పాడుచుండగ వినుటయె భాగ్య మనగ,
నన్ని రసములు పండ రామాయణమును
గుశలవులు నేర్చి పాడిరి కూర్మి తోడ. 40

తౌ తు గాంధర్వతత్త్వజ్ఞౌ మూర్ఛనాస్థానకోవిదౌ।
భ్రాతరౌ స్వరసంపన్నౌ గంధర్వా వివ రూపిణౌ॥ {1-4-10}
రూపలక్షణసంపన్నౌ మధురస్వరభాషిణౌ। {1-4-11}

❊ శుభలక్షణములును చక్కని రూపమును గల ఆ లవకుశులు అన్ని రాగములను గానం చేయడంలో కోవిదులై గానగంధర్వులా అని అందఱూ మెచ్చుకొనే విధంగా రామాయణమును గానం చేయసాగినారు.


తే.గీ. అఖిలరాగాల కోవిదు లనగఁ బరగి
కనగ వర గాన గంధర్వు లనగ నొప్పు
లక్షణముల నుండెడి కుశ లవులు ప్రీతి
గాన మొనరించి రందఱు లీనమవగ. 41

ప్రశస్యమానౌ సర్వత్ర కదాచి త్తత్ర గాయకౌ॥ {1.4.23}
రథ్యాసు రాజమార్గేషు దదర్శ భరతాగ్రజః।
స్వవేశ్మ చానీయ తదా భ్రాతరౌ స కుశీలవౌ॥ {1.4.24}
పూజయామాస పూజార్హౌ రామః శత్రునిబర్హణః।

❊ భువనాలన్నీ కొనియాడేటట్లుగా, నవరసాలు పండేటట్లుగా రామాయణమును రచించిన వాల్మీకి మహర్షి, ఆ రామాయణాన్ని కుశలవులకు

నేర్పించగా, ఆ కుశలవులు వాడవాడలలోను యజ్ఞవాటికలలోను రాజమార్గములలోనూ ఆ రామగాథను మధురంగా గానంచేస్తూ, చివరకు శ్రీరామచంద్రుని కోరిక మేరకు ఆ శ్రీరాముని సన్నిధిలోనే జంటగా ఇలా గానం చేయసాగినారు.

మ. భువనమ్ముల్ గొనియాడగా, నవరసమ్ముల్ పండగా, మానసో
ద్భవ రామాయణమున్ గుశీలవులకున్ వాల్మీకి నేర్పింప, వా
రవనిన్ వాడల, యజ్ఞవాటికల, రథ్యారాజమార్గమ్ములన్
గవలై పాడుచు, దాటి రామసభలోనన్ బాడినా రీవిధిన్. 42



5. శ్రీ రామాయణ కథాప్రారంభము
అయోధ్యానగర వర్ణనము

ఇక్ష్వాకూణా మిదం తేషాం రాజ్ఞాం వంశే మహాత్మనామ్।
మహ దుత్పన్న మాఖ్యానం రామాయణ మితి శ్రుతమ్॥ {1.5.3}

❋ ప్రజాపతియైన మనువు మొదలుకొని ఈ భూమండలాన్ని పరిపాలించిన జయశాలురైన రాజులలో సగర చక్రవర్తి, ఇక్ష్వాకుమహారాజు మొదలైనవారు ఎంతో గొప్పగా కీర్తిని పొందినారు. ఆ మహనీయుల వంశమునకు చెందిన రఘురాముడు ఇప్పుడు ఈ భూమిని జనరంజకంగా పరిపాలిస్తూ ఉన్నాడు. ఆ రాముని చరిత్రయే రామాయణంగా ఒక మహాకావ్యంగా విరాజిల్లుతూ ఉన్నది.

శా. శ్రీరమ్యక్షితి నేలెగా మనువు వాసిన్ దొల్తc, బాలించెగా
సారోదార సుకీర్తులన్ సగరు, డిక్ష్వాకుండు నేలెన్, మహా
వీరుం డేలెడి రాము డిప్పుడు జనాభీష్టుండు తద్వంశ్యుడై,
శ్రీరామాయణ మొచుc దచ్చరిత భాసించున్ మహాకావ్యమై. 43

కోసలో నామ ముదితః స్ఫీతో జనపదో మహాన్।
నివిష్టః సరయూ తీరే ప్రభూత ధనధాన్యవాన్॥ {1.5.5}
అయోధ్యా నామ నగరీ తత్రాసీ ల్లోకవిశ్రుతా।
మనునా మానవేంద్రేణ యా పురీ నిర్మితా స్వయమ్॥ {1.5.6}

❋ పూర్వము ప్రజాపతియైన మనువు ధర్మపరులైన ప్రజలతో ధనధాన్యరాసులతో విరాజిల్లే కోసలదేశంలో, సరయూ నదీతీరంలో అయోధ్య అనే నగరాన్ని సువిశాలంగా మహోన్నతంగా నిర్మించినాడు.

సీ. నిర్మలచిత్తులై నిత్యసంతృప్తులై
నిజధర్మవర్తులౌ ప్రజలతోడc
బూర్ణపరీపాకపుష్టిసంతుష్టిc బ్ర
కాశించు ధనధాన్యరాశితోడc


గూరుముల్ నడయాడుఁ గోసలదేశ మా
ర్య జనహితమ్మొంచు నలరుచుండ
జలకళ నుప్పొంగు సరయూనదీతట
ప్రాంతమ్మునందు స్వప్రతిభతోడ
తే.గీ. మనువు నిర్మింప జనగణ మాన్యమగుచు
సకల సంపదలన్ సువిశాలమగుచు
శోభ నుండెడి, ధర్మవిస్ఫూర్తి నిలుచుఁ
గాపురమ్ముల సిరి నయోధ్యాపురమ్ము. **44**

తాం తు రాజా దశరథో మహారాష్ట్ర వివర్ధనః।
పురీ మావాసయామాస దివం దేవపతి ర్యథా॥ {1.5.9}

❊ సువిశాలమైన రాజమార్గాలతో, ఎత్తైన ప్రాసాదాలతో, సామంతరాజుల సందడితో, వందిమాగధులతో, సంగీత నాట్య ప్రసక్తులతో, గంభీరపరిఘలతో, చతురంగ బలములతో, శీతల ఉద్యానవనములతో స్వర్గంలోని అమరావతీ నగరం వలె అయోధ్యానగరం విరాజిల్లుతూ ఉండగా, అమరావతిని పరిపాలించే ఇంద్రుని వలె అయోధ్యను ఎంతో వైభవంగా దశరథమహారాజు పరిపాలిస్తూ ఉండేవాడు.

సీ. రాజమార్గమ్ములఁ బ్రాసాదములఁ గళా
కోవిదుల్ శిల్పులుఁ గొలువుదీర
సామంతరాజుల సందడిఁ బురి నిండ,
వంది మాగధ ఘటాస్పంద మమర
హృద్యవీణలు కలవాద్య విశేషముల్
సంగీత నాట్యప్రసక్తి నలర
గంభీరపరిఘలు ఘన శతఘ్నులు మహా
వారణాజానేయ పంక్తు లెసగఁ

తే.గీ. బాత్రమగు శీతలోద్యాన వనములమర
నలరు నమరావతీ పురమన నయోధ్య
దాని నేలెడు విభవతేజోనిరూఢి
శక్రుడో యన దశరథచక్రవర్తి. 45



6. దశరథుని రాజ్యపాలనము, పురజన వర్ణనము

మహర్షికల్పో రాజర్షిః త్రిషు లోకేషు విశ్రుతః॥ {1.6.2}
ధనైశ్చ సంగ్రహై శ్చాన్యైః శక్ర వైశ్రవణోపమః॥ {1.6.3}
యథా మను ర్మహాతేజా లోకస్య పరిరక్షితా।
తథా దశరథో రాజా వసన్ జగదపాలయత్॥ {1.6.4}

❊ రాజర్షి యైనవాడు, గొప్పగా యజ్ఞములను చేయువాడు, ప్రజాహితుడు, ధీమంతుడు, జితేంద్రియుడు, కుబేరునితో సమానుడు, స్తుతిపాత్రుడు అగు దశరథమహారాజు అయోధ్యలో ఉండి జనరంజకంగా పరిపాలన సాగిస్తూ ఉండేవాడు.

మ. యతిరాజున్ వరయజ్వయున్ బ్రియకరుం డాశాన్తవిష్వక్ప్రజా
హితుడున్ ధీమతియున్ కుబేరసముడున్ పృథ్వీశులం దెన్నగా
నతులుండున్ స్తుతిపాత్రుడున్ నిజమనోయన్నృప్రియుండున్ హితా
హితులం గూడి యయోధ్యలో దశరథుం డేలెన్ విలక్షక్రియన్. 46

ద్రష్టుం శక్య మయోధ్యాయాం నావిద్వా న్న చ నాస్తికః॥ {1.6.8}
సర్వే నరాశ్చ నార్యశ్చ ధర్మశీలాః సుసంయుతాః।
ఉదితా శ్శీలవృత్తాభ్యాం మహర్షయ ఇవామలాః {1.6.9}

❊ అయోధ్యానగరంలో అధర్మపరులు లేరు. దీనులు లేరు. అసత్యవాదులు లేరు. అసూయాపరులు లేరు. విద్వాంసులు కానివారు లేరు. నాస్తికులు లేరు. పేదవారు లేరు. బరులు(చోరులు)లేరు, బాధితులు లేరు. అయోధ్యా ప్రజలందఱూ వేదవేదాంగరతులు. ధర్మాత్ములు. ఋషులవలె సమదృష్టితో మెలగేవారు.

సీ. లే రధర్మపరులు లేరు దీనాత్ములు
దుర్భిక్షభయపీడితులును లేరు
లే రసత్యప్రియుల్ లే రసూయాకరుల్
లే రవిద్వాంసులు లేరు బరులు

లేరు నాస్తికజనుల్ లేరు పాక్షికధనుల్
పుత్రశోకయుతులు మొదలె లేరు,
పంచభూతవికృతి బాధితులును లేరు
వ్యర్థవాదప్రీతిపరులు నుండ
తే.గీ. రచటి పౌరులు వేదవేదాంగరతులు
కర్మజిజ్ఞాస ధర్మానుకరణ చణులు
నార్షభావానుకూల సౌహార్దమతులు
జన్యసౌజన్యసమదృష్టిఁ జనెడువారు. **47**

(బరులు = చోరులు)

కృతజ్ఞాశ్చ వదాన్యాశ్చ శూరా విక్రమసంయుతాః। {1-6-17}
దీర్ఘాయుషో నరా స్సర్వే ధర్మం సత్యం చ సంశ్రితాః।
సహితాః పుత్రపౌత్రైశ్చ నిత్యం స్త్రీభిః పురోత్తమే॥ {1-6-18}

❋ అయోధ్యానగరంలో పౌరు లందఱూ సిరిసంపదలతో పుత్రపౌత్రులతో విరాజిల్లుచున్నారు. మాన్యులు వదాన్యులు కృతజ్ఞులు వీరులు శూరులు దేశభక్తులు అయినవారై వారు ధన్యతను పొందినారు.

తే.గీ. పుత్రపౌత్రాదిలక్ష్మలఁ బూర్ణులగుచు
మాన్యులు కృతజ్ఞులు బహువదాన్యు లగుచు
వీరులును దేశభక్తులు శూరు లగుచు
నచటి పౌరులు ధన్యత నందినారు. **48**



7. దశరథుని మంత్రుల గుణవర్ణనము

అష్టౌ బభూవు ర్వీరస్య తస్యామాత్యా యశస్వినః।
శుచయ శ్చానురక్తాశ్చ రాజకృత్యేషు నిత్యశః॥ {1.7.2}
ధృష్టి ర్జయంతో విజయ స్సిద్ధార్థో హ్యర్థసాధకః।
అశోకో మంత్రపాలశ్చ సుమంత్ర శ్చాష్టమోఽభవత్॥ {1-7-3}
ఋత్విజౌ ద్వా వభిమతౌ తస్యాస్తామ్ ఋషిసత్తమౌ।
వసిష్ఠో వామదేవశ్చ మంత్రిణశ్చ తథాఽపరే॥ {1.7.4}

❈ అయోధ్యా నగరంలో దశరథ మహారాజు సభలో సుమంత్రుడు మొదలైన ఎనిమిదిమంది మంత్రులు రాజభక్తి పరులైనవారు ఉండేవారు. వసిష్ఠమహర్షి వామదేవుడు గురువులుగా, పురోహితులుగా, ఋత్విజులుగా నిత్యధర్మ తత్పరులుగా ఉంటూ ఎల్లప్పుడూ దశరథునికి శుభములను సమకూరుస్తూ ఉండేవారు.

చం. సిరులయి రష్టమంత్రులు, వసిష్ఠమహాముని వామదేవుడున్
గురులు పురోహితుల్ మును లకుంఠిత దీక్షఁ బ్రియమ్ము గూర్చువా
రరుదగు ఋత్విజుల్ దశరథాధిపు సన్నిధి నిత్యధర్మ త
త్పరత యథార్థవాక్కుల శుభమ్ములఁ గూర్చు నుందురెప్పుడున్. 49

తే.గీ. మంత్రు లచట సుమంత్రుడు మంత్రపాలు
డనెడివాడును సిద్ధార్థు డనెడివాడు
నర్థసాధకుడు జయంతు డనెడివాడు
విజయుడు నశోకుడును ధృష్టి వేడ్కఁ గలరు. 50

విద్యా వినీతా హ్రీమంతః కుశలా నియతేంద్రియాః।
శ్రీమంతః చ మహాత్మనః శాస్త్రజ్ఞా దృఢ విక్రమాః॥ {1-7-5}
కీర్తిమంతః ప్రణిహితా యథా వచన కారిణః | {1-7-6}

❈ దశరథుని చెంత ఉన్న ఆ మంత్రులు నియతచిత్తులుగా విద్యావినీతులుగా దృఢవిక్రమము కలవారుగా స్వధర్మవేత్తలుగా కీర్తిమంతులుగా ధర్మప్రవర్తకులుగా ఆడితప్పని సత్యవంతులుగా నుండిరి.

తే.గీ. నియతచిత్తులు విద్యావినీతులు దృఢ
విక్రమోపేతులు స్వధర్మవేత్తలు ఘన
కీర్తిమంతులు ధర్మప్రవర్తకులును
మాటతప్పని మాన్యు లా మంత్రివరులు. 51

తేజఃక్షమాయశఃప్రాప్తాః స్మితపూర్వాభిభాషిణః॥ {1-7-6}
అమితం వాపి పురుషం నవిహింస్యు రదూషకమ్। {1-7-9}
శుచీనాం రక్షితారశ్చ నిత్యం విషయవాసినామ్। {1-7-10}

❈ అయోధ్యలోని మంత్రులు ఎల్లప్పుడూ చిరునవ్వుతో మాట్లాడువారు, ముందుగా మాట్లాడువారు, శాస్త్ర విజ్ఞానమును పూర్ణముగా కలిగినవారు, సాధుచిత్తులు, తప్పు చేసినచో కుమారుని కూడా శిక్షించువారు, మంచివాడైనచో శత్రువును కూడా రక్షింతురు.

తే.గీ. వరు లమాత్యులు స్మితపూర్వభాషణులును
శాస్త్ర విజ్ఞానవారిధుల్ సాధుమతులు
దోషయుతుడైన సుతునైన దూఱువారు
శిష్టుడైన శత్రువును రక్షించువారు. 52



8. దశరథుడు అశ్వమేధయాగమును చేయుటకు సంకల్పించుట

తస్య త్వేవం ప్రభావస్య ధర్మజ్ఞస్య మహాత్మనః।
సుతార్థం తప్యమానస్య నాసీ ద్వంశకరః సుతః॥ {1.8.1}

❈ దశరథ మహారాజు ఎంతో వైభవమును పొందినాడు. గొప్ప కీర్తులను పొందినాడు. గురువుల దీవెనలను పొందినాడు. అయినప్పటికీ పుత్రసంతతి లేనివాడై, ఇహపర సుఖములను కలిగించే పుత్రుడు ఎప్పుడు కలుగుతాడో? అని తపిస్తూ ఉండేవాడు.

తే.గీ. ఆ దశరథుడు వైభవ మ్మందుచుండె
నతుల పాలనమ్మునఁ గీర్తి నందుచుండె
నమల గురువుల దీవెన లందుచుండె
నైననున్ బుత్రసంతాన మందకుండె. 53

తే.గీ. భద్రములఁ గంటి, సకల సంపదలఁ గంటి
నతులమౌ పుత్రసంపత్తి నందకుంటి
నిహపరము లిడు సుతుడు నాకెపుడు గలుగు
దైవమా! యని తపియించు దశరథుండు. 54

తతోఽబ్రవీ దిదం రాజా సుమంత్రం మంత్రిసత్తమమ్।
శీఘ్ర మానయ మే సర్వాన్ గురూం స్తాన్ సపురోహితాన్॥ {1.8.4}


❈ దశరథుడు చక్కగా ఆలోచించి సుమంత్రుని పిలిపించి "ఓ సుమంత్రుడా! అమితంగా సంపదలు ఉన్నప్పటికీ మనసులో పూర్తిగా ఆనందం ఉండటం లేదు. నా వంశాన్ని నిలబెట్టే ఔరసపుత్రుని పొందగోరి అశ్వమేధయాగం చేస్తే బాగుంటుంది అని అనుకొంటూ ఉన్నాను. అందుకోసం మన ఆచార్యులను పురోహితులను పిలుచుకొనిరా" అని అన్నాడు.

మ. "అమితశ్రీలను బొందినన్ హృదయమం దానందమే లేదు, వం
శము నిల్పంగను నౌరసుండు వలయున్, సాధింపగా నశ్వమే
ధముఁ జేయన్ వలె, నో సుమంత్రుడ! తదర్థ మ్మెల్లరన్ బిల్వ బం
పుమ యాచార్యపురోహితాదుల" ననెన్ భూమీశు డాలోచనన్. 55

ఊచుశ్చ పరమప్రీతాః సర్వే దశరథం వచః। {1.8.11}
సర్వథా ప్రాప్స్యసే పుత్రాన్ అభిప్రేతాంశ్చ పార్థివ। {1.8.12}

❀ అంతట సుమంత్రునిచే పిలిపించబడిన వసిష్ఠ మహర్షి మొదలైనవారు వచ్చి "ఓ దశరథ మహారాజా! నీవు అనుకొన్నట్లే అశ్వమేధయాగం చేయుము. చింత తొలగిపోయి నీకు పుత్రసంతతి కలుగుతుంది" అని పలుకగా ఆ పంక్తిరథుడు ఎంతగానో సంతోషించినాడు.

ఉ. అంతట రాజు కోర్కె విని యాగము నెంచి వసిష్ఠుడున్ హితుల్
చెంతకు వచ్చి "రాజవర! చేయుము నీ వనుకొన్న యిష్టి, నీ
చింతల నశ్వమేధము నశింపగఁ జేయును, పుత్రసంతతిన్
గాంతువు గాక" యంచు పలుకన్, గనెఁ బంక్తిరథుండు మోదమున్. 56



9. సుమంత్రుడు దశరథునికి సనత్కుమారుని మాటలను వివరించుట

ఏత చ్ఛ్రుత్వా రహ స్సూతో రాజాన మిద మబ్రవీత్। {1-9-1}

❊ అయోధ్యాధిపతి యగు దశరథ మహారాజు అశ్వమేధ యాగమును చేయవలెనని తలంచుచుండగా ఆ ప్రభువుయొక్క సూతుడు, మంత్రి, తత్త్వవేత్త అగు సుమంత్రుడు రాజును సమీపించి సంతోషంతో ఏకాంతమున ఇట్లనినాడు.

తే.గీ. అశ్వమేధముఁ జేయగా నవనివిభుడు
తలప దశరథసూతుడు తత్త్వవేత్త
యైన మంత్రి సుమంత్రుడు హర్ష మొదవఁ
బ్రభువు నేకాంతమునఁ జేరి పలికె నిటుల. 57

సనత్కుమారో భగవాన్ పూర్వం కథితవాన్ కథామ్।
ఋషీణాం సన్నిధౌ రాజన్ తవ పుత్రాగమం ప్రతి॥ {1-9-2}

❊ "దశరథ మహారాజా! పూర్వము సనత్కుమారుడు అనే మునివర్యుడు ఋషుల సన్నిధిలో తెలియజేసిన ఋశ్యశృంగ ముని యొక్క చరిత్రను నీకు చెబుతాను. నీకు శుభమును కలిగించే ఈ విషయాన్ని శ్రద్ధగా వినుము.

తే.గీ. పూర్వము సనత్కుమార సన్మునివరుండు
ఋషుల సన్నిధిన్ దెలిపిన ఋశ్యశృంగు
చరితమును దెల్పుచుంటి దశరథనృపతి!
వినుము శుభకర మియ్యది విభువరేణ్య! 58

కశ్యపస్య తు పుత్రోఽస్తి విభండక ఇతి శ్రుతః।
ఋష్యశృఙ్గ ఇతి ఖ్యాత స్తస్య పుత్రో భవిష్యతి॥ {1-9-3}
నాన్యం జానాతి విప్రేంద్రో నిత్యం పిత్రనువర్తనాత్। {1-9-4}

❋ కశ్యప మహర్షి కుమారుడు విభండక ముని. విభండకముని కుమారుడు ఋశ్యశృంగుడు. అనఘుడైన ఋశ్యశృంగుడు నిత్యము తండ్రిని అనుసరించుట తప్ప ఇతర విషయము లెఱుగని అమాయకుడు.

తే.గీ. వరుదు కశ్యపసుతుడు విభండకముని
తనయుడగు ఋశ్యశృంగు డా యనఘుడు తన
తండ్రి ననుసరించు పథము తప్ప యతడు
మహిని నితర మెఱుగని యమాయకుండు. 59

ఋష్యశృఙ్గస్తు జామాతా పుత్రాం స్తవ విధాస్యతి।
సనత్కుమార కథితం ఏతావ ద్వ్యాహృతం మయా॥ {1.9.18}

❋ ఓ మహారాజా! మహిమాన్వితుడైన ఋశ్యశృంగుని ఆహ్వానించండి. ఆ మహర్షి సాంగత్యం సదా మంగళప్రదం. వారి ఆధ్వర్యవంలో మీ యాగము పవిత్రము పరిపూర్ణము అవుతుంది. మీ కోరిక సిద్ధిస్తుంది. భవిష్యద్ద్రష్టయైన సనత్కుమార మహర్షి ద్వారా ఈ విషయాన్ని నేను విన్నాను.

మ. కనఁ బృథ్విన్ మహిమాన్వితుం డతడు నిక్కం బో యయోధ్యాధిపా!
యనఘా! పిల్వుము ఋశ్యశృంగ ముని నీ యాగార్థమై నిత్య మా
ఘను సాంగత్యమె మంగళప్రదము, సంకల్పించు నీ యిష్టి పా
వనమౌ, వింటి సనత్కుమారువలనన్ బ్రస్తావ మేతద్గతిన్. 60



10. సుమంత్రుడు దశరథునికి ఋశ్యశృంగుని వృత్తాంతమును వివరించుట

రోమపాద మువాచేదం సహామాత్యః పురోహితః। {1.10.2}
తత్ర చానీయమానే తు విప్రే తస్మిన్ మహాత్మని।
వవర్ష సహసా దేవో జగత్ ప్రహ్లాదయం స్తదా॥ {1-10-28}

❋ గతంలో అంగదేశంలో ఒకప్పుడు వర్షములు లేక క్షామపరిస్థితి చెలరేగుచుండినది. అప్పుడు రోమపాద మహారాజుయొక్క పురోహితుడు ఋశ్యశృంగుని తీసికొని వచ్చుటకు తగిన ఉపాయమును తెలిపినాడు. ఆ సామవాక్కులను అనుసరించి రోమపాదుడు వారకాంతలను పంపి విభండకమునియొక్క కుమారుడైన ఋశ్యశృంగ మహర్షిని తన రాజ్యమునకు పిలిపించినాడు. ఆ ముని అడుగు పెట్టగానే కుండపోతగా వర్షం పడడంతో అంగదేశము నూతనశోభలతో విరాజిల్లినది.

చం. గతమున నంగదేశమున క్షామపరిస్థితి రేగుచుండగా,
స్తుతమతి రోమపాద నృపసోముడు మౌని విభండకాత్మజున్
నుతగతిఁ బిల్వనంపగను, నూతనశోభల రాజ్యమెల్ల నా
తత సుఖవార్ధిఁ దేలినది తన్ముని పాదము సోకినంతనే. 61

తే.గీ. రోమపాద పురోహిత సామవాక్కు
ననుసరించుచు వారకన్యకలు పిలువ
వచ్చె నంగదేశమునకు వరమునిసుతు
డపుడె వరుణుడు వర్షించె నతిశయమున. 62

అర్ఘ్యం చ ప్రదదౌ తస్మై న్యాయత స్సుసమాహితః। {1-10-30}
అంతఃపురం ప్రవిశ్యాఽస్మై కన్యాం దత్వా యథావిధి।
శాంతాం శాంతేన మనసా రాజా హర్ష మవాప సః॥ {1-10-31}

❋ సంతోషించిన రోమపాద మహారాజు వర్షమును తనతోపాటు తీసికొని వచ్చిన ఋశ్యశృంగ మహర్షికి తాను పెంచుకొన్న కుమార్తె యగు శాంతను ఇచ్చి పెండ్లి చేసినాడు. ఓ దశరథ మహారాజా! నీవు కూడా శుభప్రదమైన ఋశ్యశృంగుని పాదములు మన అయోధ్యను కూడా పావనం చేయునట్లుగా ఆ మహాత్ముని ఇచ్చటకు ఆహ్వానింపుము.

చం. ముదమున రోమపాదు డెదఁ బొంగుచు శాంతను దత్తపుత్రికన్
సదమలమౌనికిచ్చి బుధసన్నుతిఁ బెండ్లి యొనర్చె, సర్వసం
పదలను గాంచెఁ, గావున శుభమ్మని నీవును ఋశ్యశృంగు స
త్పదము లయోధ్య రాజిలగ భావన చేయుము కోసలాధిపా! 63



11. దశరథుడు ఋశ్యశృంగుని అయోధ్యకు తీసికొని వచ్చుట

స త్వం పురుష శార్దూల తమానయ సుసత్కృతమ్।
స్వయ మేవ మహారాజ గత్వా సబలవాహనః॥ {1.11.12}

❋ "ఓ మహారాజా! నీ కుమార్తె యైన శాంతను, తన కుమార్తెగా స్వీకరించి పెంచి పెద్దచేసిన రోమపాదుడు ఆమెను ఋశ్యశృంగ మహర్షికి ఇచ్చి వివాహం జరిపించినాడు. అందువలన మీకు అల్లుడైన ఆ ఋశ్యశృంగుని సతీసమేతంగా రమ్మని ఆహ్వానించండి" అని సుమంత్రుడు చెప్పగా, దశరథుడు అలాగే చేసినాడు.

శా. "శాంతన్ త్వత్సుత, నాత్మజాత వలె వాత్సల్యమ్మునన్ బెంచి, ని
శ్చింతన్ బత్నిగ ఋశ్యశృంగునికి నిచ్చెన్ రోమపాదుండు, త
త్కాంతారత్నము నల్లునిన్ బిలిచి యాగప్రక్రియన్ సల్పుమా!
వంతల్ దీర్చు మహాత్ము డాత" డనగన్ బాటించె ధాత్రీశుడున్. 64

ఆసాద్య తం ద్విజశ్రేష్ఠం రోమపాదసమీపగమ్।
ఋషిపుత్రం దదర్శాఽఽదౌ దీప్యమాన మివానలమ్॥ {1-11-15}
శాంతా తవ సుతా రాజన్ సహభర్త్రా విశాంపతే।
మదీయం నగరం యాతు కార్యం హి మహ దద్యతమ్॥ {1-11-19}

❋ సుమంత్రుడు పలికిన హితకరమైన వాక్యములను కోసలేశుడు ప్రశాంతముగా వినినాడు. సనత్కుమారుని వాక్కులను నమ్మినాడు. మంత్రులతో కూడి అంగదేశమునకు వెళ్లి తన మిత్రుడైన రోమపాదుని దర్శించినాడు. భార్యయైన శాంతతోపాటు యజ్ఞదీక్షతో అయోధ్యకు రమ్మని ఋశ్యశృంగ మహర్షిని సంతోషంగా ఆహ్వానించినాడు.

ఉ. నెమ్మదిఁ గోసలేశుడు గణించుచు మేటి సుమంత్రు వాక్యముల్,
నమ్మి సనత్కుమారు వచనమ్ముల, నేగెను మంత్రియుక్తుడై,

సమ్మతి నంగదేశమున సన్నిహితున్ గనె, యజ్ఞదీక్షకై
రమ్మనె ఋశ్యశృంగు మది రంజిల శాంతను గూడి ప్రీతిమై. 65

ఋషిపుత్రః ప్రతిశ్రుత్య తథేత్యాహ నృపం తథా।
స నృపేణాభ్యనుజ్ఞాతః ప్రయయౌ సహ భార్యయా॥ {1-11-21}

❋ అంగదేశమునకు రాజైన రోమపాదుడు తన మిత్రుడైన దశరథుని కోరికను విని సకల భద్రప్రదుడైన ఋశ్యశృంగుని శాంతతో పాటుగా దశరథుని వెంట పంపించెను. వారందరూ సంతోషంగా అయోధ్యకు చేరుకొన్నారు.

తే.గీ. కోసలేశునిఁ గనుగొని కోరిక విని
పంపె నా రోమపాదుడు పత్నియుతుని
ఋశ్యశృంగుని శాంతతోఁ, బ్రీతి వారు
చేరినార లయోధ్యకు శ్రీకరముగ. 66



12. అశ్వమేధయాగ సన్నాహము

తతః ప్రసాద్య శిరసా తం విప్రం దేవవర్ణితమ్।
యజ్ఞాయ వరయామాస సంతానార్థం కులస్య వై॥ {1.12.2}

❈ ఇనకులపతియైన దశరథమహారాజు తన అయోధ్యానగరమునకు విచ్చేసినవాడు, మునికుమారుడు అగు ఋశ్యశృంగుని సమీపించి శిరస్సు వంచి భక్తితో ప్రణామం చేసి "ఓ మహాత్మా! నీవు పెద్దగా ఉండి నేను చేయదలచిన యజ్ఞములను నిర్వహించండి" అని మనసారా పలికినాడు.

తే.గీ. మునికుమారుని కెదురేగి యినకులపతి
శిరసు వంచి ప్రణామము చేసి భక్తి
"నీవె యజ్ఞకార్యమ్ముల నిర్వహింప
పెద్ద" వని తెల్పె మదిని సంప్రీతితోడ. 67

తతో రాజాఽబ్రవీద్వాక్యం సుమంత్రం మంత్రిసత్తమమ్।
సుమంత్రాఽఽవాహయ క్షిప్ర మృత్విజో బ్రహ్మవాదినః॥ {1.12.4}

❈ ఆ తరువాత దశరథమహారాజు మంత్రిసత్తముడగు సుమంత్రుని చూచి "ఓ సుమంత్రుడా! యజ్ఞనిర్వహణలో వాసిగాంచిన బ్రహ్మవాదులను ఋత్విక్కులను గురువులను పిలిపించుము" అని ఆదేశించినాడు. అప్పుడు అచ్చట ఉన్న విప్రవరులు అందులకు సంతోషంతో సమ్మతించినారు.

తే.గీ. మహిత నరపాలు డంత సుమంత్రుఁ జూచి
"ఓ సుమంత్రుడా! పిలువుమా వాసిగన్న
బ్రహ్మపరుల ఋత్విక్కులఁ బరమగురుల"
ననగ నటనున్న విప్రు లౌ ననిరి ప్రీతి. 68

సరయ్వా శ్చోత్తరే తీరే యజ్ఞభూమి ర్విధీయతామ్।
శాన్తయ శ్చాభివర్ధన్తాం యథాకల్పం యథావిధి॥ {1.12.15}

❋ దశరథ మహారాజు ధృష్టి మొదలైన మంత్రులను పిలిచి ఓ మంత్రులారా! వసిష్ఠాది గురువుల ఉపదేశం మేరకు యజ్ఞవిధులు నిర్వహించుటకు కావలసిన ఏర్పాట్లను చేయండి. యజ్ఞవేదికను సరయూనదీ తీరంలో సిద్ధం చేయండి. తగిన శాంతి క్రియలను చేయండి. ఎక్కడా ఎటువంటి లోపాలు దోషాలు లేనివిధంగా యాగము సంపూర్ణంగా శాస్త్రసమ్మతంగా జరిగేటట్లుగా సరిగా శ్రద్ధ వహించండి అని ఆదేశించినాడు.

మ. "గురువుల్ వల్కినరీతి యజ్ఞవిధులన్ గూర్పంగ యత్నింపుడీ,
సరయూతీరమె యజ్ఞవేదిక యగున్ శాంతిక్రియల్ సేయుడీ,
నెరసుల్ లేనటు శాస్త్రసమ్మతి సమానీతమ్ముగా సర్వమున్
సరిగా సల్పుడు మంత్రులార!" యనె రాజన్యుండు కార్యోద్ధతిన్. 69



13. యజ్ఞశాలాప్రవేశము

యజ్ఞో మే క్రియతాం బ్రహ్మన్ యథోక్తం మునిపుఙ్గవ।
యథా న విఘ్నః క్రియతే యజ్ఞాంగేషు విధీయతామ్॥ {1.13.3}

❋ శుభకరమైన వసంతఋతువు ప్రారంభం కాగా, దశరథ మహారాజు గురువర్యుడు, భూసురశ్రేష్ఠుడు, పురోహితుడు ఐన వసిష్ఠుని చూచి "ఓ బ్రహ్మర్షీ! మీరు మాకు ఇహపరశ్రేయములను ఇవ్వగలిగినవారు. అభయప్రదానం చేయగలిగినవారు. అశ్వమేధయాగమును చేసేందుకు దయతో దీక్షను స్వీకరించండి." అని ధర్మబద్ధంగా విన్నవించుకొన్నాడు.

మ. శుభమై రాగ వసంత, మాదట వసిష్ఠున్ భూసురశ్రేష్ఠ దీ
ప్రభవున్ మేటి పురోహితున్ గని యనెన్ రాజర్షి "బ్రహ్మర్షి! నా
కభయ మ్మిచ్చుచు నశ్వమేధ మికఁ జేయన్ దీక్షఁ గైకొమ్ము నీ
వుభయ శ్రేయము లీయ నేర్తు" వనెఁ బ్రత్యుత్పన్నధీధర్ముడై. 70

(దీప్రభవున్ = వెలుగే పుట్టుకగా గలవాడు)

బ్రాహ్మణావసథా శ్చైవ కర్తవ్యా శ్శతశ శ్శుభాః। {1.13.10}
దాతవ్య మన్నం విధివత్ సత్కృత్య న తు లీలయా॥ {1.13.12}
యథా సర్వం సువిహితం న కించిత్ పరిహీయతే॥ {1.13.15}

❋ "యజ్ఞనిర్వహణకై వచ్చు బ్రాహ్మణులకు చక్కగా గృహములను నిర్మించవలెను. అందఱిని అన్న దానములతో సంతృప్తి పఱచవలెను. గొప్పదైన ఈ యజ్ఞమునందు ఎచ్చటనూ ఎన్నడునూ ఎటువంటి లోటూ లేకుండునట్లు చూడవలెను" అని దశరథుడు వసిష్ఠునికి వినయంగా తెలియజేసినాడు.

తే.గీ. ప్రీతి ద్విజులకై యిండ్లు నిర్మింపవలయు
నన్నదానములన్ దృప్తి యమరవలయు

ఉత్సవమ్మున లోటు లేకుండవలయు
ననియె దశరథభూపతి వినయమొప్ప. 71

తతో వసిష్ఠప్రముఖాః సర్వ ఏవ ద్విజోత్తమాః।
ఋశ్యశృంగం పురస్కృత్య యజ్ఞకర్మారభంస్తదా॥ {1.13.37}
యజ్ఞవాటగతాః సర్వే యథాశాస్త్రం యథావిధి। {1.13.38}

❋ "అట్లే చేసెదను అని చెప్పిన వసిష్ఠ మహర్షి దశరథ మహారాజు కోరిన విధంగా యజ్ఞమునకు సంబంధించిన పనులను అందటికీ పురమాయించాడు. ఋశ్యశృంగ మహర్షి కూడా విచ్చేశాడు. ఆ మహాత్ముడు ముందు ఉండగా యజ్ఞము ప్రారంభించబడింది. ఆ యజ్ఞవాటికలో వేదఘోష మారుమ్రోగింది. శాస్త్రోక్తంగా ధర్మబద్ధంగా యజ్ఞవిధి నిర్వహింపబడింది. అన్నదాన కార్యక్రమంకూడా అఖండంగా కొనసాగింది.

మ. అటులే యంచును బంచె నందఱను రాజాజ్ఞన్ వసిష్ఠర్షి, యం
తట విచ్చేయుచు ఋశ్యశృంగముని చేతఃప్రీతి నారంభ మ
చ్చటఁ గావించెను, వేదఘోష యమరెన్, శాస్త్రోక్తసత్రక్రియా
పటుధర్మచ్చట తాండవించె విపులస్వాద్వన్నదానమ్ములన్. 72



14. అశ్వమేధయాగము

అథ సంవత్సరే పూర్ణే తస్మిన్ ప్రాప్తే తురంగమే।
సరయ్వా శ్చోత్తరే తీరే రాజ్ఞో యజ్ఞోఽభ్యవర్తత॥ {1-14-1}
ప్రాతస్సవనపూర్వాణి కర్మాణి మునిపుంగవాః॥ {1.14.5}
మాధ్యందినం చ సవనం ప్రావర్తత యథాక్రమమ్॥ {1.14.6}
తృతీయం సవనం చైవ రాజ్ఞోఽస్య సుమహాత్మనః।
చక్రు స్తే శాస్త్రతో దృష్ట్వా తథా బ్రాహ్మణపుంగవాః॥ {1.14.7}
అన్నం హి విధివత్ స్వాదు ప్రశంసంతి ద్విజర్షభాః।
అహో తృప్తాః స్మ భద్రం తే ఇతి శుశ్రావ రాఘవః {1.14.15}

❈ ప్రాతఃకాలమున చేయవలసిన క్రతువు భవ్యంగా జరిగినది. మాధ్యాహ్నిక సవము కూడా సవ్యంగా సాగినది. విప్రోత్తములు సాధువాక్యములను పలుకుచుండగా మూడవ యజ్ఞము కూడా కొనసాగినది. ఈ విధంగా శాస్త్రవిధులను అనుసరించి అశ్వమేధయాగము నిర్వహింపబడినది. "ఓ దశరథ మహారాజా! యాగాశ్వం దిగ్విజయంగా భూమిని చుట్టివచ్చింది. అశ్వమేధయాగం పరిపూర్ణమయ్యింది. ఇప్పుడు పుత్రకామేష్టి చేయడం మంచిది" అని అంటూ ఋశ్యశృంగ మహర్షి ఆ యజ్ఞాన్ని ప్రారంభించినాడు. యజ్ఞ సంబంధమైన హవిర్భాగములను స్వీకరించేందుకు బ్రహ్మాది దేవతలు ఒకచోట చేరినారు. అన్నదానాదులచే తృప్తి నందిన విప్రోత్తములు "ఓ దశరథమహారాజా! ఈ యజ్ఞ సమయమున మా కోరికలు ఫలించినవి. ఇక మీ కోరికలు కూడా ఫలించును గాక! మీకు భద్ర మగును గాక!"అని మనసారా దీవించినారు.

తే.గీ. భవ్యరీతులఁ బ్రాతస్సవమ్ము జరిగె
సవ్యముగను మాధ్యాహ్నిక సవము జరిగె
సాధువాక్యమ్ములఁ దృతీయ సవము జరిగె
శాస్త్రవిధి నశ్వమేధమ్ము జరిగె నిటుల. 73

మ. అరుదౌ రీతులఁ జుట్టి వచ్చినది యాగాశ్వమ్ము భూగోళమున్,
జరిగెన్ జక్కగ నశ్వమేధ, మిక రాజా! పుత్రకామేష్టియే
వరమౌ నంచును ఋశ్యశృంగుడు క్రతుప్రారంభమున్ జేయఁ ద
త్పరులై దేవత లెల్ల చేరిరి హవిర్భాగమ్ములన్ గైకొనన్. **74**

తే.గీ. "షడ్రసోపేత భోజనాస్వాద మమరె
కోసలేశ! కోర్కులు సమకూరె మాకు
భూరమణ యిష్ట మిక సమకూరు మీకు"
ననుచు రాజును దీవించి రందఱపుడు. **75**



15. దేవతలు రావణవధ గురించి ఆలోచించుట

భగవన్ త్వత్ప్రసాదేన రావణో నామ రాక్షసః।
సర్వాన్నో బాధతే వీర్యాత్ శాసితుం తం న శక్నుమః॥ {1.15.6}
త్వయా తస్మై వరో దత్తః ప్రీతేన భగవన్ పురా। {1.15.7}
వధార్థం తస్య భగవన్ ఉపాయం కర్తుమర్హసి॥ {1.15.11}

❈ తమ తమ హవిర్భాగములను స్వీకరించేందుకోసం ఒకచోట చేరిన దేవతలు బ్రహ్మను వినుతించి "ఓ చతుర్ముఖా! నీ దీవెన కారణంగా, నీ విచ్చిన వరాల కారణంగా బలగర్వితుడైన రావణాసురుడు మమ్ముల నందరినీ తీవ్రంగా బాధిస్తూ ఉన్నాడు. ఆ రావణవధ జరిగేందుకు, మమ్ము కాపాడేందుకు తగిన ఉపాయాన్ని దయతో ఆలోచించు" అని దీనవదనులై వేడుకోగా వారి భయాన్ని పోగొడుతూ ఆ కమలాసనుడు ఇలా అన్నాడు.

ఉ. దేవత లెల్ల బ్రహ్మను నుతించి "చతుర్ముఖ! రావణుండు నీ
దీవెన కారణమ్ముగను దీంద్రముగా మము గాసి వెట్టెడిన్
గావున వానిఁ గూల్చి మముఁ గావ నుపాయము నెంచు" మంచు భీ
త్యావృతులౌచు వేడఁ గమలాసను డిట్లనె భీతి మాన్పుచున్. 76

తేన గంధర్వయక్షాణాం దేవదానవరక్షసామ్।
అవధ్యోఽస్మీతి వాగుక్తా తథేత్యుక్తం చ తన్మయా॥ {1.15.13}
తస్మాత్ స మానుషాద్వధ్యో మృత్యుర్నాన్యోఽస్య విద్యతే॥ {1.15.14}
ఏతస్మిన్నంతరే విష్ణుః ఉపయాతో మహాద్యుతిః। {1.15.16}

❈ "ఓ దేవతలారా! దశకంఠుడు దనుజులచేత దేవతలచేత మరణం లేకుండునట్లు వరం ఇమ్మని నన్ను అడిగినాడు. నేను తథాస్తు అని అన్నాను. కాబట్టి ఆ రావణుని ఒక నరుడు చంపగలడు" అని బ్రహ్మ అంటూ ఉండగానే విష్ణుభగవానుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. దేవతల సంతాపాన్ని తన మాటలతోనే తొలగిస్తూ ఇలా అన్నాడు.

మ. "దనుజానీకముచేత దేవతతిచేతన్ నే నవధ్యుండనై
మనగా మేటి వరమ్ము నిమ్మనగ నే మన్నించితిన్ దానవే
శుని, వానిన్ నరుడే వధించు" ననె; విష్ణుండంతఁ బ్రత్యక్షమై
తన వాగ్ధారల నిర్ఝరప్రకర సంతాపంబుఁ జల్లార్చుచున్. **77**

భయం త్యజత భద్రం వో హితార్థం యుధి రావణమ్। {1.15.27}
హత్వా క్రూరం దురాత్మానం దేవర్షీణాం భయావహమ్।
వత్స్యామి మానుషే లోకే పాలయన్ పృథివీ మిమామ్। {1.15.29}

❈ శంఖ చక్ర గదా పాణియై, పీతాంబరధారియై ప్రత్యక్షమైన విష్ణుభగవానుడు బ్రహ్మ మొదలైనవారిని చూచి "ఓ దేవతలారా! మీ భయాన్ని తొలగిస్తాను. మీకు భద్రమును కలిగిస్తాను. మిమ్ము బాధించే ఆ దశాస్యుని చంపుటకు నేను భూలోకంలో నరుడుగా జన్మిస్తాను. కోసలదేశాన్ని వేల ఏళ్లు పరిపాలిస్తాను. ఇక మీకు అన్నివిధాలా జయం కలుగుతుంది" అని అభయాన్నిచ్చి తన నిలయమైన వైకుంఠానికి చేరుకొన్నాడు.

చం. "భయముఁ దొలంగఁ జేసెదను, భద్రముఁ గూర్తు, దశాస్య రాక్షసున్
నయముగఁ జంపగా నరుడనై జనియించెద భూమియందు, ని
శ్చయముగ మేటి కోసలను చక్కగ నేలెద వేలయేం, డ్లికన్
జయమగు" నంచుఁ బల్కుచును శార్ఙ్గి వికుంఠముఁ జేరె నిశ్చితిన్. **78**



16. పుత్రకామేష్టి - పాయసప్రదానము

దివ్యపాయససంపూర్ణాం పాత్రీం పత్నీమివ ప్రియామ్।
ప్రగృహ్య విపులాం దోర్భ్యాం స్వయం మాయామయీ మివ॥ {1.16.15}
సమవేక్ష్యాబ్రవీద్వాక్యం ఇదం దశరథం నృపమ్।
ప్రాజాపత్యం నరం విద్ధి మామిహాభ్యాగతం నృప॥ {1.16.16}

❋ ఆ దశరథ మహారాజు విప్రోత్తములందఱూ మెచ్చుకొనే విధంగా ఎంతో ఇష్టంతో పుత్రకామేష్టిని పూర్తిచేసినాడు. అప్పుడు ప్రజాపతిచే పంపబడినవాడు శుభలక్షణసంపన్నుడు అగు ఒక పురుషుడు దివ్యమైన పాయసపాత్రను చేతబట్టుకొని యాగాగ్ని కుండం నుండి వెలువడి దశరథుని చూచి ఎంతో ప్రీతితో మాట్లాడసాగినాడు.

ఉ. ఇష్టము తోడ నా దశరథేశుడు విప్రులు మెచ్చ పుత్రకా
మేష్టిని జేసినాడు, గణియించి ప్రజాపతి పంప నొక్కనిన్
హృష్టమనస్కుడై యతడు నేగి యజార్పిత పాయసమ్ముతో
నిష్టిముఖాగ్నికుండమున నిట్లనె రాజునుఁ జూచి ప్రీతితో. 79

ఇదం తు నృప శార్దూల పాయసం దేవ నిర్మితమ్।
ప్రజా కరం గృహాణ త్వం ధన్య మారోగ్యవర్ధనమ్॥ {1.16.19}
భార్యాణా మనురూపాణామ్ అశ్నీతేతి ప్రయచ్ఛ వై।
తాసు త్వం ప్రాప్స్యసే పుత్రాన్ యదర్థం యజసే నృప॥ {1.16.20}

❋ యజ్ఞకుండమునుండి వెలువడిన దివ్యపురుషుడు దశరథ మహారాజును జూచి "ఓ పుమర్థపావనా! నీవు వరుసగా యాగములు చేసినావు. తత్ఫలితముగా దివ్యవరముగా దేవనిర్మితము ప్రజాకరము ఐన ఈ పాయసమును నీకొఱకు తీసికొనివచ్చినాను. సంతోషంగా ఈ పాయసమును తీసికో. ఈ పాయసాన్ని నీ భార్యలకు పంచిపెట్టు. నీకు పుత్రసంతతి కలుగుతుంది" అని ఆశీర్వదించినాడు.

చం. వరుసగ యాగముల్ సలుప, వచ్చిన తత్ఫలితమ్ము దివ్యమౌ
వర మిది దేవనిర్మితము, పాయస మెన్నఁ బ్రజాకరమ్ము, సం
బరమున దీని గైకొనుము, పత్నుల కిమ్ము, భుజించినంత శ్రీ
కరమగుఁ బుత్రసంతతి సుఖమ్మున గల్గుఁ బుమర్థపావనా!" 80

తథేతి నృపతిః ప్రీత శ్శిరసా ప్రతిగృహ్యతామ్।
పాత్రీం దేవాన్న సంపూర్ణాం దేవదత్తాం హిరణ్మయీమ్॥ {1-16-21}
అభివాద్య చ తదద్భుత మద్భుతం ప్రియదర్శనమ్।
ముదా పరమయా యుక్త శ్చకారాభిప్రదక్షిణమ్॥ {1-16-22}

❃ పాయసపాత్రను తీసికొన్న దశరథుడు పరమానందమును పొంది ఆ దివ్యపురుషునికి ప్రదక్షిణం చేసి నమస్కరించి, ఆ పాయసాన్ని తన భార్యలకు పంచుటకు అంతఃపురానికి చేరుకొన్నాడు.

కం. అని పలుకఁ బాయసమ్మును
గొని యానందమున నతనిఁ గొనియాడి ప్రద
క్షిణ మాచరించి, భూపతి
తన పత్నుల కిడగ నేగెఁ దత్పాయసమున్. 81

కౌసల్యాయై నరపతిః పాయసార్ధం దదౌ తదా।
అర్ధాదర్ధం దదౌ చాపి సుమిత్రాయై నరాధిపః॥ {1.16.27}
కైకేయ్యై చావశిష్టార్ధం దదౌ పుత్రార్థ కారణాత్।
ప్రదదౌ చావశిష్టార్ధం పాయసస్యామృతోపమమ్॥ {1.16.28}
అనుచింత్య సుమిత్రాయై పునరేవ మహీపతిః। {1.16.29}

❃ దశరథ మహారాజు ఆ పాయసంలో సగభాగాన్ని (1/2 వ భాగాన్ని) కౌసల్యకు ఇచ్చినాడు. మిగిలిన సగంలో సగభాగాన్ని (1/4 వ భాగాన్ని) సుమిత్రకు ఇచ్చినాడు. మిగిలినదానిలో సగభాగాన్ని (1/8 వ భాగాన్ని) కైకేయికి


ఇచ్చినాడు. ఇంకా మిగిలియున్న భాగాన్ని (1/8 వ భాగాన్ని) మరలా సుమిత్రకు ఇచ్చినాడు.

మ. సగభాగమ్ము నొసంగెఁ బాయసమునన్ సమ్రాజ్ఞి కౌసల్యకున్,
సగమం దర్ధమునే సుమిత్రకు నిడెన్ సంప్రీతి, కైకేయి మె
చ్చగ నందష్టమభాగ మిచ్చె, నవశిష్టమ్మున్ సుమిత్రార్ధ మి
చ్చెఁ గడన్ రెండవమాఱుగా నరపతిశ్రేష్ఠుండు హర్షమ్మునన్. 82

తతస్తు తాః ప్రాశ్య తదుత్తమస్త్రియో మహీపతే రుత్తమపాయసం పృథక్।
హుతాశనాదిత్య సమానతేజసః చిరేణ గర్భాన్ ప్రతిపేదిరే తదా॥ {1.16.31}

❈ అమృతసమానమైన పాయసమును దశరథమహారాజు తన భార్యలకు పంచగా వారు ఆ పాయసమును ప్రీతితో భుజించినవారై హుతాశన అర్క తేజస్సులతో వెలుగొందసాగినారు. ప్రసన్నమైన మనస్సులతో ఉన్నట్టి ఆ ముగ్గురు రాణులు తమకోరిక సఫలమయ్యే విధంగాను, తమ భర్తయైన దశరథుడు ప్రమోదమును పొందేవిధంగాను గర్భములను ధరించినారు.

చం. అమృత సమాన పాయసము నంది భుజించి హుతాశనార్క తే
జమున వెలుంగుచుండిరి ప్రసన్నమనమ్ముల వారు, కొంత కా
లమునకు వారి కోర్కి సఫలమ్మగునట్లు నిజేశుడున్ బ్రమో
దము గనునట్లు గర్భమును దాల్చిరి రాణులు ముప్వురంతటన్. 83



17. బ్రహ్మదేవుని ప్రేరణతో దేవాదులు వానరవీరులను సృజించుట

పుత్రత్వం తు గతే విష్ణౌ రాజ్ఞస్తస్య మహాత్మనః।
ఉవాచ దేవతాః సర్వాః స్వయంభూ ర్భగవా నిదమ్॥ {1.17.1}
అప్సరస్సు చ ముఖ్యాసు గంధర్వీణాం తనూషు చ।
సృజధ్వం హరిరూపేణ పుత్రాంస్తుల్య పరాక్రమాన్॥ {1.17.5}

❃ అయోధ్యలో రాణులు ముగ్గురూ గర్భవతులు కాగా, విష్ణు భగవానుడు దశరథ మహారాజునకు కుమారుడుగా జన్మించుటకు సిద్ధమగుచుండగా, బ్రహ్మదేవుడు దేవతలను చూచి ఓ సురలారా! మీరు ఆ విష్ణువునకు సహాయముగా ఉండుటకు గొప్ప బలముగల వానరములు మొదలైన వారిని మీ కుమారులుగా అప్సరసలు తదితరులయందు వెంటనే సృష్టించండి అని ఆదేశించినాడు.

చం. దశరథరాజపుత్రునిగఁ దాను జనించగ విష్ణు వెంచఁ; "ద
ద్వశమున నుండి సాయపడఁ దత్పరతన్ సురలార! వైళమే
భృశబలవానరాదులుగ వేడ్క భవత్సుతులన్ సృజింపుడీ
యశమున నప్సరోగణము నం" దని పల్కెఁ బితామహుం డొగిన్. 84

పూర్వ మేవ మయా సృష్టో జాంబవాన్ ఋక్షపుఙ్గవః। {1.17.6}
వానరేంద్రం మహేంద్రాభమ్ ఇంద్రో వాలిన మూర్జితమ్।
సుగ్రీవం జనయామాస తపన స్తపతాం వరః॥ {1.17.9}
మారుత స్యాత్మజః శ్రీమాన్ హనుమా న్నామ వీర్యవాన్। {1.17.10}

❃ బ్రహ్మదేవునికి ముందుగానే జాంబవంతుడు జన్మించియుండినాడు. దాశరథికి సహాయపడుటకు ఆ బ్రహ్మవాక్కు ననుసరించిన దేవతలకు వానరులు జన్మించినారు. ఇంద్రునికి వాలి, సూర్యునికి సుగ్రీవుడు, బృహస్పతికి తారుడు, కుబేరునికి గంధమాదనుడు, విశ్వకర్మకు నలుడు, అగ్నికి నీలుడు, అశ్వినీదేవతలకు మైందుడు - ద్వివిదుడు, వరుణునికి వైద్యచణుడైన సుషేణుడు,

పర్జన్యునికి శరభుడు కుమారులుగా కలుగగా వాయుదేవుని కుమారుడుగా బుద్ధిబలాదులు గల హనుమంతుడు అవతరించినాడు.

సీ. పరమేష్ఠికిన్ జాంబవంతుడు పుట్టెను,
బాకశాసనునికి వాలి పుట్టె,
సూర్యునకున్ బుట్టె సుగ్రీవుడున్, బృహ
స్పతికి తారుడు కపివరుడు పుట్టె,
ఘనకుబేరునికిని గంధమాదనుడును,
విశ్వకర్మకుఁ బుట్టె వేడ్క నలుడు,
నగ్నికి నీలుండు, నశ్వినులకు మైందు
డును ద్వివిదుండును జననమంద,
తే.గీ. వరుణునకు సుషేణుడుపుట్టె వైద్యచణుడు,
పుట్టెఁ బర్జన్యునకు శరభుండు, నంత
పుట్టె మారుతి వాయుదేవుని సుతుడుగ
నిట్లు పుట్టిరి వానరుల్ కోట్లకొలది. 85

కామరూపబలోపేతా యథాకామం విచారిణః।
సింహ శార్దూల సదృశా దర్పేణ చ బలేన చ॥ {1.17.23}
విచాలయేయుః శైలేంద్రాన్ భేదయేయుః స్థిరాన్ ద్రుమాన్। {1.17.25}
దారయేయుః క్షితిం పద్భ్యామ్ ఆప్లవేయు ర్మహార్ణవమ్। {1.17.26}

❋ దాశరథికి సహాయం చేసేందుకు దేవతల అంశలతో భూమిపై జన్మించిన ఆ వానరోత్తములు తదితరులు గొప్ప వీరులు. శూరులు. కామరూపమును ధరించగలిగినవారు. సింహ సమాన ప్రతాపం గలవారు. అస్త్రశస్త్రములను గొప్పగా ప్రయోగించడం తెలిసినవారు. నేర్పుగా సముద్రములను కూడా దాటగలిగినవారు. కొండలను పిండి చేయగలవారు. ఆకాశంలో కూడా సంచరింపగలవారు.

ఉ. వారలు కామరూప పరివర్తులు, సింహసమప్రతాపులున్,
వీరులు, నస్త్రశస్త్రగుణవేత్తలు, ముంపు జనింప నొంపుగా
వారిధి నైన దాటి చనువారు, మహీధ్రవిదారకుల్, నభ
శ్చారులు, శూరులున్, త్రిదశజాతులు, జ్ఞాతులు, వానరోత్తముల్. 86



18. శ్రీరామాదుల జననము, శైశవము, గుణ వర్ణనము విశ్వామిత్ర ఆగమనము

ప్రతిగృహ్య సురా భాగాన్ ప్రతిజగ్ము ర్యథాగతమ్॥ {1.18.1}
శాన్తయా ప్రయయౌ సార్ధమ్ ఋశ్యశృంగ స్సుపూజితః। {1.18.6}
ఏవం విసృజ్య తాన్ సర్వాన్ రాజా సంపూర్ణమానసః।
ఉవాస సుఖిత స్తత్ర పుత్రోత్పత్తిం విచిన్తయన్॥ {1.18.7}

❊ దేవత లందఱూ తమతమ యజ్ఞభాగాలను స్వీకరించి వెళ్లగా, పుత్రకామేష్టి పూర్తికాగా, యజ్ఞమును చూచేందుకు దేశ విదేశములనుండి వచ్చిన రాజులందఱూ అభీష్టసిద్ధిని పొంది స్వదేశములకు బయలుదేరగా, ఋశ్యశృంగ మహర్షి తన భార్యయైన శాంతతోపాటు తన నివాసమునకు బయలుదేరగా, దశరథమహారాజు అంతఃపురంలో ఉండి యజ్ఞఫలోదయం కొఱకు ఎదురుచూడసాగినాడు.

చం. తమ తమ యజ్ఞభాగముల దైవగణమ్ము గ్రహించి యేగ, స
త్రము ముగియంగ, నా యితర రాజులు నేగ నభీష్టసిద్ధితో,
నమలుడు ఋశ్యశృంగముని యందటి వీడ్కొని యేగ శాంతతో,
సుమతి నృపాలకుం డెదురు చూచుచు నిల్చె ఫలోదయార్థమై. 87

తతో యజ్ఞే సమాప్తే తు ఋతూనాం షట్ సమత్యయుః।
తతశ్చ ద్వాదశే మాసే చైత్రే నావమికే తిథౌ॥ {1.18.8}
నక్షత్రేఽదితి దైవత్యే స్వోచ్చ సంస్థేషు పంచసు।
గ్రహేషు కర్కటే లగ్నే వాక్పతా విందునా సహ॥ {1.18.9}
ప్రోద్యమానే జగన్నాథం సర్వలోక నమస్కృతమ్।
కౌసల్యాఽజనయ ద్రామం సర్వలక్షణ సంయుతమ్॥ {1.18.10}
విష్ణో రర్ధం మహాభాగం పుత్ర మైక్ష్వాకువర్ధనమ్। {1.18.11}

❋ పుత్రకామేష్టి పూర్తియైనతరువాత, ఆరు ఋతువులు గడువగా, చైత్రమాసంలో, శుక్లపక్షంలో, సూర్య, కుజ, గురు, శుక్ర, శని అనే ఐదు గ్రహములు ఉచ్ఛస్థితిలో ఉండగా, చంద్రగురుయోగంలో, నవమి తిథిలో, పునర్వసు నక్షత్రంలో, కర్కాటక లగ్నంలో విష్ణుతేజోర్ధరూపుడు జగన్నాథుడు సకలశుభలక్షణాన్వితుడు ఇక్ష్వాకువంశవర్ధనుడు అగు రాముని శుభకరమైన ముహూర్తంలో కౌసల్య ప్రసవించినది.

తే.గీ. క్రతువు పూర్తియైనంత షడృతువు లేగ
జగతి పులకింపఁ జైత్రమాసమ్ము నందుఁ
జంద్రు డలరారు శుక్లపక్షమ్ము నందు
జగములకు నాథు రాముఁ గౌసల్య గనియె. 88

తే.గీ. భువనములు పొంగిపోవగా నవమి యందు
గన పునర్వసు నామ నక్షత్ర మందు
ప్రజలు మురియఁ గర్కాటక లగ్న మందు
సాధుమూర్తిని రాముఁ గౌసల్య గనియె. 89

తే.గీ. ఘనత నుచ్చస్థితిన్ జేర గ్రహము లైదు
సూర్య కుజ గురువులు శని శుక్రు లుండఁ
జంద్రగురుయోగ మమరిన సమయమందు
సకలవందితు రాముఁ గౌసల్య గనియె. 90

తే.గీ. విష్ణుతేజోఽర్ధరూపుని విమలమతిని
సర్వశుభలక్షణాన్వితు శాంతగుణునిఁ
దలప నిక్ష్వాకువంశ వర్ధనుని సుతుని
సన్ముహూర్తము నందుఁ గౌసల్య గనియె. 91

భరతో నామ కైకేయ్యాం జజ్ఞే సత్యపరాక్రమః॥ {1.18.12}
సాక్షా ద్విష్ణో శ్చతుర్థాంశః సర్వైః సముదితో గుణైః।
అథ లక్ష్మణశత్రుఘ్నౌ సుమిత్రాఽజనయత్ సుతౌ॥ {1.18.13}
పుష్యే జాతస్తు భరతః మీన లగ్నే ప్రసన్నధీః॥ {1.18.14}
సార్పే జాతౌ తు సౌమిత్రీ కుళీరేఽభ్యుదితే రవౌ। {1.18.15}

❋ కౌసల్యాదేవికి రాముడు పునర్వసు నక్షత్రంలో జన్మించిన తరువాత, కైకేయికి భరతుడు పుష్యమీ నక్షత్రంలో మీనలగ్నంలో విష్ణువు యొక్క ఎనిమిదవ అంశగా జన్మించినాడు. సుమిత్రకు విష్ణువుయొక్క నాలుగవ అంశగా లక్ష్మణుడు, ఎనిమిదవ అంశగా శత్రుఘ్నుడు ఆశ్లేషానక్షత్రంలో కర్కాటక లగ్నంలో దశమి తిథిలో జన్మించినారు.

తే.గీ. ధరణి వర్ధిల్లఁ బుష్యమి తళతళమన
మీనలగ్నమ్ము నమర నమేయగుణుని,
ఘనుని, హర్యష్టమాంశమో యన వెలిగెడి
కీర్తిమంతుని భరతుఁ గైకేయి గనియె. 92

తే.గీ. అటులె విష్ణుచతుర్థాంశ మనగ వెలుగు
లక్ష్మణుని, నష్టమాంశచే లక్షితుడగు
వీరు శత్రుఘ్ను నాశ్లేష తార దశమి
మెఱయఁ గర్కాటకమున సుమిత్ర గనియె. 93

రాజ్ఞః పుత్రా మహాత్మానః చత్వారో జజ్ఞిరే పృథక్।
గుణవంతోఽనురూపాశ్చ రుచ్యా ప్రోష్ఠపదోపమాః॥ {1.18.15}

❋ "చక్కనైన రూపము గలవారు, నక్షత్రములవలె గొప్ప తేజస్సు గలవారు, ప్రోష్ఠపదోపమానులు అగు (గోవుయొక్క పాదములవలె) నలుగురు కుమారులను పొందినాను. నా చింతలన్నీ తొలగిపోయినవి" అని దశరథ మహారాజు పరమానందమును పొందగా, మహారాణులగు కౌసల్య సుమిత్ర

కైకేయిలు కూడా సంతుష్టిని పొందగా, భూమాత కూడా రామాదుల జననమును ఒక పండుగ అన్నట్లు భావించి సంతోషంతో పొంగిపోయినది.

చం. "విలసితరూప కాంతి పరివృద్ధులఁ బ్రోష్ఠపదోపమానులన్
నలుగురు పుత్రులన్ బడసినా" నని, "చింతలు వంతలన్నియున్
దొలగె" నటంచు నా దశరథుండు ప్రమోదమునంద, రాణులున్
మెలగిరి నిత్యతుష్టిమెయి, మేదిని పొంగె సుపర్వభావనన్. 94

జగుః కలం చ గంధర్వాః నన్నృతు శ్చాప్సరోగణాః॥ {1.18.16}
దేవదుందుభయో నేదుః పుష్పవృష్టిశ్చ ఖాచ్చ్యుతా।
ఉత్సవశ్చ మహా నాసీత్ అయోధ్యాయాం జనాకులః॥ {1.18.17}

❋ శ్రీ రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు భూమిపై అవతరించిన శుభ సమయాన పరమానందంతో గంధర్వులు పాటలు పాడినారు. అప్సరస లందఱూ కలిసి నాట్యమాడినారు. తమంతట తాముగా దేవదుందుభులు మ్రోగినవి. ఆకాశమునుండి పుష్పవర్షం కురిసింది. దశరథుని అంతఃపురంలో మాత్రమే కాకుండా ఆ అయోధ్యా నగరంలో అంతటా పుత్రోత్సాహం వెల్లివిరిసింది. ఎంతటి పండితుడైనా సరే ఏ ఇంటిలో బిడ్డ పుట్టినాడో తెలిసికొనలేనివిధంగా ప్రతి ఇంటిలోనూ పుత్రోత్సవం జరుగసాగింది.

కం. పాడిరి గంధర్వులు, సమ
కూడుచు నప్సరస లపుడు గొప్పగ నాట్య
మ్మాడిరి, సురదుందుభులున్
వాడకయే మ్రోసె, విరులవానయుఁ గురిసెన్. 95

కం. సొంతము పుత్రోత్సాహం
బంతఃపురముననె గాక యన్ని నెలవులం;
దెంతటి బుధుడైన నెరుగ
డింతకు నేయింట నిసుగు నెపుడు కలిగెనో? 96

ఉత్సవశ్చ మహా నాసీత్ అయోధ్యాయాం జనాకులః॥ {1.18.17}

❋ రామాదుల జననంతో అయోధ్యలో అంతఃపురంలోనే కాక అన్ని యిండ్లలో పుత్రోత్సవాలు జరుగుతూ ఉండగా పౌరుల ఇండ్లలో ఎక్కడా పసిబిడ్డ ఏడుపు వినిపించకపోవడంతో ఎవరి ఇంటిలో బిడ్డ పుట్టినాడో అని క్రొత్తవారు ఊహించలేకపోయారు. అప్పుడు దశరథుని రాజగృహమునుండి బిడ్డ ఏడుపు అభయమిస్తున్నదో అన్నట్లుగా వినిపించగా "ఓహో రాజుగారి యింటిలో బిడ్డ పుట్టినాడన్నమాట" అని వారంతా చెప్పుకొనసాగినారు"

మ. ముద మొప్పారగ నన్ని యిండ్లను మహా పుత్రోత్సవమ్మైన, శ్రీ
ప్రదమౌ బిడ్డడి రోదనమ్ము వినగారాదయ్యె! నా రోదన
మ్మదిగో రాజగృహమ్మునుండి యభయమ్మన్నట్లుగాఁ దోపగా
"నుదయించెన్నృపు నింట సూను" డని యోహో పల్కినా రెల్లరున్. 97

రథ్యాశ్చ జనసంబాధాః నటనర్తక సంకులాః।
గాయనైశ్చ విరావిణ్యో వాదనైశ్చ తథాఽపరైః॥ {1.18.18}

❋ శ్రీరామ భరత లక్ష్మణ శత్రుఘ్నులు అవతరించిన శుభ సందర్భమున దశరథుని రాజగృహము సూతులతో, నటులతో, గాయకులతో, వందిమాగధ జనులతో, నర్తకమణులతో, గొప్ప వాద్యబృందములతో కళాకారులతో ఆనందోత్సాహములతో శోభిల్లినది.

కౌసల్య సుమిత్ర కైకేయి అనే ముగ్గురు రాణులకు ఆశలు పండగా కలిగిన ఆ పసిబిడ్డలను ముందుగా చూడగలిగినవారిదే అసలైన భాగ్యము అని అనుకొంటూ ఆ అయోధ్యా నగరంలోని నారీమణులు అంతఃపురంలోనికి త్వరత్వరగా వచ్చినారు.

కం. అట సూతుల మాగధులన్
నట గాయక వంది జనుల నర్తక మణులన్
పటుతర వాద్య గణ సము
ద్భటతను నా రాజగృహము దనరెన్ శోభన్. 98

ఆ.వె. "ఆసలన్ని పండఁ గౌసల్య కైకమ్మ
యును సుమిత్ర సుతుల గనిరి ఘనుల
వారి మొదటఁ జూచు వారిదే భాగ్యమ్మ"
టంచుఁ జూడ వచ్చి రతివలెల్ల. 99

ప్రదేయాంశ్చ దదౌ రాజా సూతమాగధవందినామ్।
బ్రాహ్మణేభ్యో దదౌ విత్తం గోధనాని సహస్రశః॥ {1.18.19}

❈ శ్రీరామాదుల జననం సందర్భంగా పవిత్రాత్ముడైన దశరథ మహారాజు పుత్రోత్సవాన్ని విశేషంగా జరుపుకొంటూ బ్రాహ్మణోత్తములకు గోదానమును భూదానమును చేసి, వలసినంత ధనమును కూడా సంభావనగా సమర్పించి, ఆ విప్రోత్తములయొక్క దీవెనలతో నూతనమైన తేజస్సుతో విరాజిల్లినాడు. విప్రవర్యుల వాక్కు ననుసరించి నలుగురు కుమారులకు మేధను పెంచే గుణము గల ఘృతమును రుచిచూపించినాడు. 'దీర్ఘాయుష్మాన్ భవ!' మొదలైన మంత్రములను భూసురులు పలుకుచుండగా ఎంతో ప్రీతితో జాతకర్మలను తన బిడ్డలకు జరిపించినాడు.

కం. గోవులఁ దావుల ధనములఁ
బావనమతి దశరథుండు బ్రాహ్మణులకు సం
భావనగా నిడి, వారల
దీవెనలను గాంచె నూత్న తేజమ్మమరన్. 100

తే.గీ. సమ్మతిన్ మేధ పెరుగ ఘృతమ్ము నిడుచు,
నాయువునుఁ బెంచు మంత్రాల నాలపించి
విప్రవర్యుల దీవెనల్ ప్రీతిఁ గూర్ప,
రాజు జరిపించె జాతకర్మల సుతులకు. 101

అతీత్యైకాదశాహం తు నామకర్మ తథాఽకరోత్।
జ్యేష్ఠం రామం మహాత్మానం భరతం కైకయీసుతమ్॥ {1.18.20}

సౌమిత్రిం లక్ష్మణ మితి శత్రుఘ్న మపరం తథా।
వసిష్ఠః పరమప్రీతో నామాని కృతవాం స్తదా॥ {1.18.21}

❋ కుమారులు పుట్టిన తరువాత పదకొండు రోజులు పూర్తియైన పిదప దశరథ మహారాజు ఆ బిడ్డలకు నామకరణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా జరిపించినాడు. కులగురువు, పురోహితుడు అగు వసిష్ఠ మహర్షి ధ్యానమగ్నుడై చక్కగా ఆలోచించి సుగుణధాముడు ధర్మపరుడు దశరథజ్యేష్ఠపుత్రుడు అగు బిడ్డకు దివ్యమైనటువంటి పేరును పెట్టదలచినవాడై 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మంత్రములోని 'రా' అనే అక్షరాన్ని తొలి అక్షరంగాను, 'ఓం నమశ్శివాయ' అనే పంచాక్షరీ మంత్రంలోని 'మ' అనే అక్షరాన్ని మలి అక్షరంగాను ఎంపికచేసి తారకమంత్రమైన రామ నామాన్ని సృష్టించినాడు. పలికినంతనే దోషములను తొలగింపజేయగల ఆ రామ నామంతో తన కుమారుని పిలుస్తూ కౌసల్యామాత ధన్యురాలైనది.

సీ. మహితులౌ దశరథాత్మజుల నామకరణ
మున వసిష్ఠుడు ధ్యానమున మెలంగి
యష్టాక్షరీ మంత్ర మందున్న 'రా' యను
నక్షరమున్ దొలి యక్షరముగఁ
బంచాక్షరీ మంత్ర వర్ణమ్ముల 'మ' యను
నక్షరమును మలి యక్షరముగ
మలచుచు దివ్యనామమ్మును సృజియించి
గుణధాము డితడని కూర్మిఁ గనుచుఁ
తే.గీ. జ్యేష్ఠసుతు డార్షధర్మానుశీలి యనుచు
రామ నామమ్మునిడ ననురాగ మొప్పఁ,
బలికినంతనె దోషాలఁ దొలగఁ జేయు
నామమనుచును కౌసల్య రాముఁ బిలిచె. 102

జ్యేష్ఠం రామం మహాత్మానం భరతం కైకయీసుతమ్॥ {1.18.20}
సౌమిత్రిం లక్ష్మణ మితి శత్రుఘ్న మపరం తథా।
వసిష్ఠః పరమప్రీతో నామాని కృతవాంస్తదా॥ {1.18.21}

❈ దశరథుని పెద్దకుమారునికి రాముడు అని పేరు పెట్టిన తరవాత, అన్నగారి మాటను (తండ్రిమాటగా భావించి) జవదాటకుండా పాటించగలవాడు పావనుడు రాజ్యభారమును సమర్థవంతంగా భరింపగలవాడు అని తలచి కైకేయీకుమారునికి భరతుడు అని నామకరణం చేసినాడు ఆ వసిష్ఠమహర్షి. సుమిత్రకు కలిగిన ఇద్దఱు కుమారులలో పెద్దవాడు శుభలక్షణ సమన్వితుడు అని యెంచి ఆ బిడ్డకు లక్ష్మణుడు అని, చిన్నకుమారుని శత్రువులను అవలీలగా వధించగలవానినిగా భావించి ఆ శిశువునకు శత్రుఘ్నుడు అని నామకరణం చేయగా అందఱూ పరమానందమును పొందినారు.

తే.గీ. అతుల పితృవాక్య సమమగు నన్నమాట
యనుచు జవదాటకుండు పావనుడు రాజ్య
భారమును మోయగలవాడు భరతుడనుచు
నామ మిడినాడు కైకేయి నందనునకు. 103

ఆ.వె. ఆ సుమిత్రకొడుకులందు జ్యేష్ఠుని పేరు
లక్ష్మణుండు విశదలక్షణుండు;
చిన్నవాని పేరు చెలువుగ శత్రుఘ్ను
డన వసిష్ఠమౌని యలరి రెల్ల. 104

తేషాం జన్మక్రియాదీని సర్వకర్మాణ్యకారయత్। {1.18.23}

❈ దశరథ చక్రవర్తి తన నలుగురు కుమారులకు జాతకర్మ మొదలైన సంస్కారములలో భాగంగా క్రమంగా నామకరణ మహోత్సవాన్ని పూర్తి చేసినాడు. కౌసల్యాతనయుడైన శ్రీరాముని బంగారు ఊయలలో పరుండబెట్టిన భామినీమణులు జోలపాటలను పాడటం మొదలు పెట్టినారు. "రామా లాలీ మేఘశ్యామా లాలీ తామరసనయన దశరథతనయ లాలీ" అని కొందఱు

తల్లులు, "జో అచ్యుతానంద జోజో ముకుందా లాలి పరమానంద రామ గోవిందా" అని కొందఱు తరుణులు, "కస్తూరి రంగ రంగా నాయన్న కావేటి రంగ రంగా" అని కొందఱు యువతులు, "జాబిల్లి యేతెంచె జార్చె వెన్నెల వాన చేతబట్టుము వానచినుకు రామ" అని మరికొందరు భామలు, ఊయల ఊపుతూ అనేక రకాలుగా జోలపాటలు పాడుతూ - చిఱునవ్వులు చిందించే రామునికి దీర్ఘాయువు కలగాలని దీవెనలను అందజేయసాగినారు.

సీ. "ఘన రామ లాలి మేఘశ్యామ లాలి తా
మరసనయన లాలి మహిత లాలి
జో యచ్యుతానంద జో ముకుందా లాలి
యాగమానందవిహార లాలి
కస్తూరిరంగ యో కావేటిరంగ శ్రీ
రంగ నాయన్నరో రామలాలి
జాబిల్లి యేతెంచి జార్చె వెన్నెలవాన
చేతబట్టుము రామ చినుకు లాలి

తే.గీ. స్వర్ణడోలిక లూపెడి వారి వైపు
చిఱుతనవ్వులఁజిందించు చిఱుత లాలి
లాలి దీర్ఘాయువగు రామ లాలి" యనుచు
భామ లల లాలిపాటలఁ బాడి రపుడు. 105

❋ కౌసల్యాదశరథుల ముద్దులబిడ్డ యైన శ్రీరాముడు బాల్యావస్థలో ఉన్నవాడై ఒకనాడు ఆకాశంలో కనిపించిన చందమామను చూచి" అదుగో చూలులు, అది చందమామ, దాన్ని నా కందించులీ, నాకు అదే కావాలి" అని ముద్దు ముద్దు మాటలతో మారాము చేస్తూ ఏడవడం మొదలుపెట్టినాడు. బాలరాముని ఏడుపును మాన్పించేందుకు తెలివిగలమంత్రి సుమంత్రుడు ఆ రామునికి ఒక అద్దం తెచ్చియిచ్చి ఆ అద్దంలో చందమామను చూపించినాడు. బాలరాముడు అద్దంలో చందమామను చూచి "ఆహా! చందమామ నా చేతికి చిక్కినాడు" అని

అనుకొంటూ మనసులోనే పొంగిపోతూ ఏడుపు మానివేసి ఎంతగానో సంతోషించినాడు.

మ. "అదిగో చూలులు, చందమామ యది, నా కందించులీ దాని, నా
కదియే గావలె" నంచు రాముడనఁ దా నందించె నద్దమ్ము నె
మ్మది సన్మంత్రి సుమంత్రు, డద్భుతముగా మారాము మానెన్ వెసన్
ముదితుం డందున జందమామ గని యుప్పొంగెన్ మదిన్ రాముడున్. 106

తేషాం జన్మక్రియాదీని సర్వకర్మాణ్యకారయత్।
తేషాం కేతు రివ జ్యేష్ఠో రామో రతికరః పితుః॥ {1.18.23}

❋ దశరథ మహారాజు తన కుమారులగు రామ భరత లక్ష్మణ శత్రుఘ్నులకు క్రమంగా అన్నప్రాశనము, చౌలము, ఉపనయనము మొదలగు సంస్కారములను హితులు, పురోహితులు, బంధుజనులు మొదలైన ఆత్మీయులందఱి సమక్షంలో వైభవంగా జరిపించినాడు. రాముడు జ్యేష్ఠుడని, రమ్యగుణుడని, వంశకేతనమై విరాజిల్లగలవాడని, తనయెడల అనాదరము ఏర్పడిన సందర్భమునందు కూడా ఎదుటివారిని ఆదరించి ప్రేమతో చూచేవాడని, అరిభయంకరుడై వ్యవహరించగలవాడని భావిస్తూ దశరథ చక్రవర్తి తన నలుగురు కుమారులలో ఆ రాముని ఎంతో ప్రీతితో చూచేవాడు.

కం. అన్నప్రాశన చౌలముఁ
గ్రన్నన నుపనయనకర్మఁ గావించె నృపుం
డన్నలువురు గొమరులకున్
మన్నన హితబంధుజనసమక్షమునందున్. 107

ఉ. రాముడు జ్యేష్ఠపుత్రుడని, రమ్యగుణుండని, వంశకేతనం
బై మహి వెల్గువాడని, యనాదృతినైనను నాదరించుచున్
బ్రేమగఁ జూచువాడని, యరిందము డౌనని మెచ్చుచున్ సుతున్
రామునిఁ బ్రీతిపాత్రునిగ రాజు తలంచెను సూను లందునన్. 108

❊ దశరథ మహారాజునకు కలిగిన కుమారులను చూచేందుకు వచ్చిన వారు ముద్దులొలికే ఆ బిడ్డలను చూచి "విష్ణుభగవానునికి ఉండే నాలుగు భుజములవలె ఈ నలుగురు బిడ్డలు వెలసినారు. ప్రజలందఱూ మేలు మేలు అని మెచ్చుకొనేవిధంగా వీరు ధర్మమార్గంలో ఈ భూమిని పరిపాలించగలరు" అని వర్ణిస్తూ ఆ శిశువులను ప్రశంసించేవారు.

రాముడు భరతుడు లక్ష్మణుడు శత్రుఘ్నుడు నలుగురు మెల్లమెల్లగా మాట్లాడడం మొదలుపెట్టి, అమ్మా! నాన్నా! అని పలుకుతూ ఉంటే మహారాణులు కౌసల్య కైకేయి సుమిత్ర, మహారాజు దశరథుడు తమ బిడ్డలు ముద్దు ముద్దు మాటలతో తమను పిలుస్తూ ఉన్నారు కదా అని ఆ పలుకులు విని పరవశించిపోతూ తమ జన్మ సార్థకమైనట్లుగా భావించి పరమానందమును పొందసాగినారు.

కం. "లీలగ విష్ణువునకు గల
నాలుగు భుజములన వెలసినారలు వీరల్,
మేలన భువి ధర్మమ్మున
బాలించెద" రనిరి చూడ వచ్చిన వారల్. 109

కం. నెమ్మది పుత్రులు నలువురు
నమ్మా నాన్నా యని ముదమారగ బిలువన్
సమ్మతి రాణులు రాజును
సమ్మోదము గనిరి జన్మ సఫల మ్మనుచున్. 110

సర్వప్రియకరస్తస్య రామస్యాపి శరీరతః।
లక్ష్మణో లక్ష్మిసంపన్నో బహిఃప్రాణ ఇవాపరః॥ {1.18.28}
భరత స్యాపి శత్రుఘ్నో లక్ష్మణావరజో హి సః॥ {1.18.31}
ప్రాణైః ప్రియతరో నిత్యం తస్య చాసీత్తథా ప్రియః। {1.18.32}

❊ నలుగురు కుమారులైన రామ భరత లక్ష్మణ శత్రుఘ్నులలో రామలక్ష్మణులు ఇద్దఱూ ఒకరిపై ఒకరు మిక్కిలి అనురక్తితో ఉంటూ ఎప్పుడూ జంటగా

కలిసియుండేవారు. అట్లే భరతశత్రుఘ్నులు ఇద్దఱూ జంటగా కలిసిమెలసి ఉంటూ పరస్పరం అనురాగంతో మెలగేవారు. అందంలో అశ్వినీకుమారుల వలె, తేజస్సులో సూర్యాగ్నుల వలె, కోమలత్వంలో మన్మథుని వలె, కలువపూవు వలె ఆ రామలక్ష్మణులు భరతశత్రుఘ్నులు శ్రేష్ఠమైన గుణములు గలవారై విరాజిల్లుతూ సదా కలిసిమెలసి ఉండేవారు.

తే.గీ. రామలక్ష్మణు లెపు డనురక్తులగుచు
జంటగాను కలిసి యుండసాగినారు
భరతశత్రుఘ్ను లనురాగభావ మలర
మెలగసాగిరి యటువలెఁ గలసిమెలసి. 111

తే.గీ. అందమున నశ్వినీసుతు లనగ నలరి
తేజమున భాస్కరాగ్నుల దీప్తి నలరి
కోమలత్వమున మదన కుముదములన
వారలుండిరి వరగుణభాసురులన. 112

తేషాం కేతు రివ జ్యేష్ఠో రామో రతికరః పితుః॥ {1.18.23}

❈ "బాలవాక్కు బ్రహ్మవాక్కు అన్నట్లు ఈ రాముడు దివ్యవాక్కులనే పలుకుతూ ఉన్నాడు. ఆటలు ఆడేటప్పుడు కూడా అబద్ధాలాడకుండా రాముడు సత్యమునే పలుకుతున్నాడు. ఇతరులకు బాధ కలిగించని విధంగా శిష్టుడుగా రాముడు తన పనులను చక్కబెట్టుకొంటూ ఉన్నాడు. ఊహలలో నైనా సరే కపటంతో కూడిన ఉపాయాల జోలికెళ్లకుండా మిన్నగా మెలగేవాడు ఈ రాముడు" అని ప్రజలందఱూ రాముని అనేకవిధాలుగా పొగడుతూ ఉంటే విని తండ్రియైన దశరథ మహారాజు పొంగిపోయేవాడు. సామ దాన భేద దండ అనే నాలుగింటిలో మొదటిదైన సామోపాయం శ్రేష్ఠమైనదన్నట్లుగా తన నలుగురు కుమారులలో మొదటివాడైన రాముడు సుగుణాభిరాముడు శ్రేష్ఠుడు అని భావించిన దశరథుడు ఆ రాముని ఎంతో ప్రీతితో చూచేవాడు.

సీ. "బాలవాక్కైనను బ్రహ్మవాక్కనునట్లు
పలుకును రాముడు భవ్యరీతి,
నాటలయందైన నన్నృతమ్ము లేకుండ
నాడును రాముడు వేడుక నిల,
నన్యుల బాధించనటువంటి పనులను
జేయును రాముడు శిష్టు డనగ
నూహలలోఁ గపటోపాయ మెంచక
మెలగును రాముడు మిన్నయగు" న

తే.గీ. టంచు సుగుణాభిరాము నుతించునట్టి
ప్రజల వాక్కుల దశరథరాజు వినును
జతురుపాయములన్ దొలి సామగుణము
శ్రేష్ఠ మనురీతి రామునిఁ బ్రీతిఁ గనును. **113**

❃ దశరథ చక్రవర్తి తన కుమారులగు రామలక్ష్మణ భరతశత్రుఘ్నులను విద్యావంతులుగా తీర్చిదిద్దదలచినవాడై వారిని కులగురువైన వసిష్ఠ మహర్షి ఆశ్రమానికి పంపించినాడు. ఆ నలుగురు గురుకులంలో ఉంటూ శ్రద్ధాసక్తులతో చతుర్దశ విద్యలను నేర్చుకొని సిద్ధిని పొందినారు. సూక్ష్మబుద్ధి కలవారగు ఆ రాజకుమారులు అన్ని విద్యలలో ఉన్న సారము ధర్మము అని గ్రహించినవారై ధన్యత్వమును పొందినారు.

చం. గురుకులమందు నున్న సమకూరు చతుర్దశ విద్యలంచు నా
నరపతి పుత్రులన్ బనిచినాడు, వసిష్ఠుని యాశ్రమమ్ములో
స్థిరముగ నుండి నల్వురును సిద్ధినిఁ బొందిరి, శ్రద్ధతో మహ
త్తరమగు సారమున్ గనుచు ధన్యత నొందిరి సూక్ష్మబుద్ధులై. **114**

సర్వే వేదవిదః శూరాః సర్వే లోకహితే రతాః॥ {1.18.24}
సర్వే జ్ఞానోపసంపన్నాః సర్వే సముదితా గుణైః। {1.18.25}

గజస్కంధేఽశ్వపృష్ఠే చ రథచర్యాసు సమ్మతః॥ {1.18.26}
ధనుర్వేదే చ నిరతః పితృశుశ్రూషణే రతః। {1.18.27}

❉ కులగురువైన వసిష్ఠ మహర్షి యొక్క గురుకులంలో ఉంటూ రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు నలుగురు నాలుగు వేదములను సంపూర్ణంగా నేర్చినవారై వేదవేత్తలైనారు. విశుద్ధ మనస్కులైనారు. జ్ఞాన సంపదతో వెలుగసాగినారు. విలువిద్యలో కోవిదులైనారు. గుణాఢ్యులైనారు. సత్యపరాక్రమంతో అలరారినారు. అశ్వములపై గజరాజులపై విహరించడాన్ని అభ్యసించినారు. దశరథ చక్రవర్తి కుమారులైన ఆ నలుగురు వీరులు శూరులు అయినప్పటికిని సర్వభూత హితులుగా ఉంటూ ప్రధానంగా పితృసేవనాపరులుగా మెలగసాగినారు.

చం. నలువురు వేదవేత్త లయినారు విశుద్ధులు, జ్ఞానసంపదన్
వెలుగుచు నుండువారు, విలువిద్యలఁ గోవిదులున్, గుణాఢ్యులై
యలరెడు సత్యవిక్రములు, నశ్వగజాదులపై విహారముల్
సలిపెడివారు, శూరులును, సర్వహితుల్ పితృసేవనాపరుల్. 115

తేషామేవంప్రభావాణాం సర్వేషాం దీప్తతేజసామ్॥ {1.18.34}
పితా దశరథో హృష్టో బ్రహ్మా లోకాధిపో యథా। {1.18.35}
అథ రాజా దశరథః తేషాం దార క్రియాం ప్రతి॥ {1.18.36}
చింతయామాస ధర్మాత్మా సోపాధ్యాయః సబాంధవః। {1.18.37}

❉ నాలుగు ముఖములతో వెలిగే బ్రహ్మదేవునివలె, నాలుగు సముద్రములతో వెలిగే వరుణదేవునివలె, నాలుగు భుజములతో వెలిగే విష్ణుభగవానునివలె ఆ నలుగురు కుమారులతో దశరథ మహారాజు తేజోమయుడై ప్రకాశించసాగినాడు. నా పుత్రులైన రామలక్ష్మణ భరతశత్రుఘ్నులు నలుగురూ విద్యావంతులైనారు. వేదాధ్యయన తత్పరులు, పాత్రులు, వీరులు, మాన్యులు, గుణవంతులు అయిన వీరిని చూస్తూ ఉంటే సంతోషంతో నా శరీరము పులకరిస్తూ ఉన్నది అని అనుకొంటూ దశరథుడు పురోహితులను ఆప్తమిత్రులను పిలిపించి యౌవనవంతులైన నా కుమారులకు వివాహం

జరిపించాలి అని శ్రీ రామాదుల కల్యాణ విషయాన్ని వారి చెంత ప్రస్తావించినాడు.

తే.గీ. నాల్గు ముఖములతో బ్రహ్మ వెల్గునట్లు,
నాల్గు వార్ధుల వరుణుడు వెల్గునట్లు,
నాల్గు భుజముల విష్ణువు వెల్గునట్లు,
వెల్గె నల్వురు పుత్రులు గల్గ విభుడు. 116

ఉ. పుత్రులు నల్వురున్ సుగుణపూర్ణులు యౌవనవంతులున్ సదా
పాత్రులు వైదికాధ్యయన వర్తులు మాన్యులు వీరులౌట మ
ద్గాత్రము పుల్కరించెనని తాననె రాజు పురోహితాళితో
మిత్రులతోడ "బాలురకు మేలనఁ బెండ్లి యొనర్పగాఁదగున్" 117

తస్య చింతయమానస్య మంత్రిమధ్యే మహాత్మనః॥ {1.18.37}
అభ్యాగచ్ఛ న్మహాతేజా విశ్వామిత్రో మహామునిః। {1.18.38}

❈ దశరథ చక్రవర్తి తన పుత్రులగు రామలక్ష్మణ భరతశత్రుఘ్నులకు వివాహం చేయాలనే విషయాన్ని మంత్రులు మొదలగువారిచెంత మాట్లాడుతూ ఉండగా పూజ్యుడైన విశ్వామిత్ర మహర్షి లోకకల్యాణకారకుడుగా అక్కడకు విచ్చేసినాడు. దశరథుడు తన చెంతకు విచ్చేసిన ఆ బ్రహ్మర్షిని చూచి ఇతడు కుశికవంశమున జన్మించిన కౌశికుడు. సామర్థ్యమును సమకూర్చగల సద్గురువు. గొప్ప కీర్తిమంతుడు. కష్టదశలను తొలగించగల మహర్షి. క్షత్రియాగ్రణి యైన గాధి యొక్క కుమారుడు. ఈ మహాత్ముడు నాపై దయ జూప దలచి, నా యశస్సును పెంచదలచి, నాకు మహత్తరమైన దశను కలిగింపదలచి, నన్ను అనుగ్రహింపదలచి వచ్చిన బ్రహ్మదేవుడు అని తలచినవాడై పరమానందమును పొందినాడు.

తే.గీ. అనుచు నారీతి పుత్ర కళ్యాణమెంచి
యధిపుఁ డార్యులతోడ మాటాడు చుండఁ
బూజనీయ విశ్వామిత్ర మునివరుండు
వచ్చెఁ గల్యాణకామనాబద్ధదృష్టి. 118

చం. కుశికకులోద్భవుం, డలవుకూర్పరి, కీరితి కన్నబిడ్డ, దు
ర్దశలఁ దొలంగజేయు ననురాగి, మహాముని, గాధిజుండు నా
యశమును బెంపుఁజేయుటకు నాదృతి నన్ దయజూచుచున్ మహా
దశ నిడ నేగుదెంచిన విధాతయె యంచుఁ దలంచె భూపుడున్. 119

[అలవుకూర్పరి = (బల అతిబల ఇచ్చి) అలవు సామర్థ్యమును కూర్చువాడు; కీరితి కన్న బిడ్డ = కీర్తిమంతుడు]

తం దృష్ట్వా జ్వలితం దీప్త్యా తాపసం సంశితవ్రతమ్॥ {1.18.42}
ప్రహృష్టవదనో రాజా తతోర్ఘ్య ముపహారయత్। {1.18.43}

❀ పంక్తిరథుడు తన చెంతకు వచ్చిన విశ్వామిత్రునియొక్క తేజస్సునకు ఆశ్చర్యపడుతూ "ఇతడు గతంలో ఒక క్షత్రియోత్తముడు. అఖండమైన తపస్సు చేసి బ్రహ్మర్షియై ఇప్పుడు విప్రోత్తముడుగా నూతన తేజస్సుతో ప్రకాశిస్తూ ఉన్నాడు. ఉత్తమ వ్రతపరిపాలకుడు విశ్వమునకు మిత్రుడు అయిన ఈ విశ్వామిత్రునికి అతిథిసేవ చేయాలి" అని అనుకొంటూ గురుభక్తి గలవాడై సంతోషంగా ఎదురు వెళ్లి ఆ మహర్షికి స్వాగతం పలికినాడు.

చం. గతమున క్షత్రియాగ్రణి, యఖండుడు, తాపసి, విశ్వమిత్రుడున్,
నుతిగొన బ్రహ్మతేజమున నూతనవర్ణము నంది నట్టి స
ద్వ్రతపరిపాలకుం" డనుచుఁ బంక్తిరథుం డెదురేగి, మౌని కం
చిత గురుభక్తితో నతిథిసేవ లొనర్చుచు స్వాగత మ్మిడెన్. 120

ప్రహృష్టవదనో రాజా తతోఽర్ఘ్య ముపహారయత్। {1.18.43}

❀ దశరథ మహారాజు 'అతిథి దేవో భవ' అని తలచినవాడై, బ్రహ్మర్షియైన విశ్వామిత్రుని దైవంగా భావించినవాడై, ఆ గాధినందనునికి క్రమంగా అర్ఘ్యమును పాద్యమును సమర్పించి, ఆ మహాత్ముని ఉచితమైన ఆసనంలో కూర్చుండజేసి, గొప్పగా ప్రశంస చేసి "ఓ మునిరాజా! అందఱూ కుశలమే కదా!" అని సంతోషంగా పలుకరించగా, ఆ మహర్షి దశరథునికి శుభాశీస్సుల నందజేస్తూ తన క్షేమసమాచారమును తెలియజేసినాడు.

చం. అతిథికి దైవభావమున నర్ఘ్యముఁ బాద్యముఁ దా నొసంగి పా
త్రత నిడి యాసనమ్ము "మునిరాజ! సదా కుశలమ్మె?" యంచుఁ బ్ర
స్తుతి నొనరించుచున్ దశరథుం డట ప్రశ్నలఁ బల్కరింపగా,
నతులిత దివ్యవాక్కుల మహర్షి శుభమ్మని తెల్పె క్షేమమున్. 121

పురే కోశే జనపదే బాంధవేషు సుహృత్సు చ॥ {1.18.44}
కుశలం కౌశికో రాజ్ఞః పర్యపృచ్ఛత్ సుధార్మికః। {1.18.45}

❉ అతిథి సత్కారములను అందుకొన్న ఆ గాధినందనుడు దశరథుని ఎంతో ఆదరభావముతో చూస్తూ "ఓ మహారాజా! ఈ అయోధ్యాపురమునందు, మీ రాజ్యములోని గ్రామసీమలందు అంతా క్షేమమే కదా! పెద్దవారి విషయమున, కోశాగారము విషయమున, బంధువుల విషయమున ఎటువంటి ఇబ్బందులు లేవుకదా! అంతా శుభమే కదా! మీ మిత్రులు, ఇతర రాజులు అందఱూ ఆరోగ్యవంతులుగా ఉన్నారు కదా!" అని అంటూ కుశల ప్రశ్నలు వేసినాడు.

చం. పురమున గ్రామసీమలను పూజ్యులయందును బంధులందు శ్రీ
కరమగు కోశమందున నఖండ శుభమ్మె కదా! నృపాళియం
దరయగ మిత్రులందున ననామయమే గద" యంచు వాక్కులన్
గరమనురక్తితోఁ బలికె గాధిసుతుండు నృపాలుఁ జూచుచున్. 122

అద్య మే సఫలం జన్మ జీవితం చ సుజీవితమ్॥ {1.18.52}
శుభక్షేత్రగత శ్చాహం తవ సందర్శనాత్ ప్రభో॥ {1.18.54}
బ్రూహి యత్ ప్రార్థితం తుభ్యం కార్య మాగమనం ప్రతి।
ఇచ్ఛా మ్యనుగృహీతోఽహం త్వదర్థ పరివృద్ధయే॥ {1.18.55}

❉ బ్రహ్మర్షియైన విశ్వామిత్రుడు కుశలప్రశ్నలు వేయుచు దీవింపగా వినయశీలియైన దశరథ మహారాజు ప్రణామంచేస్తూ "ఓ మహర్షీ! మా కందఱికీ క్షేమమే. మీ రాకతో నేను భాగ్యవంతుడనైనాను. నా రాజ్యము ధన్యమైనది. దయాళువైన తమ శుభాశీస్సులతో నేను జీవనసాఫల్యమును కూడా

పొందినట్లైనది. ఓ యతిరాజా! మీ సందర్శనమే మంగళకరము. నన్ను మీ సేవకునిగా భావించి మీ రాకకు గల కారణమును దయతో తెలియజేయ ప్రార్థన. మీరు నన్ను అనుగ్రహించినట్లుగా భావించి మీరు చెప్పిన పని పూర్తిచేసి మీకు సంతోషాన్ని కలిగిస్తాను అని ఆ అయోధ్యాధిపతి విన్నవించుకొన్నాడు.

ఉ. "శ్రీయుతమూర్తి! మా కిచట క్షేమమె యెల్లరకున్, మహర్షివ
ర్యా! యిటు మీరు రాగ, మది రంజిలె, రాజ్యము శిష్టకృత్స్నమై
పోయె, మదీయ జీవితము పూర్ణఫలమ్మును బొందె, స్వామి! మా
కాయత భాగ్య మబ్బె శుభమన్న దయాళుభవద్వచస్వితన్" 123

ఉ. మా కిడె నీదు దర్శనము మంగళమున్, యతిరాజవర్య! మీ
రాకకు కారణమ్ము ననురక్తి వచించి యనుగ్రహింపుడీ,
మీ కృపగా దలంచెదను, మీ పనిఁ బూర్ణముగా నొనర్చెదన్,
మీకు ముదమ్ము గూర్చెదను, మీకడ భృత్యుడ" నంచు రాజనెన్. 124



19. యాగరక్షణకై రాముని పంపుమని విశ్వామిత్రుడు కోరుట

సదృశం రాజశార్దూల తవైతత్ భువి నాన్యథా।
మహావంశ ప్రసూతస్య వసిష్ఠ వ్యపదేశినః॥ {1.19.2}
మారీచశ్చ సుబాహుశ్చ వీర్యవంతౌ సుశిక్షితౌ॥ {1.19.5}
సమాంస రుధిరౌఘేణ వేదిం తా మభ్యవర్షతామ్। {1.19.6}

❉ వినయశీలియైన దశరథుని విన్నపాన్ని ఆలకించిన విశ్వామిత్ర మహర్షి ఆ కోసలాధిపతిని జూచి "ఓ మహారాజా! నీవు గొప్పదైన ఇక్ష్వాకు వంశమున జన్మించిన వాడివి. బ్రహ్మర్షి యైన వసిష్ఠుని సదా అనుసరించే వాడివి. ఈ సభలోనివారు మెచ్చుకొనేవిధంగా నీవు మాట్లాడినావు. నేను మనసులో అనుకొన్న పనిని నీవే పూర్తిచేయాలి. తపోభూమియైన మా సిద్ధాశ్రమంలో నేను ఒక యజ్ఞాన్ని ప్రారంభించినాను. ఆ క్రతువు ముగిసే సమయంలో మారీచుడు సుబాహువు అనే రాక్షసులు నా యాగాన్ని పాడుచేయదలచినవారై యజ్ఞకుండంలో పడేటట్లు రక్తమాంసములను జారవిడిచినారు" అని తన యజ్ఞభంగమును గూర్చి దశరథునికి వివరించినాడు.

చం. వినయముతోడ రాజటుల వేడగ, కౌశికు డిట్లు పల్కె "నో
జనవర! గొప్పవంశమున జన్మము నంది వసిష్ఠమౌనిచేఁ
బనిగొను మేటివేడ! సభవారలు మెచ్చగఁ బల్కినావు, నా
మనము దలంచినట్టి పని మానక నీవ యొనర్పగావలెన్" 125

శా. "శ్రీరమ్యమ్ము తపోవనమ్ము నగు నా సిద్ధాశ్రమమ్మందు నే
నారంభించితి నొక్క యజ్ఞమును రాజా! తత్సవాంతమ్మునన్
బారంబోసిరి రక్తమాంసముల భాస్వద్యజ్ఞకుండమ్మునన్
మారీచుండు సుబాహుడున్ దనుజు లస్మద్యాగ విధ్వంసకుల్" 126

న చ మే క్రోధ ముత్స్రష్టుం బుద్ధి ర్భవతి పార్థివ॥ {1.19.7}
కాకపక్షధరం శూరం జ్యేష్ఠం మే దాతు మర్హసి।

శక్తో హ్యేష మయా గుప్తో దివ్యేన స్వేన తేజసా॥ {1.19.9}
రాక్షసా యే వికర్తారః తేషా మపి వినాశనే। {1.19.10}

❈ ఓ దశరథ మహారాజా! ఆవిధంగా నా యజ్ఞమును భంగపఱచే మారీచ సుబాహులను తపోబలంతో నేను శపించగలను. అయితే యజ్ఞదీక్షలో ఉన్న నేను ఎవరిపైనను కోపగించుకొనరాదు. శాంతస్వభావమును కలిగియుండుటయే భావ్యమని తలచి, నీ జ్యేష్ఠపుత్రుడైన రాముని శౌర్యమును గుర్తించి వెంటనే ఆ ప్రదేశమును వదలి ఇచ్చటకు వచ్చినాను. నీ కుమారుడైన రాముడు సత్యపరాక్రముడు, నీ కులదీపకుడైన రాముడు దుష్టజనశిక్షకుడు శిష్టజనరక్షకుడు. ధర్మమూర్తియైన రాముడు నా దగ్గఱ ఉండి గొప్ప బలసంపదలతో కూడినవాడై రాక్షసులను వధించి యజ్ఞసంరక్షణ గావించగలడు" అని విశ్వామిత్ర మహర్షి రాముని తనతో పంపవలసిన అవసరాన్ని, తన రాకకు గల కారణాన్ని తెలియజేసినాడు.

చం. అటుల మదీయ యజ్ఞముఁ బ్రయత్నము భగ్నము జేయు వారికై,
పటువగు శాపవాక్కు నిడ వచ్చియు, సన్నియమానువర్తినై,
పటుతర శాంతవర్తనమె భావ్యమటంచుఁ దలంచి, వైళమే
యిట కరుదెంచినాడ గుణియించుచు నీ రఘురామ శౌర్యమున్. 127

ఉ. రాముడు శిష్టరక్షకుడు, రాముడు సత్యపరాక్రముండునౌ,
రాముడు దుష్టశిక్షకుడు, రాముడు నీ కులదీపకుండునౌ
రాముడు ధర్మవర్తనుడు, రాముడు మన్నికటానువృత్తి ను
ద్దామబలప్రమాణుడయి తాఁ బరిపూర్ణముఁజేయు నిష్టినిన్. 128

శ్రేయ శ్చాస్మై ప్రదాస్యామి బహురూపం న సంశయః॥ {1.19.10}
న చ తౌ రాఘవాదన్యో హంతు ముత్సహతే పుమాన్। {1.19.12}
అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్॥ {1.19.14}
వసిష్ఠోఽపి మహాతేజా యే చేమే తపసి స్థితాః। {1.19.15}

❋ "ఓ పంక్తిరథుడా! రాముడు తన తేజస్సుతోనే రాక్షసులను వధించగలడు. సత్కీర్తిని సదా కోరుకొనే రాముడు క్షత్రియ ధర్మమును ఆచరిస్తూ జయమును పొందగలడు. రామునికి క్షేమమును శ్రేయస్సును నేను సమకూర్చగలను. నీకు శుభం కలుగుతుంది. నీ రాముడు తప్ప వేఱొకడు ఆ రాక్షసులను వధింపలేడు. రాముని మహిమ నాకు తెలియును. అట్లే బ్రహ్మర్షి యైన ఈ వసిష్ఠునికి, తత్త్వవేత్తలైన ఈ మునులకు కూడా రాముని మహత్వము తెలియును. నీవు నీ కుమారుడు అనే మమకారంతో రాముని నాతో పంపుటకు వెనుకాడవద్దు. నా కిచ్చిన మాటను గుర్తుకు తెచ్చుకొని మేలు కలగాలని ఆశిస్తూ రాముని నాతో పంపి సత్యవంతుడవుగా విరాజిల్లుము" అని విశ్వామిత్రుడు దశరథునికి హితమును ఉపదేశించినాడు.

ఉ. రాముడె నైజతేజమున రాక్షసులన్ బరిమార్చు, సద్యశః
కాముడు క్షాత్రధర్మమునఁ గాంచు జయమ్మును, రామమూర్తికిన్
క్షేమము శ్రేయమున్ గలుగఁ జేసెదఁ, బంక్తిరథా! శుభమ్మగున్,
రాముడు దక్క వేఱొకడు రాక్షసులన్ వధియింపఁ జాలునే? 129

ఉ. రాముని నేనెఱుంగుదును, బ్రహ్మవిదుం డెఱుగున్ వసిష్ఠు, డు
ద్దామగుణైకరామపరతత్త్వ మెఱుంగుదు రీ మునీశ్వరుల్,
రాముడు నీదు పుత్రుడని రాగము నొందకు, మేలుఁ జూడు మీ
రాముని నా కొసంగుచు విరాజిలు, మిచ్చిన మాట నెంచుచున్. 130

యది తే ధర్మ లాభం చ యశశ్చ పరమం భువి॥ {1.19.15}
స్థిత మిచ్ఛసి రాజేంద్ర రామం మే దాతు మర్హసి। {1.19.16}
దశ రాత్రం హి యజ్ఞస్య రామం రాజీవలోచనమ్। {1.19.18}
తథా కురుష్వ భద్రం తే మా చ శోకే మనః కృథాః। {1.19.19}


❋ ఓ దశరథ మహారాజా! నీవు సత్కీర్తిని స్వధర్మలాభాన్ని నిజంగా కోరుకొనేట్లయితే, ఈ వసిష్ఠాది ప్రముఖుల ఆమోదంతో రఘురాముని నాతో పంపు. కోరినది ఇవ్వని రాజు అని నీగుఱించి అనుకొంటూ ఇతరులు బాధపడేటట్లు నీవు మసలుకోవద్దు.

ఎటువంటి విచారమూ లేకుండా నాతో పంపేందుకు రాముని సిద్ధం చేయి. మా ఆశ్రమంలో పదిరోజులు ఉండేటట్లుగా యజ్ఞసంరక్షణ కొఱకు రాముని పంపు" అని విశ్వామిత్రుడు తన మాటలను పూర్తిచేయగా ఆ మహర్షి మాటలు విన్న దశరథుడు తన హృదయము ముక్కలైపోయినట్లుగా బాధపడుతూ క్రుంగిపోయినాడు.

ఉ. "కోరెదవేని కీర్తుల నకుంఠితమైన స్వధర్మలాభమున్,
గూరిమితో వసిష్ఠుడునుఁ, గూడి మెలంగెడి మంత్రు లందరున్
జేరి యనుజ్ఞ నీయగను, జ్యేష్ఠసుతున్ రఘురాముఁ బంపుమా!
'కోరిన దీని రాజు' వని కొందల మందగఁ జేయఁ బోకుమా!" 131

చం. "మదిని విచార మొందక కుమారుని సిద్ధము చేయుమా, వనిన్
బదిదినముల్ వసించునటు పంపుము, కాల మతిక్రమించె, నీ
యదనున యజ్ఞమున్ సలుప నయ్యెడి" నంచును గౌశికుం డనన్,
హృదయము ముక్కలైన గతి నెంచి నృపాలుడు క్రుంగె బ్రుంగుడై. 132

[బ్రుంగుడై = బాధపడినవాడై]



20. దశరథుడు రాముని పంపజాలననుట, విశ్వామిత్రుడు కోపించుట

తచ్ఛ్రుత్వా రాజశార్దూలో విశ్వామిత్రస్య భాషితమ్।
ముహూర్త మివ నిస్సంజ్ఞః సంజ్ఞావా నిద మబ్రవీత్॥ {1.20.1}
ఊన షోడశవర్షో మే రామో రాజీవలోచనః।
న యుద్ధయోగ్యతా మస్య పశ్యామి సహ రాక్షసైః॥ {1.20.2}

❋ "ఓ సూర్యవంశపు రాజా! దశరథా! ఇచ్చిన మాటను నీవు వమ్ము చేయకుండా సంతోషంగా రాముని నాతో పంపు" అని విశ్వామిత్రుడు పలుకగా ఆ మాటలు కర్ణకఠోరములై బాధపెట్టగా దశరథుడు మూర్ఛపోయాడు.

కొద్ది క్షణములలోనే తేరుకొన్న దశరథుడు విశ్వామిత్రుని చూచి "ఓ మహర్షీ! మా రాముడు చిన్న పిల్లవాడు. కమలములవంటి కన్నులు గలవాడు. రామునికి ఇంకా పదహారు సంవత్సరాల వయసుకూడా రాలేదు. రాముడు ఇంతవరకూ యుద్ధము అనే మాటను కూడా వినలేదు. అడవిలో ఎన్నడూ నివసించనూ లేదు. పసిబిడ్డయైన మా రాముడు భయంకరులైన ఆ నిశాచరులను ఎలా ఎదిరించగలడు? ఎలా చంపగలడు?" అని ప్రశ్నించాడు.

శా. "వమ్మున్ జేయకు నీదు మాటలనె భూపా! సూర్యవంశాగ్రణీ!
సమ్మోదమ్మున రాముఁ బంపు" మను విశ్వామిత్ర మౌనీంద్రు వా
క్యమ్ముల్ కర్ణకఠోరమౌచు సలుపంగా మూర్ఛలో మున్గుచున్
నెమ్మిన్ పంక్తిరథుండు తేరుకొని మౌనిన్ జూచి తా నిట్లనెన్. 133

[సలుపంగా = బాధపెట్టగా]

శా. "రాముం డెన్నగ చిన్నిబిడ్డడు సుమీ! రాజీవనేత్రుండు, కా
డా? మౌనీ! పదునాఱు వర్షములు నిండన్ లేదు, సంగ్రామమన్
నామంబున్ వినలేదు, బాలకుడు కాననన్ జూడనే లేదు, త
ద్భీమోద్దామ నిశాచరావళి నెటుల్ వేధించి భేదించెడిన్?" 134

ఇయ మక్షౌహిణీ పూర్ణా యస్యాహం పతి రీశ్వరః।
అనయా సంవృతో గత్వా యోద్ధాఽహం తై ర్నిశాచరైః॥ {1.20.3}
నిర్విఘ్నా వ్రతచర్యా సా భవిష్యతి సురక్షితా।
అహం తత్రాగమిష్యామి న రామం నేతు మర్హసి॥ {1.20.6}

❋ "ఓ విశ్వామిత్ర మహర్షీ! నా దగ్గఱ అక్షౌహిణుల కొలది సైన్యం ఉన్నది. వీరులు శూరులు ఐన నా సైనికులు ధనుర్బాణములను ధరించి ఆ దైత్యులను వధించగలరు. నేను కూడా వచ్చి, ఆయుధధారినై ఆ మారీచ సుబాహువుల ప్రాణములను తీయగలను. రాముని మీతో తీసికొని వెళ్తాననడం యుక్తము కాదు. అంకితభావంతో ఉండే నా కుమారుడైన రాముడు విల్లును పట్టుకొన్నది నిన్ననో మొన్ననో. రామునికి అడవి గుఱించి తెలియదు. దైత్యులు ఎప్పుడు ఎక్కడ ఎలా సంచరిస్తారో కూడా తెలియదు. యజ్ఞసంరక్షణ కొరకు రామునికి బదులుగా మీతో నేను వస్తాను. రాముని పంపు అనే మాటను దయచేసి ఇక అనవద్దు. ఆ మాటను వదలివేయండి" అని దశరథుడు ఆ గాధినందనునికి విన్నవించుకొన్నాడు.

మ. అధికమ్మౌ బలరాశి యున్నదిట నా కక్షౌహిణీ పూర్ణమై,
సధనుర్బాణులు శూరులున్ గలరు భాస్వద్వీర్యులున్ దైత్యులన్
వధియింపన్ గలవారు; వచ్చెదను దత్ప్రాణమ్ములన్ దీయ, నా
యుధమున్ బట్టెద; రాము దోడ్కొని చనన్ యుక్తంబొకో కౌశికా! 135

ఉ. పేరిడి నా కుమారకుడు వింటిని నిన్ననొ మొన్నొ పట్టెఁ, గాం
తారమెఱుంగ డెన్నడును, నమ్ము, మెఱుంగడు దైత్యకోటి సం
చారము, వానికిన్ బదులు చక్కగ యజ్ఞముఁ బూర్తిఁ జేయగా,
వీరుడ నేనె వత్తు, నిక వీడుము రాముని మాట గాధిజా!" 136

[పేరిడి = అంకితభావంతో పనిచేయువాడు]

విప్రయుక్తో హి రామేణ ముహూర్త మపి నోత్సహే॥ {1.20.8}
జీవితుం ముని శార్దూల న రామం నేతు మర్హసి। {1.20.9}

షష్టి ర్వర్షసహస్రాణి మమ జాతస్య కౌశిక॥ {1.20.10}
దుఃఖే నోత్పాదిత శ్చాయం న రామం నేతు మర్హసి। {1.20.11}

❊ ఓ విశ్వామిత్ర మహర్షీ! నా ముద్దులపట్టియైన రాముడు అమాయకుడు. రాక్షసుల మాయలను తెలిసికొనలేడు. రాముడు నాకు దూరమైతే నా ప్రాణాలు కూడా నాకు దూరమౌతాయి. చతురంగ బలములతో నేను రామునితో పాటు వస్తాను. మీ యజ్ఞదీక్ష తప్పక ఫలిస్తుంది. నా రాముని ఒంటరిగా మాత్రం పంపలేను. పుత్రసంతానం కొఱకు తపించి అరవైవేల సంవత్సరాల తరువాత నలుగురు కుమారులను పొంది ధన్యజీవి నయ్యాను. వారిలో సుగుణాభిరాముడుగా ఉన్న రాముడు నాకు ఎంతో ప్రీతిపాత్రుడు. నాపై కరుణ చూపకుండా రాక్షసవధకొఱకు నా రాముణ్ణి అడగడం మీకు భావ్యమేనా? నాకు ప్రాణంతో సమానమైన రాముని మీతో పంపలేను. దయచేసి మన్నించండి" అని దశరథుడు ఆ కౌశికుని వేడుకొనసాగినాడు.

ఉ. "రాము డమాయకుండు, ఘన రాక్షసమాయ నెఱుంగలేడు, గా
రాముల పట్టి, తాను చనఁ బ్రాణము లన్నియుఁ బోవు నాకు, నే
రామునితోడ వత్తు ననురక్త బలంబులతోడ, వేగ నీ
నేమము సత్ఫలమ్ము నిడు, నిక్కము రామునిఁ బంప నొక్కనిన్" 137

చం. "అరువదివేల వర్షము లహర్నిశమున్ దపియించినా ననం
తర మిటు పుత్రులన్ బడసి ధన్యుడ నైతిని, వారిలోన సం
బరమునుఁ బ్రీతిఁ గూర్చు గుణవంతుడు రాముడు నాకుఁ బ్రాణమౌ,
కరుణను వీడి రాము నడుగన్ జనునే దనుజాళిఁ దున్మగన్?" 138

కిం వీర్యాః రాక్షసా స్తే చ కస్య పుత్రాశ్చ కే చ తే॥ {1.20.12}
కథం ప్రమాణాః కే చైతాన్ రక్షంతి మునిపుంగవ। {1.20.13}
పౌలస్త్య వంశ ప్రభవో రావణో నామ రాక్షసః। {1.20.16}
తేన సంచోదితౌ ద్వౌ తు రాక్షసౌ సుమహాబలౌ। {1.20.19}

❊ ఓ విశ్వామిత్ర బ్రహ్మర్షీ! మీ యజ్ఞమును భగ్నంచేస్తూ ఉన్న ఆ మారీచ సుబాహువుల బలము ఎటువంటిది? వారు ఎవరి కుమారులు? ఏ పరిమాణంలో ఉంటారు? ఆ రాక్షసులకు నాయకుడెవరు? వాళ్లను చంపడం ఎలాగ? త్వరగా చెప్పండి అని దశరథుడు దీనంగా వేడుకొంటూ ఉండగా ఆ కౌశికుడు "ఓ పంక్తిరథా! శ్రద్ధగా విను. పులస్త్య బ్రహ్మ వంశమునకు చెందిన విశ్రవసుడు అనే మునియొక్క కుమారుడే రావణాసురుడు. కుబేరునికి సోదరుడైన ఆ రావణుడు తపస్సుచేసి బ్రహ్మనుండి వరములను పొంది రాక్షసబృందాలతో కలిసి అన్నిలోకాలనూ పీడిస్తూ ఉంటాడు. ఆ రావణుని ప్రేరణతోనే మారీచ సుబాహులనే రాక్షసులు నా యజ్ఞమును భగ్నం చేస్తూ ఉన్నారు అని ఆ దైత్యుల గుఱించి వివరించాడు.

మ. "క్రతువున్ భగ్నము సేయు రాక్షసుల వీర్య మ్మెట్టి? దెవ్వారికిన్
సుతులో వారు? ప్రమాణ మెట్టిదియొ? రక్షోనాథు డెవ్వండొ? యే
గతి వారిన్ దునుమాడ వీలగునొ? వేగన్ దెల్పు బ్రహ్మర్షి!" యం
చతి దీనమ్ముగ వేడుచుండ మునిరా జా రాజుతో నిట్లనెన్. 139

సీ. "పౌలస్త్య వంశ సంభవుడు విశ్రవసుడన్
మునికిని పుత్రుం డమోఘబలుడు
నా కుబేరుని భ్రాతయౌ రావణాసురు
డవని విఖ్యాతుండు నసమబలుడు
బ్రహ్మదత్తవరాల బహుగర్వియై మూడు
లోకాల పీడించి శోక మొసగు
బలశాలులును వీర్యవంతులౌ రాక్షస
బృందాలతో సదా పేర్మి నుండు
తే.గీ. నతని ప్రేరణ మారీచు డనెడి దనుజు
డతని సయిదోడట సుబాహువనెడివాడు
వరుస మద్యజ్ఞభంగమున్ జరుపువారు
ప్రథిత దైత్యులు దశరథరాజవర్య!" 140

న హి శక్తోఽస్మి సంగ్రామే స్థాతుం తస్య దురాత్మనః॥ {1.20.20}
స త్వం ప్రసాదం ధర్మజ్ఞ కురుష్వ మమ పుత్రకే। {1.20.21}
దేవదానవగంధర్వాః యక్షాః పతగపన్నగాః।
న శక్తా రావణం సోఢుం కిం పున ర్మానవా యుధి॥ {1.20.22}

❋ 'మారీచ సుబాహులు రావణాసురునిచే పంపబడినవారు' అని వినిన దశరథుడు ఆందోళనకు గుఱియై "ఓ విశ్వామిత్ర మహర్షీ! 'రావణ' అనే పేరును వినగానే నేను భయముతో తేజస్సును శక్తిని కోల్పోతాను. ఇక యుద్ధమెట్లా చేయగలను? దేవతలు దానవులు గంధర్వులు మొదలైనవారు ఆ రావణునితో యుద్ధం చేయాలని కలలో కూడా అనుకోరు. అటువంటప్పుడు ఒక మానవుడు ఎలా యుద్ధం చేస్తాడు? నేను చతురంగ బలములతో ఉన్నప్పటికినీ ఆ రావణుని గెలువలేను. ఓ కల్యాణ సంధాయకా! మాకు గురువు దైవము నీవే సుమా! నన్ను నా రాముని దయతో చూడు" అని విన్నవించుకొనసాగినాడు.

మ. అని యా కౌశికు డట్లనంగ విని తేడాందోళనన్ బల్కె భీ
తినిఁ "దద్రావణ నామమున్ వినగనే తేజమ్ముఁ గోల్పోదు, నే
ననిలోఁ బోరగ శక్తిహీనుడ, మహాత్మా! నన్ను నా రామునిన్
గనుమా సత్కృప, దైవ మీవె, ప్రణతుల్ కల్యాణసంధాయకా! 141

మ. కలలో నైనను రావణాసురునితోఁ గయ్యమ్ము సేయన్ మదిన్
దలపన్ నేరరు దేవదానవులు గంధర్వాదులున్, సంయమీ!
యిలలో నున్నటువంటి మానవుడు దా నే తీఱునన్ బోరెడిన్?
బలమున్ గైకొనియైన రావణుని గెల్వంజాల మన్నింపుమా! 142

అథ కాలోపమౌ యుద్ధే సుతౌ సుందోపసుందయోః {1.20.25}
యజ్ఞ విఘ్న కరౌ తౌ తే నైవ దాస్యామి పుత్రకమ్ {1.20.26}
పూర్వ మర్థం ప్రతిశ్రుత్య ప్రతిజ్ఞాం హాతు మిచ్ఛసి।
రాఘవాణా మయుక్తోఽయం కుల స్యాస్య విపర్యయః॥ {1.21.2}

❋ *"ఓ విశ్వామిత్ర మహర్షీ! నా రాముడు సుకుమారగాత్రుడు. యుద్ధాన్ని గుఱించి తెలియనివాడు. సుందోపసుందుల కుమారులైన ఆ రాక్షసులేమో మాయా యుద్ధవిశారదులు. మహాబలవంతులు. కాబట్టి నా రాముని మీతో పంపజాలను" అని దశరథుడు పుత్రప్రేమ కారణంగా తన వాగ్దానము భంగమయ్యేవిధంగా మాట్లాడగా ఆ రాజును చూచి "ఓ రాజా! నేను కోరింది ఇస్తానని ఇంతకుముందే చెప్పినావు. ఇప్పుడు ఇవ్వలేను అని ఇలా మాట్లాడటం నీకు తగునా? నీవు సూర్యవంశకుపతివి. గూఢప్రియంభావుకుడవు అని నేను భావిస్తూ ఉన్నాను అని కౌశికుడు నర్మగర్భంగా మాట్లాడినాడు.*

మ. లలితుం డాజి నెఱుంగ డా రఘుకులశ్లాఘ్యుండు, తద్దైత్యులో
సులభుల్ గా రని గెల్వగా, మొఱకులున్ సుందోపసుందాత్మజుల్
విలసద్వీర్యులు, శిక్షితుల్ కలన, భావింపంగ మాయాచణుల్,
బలసంపన్నులు గాన మౌనివర! పంపంజాల నా పుత్రకున్" 143

మ. తన వాగ్దానము భంగమౌనటులఁ బుత్రప్రేమతో మాట త
ప్పిన రాజున్ గని మౌని యిట్లనియె "నీవే వాంఛిత మ్మిత్తు నీ
కని నా విప్పుడు పల్కుచుంటి విటు లీయంజాల నం చిట్లు వా
కొనగాఁ జెల్లునె? సూర్యవంశకుపతీ! గూఢప్రియంభావుకా! 144



21. వసిష్ఠుడు దశరథునికి నచ్చజెప్పుట

యదీదం తే క్షమం రాజన్ గమిష్యామి యథాగతమ్।
మిథ్యాప్రతిజ్ఞః కాకుత్స్థ సుఖీ భవ సబాంధవః॥ {1.21.3}
ఇక్ష్వాకూణాం కులే జాతః సాక్షా ద్ధర్మ ఇవాపరః।
ధృతిమాన్ సువ్రతః శ్రీమాన్ న ధర్మం హాతు మర్హసి॥ {1.21.6}

❋ "ఓ దశరథా! ఇచ్చిన మాటను తప్పుతున్నాను కదా అని సిగ్గుపడకుండా రాముని పంపను అనడమే యుక్తమని పలుకుతూ ఉన్నావు కదా! సరే! నేను ఎలా వచ్చినానో అలాగే వెళ్లిపోతాను. నీవు నీ సంపదలతో బంధువులతో ఇలాగే సుఖంగా ఉండు" అని విశ్వామిత్రుడు కోపముతో మాట్లాడుతూ ఉండగా, భూమండలమంతా అదిరినట్లు అయ్యింది. 'అయ్యో!' అని శోకిస్తూ దేవతా సమూహమంతా బెదరినట్లు అయ్యింది.

ఆ సమయంలో పురోహితుడు కులగురువు అగు వసిష్ఠుడు పంక్తిరథుని చూచి ఓ మహారాజా! నీవు ఇక్ష్వాకు వంశతిలకుడవుగా జన్మించినవాడివి. ధర్మస్వరూపుడవుగా కీర్తిని పొందినవాడివి. సత్యవ్రతంతో విరాజిల్లే చక్రవర్తివి. పుత్రవ్యామోహానికి గుఱియై ప్రాపంచిక సుఖములకు బానిసయై ఇలా మాట్లాడవచ్చునా? నీవు ఆడి తప్పుతావా? అని సున్నితంగా ప్రశ్నిస్తూ హితబోధ చేయసాగినాడు.

మ. "ఇదియే యుక్త మటంచుఁ బల్కితివి పో ప్రీహేతువాక్యమ్ము, నే
నిదె నా వచ్చిన త్రోవఁ బోయెదను నీ విట్లే సుఖమ్ముండు సం
పదలన్ బంధులఁ గూడి" యంచు ముని కోపమ్మంద, భూమండలం
బదరెన్, నిర్జరవర్గ మెల్ల బెదరెన్ హా యంచు శోకిల్లుచున్. 145

మ. "ఇలలో ధర్మమె నీ స్వరూప మనగా నిక్ష్వాకువంశాధిరా
ట్తిలకమ్మో యన జన్మ మంది, ఘనకీర్తిన్ గాంచి, సత్యవ్రత
మ్ముల రాజిల్లెడి భూపతీ! దశరథా! మోహమ్ముతో నీ గతిన్
బలుకం బోలునె? యాడి తప్పఁ దగునే ప్రాపంచిక ప్రీతిమై. 146

సంశ్రుత్యైవం కరిష్యామీ త్యకుర్వాణస్య రాఘవ।
ఇష్టాపూర్త వధో భూయాత్ తస్మాద్రామం విసర్జయ॥ {1.21.8}
కృతాస్త్ర మకృతాస్త్రం వా నైనం శక్ష్యంతి రాక్షసాః।
గుప్తం కుశికపుత్రేణ జ్వలనేనామృతం యథా॥ {1.21.9}

❈ "ఓ దశరథ మహారాజా! ఇష్టంగా ఈ పని చేసిపెడతాను అని మాట చెప్పి, దానివలన నష్టం కలుగుతుందని ఆ పని చేయకుండా ఉండే వాడు నీచుడు అని పిలువబడతాడు. మాట తప్పినవానికి తాను చేసిన ఇష్టాపూర్తి అనే యజ్ఞముయొక్క ఫలము కూడా వృధా అవుతుంది. కాబట్టి నీవు ఇచ్చిన మాటకు కట్టుబడి రాముని ఈ కౌశికునికి అప్పగించు. నీకు సుఖమే కలుగుతుంది. రామునికి ఏ కష్టమూ కలుగదు. ఈ విశ్వామిత్రుడు విశ్వమున కంతటికీ మిత్రుడు. కల్యాణకారకుడు. సర్వశస్త్రాస్త్రకోవిదుడు. ఈ బ్రహ్మర్షి సంరక్షణలో ఎవ్వరికినీ ఎటువంటి కష్టములు ఉండబోవు. నీ తనయుడైన రాముడు శస్త్రాస్త్ర విద్యలను నేర్చినవాడైనా నేర్వనివాడైనా ఆ రాక్షసులకు భయపడవలసిన అవసరం ఉండదు. నా మాట విని నీ రాముని ఈ మహాత్మునితో పంపించు" అని పురోహితుడైన వసిష్ఠుడు పంక్తిరథునికి హితోపదేశం చేయసాగినాడు.

శా. ఇష్ట మ్మీ పనిఁ జేయువాడనని సంతృప్తిన్ గృపన్ బల్కి యున్
నష్ట మ్మౌనని చేయకుండు నరు డెన్నన్ నీచుడౌ, వానిదౌ
యిష్టాపూర్తి ఫలమ్ము వమ్మగును; రాజేంద్రా! సుఖమ్మబ్బు నే
కష్టంబుండదు రాము నిమ్ము యతికిన్ గల్యాణసంపత్తికై. 147

ఉ. ఈతడు విశ్వమిత్రుడు మునీశుడు సర్వవిధాస్త్రకోవిదుం
డీతని రక్షణన్ గనిన నేరికి కష్టము లుండబో, వికన్
నీ తనయుండు నస్త్రముల నేర్చిన నేర్వకయున్న రాక్షస
వ్రాతము భీతిహేతువని పల్కగఁ జెల్లదు రాముఁ బంపుమా. 148

తేషాం నిగ్రహణే శక్తః స్వయం చ కుశికాత్మజః।
తవ పుత్రహితార్థాయ త్వాముపే త్యాభియాచతే॥ {1.21.20}

తథా వసిష్ఠే బ్రువతి రాజా దశరథ స్స్వతమ్।
ప్రహృష్ట వదనో రామమ్ ఆజుహావ సలక్ష్మణమ్॥ {1.22.1}

❊ చింతాక్రాంతుడై ఉన్న రాజును ఓదార్చుతూ "ఓ దశరథా! సిద్ధార్థుడైన ఈ విశ్వామిత్రుని చెంతకు సకల శస్త్రాస్త్రములు సమూహములుగా వచ్చి చేరియున్నవి. బ్రహ్మర్షి యైన ఈతడు ఆ మారీచసుబాహువులను అవలీలగా నిగ్రహింపగలడు. అయినప్పటికినీ నీకు ప్రియమును చేయగోరి ఈ ముని రాముని తనతో పంపమని అడుగుచున్నాడు. నీ మనసులో ఉన్న సందేహాన్ని వదలివేసి ఈ మహాత్మునికి రాముని సమర్పించు. నీ రామునికి మేలే జరుగుతుంది" అని కులగురువైన వసిష్ఠుడు హితమును ఉపదేశించగా దశరథుడు అందులకు సంతోషంతో సమ్మతించి వెంటనే రామలక్ష్మణులను పిలిపించినాడు. వారు రాగానే తండ్రియైన దశరథుడు తల్లులు గురువులు ఆ రామలక్ష్మణులకు శ్రేయస్సు కలగాలని మనసారా దీవించినారు.

శా. "చేరెన్ శస్త్రము లస్త్రముల్ గములుగా సిద్ధార్థుడౌ యీతనిన్,
మారీచాదుల నిగ్రహింప గలడీ మౌనీంద్రు, డైనన్ గృపన్
నీ రామున్ దనతోడఁ బంపుమనియెన్ నీ శ్రేయమున్ గోరువా
డై, రాజా! మది సంశయమ్ము నిను వీడన్ రాము నర్పించుమా!" 149

మ. అని బ్రహ్మర్షి వసిష్ఠు డా విభుని చింతాక్రాంతు నోదార్చి రా
మునిఁ బంపించుట మేలనంగ, నృపు డామోదించుచున్ వైళమే
తన యాత్మీయుల రామలక్ష్మణులఁ జేతఃప్రీతిఁ బిల్పించె, వా
రిని దీవించిరి తండ్రి తల్లులు గురుల్ శ్రేయమ్ము సంధిల్లగన్. 150



22. దశరథుడు రామలక్ష్మణులను విశ్వామిత్రునితో పంపుట బల అతిబల విద్యల ఉపదేశము

స పుత్రం మూర్ధ్న్యుపాఘ్రాయ రాజా దశరథః ప్రియమ్।
దదౌ కుశికపుత్రాయ సుప్రీతే నాంతరాత్మనా॥ {1.22.3}
విశ్వామిత్రో యయా వగ్రే తతో రామో ధనుర్ధరః।
కాకపక్షధరో ధన్వీ తం చ సౌమిత్రి రన్వగాత్॥ {1.22.6}

❈ దశరథ చక్రవర్తి స్థిరమైన చిత్తవృత్తి కలవాడై తనకు అత్యంత ప్రియమైన కుమారుడగు రాముని ప్రేమతో దగ్గరకు తీసికొని, శిరస్సును మూర్కొని, మహాత్ముడైన కౌశికునికి అప్పగించినాడు. రాముడు ఆ విధంగా విశ్వామిత్ర మహర్షితో కూడిన సమయాన రాబోయే శుభములను తెలియజేస్తూ గాలి మెల్లగా చల్లగా వీచింది. ఆకాశంనుండి పుష్పవృష్టి కురిసింది. దేవదుందుభులు మ్రోగినవి. శంఖములు భాంకారములతో శబ్దించినవి. ముందుగా విశ్వామిత్రుడు, ఆ ముని వెనుక రాముడు, రాముని వెనుక లక్ష్మణుడు వరుసగా బయలుదేరి వెళ్తూ కొండలు కోనలు ఉండే కాననసీమల వైపుగా తమ ప్రయాణాన్ని మొదలుపెట్టినారు.

ఉ. ప్రేమ చెలంగ భావమునఁ బ్రీతిమెయిన్ స్థిరచిత్తవృత్తియై
రాము శిరమ్ము మూర్కొనుచు రాజొసగెన్ సుతు మౌని, కంతటన్
శ్రీమహితమ్ముగాఁ బ్రకృతి సేవలఁ జేయగ సిద్ధమై శుభా
గామితఁ దెల్ప నాశుగతి గాలియు వెన్నె మందగామియై. 151

చం. కురిసెఁ బ్రసూనవృష్టి మునిఁ గూడిన రామునిఁ జూచి, దుందుభుల్
వరుసగ మ్రోసె, శంఖములు భాంకృతులన్ నినదించె, ముందుగా
వరముని, వెన్క రాఘవుడు, వారల వెన్బడి లక్ష్మణుండు సా
గిరి గిరికాననవ్రతతికిన్ మరియాదల గౌరవించుచున్. 152

అనుజగ్మతు రక్షుద్రౌ పితామహ మివాశ్వినౌ।
తదా కుశికపుత్రం తు ధనుష్పాణీ స్వలంకృతౌ॥ {1.22.8}
కుమారౌ చారువపుషౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ॥ {1.22.9}
అనుయాతౌ శ్రియా దీప్త్యా శోభయేతా మనిందితౌ। {1.22.10}

❋ విశ్వామిత్ర మహర్షి వెంట వెళ్తూ ఉన్న ఆ రామలక్ష్మణులు కొద్దిపాటి జుట్టు కలవారై తమ శరీరకాంతులతో ప్రకాశిస్తూ ఉన్నారు. సౌందర్యంలో మన్మథుని వలె ఉన్నారు. బ్రహ్మదేవుని వెంట వెళ్లే దేవతలలో అశ్వినీకుమారులవలె ఉన్నారు. ఆ బాలురు ఆభరణములతో విరాజిల్లుతూ ఉన్నారు. ధనుర్బాణములను తూణీరములను ఖడ్గములను హస్తకవచములను ధరించిన ఆ రాకుమారులు ఆర్తత్రాణ పారీణులు. గురుభక్తి గలవారైన ఆ అన్నదమ్ములిద్దఱూ కౌశికుని అనుసరిస్తూ ముందుకు సాగుతున్నారు.

మ. తనువుల్ వెల్గఁ గాకపక్షముల నార్తత్రాణ పారీణులున్
ఘనతూణీర ధను ర్విరాజితులు సౌందర్యమ్మునన్ మారులో
యన, లోకేశుని వెంట నేగు సురలం దా యశ్వినీపుత్ర భా
వనఁ గల్గించుచు రామలక్ష్మణులు విశ్వామిత్రుతో నేగెడిన్. 153

కం. బాలు రలంకరణమ్ములు
గ్రాలన్ మేలైన హస్తకవచము లమరన్
హేలన్ ఖడ్గము లొలయన్
లీలన్ గుశికాత్ము ననుసరించిరి భక్తిన్. 154

అధ్యర్ధయోజనం గత్వా సరయ్వా దక్షిణే తటే।
రామేతి మధురాం వాణీం విశ్వామిత్రోఽభ్యభాషత॥ {1.22.11}
మంత్రగ్రామం గృహాణ త్వం బలా మతిబలాం తథా॥ {1.22.12}
క్షుత్పిపాసే న తే రామ భవిష్యేతే నరోత్తమ। {1.22.17}

❋ విశ్వామిత్ర మహర్షి వెంట రామలక్ష్మణులు ఒకటిన్నర యోజనం దూరము వెళ్లినవారై, సరయూ నదిని చేరుకొన్నారు. ఆ నదీతీరంలో కౌశికుడు రాముని

ఎంతో ప్రేమతో చూస్తూ, రామా! అని నోరారా పిలుస్తూ ఇలా అన్నాడు. అన్ని విద్యలలో బల అతిబల అనే విద్యలు ఎంతో శ్రేష్ఠమైనవి. వీటిని గ్రహిస్తే శ్రమ అనేది ఉండదు. ఎప్పుడునూ జ్వరము రాదు. మనసు సంతోషంగా ఉంటుంది. రాక్షసులవలన భయము ఉండదు. ఇక ఆకలి దప్పిక అనేవి ఉండనే ఉండవు. నీవు ఈ విద్యలను గ్రహించు. ఈ భూమి మీద నీకంటే గొప్పవాడు లక్ష్మీవంతుడు మఱొకడు ఉండనే ఉండదు" అని బల అతిబల అనే విద్యలను గుఱించి వివరించసాగినాడు.

తే.గీ. ఓర్మిఁ జని రొకటిన్నర యోజనమును
జేరి రదె సరయూ నదీ తీరమునకు
నంత మౌని విశ్వామిత్రు డనియె నిట్లు
రాముఁ గనుగొని నోరారఁ బ్రేమ మీఱ. 155

మ. తలపన్ శ్రేష్ఠము లీ బలాతిబల విద్యల్, వీని గొన్నన్ శ్రమా
దులు లేకుండు, జ్వరమ్ము రాదెపుడు, సంతోషమ్ము సంధిల్లు, దై
త్యులు భీతిన్ గలిగింపఁ జాల, రిక క్షుత్తున్ దప్పియున్ గల్గ, వీ
యిల నీ సాటి యొకండు గల్గునె రమాహేలా సమారాధ్యుడై. 156

పితామహసుతే హ్యేతే విద్యే తేజ స్సమన్వితే॥ {1.22.18}
ప్రదాతుం తవ కాకుత్స్థ సదృశ స్త్వం హి ధార్మిక। {1.22.19}
తతో రామో జలం స్పృష్ట్వా ప్రహృష్టవదన శ్శుచిః॥ {1.22.20}
ప్రతిజగ్రాహ తే విద్యే మహర్షే ర్భావితాత్మనః। {1.22.21}

⋆ "కాకుత్స్థవంశప్రభువైన ఓ రామా! శుచివై ఆచమనాదులు చేసేందుకు జలం తీసికో. బల అతిబల అనే యీ మహావిద్యలను స్వీకరించు. ఇవి బ్రహ్మదేవుని కుమార్తెలు. ఈ విద్యలను ఉపాసించినట్లైతే యోగము, కల్యాణము, బుద్ధిసంపద, సౌఖ్యము, ముల్లోకములలో కీర్తి మొదలైన సత్ఫలితాలు సిద్ధిస్తాయి" అని విశ్వామిత్రముని పలుకగా రఘురాముడు అట్లే అని ఆచమనం

పూర్తిచేసి సంతోషంతో బల అతిబల అనే ఆ విద్యలను స్వీకరించి పావనుడై సూర్యభగవానుని తేజస్సుతో వెలిగిపోతూ ఉన్నవాడై, శిరస్సు వంచి మునిపాదములకు భక్తితో నమస్కరించినాడు.

మ. "కొనుమా నీవు జలమ్ము, భక్తిమెయిఁ గైకొమ్మా మహావిద్యలన్,
వినుమా యియ్యవి బ్రహ్మకాత్మజలు సేవింపన్ మహాయోగమౌ
ఘన కల్యాణము బుద్ధిసంపదయు సౌఖ్యమ్మబ్బు, సత్కీర్తులన్
గనుమా నిత్యము మూడులోకములలోఁ గాకుత్స్థ వంశప్రభూ!" 157

చం. అని కుశికాత్మజుం డనగ నాచమన మ్మొనరించి, సంతస
మ్మున రఘురామమూర్తి పరిపూర్ణత వానిఁ బరిగ్రహించి, పా
వనుడయి, దివ్య సూర్యభగవానుని తేజమునంది వెల్గుచున్,
మునిపదసీమ మస్తకము మోడ్చి నమస్కృతిఁ జేసె మన్ననన్. 158


గురుకార్యాణి సర్వాణి నియుజ్య కుశికాత్మజే॥ {1.22.22}
ఊషు స్తాం రజనీం తత్ర సరయ్వాం సుసుఖం త్రయః। {1.22.23}
ప్రభాతాయాం తు శర్వర్యాం విశ్వామిత్రో మహామునిః।
అభ్యభాషత కాకుత్స్థౌ శయానౌ పర్ణసంస్తరే {1.23.1}

❋ సరయూనదియొక్క దక్షిణతీరంలో రామునికి బల అతిబల అనే విద్యలను ఉపదేశించిన తరువాత రాత్రి సమయాన విశ్వామిత్ర మహర్షి దర్భశయ్యపై నిద్రించినాడు. గురువునకు అవసరమైన సేవలు పూర్తిచేసిన రామలక్ష్మణులు రాజకుమారులైనప్పటికినీ, తాము తల్పంపైన పరుండినట్లే భావిస్తూ, ఆ నదీతీరంలో నేలపైన పచ్చికపై పరుండినారు. జగద్రక్షణ కార్యదక్షులైన రాజులు మునిరాజులు ఏ తేడా లేకుండా సమభావంతో మెలగడం సహజమే కదా!

రాత్రి గడిచింది. తెల్లవాఱింది. మహర్షి వేకువనే నిద్రలేచి పర్ణశయ్యపై పరుండియున్న రామలక్ష్మణులను ఎంతో ప్రేమతో చూస్తూ నిద్రనుండి మేల్కొల్పాలని భావించి, రామునితో ఇలా అంటూ ఉన్నాడు.

మ. సరయూ దక్షిణతీరభూమి మునిరాజన్యుండు నిద్రింప, నా
ధరణిన్ రాముడు లక్ష్మణుండు యువనేతల్ గూడ నిద్రించి రం
తరమే లేక తృణమ్ముపై సుఖముగాఁ దల్పమ్ముపై నున్న మా
దిరి, రాజుల్ మునిరాజులున్ సమగతుల్ దీర్పన్ జగద్రక్షణన్. **159**

మ. గడిచెన్ రాతిరి, తెల్లవాఱినది, వేగన్ మేల్కొనెన్ సంయమీ
శుడు, పర్ణమ్ములపైఁ దృణమ్ముల పయిన్ శుద్ధాత్ములై కూర్కు రా
ముడు నా లక్ష్మణుడున్ గనంబడగ రామున్ బ్రేమతోఁ జూచుచున్
వడి లేపందగుఁ గాదె యంచు ముని సంభావించి తా నిట్లనెన్. **160**



23. రామలక్ష్మణులతో విశ్వామిత్రుడు కామాశ్రమమున విశ్రమించుట

కౌసల్యాసుప్రజా రామ పూర్వా సంధ్యా ప్రవర్తతే।
ఉత్తిష్ఠ నరశార్దూల కర్తవ్యం దైవమాహ్నికమ్॥ {1.23.2}
తస్యర్షేః పరమోదారం వచః శ్రుత్వా నృపాత్మజౌ।
స్నాత్వా కృతోదకౌ వీరౌ జేపతుః పరమం జపమ్॥ {1.23.3}

❃ నిద్రించుచుండిన రాముని మేల్కొలుపదలచిన విశ్వామిత్ర మహర్షి రాముని సమీపించి "ఎవరిని కనుటచే కౌసల్య సుప్రజ యైనదో అట్టి రామా! సుందర గుణధామా! ఓ నరశార్దూలా! పూర్వ సంధ్యాసమయం ఆసన్నమైనది. దేవతాకార్యమైన సంధ్యావందనమును చేయాలి కదా! ఇక లెమ్ము" అని అనగానే రామలక్ష్మణు లిద్దఱూ నిద్రలేచి, సరయూనదిలో స్నానం చేసి, సూర్యభగవానునికి అర్ఘ్యప్రదానం చేసి, మంత్రజపం చేసి, సంధ్యావందనం పూర్తిచేసి, గురువుగారిని సేవించసాగినారు.

కం. కౌసల్యాసుప్రజ! రా
మా! సుందర! పూర్వ సంధ్య యమరె, నృశార్దూ
లా! సుమతీ! దైవికమున్
భాసుర మాహ్నికముఁ జేయ వలె నిక లెమ్మా! 161

మ. పరమోదారముగా మునీశ్వరు డటుల్ వల్కంగనే లేచి, యా
నరపాలాత్మజు లిద్ద, ఱేగి తటినీస్నానమ్ములన్ బూర్తి సే
సిరి, యర్ఘ్యమ్మిడినారు, సూర్యుఁ గని యర్చింపంగ భక్తిన్ జపిం
చిరి మంత్రమ్మును, జేసి రాహ్నికములన్, సేవించి రా కౌశికున్. 162

తౌ ప్రయాతౌ మహావీర్యౌ దివ్యాం త్రిపథగాం నదీమ్।
దదృశాతే తతస్తత్ర సరయ్వాః సంగమే శుభే॥ {1.23.5}
కస్యాయ మాశ్రమః పుణ్యః కో న్వస్మిన్ వసతే పుమాన్।
భగవన్ శ్రోతు మిచ్ఛావః పరం కౌతూహలం హి నౌ॥ {1.23.8}

❇ విశ్వామిత్ర ముని వెంట వెళ్తూ ఉండిన రామలక్ష్మణులు సరయూనది గంగానది ఒకటిగా కలిసి ప్రవహించే సంగమ ప్రదేశానికి చేరుకొన్నారు. అక్కడ తపోభూమిగా ఉన్న ఒక ఆశ్రమాన్ని చూచినారు. వెంటనే కౌశికుని చూచి ఓ మహర్షీ! ఈ తీరప్రాంతంలో ఉన్న ఆశ్రమం ఎవరిది? ఇక్కడ ఎవరు నివసిస్తూ ఉన్నారు? గొప్పదైన ఈ ఆశ్రమం గురించి తెలిసికోవాలని మాకు ఎంతో కుతూహలంగా ఉన్నది. మా సందేహం తొలగేటట్లు దీని చరిత్రను తెలియజేయండి" అని అడిగినారు. అప్పుడు గాధినందనుడు "ఓ రామలక్ష్మణులారా! ఇది కాముని ఆశ్రమము అని విఖ్యాతి నందినది" అని అంటూ ఆ ఆశ్రమాన్ని గురించి విశదీకరించసాగినాడు.

మ. ధరణీశాత్మజగాధిజుల్ ముదమునన్ దామేగి గంగానదీ
సరయూ సంగమ సీమ రాజిలు తపస్సంపన్నమౌ నాశ్రమం
పు రహిన్గాంచిరి, రామలక్ష్మణులు సంపూతోక్తి "మౌనీంద్ర! మా
కరయం గౌతుకమయ్యె దీని విషయమ్మంతన్ వచింపందగున్. 163

శా. ఈ తీరస్థ వరాశ్రమం బెవరిదో? యెవ్వార లిందుందురో?
పూతమ్మై చెలువొందు దీని చరితమ్మున్ దెల్పుమా" యంచు సం
శీతిన్ వేడగ నవ్వుమోమున వచించెన్ వారికిన్ మౌని "వి
ఖ్యాతిన్ గాంచిన యాశ్రమమ్మిది ధరన్ గామాఖ్యమై వెల్గెడిన్. 164

[సంశీతిన్=సంశయంతో]

కందర్పో మూర్తిమా నాసీత్ కామ ఇత్యుచ్యతే బుధైః। {1.23.10}
అశరీరః కృతః కామః క్రోధా ద్దేవేశ్వరేణ హి॥ {1.23.13}
అనఙ్గ ఇతి విఖ్యాతః తదా ప్రభృతి రాఘవ।
స చాంగవిషయః శ్రీమాన్ యత్రాంగం ప్రముమోచ హ॥ {1.23.14}

❇ గంగా సరయూ సంగమ తీరభూమి దగ్గర కనిపించిన కామాశ్రమం గురించి తెలియజేస్తూ విశ్వామిత్ర మహర్షి "ఓ రామలక్ష్మణులారా! పూర్వము ఫాలలోచనుడైన శంకరుడు ఈ ప్రదేశంలో అపూర్వమైన తపస్సును చేయసాగినాడు. ఆ శర్వునికి పార్వతితో వివాహం జరిపించాలని నిర్ణయించుకొన్న దేవతల ప్రేరణతో గర్వమును పొందిన మన్మథుడు తపోనిమగ్నుడైన ఈశ్వరునిపై తన పూలబాణములను ప్రయోగించినాడు. సర్వజ్ఞుడైన త్ర్యంబకుడు శంబరాసురవైరియైన మన్మథుని తన అగ్నినేత్రంతో కోపంగా చూచినాడు. ఫాలాక్షుని మూడవ కంటిమంటచే పూర్తిగా దహింపబడిన మారుడు తక్షణమే బూడిదగా మిగిలినాడు. మహేశునితో పోరాడి ఓడిన ఆ మనసిజుడు తన అంగములన్నీ నశింపగా

అనంగుడుగా మారిన ఈ ప్రదేశము ఆ నాటినుండి అంగదేశము అని పిలువబడుతూ ఉన్నది" అని వివరింపసాగినాడు.

ఉ. పూర్వము శంకరుం డిట నపూర్వతపఃపరతన్ దపింప, నా
శర్వునికిన్ వివాహమును సల్ప దలంచు సురాళి పంపుమై
గర్వితుడైన మన్మథు డఖండ సుమాస్త్రము లేసె నీశుపై,
సర్వ మెఱింగి త్ర్యంబకుడు శంబరవైరినిఁ జూచెఁ గ్రుద్ధుడై. 165

ఉ. మూడవ కంటి మంట పరిపూర్ణముగా దహియింప, బూదియై
నా డిట మారు, డంగములు నాశనమౌట ననంగు డయ్యె, నా
వాడుక నంగదేశమని వర్ధిలు నేటికి నీ ప్రదేశ, మీ
నాడు ప్రసిద్ధి కెక్కె మరునామముతో నిదె యాశ్రమమ్మిటన్. 166

తస్యాయ మాశ్రమః పుణ్యః తస్యేమే మునయః పురా।
శిష్యా ధర్మపరా నిత్యం తేషాం పాపం న విద్యతే॥ {1.23.15}
తేషాం సంవదతాం తత్ర తపో దీర్ఘేణ చక్షుషా।
విజ్ఞాయ పరమప్రీతా మునయో హర్ష మాగమన్॥ {1.23.18}

❊ కామాశ్రమం ఉన్న ప్రదేశానికి అంగదేశమనే పేరు ఎలా వచ్చిందో రాఘవులకు వివరించిన విశ్వామిత్ర ముని "ఓ రామలక్ష్మణులారా! ఇది శివుడు తపస్సు చేసిన ప్రదేశము. ఇక్కడ తపస్సు చేసే మునులు పరమశివుని శిష్యులుగా ప్రసిద్ధికెక్కినారు. ఇచ్చటి మునులకు పాపచింతన ఉండదు. శివుని పాదస్పర్శతో పునీతమైన ఈ ప్రదేశంలోని మునులు సదా ధర్మపథానువర్తులు. మనము నేటి రాత్రి ఇక్కడ బస చేసి ఆ తరువాత మన ప్రయాణం కొనసాగించెదము. ఈ గంగా సరయూ సంగమ తీరం మనకు ఆనందాన్ని కలిగిస్తుంది" అని అంటూ ఉండగా కామాశ్రమ నివాసులైన మునులు కౌశికుని రాక విని విశ్వామిత్ర మహర్షిని చేరవచ్చి యథావిధిగా అతిథి సేవలను చేయనారంభించినారు.

చం. భవుని తపఃప్రదేశ మిది, పావనతన్ గనె మెప్పు, మౌనిరాట్
సవనవిశిష్టనిష్ఠ బుధ సన్నుతి నందె, మునీంద్రశిష్యు లీ

భువిఁ గనకుంద్రు పాపమతిఁ, బూర్ణులు ధర్మపథానువృత్తి, నా
శివుని పదమ్మసోకి శివసేవధి పావనధీ ప్రదమ్మిదే. 167

ఉ. ఇచ్చట నేటి రాత్రి వసియింతము రామ! నదీద్వయాంతర
మ్మిచ్చును మోదమున్, పిదప నేగుద" మన్నపు డాశ్రమస్థులా
సచ్చరితుల్ మునీశ్వరులు సర్వ మెఱుంగుచుఁ, గౌశికున్ గనన్
వచ్చి, యథావిధిన్ విబుధవంద్యున కిచ్చిరి యర్ఘ్యపాద్యముల్. 168

తత్ర వాసిభి రానీతా మునిభి స్సువ్రతైః సహ।
న్యవసన్ సుసుఖం తత్ర కామాశ్రమపదే తదా॥ {1.23.21}
తతః ప్రభాతే విమలే కృతాహ్నిక మరిందమౌ।
విశ్వామిత్రం పురస్కృత్య నద్యాస్తీర ముపాగతౌ॥ {1.24.1}

❋ కామాశ్రమంలో నివసించే మునులు ముందుగా విశ్వామిత్ర మహర్షిని పూజించినారు. ఆ తరువాత రామలక్ష్మణులను సేవించి వారికి సత్కథలను వినిపించినారు. ముగ్గురినీ తమ ఆశ్రమానికి తీసికొని వెళ్లినారు. అక్కడ గాధిజుడు అనేక కథలను చెప్పగా ఆ కథలలోని సారమును రాజకుమారులు గ్రహించినారు. రాత్రి అక్కడ నిద్రించిన రామలక్ష్మణులు వేకువనే నిద్రలేచి సంధ్యావందనాదులు పూర్తిచేసి గురువుగారితో కలిసి గంగానదివద్దకు వెళ్లినారు.

శా. ఆతిథ్యమ్మను దొల్త సంయమికిఁ దా నర్పించి యా తాపస
వ్రాతం బంతట రామలక్ష్మణుల సంభావించి, తత్సేవలన్
బ్రీతిన్ బొందుచు, సత్కథాదుల నటన్ విన్పించుచున్ బ్రేమతోఁ
బూతమ్మౌ మదనాశ్రమమ్మునకుఁ గొంపోయెన్ బ్రమోదమ్మునన్. 169

ఉ. గాధిసుతుండు రాత్రి పలు గాథలఁ దెల్పగ, రామలక్ష్మణుల్
సాధుకథార్థసారమునుఁ జక్క గఁ గైకొని, నిద్ర నంది, యా
రాధనఁ జేయ భాస్కరుని రాతిరి క్రుంకక మున్నె లేచి, ధీ
సాధనఁ బూర్తి చేసి గురుసత్తముతోఁ జనినారు గంగకున్. 170

24. సరయూ, మలదకరూశ వృత్తాంతములు తాటకావన ప్రవేశము

ఉపస్థాప్య శుభాం నావం విశ్వామిత్ర మథాబ్రువన్॥ {1.24.2}
ఆరోహతు భవా న్నావం రాజపుత్రపురస్కృతః। {1.24.3}
అథ రామ స్సరిన్మధ్యే పప్రచ్ఛ ముని పుఙ్గవమ్।
వారిణో భిద్యమానస్య కిమయం తుములో ధ్వనిః॥ {1.24.6}

❈ కామాశ్రమంలోని మునులు ఒక నావను ఏర్పాటు చేసి, విశ్వామిత్ర మహర్షికి వీడ్కోలు పలుకుతూ "ఓ బ్రహ్మర్షీ! మీరు గంగానదిని దాటేందుకు ఒక నావను సిద్ధం చేసినాము" అని పలుకగా కౌశికుడు వారినుండి సెలవు తీసికొన్నాడు. విశ్వామిత్రముని, రామలక్ష్మణులు నావను ఎక్కినారు. గంగానదిలో ప్రయాణం చేస్తున్న వారి మనసు ఆనందంతో పరవశించింది. శరీరం పులకరించింది. నావ గంగానది మధ్యకు చేరినప్పుడు వారికి విభ్రాంతిని కలిగించే గొప్ప శబ్దము వినవచ్చింది. ఆ శబ్దమును వినిన రాముడు గాధిజుని చూచి "ఓ గురువర్యా! ఇక్కడ ఇంత పెద్ద శబ్దం రావడానికి కారణ మేమి?" అని ప్రశ్నించినాడు.

చం. మును లొక నావ నేర్పరచి, పూజ్యుని౯ గౌశికు రాజపుత్రులన్
గని, యట నుండి వీడ్కొలుపగా మది నెంచుచు, మౌనితోడ "ఓ
మునివర! నావనెక్కుడు ప్రమోదముతోడుత గంగ దాటుడీ"
యన౯ గుశికాత్మజుండు నను వైన గతిం గన౯ జేసె మన్ననన్. 171

ఉ. అంతట నావ నెక్కిరి మహర్షియు రాముడు లక్ష్మణుండు మే
నంతయు౯ బుల్కరింప, మది హర్షము నొందగ నేగుచుండ వి
భ్రాంతిని గొల్పు మ్రోత వినవచ్చెను మధ్యనదీ జలమ్ము నం,
దింతటి శబ్ద మేర్పడగ నేమి కతం? బనె రాముడా మునిన్. 172

కైలాసపర్వతే రామ మనసా నిర్మితం సరః।
బ్రహ్మణా నరశార్దూల తేనేదం మానసం సరః॥ {1.24.8}

తస్మాత్ సుస్రావ సరసః సాయోధ్యా ముపగూహతే। {1.24.9}
తస్యాయ మతులశ్శబ్దో జాహ్నవీ మభివర్తతే। {1.24.10}

❋ గంగానది మధ్యలో పెద్దగా శబ్దం రావడానికి కారణం ఏమిటి అని రాముడు అడుగగా విశ్వామిత్రుడు బదులు పలుకుతూ "ఓ రామా! బ్రహ్మదేవుని మనస్సునుండి సృజింపబడి, మానససరోవరము అనే పేరుతో ప్రసిద్ధికెక్కిన ఒక సరస్సు కైలాసపర్వతము నందు ఉన్నది. ఆ మానససరస్సు నుండి వెలువడిన జలరాశి సరయూనది పేర ప్రవహిస్తూ వచ్చి ఈ గంగానదిలో సంగమిస్తూ ఉన్నది. పాపాలను తొలగించి, ధన్యతను చేకూర్చి, పుణ్యమును కలిగించే ఆ సరయూనది అయోధ్యా పురమును స్పృశిస్తూ వచ్చి ఈ గంగానదిలో (ఇక్కడకు దగ్గరలో) కలుస్తూ ఉన్నందున ఈ విధంగా గొప్ప శబ్దము వినవస్తూ ఉన్నది" అని వివరించినాడు.

కం. లీలన్ ముని రామునిఁ గని
తాలిమి నిట్లనె "మనసున ధాత సృజింపన్
గైలాస పర్వతమ్మునఁ
గ్రాలున్ మానస సరోవరమ్మ శుభదమై. 173

కం. ఆ సరసు నుండి పుట్టిన
దై సరయూనామ మొప్పఁ దనరెడి నదియే
భాసిల్లెడి గంగానది
తో సంగమ మొంది యిచటఁ దుష్టిన్ గూర్చున్. 174

ఉ. పాపముఁ బాపు నా సరయు వచ్చెను బ్రహ్మసరస్సు నుండి, సం
తాప మడంచి యెల్లరకు ధన్యతఁ గూర్చును, పుణ్యద మ్మయో
ధ్యాపుర సీమ నంటి నడయాడుచు సంగమ మందు రామ! గం
గాపగ యందుఁ, దజ్జల మనంతముగా ధ్వనియించు నుగ్రతన్. 175

తాభ్యాం తు తావుభౌ కృత్వా ప్రణామ మతిధార్మికౌ।
తీరం దక్షిణ మాసాద్య జగ్మతు ర్లఘువిక్రమౌ॥ {1.24.11}
ఏతౌ జనపదౌ స్ఫీతౌ పూర్వమాస్తాం నరోత్తమ।
మలదాశ్చ కరూశాశ్చ దేవనిర్మాణనిర్మితౌ॥ {1.24.17}

❋ సరయూనది కలవడం వలన గంగానది మధ్యలో గొప్ప శబ్దం వినవస్తూ ఉన్నదని వివరించిన విశ్వామిత్ర మహర్షి గంగాసరయూసంగమ ప్రదేశమునకు ప్రణామం చేయుమని రామునికి చెప్పగా రామలక్ష్మణు లిరువురూ ఆ సంగమ ప్రదేశానికి భక్తితో నమస్కరించినారు. నావ భాగీరథీనది యొక్క దక్షిణ తీరానికి చేరగా మునితో, సోదరునితో ప్రయాణం మొదలుపెట్టిన రాముడు అక్కడ రకరకాల వృక్షాలు పక్షులు మృగములు ఉండే అడవిని చూచి "ఓ మహర్షీ! ఘోరమైన ఈ వనమునకు సంబంధించిన విషయాన్ని పూర్తిగా తెలియజేయండి" అని అడిగినాడు. అప్పుడు కౌశికుడు ఆ అటవీప్రాంతాన్ని గుఱించి తెలియజేస్తూ "ఓ రామా! పూర్వం ఈ ప్రదేశంలో దేవతలచే నిర్మింపబడిన మలదము కరూశము అనే పేర గొప్ప దేశములు రెండు ఉండేవి. దేవేంద్రుని మాలిన్యం కారణంగా అవి ఏర్పడినవి.

మ. "సరయూగంగల సంగమ మ్మిది ప్రశస్తమ్మైన తీర్థమ్ము, నీ
కరముల్ మోడ్చి ప్రణామముల్ సలుపు మో కాకుత్స్థ!" యంచున్ మునీ
శ్వరు డన్నంతనె రామలక్ష్మణులు విశ్వాసమ్మునన్ మ్రొక్కి, చే
రిరి తద్దక్షిణతీరమున్ సుగతి సంప్రీతాత్ములై మౌనితో. 176

తే.గీ. అతుల భాగీరథిన్ దాటి యవలఁ జనుచు
వృక్షవితతులు బహువిధ పక్షిగతులు
క్రూరమృగములు పెనుపొంది దారుణ మగు
వనము గన్పడ రాముడు పలికె నిటుల. 177

చం. "అలఘువనమ్ము దీని కథనంతయుఁ జెప్పు" మనంగ భవ్యధీ
విలసితుడైన కౌశికుడు వేడుక నిట్లనె "దేవనిర్మితిన్

మలద కరూశ నామముల మాన్యములై యలరారు దేశముల్
లలి నిట రెండు, శక్రుని మలమ్మున రాజిలుచుండె స్ఫీతిమై. 178

పురా వృత్ర వధే రామ మలేన సమభిప్లుతమ్।
క్షుధాచైవ సహస్రాక్షం బ్రహ్మహత్యా సమావిశత్॥ {1.24.18}
బలం నాగసహస్రస్య ధారయంతీ తదాహ్యభూత్॥ {1.24.25}
తాటకా నామ భద్రం తే భార్యా సుందస్య ధీమతః। {1.24.26}

❈ వృత్రాసురుని వధించిన ఇంద్రుడు బ్రహ్మహత్యాపాతకానికి గుఱియై మలినముతో కరూశము(ఆకలి)తో కూడినవాడై బాధపడుతూ ఈ ప్రదేశం వచ్చినాడు. మునీశ్వరులు మంత్రించిన జలములతో ఇంద్రుని అభిషిక్తుని చేసినారు. అలా సంస్కరింపబడిన ఇంద్రుడు మలమును కరూశమును ఇక్కడ వదలివేసి మలదము కరూశము అనే పేర్లతో రెండు దేశములను ఏర్పరచి అవి సమృద్ధిగా ఉండేటట్లు చేసినాడు. ఆ మలద కరూశములు చక్కగా అభివృద్ధి చెందినవి. కొంతకాలము తరువాత వేయి ఏనుగుల బలము గలిగినటువంటిది, సుందుని భార్య అగు తాటక తన కుమారుడైన మారీచునితో కలిసి సజ్జనహింసకు పూనుకొనగా ఆ రెండు దేశములు పూర్తిగా నశించినవి"

చం. చెలగుచు వజ్రి వృత్రవధఁ జేసెను పూర్వము, బ్రహ్మహత్యచే
మలిన కరూశ యుక్తుడుగ మారె, మునీశ్వర మంత్ర పూతమౌ
జలముల స్నానమాడె నిట, సంస్కృతి నిర్మల నిష్కరూశుడై
మలద కరూశ దేశముల మార్చె వరమ్మునఁ బావనమ్ముగా. 179

మ. ధనధాన్యమ్ముల వృద్ధి నొందినవి యేతద్దేశముల్, కాలమున్
జనియెన్, సుందుని భార్య తాటక క్రుధాసంయుక్త, విద్వేషకృ
ద్ఘన దుష్టాత్మ, సహస్రనాగబల, యక్షస్త్రీ సుతున్ గూడి స
జ్జన నాశమ్మును జేయుచుండగ వినష్టంబైన వేతద్గతిన్. 180

సేయం పంథాన మావార్య వస త్యధ్యర్ధయోజనే। {1.24.29}
స్వబాహుబలమాశ్రిత్య జహీమాం దుష్టచారిణీమ్। {1.24.30}
అల్ప వీర్యా యదా యక్షాః శ్రూయంతే మునిపుజ్గవ।
కథం నాగ సహస్రస్య ధారయత్యబలా బలమ్॥ {1.25.2}

❈ "ఓ రామా! మనం ఒకటిన్నర ఆమడ దూరం ముందుకు వెళ్లినట్లయితే మారీచుని తల్లియైన తాటక కనిపిస్తుంది. ఆ తాటక స్త్రీ కదా అని సంకోచించకుండా నీవు ధనుర్బాణములను ధరించి ఆమెను సంహరించాలి. అలా చేస్తే ఈ వనము అసురులు లేనిదిగా విరాజిల్లగలదు. ఈ వనము దారుణ వనంగా మారడానికి తాటకయే కారణం" అని కౌశికముని చెప్పగా రఘురాముడు "ఓ మహర్షీ! యక్షులు అల్పమైన బలాన్ని మాత్రమే కలిగియుంటారని నేను విన్నాను. అలాంటప్పుడు యక్షకాంత యైన ఈ తాటక వెయ్యియేనుగుల బలం కలదిగా ఎలా అయ్యిందో తెలియజేయ ప్రార్థన" అని తన సందేహాన్ని వ్యక్తపరచినాడు.

మ. "మన మిట్లేగిన సార్ధయోజనమునన్ మారీచునిన్ గన్న త
ల్లిని నా తాటకనుం గనుంగొనగనౌ, లీలన్ ధనుర్బాణముల్
గొని యా నారిని సంహరింపఁదగు సంకోచమ్ము లేకుండ, దా
నను నేతద్విపినమ్ము వెల్గు నికపై నష్టాసురద్వేషమై" 181

ఉ. కానన మట్లు దారుణముగా నట మాఱగఁ గారణమ్ము నా
మౌని వచింపగా గుణసమంచితుడౌ రఘురాము డిట్లనెన్
బూనిక "యక్షు లల్పబలమున్ గలవారలె, తాటకాఖ్య యీ
కాన సహస్ర నాగ బలగా నెటు లయ్యె నెఱుంగఁ జెప్పుడీ" 182



25. తాటకావృత్తాంతము
ఆమెను వధింపుమని విశ్వామిత్రుడు మరల ఆదేశించుట

పూర్వ మాసీ న్మహాయక్షః సుకేతు ర్నామ వీర్యవాన్।
అనపత్యః శుభాచారః స చ తేపే మహత్తపః॥ {1.25.4}
కన్యారత్నం దదౌ రామ తాటకాం నామ నామతః॥ {1.25.5}
దదౌ నాగసహస్రస్య బలం చాస్యాః పితామహః। {1.25.6}

❈ దశరథరాముని ప్రశ్నకు ఆదరభావంతో బదులు పలుకుతూ "ఓ రాఘవా! శ్రద్ధగా విను. పూర్వము సుకేతుడు అనే యక్షరాజు సంతానం కొఱకు తపస్సు చేయగా బ్రహ్మదేవుడు పుత్రసంతతిని ఇవ్వకుండా, తాటక అనే కుమార్తెను అనుగ్రహించి ఆమెను వెయ్యి యేనుగుల బలం కలదానినిగా చేసినాడు. తాటక యౌవనవతి కాగా తండ్రి ఆమెను ఝర్ఝుని పుత్రుడైన సుందునికి ఇచ్చి వివాహం జరిపించినాడు. ఆ తాటకకు మారీచుడు పుట్టినాడు. తాటక భర్తయైన సుందుడు గుణహీనుడుగా మెలగడంతో కుంభసంభవుడైన అగస్త్య మహర్షి ఆ సుందుని వధించినాడు అని తాటక యొక్క పుట్టుపూర్వోత్తరాలను విశ్వామిత్ర మహర్షి విశదీకరించ సాగినాడు.

**చం. అనవుడు గాధినందనుడు నాదరమొప్ప వచించె "రాఘవా!
వినుము 'సుకేతు' యక్షపతి ప్రీతిఁ దపమ్మొనరింప సంతుకై
కనుగొని బ్రహ్మదేవు డిడెఁ గన్యక నొక్కతెఁ దాటకాఖ్య నా
తనికి సహస్ర నాగబలధామ, నొసంగడు పుత్రసంతతిన్. 183**

**ఉ. ఆ చినదానిఁ బెంచె నత దర్మిలి, యౌవనరేఖ దోచగా
జూచెను, ఝర్ఝపుత్రునకు సుందున కిచ్చి యొనర్చెఁ బెండ్లి, మా
రీచుడు పుట్టె వారలకుఁ బ్రేమఫలమ్మనఁ, గుంభసంభవుం
దేచి వధించె సుందు గుణహీనుని దుష్టని నష్టభాగ్యునిన్" 184**

సుందే తు నిహతే రామ సాగస్త్య మృషిసత్తమమ్।
తాటకా సహ పుత్రేణ ప్రధర్షయితు మిచ్ఛతి॥ {1.25.9}
అగస్త్యః పరమక్రుద్ధః తాటకామపి శప్తవాన్॥ {1.25.11}
పురుషాదీ మహాయక్షీ విరూపా వికృతాననా। {1.25.12}

❊ ఓ రాఘవా! తన భర్తయైన సుందుని వధించిన అగస్త్యమహర్షిని చంపదలచిన తాటక తన కుమారుడైన మారీచునితో కలిసి ఆ మునిపై దాడి చేయబోయింది. కోపించిన అగస్త్యుడు వారిని శిక్షింపదలచి శపించగా మారీచుడు రాక్షసుడుగా మారినాడు. యక్షిణియైన తాటక నరమాంసభక్షకురాలై వికృతరూపాన్ని పొందినది.

మ. తన భర్తన్ వధియించుటన్ గినిసి, సద్యఃపుత్రసాహ్యమ్ముతో
మునిఁ జంపంగఁ దలంచి, తాటక వెసన్ బోవంగ, మారీచు దై
త్యునిగా మార్చెను శాపవాక్కుల నగస్త్యుం, డుగ్రుడై తాటకన్
ఘనయక్షిన్ బురుషాదగా వికృతగాఁ గావించె శిక్షింపగా. 185

చం. ఘనత వసించె నిచ్చట నగస్త్య మహర్షి యటంచు, నుగ్ర కా
ననముగ మార్చెఁ దాటక జనమ్ములఁ జంపుచు నీ ప్రదేశమున్,
మనమున శంక లేక పరిమార్చుమ శీఘ్రమ, నీవు తప్ప దా
నిని వధియింప వేఱొకరు నేరరు రాఘవ! ముజ్జగమ్ములన్. 186

న హి తే స్త్రీవధకృతే ఘృణా కార్యా నరోత్తమ।
చాతుర్వర్ణ్యహితార్థాయ కర్తవ్యం రాజసూనునా॥ {1.25-16}
నృశంస మనృశంసం వా ప్రజారక్షణకారణాత్।
పాతకం వా సదోషం వా కర్తవ్యం రక్షతా సదా॥ {1.25.17}

❊ "ఓ రఘురామా! స్త్రీవధ చేయడం ఎలా అని చింతించకుండా తాటకను చంపు. నాలుగు వర్ణములవారిని కాపాడే సందర్భంలో ఇది కార్యము, ఇది అకార్యము అని చూడరాదు సుమా! పూర్వము భూదేవిని చంపదలచిన మంథరను వజ్రపాణి యగు ఇంద్రుడు చంపినాడు. భృగు మహర్షి భార్య,

శుక్రుని తల్లి యగు మహిళ (ఇంద్రుని లేకుండా చేయదలచినందున) ఆమెను చక్రపాణి సంహరించినాడు. ఈ విధంగా అధర్మమును ఆచరించిన స్త్రీలు ఎంతోమంది వధింపబడినారు. కావున అధర్మపరురాలైన తాటకను నిస్సంకోచంగా చంపుము" అని విశ్వామిత్రుడు వివరింపగా "ఓ మహర్షీ! నీ ఆజ్ఞను శిరసావహిస్తాను" అని రాముడు పలికినాడు.

ఉ. స్త్రీవధఁ జేయు టెట్లనుచుఁ జింతిలబోకుమ, చంపు తాటకన్,
గావగ నాల్గువర్ణములఁ గార్యమకార్యముఁ జూడరాదు రా
మా! విను వజ్రి మానినిని మంథరఁ జంపెను, గావ్యమాత నే
భావన లేక చంపెఁ గద వాసవసోదరుడైన చక్రియున్. 187

చం. అరయగ నిట్టు లెందఱొ మహాత్ములు ధర్మముఁ దప్పు స్త్రీల నెం
దరినొ వధించినా" రనుచు ధర్మముఁ దెల్పగ, ధర్మశిక్షణా
పరుడు దృఢవ్రతుండు నగు భానుకులాగ్రణి పల్కె నిట్టులన్
"వరముని! నీదు నాజ్ఞ నిదె భాగ్యముగా శిరసావహించెదన్. 188



26. శ్రీరాముడు తాటకను వధించుట

అనుశిష్టోఽస్మ్యయోధ్యాయాం గురుమధ్యే మహాత్మనా।
పిత్రా దశరథే నాహం నావజ్ఞేయం హి తద్వచః॥ {1.26.3}
జ్యా ఘోష మకరో త్తీవ్రం దిశ శ్శబ్దేన నాదయన్॥ {1.26.6}
తేన శబ్దేన విత్రస్తాః తాటకా వనవాసినః। {1.26.7}

❋ "ఓ గురుదేవా! నా జనకుడైన దశరథ మహారాజు నాయనా! రామా! ఈ మునీంద్రుని వాక్యమే యిక నీకు కర్తవ్యము అని అయోధ్యలో చెప్పినాడు. తండ్రిమాట మీది గౌరవంతో నేను మీరు చెప్పినట్లు తాటకను సంహరిస్తాను అని అంటూ రాముడు విల్లు చేతబట్టి గొప్పగా ధనుష్టంకారం చేసినాడు. ఆ జ్యాశబ్దం భయంకరమైనదై ఆ అడవి అంతటా వ్యాపించింది. ఆ శబ్దాన్ని విన్న వనవాసు లందఱూ భయపడ్డారు. తాటక విభ్రాంతి చెంది కోపాన్ని పొంది ధ్వని ఎక్కడనుండి వచ్చిందో గుర్తించి రామలక్ష్మణులు, విశ్వామిత్ర ముని ఉన్న ప్రాంతానికి వచ్చింది.

మ. 'తనయా! రామ! మునీంద్రు వాక్య మికఁ గర్తవ్యమ్మగున్ నీకు' నం
చనియెన్ మజ్జనకుండు కూరిమి నయోధ్యన్, దండ్రివాక్యమ్ముపై
ఘనమౌ గౌరవముంచువాడ నయి వేగన్ దాటకాభామినీ
హననంబున్ బొనరింతుఁ బాంధజన సౌఖ్యప్రాప్తి లక్ష్యమ్ముగాన్" 189

మ. అనుచున్ రాముడు వింటి నంటుచు మహాజ్యాశబ్దమున్ జేసె, నా
వనమం దంతట భీషణస్వనము వ్యాప్తంబయ్యె, భీతిల్లి రా
వనవాసుల్, చనుదెంచెఁ దాటకయు విభ్రాంతాత్మయై క్రుద్ధయై
ధ్వని యేతెంచిన రామలక్ష్మణమునిప్రాంతమ్ము గుర్తించుచున్. 190

తాం దృష్ట్వా రాఘవః క్రుద్ధాం వికృతాం వికృతాననామ్।
ప్రమాణే నాతివృద్ధాం చ లక్ష్మణం సోఽభ్యభాషత॥ {1.26.9}
భిద్యేరన్ దర్శనా దస్యాః భీరూణాం హృదయాని చ॥ {1.26.10}
వినివృత్తాం కరో మ్యద్య హృతకర్ణాగ్రనాసికామ్॥ {1.26.11}

❈ వికృతమైన ముఖంతో వికృతమైన రూపంతో గొప్ప శరీరంతో విపరీతమైన కోపంతో తాటక తమ వద్దకు చేరుకోగా జాలిగుండె గల రాముడు ఆ యక్షిణిని వెంటనే చంపదలచకుండా దాని గమనశక్తిని పోగొట్టదలచినవాడై తమ్మునికి దానిని చూపిస్తూ "ఓ లక్ష్మణా! ఆ తాటకను చూస్తే చాలు పిరికివాళ్ల ప్రాణాలు తక్షణమే పోతాయి. చంపకుండా ముందు ముక్కు చెవులు కోసివేస్తే దానికి తగిన దండన విధించినట్లు ఔతుంది. నీవు నిశ్చింతగా ఉండు" అని అంటూ ఉండగా ఆ తాటక ఏ మాత్రం భయం లేనిదై పెద్దగా గర్జించింది.

ఉ. అప్పుడు రాఘవుండు వికృతాననగా వికటస్వరూపగా
గొప్ప శరీరమొప్ప నతికోపముతోఁ జనుదెంచు తాటకన్
ముప్పొనగూర్చు యక్షిణినిఁ బూర్తిగఁ జూచుచుఁ జాలి జూపుచున్
జప్పున ప్రాణముల్ గొనక నాతి గతిన్ దొలగింప నెంచుచున్. 191

ఉ. తమ్మునిఁ జూచి పల్కె "నదె తాటక చూడుము భీరుజీవముల్
వమ్మయిపోవు దానిఁ గనఁ, బ్రాణముఁ దీయక, ముందు దాని క
ర్ణమ్ముల నాసికన్ దఱిగినన్, దగు దండనమౌను లక్ష్మణా!
నెమ్మది నుండుమా" యనగ నిర్భయ తాటక చేసె గర్జనన్. 192

విశ్వామిత్రస్తు బ్రహర్షిః హుంకారేణాభిభర్త్స్య తామ్।
స్వస్తి రాఘవయో రస్తు జయం చైవాభ్యభాషత॥ {1.26.14}
శిలా వర్షం మహత్ తస్యాః శర వర్షేణ రాఘవః।
ప్రతిహ త్యోపధావంత్యాః కరౌ చిచ్ఛేద పత్రిభిః॥ {1.26.17}

❈ ఏమాత్రం జంకు లేకుండా మీదికి ఉరుకుతున్న తాటకను విశ్వామిత్ర మహర్షి తన హుంకారంతో నిలువరించినాడు. దాని మనసులోని అత్యుత్సాహాన్ని నీరు గార్చినాడు. ఓ రఘువీరులారా! మీకు ఎటువంటి ఆటంకమూ ఉండదు. నిస్సందేహంగా మీకు విజయం కలుగుతుంది అని రామలక్ష్మణులను దీవించినాడు. ఆ తాటక రామలక్ష్మణులపై పడేటట్లు గొప్పగా ధూళిని వెదజల్లి వారిని మూర్ఛపోయేటట్లు చేసి మాయమైపోయి వాళ్లపై రాళ్లవర్షాన్ని

కురిపించింది. క్షణకాలంలో తేఱుకొన్న రాముడు కోపంతో ఎఱ్ఱబడిన కన్నులు గలవాడై గొప్ప బాణములను సంధించి ఆ తాటక యొక్క చేతులను ఖండించినాడు.

శా. జంకున్ వీడుచు వచ్చు తాటకను విశ్వామిత్రు డీక్షించుచున్
హుంకారమ్మున నిల్పె, దాని మది నత్యుత్సాహమున్ ద్రుంచె, "నా
టంకంబన్నది రామలక్ష్మణుల కుండన్ బోదు సర్వత్ర యే
వంకల్ లేని జయంబు గల్గునని సంభావించె దీవించుచున్. 193

మ. ఘనధూళిన్ వెదజల్లి వారలపయిన్ గ్రమ్మంగ, మోహింపఁ జే
సిన దా తాటక రామలక్ష్మణులు మూర్ఛిల్లన్ వెసన్ మాయ మ
య్యెను, రాళ్లన్ గుఱిపించె, రాము డపు డెంతేఁ గ్రోధతామ్రాక్షుడై
ఘనబాణమ్ములఁ దాటకాకరములన్ ఖండించె బుద్ధాత్ముడై. 194

తత శ్ఛిన్నభుజాం శ్రాంతా మభ్యాశే పరిగర్జతీమ్।
సౌమిత్రి రకరోత్ క్రోధాత్ హృతకర్ణాగ్రనాసికామ్॥ {1.26.18}
అలం తే ఘృణయా రామ పాపైషా దుష్టచారిణీ॥ {1.26.21}
వధ్యతాం తావదే వైషా పురా సంధ్యా ప్రవర్తతే॥ {1.26.22}

❋ రఘురాముడు భుజములను ఖండించగా తాటక తీవ్రమైన కోపంతో ముందుకు దూకుతూ గర్జిస్తూ నిలబడగా వెంటనే లక్ష్మణుడు తాటక యొక్క ముక్కు చెవులను ఖండించినాడు. అప్పుడు రోదిస్తూ మాయమైపోయిన తాటక మరలా శిలావర్షమును కురిపించింది. విశ్వామిత్రుడు ఓ రామా! ఈ దుష్టురాలిపై జాలి ఎలా చూపిస్తావు? సాయంకాలమైతే రాక్షసులకు బలం పెరుగుతుంది సుమా! ఈ తాటక ఇప్పటికి ఎన్నో యజ్ఞములను పాడుచేసింది. కాబట్టి వెంటనే నీ పని పూర్తిచేయి. ఈ తాటకను ఇప్పుడే చంపివేయి. దుష్టశిక్షణను మొదలుపెట్టు అని ఉపదేశం చేసినాడు.

చం. భుజములు గూల రోషగతి ముందుకు దూకుచు భీతిఁ గొల్పుచున్
నిజబలమొప్ప గర్జనల నిల్చిన తాటకఁ జేరి లక్ష్మణుం

డు జవము తోడ కర్ణముల దుల్చుచు నాసికఁ గోసివేయ, నా
గజబల మాయమై శిలలఁ గల్పనఁ జేసె మహోగ్రవర్షమున్. 195

ఉ. రాల మునుంగు శిష్యులను రాఘవులన్ గని మౌని యిట్లనెన్
"జాలి యెటుల్ పొసంగు, దనుజన్ దునుమాడుము, మాపునన్ బలా
వేలత గల్గు దైత్యులకు, వేగమె దాని వధింపు రాఘవా!
చాలును యజ్ఞభంగములు చాలును దౌష్ట్యము దాని చేష్టలున్. 196

ఇత్యుక్తస్తు తదా యక్షీ మశ్మవృష్ట్యాభివర్షతీమ్॥ {1.26.23}
దర్శయన్ శబ్దవేధిత్వం తాం రురోధ స సాయకైః। {1.26.24}
తా మాపతంతీం వేగేన విక్రాంతా మశనీ మివ। {1.26.25}
శరే ణోరసి వివ్యాధ సా పపాత మమార చ। {1.26.26}

❈ వెంటనే తాటకను చంపు అని విశ్వామిత్ర ముని ఆజ్ఞాపించగా శబ్దవేధి విద్య తెలిసినవాడు సంగ్రామవిశారదుడు అగు రాముడు కంటికి కనిపించని తాటక మాయలను భేదించే బాణప్రయోగం చేసినాడు. తన బాణంతో దాని వక్షస్థలమును చీల్చివేసినాడు. అప్పుడు నేలపై కూలిన తాటక ప్రాణములను కోల్పోయింది. దుష్టశిక్షణకు నాందిగా తాటక వధింపబడగా సంతోషించిన సురపతి యగు ఇంద్రుడు సూర్యకులోద్భవుడైన రాముని ప్రశంసించినాడు. దేవతలందఱూ రాముని పరాక్రమాన్ని మెచ్చుకొన్నారు. మనసు సంతోషంతో నిండగా ఆ దేవతలు రామస్తుతి చేస్తూ విశ్వామిత్ర మహర్షితో మాట్లాడసాగినారు.

ఉ. రామ! వధింపు మంచు మునిరాజు వచింపగ, శబ్దవేధియౌ
రాముడు దాని నిల్పె శరరాసులఁ, దాటక పైకి రాగ సం
గ్రామ విశారదుం డగుచు రక్కసి మాయల నుక్కడంచి, యా
భామను గూల్చె, వక్షమున బాణము నేయుచుఁ జీల్చివేయుచున్. 197

చం. ధరణినిఁ గూలి దుష్టయగు తాటక ప్రాణముఁ గోలుపోవగా,
సురపతి సాధువాక్యముల సూర్యకులోద్భవుఁ బ్రస్తుతింపగా,

సురలును రాము మెచ్చుకొని స్తోత్ర మొనర్చిరి, చిత్తమెల్ల సం
బరమున నిండ వారు మునివర్యుni జూచి వచించి రిట్టులన్. 198

ప్రజాపతే ర్భృశాశ్వస్య పుత్రాన్ సత్యపరాక్రమాన్।
తపోబలభృతాన్ బ్రహ్మన్ రాఘవాయ నివేదయ॥ {1.26.29}
తతో మునివరః ప్రీతః తాటకావధతోషితః।
మూర్ధ్ని రామముపాఘ్రాయ ఇదం వచన మబ్రవీత్॥ {1.26.32}

❋ తాటకావధకు సంతోషించిన దేవతలు విశ్వామిత్ర మహర్షిని చూచి "ఓ గాధితనూజా! నీకు శుభం కలుగుగాక! నీవు ఎంతో గొప్ప పని చేసినావు. నీ మాట ననుసరించి రఘుపుంగవుడు ఇప్పుడు తాటకను చంపినాడు. నీ దగ్గఱ భృశాశ్వుని పుత్రులు అస్త్ర రూపంలో ఉన్నారు కదా. ఆ అస్త్రములను రామునికి అందజేయి. రాముడు ఆ అస్త్రములను పొంది ఇదేవిధంగా దుష్టశిక్షణ సాధురక్షణ చేయగలడు. నిన్ను అనుసరించే రాముడు దేవతలకు కూడా మేలు చేయగలిగిన మహాత్ముడు" అని రాముని మెచ్చుకొంటూ కౌశికుని దగ్గఱ సెలవు తీసికొని తమ స్వర్గలోకానికి వెళ్లినారు. అప్పుడు విశ్వామిత్ర ముని వాత్సల్యభావంతో రాముని దగ్గఱకు తీసికొని అతని శిరస్సును మూర్కొని దీవెనలను అందజేసినాడు.

ఉ. "గాధితనూజ! భద్ర మగు గాక! విశిష్టము నీదు కర్మ, నీ
బోధనఁ జేసి మేటి రఘుపుంగవు డిప్పుడు చంపెఁ దాటకన్,
సాధన నీవు పొందిన ప్రశస్తభృశాశ్వసుతాస్త్రరాసులన్
సాధులఁ బ్రోచు రామునికిఁ జక్కగ నిచ్చి యనుగ్రహింపుమా! 199

ఉ. మేలొనరించు నిన్ననుగమించెడి రాముడు దేవతాళికిన్
మేలొనరించువాడు ధృతి మించు మహాత్మ" డటంచుఁ బల్కి భూ
పాలకుమారు మెచ్చి మునివర్యుని వీడ్కొని వార లేగ, స
చ్చీలు శిరమ్ము మూర్కొనుచు శిష్యవరున్ గని మౌని యిట్లనెన్. 200

ఇహాద్య రజనీం రామ వసేమ శుభదర్శన॥ {1.26.33}
శ్వః ప్రభాతే గమిష్యామః తదాశ్రమపదం మమ। {1.26.34}
ముక్తశాపం వనం తచ్చ తస్మిన్నేవ తదాహని॥ {1.26.35}
రమణీయం విబభ్రాజ యథా చైత్రరథం వనం। {1.26.36}

❋ రాముని మెచ్చుకొనిన దేవతలు వెళ్లిపోయిన తరువాత విశ్వామిత్ర మహర్షి రాముని చూచి "ఓ రఘునాయకా! నీవు నీ బాణములతో తాటకను సంహరించినందున నా మనస్సు ఎంతో సంతోషంగా ఉన్నది. ఇప్పుడు సంధ్యాసమయం అయినది కాబట్టి ఈ రోజు రాత్రి మనం ఇక్కడనే ఉండి రేపు ఉదయం నా నివాసమైన సిద్ధాశ్రమానికి వెళ్దాము. అక్కడ మనము కార్యసిద్ధిని కీర్తిని పొందగలము" అని పలుకగా దశరథరాముడు సంతోషంతో అలాగే అన్నాడు. ఆనాటినుండి ఆ తాటకావనము శాపవిమోచనమును పొందిన వనంలాగా, ఎంతో పవిత్రమైనదిగా, రమణీయమైనదిగా, కుబేరుని ఉద్యానవనమైన చైత్రరథం లాగా విరాజిల్లసాగినది.

ఉ. "రామ! త్వదీయ బాణములు రక్కసి తాటక సంహరించుటన్
నా మది తుష్టి నందె, రఘునాయక! యిప్పుడు సంధ్య యయ్యె, నీ
యామిని నిచ్చటన్ గడపి యావల రేపు ప్రభాతవేళ మ
త్సీమనుఁ జేర నేగుదము సిద్ధిని గాంచి జయమ్ము నొందగన్" 201

చం. ముని యటు పల్క దాశరథి మోదము నందుచు నాటి రాత్రి ని
ర్జనవన మందు నుండె, ఘనశాప విమోచన మంది నట్టు లా
వన మది నాటినుండి కడు పావనమై రమణీయమై కుబే
రుని వనమైన చైత్రరథరూపము నందినదై విరాజిలెన్. 202



27. దివ్యాస్త్రోపదేశము

పరితుష్టోఽస్మి భద్రం తే రాజపుత్ర మహాయశః।
ప్రీత్యా పరమయా యుక్తో దదా మ్యస్త్రాణి సర్వశః॥ {1.27.2}
ధర్మచక్రం తతో వీర! కాలచక్రం తథైవ చ
విష్ణుచక్రం తథాఽత్యుగ్ర మైంద్ర మస్త్రం తథైవ చ॥ {1.27.5}
గదే ద్వే చైవ కాకుత్స్థ మోదకీ శిఖరీ ఉభే॥ {1.27.7}
ఆగ్నేయ మస్త్రం దయితం శిఖరం నామ నామతః॥ {1.27.10}
వాయవ్యం ప్రథనం నామ దదామి చ తవానఘ। {1.27.11}
అసిరత్నం మహాబాహో దదామి చ నృపాత్మజ। {1.27.14}
దారుణం చ భగస్యాఽపి శీతేషు మథ మానవమ్। {1.27.20}

❊ తాటకావనంలో రాత్రివేళ నిద్రించిన విశ్వామిత్ర మహర్షి వేకువనే నిద్రలేచినాడు. రాముని మేల్కొలిపి చిరునవ్వుతో దీవెనలు అందజేసి ఎంతో ప్రీతితో రాముని చూస్తూ "ఓ రఘురామా! నేను సర్వవిధములైన అస్త్రములను నీకు ఇవ్వదలచినాను. స్వీకరించు" అని అంటూ ఆ అస్త్రముల అధిదేవతల నామములను కౌశికుడు జపించినాడు. విశ్వామిత్రుడు శ్రీరామునికి దేవాసురులను యుద్ధంలో జయించగలిగిన కాలచక్రమును, విష్ణుచక్రమును, ధర్మచక్రమును, ఐంద్రాస్త్రమును, వజ్రాస్త్రమును, బ్రహ్మాస్త్రమును, ఆగ్నేయాస్త్రమును, వాయవ్యాస్త్రమును, శీతేషువు అని పిలువబడు మానవాస్త్రమును, శిఖరి మోదకి అనెడి గదలను, నందకము అనెడి ఖడ్గమును ఇంకను అనేక దివ్యాస్త్రములను ఉపదేశించినాడు.

మ. ముని మేల్కాంచుచు వేకువన్, విమలు రామున్ జూచి మేల్కొల్పి దీ
వెనలన్ గూర్చుచు మందహాసమున సంప్రీతిన్ వచించెన్ జనా
వనదక్షా! రఘురామ! యిచ్చెదను సర్వాస్త్రమ్ములన్ నీకిదే
కొనుమా యంచు, జపింపఁ, జేరె నవి యా కోదండరామున్ వెసన్. 203

సీ. కాలచక్రమ్మును ఘన విష్ణుచక్రమున్
ధర్మచక్రమ్మును దయ నొసంగెఁ
బావనైంద్రాస్త్రమున్ వజ్రాస్త్రము నొసంగె
నసమానమైన బ్రహ్మాస్త్ర మొసగెఁ
గీర్తింపఁదగిన యాగ్నేయాస్త్ర మొసగె వా
యవ్యాస్త్రమును భద్ర మనుచు నొసగె
స్థిరశక్తియుతమునై శీతేషు వన వెల్గు
మానవాస్త్రమును సమ్మతి నొసంగె
తే.గీ. శిఖరి మోదకి గదలను సిద్ధి నొసగె
ఘనత నందక మనెడి ఖడ్గమ్ము నొసగెఁ
గలనఁ బోరు దేవాసుర గణముఁ ద్రుంచి
జయము నొసగెడి దివ్యాస్త్రచయము నొసగె. **204**

ప్రతిగృహ్యా చ కాకుత్స్థః సమాలభ్య చ పాణినా॥ {1.27.24}
మనసా మే భవిష్యధ్వమ్ ఇతి తానభ్యచోదయత్॥ {1.27.25}

❋ రాముని చేరిన ఆ అస్త్రములు రామునికి నమస్కరించి "ఓ రాఘవా! సంతోషంగా మీకు సేవ చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాము. మీ ఆజ్ఞను పాటిస్తాము" అని విన్నవించుకొన్నాయి. "మీరు నామనసును అనుసరించి మెలగండి" అని రఘునాథుడు ప్రీతితో వాటిని స్వీకరించినాడు.

ఉ. రామునిఁ జేరి యస్త్రములు రక్తి నమస్కృతు లాచరించి "యు
ద్దామ పరాక్రమాఢ్య! యిక తావక సేవక భావ మొప్పగా
నేమముతోఁ జరింతు" మని నిర్ణయమున్ బ్రకటింప సర్వదా
నా మది నుండు డంచు రఘునాథుడు పల్కుచు వాని గైకొనెన్. **205**

28. విశ్వామిత్రుడు ఉపసంహార అస్త్రములను ఉపదేశించుట

గృహీతాస్త్రోఽస్మి భగవన్ దురాధర్ష స్సురైః అపి।
అస్త్రాణాం త్వహ మిచ్ఛామి సంహారం మునిపుంగవ॥ {1.28.2}
నిఃసృతాః స్మ మునిశ్రేష్ఠ కాంతారా ద్రోమహర్షణాత్। {1.28.19}
సర్వం మే శంస భగవన్ కస్యాశ్రమపదం త్విదమ్। {1.28.20}

❈ ఆ విధంగా అస్త్రసంపదలను స్వీకరించిన రఘురాముడు వాటికి సంబంధించిన ఉపసంహార అస్త్రములను కూడా అనుగ్రహించవలసినదిగా విశ్వామిత్ర మహర్షిని కోరినాడు. అప్పుడు కౌశికుడు భృశాశ్వుని సంతతియైన సంహారాస్త్రములను కూడా రామునికి ప్రీతితో ఉపదేశించినాడు. రఘువీరుడైన రాముడు ఆ అస్త్రములను కూడా స్వీకరించి వాటిని తన మనసునకు అనుగుణంగా ఉండవలసినదిగా తెలియజేసినాడు. ఆవిధంగా ప్రయోగ ఉపసంహార సమేతంగా సర్వవిధ అస్త్రములను స్వీకరించిన దశరథరాముడు గాధినందనుని కృపతో గొప్ప శ్రేయస్సును పొందినాడు. అటవీమార్గంలో వెళ్తూ రాముడు దారిలో అనేక విధములైన వృక్షములతో పక్షులతో సాధుజంతువులతో ఉన్న ఒక ప్రదేశాన్ని చూచి దానిని ఒక ఆశ్రమంగా గుర్తించి "ఓ మహర్షీ! ఇది ఎవరి ఆశ్రమమో తెలియజేయండి" అని అడిగినాడు.

శా. ఆ రీతిన్ గొని యస్త్రసంపదల తా నా యస్త్రసంహారమున్
గోరెన్ రాఘవు, డంతఁ గౌశికుడు సంకోచమ్ము లేకుండ సం
హారాస్త్రాల భృశాశ్వసంతతిని స్నేహమ్మొప్పగా నీయగా,
ధీరుండై గొనె వానిఁ, జిత్తమున వర్తింపంగ వాంఛించుచున్. 206

మ. వరుసన్ రాముడు నేర్చి యస్త్రతతి సర్వంబున్ బ్రయోగోపసం
హరణోపేతముగా, మునీశుకృప శ్రేయమ్మందె; మార్గమ్మునన్
దరులన్ బక్షుల సాధుజంతువుల సందర్శించుచున్, మౌనిరా
ద్వర! యీ యాశ్రమసీమ యెవ్వరిదొ తెల్పన్ మిమ్ము నర్థించెదన్. 207

సంప్రాప్తా యత్ర తే పాపాః బ్రహ్మఘ్నా దుష్ట చారిణః॥ {1.28.20}
భగవన్ తస్య కో దేశః సా యత్ర తవ యాజ్ఞికీ॥ {1.28.21}
ఏష పూర్వాశ్రమో రామ వామనస్య మహాత్మనః॥ {1.29.3}
సిద్ధాశ్రమ ఇతి ఖ్యాతః సిద్ధో హ్యత్ర మహాతపాః। {1.29.4}

❉ "ఓ మహర్షీ! ఈ ఆశ్రమం ఎవరిది? మాయలతో సంచరించేవారు మహాకాయులు దురాత్ములు ఖలులు అగు రాక్షసులు మీ యజ్ఞమును పాడుచేసినారని తెలిపినారుకదా! వారు ఏ ప్రదేశానికి వస్తూ ఉంటారు? మీరు యజ్ఞం చేసే ప్రదేశం ఏది? నేను ఆ దుష్టుల దేహాలను నేల కూల్చవలసిన ప్రదేశం ఏది?" అని కోదండరాముడు అడుగగా విశ్వామిత్రుడు "ఓ రఘురామా! ఈ ఆశ్రమాన్ని వామన ఆశ్రమము అని అంటారు. దేవతలందఱికీ పెద్దయైన విష్ణుమూర్తి పూర్వం ఈ అటవీప్రాంతంలో తపస్సు చేసినాడు. అప్పుడు ఆ భగవానుని మనోరథం సిద్ధించింది. అందువలన ఈ ఆశ్రమము సిద్ధాశ్రమము అనే పేరుతో ప్రసిద్ధికెక్కి విరాజిల్లుతూ ఉన్నది" అని వివరించసాగినాడు.

శా. "మాయన్గూడి చరించు రాక్షసు లసామాన్యుల్ దురాత్ముల్ ఖలుల్
మీ యజ్ఞమ్మునుఁ బాడుచేసిరని స్వామీ! తెల్పినారల్, మహా
కాయుల్ వారరుదెంచు తావును, సమిత్కార్యార్థధామమ్ముఁ, ద
త్కాయాళిన్ బడవేయనౌ క్షితిని వేడ్కన్ దెల్పగా వేడెదన్". 208

మ. అని యా రాముడు కౌశికున్ బలుకగా నాత్మీయతన్ గాధిజుం
డనె "రామా! యిది వామనాశ్రమము దేవాధీశుడౌ విష్ణు వీ
వనసీమన్ దప మాచరించె, మదిఁ దద్భావమ్ము సిద్ధించుటన్
ఘన సిద్ధాశ్రమ నామధేయమున వేడ్కన్ రాజిలున్ దివ్యమై. 209



29. సిద్ధాశ్రమ వృత్తాంతము

ఏతస్మి న్నేవ కాలే తు రాజా వైరోచని ర్బలిః॥ {1.29.4}
నిర్జిత్య దైవతగణాన్ సేంద్రాంశ్చ సమరుద్గణాన్। {1.29.5}
స త్వం సురహితార్థాయ మాయా యోగ ముపాశ్రితః।
వామనత్వం గతో విష్ణో కురు కల్యాణ ముత్తమమ్॥ {1.29.9}

❋ శ్రీపతియైన విష్ణుమూర్తి సుదీర్ఘమైన తపస్సును చేసే సమయంలో రాక్షసరాజైన బలిచక్రవర్తి భూలోకవాసులను, స్వర్గలోకవాసులను సంపూర్ణంగా జయించి ముల్లోకాలను పాలిస్తూ గర్వాన్ని పొందినటువంటివాడై దేవతలకు సంతాపాన్ని కలిగిస్తూ ఉండగా దేవతలందరూ విష్ణుభగవానుని చేరి "ఓ జనార్దనా! విరోచనుని కుమారుడగు బలిచక్రవర్తి భూలోకంలో ఒక యజ్ఞం చేస్తూ ఉన్నాడు. యజ్ఞం చేసే సమయంలో ఆ బలిచక్రవర్తి ఎవరు ఏమి అడిగినా దానంగా ఇస్తాడు. కాబట్టి నీవు దేవహితం కొఱకు నీ కళలను ఉపసంహరించినవాడవై వామన రూపంలో అతనివద్దకు వెళ్లి మా స్వర్గలోకాన్ని అడుగు. దేవలోకాన్ని దానంగా స్వీకరించి మాకు అప్పగించు" అని ప్రార్థించినారు. అదే సమయంలో కాశ్యప ప్రజాపతి పుత్రసంతాన కాంక్షతో దీక్షగా ఒక వ్రతం చేస్తూ ఉండినాడు" అని విశ్వామిత్ర ముని రామునికి సిద్ధాశ్రమ విశేషాలను విశదీకరించసాగినాడు.

ఉ. శ్రీపతి దీర్ఘమౌ తపముఁ జేయు తఱిన్ బలిచక్రవర్తి యీ
భూపతులన్ దివౌకసుల పూర్ణముగాగ జయించి, దేవసం
తాపముఁ గూర్చువాడగుచు దర్పము నందగఁ, "గష్టరాసులన్
బాపు మటంచు దేవతలు ప్రార్థనఁ జేసి రిటుల్ జనార్దనున్". 210

మ. "ఇల వైరోచని యజ్ఞమం దడుగుచో నేమైన నిచ్చున్, భవ
త్కళలన్ లోగొని వామనుండ వయి మా ధామమ్ము నర్థింపుమా!
కలుగున్ దేవహిత" మ్మటంచుఁ బలుకంగా నత్తఱిన్ గాశ్యపుం
డలఘుస్ఫూర్తి వ్రతమ్మొనర్చె వరపుత్రాకాంక్షతో దీక్షతో. 211

పుత్రత్వం గచ్ఛ భగవన్ అదిత్యా మమ చానఘ॥ {1.29.16}
భ్రాతా భవ యవీయాం స్త్వం శక్ర స్యాసురసూదన। {1.29.17}
త్రీన్ క్రమా నథ భిక్షిత్వా ప్రతిగృహ్యా చ మానదః। {1.29.20}
మహేంద్రాయ పునః ప్రాదాత్ నియమ్య బలి మోజసా। {1.29.21}

❈ కాశ్యపుని వ్రతం సంతోషంగా పూర్తికాగా శ్రీపతియైన జనార్దనుడు ప్రత్యక్షమైనాడు. "ఓ మాధవా! నీవు అదితికి నాకు పుత్రుడుగా జన్మించాలి. ఆ పురుహూతునికి సోదరుడవై నీవు ఉపేంద్రుడుగా పేరు పొందాలి" అని వరం కోరుకొని కాశ్యపుడు ఆ విష్ణువును భక్తితో కీర్తించినాడు. తథాస్తు అనిన శ్రీహరి అదితికి కాశ్యపునికి కుమారుడుగా వామనమూర్తిగా అవతరించినాడు. బలిచక్రవర్తిని సమీపించి మూడడుగులు దానంగా అడిగినవాడై తన విశ్వరూపాన్ని చూపించినవాడై త్రివిక్రముడై మూడు లోకాలను ఆక్రమించి ఇంద్రునికి సమర్పించి ఉపేంద్రుడు అనే పేరుతో ప్రసిద్ధి కెక్కినాడు" అని విశ్వామిత్ర ముని రామునికి సిద్ధాశ్రమ విశేషాలను విశదీకరించసాగినాడు.

చం. ముదమునఁ దద్వ్రతమ్ము పరిపూర్ణము గాగ, జనార్దనుండు సం
పదల నొసంగు శ్రీపతి శుభస్థితిఁ గన్పడఁ, జూచి "మాధవా!
అదితికి నాకుఁ బుత్రుడుగ, నా పురుహూతుని సోదరుండుగా,
నిదె జనియింపుమా" యనుచు స్వేచ్ఛ నుతించెను గాశ్యపుం డటన్. 212

ఉ. ప్రీతిగ నంతఁ దా నవతరించెను విష్ణువు వామనుండుగా,
భూతిని గోరె నా బలిని మూడడుగుల్, ఘన విశ్వరూపుడై
ఖ్యాతిఁ ద్రివిక్రముండుగ నఖండముగాఁ గొనె మూడులోకముల్,
దాతగ నిచ్చె నింద్రునికి దానముగాగ నుపేంద్రుడై వెసన్. 213

తే నైష పూర్వ మాక్రాంతః ఆశ్రమః శ్రమనాశనః।
మయాపి భక్త్యా తస్యైషః వామన స్సోపభుజ్యతే॥ {1.29.22}
అత్రైవ పురుషవ్యాఘ్ర హంతవ్యా దుష్టచారిణః॥ {1.29.23}
తదాశ్రమపదం తాత తవాప్యేత ద్యథా మమ॥ {1.29.24}

❋ "ఓ రాఘవా! తన తపస్సు ఫలించగా వామనమూర్తి ఇచ్చటనే సిద్ధిని పొందినాడు. తాను కోరుకొన్నట్లు శ్రీహరిని పుత్రునిగా పొంది కాశ్యపుడు ఇచ్చటనే సిద్ధిని పొందినాడు. దేవతలు కూడా ఇచ్చటనే మధువైరిని సేవించి సిద్ధిని పొందినారు. ఆ విధంగా అందఱికీ సిద్ధిని సమకూర్చే ఈ ఆశ్రమమే సిద్ధాశ్రమము. ఇదియే ప్రస్తుతం నేను నివసిస్తున్న నా సిద్ధాశ్రమము. వామనమూర్తి మెలగిన ఈ సిద్ధాశ్రమం నాది మాత్రమే కాదు. మీది కూడా సుమా! సిద్ధిప్రదమైనది రమ్యమైనది అగు ఈ ఆశ్రమం లోపలకు ఇప్పుడు మనం వెళ్లాము. నీవు నా యజ్ఞమును రక్షింపవలసినది ఇచ్చటనే. నీ శక్తిసామర్థ్యములతో రాక్షసావళిని వధించవలసినది కూడా ఈ సిద్ధాశ్రమంలోనే" అని విశ్వామిత్రముని ఆ ఆశ్రమ విశేషములను విశదీకరించినాడు.

శా. సిద్ధిన్ బొందెను వామనుండు తపముల్ సిద్ధింపగా నిచ్చటన్,
సిద్ధిన్ బొందెను గాశ్యపుండు హరియే సిద్ధింపగాఁ బుత్రుడై,
సిద్ధిన్ బొందిరి దేవతల్ మధురిపున్ సేవించుచున్, రాఘవా!
సిద్ధిన్ గూర్చు మదాశ్రమమ్ము వినుమా! సిద్ధాశ్రమ మ్మియ్యదే. 214

శా. శ్రీమంతం బిట వామనుండు మెలగెన్, సిద్ధాశ్రమం బన్న నో
రామా! నాదియె కాదు మీదియు సుమా! రమ్యాశ్రమం బిద్ది, సం
క్షేమంబున్ గన లోనికేగెద, మిటన్ సేవింపనౌ యజ్ఞమున్,
సామర్థ్యమ్మున రాక్షసావళి వధన్ సల్పంగ నౌ నాననెన్. 215

యథార్హం చక్రిరే పూజాం విశ్వామిత్రాయ ధీమతే।
తథైవ రాజపుత్రాభ్యాం అకుర్వ న్నతిథిక్రియామ్॥ {1.29.27}
ప్రభాత కాలే చోత్థాయ పూర్వాం సంధ్యా ముపాస్య చ
హుతాగ్నిహోత్ర మాసీనం విశ్వామిత్ర మవందతామ్॥ {1.29.32}

❋ వనంలో ఉన్న సిద్ధాశ్రమంలో కాలుపెట్టిన విశ్వామిత్ర గురువర్యులను చూచిన శిష్యులు భక్తితో గురుపూజ చేసినారు. గురువర్యుని అనుసరించి వచ్చిన

రాముని లక్ష్మణుని అతిథిసత్కారాలతో గౌరవించినారు. విశ్వామిత్రుడు తన సిద్ధాశ్రమమును చేరుకొన్న సంతోషంతో ఎట్టి సంకోచమూ లేనివాడై యజ్ఞాన్ని ప్రారంభించేందుకు సంకల్పించినాడు. రాత్రి గడచిపోగా రామలక్ష్మణులు వేకువనే మేల్కొన్నారు. భానువంశసంజాతులు రాజకుమారులు అగు ఆ ఇరువురు ప్రాతఃకాల సంధ్యావందనాది కార్యములను పూర్తిచేసినారు. యజ్ఞవేదిక దగ్గర అగ్నిని వ్రేల్చుటకు సిద్ధంగా ఉన్న విశ్వామిత్రుని చూచి నమస్కరించినారు. సంతోషంతో ఒడలు పులకరింపగా "ఓ మునివంద్యా! మేము మీకు ఏ విధంగా సహకారమును అందజేయవలెనో సెలవివ్వండి" అని అడుగసాగినారు.

మ. వని సిద్ధాశ్రమమందు కాలిడిన విశ్వామిత్రు దర్శించి యా
ర్తిని శిష్యుల్ గురుపూజఁ జేసి, మధురాతిథ్యమ్ము నందించి రా
ముని సౌమిత్రిని గారవింప, ముని సమ్మోదమ్ముతో దీక్ష గై
కొని యజ్ఞమ్మును జేయఁ బూనె మది సంకోచమ్ము లేకింతయున్. 216

ఉ. రాత్రి గతింప మేల్కొనిన రాజకుమారులు భానువంశ స
త్పుత్రులు సాంధ్యకృత్యములఁ బూర్తిగఁ దీర్చుచు, యజ్ఞవేదికన్
బాత్రత నగ్ని వ్రేల్చు మునివంద్యునిఁ జూచి నమస్కరించుచున్
గాత్రము పుల్కరింప సహకారముఁ గూర్ప వచించి రిట్టులన్. 217



30. శ్రీరాముడు దుష్టశిక్షణ చేసి యజ్ఞమును సంరక్షించుట

భగవన్ శ్రోతు మిచ్ఛావో యస్మిన్ కాలే నిశాచరౌ।
సంరక్షణీయౌ తౌ బ్రహ్మన్ నాతివర్తేత తత్క్షణమ్॥ {1.30.2}
అద్య ప్రభృతి షడ్రాత్రం రక్షతం రాఘవౌ యువామ్।
దీక్షాం గతో హ్యేష ముని ర్మౌనిత్వం చ గమిష్యతి॥ {1.30.4}

❋ "ఓ మౌనివర్యా! యజ్ఞమును పాడుచేసే రాక్షసులు ఎప్పుడు వస్తారో, ముందుగా ఏ దిక్కు నుండి వస్తారో ఆలోచించి చెప్పండి. మేము మేటి ధనుర్బాణములను ధరించి మీ యజ్ఞమును సంరక్షించగలము" అని రామలక్ష్మణులు విశ్వామిత్ర మహర్షిని చూచి అంటూ ఉండగా, ఆ ఆశ్రమంలో ఉండే మునులు వారి మాటలను మెచ్చుకొని "ఓ రామలక్ష్మణులారా! గురువర్యులు యజ్ఞదీక్షను చేపట్టి ఇప్పుడు మౌనవ్రతంలో ఉన్నారు. మీరు ప్రతిన బూని నిద్రాహారాలు మాని అన్నివేళలా యజ్ఞవేదికను సంరక్షిస్తూ ఉండాలి. అన్నిలోకముల సంక్షేమం కొఱకు చేస్తున్న ఈ యాగము జరిగే సమయంలో మీరు ఆరురోజులపాటు రాత్రింబవళ్లూ గురుసేవలో ఉండాలి" అని హితవు పలికినారు.

ఉ. ముప్పొనగూర్చు రాక్షసులు ముందుగ నే దిశనుండి వత్తురో?
యెప్పుడు వచ్చువారొ? గణియించి వచింపుడు మౌనివర్య! మే
మిప్పుడు మీదు యజ్ఞము నహీన శరమ్ములఁ గాచువార" మం
చొప్పుచుఁ బల్క, మెచ్చుచు మృదూక్తుల మౌనులు వల్కి రిట్టులన్. 218

శా. మా మాటల్ వినుడీ, మహర్షి దనరున్ మౌనవ్రతమ్మందె, య
య్యా! మీరల్ చరియింపుడీ ప్రతిన నిద్రాహారముల్ మాని, యో
రామా! లక్ష్మణ! యజ్ఞవేదికను సంరక్షించుడీ లోక సం
క్షేమార్థంబుగ నారురోజులు, మునిన్ సేవింపుడీ రేఁబవల్" 219

తౌ తు తద్వచనం శ్రుత్వా రాజపుత్రౌ యశస్వినౌ।
అనిద్రౌ షడహోరాత్రం తపోవన మరక్షతామ్॥ {1.30.5}
అథ కాలే గతే తస్మిన్ షష్ఠేఽహని సమాగతే। {1.30.7}
ప్రజజ్వాల తతో వేది స్సోపాధ్యాయపురోహితా॥ {1.30.8}

❊ ఆఱు రోజులపాటు యజ్ఞసంరక్షణ చేయాలని ఆ ఆశ్రమంలోని మునులు తెలుపగా రామలక్ష్మణులు అందుకు సిద్ధమయ్యారు. నిద్రాహారాలు మాని ధనుర్ధారులై శరసంధానం చేసి లక్ష్యోన్ముఖులయ్యారు. అచ్చటి మునులు మెచ్చుకొనే విధంగా యజ్ఞమును కౌశిక మహర్షిని సంరక్షింపసాగినారు. ఆఱవరోజున రాముడు "ఓ లక్ష్మణా! యజ్ఞరక్షణకు సిద్ధమే కదా!" అని అంటూ ఉండగా యజ్ఞవేదికలోని అగ్నిశిఖ గొప్పగా ప్రజ్వరిల్లి యజ్ఞం పరిపూర్ణమై సత్ఫలితాన్నిస్తుంది అని సూచించినదా అన్నట్లు అందఱికీ ఆనందాన్ని కలిగించింది.

మ. మునిసంఘం బటు పల్క, వల్లె యని సమ్మోదమ్ముతో రామ ల
క్ష్మణు లాహారము నిద్ర మాని శరముల్ సంధించి రాత్రింబవ
ళ్లను భేదమ్మును మాని యాఱుదినముల్ లక్ష్యోన్ముఖుల్ గా మహ
ర్షిని యజ్ఞమ్మును గాచినా రచట వారిన్ మెచ్చగాఁ దన్మునుల్. 220

ఉ. ఆదర మొప్ప రామవిభు డాఱవనాడు ధనుస్సుఁ బట్టుచున్
సోదర! లక్ష్మణా! సవముఁ జూడగ సిద్ధము కమ్మనంగ నా
వేదికలోని యగ్నిశిఖ వేడుక గొప్పగఁ బ్రజ్వరిల్లి స
మ్మోదముఁ గూర్చె నెల్లరకుఁ బూర్ణఫలమ్ము నొసంగు సూచనన్. 221

మంత్రవచ్చ యథాన్యాయం యజ్ఞోఽసౌ సంప్రవర్తతే।
ఆకాశే చ మహాన్ శబ్దః ప్రాదు రాసీ ద్భయానకః॥ {1.30.10}
మారీచశ్చ సుబాహుశ్చ తయో రనుచరాశ్చ యే
ఆగమ్య భీమసంకాశా రుధిరౌఘ మవాసృజన్॥ {1.30.12}

❋ శాస్త్రవిధిని అనుసరించి మంత్రపూర్వకంగా క్రతువు నిర్వహింపబడుతూ ఉండగా మనోవ్యథను కలిగించే భయంకర శబ్దాలు ఆకాశంలో ఏర్పడినవి. మహారథులైన రామలక్ష్మణులకు కనిపించేవిధంగా మారీచుడు సుబాహువు అనే రాక్షసులు ఆకాశంలో అటు ఇటు తిరుగసాగినారు. అనుచర వర్గంతో కూడినవారై గుంపులు గుంపులుగా ఉన్న ఆ దైత్యులు గర్జనలు చేస్తూ మేఘమండలంలో తిరుగాడుతూ విశ్వామిత్రముని చేసే యజ్ఞమునకు పైభాగమున ఉండి యజ్ఞవేదిక నిండిపోయేటట్లు రక్తాన్ని క్రుమ్మరించినారు. దానిని గమనించిన రఘురాముడు ఆగ్రహోదగ్రుడై ఆ రాక్షసులను తక్షణమే అక్కడినుండి పారదోలాలి అని నిశ్చయించుకొన్నాడు.

మ. విధిగా మంత్రయుతమ్ముగాఁ గ్రతువు నిర్భీతిన్ జెలంగన్, మనో
వ్యథఁ గల్గించెడి ఘోరశబ్దములు మ్రోయం జొచ్చె నింగిన్, మహా
రథులౌ రాముడు లక్ష్మణుండు గనఁ జేరన్ వచ్చి రా రాక్షసుల్
వధకున్ యోగ్యతతో సుబాహుడు ధృతిన్ వర్తించు మారీచుడున్. 222

చం. అనుచరవర్గ మొప్పగ భయంకర దైత్యులు మేఘమండల
మ్మున ఘనగర్జనాదుల సమూహముగా చరియించుచుండి త
న్మునికృతయజ్ఞవేదిఁ బరిపూర్ణముగా రుధిరమ్ముఁ గ్రుమ్మరిం
చినఁ, గని రాము డుగ్రుడయి శీఘ్రమె వారలఁ ద్రోల నెంచుచున్. 223

మానవం పరమోదార మస్త్రం పరమభాస్వరమ్।
చిక్షేప పరమ క్రుద్ధో మారీచోరసి రాఘవః॥ {1.30.16}
స తేన పరమాస్త్రేణ మానవేన సమాహితః।
సంపూర్ణం యోజన శతం క్షిప్త స్సాగర సంప్లవే॥ {1.30.17}

❋ మారీచ సుబాహులను శిక్షింపదలచిన రఘురాముడు తమ్ముని చూచి "ఓ లక్ష్మణా! ఆకాశంలో సంచరిస్తున్న ఆ దైత్యులను చూడు. మహర్షి ఉపదేశించిన నూతనాస్త్రములను ఇప్పుడు ఆ రాక్షసులపై ప్రయోగించి వారిబలమును నశింపజేస్తాను. వారి మాయాప్రభావాన్ని పూర్తిగా తొలగిస్తాను" అని అంటూ

మానవాస్త్రాన్ని మనసులో స్మరించినాడు. దశరథరాముడు మానవాస్త్రాన్ని చేతబట్టి మారీచుని వక్షస్థలానికి గురిపెట్టి ప్రయోగించగా ఆ అస్త్రం మారీచుని పాఱిపోయేటట్లు మూర్ఛపోయేటట్లు చేసింది. వక్షస్థలమును తాకిన ఆ అస్త్రము మారీచుని ప్రాణములు తీయకుండా అతనిని నూరుయోజనాలకు అవతల సముద్రంలో పడవేసింది.

ఉ. తమ్ముఁడ! లక్ష్మణా! చదల దైత్యులఁ జూడుము, వారి నూతనా
స్త్రమ్ములఁ బాఱఁదోలెదను, రాక్షసమాయల నుక్కడంచెదన్,
వమ్మొనరింతు వారల ప్రభావము నెల్ల" యటంచుఁ బల్కి చే
తమ్మున మానవాస్త్రమును దా స్మరియించె రఘూద్వహుం డటన్. 224

శా. కేలన్ దాలిచి మానవాస్త్రముఁ బ్రయోగింపంగ మారీచుపై,
లీలన్ వానిని బాఱఁద్రోలి యది వార్ధిం గూలగాఁ జేసె, దు
శ్శీలుం డాతడు మూర్ఛ నంది యురమున్ ఛేదింప బాణమ్ము దా
వ్రాలెంగా శతయోజనాల కవలన్ బ్రాణావశిష్టుండుగా. 225

సంగృహ్యాస్త్రం తతో రామో దివ్య మాగ్నేయ మద్భుతమ్।
సుబాహూరసి చిక్షేప స విద్ధః ప్రాపత ద్భువి॥ {1.30.21}
శేషాన్ వాయవ్య మాదాయ నిజఘాన మహాయశాః।
రాఘవః పరమోదారో మునీనాం ముద మావహన్॥ {1.30.22}

❊ "ఓ లక్ష్మణా! మానవాస్త్రంతో మారీచుడు దూరంగా ఉన్న సముద్రంలో పడేట్లు చేసినాను. ఈ ఆగ్నేయాస్త్రంతో సుబాహువును వధిస్తాను" అని అంటూ రఘురాముడు ఆ అస్త్రమును ప్రయోగించి ఆ రాక్షసుని వక్షస్థలమును చీల్చివేసినాడు. మరణించిన సుబాహునియొక్క దేహం నేలకూలింది. రాముడు వాయవ్యాస్త్రం ప్రయోగించి ఆ రాక్షసుల అనుచరులను సంహరించినాడు. మారీచుడు సుబాహువు వారిని అనుసరించిన ఇతర రాక్షసులు పూర్తిగా వధింపబడగా మునులందఱూ ఎంతగానో సంతోషించినారు. "ఓ రాఘవా! నీవు మా యజ్ఞమును చక్కగా సంరక్షించినావు. వీరాగ్రగణ్యుడవైన నిన్ను

అభినందించి నీకు మేము తగువిధంగా పూజ చేయదలచినాము. మా పూజలను స్వీకరించు" అని అచ్చటి మునులు రాముని వేడుకొనగా, రాముడు ఎంతో ఆదరంతో వారి పూజలను స్వీకరించినాడు.

మ. కనుమా లక్ష్మణ! రాక్షసాధముల మూకన్, వారు దూరాని కే
గిన నే వీడ, సుబాహు గూల్తు" నని యాగ్నేయాస్త్రమున్ వేసి యా
తని వక్షమ్మును జీల్చి చంపఁ, బడె తద్దుష్టాత్మదేహమ్ము నే
లను, వాయవ్యము నేసె సేనలను గూల్పన్‌రామభద్రుం డటన్. 226

మ. బుధులౌ మౌనులు మోదమంది రఘురామున్ జూచి మాయాబలా
యుధు మారీచునిఁ బాఱఁద్రోలుచు సుబాహున్ వారి సైన్యమ్ములన్
వధియింపన్, "క్రతురక్షణమ్ము జరిగెన్ భవ్యమ్ముగా రాఘవా!
విధివత్పూజలఁ గొ" మ్మనంగఁ, గొనె నా వీరాగ్రగణ్యుం డటన్. 227


స హత్వా రాక్షసాన్ సర్వాన్ యజ్ఞఘ్నాన్ రఘునందనః।
ఋషిభిః పూజిత స్తత్ర యథేంద్రో విజయే పురా॥ {1.30.23}
కృతార్థోఽస్మి మహాబాహో కృతం గురువచ స్త్వయా।
సిద్ధాశ్రమ మిదం సత్యం కృతం రామ మహాయశః॥ {1.30.25}

❋ యజ్ఞం ఫలవంతంగా సమాప్త మయ్యేందుకు రఘురాముడు దైత్యులను సంహరించగా, దేవలోకంలో దేవతలు ఇంద్రుని ఏ విధంగా స్తుతిస్తారో ఆవిధంగా సిద్ధాశ్రమంలోని మునులు రాముని స్తుతించినారు. పరమానందమును పొందిన విశ్వామిత్ర మహర్షి "ఓ దశరథరామా! తండ్రిమాటను శిరసావహించి నాయజ్ఞమును చక్కగా రక్షించి విజయసిద్ధితో ప్రకాశిస్తూ ఉన్నావు. నా ఆశ్రమమునకు కృతార్థత సిద్ధించింది. ఇప్పుడు శాంతిధామంగా శ్రీమంతంగా ఉన్న ఈ సిద్ధాశ్రమం ఇక నామసార్థకతను కూడా పొందగలదు" అని రాముని ప్రస్తుతించినాడు.

కం. సవము సమాప్తం బగుటకు
భువి దైత్యుల గూల్చె రామభూవిభు డతనిన్

గవులై పొగడిరి మౌనులు
దివి నింద్రు నుతించునట్టి దివిజుల మాడ్కిన్. 228

శా. రామున్ బల్కె మునీంద్రు డిట్లు "క్రతువున్ రక్షించినావయ్య ! సం
క్షేమం బబ్బగఁ దండ్రిమాట వినుచున్ జెల్వొందినావయ్య ! శ్రీ
ధామంబయ్యె మదాశ్రమంబును గృతార్థత్వంబుతో, నింక సు
శ్రీమంతంబుగ నామసార్థకత నీ సిద్ధాశ్రమం బొప్పెడిన్" 229



31. మిథిలా ప్రయాణము

ప్రభాతాయాం తు శర్వర్యాం కృతపౌర్వాహ్ణికక్రియౌ।
విశ్వామిత్ర మృషీం శ్చాన్యాన్ సహితా వభిజగ్మతుః॥ {1.31.2}
మైథిలస్య నరశ్రేష్ఠ జనకస్య భవిష్యతి।
యజ్ఞః పరమ ధర్మిష్ఠ స్తత్ర యాస్యామహే వయమ్॥ {1.30.6}

❈ యజ్ఞమును సంరక్షించిన రామలక్ష్మణులు ఆ నాటి రాత్రి సిద్ధాశ్రమంలో నిశ్చింతగా హాయిగా నిద్రించినారు. వారిరువురు వేకువనే నిద్రలేచి ప్రాతఃకాల సంధ్యావందనాది పూజావిధులను పూర్తిచేసి ఏమాత్రము గర్వమును పొందకుండా విశ్వామిత్ర మహర్షిని చూచేందుకు వెళ్లినారు. రాజకుమారులైన రామలక్ష్మణులు మునిరాజైన కౌశికుని చూచి కింకరుల వలె మెలగుతూ ఎంతో వినయంతో నమస్కరించినారు. రాముని చూచి గాధిజుడు సంతోషిస్తూ ఉండగా అచ్చట ఉన్న మునులు "ఓ రఘురామా! మనం మిథిలకు వెళ్దాము. ఆ నగరంలో ఒక గొప్ప యజ్ఞము జరుగగలదు. అచ్చటికి వెళ్లినట్లైతే మనం ఆ యజ్ఞముతో పాటు మహిమాన్వితమైన శివధనుస్సును కూడా చూడవచ్చు" అని రామునికి మిథిలానగర విశేషములను వివరింపసాగినారు.

ఉ. అంతట రామలక్ష్మణులు హాయిగ రాత్రి పరుండినారు, ని
శ్చింతగ లేచి వేకువన శ్రీకర సంధ్యల వార్చినార లా
వంతయు గర్వమందక మహర్షినిఁ జూడగఁ నేగినారు త
చ్చింత దొలంగినన్ వినయశీలతఁ గింకరులై చరింపగన్. 230

ఉ. రాముడు లక్ష్మణుండు మునిరాజునుఁజేరి నమస్కరింపగా
రామునిఁ జూచి కౌశికుడు రంజిల మౌనులు వల్కి రిట్టులన్
"రామ! చనంగనౌ మిథిల, రాజిలు నచ్చట దివ్య యజ్ఞ, మా
సీమ మహేశదత్తమగు శ్రేష్ఠధనుస్సునుఁ జూడగా నగున్. 231

త్వం చైవ నరశార్దూల సహాస్మాభి ర్గమిష్యసి।
అద్భుతం ధనురత్నం చ తత్ర తద్ద్రష్టు మర్హసి॥ {1.31.7}
ధనుష స్తస్య వీర్యం తు జిజ్ఞాసంతో మహీక్షితః।
న శేకు రారోపయితుం రాజపుత్రా మహాబలాః॥ {1.31.10}

❊ "ఓ రఘురామా! మిథిలానగరంలో ఉన్న ఆ శివధనుస్సు గొప్ప మహిమతో కూడినట్టిది. అప్రమేయము భారవంతము పరమ భాస్వరము అగు ఆ శివధనుస్సు అపూర్వమైనది. గొప్ప వీరులు శూరులు అగు దేవతలు రాక్షసులు ఎంతగా ప్రయత్నించిననూ దానిని ఎక్కుపెట్టలేకపోయినారు. భూపతులు ఎంతోమంది వచ్చి దానిని ఎక్కుపెట్టలేక దీనభావంతో వెనుదిరిగి వెళ్లినారు. మూడులోకములవారికి అసాధ్యముగా ఉన్న ఆ ధనుస్సును సామాన్యులైన మానవులు ఎక్కుపెట్టగలరా? మనము గాధితనూజుడైన ఈ విశ్వామిత్రుని వెంట మిథిలకు వెళ్లి అద్భుతమైన ఆ ధనూరత్నమును, అచ్చట జరుగు యజ్ఞమును చూద్దాము" అని సిద్ధాశ్రమంలోని మునులు మిథిలానగర విశేషములను రామునికి విశదీకరించసాగినారు.

ఉ. ఆరయ నా ధనుస్సు మహిమాఢ్య మపూర్వము నప్రమేయమున్
భారయుతమ్మునున్ బరమభాస్వరరూపముఁ గాన, దాని నే
వీరులు శూరులున్ ఘనులు వేల్పులు రాక్షసు లెక్కు పెట్టగా
నేరరు మూడు లోకముల, నేర్తురె మానవు లెంతవారలేన్? 232

ఉ. ఆ ధనువీర్యమున్ గనెద మంచు మహీపతు లెందఱెందఱో
సాధన దాని నెక్కిడగఁ జాలక దీనత నేగినారు, త
ద్గాథ మహాద్భుతమ్ము గనుకన్ మిథిలాపురి కేగుచుంటి మీ
గాధితనూజు వెంటఁ జని కాంచెద మా ధనువున్ సుయజ్ఞమున్. 233

తద్ధి యజ్ఞఫలం తేన మైథిలే నోత్తమం ధనుః।
యాచితం నరశార్దూల సునాభం సర్వదైవతైః॥ {1.31.12}
ఏవ ముక్త్వా మునివరః ప్రస్థాన మకరో త్తదా।
సర్షిసంఘః సకాకుత్స్థ ఆమంత్ర్య వనదేవతాః॥ {1.31.14}

❀ "ఓ రఘురామా! పూర్వకాలమున మిథిలను పరిపాలించినవారిలో ఒక రాజు మతిమంతుడై ఒక యజ్ఞమును చేయగా దేవతలు ప్రత్యక్షం కాగా "ఓ సురలారా! నాకు యజ్ఞఫలంగా శివధనుస్సును ప్రసాదించండి" అని వేడినాడు. అట్లే అని అమరులు ఆ ధనుస్సును ఆ రాజునకు ఇచ్చినారు. ఆనాటినుండి ఈనాటివఱకు ఆ మిథిలానగర ప్రభువులు దివ్యమైన ఆ శివధనుస్సును భక్తిప్రపత్తులతో నిత్యమూ అర్చిస్తూ ఉన్నారు" అని మునులు శివధనుస్సును గుఱించి రామునికి చెప్పినారు. ఆ తరువాత గాధితనూజుడైన విశ్వామిత్రుడు ఆ రామలక్ష్మణులను మునులను వెంటబెట్టుకొని మిథిలకు బయలుదేరదలచినాడు. కౌశికుడు ఆ సిద్ధాశ్రమంలో ఉన్న వృక్షములను చూచి "ఓ వనదేవతలారా! మిమ్ము వదలిపెట్టి నేను హిమాద్రికి వెళ్లదలచినాను. మీకు శుభం కలుగుగాక!" అని సుహృద్భావంతో పలికినాడు.

మ. సుమతిన్ యజ్ఞ మొనర్ప మున్ను మిథిలేశుం డొక్క, డా దేవతల్
గములై కన్పడ వేడె యజ్ఞఫలమున్ గాంక్షించి తచ్చాపమున్,
సమతన్ వార లొసంగఁ, దద్ధనువు భాస్వద్రీతి నర్చాదులన్
విమలంబై చెలువొందు నా మిథిలలో విఖ్యాతమై నేటికిన్. 234

చం. మునివరులట్లు వల్క, మునిముఖ్యుడు గాధితనూజు డంతటన్
మునులను రామలక్ష్మణులఁ బొందికఁ దోడ్కొని యేగనెంచి, పా
వన వనదేవతాళిఁ గని "భద్రము మీకు హిమాద్రి కేగ వీ
డ్కొని చనుచున్నవాడ" నని కూరిమిఁ బల్కెను దివ్యభావనన్. 235

ప్రదక్షిణం తతఃకృత్వా సిద్ధాశ్రమ మనుత్తమమ్।
ఉత్తరాం దిశ ముద్దిశ్య ప్రస్థాతు ముపచక్రమే॥ {1.31.16}
మృగ పక్షి గణా శ్చైవ సిద్ధాశ్రమ నివాసినః।
అనుజగ్ము ర్మహాత్మానం విశ్వామిత్రం మహామునిమ్॥ {1.31.18}

❀ మిథిలాప్రయాణమునకు ముందు విశ్వామిత్ర మహర్షి తాను అంతవఱకూ నివసిస్తూ ఉండిన పావన సిద్ధాశ్రమానికి భక్తితో ప్రదక్షిణం చేసినాడు. సిద్ధాశ్రమానికి ఉత్తరదిక్కున ఉన్న గంగానది వైపుగా తన ప్రయాణాన్ని

మొదలుపెట్టినాడు. బ్రహ్మవాదులైన మౌనివర్యులు వంద బండ్లపై వస్తూ ఆ మహర్షిని అనుసరించినారు. ఆశ్రమంలో సంచరించే మృగములు పక్షులు కూడా తమకు ఆత్మీయుడైన విశ్వామిత్రుని వెంబడించగా ఆ మహర్షి ఆదరభావంతో చూస్తూ వాటిని వెనుకకు మరలించినాడు. భాస్కరుడు అస్తమించేంత వఱకు ప్రయాణాన్ని కొనసాగించిన కౌశికుడు అనుచరసమేతంగా శోణానదిని చేరుకొని ఆ నదీతీరంలో రాత్రి ఉండేందుకు నిశ్చయించుకొన్నాడు.

చం. చనుటకు ముందు కౌశికుడు చక్కగఁ జేసెఁ బ్రదక్షిణమ్ము పా
వనమగు నాశ్రమమ్మునకుఁ, బాత్రత నుత్తరమందునున్న జీ
వనదిని గంగ నెంచి పరివారముతోఁ జనుచుండ బ్రహ్మభా
వన గల మౌనివర్యులును వచ్చిరి వెంబడి వందబండ్లపై. 236

చం. ప్రియమున నాశ్రమమ్మునఁ జరించు మృగమ్ములు పక్షిసంతతుల్
రయమున మౌని వెందవిలి రాగ వెసన్ మఱలించె మౌని దా
నయమునఁ, నట్టు లేగి మునినాథుడు భాస్కరు దస్తమింప ని
ర్భయమున నుండె శోణఁ గని రాత్రి వసింప నదీతటమ్మునన్. 237


భగవన్ కోన్వయం దేశః సమృద్ధ వన శోభితః॥ {1.31.23}
శ్రోతు మిచ్ఛామి భద్రం తే వక్తు మర్హసి తత్త్వతః। {1.31.24}
బ్రహ్మ యోని ర్మహానాసీత్ కుశో నామ మహాతపాః।
అక్లిష్టవ్రతధర్మజ్ఞః సజ్జనప్రతిపూజకః॥ {1.32.1}

❊ విశ్వామిత్ర మహర్షి రామలక్ష్మణులతో, మునులతో కలిసి శోణానదీతీరమునకు చేరుకోగా సూర్యుడు పశ్చిమాద్రికి చేరుకొన్నాడు. వారంతా సాయంకాల సంధ్యావందనాది కార్యక్రమాలను పూర్తిచేసినారు. దశరథరాముడు తమ్ముడైన లక్ష్మణునితో పాటు మునివరుని ముందు కూర్చొని "ఓ మహర్షీ! ఈ వనము యొక్క మహిమను తెలియజేయండి" అని ప్రార్థించినాడు. రాముని కోరిక మేర కౌశికుడు ఆ ప్రదేశమును గుఱించి చెబుతూ

"ఓ రామా! శ్రద్ధగా విను. ఈ ప్రదేశము రమ్యమైనది. దివ్యమైనది. ఎంతో పావనమైనది. పూర్వము బ్రహ్మపుత్రుడు, తపోధనుడు, ధార్మికుడు అగు కుశుడు ఇక్కడ నిత్యం వ్రతాలను ఆచరిస్తూ ఉండేవాడు" అని ఆ వనం గురించి వివరించసాగినాడు.

చం. ఇను డదె పశ్చిమాద్రి పయి కేగగ, రాముడు లక్ష్మణుండు త
న్మునులును గౌశికుండు రవిపూజ లొనర్చిరి, రాము డంతఁ ద
న్మునివరు ముందుఁ గూర్చొనెఁ బ్రమోదముతో సహజన్ముతోడఁ, ద
ద్వన మహిమమ్ము దెల్పుడని ప్రార్థనఁ జేసె మహర్షిఁ జూచుచున్. 238

ఉ. రాముని కోర్కి మేర ననురక్తి వచించె నిటుల్ మహర్షి "యో
రామ! వచించెదన్ వినుము రమ్యము దివ్యము పావనమ్ము నీ
ధామము, మున్ను సంయమి సుధార్మికుడౌఁ గుశు డుండె నిత్యస
త్కాముడు బ్రహ్మపుత్రుడు సతమ్ము వ్రతమ్ములఁ జేయువాడిటన్" 239



32. కౌశికుని వంశ వర్ణనము

వైదర్భ్యాం జనయామాస చతుర స్సదృశాన్ సుతాన్॥ {1.32.2}
కుశాంబం కుశనాభం చ ఆధూర్తరజసం వసుమ్। {1.32.3}
సుమాగధీ నదీ రమ్యా మాగధాన్ విశ్రుతా యయౌ।
పంచానాం శైలముఖ్యానాం మధ్యే మాలేవ శోభతే॥ {1.31.9}

❊ "ఓ రఘురామా! కుశుడు తనకు అన్నివిధాలా తగిన వైదర్భి అనే కన్యను వివాహం చేసికొన్నాడు. వారికి కుశాంబుడు కుశనాభుడు ఆధూర్తరజసుడు వసువు అనే నలుగురు కుమారులు కలిగినారు. ఋషివరుడైన కుశుడు క్షత్రియ ధర్మపరులైన కుమారులను పిలిచి "నాయనలారా! ప్రజలను కన్నబిడ్డలవలె భావిస్తూ రాజ్యమును చక్కగా పాలించండి" అని చెప్పగా ఆ నలుగురు క్రమంగా కౌశాంబి, మహోదయము, ధర్మారణ్యపురము, గిరివ్రజము అనే పేర్లతో నాలుగు పురములను నిర్మించుకొన్నారు. ఈ భూమి అంతా వసురాజుయొక్క సంపద. ఇక్కడ ఐదు పర్వతాలు ఉన్నాయి. మాగధి అనే పేరును కూడా కలిగియున్న శోణానది ఈ పర్వతాల చుట్టూ ఒక మాల వలె కనిపిస్తూ ప్రవహిస్తూ ఉన్నది అని విశ్వామిత్ర మహర్షి కుశుని వృత్తాంతమును వివరించసాగినాడు.

తే.గీ. ఆ కుశునకు వైదర్భి యర్ధాంగి యయ్యె
నాత్మజులుగను వసువు కుశాంబుడు కుశ
నాభు డాధూర్తరజసు డనంగ బుధులు
కలిగినారలు వారికి క్షాత్రమతులు. 240

తే.గీ. ఋషివరుండగు కుశుడు సంతృప్తి నంది
సుతుల రావించి "ప్రజల సంతతి సమముగ
నరసి చక్కగాఁ బాలింపు డనుచుఁ" బలుక
నాల్గు పురముల నిర్మించినారు వారు. 241

సీ. అధికతేజస్వి కుశాంబుడు నిర్మించెఁ
గౌశాంబి యను బురిన్ ఘనముగాను
నయశాలి యగు కుశనాభుండు నిర్మించె
ను మహోదయమ్మును నూతనముగ
నాధూర్తరజసుడు నరయ ధర్మారణ్య
పురమును నిర్మించె భూతితోడ
వసువను నరపతి భద్రాత్ము డగుచు గి
రివ్రజం బనగ నిర్మించెఁ బురము
తే.గీ. రామ! యీభూమి యావసురాజధనము
పంచశైలమ్ము లిచ్చట వరలుఁ గనుము
పర్వతమ్ములఁ జుట్టుచున్ బారుచుండు
మాగధి యన శోణానది మాలవోలె. 242

కుశనాభస్తు రాజర్షిః కన్యాశత మనుత్తమమ్।
జనయామాస ధర్మాత్మా ఘృతాచ్యాం రఘునందన॥ {1.32.11}
అహం వః కామయే సర్వా భార్యా మమ భవిష్యథ।
మానుష స్త్యజ్యతాం భావో దీర్ఘ మాయు రవాప్స్యథ॥ {1.32.16}

❋ ఓ దశరథరామా! కుశుని కుమారులలో ఒకడైన కుశనాభుడు అనే రాజు ఘృతాచిని వివాహమాడగా వారికి వందమంది కుమార్తెలు కలిగినారు. వారు యుక్తవయస్సును పొంది ఒకనాడు ఉద్యానవనములో తిరుగుచుండగా వారిని చూచి ఇష్టపడిన వాయుదేవుడు "ఓ కన్యకలారా! నేను మిమ్ము వరించినాను. మీరు ఈ లోకంలోని రాజులను కోరుకొనవద్దు. మీరు నన్ను వరించినట్లైతే మీకు ఈ యౌవనం సుస్థిరంగా ఉంటుంది. దీర్ఘసుమంగళీత్వం సిద్ధిస్తుంది. గొప్ప గౌరవం కలుగుతుంది. దేవతలవలె మీరు కూడా అంతటా సంచరింపవచ్చు. మీ నిర్ణయాన్ని చెప్పండి" అని అడుగగా ఆ వందమంది కన్యకలు వాయుదేవుని తిరస్కరిస్తూ "ఓ గంధవహా! నీ గొప్పతనం గురించి మాకు తెలుసు. మేము

కుశనాభుని కుమార్తెలమని తెలియక నీవు ఇలా మాట్లాడుతున్నావు. మేము మా సంకల్పమాత్రం చేత నిన్ను పదవీచ్యుతునిగా చేయగలము" అని తమ అభిప్రాయమును వివరించసాగినారు.

తే.గీ. తలచి కుశనాభరాజు ఘృతాచి యందుఁ
గనియెఁ గన్యాశతమ్ము, నా తనయ లెల్ల
తరుణులై తిరుగుచుండ నుద్యానభూమి
వాయుదేవుడు వారితోఁ బలికె నిటుల. 243

ఉ. "నేను వరించినాడ మిము, నిర్ణయమున్ గొని నన్ వరించుడీ,
మానవనాథుఁ గోరుటలు మానుడు, దీర్ఘసుమంగళీత్వమున్
గానుకగా నొసంగెదను, గల్గును నిశ్చల యౌవనమ్ము, స
మ్మానముఁ గల్గు, దేవతల మాడ్కిఁ జరింపగవచ్చు నంతటన్"244

మ. చనవున్ గైకొని వాయువట్లన తిరస్కారమ్ముతో వార లి
ట్లని "రో యాశుగ! మేమెఱుంగుదుము సత్యంబైన నీ తత్త్వమున్
వినుమయ్యా! కుశనాభు పుత్రికలమై వెల్గొందు మమ్మెంచకి
ట్లనగా, మేము నినున్ బదచ్యుతునిఁ జేయన్ బూన నేమౌదువో?" 245

పితా హి ప్రభు రస్మాకం దైవతం పరమం హి సః।
యస్య నో దాస్యతి పితా స నో భర్తా భవిష్యతి॥ {1.32.22}
తాసాం తద్వచనం శ్రుత్వా వాయుః పరమకోపనః।
ప్రవిశ్య సర్వగాత్రాణి బభంజ భగవాన్ ప్రభుః॥ {1.32.23}

❃ "ఓ రఘునందనా! కుశనాభుని కుమార్తెలు వాయుదేవుని కోరికను తిరస్కరించినవారై "ఓ సమీరుడా! ధూర్తుని వలె మాట్లాడవద్దు. ఈ విషయము తెలిసినచో మా తండ్రి కాలస్వరూపుడై నిన్ను చంపివేయగలడు. దివ్యమైన మా తపోబలమును రక్షించుకొనదలచి మేము నిన్ను క్షమించుచున్నాము. సర్వదా మనసారా మమ్ము దీవించే మా తండ్రి మమ్ములను ఎవరికి ఇవ్వవలెనని అనుకొంటాడో అతడే మాకు ప్రాణనాథు డౌతాడు" అని పలుకగా కోపమును

పొందిన ఆ వాయువు ఆ కన్యకలయందు ప్రవేశించి వారి దేహములను విఱిచివేసినాడు. ఆ కారణంగా కుబ్జలుగా మారిన ఆ కన్యకలు ఏడుస్తూ తండ్రి వద్దకు వెళ్లి తమ అవస్థకు కారణం వాయుదేవుడని జరిగిన విషయాన్ని తెలియజేసినారు” అని విశ్వామిత్రుడు తన వంశంలోని పూర్వీకుల గుఱించి వివరించసాగినాడు.

ఉ. “మారుత! ధూర్తవాక్యముల మానుము, మా జనకుండు కాలుడై
తీరును నిన్నుఁ జంపుటకు, దివ్యతపోబల రక్షణార్థ మీ
తీరుగ నిన్ క్షమించితిమి, దీవెన లిచ్చెడి తండ్రి కీర్తివి
స్తారుడు మమ్ము నెవ్వరి కొసంగునొ యాతడె మాకు నాథుడౌ” 246

మ. అని యా కన్యక లట్లు వల్క, శ్వసనుం డత్యంత కోపమ్మునన్
గనుచున్, వారలలోనఁ జేరి విఱిచెన్ దద్దేహభాగమ్ములన్;
గనగా వారలు కుబ్జలై జనకు చెంతన్ జేరి రోదించి, వే
దనకున్ వాయువె కారణమ్మనిరి చింతాక్రాంతలై దీనలై. 247



33. బ్రహ్మదత్తుడు కుశనాభుని పుత్రికలను వివాహమాడుట

క్షాంతం క్షమావతాం పుత్ర్యః కర్తవ్యం సుమహత్కృతమ్। {1.33.6}
అలంకారో హి నారీణాం క్షమా తు పురుషస్య వా। {1.33.7}
క్షమా దానం క్షమా యజ్ఞః క్షమా సత్యం హి పుత్రికాః॥ {1.33.8}
క్షమా యశః క్షమా ధర్మః క్షమయా నిష్ఠితం జగత్। {1.33.9}

❃ "ఓ రఘురామా! వాయుదేవునిచే కుబ్జలుగా మార్చబడిన తన కుమార్తెలను చూచి, వారికి గల సంస్కారమునకు క్షమాగుణమునకు ఎంతగానో సంతోషించినవాడైన కుశనాభ మహారాజు ఓర్పుతో ప్రవర్తించడము గుఱించి ఓర్పు యొక్క మహిమ గుఱించి కుమార్తెలకు వివరిస్తూ "ఓ పుత్రికారత్నములారా! క్షమాగుణమే ధర్మము. క్షమయే దానము, యజ్ఞము, యశస్సు, సత్యము ఔతుంది. క్షమయే అన్ని జగములకు ఆధారము. క్షమయే ఆభరణము. నిత్యమూ శాంతిని కలిగించేది కూడా క్షమాగుణమే. మీరు నూరుమంది అయినా అందఱూ గొప్పదైన ఆ క్షమాగుణమును కలిగియున్నందున మిమ్ములనందఱినీ నేను మనస్ఫూర్తిగా మెచ్చుకొంటున్నాను" అని వారినందఱినీ అభినందించి తనకు తగిన అల్లుని వెదుకదలచినవాడై మంత్రులను పిలిచి వారికి తన మనసులోని మాటను తెలియజెప్పినాడు" అని విశ్వామిత్ర మహర్షి తన వంశంలోని పూర్వీకుల గుఱించి దశరథరామునికి విశదీకరించసాగినాడు.

ఉ. మారుతు డిట్లు కుబ్జలుగ మార్చిన, నాదు సుతాశతమ్ము సం
స్కారముతో క్షమాగుణముఁ గల్గి మెలంగె నటంచు నుబ్బుచున్
వారల మెచ్చి మెచ్చి కుశనాభుడు నోరిమితోఁ జరించుటం
గూరిచి తన్మహత్వమును గూరిచి వారికిఁ దెల్పె నిట్టులన్. 248

కం. క్షమయే ధర్మము దానము
క్షమయే యజ్ఞమ్ము యశము సత్యమ్ము నగున్

క్షమయే జగదాధారము
క్షమయే భూషణము సతతశాంతిప్రదమున్. 249

తే.గీ. అనుచుఁ గన్యాక్షమాగుణమునుఁ బొగడుచు
వారి కల్యాణమునుఁ జేయు భావ మొప్ప
సదృశజామాతఁ గనుగొన సంతసమున
మంత్రులనుఁ బిల్చి చర్చించె మనసు విప్పి. 250

తప్యంతం తమృషిం తత్ర గంధర్వీ పర్యుపాసతే।
సోమదా నామ భద్రం తే ఊర్మిళాతనయా తదా॥ {1.33.12}
తస్యాః ప్రసన్నో బ్రహ్మర్షి ర్దదౌ పుత్ర మనుత్తమమ్।
బ్రహ్మదత్త ఇతి ఖ్యాతం మానసం చూళిన స్సుతమ్॥ {1.33.18}

❄ ఓ రఘురామా! కుశనాభుడు తన వందమంది కుమార్తెలకు తగిన వరుని వెదకుచున్న ఆ సమయంలోనే చూళి అనే మహాత్ముడు తపస్సు చేస్తూ ఉండినాడు. ఊర్మిళ అనే మహిళ యొక్క కుమార్తె సోమద అనే పేరుగల కన్యక తపస్సుచేస్తూఉండిన చూళికి దాసిలాగా సేవలు చేస్తూ ఉండినది. చూళి సోమదసేవలను మెచ్చుకొని వరం కోరుకొమ్మని ఆమెతో అన్నాడు. "ఓ బ్రహ్మర్షీ! నీ తేజస్సుతో వర్ధిల్లే కుమారుని ప్రసాదించండి" అని సోమద కోరుకొన్నది. తథాస్తు అని అంటూ చూళిమహర్షి తన తేజస్సుతో విరాజిల్లే కుమారుని సృష్టించి, బ్రహ్మదత్తుడు అని నామకరణం చేసి సోమదకు ఇచ్చినాడు. ఆ బ్రహ్మదత్తుడు సౌమదేయుడు అనే పేరుతో కూడా ప్రసిద్ధి చెంది, చక్కగా రాజ్యపరిపాలన చేస్తూ జనవంద్యుడుగా కీర్తిని పొందినాడు"

ఉ. ఆ సమయమ్ము నందొక మహాత్ముడు చూళి తపమ్ము సేయగన్,
దాసిగ నూర్మిళాసుత స్వనామము సోమద, సేవఁ జేయ, నా
భాసురమూర్తి మెచ్చుకొని భామ! వరమ్మును గోరుకొమ్మనన్,
"వాసిగ నీదు తేజమున వర్ధిలు పుత్రు నొసంగుమా" యనెన్. 251

ఉ. సోమద కోరగా నటులఁ, జూళి మహర్షి తపోనిమగ్నుడై
ధీమణి బ్రహ్మదత్తుఁ దన తేజమునన్ గని యిచ్చె వాని నా
భామకు, నా సుతుండు జనవంద్యుడునై భువి సౌమదేయుడన్
నామముతో వెలింగి కనినాడు యశఃపరితుష్టిఁ బాలనన్. 252

త మాహూయ మహాతేజా బ్రహ్మదత్తం మహీపతిః।
దదౌ కన్యా శతం రాజా సుప్రీతే నాంతరాత్మనా॥ {1.33.21}
పుత్ర స్తే సదృశః పుత్ర భవిష్యతి సుధార్మికః।
గాధిం ప్రాప్స్యసి తేన త్వం కీర్తిం లోకే చ శాశ్వతీమ్॥ {1.34.3}

❊ "ఓ రఘురామా! చూళి సోమదల కుమారుడగు బ్రహ్మదత్తుడు చాలా గొప్పవాడని తెలిసికొన్న కుశనాభుడు ఆ సౌమదేయుని ఆహ్వానించి తన వందమంది కుమార్తెలను పత్నులుగా స్వీకరించవలసినదిగా కోరి వివాహం జరిపించినాడు. వరుని పాణిగ్రహణంతో కుబ్జరూపం తొలగిపోగా రాజకుమార్తె లందఱూ నిజరూపమును పొంది సుందరీమణులుగా మారగా వారి తండ్రి కుశనాభుడు ఎంతగానో సంతోషించినాడు. బ్రహ్మదత్తుడు సతీసమేతంగా తన కాంపిల్యపురమును చేరుకొన్నాడు. కన్యాదానమును పూర్తిచేసిన కుశనాభుడు పుత్రుని పొందగోరి ఒక యజ్ఞమును ప్రారంభించగా "నాయనా నీకు నీతో సమానమైన గాధి అను కుమారుడు జన్మించగలడు" అని దీవించి కుశుడు ఆకాశమార్గంలో బ్రహ్మలోకానికి వెళ్లినాడు" అని విశ్వామిత్ర ముని తన వంశంలోని పూర్వీకులను గుఱించి సాకేతరామునికి విశదీకరించసాగినాడు.

చం. ఘనుడని బ్రహ్మదత్తుఁ గని, గౌరవమొప్పగఁ బిల్వబంచి, "నా
తనయల నూర్గురన్ గొనుము తావకపత్నులుగా" నటంచు వా
కొనెఁ గుశనాభరాజు, సమకూరె వివాహము, చూళిపుత్రు తా
కున నటఁ గుబ్జలెల్ల సుమకోమలులైరి స్వరూప మందుచున్. 253

తే.గీ. దుహితలకు వాయుదోషమ్ము తొలగిపోవఁ
దండ్రి కుశనాభరాజు చేతమ్ము పొంగె,

వరుడు సతులతోఁ గాంపిల్యపురముఁ జేరఁ
జూచి మురిసిరి సోమదాచూళు లపుడు. 254

చం. తనయల బ్రహ్మదత్తునికి దానముగా నిడి పంపి, యంతటన్
దనయునిఁ బొందఁ గోరి కుశనాభుడు యజ్ఞముఁ జేయగాఁ, గుశుం
డనునయ మొప్పఁ బల్కెను "మదాత్మజ! కల్గు భవత్సమానుడౌ
తనయుడు నీకు గాధి యను ధర్మపరుం" డని యేగె నింగికిన్. 255



34. విశ్వామిత్రుని తండ్రి యగు గాధి వృత్తాంతము

స పితా మమ కాకుత్స్థ గాధిః పరమధార్మికః।
కుశవంశ ప్రసూతోఽస్మి కౌశికో రఘునందన॥ {1.34.6}
పూర్వజా భగినీ చాపి మమ రాఘవ సువ్రతా।
నామ్నా సత్యవతీ నామ ఋచీకే ప్రతిపాదితా॥ {1.34.7}
సిద్ధాశ్రమ మనుప్రాప్య సిద్ధోఽస్మి తవ తేజసా॥ {1.34.12}

❋ "ఓ రఘురామా! తండ్రియైన కుశుడు దీవించినట్లే కుశనాభునికి గాధి అనే కుమారుడు జన్మించినాడు. ఆ గాధికి జన్మించిన కుమారుడను నేనే. కుశుని వంశంలో జన్మించినందున నాకు కౌశికుడు అనే పేరు కూడా ఏర్పడింది. నాకంటే ముందు మా తండ్రియగు గాధికి సత్యవతి అనే కుమార్తె జన్మించింది. ఆమె ఋచీకుని వివాహమాడింది. భర్తతో స్వర్గానికి కూడా వెళ్లింది. తరువాత నదీస్వరూపాన్ని పొంది కౌశికీనదిగా హిమాలయంలో ఇప్పటికీ ప్రవహిస్తూ ఉన్నది. సోదరిపై గల మమకారంతో నేను ఆ మంచుకొండపై తపస్సు చేస్తూ ఉండినాను. యజ్ఞసిద్ధిని పొందదలచి నేను ఈ సిద్ధాశ్రమమునకు వచ్చినాను. నీ సంరక్షణలో నా యజ్ఞకార్యము పరిపూర్ణంగా ఫలించింది" అని విశ్వామిత్రముని ఇనకులనాథుడైన రామునికి తన వంశంలోని పూర్వీకులను గురించి విశదీకరించినాడు.

తే.గీ. అటులె కుశనాభునికిఁ గల్గె నాత్మజుండు
గాధి యాయన మజ్జన్మకారకుండు
కుశుని కులమునఁ బుట్టుటన్ గౌశికు డను
నామమును నాకుఁ గల్గె నో రామచంద్ర! 256

చం. ఇనకులనాథ! నేను జనియించుట కంటెను ముందు గాధికిన్
దనయగఁ బుట్టె సత్యవతి, ధాత్రిని వెల్గె ఋచీకుపత్నిగన్
జనియెను భర్తతోఁ గలసి స్వర్గతలమ్ము, నదీస్వరూపమున్
గొని భువిలో హిమాద్రి పయిఁ గూరిమితోఁ బ్రవహింపసాగెగా. 257

తే.గీ. మంచుకొండఁ గౌశికి ప్రవహించుచుండ
నేను నచ్చోటఁ దపమున నిలిచి యుంటి,
యజ్ఞమును జేయఁ వచ్చితి, నదియు ముగిసె
నీవు సిద్ధాశ్రమక్షోణిఁ గావ దాని. 258

గతోఽర్ధరాత్రః కాకుత్స్థ కథాః కథయతో మమ।
నిద్రా మభ్యేహి భద్రం తే మా భూ ద్విఘ్నోఽధ్వనీహ నః॥ {1.34.14}
తే గత్వా దూర మధ్వానం గతేఽర్ధదివసే తదా।
జాహ్నవీం సరితాం శ్రేష్ఠాం దదృశు ర్మునిసేవితామ్॥ {1.35.7}

❊ "ఓ రఘురామా! నీవు ఈ వనముయొక్క మహిమను గుఱించి అడిగినావు. ఈ ప్రదేశమునకు సంబంధించి మీరు తెలిసికొనదగిన విశేషములను నేను చెప్పినాను. నా వంశం గుఱించి వివరించినాను. అనేక కథలను చెప్పడంతో అర్ధరాత్రి సమయం కావస్తూ ఉన్నది. ఆకాశంలో చంద్రుడు కనిపిస్తూ ఉన్నాడు చూడండి. ఇక నిద్రపొండి" అని విశ్వామిత్ర ముని పలుకగా అందఱూ ఆ బ్రహ్మర్షి గొప్పదనాన్ని పొగడుతూ నిద్రకు ఉపక్రమించినారు. శోణానదీతీరంలో నిద్రించిన వారందఱూ వేకువన కౌశికుడు మేల్కొల్పగా నిద్రలేచి ప్రాతఃకాల సంధ్యావందనాది కార్యక్రమాలను పూర్తిచేసికొని అక్కడినుండి బయలుదేఱుటకు సిద్ధమైనారు. ప్రయాణం మొదలుపెట్టి మధ్యాహ్న సమయానికి ప్రశస్తమైన గంగానదివద్దకు చేరుకొన్నారు.

చం. "అడిగితివీ వనస్థమహిమాదుల నెల్లఁ గుతూహలమ్మునన్,
నుడివితి మీ రెఱుంగుటకు నోచిన యర్థములెల్ల, నాదు వం
గడమును గూర్చి రామ! బహుగాథల నయ్యెడి నర్ధరాత్రి, గాం
చుడు కనిపించెఁ జంద్రుడును శోభ, నికన్ శయనింపు డెల్లరున్" 259

మ. అని చెప్పంగ మునీంద్రునిన్ బొగడి వా రా రాత్రి నిద్రించి రా
ఘన శోణాతటమందు, వేకువన వీకన్ మౌని మేల్కొల్ప, సూ
ర్యుని పూజాదులఁ గొల్చి, వేగఁ జనగా నుద్యుక్తులై రందఱున్
జని మధ్యాహ్నపు వేళఁ జూచిరి ప్రశస్తంబైన గంగానదిన్. 260

35. గంగావతరణ కథ

తాం దృష్ట్వా పుణ్య సలిలాం హంస సారస సేవితామ్।
బభూవు ర్ముదితా స్సర్వే మునయః సహ రాఘవాః॥ {1.35.8}
తస్యా స్తీరే తత శ్చక్రుః త ఆవాసపరిగ్రహమ్।
తతః స్నాత్వా యథాన్యాయం సంతర్ప్య పితృదేవతాః॥ {1.35.9}
హుత్వా చైవాగ్నిహోత్రాణి ప్రాశ్య చామృతవ ద్ధవిః। {1.35.10}

❋ రామలక్ష్మణులు మునులు మహర్షితోపాటు గంగానదిని చేరుకొన్నారు. పావనమైనది దివ్యమైనది పుణ్యజలములతో కూడినది అగు ఆ గంగానదిలో మనోహరంగా శబ్దం చేస్తూ హంసలు సారసపక్షులు విహరిస్తూ ఉండగా అందఱూ ఆ గంగానదీ వైభవాన్ని మెచ్చుకొని ఆ నదీతీరంలో విశ్రాంతి తీసికొన్నారు. అక్కడనే విడిది ఏర్పాటుచేసికొన్నారు. గంగానదిలో స్నానం చేసి పితృదేవతావిధులను పూర్తిచేసి యజ్ఞం చేసినారు. యజ్ఞశేషమును అపూర్వమైన దివ్యప్రసాదంగా స్వీకరించి పరమానందమును పొందినారు.

ఉ. పావనదివ్యగంగ కనుపట్టెను పుణ్యజలాన్వితమ్ముగా
జీవనదాత్రి యౌచు విలసిల్లెను, హంసలు సారసమ్ములున్
రావ మొనర్చుచున్ మిగుల రాజిలుచుండగ, నంద ఱానదిన్
భావమునందు మెచ్చుకొని భావనఁ జేసిరి విశ్రమింపగన్. 261

శా. గంగాతీరమునందుఁ గోర్కి విడిదిన్ గల్పించినా రందఱున్,
గంగాస్నానముఁ జేసి పైతృక విధుల్ గావించి, యజ్ఞమ్ముఁ జే
యంగా బూనిరి యజ్ఞశేషమును దివ్యంబంచుఁ గైకొంచు, ను
ప్పొంగన్ సాగి రపూర్వ రీతుల మహామోదమ్ము చేకూరగన్. 262

అథ తత్ర తదా రామో విశ్వామిత్ర మథాబ్రవీత్॥ {1.35.11}
భగవన్ శ్రోతు మిచ్ఛామి గఙ్గాం త్రిపథగాం నదీమ్।
త్రైలోక్యం కథ మాక్రమ్య గతా నదనదీపతిమ్॥ {1.35.12}

చోదితో రామవాక్యేన విశ్వామిత్రో మహామునిః।
వృద్ధిం జన్మ చ గంగాయా వక్తు మేవోపచక్రమే॥ {1.35.13}

❋ గంగానదీతీరంలో యజ్ఞవిధులు పూర్తిచేసిన తరువాత మునులు, రామలక్ష్మణులు అందఱూ బ్రహ్మజ్ఞానియైన విశ్వామిత్రుని చెంత కూర్చున్నారు. గాధిసుతుడైన కౌశికుని సేవిస్తూ నిత్యం సంతోషంగా ఉండే రఘురాముడు "ఓ మునీంద్రా! ఈ గంగానదియొక్క పుట్టుకను గుఱించి మాకు ఇప్పుడు సంపూర్ణంగా తెలియజేయండి. ఈ గంగానది 'త్రిపథగ' అనే పేరుతో గొప్ప కీర్తిని ఎలా పొందినది? ఈ గంగానది మూడులోకాలలో ఎలా వ్యాపించింది? సముద్రుని దగ్గఱకు ఎలా చేరింది? మాకు కొద్దిపాటి సందేహం కూడా మిగులకుండా ఉండేటట్లు ఈ గంగానది యొక్క చరిత్రను విశదీకరించండి" అని అడుగగా సంతోషపడిన విశ్వామిత్ర ముని రాముని ప్రశ్నలకు సమాధానంగా గంగ మూడులోకాలనూ పావనం చేసి 'త్రిపథగ' అనే పేరును పొందిన విషయమును సంపూర్ణంగా చెప్పదలచి ఇలా వివరించసాగినాడు.

శా. అంతన్ మౌనులు రామలక్ష్మణులు బ్రహ్మజ్ఞానియౌ మౌనికిన్
జెంతన్ గూర్చొనినారు; గాధిసుతునిన్ సేవించుచున్ నిత్యమున్
సంతోషించెడి రాము డిట్లనె "మునీంద్రా! తెల్పుమా సందియం
బింతన్ లేనటు గంగ జన్మమును మా కీ వేళ పూర్ణమ్ముగా" 263

కం. "మునినాథ! గంగ యేవిధి
ఘనకీర్తుల తోడఁ ద్రిపథగా నామంబున్
గనె? మూడులోకముల వ్యా
ప్తిని నెటు గనె? నెట్టు లంబుధినిఁ జేరఁ గనెన్" 264

తే.గీ. రాము డడిగిన ప్రశ్నల రక్తి వినుచు
ముదము నంది విశ్వామిత్ర ముని త్రిపథగ
మూడులోకాలఁ బావనమ్ముగను జేయు
గాథ వివరింప నెంచె సాకల్యముగను. 265

శైలేంద్రో హిమవా న్నామ ధాతూనా మాకరో మహాన్ । {1.35.14}
నామ్నా మనోరమా నామ పత్నీ హిమవతః ప్రియా॥ {1.35.15}
అథ జ్యేష్ఠాం సురా స్సర్వే దేవతార్థచికీర్షయా ।
శైలేంద్రం వరయామాసుః గంగాం త్రిపథగాం నదీమ్॥ {1.35.17}
దదౌ ధర్మేణ హిమవాం స్తనయాం లోక పావనీమ్। {1.35.18}

❈ "హిమవంతుడు అనే పర్వతరాజు మేరుపర్వతముయొక్క కుమార్తె యగు మనోరమను పెండ్లి చేసికొన్నాడు. వారికి కలిగిన ఇద్దఱు కుమార్తెలలో జ్యేష్ఠపుత్రికగా గంగ, కనిష్ఠపుత్రికగా ఉమ పరమానందమును కలిగించసాగినారు. దేవతలందఱూ హిమవంతుని చేరి "ఆర్యా! పావని యైన గంగను మాకివ్వండి" అని వేడగా సదా లోకహితమును కోరుకొనే ఆ పర్వతరాజు సంతోషంగా తన పెద్దకుమార్తెయైన గంగను వారికి సమర్పించినాడు. గంగను తమతోపాటు స్వర్గమునకు తీసికొనివెళ్లిన దేవతలు ఎంతగానో సంతోషించినారు అని విశ్వామిత్ర ముని రామునికి గంగావతరణ గాథను విశదీకరించసాగినాడు.

మ. హిమవంతుండను పర్వతేంద్రు డతులుం డెన్నంగఁ, బెండ్లాడె ను
త్తమయౌ మేరుసుతన్ మనోరమను, జేతఃప్రీతిఁ బుత్రీద్వయం
బమరెన్, గంగయె జ్యేష్ఠపుత్రికగ శోభన్ గూర్చుచున్ వెల్గగా,
నుమ భాసిల్లెఁ గనిష్ఠపుత్రికగ భాగ్యోత్సాహముల్ గూర్చుచున్. 266

ఉ. పావన గంగ నిమ్ము హిమవంతుడ! మాకని చేరవచ్చి యా
దేవతలెల్ల వేడగ, నదీనత గంగ నొసంగి వారికిన్
జీవనదాతగా మెలగెఁ, జిత్తము లోకహితమ్మె కోర, స
ద్భావన తోడ నుండె హిమవంతుడు నిర్ఝరు లుల్లసిల్లగన్. 267

ఉగ్రేణ తపసా యుక్తాం దదౌ శైలవర స్సుతామ్।
రుద్రా యాప్రతిరూపాయ ఉమాం లోకనమస్కృతామ్॥ {1.35.21}
న లోకా ధారయిష్యంతి తవ తేజః సురోత్తమ॥ {1.36.10}
బ్రాహ్మేణ తపసా యుక్తో దేవ్యా సహ తప శ్చర। {1.36.11}

❋ ఓ రఘురామా! హిమవంతుని జ్యేష్ఠపుత్రిక గంగ ఆవిధంగా దేవలోకమునకు చేరుకొనగా, కనిష్ఠపుత్రిక ఉమ పరమశివుని భర్తగా పొందగోరి ఘోరమైన తపస్సు చేసినది. లోకకల్యాణం జరుగగలదని భావించిన హిమవంతుడు ఉమామహేశ్వరులకు కల్యాణం జరిపించినాడు. ఆదిదంపతులైన శివపార్వతులు ఆనందంగా విహరించుచుండగా బ్రహ్మ మొదలైన దేవతలు అగ్నినేత్రుడైన పరమేశ్వరుని సమీపించి నమస్కరించి "ఓ శంకరా! నీ తేజస్సును ఎవ్వరునూ భరించలేరు. మా విన్నపాన్ని మన్నించి నీ తేజస్సు నీలోనే ఉండేట్లు చూడు. నీవు నీ భార్య పార్వతి ఇద్దఱూ నిశ్చలమనస్కులై తపస్సు చేయండి" అని ప్రార్థించినారు అని విశ్వామిత్రముని దశరథరామునికి గంగావతరణ కథావిశేషములను విశదీకరించసాగినాడు.

తే.గీ. నిష్ఠతో పర్వతేంద్రు కనిష్ఠపుత్రి
యుగ్రు నాథునిగాఁ గోరి యుగ్ర తపముఁ
జేయగా హిమవంతుడు శివుని కిచ్చె
నాత్మజ నుమను లోకకల్యాణ మనుచు. 268

చం. పరిణయమాడి నట్టి శివపార్వతు లిర్వురుఁ గ్రీడ నుండగా
సురలు పితామహుండు చని శూలికి మ్రొక్కి "భవత్ప్రజాతి నె
వ్వరు సహియింపజాలుదురు? పావకనేత్ర! కృపాంతరంగ! శం
కర! దయతోడ మా వినతిఁ గైకొను" మంచు వచించి రిట్టులన్. 269

ఉ. "దేవ! మహేశ! నీదయిన తేజముఁ దాల్పగలేవు లోకముల్,
కావున మాదు విన్నపము గైకొని లోకహితమ్మె కూర్చుచున్
నీవిక నీదు తేజమును నిల్పుము దేహమునందె, శంకరా!
నీవును నీదు పత్నియును నిశ్చలదివ్య తప మ్మొనర్చుడీ!" 270

36. పార్వతీదేవి దేవతలకు, భూమికి శాపము నిచ్చుట

ధారయిష్యతి క స్తన్మే బ్రువంతు సురసత్తమాః॥ {1.36.14}
యత్తేజః క్షుభితం హ్యేతత్ తద్ధరా ధారయిష్యతి॥ {1.36.15}
తదగ్నినా పున ర్వ్యాప్తం సంజాతః శ్వేతపర్వతః।
దివ్యం శరవణం చైవ పావకాదిత్య సన్నిభమ్॥ {1.36.18}
యత్ర జాతో మహాతేజాః కార్తికేయోఽగ్నిసంభవః। {1.36.19}

❋ "ఓ రఘురామా! బ్రహ్మాది దేవతల విజ్ఞప్తిని శంకరుడు ఆమోదించి "ఓ దేవతలారా! నా తేజస్సును భరించగలవారు ఒక్కరు కూడా లేరా?" అని అడుగగా "ఓ మహాదేవా! మీ తేజస్సును వసుంధర ధరించగలదు" అని ఆ అమరులు సమాధానమునిచ్చినారు. పరమశివుని తేజస్సు భూతలముపై పడగా దేవతలు వాయుసఖుడైన అగ్నిదేవుని చూచి "ఓ పావకుడా! నీవు వాయువుతో కూడి ఆ శివతేజస్సులో ప్రవేశించుము" అని చెప్పగా అనలుడు అట్లే చేసినాడు. అప్పుడు ఆ శివవిభూతి ఒక శ్వేతపర్వతంగా ప్రకాశించింది. అగ్నితోను సూర్యునితోను సమానమైన కాంతితో నిండిన ఆ ప్రదేశంలో కాలక్రమమున ఱెల్లు వనం ఏర్పడినది. ఆ ఱెల్లు వనంలో శివకుమారుడు అగ్నిసంభవుడు అయిన కార్తికేయుడు జన్మించినాడు అని విశ్వామిత్ర ముని అయోధ్యారామునికి కుమారస్వామి అవతరించుటను గుఱించి వివరించసాగినాడు.

చం. అని సుర లెల్ల పల్క విని, "యట్లె యొనర్చెద" నంచు శంకరుం
డని, యొకవేళ మత్తనువు నందలి తేజము నిల్వకుండ జా
రిన, మరి దాని నెవ్వరు ధరింపగ నేర్తురొ తెల్పు డన్న, శూ
లినిఁ గని వార లిట్లనిరి "లీలగ ధారుణియే ధరించెడిన్" 271

చం. నుడువగ నట్లు నిర్జరులు నూతనమైన స్వకీయతేజమున్
విడిచెను భూమిపై శివుడు, వేగమె యగ్నినిఁ జూచి దేవతల్
"వడిగ సదాగతిన్ గలసి భర్గుని తేజములోనఁ జేరు మి
ప్పుడె" యన, నగ్ని చేర, శివభూతి వెలింగెను శ్వేతశైలమై. 272

తే.గీ. పావకాదిత్య సన్నిభ భవ్యదీప్తి
వరుస నచ్చట వెలసెను వరశరవణ
మందు కార్తికేయుడు శూలి కాత్మజుండు
జనన మొందెను ధర నగ్నిసంభవుండు. 273

అథ శైలసుతా రామ త్రిదశా నిద మబ్రవీత్॥ {1.36.20}
సమన్యు రశపత్ సర్వాన్ క్రోధసంరక్తలోచనా।
యస్మా న్నివారితా చైవ సంగతిః పుత్రకామ్యయా॥ {1.36.21}
అపత్యం స్వేషు దారేషు తస్మా న్నోత్పాదయిష్యథ। {1.36.22}
అవనే నైకరూపా త్వం బహుభార్యా భవిష్యసి॥ {1.36.23}

❃ "ఓ రఘురామా! శివతేజముతో అవతరించిన శరవణభవుని దేవతలందఱూ సందర్శించి సంతోషించినారు. కుమారస్వామికి జననీజనకులైన పార్వతీపరమేశ్వరులకు పూజలు చేసినారు. భక్తిప్రపత్తులతో ఆ ఆదిదంపతులను సేవించినారు. అప్పుడు పార్వతి దేవతలను కోపంతో చూస్తూ "ఓ అమరులారా! నేను కుమారుని పొందడం మీకు ఇష్టము లేక, శివతేజమును నేను భరింపలేనని చెబుతూ నా నాథుని నాకు దూరం చేసినారు. మీరు చేసిన ఈ తప్పునకు ఫలితంగా మీకు మీ భార్యలయందు సంతానము కలుగకుండుగాక!" అని దేవతలను శపించింది. భూమివైపు కోపంగా చూస్తూ "ఓ వసుంధరా! నీవు అనేక రూపాలను పొందుతావు. అనేకమంది రాజులకు భార్యవౌతావు. కుమారుడు పుట్టడం వలన లభించే ఆనందం నీకు కలుగకుండు గాక!" అని శపించింది అని విశ్వామిత్ర ముని సాకేతరామునికి కుమారస్వామి అవతరణ విశేషములను విశదీకరించసాగినాడు.

కం. దేవాదులు శివతేజము
తో వఱలు కుమారుఁ గనుచుఁ దుష్టి నలరుచున్,
గావించుచుఁ బూజాదులు,
సేవించిరి భక్తితోడ శివపార్వతులన్. 274

ఉ. అప్పుడు కోప మొప్ప నచలాత్మజ పల్కె నిటుల్ సురాళితో
"నొప్పుగ నేఁ గుమారు గన నోరిమి నుండగఁ, జిత్తమందు మీ
కొప్పక, నన్ను నా విభుని నూరక దూరమొనర్చినారు, మీ
తప్పునకున్ ఫలమ్మిదియె, తథ్య మపత్యము లేదు మీకికన్" 275

ఉ. మీరును సంతతిన్ గనరు మీ సతులందు" నటంచు శాపమున్
వారల కిచ్చి, ధాత్రిఁ గని పార్వతి యిట్లనె "నో వసుంధరా!
మారును నీదు రూపము లమాన్యములై, భవదీయనాథులున్
మారుచునుందు, రెన్నడుఁ గుమారసుఖమ్ము లభించకుండెడిన్" 276

తాన్ సర్వాన్ వ్రీడితాన్ దృష్ట్వా సురాన్ సురపతి స్తదా।
గమనా యోపచక్రామ దిశం వరుణపాలితామ్॥ {1.36.25}
స గత్వా తప ఆతిష్ఠత్ పార్శ్వే తస్యోత్తరే గిరేః।
హిమవత్ప్రభవే శృంగే సహ దేవ్యా మహేశ్వరః॥ {1.36.26}

❀ "ఓ రఘురామా! తన గర్భమున కుమారుడు కలుగకుండునట్లు చేసిన దేవతలను పార్వతి శపించగా ఆ దేవతలు సిగ్గుపడుతూ ఆ సర్వమంగళను శరణు వేడినారు. అప్పుడు ఆ దేవతలను కరుణతో చూసి పరమశివుడు పార్వతీదేవితో కూడినవాడై హిమాలయంలోనే పడమటి దిక్కునకు వెళ్లి తపస్సు చేయడం మొదలుపెట్టినాడు. అప్పుడు అగ్ని మొదలైన దేవతలు బ్రహ్మదేవుని సమీపించి ఓ పితామహా! దేవసైన్యమునకు సేనాపతి పరమశివుడు అని మీరు చెప్పియున్నారు. ఆ నాగభూషణుడు ఇప్పుడు తపోదీక్షలో ఉన్నందున మఱియొకరిని సేనాపతిగా చేయండి అని ప్రార్థించినారు అని విశ్వామిత్రముని అయోధ్యారామునికి కుమారస్వామి అవతరణ విశేషములను విశదీకరించసాగినాడు.

మ. అని శాపమ్ము నొసంగఁ జండిక సహస్రాక్షుండు తద్దేవతల్
ప్రణతుల్ సేయుచు దీనులై, కృపను సంరక్షింపగా వేడ, వా

రిని వీక్షించుచుఁ, బశ్చిమంబు చని గౌరీదేవితో శూలియున్
ఘనమౌ రీతి తపమ్ము సేయఁ దొడగెన్ గణ్యక్రియాకారణా! 277

మ. శితికంఠుండు హిమాద్రిపైనఁ దపమున్ జేయన్, గృశానాది దే
వత లా బ్రహ్మను జేరి పల్కి రిటు "దేవా! మున్ను శూలిన్ భవ
త్పతి సేనాపతి యంచుఁ దెల్పితివి మా భాగ్యమ్మనన్, నాగభూ
షితు డెన్నన్ దప మాచరించు, నితరున్ సేనాపతిన్ జేయుమా! 278



37. కుమారస్వామి జననము

యో న స్సేనాపతి ర్దేవ దత్తో భగవతా పురా।
స తపః పర మాస్థాయ తప్యతే స్మ సహోమయా॥ {1.37.3}
ఇయ మాకాశగా గంగా యస్యాం పుత్రం హుతాశనః।
జనయిష్యతి దేవానాం సేనాపతి మరిందమమ్॥ {1.37.7}

❋ ఓ రఘురామా! "ప్రస్తుతం పరమశివుడు తపోదీక్షలో ఉన్నందున మఱియొక సేనాపతిని నియమించండి" అని దేవతలు బ్రహ్మదేవుని వేడగా ఆ చతుర్ముఖుడు "ఓ సురలారా! పార్వతీదేవి యిచ్చిన శాపవాక్కుల ననుసరించి మీకు మీ భార్యలయందు పుత్రుడు కలుగబోడు. అగ్నిదేవుడు గంగతో కలిసినపుడు ఉద్భవించు కుమారుడే దేవసేనాపతిగా ఉండగలడు. గంగాకుమారుని పార్వతీదేవి కూడా తన తనయునిగా భావించి సంతోషపడగలదు. పరమశివుడు కూడా పరమానందమును పొందగలడు" అని పలుకగా ఆ పరమేష్ఠిని అమరులు అందఱూ భక్తితో సేవించినారు.

మ. అని దీనమ్ముగ విన్నవించుకొను దేవాళిన్ గృపన్ జూచి, యి
ట్లనె లోకేశుడు "పార్వతీసతి నుడుల్ వ్యర్థమ్ము కాబోవు, కా
వున మీకున్ సతులందుఁ గల్గడు సుమీ బుత్రుండు, ప్రీతిన్ హుతా
శను డీ గంగనుఁ గూడి పొందును సుతున్ శత్రుఘ్ను సేనాపతిన్" 279

మ. సురగంగానది యగ్నిపుత్రుఁ గని తా శోభిల్లు, రుద్రాణి సం
బరమున్ బొందుచుఁ దత్కుమారుఁ గని సంభావించు మత్పుత్రు డం
చు, రహిన్ శంభుడు మోదమందు" ననుచున్ సొంపారగాఁ బల్క, నా
సుర లెల్లన్ బరమేష్ఠిఁ గొల్చిరి మనశ్శుభ్రప్రమోదమ్మునన్. 280

దేవ కార్య మిదం దేవ సంవిధత్స్వ హుతాశన।
శైలపుత్ర్యాం మహాతేజో గంగాయాం తేజ ఉత్సృజ॥ {1.37.11}
యదస్యా నిర్గతం తస్మాత్ తప్త జాంబూనదప్రభమ్॥ {1.37.18}
కాంచనం ధరణీం ప్రాప్తం హిరణ్య మమలం శుభమ్। {1.37.19}

❋ ఓ రఘురామా! బ్రహ్మదేవుని మాటలను అనుసరించి దేవతలు దివినుండి భువికి దిగివచ్చి, అనేక ధాతువులతో కూడియున్న కైలాస పర్వతమును చేరి అచ్చట ఉన్న అగ్నిదేవుని చూచి “ఓ హవ్యవాహనా! దేవతలందఱూ సంతోషించునట్లు నీ తేజస్సును గంగయందు ఉంచుము” అని పలికినారు. పావకుడు తనయందు గల శివతేజస్సును గంగయందు నిక్షిప్తం చేయగా గంగ ఆ తేజస్సును భరించలేక దానిని హిమాలయప్రాంతమున విడిచిపెట్టింది. అప్పుడు ఆ తేజస్సుకారణంగా ఆ హిమాలయ ప్రాంతమంతా బంగారుకాంతులతో వెండికాంతులతో ప్రకాశించింది.

తే.గీ. దివిషదుల్ వేగ దివి నుండి భువికి వచ్చి
ధాతుమండిత కైలాస ధామమందు
వహ్నిఁ గని పల్కినార లిబ్భంగి “ననల!
నీదు తేజమున్ గంగలో నిలుపు మయ్య!” 281

ఉ. పావకు డంత వల్లె యని పల్కి, ప్రియమ్మున గంగ డాయుచున్
దేవి! శుభమ్ము, నాదయిన తేజముఁ దాల్చుచు గర్భ మందుమా!
దేవగణమ్ము సంతసిలు దీన ననంగను, దివ్యరూపమున్
భావన నంది గంగ కనుపట్టి ధరింపగ నగ్నితేజమున్. 282

చం. అనలుడు గంగఁ జూచి తనయందలి తేజముఁ దచ్ఛరీరమం
దునఁ బ్రసరింపఁ జేయఁ, గడు దుఃఖము నందె భరించలేక వే
దనఁ దన గర్భమున్ విడిచెఁ దన్వి హిమాచలపాదసీమ, వె
ల్గిన దది కాంచన మ్మనగ లీలగ, వెండి యనంగ నచ్చటన్. 283

తత స్తు దేవతా స్సర్వాః కార్తికేయ ఇతి బ్రువన్॥ {1.37.25}
స్కంద ఇత్యబ్రువన్ దేవాః స్కన్నం గర్భ పరిస్రవాత్॥ {1.37.27}
ప్రాదుర్భూతం తతః క్షీరం కృత్తికానా మనుత్తమమ్॥ {1.37.28}
షణ్ణాం షడాననో భూత్వా జగ్రాహ స్తనజం పయః। {1.37.29}

❄ ఓ రఘురామా! గంగ అగ్నిద్వారా పొందిన శివతేజస్సును భరించలేక హిమాలయ ప్రాంతమున విడిచిపెట్టగా తీక్షణమైన ఆ తేజస్సు కారణంగా అక్కడ బంగారు వెండితోపాటు రాగి సీసము ఇనుము తగరము మొదలైన అనేకధాతువులు ఏర్పడినవి. హిమాలయ సీమ స్వర్ణమయంగా మారినది. గంగ విడిచిపెట్టిన తేజస్సు కారణంగా బంగారము అగ్నిప్రభలతో విరాజిల్లుతూ ఆనాటినుండి జాతరూపము అనే క్రొత్తపేరును పొందినది. గంగాగర్భమునుండి పరమశివుని కళలతో అగ్నిరూపుడుగా కుమారుడు అవతరించగా దేవతలు వచ్చి ఆ శివకుమారునికి పాలు పట్టేందుకు కృత్తికలను పిలిచినారు. ఆఱుగురు కృత్తికలు తల్లులై ప్రేమతో తమ పాలు పట్టేందుకు సిద్ధంకాగా ఆ బిడ్డడు విచిత్రంగా ఆఱు ముఖములు కలవాడై ఆ ఆఱుగురు కృత్తికల దగ్గఱ కడుపునిండా పాలు త్రాగినాడు.

తే.గీ. గంగ విడిచిన దాని తీక్ష్ణత వలనను
రాగి సీస మినుము తగరమ్ము ననగ
ధరణి జనియించె నిటు పలు ధాతువులును
స్వర్ణమయ మయ్యె నా హిమాచల తలమ్ము. 284

తే.గీ. భద్రముగ ధాత్రి గంగగర్భమ్ము వెలుగ
స్వర్ణము వెలింగెఁ బావకప్రభలతోడ,
నవ్యనామమ్ముఁ గాంచె నానాటినుండి
జాతరూప మటంచును స్వర్ణ మరయ. 285

తే.గీ. గంగగర్భమ్ము నుండి శ్రీకంఠు కళల
నగ్నిరూప కుమారకు డవతరింప
సురలు విచ్చేసి శిశువునుఁ జూచి వేగఁ
గృత్తికలఁ బిల్చినారలు క్షీర మొసగ. 286

తే.గీ. ఆఱుగురు కృత్తికలు తల్లు లగుచుఁ బ్రేమ
క్షీర మిడఁ గోరి దరిఁ జేరఁ జిత్ర మనగ

నాఱు మోములతోడఁ దా నలరుచుండి
పాలు ద్రావెను గడుపార బాలు డపుడు. **287**

తాః క్షీరం జాతమాత్రస్య కృత్వా సమయ ముత్తమమ్।
దదుః పుత్రోఽయ మస్మాకం సర్వాసా మితి నిశ్చితాః॥ {1.37.24}
గృహీత్వా క్షీర మేకాహ్నా సుకుమారవపు స్తదా॥ {1.37.29}
అజయత్ స్వేన వీర్యేణ దైత్యసైన్యగణాన్ విభుః। {1.37.30}

❈ ఓ రఘురామా! ఈ కుమారుడు మా అందఱి కుమారుడు అని భావించిన ఆ ఆఱుగురు కృత్తికలు ప్రేమతో తమ స్తన్యమునిచ్చి పెంచినందున ఆ శివకుమారుడు కార్తికేయుడు అనే పేరుతో ప్రసిద్ధి కెక్కినాడు. గంగకు ఏర్పడిన గర్భస్రావము నుండి ఉద్భవించినందున స్కందుడు అని పేరు పొందినాడు. ఆఱు ముఖములతో కూడియున్నందున షణ్ముఖుడు అనే నామంతో కూడా కీర్తి నందినాడు. సుకుమారుడైన ఆ శివకుమారుడు కృత్తికల పాలు త్రాగి ఒకే ఒక్క రోజులోనే గొప్ప శక్తిని పొందినవాడై సమరోత్సాహంతో రాక్షస సంహారం చేసి దేవతలందఱికీ సంతోషాన్ని కలిగించినాడు.

ఉ. ఈతడు మా కుమారుడని యెంచుచుఁ బ్రేమ దలిర్పఁ గృత్తికల్
చేతము పొంగ స్తన్య మిడఁ, జెల్వుగ నాతడు గార్తికేయుడై
ఖ్యాతి గడించె, స్కందు డని రందఱు గర్భపరిస్రవమ్మునన్,
బ్రీతిని షణ్ముఖుం డనెడి పేరును రాజిలె నారుమోములన్. **288**

తే.గీ. ఆ కుమారుడు సుకుమారు డగ్నిసముడు
కృత్తికల పాలు ద్రావి సంతృప్తు డగుచు
నొక్క దినమునన్ బలమొంది యుత్సహించి
దైత్యులను గూల్చి నిర్జరత్రాత యయ్యె. **289**

సురసేనా గణపతిం తత స్త మతులద్యుతిమ్॥ {1.37.30}
అభ్యషించన్ సురగణా స్సమే త్యాగ్ని పురోగమాః। {1.37.31}

భక్తశ్చ యః కార్తికేయే కాకుత్స్థ భువి మానవః॥ {1.37.32}
ఆయుష్మాన్ పుత్రపౌత్రైశ్చ స్కందసాలోక్యతాం వ్రజేత్। {1.37.33}

❋ ఓ రఘురామా! ఆవిధంగా ప్రభవించిన శివతేజస్సు మొదట భూమిపై విరాజిల్లినది. ఆ తరువాత క్రమంగా అగ్నితో కూడినదై గంగయందు ప్రవేశించింది. గంగనుండి రెల్లుపొదను చేరి శివకుమారుని రూపంగా ఆవిర్భవించింది అని ప్రశంసిస్తూ దేవతలు ఆ శివకుమారుని తమ సైన్యమునకు సేనాపతిగా ఎంచుకొన్నారు. దేవసేనాపతిగా కుమారస్వామికి పట్టాభిషేకం జరిపించినారు. ఓ ఇనకులనాథా! ఇంతవఱకు నీకు ఈశ్వరలీలను, కుమారసంభవమును, గంగగాథను వినిపించినాను. పుణ్యప్రదమైన ఈ కార్తికేయుని కథను విన్నవారు ఆయురారోగ్య భోగభాగ్యములతో పుత్రపౌత్రులతో సుఖసంతోషములతో జీవించి అంత్యకాలమున ఆ స్కందుని లోకమును చేరుకొనగలరు.

మ. ప్రభవించెన్ శివతేజమై, ధరణిపై రాజిల్లె, వైశ్వానర
ప్రభలన్ గంగను జేరె, రెల్లుపొదలన్ రాణించె, వీర్యోన్నతిన్
శుభమున్ గూర్చె నితం, డటంచు దివిజుల్ సొంపార సేనాపతి
ప్రభ వర్ధిల్లుననన్, గుమారు డమరెన్ బట్టాభిషేకమ్మునన్. 290

చం. ఇనకులనాథ! తెల్పితిని యీశ్వరలీలఁ, గుమారసంభవ
మ్మును, వరగంగ గాథ మది పొంగగ నీ కథ విన్నవారు జీ
వనమున గాంతు రాయువును, భాగ్యములన్, వరపుత్రపౌత్రులన్,
ఘనమగు స్కందలోకమునుఁ గాంచెద రంత్యమునందుఁ బాత్రులై. 291



38. సగర చక్రవర్తి వృత్తాంతము

అయోధ్యాధిపతిః శూరః పూర్వ మాసీ న్నరాధిపః।
సగరో నామ ధర్మాత్మా ప్రజాకామ స్స చాప్రజః॥ {1.38.2}
తాభ్యాం సహ తతో రాజా పత్నీభ్యాం తప్తవాం స్తపః।
హిమవంతం సమాసాద్య భృగుప్రస్రవణే గిరౌ॥ {1.38.5}

❈ విశ్వామిత్ర మహర్షి దశరథరామునికి ఆవిధంగా కుమారసంభవమును వివరించి ఆ తరువాత గంగావతరణ గాథను ఈ విధంగా చెప్పసాగినాడు. "ఓ రఘురామా! పూర్వము కీర్తిమంతుడైన సగర చక్రవర్తి అయోధ్యను పరిపాలించినాడు. వైదర్భుని కుమార్తె అగు కేశిని అను కన్యను సగరుడు వివాహమాడినాడు. సాటిలేని రూపము గలది అరిష్టనేమి కుమార్తె అగు సుమతి అనే కన్యను కూడా సగరుడు పెండ్లియాడినాడు. సాధ్వీమణులైన ఇద్దఱు భార్యలు ఉన్నప్పటికినీ సగరునికి సంతానం కలుగలేదు. అందువలన సగర చక్రవర్తి తన ఇద్దఱు భార్యలతో కూడి హిమాలయంలో ఉన్న భృగుప్రస్రవణ గిరిని చేరి సుదీర్ఘమైన తపస్సును ప్రారంభించినాడు.

కం. కూరిమిఁ గుమారజననముఁ
గూరిచి వివరించి కౌశికుడు రాముని కిం
పారగ నిటులనెఁ బరహిత
కారుడు గంగావతరణ గాథనుఁ దెలుపన్. 292

తే.గీ. సగరుడేలె నయోధ్య మున్ సద్యశస్సు
చేరి తరియించి తరియింపఁజేయఁ దనను,
బ్రీతి వైదర్భిదుహితనుఁ బెండ్లియాడెఁ
గేశినీ నామధేయ సత్కీర్తిగేయ. 293

తే.గీ. మేలు నంద నరిష్టనేమికి దుహితను
నద్భుతం బగు రూపమం దప్రతిమను

సుమతి నామమ్ముతో వెల్గు సుదతి నంత
జాయగా గొనెను సగరచక్రవర్తి. 294

తే.గీ. భక్తి సేవించు నిద్దఱు భార్యలున్న
సంతతిన్ గాంచకుండె నా సగరు డంత
సతులఁ దోడ్కొని హిమగిరిన్ సలుపఁ దపము
నెమ్మదిన్ భృగుప్రస్రవణమ్ముఁ జేరె. 295

అథ వర్షశతే పూర్ణే తపసారాధితో మునిః।
సగరాయ వరం ప్రాదాత్ భృగుః సత్యవతాం వరః॥ {1.38.6}
ఏకా జనయితా తాత పుత్రం వంశకరం తవ।
షష్టిం పుత్రసహస్రాణి అపరా జనయిష్యతి॥ {1.38.8}

❈ ఓ రఘురామా! సగరచక్రవర్తి సంతానమును కోరి వంద సంవత్సరాలపాటు తపస్సు చేయగా వరదుడైన భృగుమహర్షి ప్రత్యక్షమై "ఓ సగరుడా! నీకు ఉన్న ఇద్దఱు భార్యలలో ఒకరికి వంశోద్ధారకుడైన కుమారుడు కలుగుతాడు. మఱొకరికి అరవైవేల మంది కుమారులు కలుగుతారు" అని దీవించినాడు. కేశిని వంశకరుడైన కుమారుని కోరుకొనగా, సుమతి 60,000 మంది కుమారులను కోరుకొన్నది. సగరునికి సంతతి లేదనే చింత తొలగిపోయేవిధంగా కేశినికి అసమంజసుడు అనే కుమారుడు కలిగినాడు. గరుత్మంతుని సోదరి యగు సుమతి ఒక గర్భతుంబమును ప్రసవించింది. వరం కారణంగా కలిగిన ఆ గర్భతుంబం నుండి అరవైవేలమంది పుత్రులు ఉద్భవించినారు. వారిని దాదులు నేతికుండలలో ఉంచి జాగ్రత్తగా పెంచినారు.

తే.గీ. తపము సేయగ వర్షశతమ్ము నిండ
వచ్చె భృగుముని; వరదుడై పలికె నిటుల
"కలుగు నొక భార్యకున్ వంశకరుడు, కలుగు
వేరొకసతికి నరువదివేల సుతులు" 296

తే.గీ. భృగువు వరముల నొసగ సంప్రీతిఁ తోడ
వరముగాఁ గోరెఁ గేశిని వంశకరుని,
నంత సుమతియు షష్టిసహస్ర సుతులఁ
గోరె, సగరుండు సతులతోఁ జేరెఁ బురము. 297

తే.గీ. కొంతకాలమ్మున సగరు చింత తొలగఁ
గనియె నసమంజుఁ గేశిని మనసు పొంగ,
ఘనత నొక గర్భతుంబమున్ గనియె సుమతి
వరము కారణమున నాసుపర్ణుభగిని. 298

తే.గీ. వరఫలమ్మగు గర్భతుంబమ్ము నుండి
పుట్టి రరువదివేల సుపుత్రు లంతఁ
గూర్మి వారల ఘృతపూర్ణ కుంభతతుల
నుంచి దాదులు ప్రీతితోఁ బెంచినారు. 299

తస్య పుత్రోఽంశుమా న్నామ అసమంజస్య వీర్యవాన్॥ {1.38.22}
సమ్మతః సర్వలోకస్య సర్వస్యాపి ప్రియంవదః।
తతః కాలేన మహతా మతి స్సమభిజాయత॥ {1.38.23}
సగరస్య నరశ్రేష్ఠ యజేయ మితి నిశ్చితా। {1.38.24}

❋ ఓ రఘురామా! మీ అయోధ్యానగరమును పాలించుచుండిన సగరచక్రవర్తి ఆ విధంగా సంతానమును పొంది సంతోషించినాడు. ఆ కుమారులు కాలక్రమమున విద్యావంతులుగా రూపయౌవన సంపన్నులుగా అయినారు. పెద్దకుమారుడైన అసమంజసుడు నగరంలోని పసిబిడ్డలను సరయూనదీజలాలలో ముంచివేస్తూ సంతోషిస్తూ నవ్వుతూ ఉండేవాడు. అసమంజసుని పనులను గమనించి సహింపజాలని సగరుడు తన కుమారుడు అని కూడా చూడకుండా ఏ మాత్రం బాధపడకుండా వానిని నగరంనుండి బహిష్కరించినాడు. ఆ అసమంజసుని కుమారుడు అంశుమంతుడు గొప్ప

వీర్యబలసంపన్నుడు. అందఱితో ప్రియముగా మాటలాడేవాడు. కొంతకాలానికి సగరుడు అశ్వమేధయాగాన్ని చేయాలని సంకల్పించినాడు.

కం. సంతతి గని సగరాధిపు
డెంతయు ముద మందఁ, బుత్రు లెల్లరు మది ని
శ్చింతన్ గనిరి సువిద్యల
యంతము గని, రూపయౌవనాఢ్యులు నగుచున్. 300

చం. కన నసమంజు డెల్లఁ బసికందులఁ దా సరయూ జలమ్ములం
దునఁ బడవైచి ముంచుచునుఁ దుష్టిని నవ్వుచునుండ, వానినిన్
గని సగరుండు జ్యేష్ఠసుతు కార్యము సైపగ రాని దౌట, నా
తనిని బహిష్కరించెఁ బరితప్తుడుగాక పురమ్ము వెల్వడన్. 301

తే.గీ. అనఘ! యసమంజుని కుమారు డంశుమంతు
డధికవీర్యుండు ప్రియవాదియై మెలంగ
నంత సగరు డమోఘ మైనట్టి మేటి
యశ్వమేధ యాగముఁ జేయ నభిలషించె. 302



39. సగరుని అశ్వమేధ యజ్ఞాశ్వమును ఇంద్రుడపహరించుట సగరపుత్రులు అశ్వము కొఱకు భూమిని త్రవ్వుట

శంకరశ్వశురో నామ హిమవా నచలోత్తమః।
విన్ధ్యపర్వత మాసాద్య నిరీక్షేతే పరస్పరమ్॥ {1.39.4}
తస్యాశ్వచర్యాం కాకుత్స్థ దృఢధన్వా మహారథః।
అంశుమా నకరో త్తాత సగరస్య మతే స్థితః॥ {1.39.6}

❋ కోదండరాముడు తన పూర్వీకుడైన సగరుడు చేయదలచిన హయమేధయాగమును గుఱించి వివరింపవలసినదిగా మహర్షిని కోరగా కౌశికుడు సంతోషంగా ఇలా చెప్పసాగినాడు. "ఓ రఘురామా! ఈ భూమిపై వింధ్యపర్వతము హిమాలయ పర్వతము రెండూ పరస్పరము చూచుకొంటూ ఎదురెదురుగా ఉన్నాయి. ఆ వింధ్య హిమాలయ పర్వతములకు మధ్యన ఉన్న ప్రదేశంలో సగరచక్రవర్తి అశ్వమేధయాగాన్ని అపూర్వమైనరీతిలో మొదలుపెట్టినాడు. సగరుడు తన ధ్యేయం నెఱవేఱేందుకు నియమనిష్ఠలతో ఉండగా, ఋత్విక్కులు యజ్ఞకార్యంలో ఉండి మంత్రములను పఠిస్తూ ఉండగా, శుభకరుడైన అంశుమంతుడు అఖండబల పరాక్రమములు గలవాడై ధనుర్ధారియై యజ్ఞాశ్వ సంరక్షణాభారమును సంపూర్ణంగా వహించేందుకు సిద్ధమయ్యాడు.

కం. అని విశ్వామిత్రుడు దెలి
పిన నా హయమేధరీతి వివరింపు డటం
చను రాముడు కోరగ నా
మునిపుంగవు డిట్లు పలికె మోదముతోడన్. 303

తే.గీ. అవని విలసిల్లు వింధ్యహిమాచలములు
మించుచుఁ బరస్పరము విలోకించుచుండ,
నట్టి యద్రులకు నడుమ నమరె సగరు
నశ్వమేధ మపూర్వమ్ము నద్భుతమన. 304

ఉ. ధ్యేయము నెంచుచున్ సగరు డెంతయు నిష్ఠ వహింపగా, నుపా
ధ్యాయులు యజ్ఞకార్యమునఁ దద్గత మంత్రములన్ బఠింపగాఁ,
బాయక నంశుమంతుడు శుభంకరు డశ్వముఁ గాచు భారమున్
మోయుచు నుండె సంతతము పూర్ణబలుండు ధనుర్ధరుండునై. 305

తస్య పర్వణి తం యజ్ఞం యజమానస్య వాసవః।
రాక్షసీం తను మాస్థాయ యజ్ఞీయాశ్వ మపాహరత్॥ {1.39.7}
యావ త్తురగ సందర్శ స్తావత్ ఖనత మేదినీమ్।
తం చైవ హయహర్తారం మార్గమాణా మమాజ్ఞయా॥ {1.39.14}

❋ ఓ రఘురామా! సగరచక్రవర్తి అశ్వమేధయాగాన్ని గొప్పగా నిర్వహిస్తూ ఉండగా, ఒక పర్వదినమున ఇంద్రుడు రాక్షసస్త్రీ రూపంలో వచ్చి యజ్ఞాశ్వమును అపహరించినాడు. అప్పుడు ఆ యాగమును జరిపిస్తూ ఉండిన ఋత్విక్కులు సగరుని చూచి "ఓ రాజా! ఎవడో నీ యజ్ఞమును భగ్నంచేయదలచి యజ్ఞాశ్వాన్ని తీసికొనిపోయినాడు. నీవు వాడిని వెదకిపట్టి సంహరించాలి. అలా చేయకపోతే నీకు అమంగళం కలుగుతుంది" అని తెలియజెప్పినారు. వెంటనే సగరుడు తన అరవైవేలమంది కుమారులను పిలిచి "నాయనలారా! మన యాగాశ్వాన్ని ఎవడో దుర్మార్గుడు అపహరించినాడు. వాడు ఎక్కడ ఉన్నాడో వెదకండి. వాడిని పట్టుకొని చంపివేయండి. ఎక్కడా కనిపించకపోతే వానికొఱకు ఈ భూమిని త్రవ్వండి. ఎలాగైనా సరే మన యజ్ఞాశ్వాన్ని వెదకి తీసికొనిరండి" అని ఆదేశించి, "ఇక్కడ నేను నా మనుమడు అంశుమంతుడు ఈ ఋత్విక్కులు అందఱమూ ఈ యజ్ఞవాటికను సంరక్షిస్తూ ఉండగలము" అని తెలియజేసినాడు.

తే.గీ. సగరు యజ్ఞమ్ము చక్కగా సాగుచుండఁ
బర్వదినమున రాక్షసభామ యగుచు
నమరపతి వచ్చి యజ్ఞాశ్వ మపహరించె
నప్పు డిటు పల్కి రట నుపాధ్యాయులెల్ల. 306

మ. "అవనీశా! కొనిపోవుచుండె నెవడో యజ్ఞాశ్వమున్ నేడు నీ
సవమున్ భగ్నము సేయఁ, జేయవలెఁ దత్సంహారమున్, లేనిచో
నవలోకింతు వమంగళ" మ్మని యుపాధ్యాయుల్ ప్రబోధింప, భూ
ధవుడున్ షష్టిసహస్రపుత్రులకుఁ గర్తవ్యమ్ముఁ దెల్పెన్ వెసన్. 307

చం. హయమును దొంగిలించి చను నట్టి ఖలున్ గనఁ జాల, వాని ని
శ్చయముగ నంతటన్ వెదకి చంపుడు, కన్పడకున్న వానికై
రయమున నందఱున్ ధరనుఁ ద్రవ్వుడు, గుఱ్ఱముఁ బట్టి తెండు, ని
ర్భయముగ నేను ఋత్విజులు పౌత్రుడు నుందుము యజ్ఞరక్షణన్." 308

యోజనానాం సహస్రాణి షష్టిం తు రఘునందన॥ {1.39.20}
బిభిదు ర్ధరణీం వీరా రసాతల మనుత్తమమ్। {1.39.21}
భగవన్ పృథివీ సర్వా ఖన్యతే సగరాత్మజైః॥ {1.39.24}
బహవశ్చ మహాత్మానో హన్యంతే తలవాసినః। {1.39.25}

❊ ఓ రఘురామా! పితృవాక్యపరిపాలనాదక్షులైన సగరపుత్రులు అరవైవేలమంది యజ్ఞాశ్వాన్ని వెదకుటకు బయలుదేఱినారు. ఒక్కొక్కరు ఒక్కొక్క యోజనం చొప్పున వెదుకదలచినారు. భూతలంపై గుఱ్ఱము కనిపించనందున భూమిని త్రవ్వినారు. ఆ సమయంలో దారిలో దైత్యులను నాగులను సాధువులను చూస్తూ వారే అశ్వమును దొంగిలించినవారని భావించి వారిని సంహరించినారు. సగరపుత్రుల చేష్టలకు భయపడిన నాగులు గంధర్వులు దేవతలు మొదలైనవారు బ్రహ్మదేవుని చేరుకొని "ఓ పితామహా! సగరపుత్రులు భూమిని త్రవ్వుతూ తమకు కనిపించిన వారినందఱినీ యజ్ఞాశ్వచోరులనే భావనతో చంపివేస్తూ ఉన్నారు. మాకందఱికీ మీరే దిక్కు" అని శరణు వేడినారు.

చం. అరువదివేలమంది సగరాత్మజు లాదటఁ దండ్రిమాటతో
నురుగతి నొక్క యోజనము నొక్కరు చూడఁ దలంచువారలై
త్వరపడి మేదినీతలముఁ ద్రవ్వుచు భూమినిఁ జుట్టివచ్చి ర
త్తరి వధియించినారు పలు దైత్యుల నాగుల సాధుమూర్తులన్. 309

తే.గీ. అంత నాగులు గంధర్వు లసురులు సుర
లజుని దరిఁ జేరి "సగరపుత్రాళి ధరను
ద్రవ్వి యజ్ఞాశ్వచోరులన్ దలపుతోడ
నందఱినిఁ జంపుచున్నది యనిరి భీతి. **310**



40. కపిల వాసుదేవుని కోపాగ్నికి సగరపుత్రులు భస్మమగుట

యస్యేయం వసుధా కృత్స్నా వాసుదేవస్య ధీమతః।
కాపిలం రూప మాస్థాయ ధారయ త్యనిశం ధరామ్॥ {1.40.2}
తస్య కోపాగ్నినా దగ్ధా భవిష్యంతి నృపాత్మజాః।
పృథివ్యా శ్చాపి నిర్భేదో దృష్ట ఏవ సనాతనః॥ {1.40.3}

❊ ఓ రఘురామా! సగరపుత్రులు భూమిని త్రవ్వుతూ కనిపించిన వారినందఱినీ చంపుచున్నారు అని దేవతలు విన్నవించగా బ్రహ్మదేవుడు ఓ సురలారా! భూమిని ధరించే విష్ణుభగవానుడు ఈ విశ్వమును కాపాడుతూ ఉంటాడు. ఇప్పుడు కపిలవాసుదేవ మహర్షి రూపంలో రసాతలంలో ఉండి తపస్సు చేస్తూ ఉన్నాడు. ఆ వాసుదేవుడు ఆ సగరపుత్రులను తన కోపాగ్నితో దహించివేయగలడు. మీరు భయపడవలసిన పనిలేదు. భూమి అప్పుడప్పుడూ ఇలాగే త్రవ్వబడుతూ ఉంటుంది. అల్పాయుష్కులైన ఆ సగరపుత్రులు ఇక త్వరలో మరణిస్తారు" అని తనను శరణువేడిన వారినందఱినీ ఓదార్చినాడు.

చం. అపుడు పితామహుండు సుర లందఱి బాధల నాలకించి "యీ
విపుల ధరించు మాధవుడు విశ్వముఁ గాచుఁ, దపోనిమగ్నుడై
కపిలమహర్షి రూపమునుఁ గాంచి రసాతల మందు నుండెఁ దా
నిపుడు, దహించివేయు సగరేశ్వరపుత్రులఁ గోపవహ్నిచే. 311

తే.గీ. భీతినందకుడీ మీరు విబుధులార!
వసుధ నిత్యమ్ము నిటు త్రవ్వబడుచు నుండు
నల్పజీవు లయిన సగరాత్మజు లిక
మరణ మందెద" రనియె నమరులఁ గనుచు. 312

తతో భిత్త్వా మహీం సర్వే కృత్వా చాపి ప్రదక్షిణమ్॥ {1.40.6}
సహితా స్సగరాః సర్వే పితరం వాక్య మబ్రువన్। {1.40.7}
భూయః ఖనత భద్రం వో నిర్భిద్య వసుధా తలమ్॥ {1.40.10}
అశ్వహర్తార మాసాద్య కృతార్థాశ్చ నివర్తథ। {1.40.11}

❋ ఓ రఘురామా! సగరపుత్రులు భూమిని త్రవ్వుతూ ఎంత తిరిగిననూ వారికి ఎక్కడను యజ్ఞాశ్వము కనిపించలేదు. అందువలన వారు తిరిగి తండ్రి వద్దకు చేరుకొని "ఓ తండ్రీ! అశ్వం కొఱకు వెదకుతూ భూమిని త్రవ్వుతూ దారిలో మాకు కనిపించిన సాధువులను ఇతరప్రాణులను చంపినాము. అశ్వమును దొంగిలించినవాడు మాకు ఎక్కడనూ కనిపించలేదు. మా ప్రయత్నము విఫలమైనది" అని తెలియజేసినారు. అప్పుడు సగరుడు "కుమారులారా! మరలా వెళ్లండి. భూమిని ఇంకనూ త్రవ్వండి. అశ్వం కనిపించేంతవరకూ వెతుకుతూనే ఉండండి. గుఱ్ఱం కనబడకపోతే తిరిగిరావద్దు. పని పూర్తిచేసికొని రండి" అని కోపంగా మాట్లాడగా వారు మరలా అశ్వం కొఱకు వెదకుతూ భూమిని త్రవ్వుతూ రసాతలం చేరుకొన్నారు అని విశ్వామిత్రముని దశరథరామునికి గంగావతరణ కథావిశేషములను విశదీకరించసాగినాడు.

కం. **అవనిన్ ద్రవ్వుచుఁ దిరుగుచు**
సవనాశ్వముఁ గాంచలేని సగరాత్మజు లె
ల్ల వడిన్ దండ్రినిఁ జేరుచు
వివరించిరి యత్న మెల్ల విఫల మ్మనుచున్. **313**

తే.గీ. **పృథ్వి సవనాశ్వమును గాంచ వెదకినార**
మిలను ద్రవ్వి రసాతల మేగినాము
సాధుజీవుల నుగ్రతన్ జంపినార
మశ్వహర్త కనంబడ దయ్యెఁ దండ్రి!" **314**

కం. **అని తండ్రికి వివరింపగ**
ననె సగరుడు "మీరు మరల హయచోరుఁ గనన్
జనుడీ భూమినిఁ ద్రవ్వుడు
మన యశ్వము దొరకు వఱకు మరలకు" డనుచున్. **315**

తే.గీ. **"పొందు మీరు కృతార్థులై రం" డటంచు**
దండ్రి కోపమ్మునన్ బల్కఁ దనయులెల్ల

మరల నా యశ్వముం జూడఁ దరలి కెరలి
క్షమను ద్రవ్వుచు గనిరి రసాతలమ్ము. 316

ఖన్యమానే తత స్తస్మిన్ దదృశుః పర్వతోపమమ్॥ {1.40.12}
దిశాగజం విరూపాక్షం ధారయంతం మహీతలమ్। {1.40.13}
యదా పర్వణి కాకుత్స్థ విశ్రమార్థం మహాగజః॥ {1.40.14}
ఖేదా చ్చాలయతే శీర్షం భూమికంప స్తదా భవేత్। {1.40.15}

❊ ఓ రఘురామా! తండ్రి ఆజ్ఞను అనుసరించి అరవైవేలమంది సగరపుత్రులు మరల యజ్ఞాశ్వాన్ని వెదకుతూ భూమిని త్రవ్వుతూ రసాతలం చేరుకొన్నారు. అక్కడ భూమిని మోయుచున్న దిగ్గజములను వారు చూచినారు. భూమిని త్రవ్వుచున్న సమయమున తూర్పుదిక్కున విరూపాక్షము, దక్షిణదిక్కున మహాపద్మము, పడమటిదిక్కున సౌమనసము, ఉత్తరదిక్కున భద్రము అను పేర్లతో ప్రసిద్ధి చెందిన గజేంద్రములను చూచినారు. ఆ దిగ్గజములకు ప్రదక్షిణం చేసినారు. ఆ తరువాత విధివశమున ఈశాన్యదిక్కునకు వెళ్లి అచ్చట కపిల వాసుదేవ మహర్షిని చూచినారు. ఓ దశరథరామా! పర్వతములతో కూడియున్న ఈ భూమిని మోయుచున్న సమయమున తూర్పుదిక్కున ఉన్న విరూపాక్షము అనే దిగ్గజము అలసటతో విశ్రాంతి కొఱకు తలను కదలించినప్పుడు భూకంపములు ఏర్పడుచుండును.

సీ. తరలి తూరుపుదిక్కుఁ ద్రవ్వి వారలు విరూ
పాక్షమన్ దిగ్గజ మచటఁ గనిరి
దక్షిణ దిక్కునఁ ద్రవ్వి మహాపద్మ
మను దిగ్గజమ్మును ఘనత గనిరి
పడమటన్ ద్రవ్వుచు వడి సౌమనస మను
నాశామదేభము నచటఁ గనిరి
ఉత్తరమునఁ ద్రవ్వి యుత్సాహమున భద్ర
మను దిగ్గజము గని రంత వరుస

తే.గీ. క్ష్మాతలము మోయు తద్దిగ్గజముల కెల్ల
విధిఁ బ్రదక్షిణ మొనరించి విధివశమునఁ
దెలివి మీరంగ నీశాన్య దిక్కు కేగి
కపిల వాసుదేవమహర్షిఁ గాంచినారు. 317

తే.గీ. పర్వతాదులతో నున్న వసుధ మోయు
నట్టి దిక్కరీంద్రము విరూపాక్ష మద్ది
మించి శ్రాంతికై తలఁ గదలించు వేళ
వచ్చు భూకంపములు రాఘవా! నిజమ్ము. 318


దదృశుః కపిలం తత్ర వాసుదేవం సనాతనమ్।
హయం చ తస్య దేవస్య చరంత మవిదూరతః॥ {1.40.25}
తత స్తేనాప్రమేయేన కపిలేన మహాత్మనా।
భస్మరాశీకృతా స్సర్వే కాకుత్స్థ సగరాత్మజాః॥ {1.40.30}

❋ ఓ రఘురామా! సగరపుత్రులు తండ్రి ఆజ్ఞ ననుసరించి యజ్ఞాశ్వమును వెదకుచూ రసాతలంలో కపిలవాసుదేవ మహర్షి చెంతకు చేరుకొన్నారు. ఆ ముని ముందు ఉన్న యాగాశ్వమును చూచినారు. సంతోషంతో పొంగిపోయినారు. యాగాశ్వమును దొంగిలించి తెచ్చినవాడు అతడే అని అనుకొని ఆ మునిని అనుమానంతో చూచినారు. విపరీతమైన కోపాన్ని పొందినారు. "ఓ పాపాత్ముడా! అశ్వహర్తవైన నిన్ను ఇప్పుడే చంపివేస్తాము" అని నోటికి వచ్చినట్లు మాట్లాడుతూ శస్త్రములను చేతబట్టి ఆ మునిమీదకు దూకేందుకు సిద్ధమైనారు. దుడుకుతనంతో వ్యవహరించే ఆ సగరపుత్రులను చూచి ఉగ్రరూపాన్ని పొందిన కపిల వాసుదేవ మహర్షి కోపంగా చూస్తూ ఒకమాఱు హుంకారం చేసినాడు. మునికోపాగ్నికి అరవైవేలమంది సగరపుత్రులు క్షణకాలంలో భస్మమై నేల కూలినారు.

చం. మునివరుఁ జేరినారు, ముని ముందర నశ్వముఁ గాంచినారు, నె
మ్మనమునఁ బొంగినార, లనుమానముతో మునిఁ జూచినారు, త

న్మని హయహర్త యంచును విమోహితులై క్రుధ నందినారు, పా
పిని నినుఁ జంపివేతుమని ప్రేలుచు దూకిరి శస్త్రపాణులై. 319

తే.గీ. దుడుకుతనమూను సగరపుత్రులను గాంచి
కనులఁ గెంపులు నిండంగఁ గపిలమౌని
యుగ్రరూపుడై యొకమాఱు హుంకరింప
భస్మరాసులై కూలిరి వారలెల్ల. 320



41. సగరుడు యజ్ఞమును పూర్తిచేయుట

పుత్రాంశ్చిర గతాన్ జ్ఞాత్వా సగరో రఘునందన।
నప్తార మబ్రవీ ద్రాజా దీప్యమానం స్వతేజసా॥ {1.41.1}
పితౄణాం గతి మన్విచ్ఛ యేన చాశ్వోఽపవాహితః॥ {1.41.2}
సిద్ధార్థ స్సన్ నివర్తస్వ మమ యజ్ఞస్య పారగః॥ {1.41.4}

❊ ఓ రఘురామా! కపిల వాసుదేవుని కోపాగ్నికి సగరపుత్రులు భస్మం కాగా, తన అరవైవేలమంది పుత్రులు ఎంతకాలమైనప్పటికినీ తిరిగి రాలేదని చింతిస్తూ ఉండిన సగర చక్రవర్తి మనుమడైన అంశుమంతుని పిలిచి "నాయనా! నా మనుమడివైన నీవు గొప్ప శూరుడవు. నీవు నీ (అరవైవేల మంది) పినతండ్రులను, యజ్ఞాశ్వమును వెదకుటకు ధనుర్ధారివిగా ఖడ్గధారివిగా వెళ్లు. సాధువులు కనిపిస్తే నమస్కారం చేయి. నీ ప్రయత్నమునకు ఆటంకం కలిగించే దుష్టులను చంపివేయి. ధీరుడవై మెలగుతూ యాగాశ్వాన్ని తీసికొనిరా" అని ఆదేశించినాడు. తాతయైన సగరుడు ఆ విధంగా పలుకగా అంశుమంతుడు "అట్లే చేస్తాను" అని అంటూ తాతగారి దీవెనలను అందుకొని ఖడ్గమును కార్ముకమును ధరించి గుఱ్ఱమును వెదకుటకు బయలుదేఱినాడు.

కం. ఎంతకుఁ దన పుత్రులు తన
చెంతకు రారని సగరుడు చింతిలి, సవమున్
సాంతము సేయగఁ దలచుచు,
మంతనములు సలుప నంశుమంతునిఁ బిలిచెన్. 321

ఉ. శూరుడ వీవు పౌత్రుడవు, శూరత నేగుము నీదు తండ్రులన్
వారువమున్ గనంగఁ, గరవాలముఁ గార్ముకమున్ గ్రహింపుమా!
చేరి నమస్కరింపుము విశిష్టులఁ, జంపుము విఘ్నశీలురన్,
ధీరుడవై తురంగమును దెమ్ము శుభమ్ముగుఁ బొమ్ము శీఘ్రమే" 322

తే.గీ. అనుచు సగరుడు పల్కగా నంశుమంతు
డట్లె యని, తాత దీవెన లందుకొనుచుఁ,
బుడమిఁ బితరులన్ యజ్ఞాశ్వమున్ వెదుకగ,
ఖడ్గకార్ముకధారియై కదలినాడు. 323

స ఖాతం పితృభి ర్మార్గ మంత ర్భౌమం మహాత్మభిః।
ప్రాపద్యత నరశ్రేష్ఠ తేన రాజ్ఞాభిచోదితః॥ {1.41.6}
తేషాం తద్వచనం శ్రుత్వా జగామ లఘువిక్రమః।
భస్మరాశీకృతా యత్ర పితర స్తస్య సాగరాః॥ {1.41.12}

❉ *"ఓ రఘురామా! సగరుని మనుమడైన అంశుమంతుడు తాతగారి మాట ననుసరించి యజ్ఞాశ్వమును పినతండ్రులను వెదకుటకు బయలుదేఱినాడు. తన పినతండ్రులు భూమిని త్రవ్విన మార్గంలోనే ప్రయాణించి రసాతలం చేరుకొన్నాడు. అచ్చట దేవదానవులు నిరంతరం పూజించే దిగ్గజాన్ని దర్శించి భక్తిప్రపత్తులతో పూజించి "ఓ దిగ్గజమా! మా యాగాశ్వము జాడను, మా పితరుల జాడను తెలియజేయి" అని ప్రార్థించినాడు. అప్పుడు ఆ దిగ్గజము "ఓ అంశుమంతుడా! నీవు ధన్యుడవు. త్వరలో నీవు మీ యజ్ఞాశ్వమును తీసికొని మీ అయోధ్యానగరమునకు చేరుకొనగలవు. ఇది నిజము" అని అతడు కోరిన విషయమును గుఱించి తెలియజేసినది. ఇతర దిగ్గజములు కూడా అదేవిధముగా తెలుపగా అంశుమంతుడు తన పితరులు భస్మమై పడియున్న ప్రదేశమునకు చేరుకొన్నాడు.*

చం. పితరులు త్రవ్వినట్టి పృథివిన్ గని, తత్పథ మంద యేగి, సం
తతమును దేవదానవులు నమ్మి భజించు గజేంద్రుఁ జూచి, తా
నతులిత భక్తిఁ గొల్చి సవనాశ్వము జాడను దెల్పుమన్న, నీ
ప్సిత విషయమ్ము నాతనికిఁ బ్రీతి వచించెను దిగ్గజ మ్మిటుల్. 324

మ. అరయన్ ధన్యుడ వంశుమంతుడ! భవద్యజ్ఞాశ్వమున్ గూడుచున్
త్వరలో నేగెద వా యయోధ్య కిది సిద్ధమ్మంచు దిగ్వారణ

మ్ము రహిన్ దెల్పగ, నట్లె పల్క నితరమ్ముల్ దిగ్గజమ్ముల్, చనెన్
వరుసన్, దండ్రులు భస్మమై పడిన తత్ప్రాంతమ్ముఁ జేరెన్ వెసన్. 325

స చైవ మబ్రవీ ద్వాక్యం వైనతేయో మహాబలః।
మా శుచః పురుషవ్యాఘ్ర వధోఽయం లోకసమ్మతః॥ {1.41.17}
భస్మరాశీకృతా నేతాన్ ప్లావయే ల్లోకపావనీ। {1.41.20}
షష్టిం పుత్రసహస్రాణి స్వర్గలోకం నయిష్యతి। {1.41.21}

❊ ఓ రఘురామా! సగరుని మనుమడైన అంశుమంతుడు తన (అరవైవేలమంది) పినతండ్రులు భస్మంగా పడియున్న ప్రదేశాన్ని చేరుకొన్నాడు. అచ్చట ఉన్న భస్మము తన పితరులదే అని తెలిసికొని వారిని ప్రత్యక్షంగా చూడలేకపోయినానని బాధపడి వారి మరణమునకు కుమిలిపోయినాడు. అక్కడే ఉన్న యజ్ఞాశ్వాన్ని చూచినాడు. పితరులకు జలతర్పణం ఇవ్వడం తన బాధ్యతగా భావించి నీటికొఱకు వెదుకసాగినాడు. ఎక్కడను నీరు కనిపించకపోగా విలపిస్తూ ఆ సమయాన అచ్చటకు వచ్చిన తన పితరులకు మేనమామయైన గరుత్మంతుని చూచి పితరులకు పట్టిన దుర్గతిని తెలిపి ఏడువసాగినాడు. అప్పుడు గరుడుడు "ఓ అంశుమంతుడా! వీరి మరణము లోకసమ్మతము. కాబట్టి నీవు శోకించవద్దు. నిష్కారణంగా దాడి చేయబూనిన వీరిని కపిల వాసుదేవ మహర్షి తన కోపాగ్నిచే భస్మం చేసినాడు. వీరికి సాధారణ జలములతో తర్పణం ఇవ్వడం సరికాదు. పవిత్రమైన గంగానదీ జలతర్పణం మాత్రమే పాపములను తొలగించి వీరిని స్వర్గలోకమునకు తీసికొనివెళ్లగలదు" అని హితమును ఉపదేశించినాడు.

చం. పితరులఁ జూడలేక పరివేదనఁ జెందుచు, భస్మరాసులన్
బితరులుగా నెఱింగి దురపిల్లుచు, యజ్ఞహయమ్ముఁ గాంచె; బా
ధ్యత యని వారికెల్ల జలతర్పణ మీయగ నెంచి, నీటికై
వెతకి జలమ్ముఁ గానకఁ దపించుచుఁ, జూచె సుపర్ణ బంధువున్. 326

తే.గీ. పితరులకు మేనమామయౌ విహగపతినిఁ
జూచి, యంశుమంతుం డేడ్చె శోక మొదవ,
నంత గరుడుడు వచియించె నతని కిట్లు
"లోకసమ్మత మిది నీకు శోక మేల?" 327

తే.గీ. "కపిలముని కోపమున వీరిఁ గాల్చివేసె,
నిచటి జలములఁ దర్పణ మెన్నఁ దగదు,
గాంగజలములె వీరల కలుషమడచి
పావనులఁ జేసి పంపించు స్వర్గమునకు" 328

యజ్ఞం నిర్వర్తయామాస యథాకల్పం యథావిధి। {1.41.25}
త్రింశ ద్వర్షసహస్రాణి రాజ్యం కృత్వా దివంగతః। {1.41.27}
స రాజా సుమహా నాసీ దంశుమాన్ రఘునందన। {1.42.2}
తపోవనం గతో రామ స్వర్గం లేభే తపోధనః॥ {1.42.4}


❉ ఓ రఘురామా! గరుత్మంతుడు అంశుమంతుని చూచి "నాయనా! యజ్ఞాశ్వమును తీసికొని వెళ్లు. మీ తాతయైన సగరచక్రవర్తి యాగాన్ని పూర్తిచేస్తాడు" అని తెలుపగా అట్లే అనిన అంశుమంతుడు గుఱ్ఱముతోపాటు అయోధ్య చేరి తాతగారికి జరిగిన విషయాన్ని, గరుడుని మాటలను వివరించినాడు. సగరుడు అశ్వమేధయాగాన్ని పూర్తిచేసి, చక్కగా రాజ్యపరిపాలన చేస్తూ గంగను దివినుండి భువికి తీసికొనిరావడం ఎలా? అని చింతిస్తూ ముప్పైవేల సంవత్సరాల తరువాత దివంగతుడైనాడు. సగరుడు మరణించిన తరువాత అంశుమంతుడు రాజైనాడు. కొంతకాలం తరువాత అంశుమంతుడు కుమారుడైన దిలీపునికి రాజ్యం అప్పజెప్పి తాను అడవికి వెళ్లి తపస్సు చేస్తూ ముప్పైరెండు వేల సంవత్సరాల తరువాత స్వర్గస్థుడైనాడు.

తే.గీ. "అంశుమంతుడ! నీవు యజ్ఞాశ్వముఁ గొని
శీఘ్రముగను బితామహుఁ జేరుకొనుము

బుధులతో నశ్వమేధమున్ బూర్తిఁ జేయు
నత" దనుచుఁ బలికె నప్పు డా గరుడుడు. 329

ఉ. అప్పుడ యంశుమంతుడు హయమ్మును గొంచు నయోధ్యఁ జేరి తా
జెప్పె సుపర్ణువాక్యములఁ, జేసెను బార్థివు దశ్వమేధమున్
గొప్పగ, గంగ రాక మదిఁ గోరుచు, రాజ్యము నేలుచుండగన్
ముప్పదివేల యేండ్లు చన, భూపతి యంత దివంగతుండయెన్. 330

తే.గీ. అటుల సగరుండు దివికేగ నంశుమంతు
డపుడు రాజుగ భువినేలి, యాత్మజు నిక
నేలుమనుచు దిలీపుని, నేగె వనికి,
నేగె ముప్పదిరెండు వేలేండ్లకు దివి. 331



42. భగీరథుడు గంగను భూమికి తెచ్చుటకు తపస్సును ప్రారంభించుట

తస్య చింతయతో నిత్యం ధర్మేణ విదితాత్మనః।
పుత్రో భగీరథో నామ జజ్ఞే పరమధార్మికః॥ {1.42.7}
భగీరథస్తు రాజర్షి ర్ధార్మికో రఘునందన। {1.42.11}
మంత్రి ష్వాధాయ తద్రాజ్యం గఙ్గావతరణే రతః। {1.42.12}

❊ ఓ రఘురామా! అంశుమంతుడు మరణించిన తరువాత దిలీప మహారాజు "తన పితామహులను పావనం చేయగల గంగానది ఎలా అవతరిస్తుంది" అని నిరంతరం చింతిస్తూ ఉండినాడు. యజ్ఞయాగాదులు చేసినాడు. వంశోద్ధారకుడైన భగీరథుడు అనే కుమారుని పొందినాడు. ముప్పైవేలయేండ్లు రాజ్యమును పరిపాలించినాడు. తన రాజ్యమునందు కుమారుడగు భగీరథుని పట్టాభిషిక్తునిగా చేసినాడు. పితరుల గుఱించి దిగులుపడుతూ మనోవ్యాధితో మరణించినాడు. తాను చేసిన పుణ్యకర్మల ఫలితంగా స్వర్గమును చేరుకొన్నాడు. రాజర్షి యైన భగీరథుడు ప్రజలను తన కన్నబిడ్డలవలె పాలిస్తూ ఎలాగైనా సరే గంగావతరణ అనే మహత్కార్యమును సాధించాలి అని నిశ్చయించుకొన్నాడు.

తే.గీ. రాజ్య మేలు దిలీపుడు రాగ మొదవఁ
దన పితామహు లెల్లరు దగ్ధ మగుట
నెంచి గంగావతరణ మదెట్లు జరుగు
ననెడి చింతతో నుండెఁ దా ననవరతము. 332

తే.గీ. ఆ దిలీపుడు యజ్ఞాదు లమరఁ జేసి
ప్రణుతిఁ గాంచెడి సుతు భగీరథునిఁ బొంది
రక్తి ముప్పదివేలేండ్లు రాజ్య మేలి
కోర్కి సుతునిఁ బట్టాభిషిక్తునిగఁ జేసె. 333

తే.గీ. త్వరగ గంగావతరణమ్ము జరుగు టెట్టు
లనెడి చింతఁ, బితామహులనుఁ దలచుచు

మరణ మొంది, దిలీపుడు మహితమైన
పుణ్యకర్మల ఫలమునఁ బోయె దివికి. 334

తే.గీ. అంతట భగీరథుడు కీర్తి నవని నేలె
సత్యధర్మమ్ము లెఱిగి రాజర్షి యగుచుఁ
బ్రీతిఁ బ్రజలను తన కన్నబిడ్డ లనుచుఁ
దలచి సాధింతు గంగావతరణ మనుచు. 335

స తపో దీర్ఘ మాతిష్ఠ ద్గోకర్ణే రఘునందన॥ {1.42.12}
ఊర్ధ్వబాహుః పంచతపా మాసాహారో జితేంద్రియః। {1.42.13}
గంగాయాః సలిలక్లిన్నే భస్మ న్యేషాం మహాత్మనామ్।
స్వర్గం గచ్ఛేయు రత్యంతం సర్వే మే ప్రపితామహాః॥ {1.42.19}

❃ ఓ రఘురామా! సగరచక్రవర్తి యొక్క మునిమనుమడైన భగీరథుడు గంగావతరణం కొఱకు గోకర్ణం వెళ్లి కఠోరమైన తపస్సును చేయసాగినాడు. ఏకాగ్రత గలవాడై, ఊర్ధ్వబాహుడై, మాసమునకు ఒకసారి మాత్రమే ఆహారమును భుజించువాడై, పంచాగ్నుల మధ్య నిలబడినవాడై, ఇంద్రియనిగ్రహం కలవాడై, దీక్షాబద్ధుడై ఘోరమైన తపస్సును చేస్తూ ఉండగా ప్రీతి చెందిన చతుర్ముఖుడు ప్రత్యక్షమై "వరం కోరుకో. నిన్ను అనుగ్రహిస్తాను" అని అన్నాడు. అప్పుడు భగీరథుడు "ఓ బ్రహ్మదేవా! నా పితామహులైన సగరపుత్రులు స్వర్గలోకమును చేరుకొనుటకు వారికి గంగానదీజలములతో తర్పణం ఇవ్వవలసియున్నది. అందుకొఱకు నాకు సురగంగ కావలెను. గొప్పదైన ఇక్ష్వాకు వంశంలో జన్మించిన నేను సంతోషాన్ని కలిగించే సంతానాన్ని ఇంతవరకు పొందలేదు. కాబట్టి వంశమును నిలిపే సంతతిని కూడా దయతో అనుగ్రహించండి" అని ప్రార్థించినాడు.

మ. ఘన గంగానది నందఁ గోరుచును గోకర్ణమ్ముఁ జేరెన్, వర
మ్మని యేకాగ్రత నూర్ధ్వబాహుడుగ మాసాహారిగాఁ దప్తు ద
య్యెను, బంచాగ్నుల మధ్య నుండి మది నెంతే నిగ్రహమ్మొప్ప దీ
క్షనుఁ జేసెం దప మా భగీరథుడు సాక్షాద్బ్రహ్మదేవున్ గనన్. 336

చం. ఘనుడు భగీరథుం డటు లఖండ తప మ్మొనరింప, బ్రహ్మ యా
తని గని "కోరుమా వరముఁ దప్పక నిత్తు" నటంచుఁ బల్క, న
మ్మనుజ వరుండు కోరె నిటు "మత్ప్రపితామహు లెల్ల స్వర్గమున్
గన సురగంగ కావలయు గాంగజలమ్ములఁ దర్పణమ్మిడన్". 337

తే.గీ. భవ్యమైనట్టి యిక్ష్వాకు వంశజుడను
హర్షము నొసంగు సంతాన మందనైతి
నన్నుఁ గరుణించి దయను సంతతి నొసంగి
వంశమును నిల్పు మని వేడె వనజభవుని. 338

గంగాయాః పతనం రాజన్ పృథివీ న సహిష్యతి।
తాం వై ధారయితుం వీర నాన్యం పశ్యామి శూలినః॥ {1.42.24}
ఉమాపతిః పశుపతీ రాజాన మిద మబ్రవీత్॥ {1.43.2}
శిరసా ధారయిష్యామి శైలరాజసుతా మహమ్॥ {1.43.3}

❋ ఓ రఘురామా! సురగంగ కావాలి, సంతానం కావాలి అన్న రాజశ్రేష్ఠుని కోరికలను వినిన బ్రహ్మదేవుడు తథాస్తు అని అన్నాడు. "ఓ మహారథుడా! భగీరథుడా! నీ కోరిక ననుసరించి గంగ దివినుండి భువికి తప్పనిసరిగా అవతరిస్తుంది. నిన్ను అనుసరిస్తుంది. అయితే వేగంగా క్రిందకు దూకే సురగంగను ఈ భూమి భరించలేదు. గంగను ధరించగల శక్తిమంతుడు చంద్రశేఖరుడు ఒక్కడే. అందువలన నీవు నీ తపస్సుతో ఆ పరమేశ్వరుని సంతోషపెట్టు" అని చతుర్ముఖుడు అదృశ్యమైనాడు. భగీరథుడు మరల దీక్ష వహించి తన కాలి బొటనవ్రేలి కొనభాగంపై నిలబడి తపస్సును మొదలుపెట్టినాడు. ఒక సంవత్సర కాలం గడువగా అతని తపస్సును మెచ్చి పరమశివుడు ప్రత్యక్షమైనాడు. "గంగను నేను ధరిస్తాను" అని అభయ మిచ్చినాడు. ఆ తరువాత సురగంగ వేగంగా ఆకాశం నుండి శంభుని శిరస్సుపైకి దూకింది.

చం. అన విని బ్రహ్మదేవుడు తథాస్తని, "గంగ మహోద్ధృతిం బిఱుం
దన నరుదెంచు, దాని ధర తాల్చి భరింపగఁ జాల, దో
యనఘ! ధరింపనోపెడి మహాత్ముఁడు శంభుడు గాన, వేగ శూ
లినిఁ బరితుష్టుఁ జేయు" మని లీల వచించి యదృశ్యుడై చనెన్. 339

మ. గురుదీక్షన్ సమ మా భగీరథుడు స్వాంగుష్ఠాగ్ర మాత్రమ్మునన్
ధరపై నిల్చి తప మ్మొనర్పఁ గని, చేతఃప్రీతిఁ బ్రత్యక్షమై
వర మిచ్చెన్ సురగంగఁ దాల్తు ననుచున్ భర్గుండు, తా నంత భా
సుర వేగమ్మున దూకె శంభుని శిరస్సున్ జేరగా గంగయున్. 340



43. గంగావతరణము

అచింతయ చ్చ సా దేవీ గంగా పరమదుర్ధరా॥ {1.43.5}
విశామ్యహం హి పాతాళం స్రోతసా గృహ్య శంకరమ్।
తస్యావలేపనం జ్ఞాత్వా క్రుద్ధస్తు భగవాన్ హరః॥ {1.43.6}
తిరోభావయితుం బుద్ధిం చక్రే త్రిణయన స్తదా। {1.43.7}

❈ ఓ రఘురామా! దేవత లందఱూ కొనియాడుతూ తనకు నమస్కారాలు చేస్తూ ఉండగా సురగంగ పొంగుతూ గొప్ప ప్రవాహంగా రూపుదిద్దుకొని ఆకాశం నుండి క్రిందికి దూకింది. పావనమైన శంభుని శిరస్సును చేరుతూ గర్వాన్ని పొందినదై తన వేగంతో ఆ పరమశివుని తనతోపాటు రసాతలానికి తీసికొని వెళ్లిపోతాను అని భావించింది. సర్వజ్ఞుడైన గంగాధరుడు సురగంగ గర్వమును పొందినదని గ్రహించి ఉగ్రుడైనాడు. ఆ మందాకిని యొక్క మదమును అణచివేయదలచిన వ్యోమకేశుడు తన జటామండలమును విస్తరింపజేసి అందులో ఆ గంగను బంధించినాడు. అప్పుడు గంగ భ్రాంతికి లోనై గర్వభంగాన్ని పొంది ఎటువెళ్లవలెనో దిక్కు తోచక, ఏ దారీ లేక ఎంతగానో చింతించసాగింది.

మ. వినుతుల్ సేయుచు దేవతల్ నతులిడన్ విచ్చేయుచున్ బొంగుచున్
ఘన రూపమ్మును దాల్చి గంగ దిగె నా కాశమ్ము నందుండి పా
వనమౌ శంభు శిరమ్ముఁ జేరి, మది సంభావించె నీ రీతి "నీ
శునిఁ గొంపోదు రసాతలమ్మునకు నాశుప్రౌఢి నే నిప్పుడే". 341

మ. మదిలో గర్వము నందె గంగ యనుచున్ భావించి సర్వజ్ఞు, డా
మదమున్ ద్రుంచగ నెంచి యుగ్రుడుగఁ దా మారెన్, జటామండలం
బది విస్తారతరంబు గాగఁ, గ్రుధతో నద్దాని బంధించె, నం
త దిశల్ గాంచగలేక గంగ కడుఁ జింతన్ బొందె విభ్రాంతయై. 342

నైవ నిర్గమనం లేభే జటామణ్డల మోహితా। {1.43.9}
తా మపశ్యన్ పునస్తత్ర తపః పరమ మాస్థితః। {1.43.10}
విససర్జ తతో గంగాం హరో బిందుసరః ప్రతి।
తస్యాం విసృజ్యమానాయాం సప్త స్రోతాంసి జజ్ఞిరే॥ {1.43.11}

❊ ఓ రఘురామా! ఆ విధంగా ఆకాశగంగ పరమ శివుని జటాజూటంలో బంధింపబడి ఎటు పోవడానికీ దారిలేక అక్కడనే తిరుగుతూ ఉండసాగినది. దేవగంగకు పొంగిన ఆవేశం పూర్తిగా అణగారింది. గర్వమంతా నశించింది. సంవత్సరాలపాటు కాలం గడిచింది. గంగ ఎంతకూ దిగిరాకపోవడంతో భగీరథుడు గంగాధరుని గుఱించి రెండవమాఱు తపస్సు చేసినాడు. పట్టువదలక మరలా తపస్సు చేస్తున్న భగీరథుని ధూర్జటి మెచ్చుకొన్నాడు. తన భక్తుని కోరికను తీర్చదలచి శివుడు సంతోషంగా గంగను విడిచిపెట్టినాడు. అప్పుడు గర్వవిహీనయైన గంగ వినయగుణం కలిగినదై శివజటాజూటం నుండి ఏడుపాయలుగా భూమిపై పడింది.

ఉ. ఆ విధి గంగ యీశు జట లందె చరింపగసాగెఁ, దా నెటుల్
పోవగ దారిలేక, తన పొంగు నశింపగ, మేటి గర్వమున్
బోవగ, వర్షముల్ గడచిపోవగఁ; జేసె భగీరథుండు స
ద్భావన నీశు నెంచుచుఁ దపమ్మును రెండవ మాఱు దీక్షతో. 343

చం. వదలక యా భగీరథుడు భవ్యతపమ్మును జేయ మెచ్చుచున్,
వదలెను గంగ నా శివుడు భక్తుని కోరికఁ దీర్ప, నంతటన్
గదలెను దివ్యగంగ నిజగర్వము సర్వము ఖర్వ మౌటచే,
మెదలుచు నమ్రభావమున, మేదినిఁ జేరిన దేడుపాయలై. 344

హ్లాదినీ పావనీ చైవ నలినీ చ తథాఽపరా।
తిస్రః ప్రాచీం దిశం జగ్ముః గంగా శ్శివజలా శ్శుభాః॥ {1.43.12}
సుచక్షు శ్చైవ సీతా చ సింధు శ్చైవ మహానదీ।
తిస్ర స్త్వేతా దిశం జగ్ముః ప్రతీచీం తు శుభోదకాః॥ {1.43.13}
సప్తమీ చాన్వగా త్తాసాం భగీరథ మథో నృపమ్। {1.43.14}

❋ ఓ రఘురామా! పరమశివుడు తన జటాజూటమున బంధించిన గంగను కరుణించి వదలిపెట్టగా, ఆ సురాపగ సంతోషంతో అద్భుతమైన రీతిలో భువికి అవతరిస్తూ, బిందుసరోవరాన్ని చేరి ఏడుపాయలుగా ప్రవహించింది. ఏడుపాయలలో నళిని, పావని, హ్లాదిని అను పేర్లతో మూడుపాయలు తూర్పుదిక్కునకు ప్రహించసాగినవి. సింధువు, సీత, సుచక్షువు అనే పేర్లతో మూడుపాయలు పడమటిదిక్కునకు ప్రవహించసాగినవి. ఇక మిగిలిన ఏడవపాయ భగీరథుని పితరులకు తన స్పర్శతో ఊర్ధ్వలోకగతులను ఉత్తమయోగమును కలిగింపదలచి ఆ రాజశ్రేష్ఠుని అనుసరించింది.

తే.గీ. త్రోవఁ గనె గంగ బిందుసరోవర దిశ
నేడు పాయల గంగలో మూడు పాయ
లరిగెను నళిని పావని హ్లాదిని యను
నామములఁ దూర్పు దెసకు విన్నాణముగను. 345

తే.గీ. శ్రేయ మిడు మఱియొక మూడు పాయలు కొన
సాగె సింధువు సీత సుచక్షు వనెడి
దివ్య నామాల పడమటి దెసకు, తాను
ధన్యతను గాంచినట్లుగా తలచె ధరణి. 346

ఉ. ఆగక శంభు మస్తకము నందు, సురాపగ సంతసమ్ముతో
నా గతి దూకి యేగెఁ బరమాద్భుత లీలల నాఱు పాయలై,
వేగముతో భగీరథుని వెంబడి యేడవ పాయ సాగె, స
ద్యోగము గూర్చి సాగరుల కూర్ధ్వగతుల్ గలిగింప నెంచుచున్. 347

భగీరథోఽపి రాజర్షిః దివ్యం స్యందన మాస్థితః। {1.43.14}
ప్రాయా దగ్రే మహాతేజా గంగా తం చా ప్యనువ్రజత్। {1.43.15}
త దద్భుతతమం లోకే గంగాపతన ముత్తమమ్॥ {1.43.19}
దిదృక్షవో దేవగణా స్సమీయు రమితౌజసః। {1.43.20}

❊ ఓ రఘురామా! శివుని శిరస్సు నుండి అవనికి అవతరించిన ఆకాశగంగ రథస్థుడైన భగీరథుని అనుసరించసాగినది. అపార జలరాశితో గొప్ప గొప్ప శబ్దములతో ఆ రాజర్షిని వెంబడించి వెళ్లే ఆ గంగా ప్రవాహంలో తాబేళ్లు మొసళ్లు చేపలు మొదలైన జలచరాలు ఉత్సాహంతో ఎగిరిపడసాగినవి. దివిజగంగ దివ్యజలాలతో భువికి అవతరిస్తూ ఉండగా దేవతలు ఋషులు యక్షులు మొదలైనవారు తమ తమ వాహనములపై ఉండి ఆకాశము నుండియే ఎంతో ఆశ్చర్యంతో మహోత్సాహంతో గంగావతరణ దృశ్యాన్ని తిలకించి పులకించసాగినారు.

శా. ఆ రాజర్షి భగీరథుండు రథమం దాసీనుడై ముందు పో
గా, రాశీకృత తోయజాలములతో గంభీర నాదమ్ముతో
నా రాజన్యుని వెంబడించి చనెఁ దా నా గంగ, చూడంగ నా
వారిన్ కచ్ఛప శింశుమార ఝషముల్ వర్తించె నర్తించుచున్. 348

మ. దివిలో నుండిన గంగ యా విధముగా దివ్యాంబుజాలమ్ముతో
నవనిన్ జేరగ, దేవతల్ మునులు యక్షాదుల్ సమూహమ్ముగా
స్తవనీయంబగు వాహనమ్ముల పయిన్ సంతుష్టిమై వచ్చి, తా
మవలోకించిరి నింగి నుండియె ప్రవాహమ్మున్ మహోత్సాహులై. 349

క్వచి ద్ద్రుతతరం యాతి కుటిలం క్వచి దాయతమ్॥ {1.43.23}
వినతం క్వచి దుద్భూతం క్వచి ద్యాతి శనైః శనైః।
సలిలేనైవ సలిలం క్వచి దభ్యాహతం పునః॥ {1.43.24}
ముహు రూర్ధ్వముఖం గత్వా పపాత వసుధాతలమ్। {1.43.25}

❊ ఓ రఘురామా! గంగావతరణ దృశ్యమును అమరులు ఆకాశంలోనే ఉండి ఆశ్చర్యంతో తిలకిస్తూ ఉండినారు. గొప్ప ఆభరణాలతో కూడిన దేవతలు ఆకాశంలో ప్రకాశిస్తూ ఉంటే మేఘాలు లేని ఆ ఆకాశం వందమంది సూర్యులతో ప్రకాశిస్తూ ఉన్నట్లు అనిపించింది. గంగ దివినుండి భువికి దిగివచ్చే సమయంలో ఆ గంగలో ఉన్న చేపలు తాబేళ్లు సర్పములు మొసళ్లు మొదలగు జలచరాలు అటు ఇటు కదులుతూ నింగిలో మెఱుస్తూ ఉంటే ఆకాశంలో

మేఘాలు లేకుండానే మెఱుపులు కనిపించినట్లయ్యింది. గంగా ప్రవాహ వేగానికి నింగిలో వేయివిధాలుగా నురుగులు ఏర్పడగా గగనతలంలో శరత్కాలమేఘాలతోపాటు రాజహంసలు ఎగురుతున్నట్లు అనిపించింది. భూమికి చేరిన ఆ పావన గంగానది ఒకచోట వేగంగా మఱొకచోట మెల్లగా, ఒకచోట నేరుగా (చక్కగా) మఱొకచోట వంకరగా ప్రవహిస్తూ, ఒకచోట క్రిందికి దూకుతూ మఱొకచోట ఊర్ధ్వదిశకు చేరుతూ, ఒకచోట అక్కడే పుట్టినట్లు బుగ్గ వలె పైకి ఉబుకుతూ ఒకచోట ప్రశాంతంగా ఉంటూ అనేకవిధాలుగా ప్రవహిస్తూ అందఱికీ పరమానందమును కలిగించసాగినది.

తే.గీ. తేజమున నొప్పుచుండిన దేవవరులు
మెఱయుచుండంగ నింగి నాభరణ కాంతి,
మేఘములు లేని గగనమ్ము మించె నప్పు
డతులితంబుగ శతసూర్యయుతము వోలె. 350

తే.గీ. దివిని వీడ్కొని సరగున భువికి వచ్చు
గంగలో మత్స్య కచ్ఛప గణము లురగ
ములును శింశుమారములు సంచలితములయి
మెఱపులో యన నింగిలో మెఱయసాగె. 351

తే.గీ. గంగ వేగమ్ముతో రాగ నింగి నుండి
వేయివిధముల ఫేనమ్ము విస్తరింప
నెగడె హంసలతో వలె నింగి యెల్ల
వఱలి నట్లుండె శారదాభ్రములతోడ. 352

మ. ఒకచో నేగును గంగ వేగముగఁ, దా నొక్కొక్కచో మెల్లగా,
నొకచో నాయతతం జనున్, గుటిలగా నొక్కొక్కచో, దూకుగా
నొకచో, నూర్ధ్వముగాఁ జరించు నొకచో నుద్భూతగా, నమ్రగా
నొకచోటన్ బ్రవహించుఁ, బావనముగా నొప్పారుచున్ ధాత్రిపై. 353

తత్ర దేవర్షిగంధర్వా వసుధాతలవాసినః॥ {1.43.26}
భవాంగపతితం తోయం పవిత్ర మితి పస్పృశుః।
శాపాత్ ప్రపతితా యే చ గగనాత్ వసుధాతలమ్। {1.43.27}
కృత్వా తత్రాభిషేకం తే బభూవు ర్గత కల్మషాః। {1.43.28}

❊ ఓ రఘురామా! శివుని శిరస్సునుండి దిగివచ్చిన దివ్య పవిత్రగంగ ఆ విధంగా భూమిపై ప్రవహిస్తూ ఉండగా చూచిన దేవతలు మానవులు అందఱూ "ఈ గంగానది పరమశివుని స్పర్శచే తాను పవిత్రమై అందఱినీ పవిత్రులనుగా చేయగలదు" అని అనుకొంటూ భక్తితో నమస్కరిస్తూ ఆ గంగను తాకి ఆ జలమును తమ శిరస్సులపై చల్లుకొన్నారు. శాపమును పొంది చింతిస్తూ స్వర్గలోకాన్ని వదలి భూలోకమును చేరి మనస్తాపంతో కాలాన్ని గడుపుతూ ఉండిన దేవతలు తాము శాపవిమోచనం పొంది మరల తమ స్వస్థలమైన స్వర్గమును చేరుకొనే సదవకాశం వచ్చిందని భావిస్తూ పవిత్రమైన గంగాజలములలో మునిగి తమ పాపములు తొలగిపోగా ఎటువంటి కల్మషం లేనివారై తిరిగి స్వర్గమునకు చేరుకొన్నారు. "మహాదేవుడైన శివుని స్పర్శతో పావనమైన గంగ ఇప్పుడు ఈ వసుంధరపై ప్రవహిస్తూ ఉన్నది" అని అనుకొంటూ ఎంతోమంది మానవులు భక్తిశ్రద్ధలతో గంగానదీస్నానం చేసి తమ శ్రమ తొలగిపోగా విశ్రాంతిని పొందుతూ పరమానందమును పొందినారు.

చం. భవుని శిరస్సు నుండి దిగివచ్చిన దివ్య పవిత్ర గంగ తా
నవనిఁ జరింపఁ, గాంచుచు సురావళి మానవకోటి మ్రొక్కుచున్
"శివుని శిరస్సు నుండి భువిఁ జేరిన గంగ పవిత్ర" మంచు "వా
స్తవ మిది" యంచుఁ దజ్జలముఁ దాకి ధరించిరి మస్తకమ్ములన్. 354

ఉ. శాపము నంది చింతిలుచు స్వర్గము వీడుచు భూమిపై మన
స్తాపముతో వసించు బహు దైవతముఖ్యులు శాపమోక్షమే
తోపగ, గంగలో మునిగి తుష్టినిఁ బొంది పవిత్రవారిచేఁ
బాపము వీడగా మరల స్వర్గముఁ జేరి రకల్మషాత్ములై. 355

తే.గీ. హరునిఁ దాకుటఁ బావనమైన గంగ
హేల నీ వసుంధరఁ బ్రవహించుచుండ
శ్రద్ధతో నరుల్ గంగలో స్నానమాడి
శ్రమ తొలంగ ముదమ్ము విశ్రాంతిఁ గనిరి. 356

యతో భగీరథో రాజా తతో గంగా యశస్వినీ॥ {1.43.33}
జగామ సరితాం శ్రేష్ఠా సర్వపాపవినాశినీ। {1.43.34}
తతస్తుష్టో మహాతేజా శ్రోత్రాభ్యా మసృజత్ పునః।
తస్మా జ్జహ్నుసుతా గంగా ప్రోచ్యతే జాహ్నవీతి చ॥ {1.43.38}

❈ ఓ రఘురామా! భగీరథుడు రథంలో కూర్చొని వెళ్తూ ఉండగా సురగంగ సంతోషంగా అతని రథమార్గాన్ని అనుసరించింది. దేవతలు యక్షులు కిన్నరులు మునులు అప్సరసలు నాగులు దైత్యులు దానవులు ఆ గంగానదిని అనుసరించి వెళ్లసాగినారు. చిందులు వేస్తూ పైకి ఎగసిపడే చేపలు కూడా గంగను అనుసరించసాగినవి. భగీరథ మహారాజు ఎక్కడికి వెళ్తే అక్కడికి సురగంగ వెళ్లసాగింది. తన స్పర్శతో అనేక ప్రదేశములను ప్రాణులను పావనం చేస్తూ గంగానది తాను వెళ్లే దారిలో ఉండిన జహ్ను మహర్షి యొక్క యజ్ఞవాటికను ముంచివేసింది. అందులకు కోపించిన జహ్ను మహర్షి గంగను పూర్తిగా త్రాగివేసినాడు. దేవతలందఱూ జహ్నుమహర్షిని సేవించి "ఓ మహర్షీ! గంగ ఇకనుండి నీ కుమార్తెగా మెలగగలదు. కరుణ చూపి గంగను విడిచిపెట్టు" అని వేడుకొనగా ప్రసన్నుడైన జహ్నుమహర్షి తన రెండు చెవులనుండి గంగను విడిచిపెట్టినాడు. జహ్నుమహర్షి కుమార్తెగా మారిన గంగ ఆ నాటినుండి జాహ్నవి అనే పేరుతో ప్రసిద్ధికెక్కింది.

ఉ. ముందు భగీరథుండు చన, మోదముతో సురగంగ యేగెఁ ద
త్స్యందన మార్గ మందున, సురావళి నాగులు యక్షు లప్సరో
బృందము దైత్య దానవుల బృందము కిన్నర మౌని బృందముల్
చిందులు వేయు మత్స్యములు చిత్రము గంగను వెంబడించెగా. 357

ఉ. ఎక్కడి కేగునో నృపుడు స్వేచ్ఛగఁ, బావన దివ్య గంగ తా
నక్కడి కేగుఁ బాపముల నంతము చేయును స్పర్శచేతనే,
చక్కగ నేగు మార్గమున జహ్నుమునీంద్రుని యజ్ఞవాటికన్
జిక్కరిఁ జేసె ముంచి, ముని చేకొని గంగనుఁ ద్రాగెఁ గ్రుద్ధుడై. 358

తే.గీ. అంత సుర లెల్ల జహ్నుమహర్షిఁ గొల్చి
"గంగ నీ సుత యగు నింకఁ గరుణ హితము
సేయు" మన, ముని తన రెండు చెవుల నుండి
విడువ వెల్వడి జాహ్నవి పేర నలరె. 359

జగామ చ పున ర్గంగా భగీరథరథానుగా। {1.43.39}
రసాతలముపాగచ్ఛత్ సిద్ధ్యర్థం తస్య కర్మణః। {1.43.40}
అథ తద్భస్మనాం రాశిం గంగాసలిల ముత్తమమ్॥ {1.43.41}
ప్లావయ ద్ధూతపాప్మాన స్స్వర్గం ప్రాప్తా రఘూత్తమ। {1.43.42}

❊ ఓ రఘురామా! ఆవిధంగా జాహ్నవి అనే పేరును పొందిన సురగంగ మరలా భగీరథుని రథమార్గము వెంబడి వెళ్తూ సముద్రాన్ని చేరింది. ఆ తరువాత రసాతలాన్ని చేరుకొన్నది. రసాతలంలో తన ప్రపితామహుల యొక్క భస్మరాసులను చూచిన భగీరథుడు దీనచిత్తుడై చింతాక్రాంతుడై త్వరగా వారికి జలతర్పణమును ఇవ్వదలచినాడు. అప్పుడు దేవగంగ సగరాత్మజుల యొక్క భస్మరాసులు పడియున్న ప్రాంతాన్ని చేరుకొని తన పవిత్రజలరాసులచే ఆ భస్మరాసులను ముంచివేసింది. తక్షణమే ఆ అరవైవేలమంది సగరపుత్రుల పాపము నశించింది. వారందఱూ స్వర్గలోకమును చేరుకొన్నారు.

చం. మరలఁ జనెన్ భగీరథుని మార్గము వెంబడి గంగ, సింధువున్
సరగునఁ జేరెఁ, జేరెను రసాతలమున్, సలిలక్రియార్థియై
త్వరపడెఁ బార్థివుండు ప్రపితామహులన్ సితభస్మరూపులన్
మరి మరి కాంచి చింతిలుచు మ్రగ్గగ సాగెను దీన చిత్తుడై. 360

ఉ. అంతట దేవగంగ సగరాత్మజ భస్మచయమ్ము లున్న త
త్ప్రాంతముఁ జేరి, స్వీయజలరాసుల ముంచెను భస్మరాసులన్
జింత తొలంగఁ, బాపము నశింపగ షష్టిసహస్ర సాగరుల్
వింతగఁ దక్షణమ్మె కదు వేడుకఁ జేరిరి స్వర్గలోకమున్. 361



44. సగరపుత్రులకు స్వర్గప్రాప్తి

సాగరస్య జలం లోకే యావత్ స్థాస్యతి పార్థివ।
సగర స్యాత్మజా స్తావత్ స్వర్గే స్థాస్యంతి దేవవత్॥ {1.44.4}
ఇయం చ దుహితా జ్యేష్ఠా తవ గంగా భవిష్యతి। {1.44.5}
గంగా త్రిపథగా రాజన్ దివ్యా భాగీరథీతి చ। {1.44.6}

❊ ఓ రఘురామా! సగరపుత్రులు ఆవిధంగా స్వర్గలోకమును చేరుకొనగా, వరదుడైన బ్రహ్మదేవుడు భగీరథుని దగ్గఱకు వచ్చి, "నాయనా! సురగంగ స్పర్శతో మీ పితరులు అరవైవేలమంది తత్క్షణమే స్వర్గమునకు వెళ్లినారు. ఈ భూమిమీద ఉన్న సముద్రములలో జలములు ఎంతకాలం వఱకు ఉంటాయో అంతకాలం వఱకు మీ పితరులు అందరూ స్వర్గలోకంలోనే ఉండెదరు గాక! ఈ గంగానది నీకు పెద్దకుమార్తెగా విరాజిల్లునుగాక! ఈ జాహ్నవి నీ పేరుతోకూడి భాగీరథి అని కూడా పిలువబడును గాక! ఈ గంగానది స్వర్గలోకంలో ఉండి, అక్కడినుండి భూలోకం చేరి, అక్కడినుండి రసాతలమునకు వచ్చినది. ఈ విధంగా మూడు లోకములలో ప్రవహించినందున గంగానది ఇకపై త్రిపథగ అనే పేరుతో కూడా ప్రసిద్ధి చెందునుగాక! త్రిలోకపూజ్యగా సత్కారమును పొందునుగాక!" అని భగీరథుని దీవించినాడు.

**చం. వరదుడు బ్రహ్మ యంత కనుపట్టుచుఁ బల్కె నిటుల్ "భగీరథా!
సురనది తాకినంతఁ బరిశుద్ధులుగా భవదీయులైన యా
యరువది వేలమంది చని రా త్రిదివమ్మునుఁజేర, నుందు రం
దరు నట నెంతదన్క వసుధన్ జలముండునొ సాగరమ్ములన్. 362**

**ఉ. కూరిమి జ్యేష్ఠపుత్రిక యగున్ నృప! నీదగు నామ మొప్ప భా
గీరథి పేర లోకములఁ గీర్తినిఁ గాంచును; స్వర్గమందు వి
స్తారత నుండెఁ, జేరినది ధాత్రికిఁ, జేరె రసాతలమ్ము, స
త్కారము నందెడిన్ ద్రిపథగా నిక గంగ త్రిలోకపూజ్యగా". 363**

పూర్వకేణ హి తే రాజన్ తేనాతియశసా తదా।
ధర్మిణాం ప్రవరేణాపి నైష ప్రాప్తో మనోరథః॥ {1.44.8}
పితామహానాం సర్వేషాం కురుష్వ సలిలక్రియామ్।
స్వస్తి తేఽస్తు గమిష్యామి స్వం లోకం గమ్యతాం నృప॥ {1.44.15}

❋ ఓ రఘురామా! మీ వంశములో గొప్ప కీర్తినందిన భగీరథుని పేర గంగానదికి భాగీరథి అని పేరు వచ్చినదని తెలిపిన బ్రహ్మదేవుడు భగీరథుని చూచి నాయనా! మీ పూర్వీకులలో సగరుడు, అంశుమంతుడు, దిలీపుడు అనే మహారాజులు సురగంగను అవతరింపజేయవలెనని ప్రయత్నం చేసినారు. అయితే వారు చేసిన కృషి అంతా వ్యర్థమైపోయింది. నీవు సుదీర్ఘమైన అమోఘమైన తపస్సు చేసి దివినుండి గంగానదిని ఈ రసాతలమునకు తీసికొని వచ్చినావు. నీ పితామహుల కందఱికీ పాపవిమోచనముతోపాటు స్వర్గలోక ప్రాప్తిని కలిగించినావు. గంగను అవతరింపజేస్తానన్న నీ ప్రతిజ్ఞ నెఱవేఱింది. ఇక నీవు ప్రశాంతంగా నీ పితరులకు ఈ గంగాజలములతో తర్పణము సమర్పించుము. నీకు సత్కీర్తి లభించుగాక! పుణ్యలోకములు సిద్ధించును గాక! జయము కలుగుగాక" అని ఆశీర్వదించి సంతోషంతో తన లోకమునకు చేరుకొన్నాడు.

చం. సగరుడు, నంశుమంతుడుఁ, బ్రశస్తగుణుండు దిలీపుడున్ సురా
పగ కయి యత్నమున్ సలుప వారలదౌ కృషి వ్యర్థ మయ్యె, నీ
వగణితమౌ తపమ్మున సురాపగఁ దెచ్చి, పితామహాళికిన్
వగ తొలగంగ స్వర్గమును బాత్రత గూర్చితి వో భగీరథా! 364

ఉ. ప్రీతిగ నీ ప్రతిజ్ఞ నెఱవేఱె భగీరథ! కీర్తి గల్గు, నీ
కాతత పుణ్యలోకతతు లబ్బును, దర్పణ మిమ్ము వీరికిన్
జేతము పొంగగా, జయము సిద్ధియుఁ గల్గు" నటంచుఁ బల్కుచున్
ధాత ముదమ్ముతోడఁ దనధామముఁ జేరగ నేగె నంతటన్. 365

భగీరథోఽపి రాజర్షిః కృత్వా సలిలముత్తమమ్। {1.44.17}
కృతోదక శ్శుచీ రాజా స్వపురం ప్రవివేశ హ। {1.44.18}

ఇద మాఖ్యాన మవ్యగ్రో గంగావతరణం శుభమ్॥ {1.44.22}
యశ్శృణోతి చ కాకుత్స్థ సర్వాన్ కామా నవాప్నుయాత్।
సర్వే పాపాః ప్రణశ్యంతి ఆయుః కీర్తిశ్చ వర్ధతే॥ {1.44.23}

❊ ఓ రఘురామా! బ్రహ్మవాక్కు ననుసరించి భగీరథుడు తన పితరులకు గంగాజలములతో తర్పణ కార్యక్రమాన్ని పూర్తిచేసినాడు. అరవైవేలమంది సగరపుత్రులు ఉత్తమ గతులను పొందగా కార్యసిద్ధిని పొందిన భగీరథుడు అయోధ్యానగరానికి చేరుకొన్నాడు. సద్గుణగరిష్ఠుడై రాజ్యమును పరిపాలించినాడు. ఓ దశరథరామా! గంగానది దివినుండి అవతరించుటకు సంబంధించిన కథాసారమును ఇప్పటివఱకు మీకు సంతోషంగా వివరించినాను. ఈ గంగావతరణ గాథను శ్రద్ధతో వినిపించినవారు, ఏకాగ్రతతో వినినవారు ఈ లోకములో గొప్పకీర్తులను పొందగలరు. వారి పాపములు నశింపగలవు. వారికి దీర్ఘాయువు భోగభాగ్యములు సిద్ధింపగలవు. మరణానంతరము వారు స్వర్గమును చేరుకొనగలరు. వారి పితృదేవతలు కూడా పరమానందమును పొందగలరు.

శా. ఆ రాజన్యుడు తర్పణమ్ము లిడగా, నా సాగరుల్ సద్గతిన్
జేరంగా, స్వపురమ్ముఁ జేరె నృపుడున్ సిద్ధార్థుడై, సద్గుణో
దారుండౌచు నయోధ్య నేలె; రఘునాథా! మీకు నేతత్కథా
సారమ్మున్ వివరించినాడ మదిలో సంతోష మొప్పంగగా. 366

కం. గంగావతరణ గాథను
రంగుగ వినిపించు నరుడు రంజిలు భువి ను
ప్పొంగెడి కీర్తుల, స్వర్గము
ముంగిటి సిరియౌఁ బితరులు పులకింపంగా. 367

కం. ఈ గంగావతరణ మను
రాగముతో వినినఁ బాపరాశి నశించున్
భోగము కీర్తియు నాయువు
నాగక వర్ధిల్లు నని మహర్షి వచించెన్. 368

45. క్షీరసాగర మథనము
హాలాహలభక్షణము, అమృతావిర్భావము

అత్యద్భుత మిదం బ్రహ్మన్ కథితం పరమం త్వయా।
గంగావతరణం పుణ్యం సాగరస్యాపి పూరణమ్॥ {1.45.2}
తరామ సరితాం శ్రేష్ఠాం పుణ్యాం త్రిపథగాం నదీమ్। {1.45.6}
నౌ రేషా హి సుఖాస్తీర్ణా ఋషీణాం పుణ్యకర్మణామ్। {1.45.7}

❈ గౌరీమహేశ్వర పవిత్రస్పర్శ కారణంగా తనను స్పృశించినవారికి ఉత్తమలోకములను కలిగించగల సురగంగ యొక్క గాథను విశ్వామిత్రముని తెలియజేయగా విని సంతోషించిన రామలక్ష్మణులు "ఓ మహర్షీ! అత్యద్భుతమైన గంగావతరణ గాథను మీద్వారా విన్నాము. ధన్యతను చేకూర్చే గంగ కథను తన్మయత్వంతో వింటూ ఉంటే కాలము తెలియకుండానే గడచిపోయినది" అని అంటూ గురువును సేవించినారు. రాత్రి గడచిన తరువాత కోదండరాముడు వేకువనే నిద్రలేచి సంధ్యావందనాదికములను పూర్తిచేసి మహర్షిని దర్శించి "ఓ మునీంద్రా! ఎంతో ఆశ్చర్యకరమైన గంగ కథను విన్నాము. మునులందఱూ ఈ గంగానదిని దాటివెళ్లవలెనని కోరుతున్నారు. నావ కూడా సిద్ధంగా ఉన్నది. మీరు సమ్మతిస్తే నావనెక్కి ఈ గంగానది యొక్క అవతలి ఒడ్డునకు వెళ్లుదము" అని విన్నవించినాడు.

మ. స్థిరలోకమ్ములఁ గూర్పగా నవతరించెన్ గంగ గౌరీమహే
శ్వర సంసర్గ పవిత్ర నాఁ బలుక విశ్వామిత్రు, డా గాథ సం
బరమున్ గూర్పగ రామలక్ష్మణులు సౌభాగ్యమ్ముగా నాలకిం
చిరి, యత్యద్భుతమైన గాథ యనుచున్ సేవించి రా సంయమిన్. 369

తే.గీ. ధన్యతను గూర్చు గంగావతరణ గాథఁ
దన్మయత్వమ్ముతో విన దాశరథులు
కాలము తెలియరాకుండఁ గడచిపోయె;
నుదయ మయ్యె రాముడు భాను మదినిఁ గొలిచె. 370

మ. గురువున్ జూచుచు భక్తి నిట్లనియె నా కోదండరాముండు "మా
కరయన్ దివ్య సురాపగావతరణ మ్మాశ్చర్యమున్ గూర్చెగా,
తరియింపంగను నావ యున్న దిచటన్, దాటంగ వాంఛించి రం
దరు గంగానది దాట నేగెదము చేతఃప్రీతి మౌనీశ్వరా!" 371

ఉత్తరం తీర మాసాద్య సంపూజ్యర్షిగణం తదా।
గంగాకూలే నివిష్టా స్తే విశాలాం దదృశుః పురీమ్॥ {1.45.9}
శ్రూయతాం రామ శక్రస్య కథాం కథయత శ్శుభామ్।
అస్మిన్ దేశే తు యద్వృత్తం తదపి శృణు రాఘవ॥ {1.45.14}

❈ మన మందఱమూ ఈ గంగానదిని దాటుదము అని అన్న రఘురాముని మాటకు విశ్వామిత్రముని సంతోషించి గంగను దాటేందుకు ఆమోదం తెలియజేసినాడు. రామలక్ష్మణులు మునులు విశ్వామిత్ర మహర్షి అందఱూ నావ నెక్కి నదిని దాటి గంగ యొక్క ఉత్తరతీరానికి చేరుకొన్నారు. అక్కడ మనోహరంగా స్వర్గలోకసమానంగా వైభవోపేతంగా ఉన్న విశాలా నగరాన్ని చూచినారు. ఆ నగరాన్ని చూచిన శ్రీరాముడు కౌశికుని చూచి "ఓ మహర్షీ! రమ్యమైన ఈ విశాలా నగరం ఎంతో దివ్యమైనదిగా ఉన్నది. ఈ నగరాన్ని ఇంతవఱకు భవ్యంగా పరిపాలించిన రాజవంశములను గుఱించి నాకు వివరించండి" అని వేడినాడు. దశరథరాముని మాటలను విన్న గాధిజుడు "ఓ రామా! ఈ ప్రదేశంలో ఇంద్రుడు కొంతకాలం నివసించినాడు. ఆ శక్రుని కథను వివరిస్తాను శ్రద్ధగా విను"

ఉ. మౌనియు రాము పల్కులకు మానస మందుఁ బ్రమోద మందుచున్,
దానును రామలక్ష్మణు లుదారులు శిష్యులు నావ నెక్కి గం
గానది దాటి, మోదమునఁ గాంచిరి యుత్తరతీరమున్, విశా
లా నగరమ్ముఁ జూచిరి విలాసముగా నట స్వర్గతుల్యమున్. 372

తే.గీ. లక్షణముగనున్నది విశాలాపురమ్ము
దివ్యముగ నున్న దీనిని భవ్యముగను

నేలు రాజవంశముల నా కెఱుగఁ జెప్పు
మనుచు రాముడు ప్రార్థించె మునివరేణ్యు. 373

తే.గీ. రాము పల్కులు విని మునిరాజవరుడు
పలికె నిట్టుల నో రామ! తెలిసికొనుము
సరిగ నీ ప్రదేశమ్మున జరిగినట్టి
శక్రగాథను వివరింతు శ్రద్ధ వినుము. 374

పూర్వం కృతయుగే రామ దితేః పుత్రా మహాబలాః।
అదితే శ్చ మహాభాగ వీర్యవంతః సుధార్మికాః॥ {1.45.14}
తతో నిశ్చిత్య మథనం యోక్త్రం కృత్వా చ వాసుకిమ్
మంథానం మందరం కృత్వా మమంథు రమితౌజసః॥ {1.45.18}

❋ విశాలా నగరమును పరిపాలించిన రాజవంశములను గుఱించి తెలియజేయవలసినదిగా రఘురాముడు కోరగా విశ్వామిత్రముని ఓ అయోధ్యారామా! పూర్వకాలంలో కృతయుగంలో మరీచి మహర్షి పుత్రుడగు కాశ్యపుడు అనే ముని ఉండేవాడు. ఆ కాశ్యపునికి దితి అదితి అనే ఇద్దరు భార్యలు ఉండేవారు. నిర్మలచిత్తలైన వారు ఆ మునికి గొప్ప సహధర్మచారిణులుగా ఉండినారు. దితిపుత్రులైన దైత్యులు సాటిలేని బలం కలవారై యుద్ధములను చేసేవారు. అదితిపుత్రులైన దేవతలు దక్షత కలవారై ధర్మమార్గంలో పోరాడుతూ శత్రువులను జయించేవారు. ఆ దైత్యదానవులు కలిసికొని తమకు జరామరణములు రాకుండుటకు తగిన మార్గములను గుఱించి ఆలోచించసాగినారు. క్షీరసాగరాన్ని చిలికితే అమృతం లభిస్తుంది అని తెలిసికొనినారు. మందరపర్వతాన్ని కవ్వంగా తెచ్చినారు. నాగరాజైన వాసుకిని త్రాడుగా చేసినారు. శత్రుత్వాన్ని మాని స్నేహాన్ని పెంపొందించుకొని దేవదానవులు పాలసముద్రాన్ని వేయి సంవత్సరాలపాటు మథించినారు.

తే.గీ. పూర్వము కృతయుగమునందుఁ బూజ్యుడైన
కాశ్యపుండు మారీచుండు ఘనత నుండె,

దితి యదితి యన నుండిరి సతు లతనికి
నిత్య సహధర్మచారిణుల్ నిర్మల లిల. 375

మ. తుల లేనట్టి బలాఢ్యు లెన్న దితిపుత్రుల్ యుద్ధరంగమ్ములన్,
దొలగం ద్రోతురు దక్షులై యదితిపుత్రుల్ శత్రువర్గమ్ములన్
బల మొప్పంగ సుధర్మమార్గరతులై, భద్రమ్ము వాంఛించి వా
రలు యోచించి రిటుల్ జరామరణముల్ రాకుండు మార్గమ్ములన్. 376

తే.గీ. క్షీరవార్ధినిఁ జిలికినఁ జిక్కు నమృత
మనుచుఁ గవ్వముగను మందరాద్రి నిలిపి
డ్రాడుగా వాసుకిన్ జేసి ద్రచ్చినారు
సఖ్యతన్ వారు వేయి వత్సరము లపుడు. 377

పూర్వం ధన్వంతరి ర్నామ అప్సరాశ్చ సువర్చసః॥ {1.45.19}
వరుణస్య తతః కన్యా వారుణీ రఘునందన। {1.45.23}
ఉచ్చైశ్శ్రవా హయశ్రేష్ఠో మణిరత్నం చ కౌస్తుభమ్।
ఉదతిష్ఠ న్నరశ్రేష్ఠ తథై వామృత ముత్తమమ్॥ {1.45.38}
యదా క్షయం గతం సర్వం తదా విష్ణు ర్మహాబలః।
అమృతం సోఽహర త్తూర్ణం మాయా మాస్థాయ మోహినీమ్॥ {1.45.41}

❈ ఓ రఘురామా! దేవదానవులు కలిసి క్షీరసాగరాన్ని చిలికినప్పుడు దండ కమండలు ధారి యైన ధన్వంతరి ఆవిర్భవించినాడు. అరవై కోట్లమంది అప్సరసలు పరిచారికలతోపాటు వెలువడినారు. వరుణుని కన్యకయైన వారుణి ఉద్భవించింది. ఉచ్చైశ్శ్రవము అనే ఉత్తమాశ్వం వచ్చింది. శుభకరమైన కౌస్తుభము అనే మణి వెలువడింది. చివరకు అమృతం ఆవిర్భవించింది. ఆ అమృతం కొఱకు దేవతలు రాక్షసులు తగవులాడుకొన్నారు. వారి పోరాటంలో కొందఱు రాక్షసులు మరణించినారు. విష్ణుమూర్తి మోహినీరూపాన్ని ధరించి నేర్పుగా ఆ అమృతభాండాన్ని అపహరించినాడు.

సీ. దండ కమండలు ధారి ధన్వంతరి
వెలువడె క్షీరాబ్ధితలము నుండి
అరువదికోట్లుగా నప్సరసల్ రమ్య
పరిచారికలఁ గూడి వచ్చినారు
వరుణకన్యక యగు వారుణి వెల్వడె
వారువ ముచ్చైశ్శ్రవమ్ము వచ్చె
శుభకరమణిగఁ గౌస్తుభము వెల్వడె నంత
నెమ్మదిగా నమృతమ్ము రాగ
తే.గీ. నాదితేయులు దైత్యులు నమృతవాంఛఁ
బోరఁ గొందఱు మరణించినా రసురులు
మోహినీరూపమున విష్ణుమూర్తి వచ్చి
యమృతభాండంబు నేర్పుగా నపహరించె. **378**

యే గతాఽభిముఖం విష్ణు మక్షయం పురుషోత్తమమ్। {1-45-42}
సంపిష్టా స్తే తదా యుద్ధే విష్ణునా ప్రభ విష్ణునా॥ {1-45-43}
నిహత్య దితి పుత్రాంశ్చ రాజ్యం ప్రాప్య పురందరః।
శశాస ముదితో లోకాన్ సర్షిసంఘాన్ సచారణాన్॥ {1-45-44}

❈ శ్రీహరి అవలీలగా దైత్యసేనలను వధింపగా దేవదానవ సంగ్రామంలో విజయం ఇంద్రుని వరించింది. వాసవుడు గొప్పదైన వీర్యసంపద వర్ధిల్లగా అన్ని లోకాలను సంతోషంగా పరిపాలింపసాగినాడు.

మ. అవలీలన్ వధియించినాడు హరి దైత్యానీకమున్, దేవదా
నవ సంగ్రామమునన్ జయమ్ము కలుగంగా వాసవుం డంతటన్
స్తవనీయంబుగఁ నెల్లలోకములఁ జేతఃప్రీతిఁ బాలించెఁ బ్రా
భవ మొప్పారగ హర్షమున్ గనుచు శుంభద్వీర్య సంపన్నతన్. **379**

46. ఇంద్రుని చంపగల పుత్రుని కొఱకు దితి తపస్సు చేయుట

హతేషు తేషు పుత్రేషు దితిః పరమదుఃఖితా।
మారీచం కాశ్యపం రామ భర్తార మిద మబ్రవీత్॥ {1-46-1}
హతపుత్రాస్మి భగవం స్తవ పుత్రై ర్మహాబలైః।
శక్రహంతార మిచ్ఛామి పుత్రం దీర్ఘతపోర్జితమ్॥ {1-46-2}

❊ ఓ రఘురామా! యుద్ధంలో కుమారులు మరణించగా ఎంతగానో దుఃఖించిన దితి దీనురాలై విలపిస్తూ తన భర్తయైన కాశ్యపుని సమీపించి "ఓ ప్రాణనాథా! నా బిడ్డలను దేవతలు చంపివేసినారు. కాబట్టి నా పుత్రుల వధకు కారణమైన దేవేంద్రుని వధింపగల కుమారుని పొందవలెనని నేను కోరుకొనుచున్నాను" అని వివరించి "నా పుత్రశోకాన్ని తొలగిస్తూ ఇంద్రుని వధించగల కుమారుని నాకు అనుగ్రహింపుము" అని వేడుకొనసాగినది. కాశ్యపుడు తన పత్నియైన దితిని ఓదార్చి వీర్యవంతుడైన పుత్రుని ప్రసాదించదలచినాడు.

మ. కలనన్ బుత్రులు కూలగా, పరమదుఃఖంబందుచున్ దీనతన్
విలపించెన్ దితి, భర్త కాశ్యపునికిన్ విన్పించె వృత్తాంతమున్,
బలవైరిన్ వధియింపఁ జాలెడి సుతున్ వాంఛింతు, మచ్ఛోకమున్
దొలగంజేయు మనంగ, నాతడు సుపుత్రున్‌గూర్పగా నిట్లనెన్. 380

ఏవం భవతు భద్రం తే శుచి ర్భవ తపోధనే।
జనయిష్యసి పుత్రం త్వం శక్రహంతార మాహవే॥ {1.46.5}
గతే తస్మిన్ నరశ్రేష్ఠ దితిః పరమహర్షితా।
కుశప్లవన మాసాద్య తపస్తేపే సుదారుణమ్॥ {1.46.8}

❊ ఓ రఘురామా! కాశ్యపుడు తన భార్యయైన దితిని చూచి "ఓ ధర్మపత్నీ! నీవు వేయి సంవత్సరాలపాటు తపస్సు చేయి. దీక్షాసమయంలో నీవు శుచిగా ప్రవర్తించాలి. శుచిగా ఉంటేనే నీ కోరిక నెఱవేఱుతుంది. శుచిగా ఉంటేనే సూర్యుని వంటి తేజస్సు కలవాడు నీ శోకమును తొలగింపగలవాడు ఇంద్రుని

చంపగలవాడు అగు కుమారుడు జన్మిస్తాడు” అని చెప్పి ఆమెను స్పృశించి ఓదార్చి చింత దీర్చి తపస్సు చేసికొనేందుకు వెళ్లిపోయినాడు. సాధ్వీమణి యైన దితి నిశ్చింతగా కుశప్లవనము అనే ప్రదేశాన్ని చేరి తపోదీక్షను వహించింది.

మ. తపమున్ జేయుము వేయివర్షములు శుద్ధప్రీతచిత్తమ్ముతో
నెపుడున్, బుద్ధశుచిప్రవర్తనముతో నిష్టమ్ము సిద్ధించు, నీ
కపుడే శక్రునిఁ జంపఁ జాలు సుతు దూహాతీత వీర్యుండు నా
తపనుం బోలెడివాడు పుట్టును దితీ! త్వచ్ఛోకవిచ్ఛిత్తికై. 381

మ. సతితో నట్లని కాశ్యపుండు తన హస్తస్పర్శ నోదార్చి, యా
తత మోదమ్మును గూర్చి యా యమకుఁ, జింతన్ దీర్చి యేగంగ మౌ
ని తపశ్చర్యకు, సాధ్వియైన దితియున్ నిశ్చింతతోఁ జేరె సం
తత దీక్షాన్వితయై కుశప్లవనమన్ ధాత్రిం దపశ్చర్యకై. 382

గాత్రసంవాహనై శ్చైవ శ్రమాపనయనై స్తథా।
శక్ర స్సర్వేషు కాలేషు దితిం పరిచచార హ॥ {1.46.11}
తప శ్చరంత్యా వర్షాణి దశ వీర్యవతాం వర।
అవశిష్టాని భద్రం తే భ్రాతరం ద్రక్ష్యసే తతః॥ {1.46.14}

❈ ఓ రఘురామా! భర్తయైన కాశ్యపుని అనుగ్రహంతో దితి నిర్మలమైన మనస్సుతో కుశప్లవనంలో తపోదీక్షలో ఉండగా సహస్రాక్షుడు కపటబుద్ధితో వచ్చి దితిని సమీపించి “అమ్మా! నీవు నాకు తల్లితో సమానము కావున నీకు సేవ చేసెదను” అని దితికి అన్ని విధములైన సేవలను చేయసాగినాడు. అగ్నిని సిద్ధం చేసేవాడు. దర్భలు మొదలైన వస్తువులను తెచ్చి యిచ్చేవాడు. ప్రీతితో పాదసేవ చేసేవాడు. దితి తపస్సు చేయవలసిన వేయి సంవత్సరముల కాలము పూర్తియగుటకు పది సంవత్సరాలకు ముందు శక్రుని చూచి “ఓ కుమారా! ఇక ఒక దశాబ్దం గడిస్తే నీవు నీ సోదరుని చూడగలవు” అని తనకు జన్మించబోయే పుత్రుని గురించి తెలియజేసినది.

మ. అమలాత్మన్ దితి దీక్ష నుండగ, సహస్రాక్షుండు విచ్చేసి, యా
యమకున్ సేవలు చేయ సాగెఁ గపటవ్యాపార పారీణుడై
శ్రమతో నగ్ని కుశాది వస్తు తతులన్ సామగ్రిగాఁ దెచ్చి యి
చ్చు, మహత్ప్రీతిని పాదసంవహనమున్ స్తుత్యమ్ముగాఁ జేసెడిన్. 383

తే.గీ. వనిత తపియించు తఱి వేయి వత్సరములు
పూర్తి యగుటకు దశవర్షములకు ముందు
పలికె నీరీతి "ఇక దశాబ్దమ్ము గడువ
నీవు సోదరుఁ గాంతువు నిజము శక్ర!" 384

యాచితేన సురశ్రేష్ఠ తవ పిత్రా మహాత్మనా।
వరో వర్షసహస్రాంతే దత్తో మమ సుతం ప్రతి॥ {1.46.13}
తమహం త్వత్కృతే పుత్ర సమాధాస్యే జయోత్సుకమ్।
త్రైలోక్యవిజయం పుత్రం సహ భోక్ష్యసి విజ్వరః॥ {1.46.15}

❊ ఓ రఘురామా! దితి తన తపస్సు పూర్తి అయ్యేందుకు ముందు ఇంద్రునితో మాట్లాడుతూ "ఓ పాకశాసనా! నేను నీ తండ్రిని చేరి "ఓ ప్రాణనాథా! నాకు ఒక కుమారుని ప్రసాదించండి" అని ప్రార్థింపగా అందులకు అంగీకరించిన నీ తండ్రి నన్ను వేయి సంవత్సరములపాటు తపస్సు చేయమనినాడు. "అప్పుడు నీ కోరిక తీరి కుమారుడు జన్మిస్తాడు" అని నన్ను దీవించినాడు. కాబట్టి ఇక ఒక దశాబ్దకాలంలో మూడులోకాలను జయించగల కుమారుడు నాకు కలుగగలడు. నీతో కలిసి ఉండవలసినదిగా చెప్పి వాడిని నేను ఒప్పించగలను. మీరు ఇద్దఱూ కలిసి స్నేహంగా ఉంటూ అన్నిలోకాలను గొప్పగా పరిపాలించండి" అని తన మనసులోని మాటను తెలియజేసింది.

ఉ. కూరిమి నీ పితన్ సుతునిఁ గోరి భజించితిఁ బాకశాసనా!
"తీరును నీదు కోరిక, నుతింగను రీతుల వేయి వర్షముల్
ఘోర తపమ్ము సేయగను గొప్ప కుమారుడు కల్గు" నంచు నో
రార వచించె నాత, డిక హర్షము గల్గు సుతోదయమ్మగున్. 385

తే.గీ. మూడులోకాలను జయించు పుత్రుఁ గాంతు
వాని నొప్పింతు నీతోడ వరలునట్లు,
నీవు నాతడు సఖ్యతన్ నిఖిలలోక
ములను బాలింపనగుఁ బరిపూర్ణముగను. 386

తస్యా శ్శరీరవివరం వివేశ చ పురందరః।
గర్భం చ సప్తధా రామ బిభేద పరమాత్మవాన్॥ {1.46.18}
మా రుదో మా రుద శ్చేతి గర్భం శక్రోఽభ్యభాషత। {1.45.20}
న హన్తవ్యో న హన్తవ్య ఇత్యేవం దితి రబ్రవీత్। {1.46.21}

❋ ఓ రఘురామా! "నాకు కలుగనున్న కుమారునితో కలిసి అన్ని లోకాలను పాలించు" అని దితి ఇంద్రునికి చెప్పి మధ్యాహ్న సమయంలో శయ్యపై నిద్రించినది. కాళ్లు ఉంచవలసినచోట తలను, తల ఉంచవలసిన చోట కాళ్లను ఉంచి దితి నిద్రించుచుండగా గమనించిన ఇంద్రుడు అవకాశం కొఱకు ఎదురుచూస్తూ "ఈమె శయ్యపై అశుచిగా పరుండినది" అని నిశ్చయించి వెంటనే ఆమె దేహములో ప్రవేశించి గర్భమును తన వజ్రంతో ఏడు ముక్కలుగా ఖండించినాడు. బాధను భరించలేక పిండము ఏడ్చుచుండగా ఇంద్రుడు "ఏడువవద్దు" అని అంటూ ఉండగా నిద్రనుండి మేల్కొనిన దితి ఇంద్రుని దౌష్ట్యమును తెలిసికొని "ఓ పాకశాసనుడా! పిండమును చంపవద్దు. ప్రాణములతో విడిచిపెట్టు" అని వేడుకొనసాగినది.

మ. అనుచున్ నిద్రను బొందె నా ముదిత మధ్యాహ్నమ్మునన్, నిల్పెగా
దన పాదమ్ముల మస్తకమ్ము నట వ్యత్యస్తమ్ముగాఁ, బాకశా
సను డంతన్ దితి జూచినా డశుచిగా శయ్యాతలమ్మందు, మా
నిని దేహమ్మునఁ దూఱి గర్భమును ఖండించెన్ వెసన్ సప్తధా. 387

ఉ. వాడిగ నున్న వజ్రమున వాసవు డా దితి గర్భమున్ మదిన్
గీడుగ నెంచి చీల్చు తఱిఁ, గేకలు వేయుచు బాధతోడఁ దా
నేడువసాగె గర్భ, మపు డింద్రుడు "మా రుద" యంచు పల్కగా,
వీడుము చంపవద్దనుచు వేడిన దా దితి పాకశాసనున్. 388

అశుచి ర్దేవి సుప్తాసి పాదయోః కృతమూర్ధజా॥ {1.46.22}
అభిందం సప్తధా దేవి తన్మే త్వం క్షంతు మర్హసి॥ {1.46.23}
వాతస్కంధా ఇమే సప్త చరంతు దివి పుత్రక।
మారుతా ఇతి విఖ్యాతా దివ్యరూపా మమాత్మజాః॥ {1.47.4}

❋ ఓ రఘురామా! తన గర్భములోని పిండము యొక్క ఏడుపు విని నిద్రనుండి మేల్కొనిన దితి ఆ పిండమును చంపవద్దని శక్రుని ప్రార్థించింది. అప్పుడు ఇంద్రుడు పిండమును చంపడం మాని దితిని చూచి "అమ్మా! నీవు అశుచిగా పరుండినందున నేను అవకాశం లభించింది కదా అని అనుకొన్నాను. నన్ను చంపేందు కొఱకు నీకు కుమారుడుగా పుట్టబోయే బిడ్డను పిండంగా ఉన్నప్పుడే చంపదలచి నీలో ప్రవేశించినాను. వజ్రాయుధంతో పిండమును ఏడు ముక్కలుగా ఖండించినాను. కరుణాస్వాంతవైన నీవు నన్ను క్షమించు" అని చేతులు జోడించినాడు. దైత్యమాతయైన దితి ఆ ఆఖండలుని క్షమించి "ఓ వాసవుడా! అశుచిగా నిద్రించడం నేను చేసిన తప్పు. ఏడుగా ఖండింపబడిన పిండములోనున్న నా ఏడుమంది కుమారులు 'మా రుద' అని నీవు అనినందున మరుత్తులు అని పిలువబడుతూ దేవతలతో సమానులై స్వర్గంలో ఉంటూ వాతస్కంధులై ఏడు స్థానములను పాలింతురు గాక! ఇందులకు నీవు సమ్మతించుము" అని కోరుకొనెను.

మ. తెలివిన్ బొందిన దైత్యమాత యటు ప్రార్థింపంగ శక్రుం డిటుల్
పలికెన్ "నీ వశుచిత్వమున్ గనుటచేఁ ద్వద్గర్భపిండమ్ము నా
కులతన్ ముక్కలు సేసినాడ, జననీ! కూర్మిన్ ననున్ గాంచి ని
శ్చలబుద్ధిన్ క్షమియింపుమమ్మ! కరుణాస్వాంతా! నమస్కారముల్" 389

మ. అని శక్రుండన దైత్యమాత యనె నా యాఖండలున్ గాంచి వే
దనతో "వాసవ! తప్పు నాది, యశుచిత్వప్రాప్తి సుప్తిప్రియన్,
దనయుల్ వీరలు నాకు, నేడుగురు వాతస్కంధులై నాక మం
దున వర్తింతురు గాక! మారుతు లనన్ దుష్టిన్ సురోత్తంసులై" 390

47. సప్త మరుత్తుల వృత్తాంతము

బ్రహ్మలోకం చరత్వేక ఇంద్రలోకం తథాపరః।
దివి వాయు రితి ఖ్యాత స్తృతీయోఽపి మహాయశాః॥ {1.47.5}
చత్వారస్తు సురశ్రేష్ఠ దిశో వై తవ శాసనాత్।
సంచరిష్యంతు భద్రం తే దేవభూతా మమాత్మజాః॥ {1.47.6}
త్వత్కృతే నైవ నామ్నా చ మారుతా ఇతి విశ్రుతాః। {1.47.7}

❊ ఓ రఘురామా! దితి తన ఏడుగురు కుమారులను దేవతలతో సమానులుగా ఉండుటకు సమ్మతించవలసినదిగా ఇంద్రుని కోరినది. "ఒకడు బ్రహ్మలోకమున, మరొకడు ఇంద్రలోకమున ఉండెదరు. మరొకడు వాయువు అను పేర స్వర్గలోకములో ఉండగలడు. మిగిలిన నలుగురు నాలుగు దిక్కులయందు దేవతలై విరాజిల్లుచూ నీ శాసనములను అమలుజరుపుచూ ఉండగలరు. నీవు వీరితో 'మా రుద' అని అనినందున ఈ ఏడుగురు సప్తమరుత్తులు అని పేరు పొందెదరు గాక" అని దితి పలుకగా ఇంద్రుడు చేతులు జోడించి "అమ్మా! నీ కుమారులు నీ మాట ననుసరించి దేవతాంశములతో విరాజిల్లుచూ ఘనత వహించెదరు" అని తన సమ్మతిని తెలిపి స్వర్గమునకు వెళ్లినాడు. తల్లి యైన దితి కూడా స్వర్గమునకు వెళ్లినది. ఆ విధముగా దితి ఇంద్రుడు ఇరువురూ సంతోషమును పొందినారు.

ఉ. ఒక్కడు బ్రహ్మలోకమున నుండు, మరొక్కడు నింద్రలోక మం,
దొక్కడు వాయునామమున నుండును స్వర్గమునన్ బ్రసిద్ధుడై,
తక్కిన నల్వురున్ దిశలఁ దావక శాసనబద్ధ బుద్ధులై
చక్కగ నీదు పిల్పుననె సప్తమరుత్తులుగా వసింపరే" 391

మ. అని వాక్రుచ్చు దితిన్ గణించి మఘవుం డా తల్లికిన్ మ్రొక్కి "నీ
వనినట్లే యగుగాక! నీ సుతులు దేవాంశన్ విరాజిల్లుచున్
ఘనతన్‌గాంతు" రటంచుఁ బల్కి, చనె నాకమ్మున్ గనన్, దల్లియున్
జనె స్వర్గమ్మునుఁ జేర, వాసవదితుల్ సంతుష్టులై రవ్విధిన్. 392

ఏష దేశః స కాకుత్స్థ మహేంద్రాధ్యుషితః పురా॥ {1.47.10}
దితిం యత్ర తపః సిద్ధా మేవం పరిచచార సః।
ఇక్ష్వాకోస్తు నరవ్యాఘ్ర పుత్రః పరమధార్మికః॥ {1.47.11}
అలంబుసాయా ముత్పన్నో విశాల ఇతి విశ్రుతః।
తేన చాసీ దిహ స్థానే విశాలేతి పురీ కృతా॥ {1.47.12}

❈ ఓ రఘురామా! దితి తపస్సు చేసినది ఈ ప్రదేశం లోనే. ఇంద్రుడు దితికి సేవచేసినది కూడా ఈ ప్రదేశంలోనే. నీవు కోరినట్లు ఈ ప్రదేశమునకు సంబంధించిన రాజుల చరిత్రను చెబుతున్నాను విను. పూర్వము ఇక్ష్వాకుడు అను మహారాజునకు అలంబుస అనెడి పత్నియందు విశాలుడు అనే కుమారుడు జన్మించినాడు. ఆ విశాలునిచే నిర్మింపబడినదే ఈ విశాలా నగరము.

తే.గీ. దితి తపముఁ జేసినట్టి ప్రదేశ మిదియె
మించి యా దితి నిచట సేవించె వజ్రి
నీవు కోరిన విషయమున్ నిశ్చయముగ
తెలుపుచుంటిని రాఘవా! తెలిసికొనుము. 393

తే.గీ. రామ! యిక్ష్వాకువునకు నలంబుసకును
పుత్రవరుడు విశాలుడు పుట్టినాడు
ప్రీతి నా విశాలు డిట నిర్మించినాడు
లక్షణమ్ముగ నీ విశాలాపురమ్ము. 394

విశాలస్య సుతో రామ హేమచంద్రో మహాబలః।
సుచంద్ర ఇతి విఖ్యాతో హేమచంద్రా దనంతరః॥ {1.47.13}
సుచంద్ర తనయో రామ ధూమ్రాశ్వ ఇతి విశ్రుతః।
ధూమ్రాశ్వతనయ శ్చాపి సృంజయ స్సమపద్యత॥ {1.47.14}
సృంజయస్య సుత శ్శ్రీమాన్ సహదేవః ప్రతాపవాన్। {1.47.15}

❊ ఓ రఘురామా! విశాలుని సుతుడు హేమచంద్రుడు. హేమచంద్రుని పుత్రుడు సుచంద్రుడు. సుచంద్రుని ఆత్మజుడు ధూమ్రాశ్వుడు. ధూమ్రాశ్వుని సూనుడు సృంజయుడు. సృంజయుని తనయుడు సహదేవుడు.

తే.గీ. రామ! యా విశాలు సుతుండు హేమచంద్రు
డతనికిన్ సుచంద్రుడు సుతు డతని పుత్రు
డనగ గల్గె ధూమ్రాశ్వు డతనికి సృంజ
యుండు నతనికిన్ సహదేవు డుద్భవించె. 395

కుశాశ్వః సహదేవస్య పుత్రః పరమధార్మికః॥ {1.47.15}
కుశాశ్వస్య మహాతేజాః సోమదత్తః ప్రతాపవాన్।
సోమదత్తస్య పుత్రస్తు కాకుత్స్థ ఇతి విశ్రుతః॥ {1.47.16}
తస్య పుత్రో మహాతేజా స్సంప్రత్యేష పురీ మిమామ్।
ఆవస త్యమరప్రఖ్య స్సుమతి ర్నామ దుర్జయః॥ {1.47.17}

❊ ఓ రఘురామా! సహదేవుని పుత్రుడు కుశాశ్వుడు. కుశాశ్వుని కుమారుడు సోమదత్తుడు. సోమదత్తుని సుతుడు కాకుత్స్థుడు. కాకుత్స్థుని తనయుడు సురసమానుడైన సుమతి.

తే.గీ. ధీరుడగు కుశాశ్వుడు సహదేవునకును
గలిగె, సోమదత్తుండు నాఁ గలిగె నతని,
కతని కెన్న కాకుత్స్థుడు సుతు, డతనికి
సుమతి యనువాడు జనియించె సురనిభుండు. 396

ఇక్ష్వాకోస్తు ప్రసాదేన సర్వే వైశాలికా నృపాః।
దీర్ఘాయుషో మహాత్మానో వీర్యవంత స్సుధార్మికాః॥ {1.47.18}

❊ ఓ రఘురామా! మీ వంశంలో పూర్వీకుడైన ఇక్ష్వాకు మహారాజు యొక్క అనుగ్రహం వలన, మహిమ వలన ఈ విశాలా నగరమును పాలించిన రాజులందఱూ నీతిమంతులుగా, ధీమంతులుగా, వీర్యవంతులుగా, ధర్మాత్ములుగా, దీర్ఘాయుష్మంతులుగా విరాజిల్లినారు.

తే.గీ. జగతి నిక్ష్వాకురాజ ప్రసాద మహిమ
నీతియుతులు వైశాలికా నృపతు లెల్ల
ధీయుతులు వీర్యయుతులు దీర్ఘాయువులుగ
ధర్మపరులుగ నేలి రీ ధరణి రామ! 397

ఇహాద్య రజనీం రామ సుఖం వత్స్యామహే వయమ్।
శ్వః ప్రభాతే నరశ్రేష్ఠ జనకం ద్రష్టు మర్హసి॥ {1.47.19}
సుమతిస్తు మహాతేజా విశ్వామిత్ర ముపాగతమ్।
శ్రుత్వా నరవరశ్రేష్ఠః ప్రత్యుద్గచ్ఛ న్మహాయశాః॥ {1.47.20}

❋ "ఓ రఘురామా! మనము ఈరోజు రాత్రి ఇక్కడనే ఉండెదము. రేపు జనక మహారాజును చూడగలము" అని విశ్వామిత్రముని చెప్పుచుండగా బ్రహ్మర్షి రాకను గుఱించి తెలిసికొనిన ఆ విశాలా నగర రాజైన సుమతి కౌశికుని దర్శింపదలచి వారి వద్దకు చేరుకొన్నాడు.


తే.గీ. రాత్రి గడపెద మిచ్చట రామచంద్ర!
రేపు చూడ నొప్పు జనక భూపతినని
పలుకుచుండ గాధిజుడు, తత్ప్రాంత నృపతి
సుమతి మునిరాక నెఱుగుచుఁ జూడవచ్చె. 398

పూజాం చ పరమాం కృత్వా సోపాధ్యాయ స్సబాంధవః।
ప్రాంజలిః కుశలం పృష్ట్వా విశ్వామిత్ర మథాబ్రవీత్॥ {1.47.21}
పృష్ట్వా తు కుశలం తత్ర పరస్పరసమాగమే।
కథాంతే సుమతి ర్వాక్యం వ్యాజహార మహామునిమ్॥ {1.48.1}

❋ విశాలా నగర ప్రభువు సచ్చరిత్ర కలవాడు అగు సుమతి గురువులతో, బంధువులతో, మిత్రులతో కూడినవాడై మునీంద్రుడైన గాధిజుని చేరి నమస్కరించి పూజించి గౌరవించి ప్రశంసించి "అందఱూ కుశలమే కదా" అని

పలుకరించి అచ్చట అద్భుత గాత్రులైన రామలక్ష్మణులు కనిపించగా వారిని గుఱించి తెలిసికొనదలచినాడు. వారు ఎవరు అని మహర్షిని అడుగసాగినాడు.

ఉ. సచ్చరితుండునౌ సుమతి సద్గురుబంధుసుహృత్సమేతుడై
వచ్చి, మునీంద్రు గాధిజుని వందన పూజల గారవించుచున్,
మెచ్చుచు "నందఱున్ గుశలమే గద" యంచును బల్కరించి, తా
నచ్చట రామలక్ష్మణుల నద్భుతగాత్రులఁ గాంచి యిట్లనెన్. 399



48. అహల్యాశాప వృత్తాంతము

ఇమౌ కుమారౌ భద్రం తే దేవ తుల్య పరాక్రమౌ।
గజసింహగతీ వీరౌ శార్దూలవృషభోపమౌ॥ {1.48.2}
పద్మపత్రవిశాలాక్షౌ ఖడ్గతూణీ ధనుర్ధరౌ।
అశ్వినావివ రూపేణ సముపస్థితయౌవనౌ॥ {1.48.3}
యదృచ్ఛయైవ గాం ప్రాప్తౌ దేవలోకా దివామరౌ।
కథం పద్భ్యా మిహ ప్రాప్తౌ కిమర్థం కస్య వా మునే॥ {1.48.4}
భూషయంతౌ విమం దేశం చంద్ర సూర్యౌ వివాంబరమ్। {1.48.5}
వరాయుధధరౌ వీరౌ శ్రోతు మిచ్ఛామి తత్త్వతః॥ {1.48.6}

❋ విశ్వామిత్రుని చెంత ఉన్న రామలక్ష్మణులను గురించి తెలిసికొనదలచిన విశాలా నగర ప్రభువు అగు సుమతి "ఓ మహర్షీ! ఈ ఇద్దరు కుమారులు ధీరులుగా, వీరులుగా, దేవతలతో సమానమైన పరాక్రమము కలవారుగా, సింహగమనము కలవారుగా, శార్దూల వృషభములతో సమానమైన బలము కలవారుగా, పద్మపత్రముల వంటి విశాలమైన కన్నులతో ప్రకాశించువారుగా, ఖడ్గమును తూణీరమును ధనుస్సును ధరించినవారుగా, ధైర్యవంతులుగా, అశ్వినీదేవతలతో సమానమైన చక్కని రూపము కలవారుగా, యౌవనప్రాయులుగా, దేవశ్రేష్ఠులుగా, సూర్యచంద్రుల వలె వెలుగువారుగా, సాధుమూర్తులుగా, దివి నుండి భువికి దిగివచ్చిన దేవతలుగా విరాజిల్లుచున్నారు. ఇంత గొప్పవారైన వీరు పాదచారులుగా వనసీమలలో మిమ్ము అనుసరించి తిరుగుచుండుటకు కారణమేమి? ఈ ఇద్దరు ఎవరు? ముందుగా నాకు తెలియజేయవలసినదిగా కోరుచున్నాను" అని ప్రశ్నించినాడు.

సీ. ఈ కుమారులు ధీరు లెన్నగా దేవతు
ల్యపరాక్రములును సింహగతు లరయ
వీరలు శార్దూలవృషభసములు పద్మ
పత్ర విశాలాక్షిభాసితులును

ఖడ్గతూణీరాల ఘన ధనూరత్నాల
ధరియించియున్నారు ధైర్యగుణులు
నశ్వినీ దేవతలన రూపవంతులు
యౌవనప్రాయులు దేవవరులు
తే.గీ. చంద్రసూర్యులవలె వెల్గు సాధుమతులు
నెంచి దివినుండి భువి కేగుదెంచినట్లు
మెలగుచున్నారు, పాదచారులుగ వనము
లందు నిటు లుండఁ గతమేమి? ముందు చెపుమ. 400

పరస్పరస్య సదృశౌ ప్రమాణేంగితచేష్టితైః॥ {1.48.5}
కిమర్థం చ నర శ్రేష్ఠౌ సంప్రాప్తౌ దుర్గమే పథి।
వరాయుధధరౌ వీరౌ శ్రోతు మిచ్ఛామి తత్త్వతః॥ {1.48.6}

❊ విశాలా నగర ప్రభువైన సుమతి విశ్వామిత్ర మునిని చూచి "ఓ సంయమీంద్రా! మీ చెంత ఉన్న ఈ ఇరువురు కుమారులు ఉత్తమ గుణములు కలవారై ఒకరికొకరు సాటి అన్నట్లుగా ఉన్నారు. వీరు ఎవరి పుత్రులో తెలిసికొనవలెనని నాకు ఎంతో కుతూహలంగా ఉన్నది. దయచేసి తెలియజేయండి" అని వేడుకొన్నాడు.

తే.గీ. ఉత్తమ గుణాల నొప్పుచు నొకరికొకరు
సాటి యన నున్న వీరలు సంయమీంద్ర!
ఎవరి పుత్రులో తెలియంగ నెఱుకపరచు
మనుచు వేడె సుమతి కుతూహలముతోడ. 401

తస్య తద్వచనం శ్రుత్వా యథావృత్తం న్యవేదయత్।
సిద్ధాశ్రమనివాసం చ రాక్షసానాం వధం తథా॥ {1.48.7}

❊ విశాలా నగరమును పాలించే సుమతి రామలక్ష్మణులను గుఱించి అడుగగా మునివంద్యుడైన విశ్వామిత్ర మహర్షి రాజును చూచి "ఓ సుమతిప్రభూ!

వీరిద్దఱు దశరథమహారాజుయొక్క కుమారులు. వీరు యజ్ఞరక్షణ గావించి నాకు శుభమును చేకూర్చినారు. మిథిలా నగరమును దర్శింపదలచి నన్ను అనుసరించి వచ్చినారు" అని రామలక్ష్మణులు నిర్వహించిన అద్భుతమైన కార్యములను ఎంతో ప్రీతితో విశదీకరించినాడు.

చం. అని యడుగంగ నా సుమతి కా మునివంద్యుడు మోద మొప్ప ని
ట్లనె "సుమతిప్రభూ! దశరథాధిపు పుత్రులు వీరు, యజ్ఞ ర
క్షణ మొనరించినారు, శుభకాములు, నా వెనువెంట వచ్చినా"
రనుచుఁ దదీయ కార్యముల నద్భుతరీతి వచించెఁ బ్రీతిమై. 402

విశ్వామిత్ర వచః శ్రుత్వా రాజా పరమవిస్మితః।
అతిథీ పరమౌ ప్రాప్తౌ పుత్రౌ దశరథస్య తౌ॥ {1.48.8}
పూజయామాస విధివత్ సత్కారార్హౌ మహాబలౌ।
తతః పరమసత్కారం సుమతేః ప్రాప్య రాఘవౌ॥ {1.48.9}
ఉష్య తత్ర నిశామేకాం జగ్మతుః మిథిలాం తతః। {1.48.10}

❈ రామలక్ష్మణుల అద్భుతకార్యములను గుఱించి విశ్వామిత్ర మహర్షి వివరింపగా ఆలకించిన సుమతిప్రభువు పరమాశ్చర్యమును పొంది తామరరేకులవంటి అందమైన కన్నులు గలవారు తేజోమూర్తులు రాజకుమారులు అగు ఆ రఘువీరులను తగినవిధంగా పూజించి తన రాజమందిరమునకు వెళ్లిపోగా అందఱూ ఆ రాత్రి అచ్చటనే హాయిగా నిద్రించినారు.

మ. పరమాశ్చర్యము నందుచున్ సుమతి విశ్వామిత్రు వాక్యాల నా
దర భావమ్మున నాలకించి, నృపులన్ దద్రాఘవశ్రేష్ఠులన్
సరసీజాక్షుల రామలక్ష్మణుల భాస్వన్మూర్తులన్ గొల్చి స
త్వర మేగన్, నిదురించినా రచటనే వారందఱున్ హాయిగా. 403

ఉష్య తత్ర నిశా మేకాం జగ్మతు ర్మిథిలాం తతః।
తాం దృష్ట్వా మునయః సర్వే జనకస్య పురీం శుభామ్॥ {1.48.10}
సాధు సాధ్వితి శంసంతో మిథిలాం సమపూజయన్। {1.48.11}

❊ ఇనకులతిలకులైన ఆ రామలక్ష్మణులు, విశ్వామిత్ర మహర్షి, ఇతర మునులు విశాలా నగరమున ఒక రాత్రి నిద్రించి ఉదయముననే లేచి సంధ్యావందనాది కార్యక్రమములను పూర్తిచేసికొని బయలుదేఱి మిథిలాపురమును చేరుకొన్నారు. ఆ మిథిలా నగర వైభవమును తిలకించి పులకించి మనసులో ఎంతగానో పొంగిపోయినారు.

తే.గీ. సుప్రభాతమ్మునన్ లేచి, శుచిగ వార్చి,
యినకులజులు విశ్వామిత్రుడును మునులును
జనకు మిథిలాపురినిఁ గూర్చి సాగినారు
పురముఁ దిలకించి పులకించి పొంగినారు. 404

మిథిలోపవనే తత్ర ఆశ్రమం దృశ్య రాఘవః॥ {1.48.11}
పురాణం నిర్జనం రమ్యం పప్రచ్ఛ ముని పుంగవమ్।
ఇద మాశ్రమ సంకాశం కిన్విదం మునివర్జితమ్॥ {1.48.12}
శ్రోతు మిచ్ఛామి భగవన్ కస్యాయం పూర్వ ఆశ్రమః। {1.48.13}

❊ మిథిలా నగర సమీపంలో రఘురాముడు ఒక ఆశ్రమాన్ని చూచినాడు. ఆ ఆశ్రమం రమణీయమైనదిగాను, పురాతనమైనదిగాను, జనసంచారం లేనిదిగాను కనిపించింది. దశరథరాముడు మంగళతీర్థపాదుడైన విశ్వామిత్ర మహర్షిని చూచి "ఓ గురుదేవా! ఈ ఆశ్రమము యొక్క చరిత్రను తెలియజేయండి" అని ప్రార్థించినాడు.

తే.గీ. కనియె రాముడు మిథిలోపవనము నందు
రమ్యము పురాతనమ్ము నిర్జనము నైన
యాశ్రమ మ్మొక్క డద్దాని యాటపట్టుఁ
గూర్చి యడిగె విశ్వామిత్ర గురువరేణ్యు 405

గౌతమస్య నరశ్రేష్ఠ పూర్వ మాసీ న్మహాత్మనః॥ {1.48.15}
ఆశ్రమో దివ్యసంకాశః సురై రపి సుపూజితః।
స చేహ తప ఆతిష్ఠ దహల్యాసహితః పురా॥ {1.48.16}
వర్షపూగా ననేకాంశ్చ రాజపుత్ర మహాయశః। {1.48.17}

❈ మిథిలానగర సమీపంలో పురాతనమైన ఒక ఆశ్రమాన్ని చూచిన రఘురాముడు ఆ ఆశ్రమాన్ని గుఱించి తెలుపవలసినదిగా విశ్వామిత్రుని అడుగగా ఆ మహర్షి "ఓ ఇనకులనాథా! ఈ ఆశ్రమాన్ని గుఱించి చెబుతున్నాను విను. ఇది గౌతమ మహర్షి ఆశ్రమము. నిత్యమూ యజ్ఞములను చేస్తూ పరమపావనుడుగా విరాజిల్లే గౌతమ మహర్షి తన పత్నియైన అహల్యతో కూడి ఈ ఆశ్రమంలో చాలాకాలం నివసించినాడు. అనేక సంవత్సరాలపాటు ఈ ప్రదేశంలో తపస్సు చేసి అందఱిచే పూజింపబడినాడు" అని విశ్వామిత్రముని అయోధ్యారామునికి గౌతమాశ్రమమును గుఱించి వివరించసాగినాడు.

చం. అని యడుగంగఁ బ్రీతి వినుమంచును గాధిజు డిట్లు వల్కె "నో
యినకులనాథ! గౌతమ మునీంద్రుని యాశ్రమ మిద్ది, హోతృపా
వనుడగు గౌతముండు తన పత్ని నహల్యను గూడి యిచ్చటన్
మనియె, ననేక వర్షములు మాన్యతపఃప్రియవర్తనమ్మునన్. 406

తస్యాంతరం విదిత్వా తు సహస్రాక్ష శ్శచీపతిః॥ {1.48.17}
మునివేషధరోఽహల్యా మిదం వచన మబ్రవీత్। {1.48.18}
సంగమం త్వహ మిచ్ఛామి త్వయా సహ సుమధ్యమే। {1.48.19}

❈ ఓ రఘురామా! ఒకనాడు గౌతమముని ఇంటియందు లేని సమయం చూచి, సహస్రాక్షుడైన ఇంద్రుడు గౌతమమహర్షి వేషాన్ని ధరించి, గౌతమపత్నియైన అహల్యను సమీపించి "ఓ సుమధ్యమా! అహల్యా! నేను నీ సంగమం కోరుతున్నాను" అని పలికినాడు.

తే.గీ. గౌతముడు గేహమున లేని కాలముఁ గని
యా సహస్రాక్షు డేతెంచె నా ముని వలె,

"నాలసింపకు మో సుమధ్యమ! యహల్య!
యభిలషింతు నీ సంగమ" మ్మనుచుఁ బలికె. 407

మునివేషం సహస్రాక్షం విజ్ఞాయ రఘునందన॥ {1-48-19}
మతిం చకార దుర్మేధా దేవ రాజ కుతూహలాత్।
అథాఽబ్రవీత్ సురశ్రేష్ఠం కృతార్థేనాంతరాత్మనా॥ {1-48-20}
కృతార్థాఽస్మి సురశ్రేష్ఠ గచ్ఛ శీఘ్ర మితః ప్రభో। {1-48-21}

❊ ఆ మాటలను వినిన అహల్య సహస్రాక్షుడే తన నాథుడగు గౌతమముని వేషమున వచ్చినాడు అని ఎఱిగి అతని ప్రేమను పొందగోరి కృతార్థురాలై "ఓ సుత్రామా! త్వరగా వెళ్లిపొమ్ము" అని పలికెను.

శా. ఆ మాటల్ విని యా యహల్యయె "సహస్రాక్షుండు విచ్చేసినా
డీ మౌనీంద్రుని వేష మొంది" యని, "నే నీ దేవరాజోత్తమ
ప్రేమన్ బొందెద" నంచు నెంచి మది, దుర్మేధన్ సుఖమ్మంది, సు
త్రామా! సత్వర మేగు మంచనె కృతార్థత్వమ్ముఁ దా నొందుచున్. 408

ఆత్మానం మాం చ దేవేశ సర్వదా రక్ష మానద॥ {1.48.21}
ఏవం సంగమ్య తు తదా నిశ్చక్రా మోటజా త్తతః।
స సంభ్రమాత్ త్వరన్ రామ శంకితో గౌతమం ప్రతి॥ {1.48.23}

❊ ఓ రఘురామా! అహల్య శక్రుని చూచి "ఓ దేవరాజా! నాకు నీవే రక్షకుడవు. అట్లే నీకు కూడా నీవే రక్షకుడవు సుమా" అని పలుకగా ఇంద్రుడు సంతోషించి అచ్చటనుండి వెళ్లుటకు సిద్ధమై "ఇప్పుడు గౌతమ మహర్షి వచ్చునేమో" అని సందేహపడినాడు.

ఉ. "ఎన్నగ నాకు రక్షకుడ వీవె పురందర! యట్లె నీకునున్
సన్నుతమూర్తి! నీవె" యని నాతి వచింప నహల్యఁ జూచి "యో
యన్నులమిన్న! తుష్టి నిట నందితి" నంచు బిడౌజు డేగుచున్
దిన్నన గౌతముం దరుగుదెంచునొ యేమొ యటంచు భీతిలెన్. 409

గౌతమం సందదర్శాథ ప్రవిశంతం మహామునిమ్।
దేవదానవదుర్ధర్షం తపోబలసమన్వితమ్॥ {1.48.24}
తీర్థోదక పరిక్లిన్నం దీప్యమాన మివానలమ్।
గృహీతసమిధం తత్ర సకుశం మునిపుంగవమ్॥ {1.48.25}
దృష్ట్వా సురపతి స్త్రస్తో విషణ్ణవదనోఽభవత్। {1.48.26}

❊ ఓ రఘురామా! ఇంద్రుడు తిరిగి వెళ్లదలచినవాడై, గౌతమముని ఇంటికి రాగలడేమో అని భయపడుతూ ఉండగా, దేవదానవులకు కూడా అజేయుడు, ధీమంతుడు, తపోబల సంపన్నుడు, పావనుడు, లోకోత్తరుడు అగు గౌతమ మహర్షి స్నానమును జపమును పూర్తి చేసికొని సమిథలను దర్భలను చేత బట్టుకొని తన ఇంటికి వచ్చినాడు. ఆ మునిని చూచిన శక్రుని మనసులో భయం రెట్టింపయ్యింది. వక్రమార్గుడైన ఆ దేవరాజు దోషిగా చిక్కినాడు.

ఉ. అత్తరి దేవదానవుల కైన నజయ్యుడు గౌతముండు ధీ
సత్తముడున్, దపోబలుడు, స్నానజపాదులఁ బావనుండు, లో
కోత్తరుడున్ సమిత్కుశల నొప్పుచు నింటికి నేగుదెంచగాఁ
జిత్తము సంభ్రమింప నటఁ జిక్కెను శక్రుడు వక్రమార్గుడై. 410

అథ దృష్ట్వా సహస్రాక్షం మునివేషధరం మునిః॥ {1.48.26}
దుర్వృత్తం వృత్తసంపన్నో రోషా ద్వచన మబ్రవీత్।
మమ రూపం సమాస్థాయ కృతవా నసి దుర్మతే॥ {1.48.27}
అకర్తవ్య మిదం తస్మాత్ విఫల స్త్వం భవిష్యసి।
గౌతమే నైవ ముక్తస్య సరోషేణ మహాత్మనా॥ {1.48.28}
పేతతు ర్వృషణౌ భూమౌ సహస్రాక్షస్య తత్క్షణాత్। {1.48.29}

❊ ఓ రఘురామా! వేదవేత్త యైన గౌతమ మహర్షి తనవేషమును ధరించి వచ్చినవాడు, ధర్మభంగమునకు పాల్పడినవాడు, ఖలుడు అగు ఇంద్రుని దుష్టశీలమును గుఱించి తలపోసినవాడై "ఓ శక్రుడా! దురితాత్ముడవు దేవనేతవు అగు నీవు విఫలుడ వగుదువు గాక!" అని శపించినాడు. దేవేంద్రుని సంతోషము తొలగిపోగా తత్క్షణమే అతని వృషణములు నేలపై రాలిపడినవి.

ఉ. వేదవిదుండు మౌని తన వేషముఁ దాల్చినవాని, ధర్మవి
చ్ఛేదకుఁ గాంచి, వాని ఖలశీలము నెంచుచు, "శక్ర! దేవనే
తా! దురితాత్ముఁడా! విఫలతన్ గను" మంచు శపింప, వీడ స
మ్మోదము, గోత్రభిద్వృషణముల్ వెస రాలి పడెన్ ధరిత్రిపై. 411

గౌతమే నైవ ముక్తస్య సరోషేణ మహాత్మనా॥ {1.48.28}
తథా శప్త్వా స వై శక్ర మహల్యా మపి శప్తవాన్॥ {1.48.29}
ఇహ వర్షసహస్రాణి బహూని త్వం నివత్స్యసి।
వాయుభక్షా నిరాహారా తప్యంతీ భస్మశాయినీ॥ {1.48.30}
అదృశ్యా సర్వభూతానా మాశ్రమేఽస్మి న్నివత్స్యసి। {1.48.31}

❃ ఓ రఘురామా! గౌతమ మహర్షి ఆవిధంగా సురపతియైన ఇంద్రునికి శాపాన్నిచ్చి ఆ తరువాత తన భార్యను చూచి "ఓ అహల్యా! నీవు అదృశ్యరూపంతో వేలకొలది సంవత్సరాలపాటు ఇచ్చట బూడిదపై పరుండినదానవై, నిరాహారవై, వాయువును భుజించుదానవై, దీనురాలివై పడియుండుము" అని శపించెను.

చం. సురపతి కట్లు శాపమిడుచున్ ఘనరోషకషాయితాక్షుడై
వరముని గౌతముం డిటులు వల్కె నహల్యనుఁ జూచి "నీవు సు
స్థిరముగ వేలయేండ్లు కడు దీనగ బూదిఁ బరుండి యిచ్చటన్
వరలు మదృశ్యరూపమున వాయువునే భుజియించుదానవై". 412

యదా చైత ద్వనం ఘోరం రామో దశరథాత్మజః॥ {1.48.31}
ఆగమిష్యతి దుర్ధర్ష స్తదా పూతా భవిష్యసి। {1.48.32}

❃ ఓ రఘురామా! గౌతమ మహర్షి తన భార్యను చూచి "ఓ అహల్యా! దశరథ మహారాజుయొక్క కుమారుడగు శ్రీ రాముడు ఇచ్చటకు తరలి రాగలడు. ఈ ఆశ్రమంలో నిన్ను దయతో చూడగలడు. అప్పుడు నీ మోహపాశములు


తొలగిపోగలవు. ఆ శ్రీరాముని సేవించుటచేత నీవు పవిత్రతను పొందగలవు" అని శాపవిమోచనమును తెలియజేసినాడు.

తే.గీ. దాశరథి రాము డిచటకు తరలివచ్చుఁ,
దలచి యాశ్రమమున నిన్ను దయను జూచు,
నపుడు నీ మోహపాపమ్ము లంతరించు,
నతని సేవఁ బవిత్రత నందవచ్చు. 413

తస్యాతిథ్యేన దుర్వృత్తే లోభమోహవివర్జితా॥ {1.48.32}
మత్సకాశే ముదా యుక్తా స్వం వపు ర్ధారయిష్యసి।
ఏవ ముక్త్వా మహాతేజా గౌతమో దుష్టచారిణీమ్॥ {1.48.33}
ఇమ మాశ్రమ ముత్సృజ్య సిద్ధచారణసేవితే।
హిమవచ్ఛిఖరే పుణ్యే తపస్తేపే మహాతపాః॥ {1.48.34}

❊ ఓ రఘురామా! గౌతమ మహర్షి తన భార్యను చూచి "ఓ అహల్యా! పతితపావనుడైన శ్రీరాముని దర్శనంతో నీవు నిజరూపమును పొందగలవు. పవిత్రమైన మనస్సు కలదానివై నన్ను కలిసికొనగలవు. నేను నీకిచ్చిన శాపము తొలగిపోవు మార్గము ఇదియే" అని అహల్యకు శాపవిమోచనమును గురించి కూడా తెలియజేసి ఈ ఆశ్రమాన్ని వదలి హిమాద్రికి వెళ్ళి అచ్చట తపస్సు చేయనారంభించినాడు.

తే.గీ. అంతటన్ నీవు నిజరూప మందగలవు
పూత చిత్తమ్ముతో నన్నుఁ బొందఁగలవు
పాయ నా శాప మిద్ది యుపాయ మనుచు
నతడు తపమును జేయ హిమాద్రి కేగె. 414



49. అహల్యాశాప విమోచనము

అఫలస్తు తత శ్శక్రో దేవా నగ్నిపురోధసః।
అబ్రవీ త్త్రస్తవదనః సర్షిసంఘాన్ సచారణాన్॥ {1.49.1}
అఫలోఽస్మి కృత స్తేన క్రోధాత్ సా చ నిరాకృతా। {1.49.2}
శాపమోక్షేణ మహతా తపోఽస్యాపహృతం మయా॥ {1.49.3}
సురసాహ్యకరం సర్వే సఫలం కర్తు మర్హథ॥ {1.49.4}

❊ ఓ రఘురామా! వృషణములు రాలిపడగా అఫలుడైన ఇంద్రుడు ఎంతగానో బాధపడుతూ దేవతల దయతో తాను సఫలుడుగా మాఱగోరినవాడై సురసమూహమును చూచి "ఓ దేవతలారా! గౌతమ ముని తపఃఫలము విఫలము అగుటకొఱకు ప్రయత్నించి ఆ మహర్షి శాపమునకు గుఱియై నేను విఫలుడనైనాను. దయచేసి మీరు నన్ను సఫలునిగా చేయండి" అని ప్రార్థించినాడు.

చం. అఫలుడు వాసవుండు కడునార్తిని గుందుచు దైవసత్కృపన్
సఫలత నందఁగోరి, సురసంఘముతో ననె నిట్లు "గౌతమున్
విఫలతపస్వి జేయఁ జని వింతగ నాతని శాపమంది నే
విఫలుడనైతి మిమ్ములను వేడెద నన్ సఫలున్ బొనర్పుడీ" 415

శతక్రతో ర్వచః శ్రుత్వా దేవా స్సాగ్ని పురోగమాః।
పితృదేవా నుపేత్యాహు స్సహ సర్వై ర్మరుద్గణైః॥ {1.49.5}
అయం మేషః సవృషణ శ్శక్రో హ్యవృషణః కృతః।
మేషస్య వృషణౌ గృహ్య శక్రాయాశు ప్రయచ్ఛత॥ {1.49.6}
అగ్నే స్తు వచనం శ్రుత్వా పితృదేవా స్సమాగతాః।
ఉత్పాట్య మేషవృషణౌ సహస్రాక్షే న్యవేశయన్॥ {1.49.8}

❊ ఓ రఘురామా! ఇంద్రుడు ఆ విధంగా దేవతలను ప్రార్థింపగా దేవతలు పితృదేవతలను సమీపించి "మీకు సమర్పించబడు ఈ మేకపోతు వృషణములను శచీపతియైన ఇంద్రునికి ఇవ్వండి" అని ప్రార్థింపగా ఎంతో

ప్రీతితో వారు అట్లే అని అంగీకరించినారు. దేవతలు సంతోషపడగా అప్పటినుండి ఇంద్రుడు మేక వృషణములను కలిగియున్నాడు.

మ. అని శక్రుండన దేవతాళి పితృదేవాళిన్ సమీపించి "యి
మ్మున మీ కిచ్చిన మేక పోతు వృషణమ్ముల్ మా శచీజాని కిం"
దని ప్రార్థింపగఁ బ్రీతి నట్లె యని వారంగీకరింపంగ నిం
ద్రుని కబ్బెన్ వృషణమ్ము లా విధముగాఁ దుష్టిన్ సురల్ మెచ్చగా. 416

ఇంద్రస్తు మేషవృషణ స్తదాప్రభృతి రాఘవ।
గౌతమస్య ప్రభావేన తపసశ్చ మహాత్మనః॥ {1.49.10}
తదాగచ్ఛ మహాతేజ ఆశ్రమం పుణ్యకర్మణః।
తారయైనాం మహాభాగా మహల్యాం దేవరూపిణీమ్॥ {1.49.11}

❋ ఓ రఘురామా! ఆనాటినుండి దేవేంద్రుడు తాను మేకపోతు వృషణములతో మెలగుచున్నాడు. ఓ దశరథరామా! చూడు. ఇదియే గౌతమాశ్రమము. ఇక ఆ అహల్యను తరింపజేయుటకు ఈ ఆశ్రమంలోనికి ప్రవేశించు.

తే.గీ. అది మొదలుగాగ నా యింద్రు డమరవిభుడు
మేషవృషణమ్ములన్ దాల్చి మెసలినాడు;
గౌతమాశ్రమ మిది రామ! కనుము దీని
నా యహల్యను దరియింపఁ జేయఁ బూని. 417

విశ్వామిత్రవచః శ్రుత్వా రాఘవ స్సహ లక్ష్మణః।
విశ్వామిత్రం పురస్కృత్య తమాశ్రమ మథావిశత్॥ {1.49.12}
దదర్శ చ మహాభాగాం తపసా ద్యోతితప్రభామ్।
లోకైరపి సమాగమ్య దుర్నిరీక్ష్యాం సురాసురైః॥ {1.49.13}
సతుషారావృతాం సాభ్రాం పూర్ణచంద్రప్రభామివ।
మధ్యేఽంభసో దురాధర్షాం దీప్తాం సూర్యప్రభామివ॥ {1.49.14}

❀ ఓ రఘురామా! అహల్యను తరింపజేయుము" అని విశ్వామిత్ర మహర్షి పలుకగా శ్రీరాముడు అట్లే అని మహర్షితో లక్ష్మణునితో మునులతో కలిసి ఆ గౌతమాశ్రమంలో ప్రవేశించినాడు. అచ్చట తేజోరూపిణిగా, దుర్నిరీక్ష్యగా, దివ్యాభరణయుక్తగా, మంచుతోను మేఘములతోను కప్పబడిన చంద్రుని యొక్క ప్రభతో కూడియున్నదిగా, జలమధ్యమున ప్రకాశించు సూర్యబింబమా అన్నట్లు కనిపించే భామామణిగా విరాజిల్లే అహల్యను చూచినాడు.

మ. ముని యారీతి వచింప రాముడు ప్రభాపూర్ణుండు సౌమిత్రితోఁ
జని, తా నాశ్రమసీమ లోనఁ గనె భ్రాజద్రూపిణిన్, దుర్నిరీ
క్ష్యను, దివ్యాభరణన్, దుషారయుతి మేఘచ్ఛన్న చంద్రప్రభన్,
ఘనవారిస్థితసూర్యబింబమొ యనంగాఁ దోచు భామామణిన్. 418

సా హి గౌతమవాక్యేన దుర్నిరీక్ష్యా బభూవ హ॥ {1.49.15}
త్రయాణా మపి లోకానాం యావ ద్రామస్య దర్శనమ్।
శాపస్యాంత ముపాగమ్య తేషాం దర్శన మాగతా॥ {1.49.16}
రాఘవౌ తు తత స్తస్యాః పాదౌ జగృహతు స్తదా। {1.49.17}

❀ గౌతమ మహర్షి వాక్కుల ప్రభావం కారణంగా అంతవఱకు ఎవ్వరికీ కనిపించకుండా భస్మశాయినిగా పడియుండిన అహల్య శ్రీరాముని దర్శనము పుణ్యప్రదమని భావించింది. పతితపావనుడైన రాముని దర్శించింది. పాతకములు నశింపగా పరమపావనయై తన పూర్వరూపాన్ని పొంది రాముని ఎదుట నిలబడింది. తమకు సాక్షాత్కరించిన ఆ అహల్యామాత యొక్క పాదములకు రామలక్ష్మణులు భక్తిప్రపత్తులతో నమస్కరించినారు.

ఉ. గౌతమ మౌని వాక్యమునఁ గన్పడ కుండెడు నా యహల్య, సం
భూతము రామదర్శనము పుణ్యతమంబని రాముఁ జూచుచున్
బాతకముల్ నశింపఁ, నిజ పావన రూపము నంది నిల్చె, నా
మాతకు రామలక్ష్మణులు మాన్యతఁ మ్రొక్కిరి భక్తియుక్తులై. 419

పాద్యమర్ఘ్యం తథాతిథ్యం చకార సుసమాహితా।
ప్రతిజగ్రాహ కాకుత్స్థో విధి దృష్టేన కర్మణా॥ {1.49.18}

పుష్పవృష్టి ర్మహత్యాసీ ద్దేవదుందుభి నిస్వనైః।
గంధర్వాప్సరసాం చాపి మహానాసీత్ సమాగమః॥ {1.49.19}

❋ రామలక్ష్మణులు అహల్యాదేవి పాదములకు నమస్కరింపగా ఆ సాధ్వి వారికి భక్తిప్రపత్తులతో అర్ఘ్యమును పాద్యమును సమర్పించినది. ఆ శుభతరుణాన దేవతలు సంతోషంతో పుష్పవర్షాన్ని కురిపించినారు. అప్సరస స్త్రీలు ఆనందంగా నాట్యమాడినారు. దేవదుందుభులు గొప్పగా మ్రోగినవి.

ఉ. వారలు భక్తితోడ తన పాదము లంటి నమస్కరింపగా,
వారికి నర్ఘ్య పాద్యముల భక్తి నొసంగె నహల్య; యంతటన్
బేరిమిఁ బుష్పవృష్టిఁ గురిపించిరి దేవత, లప్సరోంగనల్
చేరుచు నాట్య మాడి, రటఁ జెల్వుగ మ్రోగెను దేవదుందుభుల్. 420

సాధు సాధ్వితి దేవాస్తా మహల్యాం సమపూజయన్।
తపోబలవిశుద్ధాంగీం గౌతమస్య వశానుగామ్॥ {1.49.20}
గౌతమోఽపి మహాతేజా అహల్యాసహిత స్సుఖీ।
రామం సంపూజ్య విధివ త్తపస్తేపే మహాతపాః॥ {1.49.21}
రామోఽపి పరమాం పూజాం గౌతమస్య మహామునేః।
సకాశా ద్విధివత్ ప్రాప్య జగామ మిథిలాం తతః॥ {1.49.22}

❋ పూలవాన కురిసింది. దేవతలు దివినుండి భువికి దిగివచ్చి అహల్యాదేవిని పూజించినారు. గౌతమ మహర్షి పావనురాలైన తన పత్ని దగ్గఱకు వచ్చినాడు. భక్తిభావంతో శ్రీరాముని సేవించినాడు. సంతోషంతో గౌతమముని సేవలనందుకొన్న రఘువర్యుడైన శ్రీరాముడు గురువర్యుడైన కౌశికుని మాటల ననుసరించి మిథిలానగరమును చేరినాడు.

ఉ. దేవత లెల్ల నేల కరుదెంచిరి పూజ నహల్యఁ గొల్వ, స
ద్భావనతోడ గౌతముడు పత్నినిఁ జేరగ వచ్చి రామునిన్
బావనరీతిఁ గొల్చె, రఘువర్యుడు సంతస మొప్ప మౌనిచే
సేవలనంది, యా మిథిలఁ జేరగ నేగెను గౌశికోక్తులన్. 421

50. శ్రీరామ లక్ష్మణులు విశ్వామిత్రునితో మిథిల చేరుట

తతః ప్రాగుత్తరాం గత్వా రామ స్సౌమిత్రిణా సహ।
విశ్వామిత్రం పురస్కృత్య యజ్ఞవాట ముపాగమత్॥ {1.50.1}
రామస్తు ముని శార్దూల మువాచ సహ లక్ష్మణః।
సాధ్వీ యజ్ఞ సమృద్ధి ర్హి జనకస్య మహాత్మనః॥ {1.50.2}
బహూనీహ సహస్రాణి నానాదేశనివాసినామ్।
బ్రాహ్మణానాం మహాభాగ వేదాధ్యయనశాలినామ్॥ {1.50.3}

❋ రఘురాముడు కౌశికునితో లక్ష్మణునితో మునులతో కలిసి ఈశాన్యదిశగావెళ్లి మిథిలానగరంలో జనకమహారాజు యొక్క యజ్ఞవాటిక దగ్గఱకు చేరుకొన్నాడు. యజ్ఞమునకు సంబంధించిన సామగ్రితో పరిపూర్ణంగా విరాజిల్లుతూ ఉండిన ఆ యజ్ఞవాటికలో వేదతత్త్వజ్ఞులను దర్శించినాడు. గొప్పగా కనిపించే విప్రవాటికలలో అనేక దేశములనుండి విచ్చేసిన విప్రుల సమూహములను చూచినాడు.

మ. చని యీశాన్యమునందుఁ గౌశికునితో సౌమిత్రితో యజ్ఞవా
టినిఁ జేరెన్ రఘురాము డా జనకువీటిన్, యజ్ఞ సామగ్రి చే
తను బూర్ణమ్ముగ వెల్గు సీమను, త్రయీతత్త్వజ్ఞులన్ గన్గొనెన్
ఘనతన్ రాజిలు ఋష్యవాటికల నానాదేశ విప్రావళిన్. 422

ఋషివాటాశ్చ దృశ్యన్తే శకటీశతసంకులాః।
దేశో విధీయతాం బ్రహ్మన్ యత్ర వత్స్యామహే వయమ్॥ {1.50.4}
రామస్య వచనం శ్రుత్వా విశ్వామిత్రో మహామునిః
నివేశ మకరో ద్దేశే వివిక్తే సలిలాయుతే॥ {1.50.5}

❋ మిథిలలో యజ్ఞవాటిక సమీప ప్రదేశము వందలకొలది శకటములతో జన సమూహంతో కనిపించడంతో, రఘురాముడు బ్రహ్మర్షి యగు విశ్వామిత్రుని చూచి "ఓ గురుదేవా! మీరు మేము అందఱమూ సుఖంగా ఉండేందుకు తగిన

ప్రదేశాన్ని చూపించండి" అని అడుగగా ఆ గాధిజుడు నివాసమునకు తగినట్టిది, నీరు సమృద్ధిగా ఉన్నట్టిది అగు ఒక ప్రదేశమును చూపించినాడు.

ఉ. "ఠీవిగ నీ ధరిత్రి శకటీశతసంకులమై కనంబడెన్
గావున మీరు మేమును సుఖమ్ముగ నుండగలట్టి ప్రాంతమున్
బావనమూర్తి! తెల్పు" మని పల్కగ రాముడు, తోయయుక్తమౌ
పావనసీమఁ జూపెను నివాసము సేయగ గాధిజుం డటన్. 423

విశ్వామిత్ర మనుప్రాప్తం శ్రుత్వా స నృపతి స్తదా।
శతానందం పురస్కృత్య పురోహిత మనిందితమ్॥ {1.50.6}
ప్రత్యుజ్జగామ సహసా వినయేన సమన్వితః।
ఋత్విజోఽపి మహాత్మాన స్త్వర్ఘ్య మాదాయ సత్వరమ్॥ {1.50.7}
విశ్వామిత్రాయ ధర్మేణ దదు ర్మంత్రపురస్కృతమ్। {1.50.8}

❋ లోకకల్యాణ కారకుడైన విశ్వామిత్ర మహర్షి మిథిలకు వచ్చియున్నాడని వినిన వెంటనే జనకమహారాజు బయలుదేరి మహర్షిని చేరి అర్ఘ్యము, పాద్యము మొదలగువాటిని సమర్పించి భక్తిప్రపత్తులతో ఆతిథ్యము నిచ్చినాడు. జనకునితో పాటు రాజపురోహితుడగు శతానందుడు కూడా వచ్చి మునివర్యుని చూచి పూజించి ఎంతో సంతోషంతో ప్రశాంతచిత్తుడైనాడు.

మ. జనకల్యాణకరుండు సద్గురుడు విశ్వామిత్రు డేతెంచినా
డని విన్నంతనె యేగుదెంచి జనకుం డాతిథ్య మందించె భ
క్తిని నర్ఘ్యాదులఁ, దత్పురోహితుడు నేతెంచెన్ శతానందు, డా
ఘనుడున్‌గౌశికుఁబూజ సేసి ముదమున్‌గాంచెన్‌ప్రశాంతాత్ముడై. 424

ప్రతిగృహ్య తు తాం పూజాం జనకస్య మహాత్మనః॥ {1.50.8}
పప్రచ్ఛ కుశలం రాజ్ఞో యజ్ఞస్య చ నిరామయమ్।
సర్వాంశ్చాపి మునీన్ పృష్ట్వా సోపాధ్యాయపురోధసః॥ {1.50.9}
యథా న్యాయం తతః సర్వై స్సమాగచ్ఛత్ ప్రహృష్టవత్। {1.50.10}

❀ జనక మహారాజు చేసిన అతిథిపూజలను ప్రీతితో స్వీకరించిన విశ్వామిత్ర మహర్షి "ఓ మిథిలా నగర భూపాలా! మీకు కుశలమే కదా! ఎటువంటి విఘ్నములు లేకుండా మీ యజ్ఞము నిర్వహింపబడుచున్నది కదా! ఇచ్చటి మునులందఱూ క్షేమంగా ఉన్నారు కదా! మీరు చేసిన సేవ నాకెంతో సంతోషమును కలిగించింది. మీ యజ్ఞవాటిక పరిపూర్ణంగా సకలసంపదలతో వర్ధిల్లుతూ ఉన్నది" అని కుశలప్రశ్నలు వేస్తూ రాజును ప్రశంసించినాడు.

చం. జనకనృపాలు పూజలను జక్కగ గైకొని గాధిసూను డి
ట్లనె "కుశలమ్మె? భూపవర! యజ్ఞము విఘ్నము లేక యున్నదే?
మునివరు లెల్ల క్షేమమె? ప్రమోదముఁ గూర్చెను మీదు సేవ, పా
వనమగు యజ్ఞవాటి యిట వర్ధిలుచున్నది పూర్ణసంపదన్." 425

ఆసనేషు యథాన్యాయ ముపవిష్టాన్ సమంతతః॥ {1.50.12}
దృష్ట్వా స నృపతి స్తత్ర విశ్వామిత్ర మథాబ్రవీత్।
అద్య యజ్ఞసమృద్ధి ర్మే సఫలా దైవతైః కృతా॥ {1.50.13}
అద్య యజ్ఞఫలం ప్రాప్తం భగవ ద్దర్శనా న్మయా। {1.50.14}

❀ విశ్వామిత్ర మహర్షి ఆవిధంగా కుశలప్రశ్నలు వేసి ఉచితాసనమున కూరుచుండగా, జనకమహారాజు కౌశికుని చూచి ప్రణామం చేస్తూ "ఓ పుణ్యాత్మా! మీ రాకచేత నా యజ్ఞము మహత్వమును పొందినది. మీ దర్శన భాగ్యంతో ఈ యజ్ఞము ఫలించినట్లైనది అని తన సంతోషాన్ని తెలియజేసినాడు.

చం. అని కుశలమ్ము తా నడిగి యాసనమందునఁ గూరుచుండగన్,
జనకుడు కౌశికున్ గని ప్రణామ మొనర్చుచుఁ బల్కె నిట్టు "లో
యనఘ! మదీయ యజ్ఞము మహత్వము నందెను మీదు రాకచే
తను, ఫలియించె నిప్పు డిదె తావక దర్శన భాగ్యసిద్ధిచే" 426

యజ్ఞోపసదనం బ్రహ్మన్ ప్రాప్తోఽసి మునిపుంగవ।
ద్వాదశాహం తు బ్రహ్మర్షే శేష మాహు ర్మనీషిణః॥ {1-50-15}
తతో భాగార్థినో దేవాన్ ద్రష్టు మర్హసి కౌశిక। {1-50-16}

❊ ఓ విశ్వామిత్ర మహర్షీ! మునులతోపాటు ఈ యజ్ఞవాటికకు విచ్చేసినావు. మాచే పూజలను అందుకొన్నావు. మీ రాకతో మీ కృపతో నేను ధన్యుడ నైనాను. ఇచ్చట పండ్రెండు రోజులపాటు ఉండండి. యజ్ఞభాగములను స్వీకరించేందుకు దేవతలు ఇచ్చటకు వస్తారు. మీరు వారిని చూచే అవకాశం కలుగుతుంది కదా. నా విన్నపాన్ని మన్నించి మీరు ఇచ్చటనే ఉండండి అని జనక మహారాజు విజ్ఞప్తి చేసినాడు.

చం. మునులను గూడి వచ్చితివి పూజల నందితి, వీవు సత్కృపన్
గనగను నేను ధన్యతను గాంచితి నుండుడు ద్వాదశాహముల్,
కొనగను యజ్ఞభాగములఁ గూరిమి దేవతలెల్ల వచ్చుటన్
గనుగొన నౌను, నా వినతిఁ గైకొనుమా ముని మాన్యభావనా! 427

ఇమౌ కుమారౌ భద్రం తే దేవతుల్యపరాక్రమౌ॥ {1.50.17}
గజసింహగతీ వీరౌ శార్దూలవృషభోపమౌ।
పద్మపత్రవిశాలాక్షౌ ఖడ్గతూణీధనుర్ధరౌ॥ {1.50.18}
అశ్వినా వివ రూపేణ సముపస్థితయౌవనౌ।
యదృచ్ఛయైవ గాం ప్రాప్తౌ దేవలోకా దివామరౌ॥ {1.50.19}
భూషయంతా విమం దేశం చంద్రసూర్యా వివాంబరమ్। {1.50.21}
కాకపక్షధరౌ వీరౌ శ్రోతు మిచ్ఛామి తత్త్వతః। {1.50.22}

❊ జనకమహారాజు విశ్వామిత్రునితో మాట్లాడుతూ ఆ గాధిజుని ప్రక్కన ఉన్న రామలక్ష్మణులను చూచి సంతోషపడుతూ "ఓ మహర్షీ! సుకుమారులుగా ఉన్న ఈ ఇద్దఱు ఎవరు? విశాలాక్షులుగా, మేటి ధనుర్ధారులుగా, సింహవిక్రములుగా, గజగమనము గలవారుగా, దేవసమానులుగా, అశ్వినీదేవతలవలె చక్కనైనరూపము కలవారుగా, యౌవనవంతులుగా, నింగి నుండి నేలకు దిగివచ్చిన దేవతలుగా, పాత్రులుగా, తేజోవంతులుగా, ఈ భూమిని రక్షింపగలవారుగా, సూర్యచంద్రులతో సమానమైన వారుగా, గొప్ప భుజబలము కలవారుగా, ఖడ్గతూణీర ధారులుగా, కాకపక్షధరులుగా విరాజిల్లుచున్న ఈ ఇరువురు ఏ మహాత్ముని కుమారులో తెలియజేయండి" అని ప్రశ్నించినాడు.

మ. అని గాధేయునితో వచించి జనకుం డానంద మొప్పారగాఁ
గనుచున్ రాముని లక్ష్మణున్ మరల వక్కాణించె నీరీతి "నో
యనఘా! యీ సుకుమారు లిద్దఱు విశాలాక్షుల్ ధనుర్ధారులున్
ఘన సింహమ్ముల బోలు విక్రమవరుల్ గంధేభశుంభద్గతుల్. 428

ఉ. దేవసమాను, లశ్వినుల తీరుగ రూపముఁ గన్న వార, లీ
యౌవనవంతు, లా త్రిదశు లాదట నేలకుఁ జేరిరంచు సం
భావనఁ జేతు వీరిగని, పాత్రులు తేజముతోడ నిద్ధరన్
గావగ నున్న సూర్యశశికల్పులు వీరలఁ గూర్చి దెల్పుడీ. 429

ఆ.వె. దోర్బలులును ఖడ్గతూణీరధారులు
కాకపక్షధరులు ఘనులు వీర
లే మహాత్ము సుతులొ యెఱుగంగఁ జెప్పుడీ"
యనగ, గాధిసూను డనియె నిటుల. 430

తస్య తద్వచనం శ్రుత్వా జనకస్య మహాత్మనః॥ {1.50.22}
న్యవేదయ న్మహాత్మానౌ పుత్రౌ దశరథస్య తౌ।
సిద్ధాశ్రమనివాసం చ రాక్షసానాం వధం తథా॥ {1.50.23}
తచ్చాగమన మవ్యగ్రం విశాలాయాశ్చ దర్శనమ్।
అహల్యాదర్శనం చైవ గౌతమేన సమాగమమ్॥ {1.50.24}

❊ జనకమహారాజు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా విశ్వామిత్రమహర్షి "ఓ మిథిలాధిపా! వీరు దశరథమహారాజు యొక్క కుమారులు. ధర్మవేత్తలు. పితృభక్తి పరాయణులు. పితృవాక్యపాలకులై నన్ను అనుసరించుచు నా ఆశ్రమములో యజ్ఞసంరక్షణ గావించినారు. నా యజ్ఞమునకు విఘ్నములను కలిగించిన రాక్షసులను వధించినారు. కీర్తిమంతులైన వీరు విశాలానగరమును దర్శించి ఆ తరువాత అహల్యాగౌతములను దర్శించినారు" అని రామలక్ష్మణులను గుఱించి వివరించసాగినాడు.

చం. దశరథరాజనందనులు ధర్మవిదుల్ పితృభక్తితోడ నా
వశమున నుండి యాశ్రమ నివాసులునై క్రతురక్ష సల్పుచున్
నిశి చరియించు రాక్షసుల నిర్గతజీవులఁ జేసినారు స
దృశులు విశాలఁ జేరుచు నహల్యను గౌతము గాంచి రంతటన్. 431

మహాధనుషి జిజ్ఞాసాం కర్తు మాగమనం తథా।
ఏత త్సర్వం మహాతేజా జనకాయ మహాత్మనే॥ {1.50.25}
నివేద్య విరరామాథ విశ్వామిత్రో మహామునిః। {1.50.26}
గౌతమస్య సుతో జ్యేష్ఠ స్తపసా ద్యోతిత ప్రభః। {1.51.2}
శతానందో మునిశ్రేష్ఠం విశ్వామిత్ర మథాబ్రవీత్॥ {1.51.3}

❋ విశ్వామిత్ర మహర్షి రామలక్ష్మణులను గురించి జనకునికి వివరిస్తూ “ఓ మహారాజా! వీరు ఆ గౌతమాశ్రమము నుండి బయలుదేరి ఇచ్చట జరుగుచున్న గొప్ప యజ్ఞమును చూడదలచినవారై ఈ మిథిలకు వచ్చినారు. ఈ విదేహ నగర విశేషములను మెచ్చినారు” అని పలుకగా రాజర్షి జనకుడు ఎంతగానో సంతోషించినాడు. అహల్యాగౌతముల కుమారుడగు శతానందుడు జనకుని ప్రక్కనే ఉన్నవాడై కౌశికునితో ఇలా మాట్లాడినాడు.

ఉ. “అచ్చటినుండి వీరలు మహత్తర యజ్ఞముఁ జూడఁ గోరుచున్
మెచ్చుచు వచ్చిరీ మిథిల మేటి పురం” బని సన్నుతింప నా
సచ్చరితుండు గాధిజుడు, సంతసమందెను రాజు, తోడుగా
వచ్చిన గౌతమాత్మజుడు పల్కెను కౌశికుఁ జూచి యిట్టులన్. 432



51. శ్రీరామునికి శతానందుడు విశ్వామిత్రుడు బ్రహ్మర్షి యైన విధమును విశదీకరించుట

అపి తే ముని శార్దూల మమ మాతా యశస్వినీ।
దర్శితా రాజపుత్రాయ తపో దీర్ఘ ముపాగతా॥ {1.51.4}
అపి రామే మహాతేజాః మమ మాతా యశస్వినీ।
వన్యై రుపాహరత్ పూజాం పూజార్హే సర్వదేహినామ్॥ {1.51.5}
అపి కౌశిక భద్రం తే గురుణా మమ సంగతా।
మమ మాతా మునిశ్రేష్ఠ రామసందర్శనాదితః॥ {1.51.7}

❊ "యతులలో రాజువగు ఓ విశ్వామిత్ర మహర్షీ! ఈ రఘురాముడు నా కన్నతల్లియగు అహల్యామాతను ఆదరభావంతో చూచినాడా? నా తల్లి తన స్వరూపమును మరలా పొందగలిగినదా? నా మాతృమూర్తి రాముని అర్చించినదా? నా తల్లి చేసిన పూజను ఈ రాముడు ప్రీతితో స్వీకరించినాడా? నా తల్లియైన అహల్యామాత నా తండ్రియైన గౌతమ మహర్షిని కలిసికొన్నదా? దయచేసి నా సందేహమును తీర్చండి" అని శతానందుడు కౌశికునికి విజ్ఞప్తి చేసినాడు.

మ. "యతిరాజా! ననుఁ గన్నతల్లి నెదలో నాప్యాయభావంబునం
గనెనా రాముడు? నైజరూపమును వీకం బొందెనా మాత? స
న్నుతి మాత్రర్చన నందెనా మిగుల సంతోషించి రాముండు? తా
జతగాఁ దండ్రిని జేరెనా జనని? నా సందేహముల్ దీర్చుమా!" 433

అపి మే గురుణా రామః పూజితః కుశికాత్మజ।
ఇహాఽఽగతో మహాతేజాః పూజాం ప్రాప్తో మహాత్మనః॥ {1.51.8}
అపి శాంతేన మనసా గురు ర్మే కుశికాత్మజ।
ఇహాగతేన రామేణ ప్రయతే నాభివాదితః॥ {1.51.9}

❊ "ఓ విశ్వామిత్ర మహర్షీ! నా తండ్రి మేటి మునినాథుడు అగు గౌతమ మహర్షి ఈ రాముని ప్రీతితో చూచినాడా? నా తండ్రి నాతల్లితో కూడినవాడై ఈ రామునికి ప్రణామములను సమర్పించినాడా? అతిథిపూజలు చేసినాడా? నా తండ్రి పూర్తిగా సంతోషమును పొందినాడా? ముక్తిని కలిగించగల ఈ రామునిచే నా తండ్రి పూజింపబడినాడా?" అని శతానందుడు కౌశికుని ప్రశ్నించినాడు.

ఉ. "నా జనకుండు మేటి మునినాథుడు ప్రీతిగ రాముఁ జూచెనా?
నా జననీయుతుండయి ప్రణామములన్ సమకూర్చెనా? వెసన్
బూజలఁ జేసెనా? మదినిఁ బూర్ణముగా బరితోషమందెనా?
పూజల నందెనా మరల ముక్తివిధాయకుడైన రాముచే"? 434

తచ్ఛ్రుత్వా వచనం తస్య విశ్వామిత్రో మహామునిః
ప్రత్యువాచ శతానందం వాక్యజ్ఞో వాక్యకోవిదమ్॥ {1.51.10}
నాతిక్రాన్తం మునిశ్రేష్ఠ యత్కర్తవ్యం కృతం మయా।
సంగతా మునినా పత్నీ భార్గవేణేవ రేణుకా॥ {1.51.11}

❊ శతానందుడు తన తల్లిదండ్రుల గురించి ఆ విధంగా అడుగగా విశ్వామిత్ర మహర్షి "ఓ శతానందుడా! జమదగ్నిమహర్షి రేణుకను కలిసికొన్న విధంగా నీ తండ్రియగు గౌతమ మహర్షి నీ తల్లియగు అహల్యను కలిసికొన్నాడు. ఈ కార్యమున నేను నా కర్తవ్యమును నిర్వహించినాను" అని తెలియజేసినాడు.

తే.గీ. అని శతానందు డడుగగ ముని యిటులనె
"నాదు కర్తవ్యమును జేసినాడ నేను
నుతుల జమదగ్నిఁ గూడు రేణుక విధమున
నీదు తండ్రిని గూడెను నీదు తల్లి" 435

తచ్ఛ్రుత్వా వచనం తస్య విశ్వామిత్రస్య భాషితమ్।
శతానందో మహాతేజా రామం వచన మబ్రవీత్॥ {1.51.12}
నాస్తి ధన్యతరో రామ త్వత్తోఽన్యో భువి కశ్చన।
గోప్తా కుశికపుత్ర స్తే యేన తప్తం మహ త్తపః॥ {1.51.15}

శ్రూయతాం చాభిధాస్యామి కౌశికస్య మహాత్మనః।
యథాబలం యథావృత్తం తన్మే నిగదతః శృణు॥ {1.51.16}

❊ విశ్వామిత్ర మహర్షి మాటలు పరమానందమును కలిగించగా శతానందుడు నరులలో ఉత్తముడైన రఘురాముని చూస్తూ "ఓ దశరథరామా! ఈ బ్రహ్మర్షి నీకు ఎటువంటి అపాయమూ రాకుండా రక్షించగలడు. ఈ కౌశికునికి శిష్యుడవైనందున ఈ భూమిమీద నీకంటే ధన్యాత్ముడు మరొక్కడు లేడు సుమా. ఈ మునీంద్రుని మాహాత్మ్యమును నీకు తెలియజేస్తాను విను అని విశ్వామిత్ర మహర్షియొక్క గొప్పతనమును గుఱించి విశదీకరించసాగినాడు.

మ. పరమానందముఁ గూర్చు వాక్కులను విశ్వామిత్రు డట్లాడగా,
నరులం దుత్తము రాముఁ గాంచుచు శతానందుండు తా నిట్లనెన్
"నిరపాయమ్ముగ గాచు నీ ముని నినున్, నీకంటె ధన్యాత్ము డీ
ధరలో లేడు మరొక్కరుండు విను మేతన్మౌని మాహాత్మ్యమున్" 436

రాజాభూ దేష ధర్మాత్మా దీర్ఘ కాల మరిందమః।
ధర్మజ్ఞః కృతవిద్యశ్చ ప్రజానాం చ హితే రతః॥ {1.51.17}
ప్రజాపతి సుతశ్చాసీత్ కుశో నామ మహీపతిః।
కుశస్య పుత్రో బలవాన్ కుశనాభ స్సుధార్మికః॥ {1.51.18}
కుశనాభ సుత స్త్వాసీ ద్గాధి రిత్యేవ విశ్రుతః।
గాధేః పుత్రో మహాతేజాః విశ్వామిత్రో మహామునిః॥ {1.51.19}

❊ "ఓ రఘురామా! ఈ విశ్వామిత్ర మహర్షి గతకాలంలో రాజుగా రాజ్యమును గొప్పగా పాలించినవాడు. ప్రజాపతియొక్క కుమారుడగు కుశుడు అను రాజునకు మునిమనుమడు. కుశనాభునికి మనుమడు. గాధికి కుమారుడు. ధర్మజ్ఞుడైన ఇతడు కౌశికుడు అని కూడా పేరును పొందినాడు" అని శతానందుడు దశరథరామునికి విశ్వామిత్రుని గొప్పతనమును గుఱించి విశదీకరించసాగినాడు.

తే.గీ. "గతమునన్ రాజితడు, ప్రజాపతిసుతుడగు
కుశుని కితడు ప్రపౌత్రుడు, గుణయుతుండు,

మేటి కుశనాభు పౌత్రుడై మించువాడు,
గాధిసుతుడు ధర్మజ్ఞుడు కౌశికుండు" 437

విశ్వామిత్రో మహాతేజాః పాలయామాస మేదినీమ్।
బహువర్షసహస్రాణి రాజా రాజ్య మకారయత్॥ {1.51.20}
కదాచిత్తు మహాతేజా యోజయిత్వా వరూథినీమ్। {1.51.21}
నగరాణి సరాష్ట్రాణి సరితశ్చ తథా గిరీన్।
ఆశ్రమాన్ క్రమశో రామ విచర న్నాజగామ హ॥ {1.51.22}
వసిష్ఠ స్యాశ్రమపదం నానావృక్షసమాకులమ్। {1.51.23}

❋ ఓ రఘురామా! ఈ విశ్వామిత్ర మహారాజు ఇతః పూర్వము అనేక వేల సంవత్సరములపాటు ఈ భూమిని పరిపాలించినాడు. ఆ కాలంలో ఇతడు ఒకసారి తనసైన్యాన్ని వెంటబెట్టుకొని గ్రామములు పురములు అని లేకుండా అన్ని దేశాలను దర్శిస్తూ చివరకు బ్రహ్మర్షియైన వసిష్ఠుని ఆశ్రమానికి చేరినాడు.

శా. పాలించెన్ పలు వేల యేండ్లిలను విశ్వామిత్ర రాజేంద్రు డా
కాలమ్మందున సైన్యమున్ గొని వెసన్ గాంచంగ నేగెన్ ధరన్
లీలన్ గ్రామములున్ బురమ్ము లనుచున్ లేకుండ సంపూర్ణ దే
శాలన్ జూచుచుఁ, జేరెఁ నంతట వసిష్ఠబ్రహ్మసంవాసమున్. 438

దేవదానవగంధర్వైః కిన్నరై రుపసేవితమ్॥ {1.51.23}
ప్రశాంత హరిణాకీర్ణం ద్విజసంఘ నిషేవితమ్। {1.51.24}
బ్రహ్మర్షి గణ సంకీర్ణం దేవర్షిగణ సేవితమ్। {1.51.25}
అబ్భక్షై ర్వాయుభక్షైశ్చ శీర్ణ పర్ణాశనై స్తథా।
ఫలమూలాశనై ర్దాంతైః జితరోషై ర్జితేంద్రియైః॥ {1.51.26}
ఋషిభి ర్వాలఖిల్యైశ్చ జపహోమపరాయణైః।
అన్యై ర్వైఖానసై శ్చైవ సమంతా దుపశోభితమ్॥ {1.51.27}
వసిష్ఠ స్యాశ్రమ పదం బ్రహ్మ లోక మివాపరమ్। {1.51.28}

❈ ఓ రఘురామా! ఆ వసిష్ఠాశ్రమము అనేక విధములైన వృక్షములతో, మృగములతో, పక్షులతో కూడియున్నదై, దేవ దానవ గంధర్వ కిన్నరులతో దేవర్షులతో బ్రహ్మర్షులతో కూడియున్నదై, జలభక్షకులతో వాయుభక్షకులతో పత్రభక్షకులతో కూడియున్నదై, వాలఖిల్యులతో వైఖానసులతో జపహోమపరులైన మునీశ్వరులతో కూడియున్నదై, జాతివైరములను మరచిన ప్రాణులతో కూడినదై, శాంతికి నిలయమై, పరమపావనమై, బ్రహ్మలోకముతో సమానమౌ పరమపదమువలె విరాజిల్లుచుండెను.

సీ. బహువిధతరువులు బహువిధమృగములు
బహుపక్షి గణములు వరలు పదము
ఘనదేవదానవ గంధర్వకిన్నర
బ్రహ్మర్షి దేవర్షి వాసపదము
వారిభక్షకులకు వాయుభక్షకులకు
పర్ణాదులకు సదావాస పదము
వాలఖిల్యాదులు వైఖానసాదులు
జపహోమపరులుండు శాంతిపదము

తే.గీ. వైరభావసువిస్మృతప్రాణియుతము
వర మునీశ్వర యుక్తమ్ము పావనమ్ము
బ్రహ్మలోక సమానమౌ పరమపదము
నచటఁ గనుపట్టె ఘనవసిష్ఠాశ్రమమ్ము. 439



52. విశ్వామిత్రునకు వసిష్ఠుని ఆతిథ్యము

స దృష్ట్వా పరమప్రీతో విశ్వామిత్రో మహాబలః।
ప్రణతో వినయా ద్వీరో వసిష్ఠం జపతాం వరమ్॥ {1.52.1}
స్వాగతం తవ చేత్యుక్తో వసిష్ఠేన మహాత్మనా
ఆసనం చాస్య భగవాన్ వసిష్ఠో వ్యాదిదేశ హ। {1.52.2}

❋ ఓ రఘురామా! వసిష్ఠాశ్రమమును ప్రీతితో చూచిన విశ్వామిత్ర మహారాజు బ్రహ్మర్షియైన వసిష్ఠుని దర్శించి పరమానందమును పొందినాడు. చేతులు జోడించి భక్తితో ఆ వసిష్ఠునికి నమస్కరించినాడు. అంతట వసిష్ఠుడు ఎంతో ఆదరభావంతో విశ్వామిత్రునికి సంతోషం కలిగే విధంగా అతిథిసత్కారం చేసినాడు.

మ. పరమంబైన వసిష్ఠు నాశ్రమము విశ్వామిత్రు డీక్షించుచున్,
బరమానందముతో వసిష్ఠుఁ గనుచున్, భాగ్యమ్ముగా నెంచుచున్,
గరముల్ మోడ్చి నమస్కరింప; ముని యుక్తంబైన సత్కార మా
దర భావమ్మునఁ గూర్చె రాజునకుఁ జేతఃప్రీతి సంధిల్లగన్. 440

యథా న్యాయం మునివరః ఫలమూలాన్యుపాహరత్॥ {1.52.3}
ప్రతిగృహ్య తు తాం పూజాం వసిష్ఠా ద్రాజసత్తమః। {1.52.4}
సుఖోపవిష్టం రాజానం విశ్వామిత్రం మహాతపాః।
పప్రచ్ఛ జపతాం శ్రేష్ఠో వసిష్ఠో బ్రహ్మణ స్సుతః॥ {1.52.6}
ప్రజాః పాలయసే వీర రాజవృత్తేన ధార్మిక॥ {1.52.7}

❋ ఓ రఘురామా! వసిష్ఠమహర్షి తన ఆశ్రమమునకు వచ్చిన విశ్వామిత్రునికి ఫలములను కందమూలములను సమర్పించినాడు. వాటిని స్వీకరించిన విశ్వామిత్ర మహారాజు బ్రహ్మర్షిని చూచి క్షేమ సమాచారములను అడిగినాడు. వసిష్ఠుడు తాము కుశలముగా ఉన్నామని తెలిపి ఓ గాధిజా! నీ పరిపాలన ఆదర్శవంతంగా ఉంటూ కీర్తిసంపదలతో విలసిల్లుచున్నది కదా! ప్రజలు

అందఱూ పుత్రపౌత్రాభివృద్ధితో సంపూర్ణంగా సంతోషంగా ఉన్నారు కదా! అని అడుగసాగినాడు.

మ. ఫలమూలాదుల నీయఁ గైకొనుచు విశ్వామిత్రుడున్ క్షేమ వా
క్కులఁ బల్కంగ, వసిష్ఠు డిట్లనె "సదా కూర్మిన్ భవత్పాలనం
బలరారున్ గద కీర్తిసంపదలతో, నాదర్శభావమ్ములన్
విలసిల్లున్ గద, పుత్రపౌత్రతతి సంవిత్పూర్ణమై గాధిజా!" 441

కచ్చిత్తే సంభృతా భృత్యాః కచ్చిత్తిష్ఠంతి శాసనే।
కచ్చిత్తే విజితా స్సర్వే రిపవో రిపుసూదన॥ {1.52.8}
కచ్చి ద్బలేషు కోశేషు మిత్రేషు చ పరంతప।
కుశలం తే నర వ్యాఘ్ర పుత్రపౌత్రే తవానఘ॥ {1.52.9}

❊ ఓ రఘురామా! వసిష్ఠమహర్షి విశ్వామిత్రుని చూచి కుశలప్రశ్నలు వేస్తూ "ఓ మహారాజా! నీ రాజ్యంలో సేవకులందఱూ సదా నీ ఆజ్ఞను భయభక్తులతో పాటిస్తూ ఉన్నారు కదా! నీ రాజ్యంలో కోశాగారము మిత్రుల సమూహము గొప్పగా విరాజిల్లుచున్నవి కదా! నీ రాజ్యాన్ని ఆక్రమించదలచిన శత్రువులను నీవు అవలీలగా నిర్మూలిస్తున్నావు కదా! నీ రాజ్యంలో సత్యముతోను ధర్మముతోను కూడిన విధులు నిత్యం వర్ధిల్లుతూ ఉన్నాయి కదా!" అని అడిగినాడు.

శా. "నీ రాజ్యమ్మున భృత్యు లెల్లరు సదా నీ యాజ్ఞఁ బాటింతురా?
నీ రాజ్యమ్మున కోశమిత్రతతి రాణించున్ గదా గొప్పగా,
నీ రాజ్యమ్ము గ్రసింప నెంచు రిపులన్ నిర్జించితే లీలగా?
నీ రాజ్యమ్మున సత్యధర్మవిధులున్ నిత్యమ్ము వర్ధిల్లుగా!". 442

సర్వత్ర కుశలం రాజా వసిష్ఠం ప్రత్యుదాహరత్। {1.52.10}
కృతోభౌ సుచిరం కాలం ధర్మిష్ఠౌ తౌ కథా శ్శుభాః। {1.52.11}
ఆతిథ్యం కర్తు మిచ్ఛామి బలస్యాస్య మహాబల।

తవ చైవాప్రమేయస్య యథార్హం సంప్రతీచ్ఛ మే॥ {1.52.13}
ఏవ ముక్తో వసిష్ఠేన విశ్వామిత్రో మహామతిః।
కృత మిత్యబ్రవీ ద్రాజా ప్రియవాక్యేన మే త్వయా॥ {1.52.15}

❊ ఓ రఘురామా! వసిష్ఠ మహర్షి ఆ విధంగా కుశలప్రశ్నలు వేయగా విశ్వామిత్ర మహారాజు ఓ బ్రహ్మర్షీ! నా రాజ్యమున అంతయూ కుశలమే అని బదులిచ్చినాడు. వారిరువురు అలా ఆత్మీయంగా మాట్లాడుకొన్న తరువాత వసిష్ఠుడు ఓ రాజా! సైన్యముతో కూడియున్న మీకు ఆతిథ్యమును ఇవ్వదలచియున్నాను అని విన్నవించగా విశ్వామిత్రుడు సంకోచిస్తూ ఇలా మాట్లాడసాగినాడు.

మ. అని ప్రశ్నింప ననామయంబె సకల మ్మార్యా! వసిష్ఠా! యటం
చనె రాజేంద్రుడు, వారలిర్వురును నత్యాసక్తితో పుణ్యభా
వనతో మాటల నాడి, రంత ముని భూపాలా! మదాతిథ్యమున్
గొనుడీ నీవును నీదు సైన్యమన సంకోచించి రాజిట్లనెన్. 443

ఫలమూలేన భగవన్ విద్యతే యత్తవాశ్రమే।
పాద్యేనాచమనీయేన భగవద్దర్శనేన చ॥ {1.52.16}
సర్వథా చ మహాప్రాజ్ఞ పూజార్హేణ సుపూజితః।
గమిష్యామి నమస్తేఽస్తు మైత్రేణేక్షస్వ చక్షుషా॥ {1.52.17}
ఏవం బ్రువంతం రాజానం వసిష్ఠః పునరేవ హి।
న్యమంత్రయత ధర్మాత్మా పునః పున రుదారధీః॥ {1.52.18}

❊ ఓ రఘురామా! సైన్యసమేతంగా ఆతిథ్యం స్వీకరించండి అని వసిష్ఠ మహర్షి గాధిజుని కోరగా విశ్వామిత్ర మహారాజు "ఓ బ్రహ్మర్షీ! మీరు ఫలమూలాదులను అర్ఘ్యపాద్యములను మాకు సమర్పించి మమ్ము సంతోషపెడుతూ యథాశక్తి అతిథిసేవలను చేసినారు. పూజ్యులైన మీ దివ్యవాక్కులతో మేము అనేక సేవలను పొందినట్లే అయినది. సమస్తమూ మాకు చెందినట్లే అయినది. ఇక నేను సైన్యసమేతంగా తిరిగి వెళ్లెదను" అని పలుకగా వసిష్ఠుడు "ఓ రాజా! మీ రందఱూ నా ఆశ్రమంలో ఉండండి" అని వేడుకొనెను.

మ. "ఫలమూలాదుల నర్ఘ్యపాద్యముల సంపత్తిన్ యథాశక్తి మ
మ్మలరింపన్, దగు సేవఁ జేసితిరి, పూజ్యార్హుల్ భవద్దివ్య వా
క్కులు చాలున్, బలు సేవ లందినటు, మాకున్ జెందె సర్వమ్ము, సే
నలతో నేగెద" మన్న నుండుడనెఁ దన్మౌనీంద్రు డా కౌశికున్. 444

ఏవ ముక్తో మహాతేజా వసిష్ఠో జపతాం వరః।
ఆజుహావ తతః ప్రీతః కల్మాషీం ధూత కల్మషః॥ {1.52.20}
యస్య యస్య యథా కామం షడ్రసేష్వభిపూజితమ్॥ {1.52.22}
తత్సర్వం కామధుక్ క్షిప్ర మభివర్ష కృతే మమ। {1.52.23}
ఏవ ముక్తా వసిష్ఠేన శబలా శత్రుసూదన।
విదధే కామధు క్కామాన్ యస్య యస్య యథేప్సితమ్॥ {1.53.1}

❀ ఓ రఘురామా! వసిష్ఠుడు మరల కోరుటచే విశ్వామిత్రుడు సైన్యసమేతంగా ముని యొక్క ఆతిథ్యమును స్వీకరించుటకు అంగీకరించినాడు. అంతట వసిష్ఠుడు సంతోషంతో కామధేనువును పిలిచి "ఓ శబలా! వీరందఱూ మెచ్చుకొనేవిధంగా నీవు షడ్రసోపేతమైన భోజనమును సిద్ధము చేయుము" అని పలికినాడు. వెంటనే ఆ గోమాత వారందఱి కొఱకు రుచికరమైన భోజన పదార్థములను కావలసినంతగా సృష్టించినది.

ఉ. ఆతడు వల్లె యంచనగ నంత వసిష్ఠుడు కామధేనువున్
జేతము పొంగఁ బిల్చి, "యిదె సిద్ధము సేయుము నీవు షడ్రసో
పేత విశిష్ట భోజనము వీరలు మెచ్చగ" నంచుఁ బల్క, గో
మాత సృజించె స్వాదుతర మాన్య పదార్థములన్ సమృద్ధిగన్. 445



53. కామధేనువును తనకిమ్మని విశ్వామిత్రుడు కోరుట వసిష్ఠుడు నిరాకరించుట

విశ్వామిత్రోఽపి రాజర్షిః హృష్టః పుష్ట స్తదాభవత్। {1.53.6}
యుక్తః పరమహర్షేణ వసిష్ఠ మిద మబ్రవీత్॥ {1.53.7}
పూజితోఽహం త్వయా బ్రహ్మన్ పూజార్హేణ సుసత్కృతః। {1.53.8}
గవాం శతసహస్రేణ దీయతాం శబలా మమ।
రత్నం హి భగవ న్నేతత్ రత్నహారీ చ పార్థివః॥ {1.53.9}
తస్మా న్మే శబలాం దేహి మమైషా ధర్మతో ద్విజ। {1.53.10}

❊ ఓ రఘురామా! కామధేనువుచే సృష్టింపబడిన పదార్థములను విశ్వామిత్ర మహారాజు, రాజపరివారములోని బ్రాహ్మణులు, మంత్రులు, పురోహితులు, భటులు మొదలైనవారు అందఱూ తృప్తిగా భుజించి ఎంతగానో సంతోషపడినారు. అప్పుడు గొప్ప మహిమతో శోభిల్లే ఆ కామధేనువును విశ్వామిత్రుడు తన స్వంతం చేసికొనడం మేలు అని భావించినాడు. అతడు వసిష్ఠుని చూచి ఓ మునీశ్వరా! ఈ గోవును నాకు ఇమ్ము. దీనికి బదులుగా నీకు అధికసంఖ్యలో గోవులను అంతులేని బంగారమును ఇచ్చెదను అని పలికినాడు.

మ. సరి యంచున్ భుజియించినా రచట విశ్వామిత్రుడున్ మేటి భూ
సురులున్ మంత్రిపురోహితాళి భటులున్, శోభిల్లు గోవున్ గొనన్
వరమౌ నంచు నృపాలు డిట్లనెను "దేవా! యిమ్ము దీనిన్, మునీ
శ్వర! నీకిత్తు ననేక గోవుల బృహత్స్వర్ణ మ్మమేయమ్ముగా" 446

ఏవ ముక్తస్తు భగవాన్ వసిష్ఠో మునిసత్తమః॥ {1.53.10}
విశ్వామిత్రేణ ధర్మాత్మా ప్రత్యువాచ మహీపతిమ్। {1.53.11}
అస్యాం హవ్యం చ కవ్యం చ ప్రాణయాత్రా తథైవ చ। {1.53.13}
ఆయత్త మత్ర రాజర్షే సర్వ మేతన్న సంశయః।
సర్వస్వ మేతత్ సత్యేన మమ తుష్టికరీ సదా॥ {1.53.15}
కారణై ర్బహుభీ రాజ న్న దాస్యే శబలాం తవ। {1.53.16}

❊ ఓ రఘురామా! విశ్వామిత్రుడు తాను రాజుననే అహంభావంతో ఆ విధంగా పలుకగా బ్రహ్మర్షియైన వసిష్ఠుడు "ఓ రాజా! ఈ ధేనువు కామధేనువు. నేను

చేసెడి యజ్ఞములకు అవసరమైన కవ్యమును హవ్యమును ఇచ్చునది ఈ గోవే సుమా. ఈ ఆవు నాకు ప్రాణసమానము. ఇచ్చట ఈ కామధేనువే నాకు సర్వస్వముగా మెలగుచున్నది. అందువలన ఈ ధేనువును నీకు ఎట్లా ఇవ్వగలను? అని బదులు పలుకసాగినాడు.

మ. అని గర్వోద్ధతి గాధిజుం డనగ బ్రహ్మజ్ఞాని తా నిట్లనెన్
"గనుమా యియ్యది కామధేనువు సుమా! కవ్యమ్ము హవ్యమ్ము ని
చ్చును నా కెన్నగఁ బ్రాణతుల్య మగుచున్ శోభిల్లు, సర్వస్వమై
తనరున్ నా కిట, నెట్లొసంగఁగల నేతద్ధేనువున్ గౌశికా!" 447

నాహం శతసహస్రేణ నాపి కోటిశతైర్గవామ్॥ {1.53.11}
రాజన్ దాస్యామి శబలాం రాశిభీ రజతస్యవా। {1.53.12}
ఏతదేవ హి మే రత్న మేతదేవ హి మే ధనమ్॥ {1.53.23}
బహునా కిం ప్రలాపేన న దాస్యే కామదోహినీమ్। {1.53.26}
కామధేనుం వసిష్ఠోఽపి యదా న త్యజతే మునిః।
తదాస్య శబలాం రామ విశ్వామిత్రోఽన్వకర్షత॥ {1.54.1}

❋ ఓ రఘురామా! కామధేనువును ఇవ్వజాలను అని తెలుపుతూ వసిష్ఠుడు రాజును చూచి "ఓ విశ్వామిత్రుడా! ఈ ధేనువునకు బదులుగా నీవు ఇవ్వదలచిన కోట్లాది గోవులను, సువర్ణము వెండి మొదలైన వాటిని, ధనరాసులను, గజములను, అశ్వములను, రథములను, ఇతర ద్రవ్యములను నేను కోరుకొనుటలేదు. మా కామధేనువునకు సాటియైనది ఈ లోకమున ఏదియునూ లేదు. వేయి మాటలేల? ఈ గోవును ఇవ్వలేను. ఇక మీరు వెళ్లవచ్చు" అని పలుకగా కోపంతో ఉగ్రుడైన విశ్వామిత్రుడు బలవంతముగా తీసికొనవెళ్ల దలచి ఆ ధేనువును పట్టుకొన్నాడు.

మ. "కొనఁ గోరన్ నృప! కోట్ల గోవులను నేఁ గోరన్ సువర్ణాదులన్
ధనరాశిన్ గజవాజులన్ రథములన్ ద్రవ్యాదులన్ గైకొనన్,
గన మా గోవుకు సాటి లేదిలను బల్కం జాల వేమాటలన్
జనుమా" యంచు వచింపఁ, బట్టె గవి విశ్వామిత్రు డత్యుగ్రుడై. 448

54. విశ్వామిత్రుడు కామధేనువును అపహరింపబోవుట శబల వసిష్ఠుని అనుమతితో బలములను సృష్టించుట

రత్నం హి భగవ న్నేతత్ రత్నహారీ చ పార్థివః॥ {1.53.9}
తదాస్య శబలాం రామ విశ్వామిత్రోఽన్వకర్షత॥ {1.54.1}
నీయమానా తు శబలా రామ రాజ్ఞా మహాత్మనా।
దుఃఖితా చింతయామాస రుదంతీ శోకకర్శితా॥ {1.54.2}

❀ ఓ రఘురామా! వసిష్ఠుడు కామధేనువును ఇవ్వను అని చెప్పగా విశ్వామిత్రుడు ఆ ధేనువును బలవంతముగా తీసికొని వెళ్లదలచినాడు. ఈ కామధేనువు ఎంతో శ్రేష్ఠమైనది. ఒక రత్నము వంటిది. రత్నము రాజుయొక్క ధనం అవుతుంది. రత్నమును రాజు హరింపవచ్చును అని పలుకుచూ ఆ మహారాజు ఆ శబలను పట్టి ఈడ్చినాడు. అవసరమైతే వసిష్ఠునితో యుద్ధం చేయుటకు కూడా సిద్ధమైనాడు. విశ్వామిత్రునిచే ఈడ్వబడిన ఆ కామధేనువు దుఃఖిస్తూ హాహాకారములు చేయసాగినది.

ఉ. రత్నము వోలె శ్రేష్ఠముగ రాజిలుచున్నది కామధేను వీ
రత్నము రాజె పొందఁదగు రాజధన" మ్మని, గాధిజుండు గో
రత్నముఁ బట్టి యీడ్చె సమరమ్మునకైనను సిద్ధమంచుఁ, ద
ద్యత్నము చేత నా శబల హా యని దుఃఖితయయ్యె నార్తిమై. 449

పరిత్యక్తా వసిష్ఠేన కిమహం సుమహాత్మనా।
యాహం రాజభటై ర్దీనా హ్రియేయం భృశదుఃఖితా॥ {1.54.3}
కిం మయాపకృతం తస్య మహర్షే ర్భావితాత్మనః।
యన్మా మనాగసం భక్తా మిష్టాం త్యజతి ధార్మికః॥ {1.54.4}

❀ ఓ రఘురామా! విశ్వామిత్రునిచే ఈడ్వబడినదై దుఃఖిస్తూ ఉండిన కామధేనువు హాహాకారములు చేయసాగినది. "ఈ విశ్వామిత్ర మహారాజు నేనే శక్తిమంతుడను అని అహంకరించినాడు. ఈ రాజుయొక్క సేవకులు కూడా

గర్వముతో భయభక్తులు లేకుండా ప్రవర్తించుచున్నారు. వీరు ఈ విధంగా నన్ను పట్టి ఈడ్చుకొని వెళ్లుచున్ననూ బ్రహ్మర్షియైన వసిష్ఠుడు చూస్తూ ఊరకున్నాడు. ఈ ఋషివరుడు నా గుఱించి పట్టించుకొనకుండా నన్ను వదలివేసినాడా ఏమి? నేను ఈ మునీంద్రునికి ఎన్నడునూ కీడు తలపెట్టలేదు. ధర్మపరుడైన ఈ తాపసి నన్ను ఇలా వదలివేసి ఊరకుండుట ధర్మమేనా?" అని అంటూ ఆ కామధేనువు రోదించసాగినది.

ఉ. "శక్తుడ క్షత్రియుండనని సర్వము నాదని రాజు, సేవకుల్
భక్తివిహీనులై యిటులఁ బట్ట, వసిష్ఠునిచేత నేఁ బరి
త్యక్తనె? కీడు నేఁ దలపఁ దన్మని కెన్నడు, ధర్మవర్తికిన్
యుక్తమె యిట్లు నన్ విడిచి యూరక యుం"టని యేడ్చెఁ బెన్వగన్. 450

నిర్ధూయ తాం తదా భృత్యాన్ శతశ శ్శత్రుసూదన।
జగామానిలవేగేన పాదమూలం మహాత్మనః॥ {1.54.5}
శబలా సా రుదంతీ చ క్రోశంతీ చేద మబ్రవీత్।
వసిష్ఠ స్యాగ్రతః స్థిత్వా మేఘదుందుభిరావిణీ॥ {1.54.6}
భగవన్ కిం పరిత్యక్తా త్వయాహం బ్రహ్మణ స్సుత।
యస్మాత్ రాజభృతా మాం హి నయంతే త్వత్సకాశతః॥ {1.54.7}

❋ ఓ రఘురామా! బలవంతముగా ఈడ్చుకొనివెళ్లెడి వందలాది విశ్వామిత్రభటుల కారణంగా బాధతో రోదించెడి శబల అనూహ్యమైన తన శక్తితో ఒక్కసారిగా విదిలించినదై వారి బారినుండి తప్పించుకొనినది. వేగంగా ఆశ్రమాన్ని చేరుకొని వసిష్ఠుని చూచి "ఓ మునీంద్రా! నన్ను రక్షింపకుండా వదలివేసినావా? దయతో నన్ను కాపాడు. నన్ను తీసికొని వెళ్లకుండా ఈ రాజభటుల దుశ్చర్యను నివారించు" అని ఆ కామధేనువు వేడుకొనినది.

మ. అదలించెన్ వెస హుంకృతిన్ శబల, యూహాతీతమౌ శక్తిచే
విదిలించెన్ దన నీడ్చు భృత్యశతమున్, వేగమ్ముగా నాశ్రమ
మ్ము దరిన్ జేరి తపస్వితో నిటులనెన్ "పోద్రోచితే నన్ మునీ
శ! దయన్ గావుమ, గాధినందనుని దుశ్చర్యన్ నివారింపుమా! 451

ఏవ ముక్తస్తు బ్రహ్మర్షి రిదం వచన మబ్రవీత్।
శోక సంతప్త హృదయాం స్వసార మివ దుఃఖితామ్॥ {1.54.8}
న త్వాం త్యజామి శబలే నాపి మేఽపకృతం త్వయా।
ఏష త్వాం నయతే రాజా బలా న్మత్తో మహాబలః॥ {1.54.9}
న హి తుల్యం బలం మహ్యం రాజా త్వద్య విశేషతః।
బలీ రాజా క్షత్రియశ్చ పృథివ్యాః పతి రేవ చ॥ {1.54.10}

❊ ఓ రఘురామా! దయతో నన్ను కాపాడు అనే కామధేనువు దీనాలాపములను ఆలకించిన వసిష్ఠుని యొక్క హృదయం తల్లడిల్లింది. గోమాతను తన చెల్లెలితో సమానంగా భావించిన వసిష్ఠుడు "ఓ శబలా! నిన్ను నేను వదులుకొంటానా? నీవు ఏ దోషమూ చేయలేదు. విశ్వామిత్ర మహారాజు అన్నివిధాలా గొప్ప శక్తిమంతుడు కదా అని తలచుచూ నేను ఊరకుండినాను. నన్ను నమ్ము" అని వసిష్ఠుడు బదులు పలికినాడు.

ఉ. ఉల్లము తల్లడిల్ల శబలోక్తులఁ శ్రద్ధగ నాలకించుచున్
జెల్లెలు వోలె నెంచుచు వసిష్ఠుడు ధేనువుఁ జూచి యిట్లనెన్
"జెల్లునె నిన్ను వీడ్కొనుట? సేవనదోషము లేమి లేవు, రా
జెల్లెడ శక్తిపూర్ణుడని యెంచుచు మిన్నకయుంటి నమ్ముమా!" 452

ఏవ ముక్తా వసిష్ఠేన ప్రత్యువాచ వినీతవత్।
వచనం వచనజ్ఞా సా బ్రహ్మర్షి మతుల ప్రభమ్॥ {1.54.12}
న బలం క్షత్రియస్యాహుర్బ్రాహ్మణో బలవత్తరః।
బ్రహ్మన్ బ్రహ్మ బలం దివ్యం క్షత్రాత్తు బలవత్తరమ్॥ {1.54.13}
నియుఙ్క్ష్వ మాం మహాభాగ త్వద్బ్రహ్మబలసంభృతామ్।
తస్య దర్పబలం యత్త న్నాశయామి దురాత్మనః॥ {1.54.14}

❊ ఓ రఘురామా! రాజు శక్తిమంతుడు కదా అని వసిష్ఠుడు బదులు పలుకగా కామధేనువు మునీంద్రుని చూచి "ఓ బ్రహ్మర్షీ! మీ బ్రహ్మతేజస్సు ఆ విశ్వామిత్రుని శక్తిని నశింపజేయగలుగుతుంది. ఇది సత్యము. ఇతర బలములకంటే బ్రాహ్మణ తేజస్సే గొప్పది. బ్రహ్మబలము ముందు

క్షత్రియబలము ఎంతో స్వల్పమైనదని నేను వినియున్నాను. మీ బ్రహ్మతేజస్సుతో కూడియున్న నన్ను ఆ రాజును శిక్షించేందు కొఱకై పంపించుము అని విన్నవించుకొనెను.

మ. అని యా మౌని వచింప ధేను వనె ని "ట్లార్యా! భవత్తేజమా
తని శక్తిన్ నశియింపఁ జేయఁ గలుగున్ దథ్యమ్ము, నే వింటి బ్రా
హ్మణ తేజమ్మె వరిష్ఠమౌ, నృపబల మ్మత్యల్పమౌ దాని ముం
దని, త్వత్తేజముఁ గన్న నన్నుపు మయ్యా! వారి శిక్షింపగన్" 453

ఇత్యుక్తస్తు తయా రామ వసిష్ఠ స్సుమహాయశాః।
సృజస్వేతి తదోవాచ బలం పరబలారుజమ్॥ {1.54.16}
తస్య తద్వచనం శ్రుత్వా సురభి స్సాఽసృజ త్తదా।
తస్యా హుంభారవోత్సృష్టాః పప్లవా శ్శతశో నృప॥ {1.54.17}
నాశయంతి బలం సర్వం విశ్వామిత్రస్య పశ్యతః। {1.54.18}

❋ ఓ రఘురామా! నీ బ్రహ్మతేజస్సుతో ఉన్న నన్ను విశ్వామిత్రుని శిక్షించేందుకు అనుమతించండి అని ఏమాత్రం భయపడని కామధేనువు బ్రహ్మర్షిని వేడుకొనగా ఆ వసిష్ఠుడు ఆ గోమాతను చూచి ఓ శబలా! నీవు ప్రధానమైన బలములను సృష్టింపుము. శత్రుబలములను జయింపుము అని ఆదేశించినాడు. ఆ గోవు వెంటనే రాజును సమీపించి తన హుంకారముతో పప్లవులు అను వీరులను సృష్టించింది. ఆ పప్లవులు విశ్వామిత్రుని భటులను నశింపజేసినారు.

చం. కర మనురక్తి గోవటు లకంపితయై పలుకన్, వసిష్ఠ డా
దరమున ధేనువున్ గని "ప్రధాన బలమ్ముల సృష్టిఁ జేయుమా!
పరబలమున్ జయింపు" మని పల్క, సృజించెను, గోవు హుంకృతిన్
వరలిన పప్లవుల్ భటుల నాశమొనర్చిరి రాజు చూడగన్. 454

స రాజా పరమక్రుద్ధో రోషవిస్ఫారితేక్షణః।
పప్లవా న్నాశయామాస శస్త్రై రుచ్చావచై రపి॥ {1.54.19}

విశ్వామిత్రార్దితాన్ దృష్ట్వా పప్లవాన్ శతశ స్తదా।
భూయ ఏవాఽసృజద్ ఘోరాన్ శకాన్ యవనమిశ్రితాన్॥ {1.54.20}
యోని దేశాచ్చ యవనా శకృద్దేశా చ్ఛకా స్తథా।
రోమకూపేషు చ మ్లేచ్ఛా హారీతా స్సకిరాతకాః॥ {1.55.3}

❊ ఓ రఘురామా! హోమధేనువుచే సృష్టింపబడిన పప్లవులు అను వీరులచే తన భటులు నశింపగా కౌశికుడు అస్త్రధారియై ఆ పప్లవులను అంతం చేసినాడు. వెంటనే కామధేనువు తన శత్రువైన కౌశికుని సైన్యమును నశింపజేయుటకు యవనులను శకులను కిరాతులను మ్లేచ్ఛులను కాల్బలమును సృష్టించినది.

చం. తన బలముల్ నశింపఁ గని తత్క్షణ మస్త్రధరుండు కౌశికుం
డనిమొన మేటి పప్లవుల నంతము చేయ; సృజించె గోవు లీ
ల నరుల గెల్వగా యవనులన్ శకులన్ భటులన్ కిరాతులన్
ఘనులగు మ్లేచ్ఛులం, గలనఁ గౌశికు సైన్యము నాశ మందగన్. 455



55. శివానుగ్రహమున విశ్వామిత్రుడు దివ్యాస్త్రములను ప్రయోగించుట

తై స్తై ర్నిషూదితం సర్వం విశ్వామిత్రస్య తత్ క్షణాత్।
సపదాతిగజం సాశ్వం సరథం రఘునందన॥ {1.55.4}
విశ్వామిత్ర సుతానాం చ శతం నానావిధాయుధమ్॥ {1.55.5}
అభ్యధావత్ సుసంక్రుద్ధం వసిష్ఠం జపతాం వరమ్।
హుంకారేణైవ తాన్ సర్వాన్ దదాహ భగవాన్ ఋషిః॥ {1.55.6}
స గత్వా హిమవత్పార్శ్వం తప స్తేపే మహాతపాః॥ {1.5512}

❊ ఓ రఘురామా! కామధేనువుచే సృష్టింపబడిన యవనులు మొదలగువారు గాధిజుని చతురంగ బలములను కూల్చివేయగా ఆ గాధిజుని కుమారులు వసిష్ఠుని చంపేందుకు వెళ్లినారు. అప్పుడు ఆ వసిష్ఠుని హుంకారము అగ్నిగా మారి కౌశికుని పుత్రులను దహించివేసింది. పుత్రశోకమును పొందిన కౌశికుడు కోపించినవాడై ప్రతీకారం తీర్చుకొనదలచి తపస్సు చేయడానికి హిమాలయానికి వెళ్లినాడు.

చం. రణమునఁ గూలిపోవఁ జతురంగ బలమ్ములు, గాధిజాత్మజుల్
చనిరి వసిష్ఠుఁ జంపుటకు, సన్ముని హుంకృతి వారినెల్లఁ దా
ననలగతిన్ దహింపఁ, గని హా యని కౌశికు డంత దీనతన్
వనరి, హిమాలయమ్మునఁ దపంబొనరింపగ నేగెఁ గ్రుద్ధుడై. 456

కేనచి త్త్వథ కాలేన దేవేశో వృషభధ్వజః।
దర్శయామాస వరదో విశ్వామిత్రం మహాబలమ్॥ {1.55.13}
వరదోఽస్మి వరో యస్తే కాంక్షిత స్సోఽభిధీయతామ్॥ {1.55.14}
యది తుష్టో మహాదేవ ధనుర్వేదో మమానఘ।
సాంగోపాంగోపనిషదః సరహస్యః ప్రదీయతామ్॥ {1.55.16}
యాని దేవేషు చాస్త్రాణి దానవేషు మహర్షిషు।
గంధర్వయక్షరక్షస్సు ప్రతిభాంతు మమానఘ॥ {1.55.17}

❃ *ఓ రఘురామా! వసిష్ఠునిపై కోపంతో విశ్వామిత్రుడు హిమాలయమున సుస్థిరమైన దీక్షతో తపస్సు చేస్తూ ఉండగా మహాదేవుడైన శివుడు ప్రత్యక్షమైనాడు. ఈశ్వరుడు "ఓ గాధిజా! వరం కోరుకో అనుగ్రహిస్తాను" అని అనగా విశ్వామిత్రుడు ఆ శూలికి మ్రొక్కి "ఓ పరమశివా! దేవతలు దానవులు మునులు గంధర్వులు యక్షులు తమ సంపదగా కలిగియున్న అస్త్రములను నాకు అనుగ్రహించండి. ఎటువంటి భయమూ లేకుండునట్లు గొప్ప శక్తిని పొందేందుకొఱకు నాకు ధనుర్వేదాన్ని అనుగ్రహించండి" అని ప్రార్థించినాడు.*

మ. స్థిరదీక్షన్ దపమాచరింపగ, మహాదేవుండు ప్రత్యక్షమై
"వరమున్ గోరుము గాధిజా!" యనగ విశ్వామిత్రు డా శూలికిన్
గరముల్ మోడిచి, "యస్త్రసంపదల వేడ్కన్ గూర్చు మో దేవ! యే
వెఱపున్ లేనటు శక్తినందగ ధనుర్వేదమ్ము నాకి" మ్మనెన్. 457

ఏవ మస్త్వితి దేవేశో వాక్య ముక్త్వా గత స్తదా॥ {1.55.18}
ప్రాప్య చాస్త్రాణి రాజర్షి ర్విశ్వామిత్రో మహాబలః।
దర్పేణ మహతా యుక్తో దర్పపూర్ణోఽభవ త్తదా॥ {1.55.19}
హత మేవ తదా మేనే వసిష్ఠ మృషిసత్తమమ్॥ {1.55.20}
తతో గత్వాఽఽశ్రమపదం ముమో చాస్త్రాణి పార్థివః।
యై స్త త్తపోవనం సర్వం నిర్దగ్ధం చాస్త్రతేజసా॥ {1.55.21}

❃ *ఓ రఘురామా! విశ్వామిత్రుడు కోరుకొన్నట్లే మహేశ్వరుడు అస్త్రములను అనుగ్రహించినాడు. అస్త్రబలంతో గర్వించిన కౌశికుడు "ఇక నన్ను ఎవడూ జయింపలేడు" అని అహంకరించినాడు. "నా ధాటికి వసిష్ఠుడు మరణిస్తాడు" అని అనుకొంటూ ఆ బ్రహ్మర్షి యొక్క ఆశ్రమానికి చేరినాడు. యుద్ధానికి సిద్ధమై కోపంతో దివ్యాస్త్రములను ప్రయోగించినాడు. వసిష్ఠుని తపోవనమును బూడిద చేసినాడు.*

ఉ. కోరినరీతి నస్త్రములఁ గూర్చె మహేశుడు; "నన్జయింపగా
నేరునె యెవ్వడేని? మరణించు వసిష్ఠ డ" టంచు గర్వియై
చేరెను గౌశికుం డదె వసిష్ఠుని యాశ్రమవాటిఁ, గ్రుద్ధుడై
పోరగ నేసె నస్త్రముల, బూడిద గాగఁ దపోవన మ్మటన్. 458

ఉదీర్యమాణ మస్త్రం తత్ విశ్వామిత్రస్య ధీమతః।
దృష్ట్వా విప్రద్రుతా స్సర్వే మునయ శ్చతశో దిశః॥ {1.55.22}
వసిష్ఠస్య చ యే శిష్యా స్తథైవ మృగపక్షిణః।
విద్రవంతి భయా ద్భీతా నానా దిగ్భ్యః సహస్రశః॥ {1.55.23}
ఇత్యుక్త్వా పరమక్రుద్ధో దణ్డ ముద్యమ్య సత్వరః।
విధూమ మివ కాలాగ్నిం యమదణ్డ మివాపరమ్॥ {1.55.28}

❋ ఓ రఘురామా! కోపంతో ఉన్న విశ్వామిత్రుడు ఈశ్వరదత్తములైన దివ్యాస్త్రములను ప్రయోగించి వసిష్ఠుని తపోవనమును బూడిద చేయగా, ఆ ఆశ్రమములోని మునులు భయముతో పరుగెత్తినారు. అచ్చటి మృగములు పక్షులు పాఱిపోయినవి. వారందఱికి కలిగిన కష్టమును తొలగించేందుకొఱకు బ్రహ్మర్షియైన వసిష్ఠుడు ప్రళయకాలమునందలి అగ్నితో సమానమైన తేజస్సు కలవాడై తన బ్రహ్మదండమును చేతబట్టి విశ్వామిత్రునికి ఎదురుగా నిలబడినాడు.

మ. కినుకన్ గౌశికు దస్త్రరాశినిఁ బ్రయోగింపంగ, భీతాత్ములై
మునులెల్లన్ బరువెత్తినారలు, మృగమ్ముల్ పక్షులున్ బ్రాణ భీ
తినిఁ బారంగ, వసిష్ఠు డందఱకు నార్తిన్ బాప యత్నించుచున్,
ఘన దండమ్మును జేతఁ బట్టి నిలిచెన్ గాలాగ్నితేజమ్మునన్. 459

ఆశ్రమం చిరసంవృద్ధం యద్వినాశితవా నసి।
దురాచారోఽసి తన్మూఢ తస్మా త్త్వం న భవిష్యసి॥ {1.55.27}
ఏవ ముక్తో వసిష్ఠేన విశ్వామిత్రో మహాబలః।
ఆగ్నేయ మస్త్ర ముత్క్షిప్య తిష్ఠ తిష్ఠేతి చాబ్రవీత్॥ {1.56.1}
తస్యాస్త్రం గాధి పుత్రస్య ఘోర మాగ్నేయ ముద్యతమ్।
బ్రహ్మదణ్డేన తచ్ఛాంత మగ్నే ర్వేగ ఇవాంభసా॥ {1.56.5}

❋ ఓ రఘురామా! బ్రహ్మదండమును చేతబట్టి విశ్వామిత్రునికి ఎదురుగా నిలబడిన వసిష్ఠుడు ఓ కౌశికా! నీవు ఖలుడవు. చిరకాలంగా అభివృద్ధి చెందియున్న నా తపోవనమును నీ అస్త్రప్రయోగంతో దహించినావు. దురాచారపరుడవైన నీవు ఎక్కువకాలము ఉండజాలవు అని అంటూ ఉండగా అజ్ఞానాంధుడైన గాధిజుడు మరలా భయంకరమైన అస్త్రములను వసిష్ఠునిపై ప్రయోగించినాడు.

మ. చిరకాలమ్ముగ వృద్ధిఁ జెందిన తపస్సీమన్ దహింపంగ దు
స్తర శస్త్రాస్త్రము లేసినాడవు దురాచారా! ఖలా! కౌశికా!
వరలన్ జాలుదువే చిరమ్మనుచుఁ దాఁ బల్కన్ వసిష్ఠుండు, పా
మరబుద్ధిన్ వడినేసె గాధిజుడు భీమప్రోత్థితాస్త్రమ్ములన్. **460**



56. విశ్వామిత్రుని దివ్యాస్త్రములను వసిష్ఠుడు తన బ్రహ్మదండముతో శమింపజేయుట

తస్యాస్త్రం గాధిపుత్రస్య ఘోర మాగ్నేయ ముత్తమమ్। {1.56.5}
వారుణం చైవ రౌద్రం చ ఐంద్రం పాశుపతం తథా। {1.56.6}
మానవం మోహనం చైవ గాంధర్వం స్వాపనం తథా। {1.56.7}
శోషణం దారణం చైవ వజ్ర మస్త్రం సుదుర్జయమ్।
బ్రహ్మపాశం కాలపాశం వారుణం పాశ మేవ చ॥ {1.56.8}
తాని సర్వాణి దణ్డేన గ్రసతే బ్రహ్మణ స్సుతః॥ {1.56.13}
తేషు శాంతేషు బ్రహ్మాస్త్రం క్షిప్తవాన్ గాధినందనః। {1.56.14}

❋ ఓ రఘురామా! బ్రహ్మర్షి వసిష్ఠుడు తన బ్రహ్మదండంతో విశ్వామిత్రుడు ప్రయోగించిన అస్త్రములను నిర్వీర్యం చేసి అతనిని నిలువరించినాడు. ఆ కౌశికుడు దివ్యాస్త్రబలగర్వంతో క్రమంగా ఆగ్నేయాస్త్రము, వారుణాస్త్రము, రౌద్రాస్త్రము, పాశుపతాస్త్రము, మోహాస్త్రము, వజ్రాస్త్రము, ఐంద్రాస్త్రము, మానవాస్త్రము, గాంధర్వాస్త్రము, జనవిధ్వంసకమైన కాలపాశాస్త్రము మొదలైనవాటిని వసిష్ఠునిపై ప్రయోగించినాడు. వసిష్ఠుని బ్రహ్మదండము ఆ అస్త్రములనన్నిటినీ మ్రింగివేయగా గాధిజుడు చివరి అస్త్రంగా బ్రహ్మాస్త్రమును ప్రయోగించినాడు.

మ. కినుకన్ గౌశికు డంత నేసె వడి నాగ్నేయాస్త్రమున్, వారుణ
మ్మును, రౌద్రాస్త్రము, దివ్యపాశుపతమున్, మోహాస్త్రమున్, వజ్రమున్,
ఘనమైంద్రమ్మును, మానవాస్త్రము, నమోఘమ్మైన గాంధర్వమున్,
జనవిధ్వంసక కాలపాశముఁ బ్రశస్తంబైన బ్రహ్మాస్త్రమున్. 461

తాని సర్వాణి దండేన గ్రసతే బ్రహ్మణ స్సుతః॥ {1.56.13}
తదప్యస్త్రం మహాఘోరం బ్రాహ్మం బ్రాహ్మేణ తేజసా।
వసిష్ఠో గ్రసతే సర్వం బ్రహ్మదణ్డేన రాఘవ॥ {1.56.16}
రోమకూపేషు సర్వేషు వసిష్ఠస్య మహాత్మనః।
మరీచ్య ఇవ నిష్పేతు రగ్నే ర్ధూమాకులార్చిషః॥ {1.56.18}
తతోఽస్తువన్ మునిగణా వసిష్ఠం జపతాం వరమ్।
ప్రసీద జపతాం శ్రేష్ఠ లోకా స్సంతు గతవ్యథాః॥ {1.56.21}

❊ ఓ రఘురామా! చెలరేగుతూ వస్తూ ఉన్న కౌశికాస్త్రములను వసిష్ఠుని బ్రహ్మదండం మ్రింగివేసింది. చివరగా విశ్వామిత్రుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రమును వసిష్ఠ మహర్షి తనలో లీనం చేసికొన్నవాడై అగ్నిజ్వాలగా మారగా, అన్నిలోకాలు ఆ అగ్నికీలలలో, పొగలో మునిగిపోయినవి. తాపమునకు గురియైన ఆ ఆశ్రమమునులు వసిష్ఠుని చూచి "ఓ మునీంద్రా! శాంతించండి. అందఱినీ కాపాడండి" అని వేడుకొనినారు.

ఉ. రేగెడి కౌశికాస్త్రముల శ్రేణిఁ దదీయ మజాస్త్రమున్ వెసన్
సాగక నీక మ్రింగె ఋతశాలి వసిష్ఠుడు బ్రహ్మదండియై,
తోగగ నెల్ల లోకములు ధూమ హుతాశన కీలలన్, "మునీ!
వేగమె శాంతి నందు" మని వేడిరి మౌనులు తాపమందుచున్. 462

ఏవ ముక్తో మహాతేజా శ్శమం చక్రే మహాతపాః।
విశ్వామిత్రోఽపి నికృతో వినిఃశ్వస్యేద మబ్రవీత్॥ {1.56.22}
ధిగ్బలం క్షత్రియబలం బ్రహ్మతేజోబలం బలమ్।
ఏకేన బ్రహ్మదణ్డేన సర్వాస్త్రాణి హతాని మే॥ {1.56.23}
తపో మహత్ సమాస్థాస్యే యద్వై బ్రహ్మత్వకారణమ్॥ {1.56.24}
స దక్షిణాం దిశం గత్వా మహిష్యా సహ రాఘవ।
తతాప పరమం ఘోరం విశ్వామిత్రో మహాత్తపః॥ {1.57.2}

❊ ఓ రఘురామా! ఆవిధంగా మునులు వేడగా పూజ్యుడైన వసిష్ఠుడు శాంతించినాడు. క్షత్రియతేజస్సు కంటే బ్రహ్మతేజస్సు గొప్పది అని గ్రహించిన విశ్వామిత్ర మహారాజు తాను ఆ బ్రహ్మతేజస్సును పొందగోరినవాడై సతీసమేతంగా దక్షిణదిశకు వెళ్లి తపస్సు చేయదలచినాడు.

చం. మును లటు వేడ, శాంతిలెను బూజ్య వసిష్ఠుడు, బ్రహ్మతేజమే
గన బలవత్తరమ్ము గద క్షత్రియ తేజము కంటె యన్న భా
వన కలుగంగ, గౌశికుడు బ్రాహ్మము తేజము నొందగోరుచున్
దన సతితోఁ జనెన్ దపము దక్షిణదిక్కునఁ జేయఁ బూనుచున్. 463



57. విశ్వామిత్రుడు బ్రహ్మర్షి యగుటకై తపస్సు చేయుట త్రిశంకుని వృత్తాంతము

అథాఽస్య జజ్ఞిరే పుత్రా స్సత్యధర్మపరాయణాః।
హవిష్యందో మధుష్యందో దృఢనేత్రో మహారథః॥ {1.57.3}
పూర్ణే వర్షసహస్రే తు బ్రహ్మా లోకపితామహః।
అబ్రవీ న్మధురం వాక్యం విశ్వామిత్రం తపోధనమ్॥ {1.57.4}
జితా రాజర్షిలోకా స్తే తపసా కుశికాత్మజ।
అనేన తపసా త్వాం తు రాజర్షి రితి విద్మహే॥ {1.57.5}
ఏవ ముక్త్వా మహాతేజా జగామ సహ దైవతైః। {1.57.6}

✲ ఓ రఘురామా! తపస్సుచేయడానికి సతీసమేతంగా వెళ్లిన విశ్వామిత్రునికి హవిష్యందుడు, మధుష్యందుడు, దృఢనేత్రుడు, మహారథుడు అనే నలుగురు గుణవంతులైన కుమారులు కలిగినారు. కౌశికుడు వేయి సంవత్సరములు తపస్సు చేయగా అతనిని చూచుటకు బ్రహ్మదేవుడు విచ్చేసి "ఓ రాజా! నీవు నీ తపస్సుతో రాజర్షిలోకములను గెలుచుకొన్నావు. నీ తపోదీక్ష ఫలవంతమైనది. నీవు రాజర్షి అను పదమును అందుకొన్నావు" అని అనుగ్రహించి తన లోకమునకు తిరిగివెళ్లినాడు.

తే.గీ. కాంతఁ గూడి తపముఁ జేయు కౌశికునకు
నట హవిష్యందుడును, మధుష్యందుడు, దృఢ
నేత్రుడును, మహారథు డను పుత్రవరులు
కలిగినారలు సుగుణవంతులు నలుగురు. 464

మ. అమలుండై తపమాచరింపగ సహస్రాబ్దంబు లా కౌశికో
త్తముఁ జూడన్ జనుదెంచి బ్రహ్మ పలికెన్ "ధాత్రీశ! రాజర్షిలో
కములన్ గెల్చితి వీవు, దీక్ష ఫలయుక్తం బయ్యె, రాజర్షి యన్
విమలంబౌ పద మందినా" వని చనెన్ వేదోక్తమార్గంబునన్. 465

విశ్వామిత్రోఽపి తచ్ఛ్రుత్వా హ్రియా కించి దవాఙ్ముఖః।
దుఃఖేన మహతాఽఽవిష్ట స్స మన్యు రిద మబ్రవీత్॥ {1.57.7}
తపశ్చ సుమహ త్తప్తం రాజర్షి రితి మాం విదుః।
దేవా స్సర్షిగణా స్సర్వే నాస్తి మన్యే తపఃఫలమ్॥ {1.57.8}
ఇతి నిశ్చిత్య మనసా భూయ ఏవ మహాతపాః।
తప శ్చకార కాకుత్స్థ పరమం పరమాత్మవాన్॥ {1.57.9}

❀ ఓ రఘురామా! బ్రహ్మదేవుడు రాజర్షి పదమును అనుగ్రహించి వెళ్లగా విశ్వామిత్రుడు ఎంతమాత్రమూ సంతృప్తి చెందలేదు. "నేను ఎంతోకాలం నుండి తపస్సు చేయుచున్నాను. బ్రహ్మ ఇచ్చిన రాజర్షి పదము నాకు సంతోషమును కలిగించుటలేదు" అని చింతిస్తూ తాను అనుకొన్న బ్రహ్మర్షి పదము లభించలేదని సిగ్గు పడుతూ, కౌశికుడు మరలా బ్రహ్మదేవుని గురించి తపస్సు చేయనారంభించినాడు.

శా. ఎంతోకాలము నుండి చేసితిఁ దప మ్మీనాడు బ్రహ్మోక్తి యే
సంతోషమ్మును గూర్చలేదనుచు విశ్వామిత్ర రాజర్షి తాఁ
జింతన్ బొందుచు సిగ్గు నందుచు నజున్ జిత్తమ్ములో నెంచుచున్,
బంతం బొప్పఁ దపం బొనర్చె మరలన్, బ్రహ్మర్షియై నిల్వగన్. 466

త్రిశంకు రితి విఖ్యాత ఇక్ష్వాకుకులవర్ధనః। {1.57.10}
గచ్ఛేయం సశరీరేణ దేవానాం పరమాం గతిమ్॥ {1.57.11}
ప్రత్యాఖ్యాతో వసిష్ఠేన స యయౌ దక్షిణాం దిశమ్।
తత స్తత్కర్మసిద్ధ్యర్థం పుత్రాంస్తస్య గతో నృపః॥ {1.57.13}
త్రిశంకు స్సుమహాతేజా శ్శతం పరమభాస్వరమ్॥ {1.57.14}
వసిష్ఠపుత్రాన్ దదృశే తప్యమానాన్ యశస్వినః। {1.57.15}

❀ ఓ రఘురామా! రాజర్షియైన విశ్వామిత్రుడు బ్రహ్మర్షి అయ్యేందుకొఱకు మరల తపస్సును మొదలుపెట్టిన సమయంలోనే ఇక్ష్వాకువంశవర్ధనుడైన త్రిశంకు మహారాజు దేహంతోనే స్వర్గలోకానికి వెళ్లాలని సంకల్పించినాడు.

తనను శరీరంతోనే స్వర్గమునకు పంపవలసినదిగా వసిష్ఠుని వేడినాడు. అలా పంపడం వీలుకాదని అవివేకి వలె మాట్లాడవద్దని వసిష్ఠుడు పలుకగా త్రిశంకుడు తన కోరికను తీర్చుమని కోరేందుకు వసిష్ఠునియొక్క వందమంది పుత్రులు ఉన్న ప్రదేశానికి వెళ్లి వారితో ఇలా అన్నాడు.

తే.గీ. సరిగ నా సమయమునఁ ద్రిశంకు డనగ
నుండె నిక్ష్వాకుకులవర్ధనుండు నృపుడు
వీక దేహమ్ముతో స్వర్గలోక మేగఁ
దలచి వేడె వసిష్ఠునిఁ దత్త్వవిదుని. 467

మ. సశరీరమ్ముగ స్వర్గలోకముఁ జనన్ శక్యమ్ము గాదంచు, బా
లిశు వోలెంబలుకంగ రాదనుచు, సంతృప్తిన్ మనన్ జెల్లు, నీ
దశతో నుండు మటంచు మౌని పలుకన్, ధాత్రీశు డా మౌనిపు
త్రశతమ్మున్ గననెంచి తన్నిలయమున్ దర్శించి తానిట్లనెన్. 468

సోఽభిగమ్య మహాత్మాన స్సర్వా నేవ గురోః సుతాన్॥ {1.57.15}
అభివాఽఽద్యానుపూర్వేణ హ్రియా కించి దవాఙ్ముఖః। {1.57.16}
శరణం వః ప్రపద్యేఽహం శరణ్యాన్ శరణాగతః। {1.57.17}
స శరీరో యథాఽహం హి దేవలోక మవాప్నుయామ్।
ప్రత్యాఖ్యాతో వసిష్ఠేన గతి మన్యాం తపోధనాః॥ {1.57.20}
గురుపుత్రా నృతే సర్వా న్నాహం పశ్యామి కాంచన। {1.57.21}

❋ ఓ రఘురామా! త్రిశంకు మహారాజు వసిష్ఠునిచే తిరస్కరింపబడినవాడై వసిష్ఠుని వందమంది పుత్రులను సమీపించి నమస్కరించి "ఓ గురుపుత్రులారా! ఈ శరీరంతో నన్ను స్వర్గమునకు పంపవలసినదిగా నేను మీ తండ్రిని కోరినాను. మీతండ్రి అట్లు పంపుటకు వీలుకాదని నివారించినాడు. నాకు మీరే శరణు అని నేను మీ దగ్గఱకు వచ్చినాను. తగిన యజ్ఞమును చేసి మీరు నన్ను బొందితో స్వర్గమునకు పంపండి" అని తన అరుదైన కోరికను తెలిపి వారిని ప్రార్థింపగా ఆ మునిపుత్రులు కోపాన్ని పొందినారు.

మ. తపమున్ జేయు వసిష్ఠపుత్రులకుఁ జేతఃప్రీతిగా మ్రొక్కుచున్
త్రప సంధిల్లగ రాజు పల్కెనిటు "మీ తండ్రిన్ సమీపించి 'స
న్నిపుడే పంపుడు మేనితో దివికి స్వామీ!' యంచు వేడన్ గురుం
డపు డట్లేగ నశక్యమౌ ననియె మద్యత్నమ్ము వారించుచున్. 469

మ. గురువర్యుండు తిరస్కరింప మది సంకోచమ్ము లేకుండ నే
శరణమ్మంచిదె మిమ్ముఁ జేరితిని యజ్ఞశ్రేష్ఠమున్ జేసి నన్
గరుణన్ బంపుడు బొందితోడ దివికిన్ గైమోడ్తు" నంచా నృపుం
డరుదౌ కోరికఁ దెల్పఁ గ్రోధయుతులై రా మౌనిపుత్రుల్ వెసన్. 470



58. వసిష్ఠపుత్రులు శపించగా చండాలత్వమును పొందిన త్రిశంకుడు విశ్వామిత్రుని ఆశ్రయించుట

అశక్య మితి చోవాచ వసిష్ఠో భగవా నృషిః।
తం వయం వై సమాహర్తుం క్రతుం శక్తాః కథం తవ॥ {1.58.4}
అవమానం చ తత్కర్తుం తస్య శక్ష్యామహే కథమ్। {1.58.6}
అన్యాం గతిం గమిష్యామి స్వస్తి వోఽస్తు తపోధనాః।
ఋషిపుత్రాస్తు తచ్ఛ్రుత్వా వాక్యం ఘోరాభిసంహితమ్॥ {1.58.8}
శేపుః పరమ సంక్రుద్ధా శ్చణ్డాలత్వం గమిష్యసి। {1.58.9}
అథ రాత్ర్యాం వ్యతీతాయాం రాజా చణ్డాలతాం గతః। {1.58.10}

❈ ఓ రఘురామా! త్రిశంకుడు వసిష్ఠపుత్రులను చూచి "శరీరంతో స్వర్గానికి పంపమని కోరగా మీ తండ్రి వసిష్ఠుడు తిరస్కరించినాడు. నా కోరికను మీరుతీర్చండి" అని వేడగా మునిపుత్రులు "ఓ రాజా! మాతండ్రి కాదనిన పనిని మేము చేయుట యుక్తము కాదు. మా తండ్రికి అవమానమును కలిగించే యజ్ఞమును మేము చేయాలని ఎలా అనుకొంటాము? నీవు ఈ దేహంతో స్వర్గానికి వెళ్లడం అసాధ్యము" అని తెలిపినారు. "అట్లైనచో నేను నా కోరిక తీరేందుకు మరొకరిని ఆశ్రయిస్తాను" అని త్రిశంకుడు పలుకగా వినిన ఆ వసిష్ఠపుత్రులు కోపమును పొంది "ఓ మూర్ఖుడా! నీవు చండాలుడవుగా అయ్యెదవు గాక! అని శపించినారు. ఆ శాపవాక్కు కారణంగా మఱునాటి ఉదయమున త్రిశంకు మహారాజు చండాలరూపాన్ని పొందినాడు.

చం. "జనకు డశక్యమన్న పని చల్పుట యుక్తమె? రాజవర్య! నీ
వనదగునా యిటుల్, గురుని కట్లవమానముఁ గూర్చు యజ్ఞమున్
జనవునఁ జేయనెంతుమె? యసాధ్యము దేహముతోఁ ద్రివిష్టపం"
బని మునిపుత్రు లాడ, నృపు డన్యుల వేడగ నిశ్చయించెఁ దాన్. 471

మ. జనకున్ జుల్కన చేసి పార్థివుడు యజ్ఞ మ్మన్యవిప్రాప్తిచే
ఘనతన్ జేసెద నంచుఁ బల్క విని "మూర్ఖా! నీవు చండాలతన్

గనుమా" యంచు శపించి రా మునిసుతుల్ కారుణ్యమే లేని వా
క్కునఁ, జండాల శరీర మందెను త్రిశంకుం డంత నా ప్రొద్దుటన్.   472

నీలవస్త్రధరో నీలః పరుషో ధ్వస్తమూర్ధజః। {1.58.10}
తం దృష్ట్వా మంత్రిణ స్సర్వే త్యజ్య చణ్డాలరూపిణమ్। {1.58.11}
ప్రాద్రవన్ సహితా రామ పౌరా యేఽస్యానుగామినః। {1.58.12}
విశ్వామిత్ర స్తు తం దృష్ట్వా రాజానం విఫలీ కృతమ్॥ {1.58.13}
కి మాగమనకార్యం తే రాజపుత్ర మహాబల॥ {1.58.15}
అయోధ్యాధిపతే వీర శాపా చ్చణ్డాలతాం గతః। {1.58.16}

❈ ఓ రఘురామా! వసిష్ఠపుత్రుల శాపం కారణంగా చండాలుడుగా మారిన త్రిశంకు మహారాజు నల్లని దేహకాంతిగలవాడై నల్లని వస్త్రములను ధరించినవాడై భయంకరమైన రూపం గలవాడై తేజోవిహీనుడై కనిపించుచుండగా ఆ రాజుయొక్క మంత్రులు హితులు విప్రులు భయముతో వణకుచున్నవారై అతనిని వదలి పాఱిపోయినారు. త్రిశంకుడు దీనవదనుడై చింతిస్తూ "ఇప్పుడు విశ్వామిత్రుడు ఒక్కడే నాకు దిక్కు" అని కౌశికుని చేరి ప్రణామంచేసి "ఓ రాజర్షీ! నిన్ను శరణు వేడుచున్నాను" అని పలుకగా ఆ విశ్వామిత్రుడు దయగలవాడై అతనికి భద్రమును చేకూర్చదలచి "ఓ అయోధ్యాధిపతీ! నీవు ఇట్లు నావద్దకు వచ్చుటకు కారణమేమి? నీకు ఈ చండాలరూపమును ఎవరు కల్పించినారు? వివరంగా చెప్పు" అని అడిగినాడు.

ఉ. నల్లని దేహకాంతిఁ గని, నల్లని వస్త్రములన్ ధరించి, భీ
తిల్లగఁ జేయు రూపుఁ గొని, తేజముఁ గోల్పడి యుండె రాజు, కం
పిల్లుచు మంత్రులున్ హితులు విప్రులు రాజును వీడి దవ్వులం
జల్లగఁ బాఱిపోవగఁ, ద్రిశంకుడు చింతిలసాగె దీనతన్.   473

మ. శరణ మ్మిప్పుడు నా కొకండె యని విశ్వామిత్రునింజేరి తొం
దరతోడన్ బ్రణమిల్లఁ, గౌశికు "డయోధ్యాభూపతీ! నీవిటుల్

శరణమ్మంచు వచింప నేమి కతమో? చండాలరూపమ్ము నె
వ్వరు కల్పించిరి తెల్పుమా" యనెఁ గృపన్ భద్రమ్ము చేకూర్పగా. 474

ప్రత్యాఖ్యాతోఽస్మి గురుణా గురుపుత్రై స్తథైవ చ॥ {1.58.17}
అనవాప్యైవ తం కామం మయా ప్రాప్తో విపర్యయః।
సశరీరో దివం యాయా మితి మే సౌమ్య దర్శనమ్॥ {1.58.18}
మయా చేష్టం క్రతుశతం తచ్చ నావాప్యతే ఫలమ్। {1.58.19}

❊ ఓ రఘురామా! విశ్వామిత్రుడు త్రిశంకుని చూచి "నీ దశను నేను గొప్పగా మారుస్తాను అని వాగ్దానంచేసి "ఓ అయోధ్యాధిపతీ! నీకు ఈ చండాలరూపం ఎలా వచ్చిందో చెప్పు" అని అడిగినాడు. త్రిశంకుడు కౌశికుని చూచి "ఓ రాజర్షీ! నన్ను ఈ శరీరంతో స్వర్గానికి పంపమని నేను మా గురువైన వసిష్ఠుని ప్రార్థించినాను. నీకోరికను ఎవరూ తీర్చలేరు అని బొందితో స్వర్గం అసాధ్యము" అని ఆ గురువర్యుడు తెలిపినాడు. నేను ఆ వసిష్ఠుని పుత్రులను ఆశ్రయించి నా కోరికను తెలిపినాను. వారు కోపాన్ని పొంది నాపై కరుణ చూపకుండా నన్ను శపించి నాకు ఈ చండాలరూపాన్ని కల్పించినారు. నేను ఎంతోకాలమునుండి ధర్మపరుడనై ఉండి నూరు యజ్ఞములను చేసినాను. దానికి ఫలితము ఇదేనా?" అని త్రిశంకుడు తన దీన దశను విన్నవించుకొనసాగినాడు.

మ. "దశ నే మార్చెద" నంచుఁ గౌశికుడు వాగ్దానమ్ముఁ జేయంగ, దు
ర్దశలో నున్న త్రిశంకు డిట్లనె "మునీ! ప్రార్థించినాడన్ గురున్
సశరీరమ్ముగ స్వర్గమున్ జనెదు నాసన్ దీర్చగా, నేరికిన్
వశమే గాదనియెన్ వసిష్ఠుడు దివిన్ వర్తింప నీబొందితోన్". 475

మ. "సురలోక మ్మటు చేరరాదని వసిష్ఠుం డట్లు పల్కంగ, నే
గురుపుత్రావళి నాశ్రయించితిని, నన్ గోపించి వారెల్లరున్
గరుణన్ వీడి శపించినారు వికృతిన్ గల్పించి రీ రూపమున్,
జిరకాలమ్ముగ నూరు యజ్ఞములు నేఁ జేయన్ ఫలంబిద్దియా?" 476

అనృతం నోక్తపూర్వం మే న చ వక్ష్యే కదాచన॥ {1.58.19}
కృచ్ఛ్రేష్వపి గత స్సౌమ్య క్షత్రధర్మేణ తే శపే।
యజ్ఞై ర్బహువిధై రిష్టం ప్రజా ధర్మేణ పాలితాః॥ {1.58.20}
తస్య మే పరమార్తస్య ప్రసాద మభికాంక్షతః। {1.5823}
కర్తు మర్హసి భద్రం తే దైవోపహతకర్మణః।
నాన్యాం గతిం గమిష్యామి నాన్య శ్శరణ మస్తి మే॥ {1.58.24}

❃ ఓ రఘురామా! త్రిశంకుడు రాజర్షియగు విశ్వామిత్రునికి తన దీనదశను విన్నవించుకొంటూ ఓ కౌశికోత్తమా! ఎటువంటి కష్టపరిస్థితులలోనూ నేను అసత్యమును పలుకుటలేదు. రాజధర్మములను గౌరవిస్తున్నాను. యజ్ఞయాగాదులను చేస్తున్నాను. ఆపదలో ఉన్నవారిని కాపాడుచున్నాను. నా రాజ్యంలోని ప్రజలను సంరక్షిస్తూ ఉన్నాను. గురువరులను సేవిస్తున్నాను. అయినప్పటికినీ దైవము నాకు మేలు కలిగించుటలేదు. ఈ విధంగా ఎప్పుడూ స్వధర్మాన్ని ఆచరించే నేను ఈరోజు శాపానికి గురియైనాను. నన్ను సశరీరంగా స్వర్గమునకు పంపగలవారు మీరే. దైవోపహతుడనైన నన్ను మహిమాన్వితులైన మీరే దయతో చూడాలి. నీ పదమే నాకు శరణు అని తలచి నేను నీ దరి చేరినాను అని వేడుకొనినాడు.

ఉ. “ఎన్న దసత్యమున్ బలుక నెంతటి కష్టము వచ్చినన్, మునీ!
యెన్నెద రాజధర్మముల, నెప్పుడు యజ్ఞము లాచరింతు, నా
పన్నులఁ గాచెదన్, బ్రజకు భద్రముఁ గూర్తు, గురూత్తమాళికిన్
మిన్నగ సేవఁ జేసెదను మేలొనగూర్పడు దైవ మేలనో”? 477

ఉ. “ఈ పగిదిన్ స్వధర్మమున నెప్డు మెలంగెడివాడ నైన, నే
శాపము నందితిన్, దమరె స్వర్గముఁ జేర్పఁ గలట్టివారు, దై
వోపహతుండ నేను మహిమోన్నత! నన్ గృపఁ జూడ వేడెదన్
నీ పదమే శరణ్య మని నీ దరిఁ జేరితిఁ గౌశికోత్తమా”! 478

59. విశ్వామిత్రుడు వసిష్ఠపుత్రులను, మహోదయుని శపించుట

ఉక్తవాక్యం తు రాజానం కృపయా కుశికాత్మజః।
అబ్రవీ న్మధురం వాక్యం సాక్షా చ్చణ్డాలరూపిణమ్॥ {1.59.1}
ఐక్ష్వాక స్వాగతం వత్స జానామి త్వాం సుధార్మికమ్। {1.59.2}
గురుశాపకృతం రూపం యదిదం త్వయి వర్తతే।
అనేన సహ రూపేణ స శరీరో గమిష్యసి॥ {1.59.4}
హస్తప్రాప్త మహం మన్యే స్వర్గం తవ నరాధిప। {1.59.5}

❊ ఓ రఘురామా! సూర్యకులోద్భవుడగు త్రిశంకుడు విశ్వామిత్రుని ఆవిధంగా శరణు వేడగా, ఆ కౌశికుడు త్రిశంకుని ఓదార్చి "నాయనా! నీవు ధార్మికుడవుగా ప్రవర్తించుచుండుటచే నేను నీకు భద్రమును కలుగజేసెదను. దేహంతో నీవు స్వర్గమును చేరుకొనేందుకొఱకు గొప్ప ఋత్విక్కులను పిలిచి యజ్ఞాన్ని ప్రారంభిస్తాను. నాకు ఎంత శ్రమ ఐనా సరే నిన్ను ఈ చండాలరూపంతోనే దేవతలు ఉండే స్వర్గానికి పంపిస్తాను. హాయిగా నీవు స్వర్గానికి వెళ్లు. నాకలోకం నీ అరచేతిలో ఉన్నది అని భావించు. ఈ విషయంగా ఇక నీకు శోకమేల?" అని అతని మానసిక సంక్షోభాన్ని తొలగిస్తూ అభయాన్ని ఇచ్చినాడు.

మ. పలుకన్ సూర్యకులోద్భవుం డటుల, విశ్వామిత్రు డాత్మీయతన్
బలికెన్ "వత్స! త్రిశంకు! ధార్మికుడవై వర్తించుటన్, భద్రమున్
గలుగన్ జేసెద, దేహయుక్తముగ స్వర్గప్రాప్తి యౌనట్లు ని
ర్మల ఋత్విక్కుల బిల్చి యజ్ఞమును బ్రారంభింతు నే నిప్పుడే. 479

మ. శ్రమ యెంతైనను బంపెదన్ దివికి, నీ చండాలరూపమ్ముతో
నమరుల్ వర్ధిలు స్వర్గలోకమున కాహా యంచు నీ వేగుమా!
సుమతీ! నీ యరచేత నాక మమరెన్, శోకమ్ము నీకేల" యం
చు మునీంద్రుం డభయమ్ము నిచ్చె నృపు సంక్షోభమ్ముఁ బోకార్చుచున్.

ఏవ ముక్త్వా మహాతేజాః పుత్రాన్ పరమధార్మికాన్।
వ్యాదిదేశ మహాప్రాజ్ఞాన్ యజ్ఞసంభారకారణాత్॥ {1.59.6}
సర్వాన్ శిష్యాన్ సమాహూయ వాక్య మేత దువాచ హ।
సర్వాన్ ఋషిగణాన్ వత్సా ఆనయధ్వం మమాజ్ఞయా॥ {1.59.7}
సశిష్యసుహృదశ్చైవ సర్త్విజ స్సబహుశ్రుతాన్।
యదన్యో వచనం బ్రూయా న్మద్వాక్యబలచోదితః॥ {1.59.8}
తత్సర్వ మఖిలేనోక్తం మమాఖ్యేయ మనాదృతమ్। {1.59.9}

❊ ఓ రఘురామా! విశ్వామిత్రుడు త్రిశంకుని ఓదార్చి అభయమిచ్చిన తరువాత తన కుమారులను పిలిచి "నాయనలారా! మీరందఱూ నేను చేయబోవు యజ్ఞమునకు అవసరమైన సంభారములను పూర్తిగా తీసికొనిరండి అని చెప్పినాడు. తన చెంత చేరిన శిష్యులను చూచి "మీరు యజ్ఞమును నిర్వహించగల ఋత్విక్కులను పండితులను శిష్యసమేతంగా వెంటబెట్టుకొని రండి" అని ఆజ్ఞాపించినాడు. "నేను చేయబోయే ఈ యజ్ఞము నియమహీనమైనదని ఎవరైనా అన్నట్లయితే వారిని గుఱించి నాకు తెలియజేయాలి" అని కూడా కౌశికుడు ఆ శిష్యులను ఆదేశించినాడు.

ఉ. కూరిమిఁ బుత్రులన్ బిలిచి "గొప్పగ మీరలు దివ్య యజ్ఞ సం
భారములన్ సమగ్రముగఁ బాత్రతఁ దెం" దని పల్కి, చెంతకున్
జేరిన శిష్యులన్ గనుచు "శిష్యసమేతుల ఋత్విగాదులన్
సూరుల వెంటబెట్టుకొనుచున్ వెస రం" దని కౌశికుండనెన్. 481

తే.గీ. నేను చేసెడి యజ్ఞమ్ము నియమహీన
మనుచు నెవరేని నుడివిన నట్టి వార్త
నాకు నెఱిగింప వలె సుమీ నమ్మకముగ
శిష్యులార!" యటంచుఁ గౌశికుడు పలికె. 482

సర్వదేశేషు చాఽఽఽగచ్ఛన్ వర్జయిత్వా మహోదయమ్।
వాసిష్ఠం తచ్ఛ్రుతం సర్వం క్రోధపర్యాకులాక్షరమ్॥ {1.59.12}

క్షత్రియో యాజకో యస్య చణ్డాలస్య విశేషతః॥ {1.59.13}
కథం సదసి భోక్తారో హవి స్తస్య సురర్షయః। {1.59.14}
తేషాం తద్వచనం శ్రుత్వా సర్వేషాం మునిపుంగవః॥ {1.59.16}
క్రోధసంరక్తనయన స్స రోష మిద మబ్రవీత్। {1.59.17}

❋ ఓ రఘురామా! విశ్వామిత్రుడు అట్లు ఆజ్ఞాపించగా ఆ మునిశిష్యులు అన్ని దిక్కులలో ఉన్న ఋత్విజుల వద్దకు వెళ్లి వారిని యజ్ఞవిధుల కొఱకు ఆహ్వానింపగా అందఱూ వచ్చినారు కాని వసిష్ఠుని వందమంది కుమారులు, మహోదయుడు అను ముని రాలేదు. "ఒక రాజు అసాధారణ యజ్ఞం చేయించడము, ఒక చండాలుడు ఆ క్రతువునకు కర్తగా ఉండటము, దేవతలు ఆ యజ్ఞానికి రావడము, యజ్ఞభాగములను భుజించడము ఇవన్నీ తగని పనులు. ఆ క్రతుకర్తలు బుద్ధిలేనివారు" అని వారు మాట్లాడగా ఆ మాటలను శిష్యులు విశ్వామిత్ర గురువునకు చెప్పినారు. కోపంతో కన్నులు ఎఱుపెక్కగా కౌశికుడు తనను నిందించిన వారిని శపించుటకు సిద్ధమైనాడు.

మ. ముని యాజ్ఞన్ గొని, శిష్యు లెల్ల దిశలన్ బొల్పారు ఋత్విక్కులన్
గని, యాహ్వానముఁ బల్క, యజ్ఞవిధులన్ గావింప విచ్చేయగా,
మునినాథున్ గని శిష్యు లిట్లనిరి "సత్పూజ్యా! వసిష్ఠాత్మజుల్
మునివర్యుండు మహోదయుండు మది నామోదించ రయ్యా! మిమున్"

మ. "క్షితినాథుండు విశిష్ట యజ్ఞ విధులన్ జేయింపఁ, జండాలు డా
క్రతుకర్తృత్వముఁ బూన, వింతగ సురల్ కాంక్షించి యేతెంతురే?
క్రతుభాగమ్ముల కోరుకొందురె మదిన్? గైకొంచు భక్షింతురే?
మతిహీనుల్ క్రతుకర్త" లంచుఁ గినుకన్ మాటాడినా రందఱున్. 484

తే.గీ. అని వసిష్ఠమహామునితనయశతము
నా మహోదయుండును బల్కి రనుచు శిష్యు
లనగ నపుడు విశ్వామిత్రముని వచించె
రక్తలోచనుండై నిష్ఠురముగ నిటుల. 485

యే దూషయం త్యదుష్టం మాం తప ఉగ్రం సమాస్థితమ్॥ {1.59.17}
భస్మీభూతా దురాత్మానో భవిష్యంతి న సంశయః।
అద్య తే కాల పాశేన నీతా వైవస్వతక్షయమ్॥ {1.59.18}
మహోదయ స్తు దుర్బుద్ధి ర్మా మదూష్యం హ్యదూషయత్॥ {1.59.20}
యథాఽయం స్వశరీరేణ స్వర్గలోకం గమిష్యతి॥ {1.60.3}
తథా ప్రవర్త్యతాం యజ్ఞో భవద్భిశ్చ మయా సహ। {1.60.4}

❁ ఓ రఘురామా! తన యజ్ఞప్రయత్నమును నిందించిన వారిపై విశ్వామిత్రునికి కోపం వచ్చింది. "తపోధనుడను ధీమంతుడను అయిన నేను క్రతుదీక్షను చేపట్టగా వారు దుష్టభావన గలవారై నన్ను దుష్టుడని అంటున్నారు. ఆ వసిష్ఠపుత్రశతాన్ని, ఆ మహోదయుని ఇప్పుడే భస్మం చేస్తాను. వారిని నరకలోకానికి పంపిస్తాను" అంటూ కౌశికుడు వారిని శపించినాడు. శాపమునకు గుఱియై వారు నశించినారు. అంతట గాధిజుడు ఋత్విజులను చూచి "ఓ విప్రోత్తములారా! ఈ త్రిశంకుడు ఇక్ష్వాకు వంశపు రాజు. చాలా గొప్పవాడు. ధర్మాత్ముడు. దీక్షాపరుడు. సశరీరంగా స్వర్గమునకు వెళ్లాలనే కోరికతో నన్ను శరణు వేడినాడు. కాబట్టి ఇతనిని స్వర్గానికి పంపేందుకు తగిన యజ్ఞమును ప్రారంభించండి" అని ఆదేశించినాడు.

మ. "ఘనధీమంతుడ నే తపోధనుడ దీక్షన్ వర్తిలన్! దుష్ట భా
వన నన్ దుష్టు డనంగ వారి నిపుడే భస్మమ్ము గావింతు, నా
మునిపుత్రాళి మహోదయుండు నరకమ్మున్ జేరగాఁ బంప నే
ర్తును చూడుం" దని శాపమిచ్చె మిగులన్ రోషాత్ముడై వైళమే. 486

మ. ముని కోపింప, వసిష్ఠపుత్రశతమున్ బూర్ణమ్ముగా నాశ మం
ద, నయోదారుడు నా మహోదయుడు చింతన్ గ్రుంగుచున్ నాశ మ
య్యెను, రాజర్షి వచించె ఋత్విజులతో "నిక్ష్వాకుదాయాదుడౌ
ఘను డీతండు త్రిశంకు నామకుడు దీక్షామూర్తి ధర్మిష్ఠుడున్". 487

తే.గీ. కోరి దివి కేగగా సశరీరముగను
శరణుఁ జొచ్చెను, గావున స్వర్గలోక
వాస మితనికిం గూర్పగా వలయు నిపుడె
మీరు యజ్ఞమ్ము సల్పుడీ మేలుఁ గూర్ప" 488



60. విశ్వామిత్రుడు త్రిశంకుని స్వర్గమునకు పంపుట

అయం కుశికదాయాదో మునిః పరమకోపనః॥ {1.60.5}
అగ్నికల్పో హి భగవాన్ శాపం దాస్యతి రోషితః॥ {1.60.6}
ఏవ ముక్త్వా మహర్షయ శ్చక్రు స్తా స్తాః క్రియా స్తదా॥ {1.60.8}
నాఽభ్యాగమ స్తదాహూతాః భాగార్థం సర్వదేవతాః॥ {1.60.11}
పశ్య మే తపసో వీర్యం స్వార్జితస్య నరేశ్వర।
ఏష త్వాం సశరీరేణ నయామి స్వర్గమోజసా॥ {1.60.13}

❈ ఓ రఘురామా! ఆవిధంగా విశ్వామిత్రుడు ఆజ్ఞాపించగా ఋత్విజులు అతని వాగ్ధోరణిని చూచి "ఈ కోపిష్ఠి చెప్పినట్లే మనం చేయాలి. లేదంటే మనకు శాపం ఇస్తాడు" అని మనసులో అనుకొంటూ విధిలేక ఆ యజ్ఞమును ప్రారంభించినారు. హవిర్భాగములను తీసికొనుటకు రావలసినదిగా దేవతలను పిలిచినారు. "ఇటువంటి యజ్ఞం చేయరాదు" అని భావించిన దేవతలు తమ హవిర్భాగములను తీసికొనుటకు రాలేదు. అందులకు కోపించిన కౌశికుడు "ఓ త్రిశంకుడా! నా తపశ్శక్తితో నిన్ను సశరీరంగా స్వర్గానికి ఇప్పుడే పంపగలను" అని ఉత్సాహంతో పలికినాడు.

మ. అని యా గాధిజు డానతీయ మును లూహాతీత వాగ్ధోరణిన్
గని, "యీ కోపను డాడినట్లె సవమున్ గావింపగాఁ జెల్లుఁ, గా
దనినన్ శాపమొసంగు" నంచు విధిగా నా యజ్ఞమున్ జేయుచోఁ
"గొనుడీ హవ్యము నంచుఁ బిల్చె" సురలన్ గూర్మిన్ మునీంద్రుం డటన్.

మ. "క్రతు వీ రీతిగఁ జేయ రా" దనుచుఁ జేరన్ రారు తద్దేవతల్,
క్రతు భాగమ్ముల గైకొనంగ దివిజుల్ రారంచుఁ గ్రోధించి ధి
క్కృతి సైరింపని కౌశికుండు "నృప! నిన్నిట్లే తపశ్శక్తి స
న్నుతరీతిన్ దివిఁ జేర్చు వాడ" ననియెన్ నూత్నక్రియోత్సాహియై. 490

దుష్ప్రాపం స్వశరీరేణ దివం గచ్ఛ నరాధిప।
ఉక్తవాక్యే మునౌ తస్మిన్ సశరీరో నరేశ్వరః॥ {1.60.14}

దివం జగామ కాకుత్స్థ మునీనాం పశ్యతాం తదా। {1.60.15}
గురుశాపహతో మూఢ పత భూమి మవాక్శిరాః।
ఏవ ముక్తో మహేంద్రేణ త్రిశంకు రపతత్ పునః॥ {1.60.17}
విక్రోశమాన స్త్రాహీతి విశ్వామిత్రం తపోధనమ్। {1.60.18}

❈ ఓ రఘురామా! విశ్వామిత్రుడు త్రిశంకుని చూచి "ఓ రాజా! నా తపశ్శక్తితో సశరీరంగా స్వర్గలోకానికి వెళ్లు" అని అనగానే చండాలరూపంతో ఉన్న త్రిశంకుడు దేవలోకానికి చేరుకొన్నాడు. ఇంద్రుడు అతనిని చూచి "ఓ త్రిశంకుడా! నీవు స్వర్గంలో ఉండుటకు అర్హుడవు కాదు. గురువుగారి శాపమునకు గుఱియైన నీవు సశరీరంగా స్వర్గమునకు ఎట్లు రాగోరినావు? మా దేవలోకంనుండి నీవు అధోముఖుడవై నీ భూలోకానికి వెళ్లిపో" అని అన్నాడు. సంక్రందనుడు అలా అనగానే త్రిశంకుడు దివినుండి భువికి తలక్రిందులుగా పడిపోవుచున్నవాడై ఆక్రోశిస్తూ తనను కాపాడవలసినదిగా కౌశికుని వేడుకొన్నాడు.

మ. "చనుమా నాకము దేహ మొప్ప" నని విశ్వామిత్రు డన్నంతనే,
చనియెన్ వేగఁ ద్రిశంకు డా దివికిఁ దచ్చండాలరూపమ్ముతోఁ,
గని సంక్రందను "డో త్రిశంకునృప! స్వర్గమ్మందు నుండంగఁ జె
ల్లునె నీ, విచ్చట నుండ నర్హుడవె? చాలున్ జాలుఁ బో పొమ్మనెన్"

మ. "గురుశాపోపహతుండ వీవు తగునా కోరంగ దేహమ్ముతో
వర నాకమ్ము, నధోముఖుండ వగుచున్ వైళంబె పొమ్మింక నీ
ధరణిన్ జేరగ" నంచు శక్రు డనినంతన్ గూలుచున్, గౌశికున్
గురువున్ వేడెఁ ద్రిశంకు డంత మది నాక్రోశించుచున్ దీనతన్. 492

త చ్ఛ్రుత్వా వచనం తస్య క్రోశమానస్య కౌశికః॥ {1.60.18}
రోష మాహారయ త్తీవ్రం తిష్ఠ తిష్ఠేతి చాబ్రవీత్।
ఋషిమధ్యే స తేజస్వీ ప్రజాపతి రివాపరః॥ {1.60.19}
సృజన్ దక్షిణ మార్గస్థాన్ సప్తర్షీ నపరాన్ పునః। {1.60.20}

సృష్ట్వా నక్షత్రవంశం చ క్రోధేన కలుషీ కృతః॥ {1.60.21}
అన్య మింద్రం కరిష్యామి లోకో వా స్యా దనింద్రకః। {1.60.22}

❈ ఓ రఘురామా! దివి నుండి భువికి పడిపోవుచున్న త్రిశంకుడు తనను దయతో కాపాడవలసినదిగా కౌశికుని ప్రార్థించినాడు. అప్పుడు విశ్వామిత్రుడు "ఓ త్రిశంకుడా! నీవు అక్కడనే ఆగుము" అని ఆ రాజును ఆకాశమునందే నిలిపివేసినాడు. అంతరిక్షములో త్రిశంకుడు ఉన్న చోట ఋషిమండలమును, తారామండలమును సృష్టించినాడు. "నేను క్రొత్తగా ఒక ఇంద్రుని దేవతామండలమును ఒక నూతన స్వర్గమును అవలీలగా సృష్టిస్తాను లేనిచో క్రూరుడైన ఆ ఇంద్రుని లేకుండా చేస్తాను" అని కోపంతో కౌశికుడు పలుకుచుండగా అందఱూ భయపడసాగినారు.

ఉ. "కావుము నేఁ ద్రిశంకుడను గౌశిక! కూలుచునుంటి, నన్ గృపన్
బ్రోవు" మటంచు నేడ్చు నృపపుంగవుఁ జూచి మహర్షి "యాగుమా
నీ వట" నంచు నిల్పె నతనిన్, ఋషిమండలమున్ సృజించి, సం
భావనఁ జేసె నొక్క శతమన్యుని సృష్టి యొనర్ప నచ్చటన్. 493

ఉ. తారకలన్ సృజించి, నృపధామమునన్ నవశక్రసృష్టి నిం
పారగఁ జేసెదన్, సురల నందఱి లీల సృజింతు, లేనిచోఁ
గ్రూరునిఁ దద్బిడౌజు నిదె రూపఱఁ జేసెద నంచుఁ గ్రోధ మొ
ప్పారగఁ బల్కు కౌశికుని పల్కులు భీతినిఁ గొల్పె నంతటన్. 494

అయం రాజా మహాభాగ గురుశాపపరిక్షతః।
సశరీరో దివం యాతుం నార్హ త్యేవ తపోధన॥ {1.60.24}
ఆరోహణం ప్రతిజ్ఞాతం నానృతం కర్తు ముత్సహే॥ {1.60.26}
అవా క్ఛిరా స్త్రిశంకుశ్చ తిష్ఠ త్వమరసన్నిభః।
అనుయాస్యంతి చైతాని జ్యోతీంషి నృపసత్తమమ్॥ {1.60.31}
కృతార్థం కీర్తిమంతం చ స్వర్గలోకగతం యథా। {1.60.32}

❊ ఓ రఘురామా! కౌశికుని కోపవాక్కులకు భయపడిన సురాసురులు ఋషులు ఆ రాజర్షిని శరణు వేడి "ఓ గాధిజా! గురువుయొక్క శాపమునకు గుఱియైన ఆ త్రిశంకుడు శరీరంతో స్వర్గంలో ఉండేందుకు ఎలా అర్హుడౌతాడు" అని అడుగగా, కౌశికుడు వారిని చూచి "నా పాదములను శరణు జొచ్చిన త్రిశంకుని స్వర్గమునకు పంపెదనని నేను ప్రతిజ్ఞ చేసినాను. ప్రతిజ్ఞ నెఱవేఱకపోయినచో నాకు అపకీర్తి కలుగుతుంది. నేను అసత్యవాదినౌతాను కదా! అందువలన త్రిశంకుడు స్వర్గంలో ఉండేందుకు మీరు సమ్మతించండి" అని పలికినాడు. అంతట ఆ దేవతాదులు త్రిశంకుడు తారాపథంలో తలక్రిందులుగా ఉండుటకు అంగీకరించి విశ్వామిత్రుని ప్రశంసించి తమలోకములకు తిరిగి వెళ్లినారు.

చం. సురలసురుల్ మునుల్ భయము చొప్పడ సంయమిఁ జేరి "గాధిజా!
శరణు, త్రిశంకు డుగ్ర గురుశాపహతుం డిటు స్వర్గవాసియై
వరలుట కర్హుడే?" యనుచుఁ బల్కగఁ గౌశికు డిట్లు పల్కె "నా
చరణముఁ బట్టగా నతని స్వర్గముఁ జేర్పఁ బ్రతిజ్ఞ జేసితిన్" 495

ఉ. "నాదు ప్రతిజ్ఞ వమ్మగుట నా కపకీర్తికరమ్ము గాన, సం
వాదము చా లసత్యమును బల్కగఁ జాలఁ, ద్రిశంకు డా దివిన్
మోదముతోడఁ దారల సమూహముతో నివసించునట్టు లా
మోదము తెల్పగాఁదగు నపూర్వముగా నిక మీర లెల్లరున్" 496

మ. తన వాదమ్మును మౌని తెల్ప, విని మోదమ్మంచు నిక్ష్వాకు రా
జును తారాపథమం దధోముఖునిగాఁ జూపట్టగా నుంచుచున్
ఘననాకమ్మున నున్న భావన వెలుంగన్ నిల్వుమా యంచుఁ; ద
న్మునివంద్యున్ నుతియించుచున్ జనిరి సమ్మోదించి దేవాదులున్. 497

61. శునశ్శేపుని వృత్తాంతము

పశ్చిమాయాం విశాలాయాం పుష్కరేషు మహాత్మనః।
సుఖం తప శ్చరిష్యామః పరం తద్ధి తపోవనమ్॥ {1.61.3}
అంబరీష ఇతి ఖ్యాతో యష్టుం సముపచక్రమే॥ {1.61.5}
తస్య వై యజమానస్య పశు మింద్రో జహార హ। {1.61.6}
ప్రాయశ్చిత్తం మహద్ధ్యేత న్నరం వా పురుషర్షభ।
ఆనయస్వ పశుం శీఘ్రం యావత్ కర్మ ప్రవర్తతే॥ {1.61.8}

❈ ఓ రఘురామా! సురాసురులు ఋషులు వెళ్లిపోయిన తరువాత విశ్వామిత్రుడు మునివరులను చూచి “ఓ మునులారా! దక్షిణదిక్కున తపస్సునకు ఆటంకం కలిగినదని ఆ దిక్కును వదలి పడమటి దిక్కున పుష్కరతీర్థంలో తపస్సు చేసెదను” అని పలికి నిష్ఠాగరిష్ఠుడై తన తపోదీక్షను మరలా మొదలుపెట్టినాడు. అదే సమయంలో అయోధ్యాధిపతి యగు అంబరీషుడు అశ్వమేధయాగం చేయసాగినాడు. అతని యజ్ఞాశ్వమును ఇంద్రుడు అపహరించగా యజ్ఞమును నిర్వహించు విప్రోత్తముడు అంబరీషుని చూచి “ఓ రాజా! అశ్వము కొఱకు వెతికించండి. అది దొరకనిచో అశ్వమునకు బదులుగా ఒక నరుని తీసికొనిరండి” అని పలికినాడు.

మ. అమరాదుల్ చన గాధిజుండు “మునులారా! దక్షిణమ్మందు నా
కమరెన్ విఘ్నము గానఁ, బశ్చిమదిశన్ యత్నింతు నా దీక్ష ను
త్తమమౌ పుష్కరతీర్థసీమలఁ, దపోధామంబు నత్యుత్తమం
బమరున్, జేసెదఁ దీవ్రమౌ తపము నే నచ్చోటనే నిష్ఠతో” 498

తే.గీ. అనుచు నేగుచుఁ బుష్కరవనముఁ జేరి
ఘనతప మ్మొనరింపంగ గాధిజు డట
ధార్మికుండయోధ్యావసుధాతలేశు
డంబరీషుం డచటఁ దోచె యజ్ఞనియతి. 499

తే.గీ. అంబరీషుడు యజ్ఞమ్ము నాచరింప
యజ్ఞపశువును వాసవుం డపహరించెఁ,
బశువు దొరకనిచో నరపశువునైన
వెదకి కొనితెమ్మనెన్ నృపు విప్రవరుడు. 500

ఉపాధ్యాయవచః శ్రుత్వా స రాజా పురుషర్షభః।
అన్వియేష మహాబుద్ధిః పశుం గోభిః సహస్రశః॥ {1.61.9}
గవాం శతసహస్రేణ విక్రీణీషే సుతం యది॥ {1.61.13}
పశో రర్థే మహాభాగ కృతకృత్యోఽస్మి భార్గవ।
సర్వే పరిసృతా దేశా యాజ్ఞీయం న లభే పశుమ్॥ {1.61.14}
దాతు మర్హసి మూల్యేన సుత మేక మితో మమ। {1.61.15}

❈ ఓ రఘురామా! "యజ్ఞాశ్వమును వెతికించండి. లేనిచో పశువునకు బదులు నరపశువును తీసికొనిరండి" అని అనిన ఋత్విక్కు మాటలను విని అంబరీషుడు ఒక నరుని తెచ్చుటకు అన్ని దేశములు తిరిగి ఋచీకుడు అను సాధువును చేరినాడు. "ఓ ఋచీకుడా! నా యజ్ఞపశువు మాయమై కనిపించనందున బదులుగా నరుని తీసికొనిరమ్మని ఋత్విక్కు తెలిపినాడు. నీవు నీ కుమారులలో ఒకరిని నాకు ఇచ్చి సహాయపడినచో నీకు లక్ష గోవులను ఇచ్చెదను" అని అంబరీషుడు ఆ భార్గవుని వేడినాడు.

ఉ. శ్రీయుతు డంబరీషు డటు ఋత్విజు వాక్కుల నాలకించుచున్
ధీయుతుడౌచు నొక్క నరుఁ దెచ్చుటకై చనె, నన్ని దేశముల్
రోయుచు నొక్కచో గనియె రూఢి ఋచీకునిఁ బుత్రవంతునిన్,
"సాయముఁ జేయ గోవుల నొసంగెద" నంచును గోరె తత్సుతున్. 501

చం. "క్రతువును జేయ మాయమయి కానగరాదు పశూత్తమంబు, నీ
వతులితరీతి యజ్ఞపశువంచుఁ గుమారకు నీయ నొక్కనిన్
హితమని లక్షధేనువుల నిచ్చెదఁ గైకొనుమయ్య! శిష్యపూ
జిత!" యని యంబరీషుడు ఋచీకుని వేడెను దీనభావనన్. 502

శునశ్శేఫః స్వయం రామ మధ్యమో వాక్య మబ్రవీత్॥ {1.61.20}
పితా జ్యేష్ఠ మవిక్రేయం మాతా చాహ కనీయసమ్।
విక్రీతం మధ్యమం మన్యే రాజన్ పుత్రం నయస్వ మామ్॥ {1.61.21}
అంబరీషస్తు రాజర్షీ రథ మారోప్య సత్వరః।
శునశ్శేఫం మహాతేజా జగామాఽఽశు మహాయశాః॥ {1.61.23}
పుష్కరక్షేత్ర మాగమ్య విశ్వామిత్రం దదర్శ హ॥ {1.62.2}

❊ ఓ రఘురామా! "యజ్ఞపశువునకు బదులుగా నరపశువును తీసికొని వెళ్లుటకు వచ్చినాను" అని అంబరీషుడు ఋచీకునికి చెప్పి "నీ కుమారులలో ఒకరిని నాకు యజ్ఞపశువుగా ఇవ్వండి" అని అడుగగా తండ్రి ఋచీకుడు తనకు ఇష్టమైన పెద్దకుమారుని ఇవ్వజాలనని అన్నాడు. తల్లి సత్యవతి తనకు ఇష్టమైన చిన్నకుమారుని ఇవ్వజాలనని తెలిపినది. అప్పుడు ఋచీకుని మధ్యమకుమారుడగు శునశ్శేఫుడు తన తల్లిదండ్రులకు తాను ఇష్టమైనవాడిని కాను అని భావించి బాధపడి అంబరీషునివెంట వెళ్లుటకు సిద్ధపడి తనను నరపశువుగా తీసికొని వెళ్లమని అడిగినాడు. అంబరీషుడు ఋచీకునికి లక్షగోవులనిచ్చి శునశ్శేఫుని రథముపై ఎక్కించుకొని తన అయోధ్యానగరమునకు బయలుదేరి దారిలో మధ్యాహ్నసమయమున పుష్కరసీమలో విశ్రాంతికొఱకు ఆగినాడు. అప్పుడు శునశ్శేఫుడు అచ్చట తపస్సుచేయుచుండిన తన మేనమామయగు విశ్వామిత్రుని చూచి తనను రక్షింపవలసినదిగా కోరినాడు.

తే.గీ. తనయు జ్యేష్ఠుని విడజాల ననియెఁ దండ్రి
యాత్మజుఁ గనిష్ఠు విడజాల ననియెఁ దల్లి
మది కలగ శునశ్శేఫుడు మధ్యముండు
"నన్ను గొనిపొ" మ్మనెన్ వేగ నరపశువుగ. 503

తే.గీ. కొనెను ముని లక్షగోవులన్ దనయు నొసగి
కొనె శునశ్శేఫు మధ్యమున్ గోరి నృపతి
యంబరీషుడు రథమునం దతని నిలిపి
చనుచుఁ బుష్కరసీమ విశ్రాంతిఁ గొనియె. 504

తే.గీ. ఆ శునశ్శేపు డపుడు మధ్యాహ్నవేళఁ
బుష్కరక్షేత్రదీక్షను బూనియున్న
మేనమామ విశ్వామిత్ర మౌనివరునిఁ
జేరి యంకముఁ జేరి "రక్షింపు" మనియె. **505**



62. అంబరీషుని యజ్ఞపరిసమాప్తి

న మేఽస్తి మాతా న పితా జ్ఞాతయో బాంధవాః కుతః॥ {1.62.4}
త్రాతు మర్హసి మాం సౌమ్య ధర్మేణ మునిపుంగవ। {1.62.5}
రాజా చ కృతకార్యః స్యా దహం దీర్ఘాయు రవ్యయః।
స్వర్గ లోక ముపాశ్నీయాం తప స్తప్త్వా హ్యనుత్తమమ్॥ {1.62.6}
తస్య తద్వచనం శ్రుత్వా విశ్వామిత్రో మహాతపాః।
సాంత్వయిత్వా బహువిధం పుత్రా నిద ముువాచ హ॥ {1.62.8}

❊ ఓ రఘురామా! శునశ్శేఫుడు తన మేనమామను చూచి శరణు వేడుచు "ఓ మహర్షీ! నాకు తల్లి లేదు. తండ్రి లేడు. జ్ఞాతులు బంధువులు కూడా లేరు. నేను నీ పాదమును చేరినాను. నాకు సమస్తమూ నీవే. నీకు మేనల్లుడనగు నన్ను కాదనకుండా తండ్రి వలె కాపాడుము. నీ తపశ్శక్తిచే అంబరీష మహారాజు యొక్క యజ్ఞము సఫలమగునట్లు చేయుము. నన్ను దీర్ఘాయుష్మంతునిగా చేయుము. నేను స్వర్గమును పొందునట్లు చేయుము" అని ఆర్తితో వేడుకొనగా తన మేనల్లుని విన్నపాన్ని ఆలకించిన విశ్వామిత్రుడు దయగలవాడై తండ్రి వలె శునశ్శేఫుని ఓదార్చినాడు. తన కుమారులను పిలిచి అతని గుఱించి చెప్పసాగినాడు.

ఉ. లేదిల నాకు తల్లి, మరి లేడిలఁ దండ్రియు నెంచిచూడగా,
లేదిల జ్ఞాతిసంతతియు, లేదిల బంధు సమూహ మెచ్చటన్,
నీదు పదమ్ముఁ జేరితిని, నీవె సమస్తము మౌనిసత్తమా!
కాదనకుండ తండ్రి వలెఁ గావుమ! సత్కృప, నీకు నల్లుడన్. 506

తే.గీ. "రాజు యజ్ఞమ్ము సఫలమై రాజిలునటు,
లల్లుడన్ నేను దీర్ఘాయువందునట్లు,
నమల తపమున నే స్వర్గ మందునట్లు,
చేయుమా మీ తపశ్శక్తిచే మునీంద్ర!" 507

తే.గీ. ఆర్తితో నా శునశ్శేపు డటులఁ బలుక,
వినెను మామ విశ్వామిత్ర మునివరుండు
తండ్రి వలె వాని నోదార్చి దయ వెలార్చి
యాత్మజులఁ బిల్చి మనసార ననియె నిటుల. 508

యత్కృతే పితరః పుత్రాన్ జనయంతి శుభార్థినః।
పరలోకహితార్థాయ తస్య కాలోఽయ మాగతః॥ {1.62.9}
అయం మునిసుతో బాలో మత్తః శరణ మిచ్ఛతి।
అస్య జీవితమాత్రేణ ప్రియం కురుత పుత్రకాః॥ {1.62.10}
పశుభూతా నరేంద్రస్య తృప్తి మగ్నేః ప్రయచ్ఛత॥ {1.62.11}
నాథవాంశ్చ శునశ్శేఫో యజ్ఞ శ్చాఽవిఘ్నితో భవేత్।
దేవతా స్తర్పితాశ్చ స్యు ర్మమ చాపి కృతం వచః॥ {1.62.12}

❈ ఓ రఘురామా! విశ్వామిత్రుడు శునశ్శేపుని విషయమును తన కుమారులకు వివరిస్తూ "ఓ పుత్రులారా! పరలోక సుఖమునుకోరి తండ్రులు తమకు పుత్రులు కలగాలని కోరుకొంటారు. మీరు తండ్రినైన నాకు సంతోషం కలిగించేందుకొఱకు నా మాటలు వినండి. దీన పరిస్థితిలో ఉన్న ఈ శునశ్శేపుడు తన ప్రాణములను నిలుప వలసినదిగా నన్ను శరణు కోరినాడు. ఇతని ప్రాణములను కాపాడుట కొఱకు మీలో ఎవరో ఒకరు ఇతనికి బదులుగా యజ్ఞపశువుగా అంబరీష మహారాజువెంట వెళ్ళండి. అప్పుడు ఏ కొఱత లేకుండా యజ్ఞము పూర్ణఫలమును ఇస్తుంది. దేవతలు సంతోషపడగలరు. ఈ బాలుడు ప్రాణములతో బ్రతుకగలడు. నేను ఇతనికిచ్చిన అభయవాక్కు సత్యము కాగలదు " అని పలికినాడు.

మ. "పరలోకమ్మున మేలు నొందవలెనన్ భావమ్ముతోఁ దండ్రు లె
ల్లరుఁ బుత్రావళి నొందుచుందు రిలఁ దల్లక్ష్యమ్ము సిద్ధింప, మీ
రరుదౌ రీతుల నాదు మాట వినుడీ! హర్షమ్ముఁ జేకూర్చుడీ!
గురుభక్త్యున్నతి పుత్రులార!" యనె సంకోచమ్ముఁ బోనాడుచున్. 509

శా. “చేరెన్ నన్ శరణమ్మటంచిదె శునశ్శేపుండు దీనాత్ముడై,
కోరెన్ బ్రాణము నిల్పుమా యనుచు, మీకున్ దెల్పుచుంటిన్, గృపన్
మీరల్ వీనికిఁ బ్రాణముల్ నిలుపనౌ, మీలో నొకం డీ నృపున్
జేరన్ బొందు సవమ్మునన్ బశువుగా, జీవించు నీ బాలుడున్. 510

శా. మీలో నొక్కడు రాజు వెంటఁ జనినన్ మేలౌ, సవమ్మచ్చటన్
లీలన్ బూర్ణఫలమ్ము నిచ్చుఁ గొఱతల్ లేకుండ పోవున్ గదా
బాలుం డీతడు నాథవంతుడగుచున్ భద్రమ్ము నందున్, సురల్
మేలున్‌గూర్తురు, నాదు వాక్కు ఋతమై మించున్‌జగచ్ఛ్రేయమై” 511

కథ మాత్మసుతాన్ హిత్వా త్రాయసేఽన్యసుతం విభో।
అకార్య మివ పశ్యామః శ్వమాంస మివ భోజనే॥ {1.62.14}
శ్వ మాంసభోజిన స్సర్వే వాసిష్ఠా ఇవ జాతిషు
పూర్ణం వర్షసహస్రం తు పృథివ్యా మనువత్స్యథ॥ {1.62.17}
ఇమే తు గాథే ద్వే దివ్యే గాయేథా మునిపుత్రక।
అంబరీషస్య యజ్ఞేఽస్మిం స్తత స్సిద్ధి మవాప్స్యసి॥ {1.62.20}

❀ ఓ రఘురామా! “శునశ్శేపునికి బదులుగా యజ్ఞపశువుగా ఒకరు వెళ్లండి” అని విశ్వామిత్రుడు పలుకగా మధుష్యందుడు మొదలుగాగల ఆ మునిపుత్రులు బాధపడి “ఓ తండ్రీ! ఇతరుల కుమారుని బ్రతికించుటకొఱకు స్వంత కుమారుని చంపుకొనదలచుటను మేము ఎక్కడనూ వినలేదు. మీరు ఇట్లు అకార్యమును చేయదలచుట న్యాయమేనా?” అని అంటూ తండ్రిమాటను తిరస్కరించినారు. అందులకు కౌశికుడు ఉగ్రుడై “ఓ కుమారులారా! మీరు వశిష్ఠునిపుత్రులవలె ధర్మవిహీనులై పాపములను మూటగట్టుకొని వేయి సంవత్సరములపాటు కష్టపడుదురు గాక!” అని శపించినాడు. తనను ఆశ్రయించిన వానిని రక్షింపదలచినవాడై “ఓ శునశ్శేపుడా! నీకు రెండు గాథాస్తోత్రములను చెప్పెదను. నీవు రాజుతో వెళ్లి యజ్ఞవాటిక దగ్గఱ రక్తవస్త్రములను ధరించినవాడవై

అగ్నిదేవునికి నమస్కరించి ఈ రెండుగాథలను గానంచేయి. నీ కోరిక సిద్ధించగలదు” అని గాథలను ఉపదేశించినాడు.

మ. జనకుం డట్లు వచింపగా విని మధుష్యందాది తత్పుత్రకుల్
“జనకా! అన్యసుతార్థమై నిజసుతున్ జంపంగ భావించుటల్
వినలే దెక్కడ, నిట్లకార్యమును గావింపంగ న్యాయమ్మొకో?
యనుచున్ వారు తిరస్కృతిన్ బలుకగా నా కౌశికుం దుగ్రుడై” 512

మ. “వ్యతిరేకించుచుఁ బుత్రు లట్లనగ, దీప్తక్రోధతామ్రాక్షుడై
సుతులారా! యిదె ధర్మహీనులగుచున్, శోకమ్ముఁ జేకూర్చు పా
పతతిన్ బొందుడు వేయివర్షములు తద్వాసిష్ఠులన్ బోలి, యా
శ్రితు రక్షించెద” నంచు గాచెను శునశ్శేపున్ స్వవాక్యార్థమై. 513

మ. “స్థిరమౌ జీవిత మిత్తు నీ కిదె శునశ్శేఫా! సుగాథాద్వయిన్
గరుణన్ జెప్పెద, రాజుతోడఁ జన నీ కామ్యమ్ము సిద్ధించెడిన్,
వరపాశమ్ముల రక్తమాల్యముల యూపస్తంభమున్ జేరి నీ
కరముల్ మోడ్చుచు నగ్ని గొల్వుము మహద్గాథాద్వయిన్ బాడుచున్”

పశుం రక్తాంబరం కృత్వా యూపే తం సమబంధయత్॥ {1.62.24}
స బద్ధో వాగ్భి రగ్ర్యాభి రభితుష్టావ తౌ సురౌ। {1.62.25}
తతః ప్రీత స్సహస్రాక్షో రహస్యస్తుతితర్పితః
దీర్ఘ మాయు స్తదా ప్రాదాత్ శునఃశేఫాయ రాఘవ॥ {1.62.26}
స చ రాజా నరశ్రేష్ఠ యజ్ఞస్య చ సమాప్తవాన్।
ఫలం బహుగుణం రామ సహస్రాక్షప్రసాదజమ్॥ {1.62.27}

❀ ఓ రఘురామా! విశ్వామిత్రుడు శునశ్శేఫుని కాపాడదలచి రెండు గాథాస్తోత్రములను ఉపదేశించినాడు. శునశ్శేఫుడు అంబరీషుని చూచి “రాజా! ఇక మనము యజ్ఞవాటికకు బయలుదేరెదము” అని అనగానే రాజు త్వరగా అయోధ్యకు చేరినాడు. సత్యవతియొక్క మధ్యమ కుమారుడగు శునశ్శేఫుడు

యజ్ఞపశువుగా ఉండుటచే రక్తవర్ణవస్త్రములను ధరించి పాశములచే బంధింపబడినవాడై రెండు గాథలను పఠిస్తూ ఇంద్రుని స్తుతించినాడు. సంతృప్తి చెందిన హరిహయుడు ఋచీకముని యొక్క పుత్రుని మెచ్చుకొని అతనికి చిరాయువును ప్రసాదించినాడు. అమరత్వము కూడా ఇచ్చినాడు. అంబరీషుని యజ్ఞము సఫలీకృతమగునట్లు అనుగ్రహించినాడు. అంతట కౌశికుడు మరల తపస్సు చేయడం ప్రారంభించినాడు.

మ. అనుచున్ గాథలఁ దెల్పఁ గౌశికుడు, దివ్యంబంచు నా మధ్యముం
డనుచున్ బార్థివు నంబరీషుఁ గని "రాజా! యజ్ఞకార్యార్థమై
చనగా నొప్పు" ననన్, నృపాలకుడు హర్షమ్మందుచున్ యజ్ఞసీ
మను జేరెన్, మొదలయ్యెఁ దత్క్రతు వసామాన్యంబుగా వైళమే. 515

చం. వరమని రక్తమాల్యముల వర్తిలె సత్యవతీకుమారకుం
డిరవుగ పాశబంధములు నేర్పడ యజ్ఞపశుత్వభావనన్,
సురపతి నా యుపేంద్రుని విశుద్ధిగ స్తోత్ర మొనర్చ గాథలన్,
హరిహయు డిచ్చె నంతటఁ జిరాయువు నా మునిపుత్రు మెచ్చుచున్. 516

తే.గీ. దేవపతి యింద్రు డట్లు సంతృప్తి నొందఁ,
బ్రాణములతో శునశ్శేపు డమరుడయ్యె,
నంబరీషుని యజ్ఞకార్యము ఫలించెఁ,
గౌశికుండు తపముఁ జేయఁ గడగె మరల. 517



63. మేనక కారణంగా విశ్వామిత్రునికి తపోభంగము విశ్వామిత్రుడు మహర్షి యగుట

అబ్రవీత్ సుమహాతేజా బ్రహ్మా సురుచిరం వచః।
ఋషి స్త్వమసి భద్రం తే స్వార్జితైః కర్మభిః శుభైః॥ {1.63.2}
అప్సరః స్వాగతం తేఽస్తు వస చేహ మమాశ్రమే॥ {1.63.6}
తస్యాం వసంత్యాం వర్షాణి పంచ పంచ చ రాఘవ। {1.63.7}
మేనకాం మధురై ర్వాక్యై ర్విసృజ్య కుశికాత్మజః।
ఉత్తరం పర్వతం రామ విశ్వామిత్రో జగామ హ॥ {1.63.13}

❄ ఓ రఘురామా! శునశ్శేపుని ప్రాణములను కాపాడిన విశ్వామిత్రుడు మరలా తపస్సును కొనసాగించినాడు. వేయి సంవత్సరముల తరువాత బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై "ఓ కౌశికుడా! నీవు ఋషివైనావు" అని దీవించి వెళ్లినాడు. సంతృప్తిని పొందని విశ్వామిత్రుడు మరల తీవ్రమైన తపస్సును చేయుచుండగా అప్సరస మేనక పుష్కరతీర్థంలో జలకాలాడుతూ మనోజ్ఞమైన రూపంతో కనిపించింది. ఆమెను చూచి మోహించిన గాధిజుడు "ఓ మేనకా! నా మదనతాపమును తీర్చు" అని వేడగా మేనక అంగీకరించింది. ఒక దశాబ్దంపాటు మేనకతో సుఖంగా కాలక్షేపం చేసిన విశ్వామిత్రుడు తాను చేసిన పొరపాటును తెలిసికొని సిగ్గుపడ్డాడు. ముని శపిస్తాడేమో అని మేనక భయపడింది. తన తపోభంగమును గుర్తించిన కౌశికుడు మరల హిమాలయంపై తపస్సును ప్రారంభించినాడు.

తే.గీ. వేయి సమములు తపముఁ గావింప, నంత
బ్రహ్మదేవుడు విచ్చేసె వరము నొసగ,
"ననఘ! కౌశిక! ఋషివైతి" వనుచుఁ బలికి
దీవెనలఁ గూర్చి తా నేగెఁ ద్రిదివమునకు. 518

చం. మరల మహత్తపమ్ము నసమానుడు కౌశికు డాచరింపగాఁ
బరమ మనోజ్ఞ రూపమున వచ్చెను మేనక, పుష్కరమ్మునన్
గర మనురక్తి నుండి జలకమ్ముల నాడుచునుండఁ జూచి, "సుం
దరి! మదనాగ్ని వేగు నను దన్పు" మటంచును గౌశికుం డనెన్. 519

ఉ. మేనక వల్లె యంచట రమించెను దన్మునితో దశాబ్ద, మా
చానను గూడుటన్ దపము సర్వము నాశము నొంద, సిగ్గుతో
మౌనివరుండు చింతిలగ, మానిని మ్రొక్కెను భీతి, నంత నా
మేనక వీడి గాధిజుడు మేలు దలంచి చనెన్ హిమాద్రికిన్. 520

స కృత్వా నైష్ఠికీం బుద్ధిం జేతుకామో మహాయశాః।
కౌశికీతీర మాసాద్య తపస్తేపే దురాసదమ్॥ {1.63.14}
మహర్షే స్వాగతం వత్స తపసోగ్రేణ తోషితః।
మహత్త్వ మృషిముఖ్యత్వం దదామి తవ కౌశిక॥ {1.63.18}
త మువాచ తతో బ్రహ్మా న తావత్త్వం జితేంద్రియః।
యతస్వ మునిశార్దూల ఇత్యుక్త్వా త్రిదివం గతః॥ {1.63.22}

❋ ఓ రఘురామా! విశ్వామిత్రుడు మేనకను వదలివేసి ఉత్తరదిక్కున తన సోదరియైన సత్యవతి నదీరూపమున ప్రవహించుచుండగా ఆ కౌశికీనదీతీరంలో జితేంద్రియనిష్ఠతో ఘోరతపస్సును చేయసాగినాడు. కౌశికుని తపస్సునకు భయపడిన దేవతలు బ్రహ్మను చేరి "ఓ పితామహా! ఆ గాధిజుని తపస్సునకు మెచ్చి అతనికి మహర్షి పదవిని అనుగ్రహించండి" అని వేడుకొన్నారు. అప్పుడు విరించి కౌశికునికి ప్రత్యక్షమై "ఓ గాధిసుతా! నీవు మహర్షి పదమును సాధించినావు" అని పలుకగా కౌశికుడు "ఓ పరమేష్ఠీ! నేను జితేంద్రియుడనుగా అయినాను కదా" అని అడిగినాడు. అందులకు బ్రహ్మ "ఓ మహర్షీ! నీవు జితేంద్రియుడవు అయ్యేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నం చేయి" అని తన లోకానికి వెళ్లిపోయినాడు.

తే.గీ. ఉత్తరాద్రికిఁ జని కని యుత్సుకతను
కౌశికీ నదీతీర ప్రదేశమందు
నియతి తోడ జితేంద్రియ నిష్ఠ తోడ
ఘోరతప మాచరించెను గుశికసుతుడు. 521

మ. భయదంబైన తపమ్ముఁ గాంచిన సురల్ బ్రహ్మన్ మదిన్ గొల్చుచున్
"దయతో నీతనికిన్ మహర్షి పదమున్ ధాతా! యొసంగుం" డనన్,

"జయమో గాధిసుతా! మహర్షి పదమున్ సాధించినా" వంచు ని
ర్ణయమున్ దెల్పగ బ్రహ్మ, కౌశికు డిటుల్ ప్రశ్నించె లోకేశునిన్. 522

మ. "పరమేష్ఠీ! ప్రణతుల్ మహర్షి పదమున్ బాత్రమ్ముగా నందితిన్
స్థిరబుద్ధిన్ విజితేంద్రియుండనె గదా తెల్పుం" డనన్, ధాత "భా
సుర మౌనీంద్ర! జితేంద్రియత్వమునకై శుద్ధాంతరంగమ్మునన్
సరిగా యత్నము చేయుమయ్య!" యని స్వస్థానమ్ము జేరన్ జనెన్. 523


ఘర్మే పంచతపా భూత్వా వర్షా స్వాకాశసంశ్రయః।
శిశిరే సలిలస్థాయీ రాత్ర్యహాని తపోధనః॥ {1.63.24}
సుర కార్య మిదం రంభే కర్తవ్యం సుమహత్త్వయా।
లోభనం కౌశిక స్యేహ కామమోహసమన్వితమ్॥ {1.64.1}
అయం సురపతే ఘోరో విశ్వామిత్రో మహామునిః।
ఘోర ముత్స్రృజ్యతే క్రోధం మయి దేవ న సంశయః॥ {1.64.3}

❊ ఓ రఘురామా! బ్రహ్మదేవుడు విశ్వామిత్రునికి మహర్షి పదమును అనుగ్రహించి వెళ్లగా సంతృప్తి చెందని కౌశికుడు మరల ఘోరతపస్సును చేయసాగినాడు. చలికాలంలో నీటిమధ్యలో ఉండి, మండుటెండలలో పంచాగ్నుల మధ్య ఉంటూ, వర్షములలో తడుస్తూ వాయుభక్షకుడై వేయిసంవత్సరాలు తపస్సు చేసినాడు. గాధిజుని ఘోరతపస్సును చూచి దేవతలు భయపడినారు. కౌశికుని తపస్సును భంగపరచుటకు ఇంద్రుడు సుందరీమణియగు రంభను పంపదలచినాడు. "కౌశికుడు కోపంతో నన్ను శపిస్తాడేమో? ఆ ముని వద్దకు నన్ను పంపడం న్యాయమేనా" అని రంభ ఇంద్రుని ప్రశ్నించినది.

తే.గీ. శిశిరమందున జలమునఁ జేరియుండి,
మండుటెండలఁ బంచాగ్నిమధ్యముదయి,
వర్షములు బడఁ దడిసి, తపమ్మొనర్చె
వాయుభక్షకుడై వేయివత్సరములు. 524

చం. అరుదగురీతి ఘోరతప మట్లొనరింపగ గాధిసూను, డా
సురపతి దేవతల్ మునులు చూచి భయంపడినారు, దేవసుం
దరి యగు రంభఁ బిల్చి "వసుధన్ ఘన కౌశికదీక్ష భగ్నమై
సురలకు మేలు గల్గునటు చూడు" మనెన్ బురుహూతు డయ్యెడన్. **525**

మ. కమనీయంబగు రూపసంపదల నీ కర్తవ్యమున్ సల్పుమా
యమరుల్ మెచ్చ ననంగ, రంభ యనె నిట్లా వాసవున్ జూచి "యో
యమరాధీశ్వర! కౌశికుండు ఘనకోపావేశబద్ధుండు శా
పము నీయన్ వెనుకాడడయ్య! ననుఁ బంపన్ జెల్లునే నిర్దయన్. **526**



64. విశ్వామిత్రుడు రంభను శపించుట

కోకిలో హృదయగ్రాహీ మాధవే రుచిరద్రుమే।
అహం కందర్పసహితః స్థాస్యామి తవ పార్శ్వతః॥ {1.64.6}
సా శ్రుత్వా వచనం తస్య కృత్వా రూప మనుత్తమమ్।
లోభయామాస లలితా విశ్వామిత్రం శుచిస్మితా॥ {1.64.8}
సహస్రాక్షస్య తత్కర్మ విజ్ఞాయ మునిపుంగవః
రంభాం క్రోధసమావిష్ట శ్శశాప కుశికాత్మజః॥ {1.64.11}

❃ ఓ రఘురామా! తపస్సును భంగము చేయుటకు కౌశికునివద్దకు వెళ్ళజాలనని రంభ దీనముగా పలుకుచుండగా ఇంద్రుడు "ఓ రంభా! కౌశికుడు శపించునని అనుమానించవద్దు. నీకు తోడుగా అచ్చట మన్మథుడు కూడా ఉండగలడు. వసంత ఋతువును కల్పించి నేను కోకిలరూపంలో ఉండగలను. నీవు నీ నాట్యంతో కౌశికుని మోహపరవశునిగా చేయుము" అనినాడు. అలాగే అని రంభ కౌశికుని తపోవనమునకు వెళ్లి మనోహరంగా నాట్యం చేయసాగినది. తపోవనంలో అకస్మాత్తుగా వసంతం వచ్చింది. కోకిల కూసింది. మన్మథుడు పూలబాణాలను ప్రయోగించినాడు. అన్నింటినీ విశ్వామిత్రుడు గమనించినాడు. ఇది అంతా దేవమాయ అని సందేహపడినాడు. కోపంతో రంభకు శాపాన్ని ఇచ్చినాడు.

మ. అని దీనమ్మృగ రంభ తెల్ప మఘవుం డా రంభతోఁ బల్కె "నీ
వనుమానింపకు, మన్మథుం డచట నెయ్యంబూని వర్తించెడిన్
గనుమా, నే నినదింతుఁ గోకిలగ సంకల్పింతు వాసంతమున్,
మునికిన్ మోదముఁ గూర్చు మందములతో మోహాబ్ధిలో ముంచుచున్"

తే.గీ. వాసవుని మాట విని రంభ వల్లె యనియెఁ
బ్రజ్ఞఁ జూపఁ గౌశికు తపోవనికిఁ జనియెఁ
బుష్పబాణుండు కనుడు నైపుణ్య మనియె
రేప శక్రుండు కోకిలరూపుఁ గొనియె. 528

తే.గీ. ఘనుడు సంయమి కోకిలస్వనము వినియె
అప్సరసయైన రంభ నాట్యమును గనియె
దేవకార్య మిది యని సందేహపడియె
వంచకీ! రంభ! యనుచు శాపమ్ము నిడియె. 529

యన్మాం లోభయసే రంభే కామక్రోధజయైషిణమ్।
దశవర్షసహస్రాణి శైలీ స్థాస్యసి దుర్భగే॥ {1.64.12}
బ్రాహ్మణ స్సుమహాతేజా స్తపోబలసమన్వితః।
ఉద్ధరిష్యతి రంభే త్వాం మత్క్రోధకలుషీకృతామ్॥ {1.64.13}
తస్య శాపేన మహతా రంభా శైలీ తదాఽభవత్।
వచః శ్రుత్వా చ కందర్పో మహర్షేః స చ నిర్గతః॥ {1.64.15}

❋ ఓ రఘురామా! దేవమాయను గ్రహించిన విశ్వామిత్రుడు రంభను చూచి "ఓ వంచకీ! కామక్రోధములను జయించుటకు నిశ్చయించుకొన్న నన్ను మోహానికి గురిచేయాలని వచ్చినావా! నీవు పదివేలయేండ్లపాటు శిలగా పడియుండుము" అని శపించినాడు. "కాలక్రమమున తపోధనుడైన వసిష్ఠుడు నీ శాపాన్ని తొలగించడానికి రాగలడు. అప్పుడు నీవు నీ నిజరూపాన్ని పొంది స్వర్గలోకానికి వెళ్లగలవు" అని శాపానుగ్రహమును తెలిపినాడు. రంభ రాయిగా మారిపోగా, ఇంద్రుడు-మన్మథుడు దేవలోకం చేరినారు. ఆ విధంగా కౌశికుని తపస్సు హరింపబడగా ఆ మహర్షి పశ్చాత్తాపాన్ని పొందినాడు.

తే.గీ. పూర్ణముగను గామక్రోధముల జయింప
బూను నన్ జేరినావు విమోహపరుప,
నిచట పదివేలయేండ్లు రాయిగ వసింపు"
మనుచు రంభను శపియించె మునివరుండు. 530

మ. శుభమున్ గూర్చు తపోధనాగ్రణి వసిష్ఠుం డాదరమ్మొప్ప నీ
కభయ మ్మిచ్చుచు శాపమున్ దొలగఁ జేయన్ వచ్చు, నో రంభ! సు
ప్రభతో నీదగు రూపమున్ గొని దివిన్ రాజిల్లు సద్వేళలో
విభవమ్మున్వరియించు ని"న్ననుచు దీవించెన్మునీంద్రుం డటన్. 531

తే.గీ. రంభ మునిశాపమున నట రాయి కాగ,
దేవపతి మన్మథుండును దివికిఁ జనగ,
ఋషి తపఃఫల మటుల హరింపఁ బడగ,
సుగతిఁ గనలేమి సంయమి దిగులు పడియె. 532

నైవ క్రోధం గమిష్యామి న చ వక్ష్యే కథంచన।
అథవా నోచ్ఛ్వసిష్యామి సంవత్సర శతాన్యపి॥ {1.64.17}
అథ హైమవతీం రామ దిశం త్యక్త్వా మహామునిః।
పూర్వాం దిశ మనుప్రాప్య తప స్తేపే సుదారుణమ్॥ {1.65.1}
ఇంద్రో ద్విజాతి ర్భూత్వా తం సిద్ధ మన్న మయాచత॥ {1.65.5}
తస్మై దత్త్వా తదా సిద్ధం సర్వం విప్రాయ నిశ్చితః। {1.65.6}

❋ ఓ రఘురామా! కోపంతో రంభను శపించి తపోబలమును కోల్పోయిన విశ్వామిత్రుడు విచారించినాడు. కోపాన్ని గెలవాలనే పట్టుదల పెరిగింది. ఏమైనాసరే ఇక బాధపడను. మాటలాడకుండా ఉంటాను. బ్రహ్మర్షి పదమును సాధిస్తాను అని వేయిసంవత్సరాలపాటు అహోరాత్రాలు తపస్సు చేయదలచినాడు. ఉత్తరదిక్కును వదలి తూర్పుదిక్కునకు వెళ్ళి నిరాహారుడుగా వెయ్యేండ్లపాటు ఘోరమైన తపస్సు చేసినాడు. ఆ తరువాత భోజనం చేసేందుకు సిద్ధమైనాడు. అప్పుడు ఇంద్రుడు ఒక బ్రాహ్మణుని వేషంలో వచ్చి అన్నం పెట్టమని అడుగగా తాను తినబోయే అన్నమును ప్రీతితో అతనికి ఇచ్చివేసినాడు.

శా. కోపమ్మున్ గెలువంగ పట్టుదల చేకూరన్, నిరాహారుడై
చేపట్టెన్ ఘనదీక్షఁ గౌశికమునిశ్రేష్ఠుం, "ఢికేమైన సం
తాపమ్మున్ గన, మాటలాడ" నని చింతన్ వీడి లక్ష్యార్థియై
రేపున్ మాపుఁ దపమ్మొనర్పఁ దలచెన్ బ్రీతిన్ బ్రశాంతమ్ముగన్. 533

తే.గీ. ఉత్తరము వీడి తూర్పున నుండి ఘోర
తపము సేయుచు వెయ్యేండ్ల తదుపరి ముని
భోజనముఁ దినఁ బోవగ భూసురుడుగ
వచ్చి వజ్రి యడుగ నన్న మిచ్చెఁ బ్రీతి. **534**



65. బ్రహ్మదేవుడు విశ్వామిత్ర మహర్షికి బ్రహ్మర్షిత్వమును ప్రసాదించుట

నిశ్శేషితేఽన్నే భగవా నభుక్త్వైవ మహాతపాః॥ {1.65.6}
న కించి దవద ద్విప్రం మౌనవ్రత ముపస్థితః।
అథవర్ష సహస్రం వై నచ్ఛ్వస న్మునిపుంగవః॥ {1.65.7}
తస్యాఽనుచ్ఛ్వసమానస్య మూర్ధ్ని ధూమో వ్యజాయత। {1.65.8}
తతో దేవా స్సగంధర్వాః పన్నగాసురరాక్షసాః। {1.65.9}
కశ్మలోపహతా స్సర్వే పితామహ మథాబ్రువన్॥ {1.65.10}

❈ ఓ రఘురామా! ఇంద్రుడు బ్రాహ్మణుని రూపంలో వచ్చి అన్నమును అడుగగా, విశ్వామిత్రుడు తాను తినదలచిన అన్నమును ఆ విప్రునికి దానముగా ఇచ్చి, మౌనంగా ప్రశాంతంగా ఉండి వేయి సంవత్సరాలపాటు గాలిని కూడా పీల్చకుండా దీక్షాబద్ధుడై ఉండగా, ఆ మహర్షియొక్క తలపై పొగలు వెలువడసాగినవి. ఆ ధూమరాశిని చూచి మూడులోకాలూ భయముతో కంపించసాగినవి. దేవతల ముఖములయందు కళలు తొలగిపోసాగినవి. ఇక అంతటా అగ్ని వ్యాపించగలదు అని భయపడిన దేవతలు దీనత్వంతో బ్రహ్మదేవుని చేరి తమను కాపాడవలసినదిగా వేడుకొనసాగిరి.

మ. తన యన్నమ్ము నొసంగె భూసురునికిన్ దానమ్ముగా తాను భో
జనమున్ మానుచు, మౌనమున్ గొని మనెన్ శాంతిన్ సహస్రాబ్దముల్,
ఘనుడై గాలియుఁ బీల్చ కుండెఁ గడు దీక్షన్; మౌని మూర్ధమ్మునన్
గనిపించెన్ ఘన ధూమరాశి, పెలుచన్ గంపించె ముల్లోకముల్. 535

తే.గీ. కౌశికుని మూర్ధమున వహ్ని గడలుకొనగ,
గనిన మేటి దేవాదులు కళలు తొలగ,
వహ్ని వ్యాపించు ననియెడి భయము కలుగ,
వేధ చెంతకు వెడలిరి వేడుకొనగ. 536

బహుభిః కారణై ర్దేవ విశ్వామిత్రో మహామునిః॥ {1.6510}
లోభితః క్రోధిత శ్చైవ తపసా చాభివర్ధతే।
న హ్యస్య వృజినం కించి ద్దృశ్యతే సూక్ష్మ మప్యథ। {1.65.11}
వ్యాకులాశ్చ దిశ స్సర్వా న చ కించిత్ ప్రకాశతే।
సాగరాః క్షుభితా స్సర్వే విశీర్యంతే చ పర్వతాః॥ {1.65.13}
ప్రకంపతే చ పృథివీ వాయు ర్వాతి భృశాకులః। {1.65.14}

❊ ఓ రఘురామా! కౌశికుని తపస్సునకు భయపడిన దేవతలు బ్రహ్మను చేరి "ఓ పితామహా! తపోదీక్షలో ఉన్న విశ్వామిత్రుడు ఇప్పుడు ఏమి జరిగిననూ కోపమును పొందుటలేదు. శాపమును ఇచ్చుటలేదు. జితేంద్రియుడుగా మెలగుచున్నాడు. బ్రహ్మర్షి పదమును కోరి కఠోరమైన తపోదీక్షను వహించినాడు. పాపపు ఆలోచనలను విడిచిపెట్టినాడు. పావనమనస్కుడై ఉన్నాడు. ఆ మహర్షి తపఃఫలము పెరుగుచున్నందున లోకములన్నీ భయపడుతూ బాధపడుచున్నవి. కాబట్టి నీవు అతడు కోరుచున్న బ్రహ్మర్షి పదవిని అతనికి ఇచ్చి మమ్ము కాపాడుము. ఆ విశ్వామిత్రుని తపోదీక్ష కారణంగా దిక్కులన్నీ తమ కాంతిని కోల్పోయినవి. సముద్రాలు ప్రశాంతతను వదలి ఉగ్రరూపాన్ని పొందుతున్నాయి. పర్వతాలు కూలిపోతున్నాయి. భూకంపాలు ఏర్పడుతున్నాయి. వాయుదేవుడు భయంకరంగా వీస్తున్నాడు. దేవతలందఱూ చింతాక్రాంతులై క్రుగ్గిపోతున్నారు. కాబట్టి నీవు ఆ కౌశికునికి ఏమి కావలెనో అడిగి దానిని అతనికి ఇచ్చి మమ్ము రక్షింపుము" అని వేడుకొనసాగినారు.

ఉ. "శాప మొసంగ డిప్పు, డనిశమ్ము జితేంద్రియుడై మెలంగెడిన్,
గోపము నందబోడు, తన కోర్కి ఫలింపగ దీక్షఁ బూనె, నే
పాపపుఁ జింత లేక కడుఁ బావనుడై తపమాచరింప, సం
తాపము నొందె లోకములు, తన్ముని వాంఛిత మిచ్చి ప్రోవుమా" 537

శా. కాంతిన్ వీడుచు వ్యాకులత్వ మమరన్ గన్పించెఁ దిగ్భాగముల్,
శాంతిన్ వీడుచు క్షోభనొందె నుదధుల్, శైలమ్ములున్ గూలె, వి
భ్రాంతిన్ భూమియుఁ గంపమొందె, జెలగెన్ వాతంబు కల్లోలమై,
చింతన్ గ్రుగ్గిరి దేవతాదులు, కృపన్ సేవింపనౌ గౌశికున్" 538

బ్రహ్మన్ నప్రతిజానీమో నాస్తికో జాయతే జనః॥ {1.65.14}
దేవరాజ్యం చికీర్షేత దీయతా మస్య యన్మతమ్॥ {1.65.17}
తత స్సురగణాః సర్వే పితామహపురోగమాః।
విశ్వామిత్రం మహాత్మానం మధురం వాక్య మబ్రువన్॥ {1.65.18}
బ్రాహ్మణ్యం తపసోగ్రేణ ప్రాప్తవానసి కౌశిక॥ {1.65.19}
దీర్ఘ మాయుశ్చ తే బ్రహ్మన్ దదామి సమరుద్గణః। {1.65.20}

❊ ఓ రఘురామా! కౌశికుని కఠోరతపోదీక్షకు భయపడిన దేవతలు బ్రహ్మను చేరి తమను కాపాడవలసినదిగా వేడుకొంటూ "ఓ పితామహా! లోకములోని ప్రజలు కర్మకాండలను చేయలేకపోతారని, నాస్తికులుగా మారిపోతారని సంశయం కలుగుతూ ఉన్నది. సృష్టిలోని స్థావరజంగమాలు భస్మం కాగలవు. కాబట్టి నీవు కౌశికుని వద్దకు వెళ్లి అతనికోరిక మేరకు అతనికి బ్రహ్మర్షి పదమును అనుగ్రహించి మాకు ఆనందాన్ని కలిగించు అని విన్నవించుకొన్నారు. దేవతల ప్రార్థనను విన్న బ్రహ్మ వారిని తోడ్కొని విశ్వామిత్రుని సమీపించి "ఓ మహర్షీ! నీకు బ్రహ్మర్షి పదము సిద్ధించినది. నీకు భాగ్యము దీర్ఘాయువు కలుగుగాక! నీ తపఃఫలము కీర్తి కల్పాంతము వఱకూ నిలిచియుండుగాక!" అని ఆశీర్వదించినాడు.

శా. మానెన్ లోకము కర్మకాండలను, బ్రహ్మా! చూడగా నాస్తిక
స్థానంబౌ నను సంశయమ్ము కలిగెన్, దథ్యమ్ముగా భస్మమౌ
నానాస్థావర జంగమావళియుఁ, గానన్ గౌశికున్ జేరి మా
కానంద మ్మగు రీతి నాతనికి బ్రహ్మర్షిత్వమున్ గూర్పుమా". 539

మ. అని దీనమ్ముగ దేవజాతు లజునిన్ బ్రార్థించి లోకేశుఁ దో
డ్కొని యా కౌశికుఁ జేర, బ్రహ్మ యనె "నీకున్ సిద్ధి చేకూరెఁ బా
వన! బ్రహ్మర్షి పదమ్ము నందితివి సౌభాగ్యమ్ము దీర్ఘాయువౌ,
కనుమా కౌశిక! నీ తపఃఫల మికం గల్పాంతసంస్థాయియౌ" 540

బ్రాహ్మణ్యం యది మే ప్రాప్తం దీర్ఘ మాయు స్తథైవ చ।
ఓంకారశ్చ వషట్కారో వేదాశ్చ వరయంతు మామ్॥ {1.65.22}
తతః ప్రసాదితో దేవై ర్వసిష్ఠో జపతాం వరః॥ {1.65.24}
సఖ్యం చకార బ్రహ్మర్షి రేవ మస్త్వితి చాబ్రవీత్।
బ్రహ్మర్షి స్త్వం న సందేహ స్సర్వం సంపత్స్యతే తవ॥ {1.65.25}
ఇత్యుక్త్వా దేవతా శ్చాపి సర్వా జగ్ము ర్యథాగతమ్। {1.65.26}

❊ ఓ రఘురామా! దేవతలతో విచ్చేసిన బ్రహ్మ విశ్వామిత్రునికి బ్రహ్మర్షి పదవిని అనుగ్రహింపగా, కౌశికుడు "ఓ పితామహా! నీ కృపతో వేదరాశి, ఓంకారము, వషట్కారము కూడా నన్ను వరించినచో నేను సంతోషపడగలను. బ్రహ్మర్షియైన వసిష్ఠుడు వచ్చి నన్ను బ్రహ్మర్షీ! అని పిలువవలెనని కోరుకొంటూ ఉన్నాను. నా కోరికను మన్నించండి" అని పలుకగా దేవతలు వసిష్ఠునికి కౌశికుని కోరికను విన్నవించినారు. అప్పుడు వసిష్ఠుడు గాధిజుని చూచి "ఓ కౌశికా! నీవు బ్రహ్మర్షివైనావు. ఇందులో ఎటువంటి సందేహమూ లేదు" అని ప్రశంసించినాడు. అప్పుడు విశ్వామిత్రుడు పూర్తిగా సంతృప్తి చెందినాడు. అంతట బ్రహ్మ దేవతలతో కూడి తనలోకమునకు బయలుదేరినాడు.

మ. అరుదౌ బ్రహ్మపదమ్ము నొందియును నీహన్ గౌశికుం డిట్లనెన్
"గరుణాళూ! నను వేదరాశియు వషట్కారమ్ము నోంకారమున్
వరియింపన్ముద మొందువాడ నజుడా! బ్రహ్మర్షి యంచున్ ననున్
వర బ్రహ్మర్షి వసిష్ఠుడున్ బిలువగా వాంఛింతు మన్నింపుమా!" 541

మ. పలుకంగా నటు కౌశికుండు, సురలున్ బ్రార్థింపగా, నిట్టులన్
బలుకం బూనె వసిష్ఠుడున్ ముదముతో "బ్రహ్మర్షి వైనావు నీ
కలయున్ బండెను సంశయమ్ము వలదింకన్ గౌశికా!" యంచుఁ, దా
నలరెన్ గాధిజు డంత బ్రహ్మ యరిగెన్ హర్షించు దేవాళితో. 542

ఏవం త్వనేన బ్రాహ్మణ్యం ప్రాప్తం రామ మహాత్మనా॥ {1.65.26}
ఏష రామ మునిశ్రేష్ఠ ఏష విగ్రహవాం స్తపః।

ఏష ధర్మపరో నిత్యం వీర్య స్త్యైష పరాయణమ్॥ {1.65.27}
ఏవ ముక్త్వా మహాతేజా విరరామ ద్విజోత్తమః।
శతానంద వచః శ్రుత్వా రామలక్ష్మణసన్నిధౌ॥ {1.65.27}
జనకః ప్రాంజలి ర్వాక్య మువాచ కుశికాత్మజమ్। {1.65.28}

❋ ఓ రఘురామా! కఠోరదీక్షతో బ్రహ్మర్షి పదమును సాధించిన ఈ విశ్వామిత్రుడు సిద్ధపురుషుడు. మునిశ్రేష్ఠుడు. విశ్వమున కంతటికీ మిత్రుడు. తపోవిగ్రహుడు. వీర్యవంతుడు. ధర్మపరుడు అని చెప్పి శతానందుడు కౌశికుని హృదయపూర్వకంగా ప్రశంసించినాడు. జనకుని పురోహితుడైన శతానందుడు ఆ విధంగా విశ్వామిత్రుడు బ్రహ్మర్షియైన విషయాన్ని రామలక్ష్మణుల సన్నిధిలో తెలుపగా అచ్చటనే ఉన్న జనకమహారాజు ఎంతో ఆసక్తితో ఆ విషయాన్ని వినినాడు.

తే.గీ. సిద్ధు డితడు రాఘవ! మునిశ్రేష్ఠతముడు
విశ్వమునకు మిత్రుడు తపోవిగ్రహుండు
తలపగా వీర్యవంతుండు ధర్మపరుడు"
నని శతానందు డా గాధిజుని నుతించె. 543

తే.గీ. అటుల నా కౌశికుండు బ్రహ్మర్షియైన
విధముఁ దెలుప శతానంద విప్రవరుడు;
వేడ్క జనకభూపతి దాని వినుచునుండె
రామలక్ష్మణ సన్నిధిన్ రక్తితోడ. 544

ధన్యోఽస్మ్యనుగృహీతోఽస్మి యస్య మే మునిపుంగవ॥ {1.65.29}
యజ్ఞం కాకుత్స్థసహితః ప్రాప్తవా నసి ధార్మిక।
పావితోఽహం త్వయా బ్రహ్మన్ దర్శనేన మహామునే॥ {1.65.30}
గుణా బహువిధాః ప్రాప్తా స్తవ సందర్శనా న్మయా। {1.65.31}
తృప్తి రాశ్చర్యభూతానాం కథానాం నాస్తి మే విభో। {1.65.34}
శ్వః ప్రభాతే మహాతేజో ద్రష్టు మర్హసి మాం పునః। {1.65.35}

❋ విశ్వామిత్రుడు బ్రహ్మర్షియైన విధమును శతానందుడు చెప్పగా వినిన జనకమహారాజు కౌశికుని చూచి ప్రశంసించి నమస్కరించి "ఓ బ్రహ్మర్షీ! మీరు మాకు శుభమును కలిగించుటకై సూర్యవంశీయులగు ఈ రాజకుమారులను మీతోపాటు ఈ మిథిలకు తీసికొనివచ్చినారు. మీరు వచ్చుటచే నా యజ్ఞము గుణవంతమైనది. పూజ్యపాదులగు మీ దర్శనంతో నేను శుభములను పొందినాను. ధన్యుడనైనాను. గుణవంతుడనైనాను. పవిత్రుడనైనాను. మీ సచ్చరిత్రను విన్నాను. బ్రహ్మతేజస్సుతో విరాజిల్లే మీ రూపాన్ని చూచినాను. భద్రముల నందినాను. శాంతిని పొందినాను. ఆశ్చర్యకరమైన మీ గాథను ఎంతగా విన్నా తృప్తి కలగడం లేదు. సాయంకాలమైనందున మనము రేపటి ఉదయమున మరల కలిసికొందము" అని విన్నవించినాడు.

చం. జనకుడు కౌశికున్ గని ప్రశంస యొనర్చి నమస్కరించుచున్,
"మునివర! నేను ధన్యుడను, పూజ్యులు మీరు శుభ మ్మొనర్పగా
నినకుల రాజనందనుల నీవిధిఁ దోడ్కొని వచ్చినారు, మ
న్ననమెయి నాదు జన్మము జనప్రగుణమ్ము నుతింప నౌనికన్. 545

ఉ. కంటి శుభమ్ము, ధన్యతను గంటిని, మీ వరదర్శనమ్ముచేఁ
గంటిని సద్గుణమ్ములను, గంటిఁ బవిత్రత, మీ చరిత్రమున్
వింటిని, బ్రహ్మతేజమున వెల్గుచునున్న భవత్స్వరూపమున్
గంటిని, మేటి భద్రముల గంటిని, శాంతిని గంటి గాధిజా!" 546

తే.గీ. కరము మీ గాథ ఆశ్చర్యకరము గానఁ
దృప్తి కలుగదు మనసున కెంత విన్న
సంయమీశ! సాయంకాల సమయమయ్యెఁ
బ్రొద్దుటఁ గలసికొందము పూజ్యపాద!" 547

ఏవ ముక్త్వా మునిశ్రేష్ఠం వైదేహో మిథిలాధిపః।
ప్రదక్షిణం చకారాఽఽశు సోపాధ్యాయ స్సబాంధవః॥ {1.65.37}

తతః ప్రభాతే విమలే కృతకర్మా నరాధిపః।
విశ్వామిత్రం మహాత్మాన మాజుహావ సరాఘవమ్॥ {1.66.1}
త మర్చయిత్వా ధర్మాత్మా శాస్త్రదృష్టేన కర్మణా।
రాఘవౌ చ మహాత్మానౌ తదా వాక్య మువాచ హ॥ {1.66.2}

❊ విశ్వామిత్ర మహర్షి బ్రహ్మర్షియైన విధమును శతానందునిద్వారా వినిన జనకమహారాజు సంతోషించినవాడై ఆ బ్రహ్మర్షికి భక్తితో ప్రదక్షిణ మాచరించి సెలవు గైకొని సపరివారంగా తన నిలయాన్ని చేరుకొన్నాడు. విశ్వామిత్రుడు కూడా రామలక్ష్మణులతో కలిసి విడిదికి చేరుకొన్నాడు. మరునాటి ఉదయం జనక మహారాజు కౌశికుని రాఘవులను పిలిపించి స్వాగతం పలికి సముచితమైన సత్కారములను చేసి గాధిజుని చూచి "ఓ బ్రహ్మర్షీ! మీ ఆజ్ఞను శిరసావహిస్తాను. ఇప్పుడు నేను ఏమి చేయవలెనో ఆజ్ఞాపించండి" అని విన్నవించుకొన్నాడు.

తే.గీ. అనుచు భక్తిఁ బ్రదక్షిణ మాచరించి
సాధువుల బంధువులఁ గూడి జనకు డేగ
ముదముతోడ విశ్వామిత్ర మునివరుండు
చనియె విడిదికి రామలక్ష్మణులతోడ. 548

మ. జనకుం డంతఁ బ్రభాతవేళ ముని విశ్వామిత్రు నా రామల
క్ష్మణయుక్తున్ బిలిపించి పూజ సలిపెన్, సత్కారముం జేసె రా
మునికిన్ లక్ష్మణమూర్తికిన్ దగువిధిన్, "బూజ్యా! యిదే స్వాగతం"
బని పల్కెన్, "భవదాజ్ఞ సేయుదును బ్రహ్మర్షీ!" యనెన్ బ్రీతితో. 549



66. శివధనుస్సు వృత్తాంతము

ఏవ ముక్త స్స ధర్మాత్మా జనకేన మహాత్మనా।
ప్రత్యువాచముని ర్వీరం వాక్యం వాక్యవిశారదః॥ {1.66.4}
పుత్రౌ దశరథ స్యేమౌ క్షత్రియౌ లోకవిశ్రుతౌ।
ద్రష్టుకామౌ ధనుశ్శ్రేష్ఠం యదేతత్ త్వయి తిష్ఠతి॥ {1.66.5}
ఏత ద్దర్శయ భద్రం తే కృతకామౌ నృపాత్మజౌ।
దర్శనా దస్య ధనుషో యథేష్టం ప్రతియాస్యతః॥ {1.66.6}

❊ రాజర్షిగా ప్రసిద్ధి వహించిన జనకభూపతి "ఓ బ్రహ్మర్షీ! ఆజ్ఞాపించండి. మీ ఆజ్ఞను శిరసావహిస్తాను" అని ఎంతో వినయంగా కౌశికునితో పలుకగా సాధుజనవినుతుడు బ్రహ్మర్షి ఐన విశ్వామిత్రుడు విదేహరాజును చూచి "ఓ మిథిలాధిపా! ఈ ఇద్దఱు సుప్రసిద్ధులైన క్షత్రియులు. దశరథమహారాజు యొక్క కుమారులు. మీ దగ్గఱ ఉన్న అమోఘమైన శివధనుస్సును చూడాలనే కోరికతో ఈ మిథిలకు వచ్చినారు. మీరు ఆ శివధనుస్సును వీరికి చూపించండి. దానిని చూచిన తరువాత వీరు తిరిగి అయోధ్యకు వెళ్లగలరు" అని పలికినాడు.

తే.గీ. ప్రథిత రాజర్షి జనకభూపతి యడకువ
నట్లు పలుకగా వినిన బ్రహ్మర్షివరుడు
జనవినుతుడు విశ్వామిత్రమునివరుండు
పలికె నీ రీతి మిథిలాధిపతిని గనుచు. 550

తే.గీ. రాజ! వీరలు దశరథరాజసుతులు
క్షత్రియులు సుప్రసిద్ధులు కాంక్షతోడ
శివధనుస్సును జూడ విచ్చేసినారు
వేడ్కఁ జూపించుడీ చూచి వెళ్లగలరు. 551

దేవరాత ఇతి ఖ్యాతో నిమేః షష్ఠో మహీపతిః।
న్యాసోఽయం తస్య భగవన్ హస్తే దత్తో మహాత్మనా॥ {1.66.8}

దక్షయజ్ఞవధే పూర్వం ధను రాయమ్య వీర్యవాన్।
రుద్రస్తు త్రిదశాన్ రోషాత్ సలీల మిద మబ్రవీత్॥ {1.66.9}
ప్రసాదయంతి దేవేశం తేషాం ప్రీతోఽభవ ద్భవః॥ {1.66.11}
ప్రీతియుక్త స్స సర్వేషాం దదౌ తేషాం మహాత్మనామ్। {1.66.12}

❊ శివధనుస్సును రామలక్ష్మణులకు చూపించవలసినదిగా బ్రహ్మర్షి విశ్వామిత్రుడు తెలుపగా జనకమహారాజు ఎంతో సంతోషపడినాడు. కౌశికుని చూచి "ఓ మౌనినాథా! మా నిమివంశంలో శ్రేష్ఠుడైన దేవరాతుడు అనే రాజునకు దేవతలు శివధనుస్సును న్యాసముగా ఇచ్చినారు. ఆనాటినుండి ఆ శివధనుస్సు నిత్యం మా వంశమువారిచే పూజింపబడుతూ ఉన్నది. పూర్వము దక్షయజ్ఞంలో తనకు గౌరవం లభించలేదని తలచిన పరమశివుడు తన ధనుస్సును చేతబట్టి దేవతలను చంపబూనినాడు. భయపడిన దేవతలందఱూ శరణు వేడగా శాంతించిన శివుడు తన ధనుస్సును దేవతలకు ఇచ్చినాడు. దేవతలు ఆ శివధనుస్సును దేవరాతునికి ఇచ్చినారు" అని జనకుడు ధనుస్సు గుఱించి వివరించసాగినాడు.

మ. అని బ్రహ్మర్షి వచించుచుండ, వినుచున్ హర్షాతిరేకమ్మునన్
జనకుండిట్లనె "మౌనినాథ! నిమివంశశ్రేష్ఠుడౌ దేవరా
తునికిన్ న్యాసముగా నొసంగబడె సంతోషమ్మునన్ దివ్య మీ
ధనురత్నమ్ము సురాళిచే, వెలుగు నేతత్పీమఁ బూజాదులన్. 552

ఉ. పూర్వము దక్షయజ్ఞమునఁ బూజల నందని కృత్తివాసు డా
శర్వుడు వింటితో సురలఁ జంపగఁ బూనగఁ, నా దివౌకసుల్
సర్వులు వేడగా, ధనువొసంగెను వారికిఁ బ్రీతి, వార లీ
యుర్విని దేవరాతునికి నుత్తముడం చిడి రా ధనుస్సునే. 553

తదేత ద్దేవదేవస్య ధనూరత్నం మహాత్మనః॥ {1.66.12}
న్యాసభూతం తదా న్యస్త మస్మాకం పూర్వజే విభో।
అథ మే కృషతః క్షేత్రం లాంగలా దుత్థితా మయా॥ {1.66.13}
క్షేత్రం శోధయతా లబ్ధా నామ్నా సీతేతి విశ్రుతా। {1.66.14}

❊ "ఆవిధంగా శివధనుస్సు మొదట దేవతల వద్దకు చేరినది. ఆ తరువాత మా నిమి వంశంలో పూజ్యుడైన దేవరాతుని వద్దకు చేరినది. ఆ దివ్యధనుస్సు ఇప్పుడు మా ఇంటిలోనే ఉండి మాచేత అర్చింపబడుతూ ఉన్నది. నేను ఒక యజ్ఞము చేయదలచి నాగలి చేతబట్టి భూమిని దున్నుచుండగా నాగటి చాలున ఒక బాలిక కనిపించినది. ఆ బిడ్డ అఖండకళానిధి వలె ప్రకాశిస్తూ ఒక నిధి వలె నాకు లభించినది. సీత అని పేరుపెట్టి ఆ బాలికను నా పుత్రికగా స్వీకరించినాను.

తే.గీ. హరుని ధను వావిధమ్మున సురలఁ జేరె,
నంత మా నిమివంశమ్ము నందుఁ బూజ్యు
దేవరాతునిఁ జేరె, నా దివ్యధనువ
యిప్పు డర్చింపఁ బడుచు మా యింట నుండె. 554

ఉ. నే నొక యజ్ఞమున్ సలుప నిర్ణయమున్ గొని భూమి దున్నగాఁ
బూని హలమ్ముఁ బట్టగ, విభూతిగ నాగటిచాలు నందునన్
గానగనయ్యె బాలిక యఖండకళానిధి వోలెఁ బ్రీతిమై
దానిని సీతపేరున యథావిధిఁ బుత్రికగా గ్రహించితిన్. 555

భూతలా దుత్థితా సా తు వ్యవర్ధత మమాత్మజా॥ {1.66.14}
వీర్యశుల్కేతి మే కన్యా స్థాపితేయ మయోనిజా। {1.6615}
తేషాం వరయతాం కన్యాం సర్వేషాం పృథివీక్షితామ్॥ {1.66.16}
వీర్యశుల్కేతి భగవన్ న దదామి సుతా మహమ్। {1.6617}
తేషాం జిజ్ఞాసమానానాం వీర్యం ధను రుపాహృతమ్॥ {1.66.18}
న శేకు ర్గ్రహణే తస్య ధనుష స్తోలనేఽపి వా। {1.66.19}

❊ అయోనిజగా భూతలమున జన్మించిన సీతను భూమాత అనుగ్రహంగా భావించినాను. నేను నా కుమార్తెగా పెంచుకొంటూ నాకు కీర్తిప్రతిష్ఠలను తెచ్చిపెట్టగలిగిన వీర్యశుల్క అని ఈ సీత గురించి నిశ్చయించుకొనినాను. ఎంతోమంది రాజకుమారులు మా సీతాకుమారిని వివాహమాడేందుకు వచ్చినారు. శివధనుస్సును ఎక్కుపెట్టినవారికి సీతనిచ్చి వివాహం చేస్తానని నేను

చెప్పగా వారు శివధనుస్సును ఎక్కుపెట్టేందుకు ప్రయత్నించి విఫలులై నాపై కోపాన్ని ప్రదర్శించినారు.

ఉ. భూతలమందు బుట్టినది పూత యయోనిజ యంచు, యజ్ఞభూ
మాత యనుగ్రహమ్మనుచు, మానినిఁ బెంచుచు, సర్వలోక వి
ఖ్యాతిని గూర్చునంచు, ముదమందుచు నుంటిని, వీర్యశుల్క మా
సీతను బెండ్లియాడ నిటఁ జేరిరి రాజకుమారు లెందఱో. 556

ఉ. చేరిన రాకుమారులకు సీత నొసంగక, వీర్యశుల్క యన్
గారణమున్ వచించి శివకార్ముక మెక్కిడుమంటి, వారిలో
నేరును దాని నెక్కిడగనేరక, యెత్తగలేక యుండగా
వారికి సీత నీయనని బల్కితిఁ, గోపము గల్గె వారికిన్. 557

న్యరుంధ న్మిథిలాం సర్వే వీర్య సందేహ మాగతాః। {1.66.21}
తతః సంవత్సరే పూర్ణే క్షయం యాతాని సర్వశః॥ {1.66.22}
తతో దేవ గణాన్ సర్వాన్ తపసాఽహం ప్రసాదయమ్॥ {1.66.23}
దదుశ్చ పరమప్రీతా శ్చతురంగబలం సురాః।
తతో భగ్నా నృపతయో హన్యమానా దిశో యయుః॥ {1.66.24}
అవీర్యా వీర్య సందిగ్ధా స్సామాత్యాః పాపకర్మణః। {1.66.25}

❊ "ఓ మిథిలాధిపతీ! శివధనుస్సును ఎక్కుపెట్టండి అని మాకు అసాధ్యమైన పరీక్ష పెట్టి నీవు మమ్ములను అవమానించినావు" అని ఆ రాజకుమారులు శస్త్రసమేతులై నా మిథిలా నగరాన్ని చుట్టుముట్టినారు. వారు ఒక సంవత్సర కాలం పాటు నాతో యుద్ధము చేసినారు. నా బలములు క్రమంగా క్షీణించుచుండగా నేను తపస్సు చేసి దేవతల అనుగ్రహంతో తిరిగి చతురంగ బలములను పొందినవాడనై మరల యుద్ధం చేయగా ఆ శత్రురాజులు బలహీనులై నలుదిక్కులకు పారిపోయినారు.

ఉ. "మాన్యులమైన మాకు నవమానముఁ జేసితి వీ" వటంచు రా
జన్యులు నన్ జయింప వరశస్త్రసమేతులునౌచుఁ గ్రుద్ధులై

సైన్యముతోడ నీ మిథిల సొంతము ముట్టడి చేసినా, రసా
మాన్య రణమ్మొనర్చి రొక మాసము గాదొక యేడు కౌశికా! 558

చం. పురమును జుట్టుముట్టిరటు భూపతు లెందఱొ, సాధనమ్ములా
వరుస క్షయమ్మునంద, మది బాధ చెలంగఁ దపస్సు చేసితిన్,
సురల యనుగ్రహమ్మున విశుద్ధబలమ్ముల నంది పోరగా
నరపతులెల్లఁ బాఱిరి వినష్టబలమ్ములతోడ నల్దిశల్. 559

యద్యస్య ధనుషో రామః కుర్యా దారోపణం మునే॥ {1.66.26}
సుతా మయోనిజాం సీతాం దద్యాం దాశరథే రహమ్। {1.66.27}
జనకస్య వచః శ్రుత్వా విశ్వామిత్రో మహామునిః।
ధను ర్దర్శయ రామాయ ఇతి హోవాచ పార్థివమ్॥ {1.67.1}
తత స్స రాజా జనకః సామంతాన్ వ్యాదిదేశ హ।
ధను రానీయతాం దివ్యం గంధమాల్యవిభూషితం॥ {1.67.2}

❉ ఓ విశ్వామిత్ర మహర్షీ! శివకార్ముకము ఎంతో పవిత్రమైనది. దివ్యశక్తితో నిండినట్టిది. ఈ విశ్వమున విఖ్యాతి నందినది. ఆ శివధనుస్సును మీకు చూపించెదను. ఈ రాముడు దానిని ఎక్కుపెట్టినచో సంతోషంతో నా కుమార్తెయగు సీతను గుణవంతుడైన ఈ రఘురామమూర్తికి ఇచ్చి వివాహం చేయగలను" అని జనకమహారాజు పలుకగా కౌశికుడు "ఓ మిథిలాధిపా! ధనుస్సును మా రామునికి చూపించు" అని అన్నాడు. వెంటనే జనకుడు సామంతులను చూచి శివధనుస్సును తీసికొనిరమ్మని సూచించినాడు. గంధమాల్య అలంకృతమై ఉన్న శివధనుస్సును తెచ్చేందుకొఱకు మంత్రులు బయలుదేరినారు.

ఉ. "పూతము దివ్యశక్తిపరిపూర్ణమునౌ శివకార్ముకమ్ము వి
ఖ్యాతము, తెచ్చి చూపెద, మహాత్ముడు రాముడు దాని నెక్కిడన్,
జేతము పొంగ దివ్యవరసిద్ధినిఁ బొంది, మదీయపుత్రికన్
సీత నొసంగెదన్ గుణవిశిష్టతమోర్మికి రామమూర్తికిన్." 560

మ. జనకుం డట్లు వచింప మోదమున, విశ్వామిత్ర మౌనీంద్రు డో
జనకా! చూపుము రామచంద్రునికిఁ దచ్చాప" మ్మనెన్ రాజు తె
మ్మనె సామంతులఁ జూచి యాశుధనువున్, హర్షమ్మునన్ మంత్రులున్
జనినారల్ వరగంధమాల్యవిలసచ్చాపంబునున్ దేరగన్. 561



67. శివధనుర్భంగము
జనకుడు దశరథుని తీసికొని వచ్చుటకై మంత్రులను పంపుట

నృణాం శతాని పంచాశత్ వ్యాయతానాం మహాత్మనామ్।
మంజూషా మష్టచక్రాం తాం సమూహు స్తే కథంచన॥ {1.67.4}
ఇదం ధనుర్వరం రాజన్ పూజితం సర్వరాజభిః।
మిథిలాధిప రాజేంద్ర దర్శనీయం యదిచ్ఛసి॥ {1.67.6}
తేషాం నృపో వచః శ్రుత్వా కృతాంజలి రభాషత।
విశ్వామిత్రం మహాత్మానం తౌ చోభౌ రామలక్ష్మణౌ॥ {1.67.7}

❊ ఎనిమిది చక్రములు గల ఇనుపపెట్టెలో ఉంచబడియున్న శివధనుస్సును ఐదువేలమంది భటులు శ్రమకోర్చి జనకుని వద్దకు తీసికొని వచ్చినారు. ఈ శివకార్ముకము ప్రతిదినము రాజపూజలను అందుకొంటూ ఉంటుంది అని మంత్రులు పలుకగా జనకమహారాజు కౌశికునికి మ్రొక్కి రామలక్ష్మణులను చూస్తూ ఆ శరాసనముయొక్క మహిమను వివరించసాగినాడు.

ఆ.వె. అష్టచక్రయుక్త మైనట్టి పేటికన్
వేడ్కఁ దెచ్చిరైదువేలమంది
యలరు శివునిచాప మా యయఃపేటికన్
నుతుల బూజల గొనుఁ బ్రతిదినమ్ము. 562

ఆ.వె. ప్రతిదినమ్ము నిచట పార్థివవరులచే
నర్చ లందుకొను శరాసనమిది
యిదియె చూపఁదగిన యీశ్వరుకార్ముక
మనిరి వారు భక్తి వినతు లగుచు. 563

తే.గీ. సచివు లట్లు వచింపగా జనకవిభుడు
మ్రొక్కు లిడుచు విశ్వామిత్రమునివరునకు
రామలక్ష్మణులనుఁ జూచి ప్రేమఁ బొదివి
శివధనుర్మహిమమ్మును జెప్పె నిటుల. 564

ఇదం ధనుర్వరం బ్రహ్మన్ జనకై రభిపూజితమ్।
రాజభిశ్చ మహావీర్యై రశక్తైః పూరితుం పురా॥ {1.67.8}
నైతత్ సురగణా స్సర్వే నాసురా న చ రాక్షసాః।
గంధర్వయక్షప్రవరా స్సకిన్నరమహోరగాః॥ {1.67.9}
క్వ గతి ర్మానుషాణాం తు ధనుషోఽస్య ప్రపూరణే।
ఆరోపణే సమాయోగే వేపనే తోలనేఽపి వా॥ {1.67.10}

❊ *"ఓ బ్రహ్మర్షీ! ఇది సాటిలేని శివధనుస్సు. ఇది మా వంశసంపద. దివ్యధనుస్సుగా భావించి మా పూర్వీకులు దీనికి పూజలు చేసినారు. బలపరాక్రమములుగల ఎంతోమంది రాజులు వచ్చి దీనిని ఎక్కుపెట్టదలచినారు కానీ కదలించుటకు కూడా శక్తిలేనివారై గర్వభంగమును పొంది వెనుదిరిగినారు. దేవతలు రాక్షసులు గంధర్వులు యక్షులు మొదలైనవారు ఈ శివచాపమును ఎత్తలేక పరీక్షలో విజయమును పొందలేకపోయినారు. ఒక సాధారణ మానవుడు ఈ ధనుస్సున నారిని పూరించగలడా? దీనిని ఎక్కుపెట్టగలడా? శరసంధానం చేయగలడా? ఇలా తన బలోద్ధతిని ప్రదర్శించగలడా?" అని జనకమహారాజు తన మనసులోని సందేహములను తెలియబరచినాడు.*

మ. ఇది శ్రీకంఠశరాసనమ్ము నతులం బెన్నంగ మా వంశ సం
పద బ్రహ్మర్షివరేణ్య! దివ్యమని సంభావించి మా పూర్వు లిం
పొదవన్ దీనికిఁ బూజఁ జేసి, రిల వీర్యోత్తంసులౌ భూపతుల్
కదలింపంగను జాలరైరి ధనువున్ గర్వమ్ము ఖర్వమ్ముగాన్. 565

మ. ఘనులౌ దేవత లెన్న రాక్షసవరుల్ గంధర్వయక్షాదులున్
మును పీ చాపము నెత్తలేక విజయమ్మున్ బొందలే కేగినా
రనఁ బూరింపగఁ జాలునే నరుడు? తా నారోపణన్ జేయ నే
ర్చునె? సంధించునె బాణమున్? బలము నారూఢిన్ ప్రదర్శించునే? 566

తదేత ద్ధనుషాం శ్రేష్ఠ మానీతం మునిపుంగవ।
దర్శయైత న్మహాభాగ అనయో రాజపుత్రయోః॥ {1.67.11}
విశ్వామిత్ర స్తు ధర్మాత్మా శ్రుత్వా జనకభాషితమ్।
వత్స రామ ధనుః పశ్య ఇతి రాఘవ మబ్రవీత్॥ {1.67.12}
ఇదం ధనుర్వరం బ్రహ్మన్ సంస్పృశా మీహ పాణినా।
యత్నవాంశ్చ భవిష్యామి తోలనే పూరణేఽపి వా॥

❊ "ఓ విశ్వామిత్ర మహర్షీ! ఈ శివధనుస్సును పెకెత్తగలిగినవాడు కదలింపగలిగినవాడు అగు మానవుని ఇంతవఱకు నేను చూడలేదు. అయినప్పటికినీ దీనిని ఈ రాజకుమారులకు చూపించుము అని జనకమహారాజు విన్నవించినాడు. అప్పుడు ఆ గాధినందనుడు రాముని చూచి "నాయనా! రామా! ఈ శివధనుస్సును చూడుము. నీకు కల్యాణ మగును గాక!" అని వాత్సల్యంతో పలికినాడు. ఆ బ్రహ్మర్షి వాక్కును వినిన రాముడు ధనుస్సు ఉన్న పెట్టెను చూచినాడు. ఆ పేటికను తెరచినాడు. గొప్ప తేజస్సుతో విరాజిల్లినాడు. శివధనుస్సును స్పృశింప దలచినాడు. గురువరుని చూచి "ఓ మునీంద్రా! నేను ఈ మహేశ్వరచాపాన్ని పైకెత్తుటకు సిద్ధమౌతూ ఉన్నాను" అని కౌశికుని అనుమతికొఱకు ఎదురుచూచినాడు.

తే.గీ. దీనిఁ బైకెత్తఁగలిగిన మానవవరుఁ
గడగి కదిలింపఁ జాలిన ఘనచరిత్రు
గాంచనైతి నే నైనను గౌశికముని!
చూపు మీ చాప మీ రాజసుతుల కిపుడు. 567

తే.గీ. వినయమున నటు జనకుడు విన్నవింప
మునివరుండు విశ్వామిత్రు డనియె నిట్లు
"భవధనుస్సును చూడుమా వత్స! రామ!
సుగుణవర! నీకు కల్యాణమగును గాక!". 568

మ. పలుకంగా నటు గాధినందనుడు, తద్బ్రహ్మర్షివాక్యమ్మునన్
దిలకించెన్ ధను వున్న పేటిఁ, దెఱచెన్, దేజమ్ము వర్ధిల్లగాఁ
బులకించెన్, స్పృశియింపనెంచె ధనువున్, "పూజ్యా! మునీంద్రా! యిదే
విలసచ్చాపము నెత్తఁ బూనితి" ననెన్ బ్రీతాత్ముడై రాముడున్. 569

బాఢ మిత్యేవ తం రాజా మునిశ్చ సమభాషత।
లీలయా స ధనుర్మధ్యే జగ్రాహ వచనాన్మునేః॥ {1.67.15}
పశ్యతాం నృసహస్రాణాం బహూనాం రఘునందనః।
ఆరోపయిత్వా ధర్మాత్మా పూరయామాస తద్ధనుః॥ {1.67.16}

❈ "ఓ గురువర్యా! శివధనుస్సును వంచి నారిని సమకూర్చే ప్రయత్నం చేస్తాను" అని రాముడు ఆ ధనుస్సును సమీపించగా చూచిన విశ్వామిత్రుడు జనకమహారాజు "అలాగే" అని తమ అంగీకారమును తెలిపినారు. అంతట రఘురాముడు ఆ శివధనుస్సుయొక్క మధ్యభాగమును పట్టుకొని తేలికగా పైకెత్తినాడు. దశరథరాముడు అవలీలగా శివధనుస్సును పైకెత్తగా రామలీలను చూచిన వేలకొలది నరులు ఆశ్చర్యంతో లేచి నిలబడినారు. బాలకరీంద్రము వలె ప్రకాశించే ఆ శ్రీరాముని సభ్యులందఱూ గొప్పగా మెచ్చుకొనసాగినారు.

మ. "హరచాపమ్మును వంచి పూరణకునై యత్నింతు" నంచున్ మహే
శ్వరు చాపమ్మును జేరు రాముఁ గని, విశ్వామిత్రుడున్ భూపుడున్
బరమార్థమ్ము గ్రహించి "వల్లె" యని సంభావింప, రాముండు తా
మరసాక్షుం డవలీల నెత్తె ధనువున్ మధ్యమ్మునన్ బట్టుచున్. 570

ఉ. వేల కొలందిగా నరులు వింతగఁ జూడగ, మౌనివాక్యమున్
బాలన చేయుచున్ ధనువుఁ బట్టుచుఁ దా నవలీల నెత్తఁ, ద
ల్లీలను జూచువారపుడు లేచిరి విస్మయమంది, రామునిన్
బాలకరీంద్రసన్నిభుని భాసురమూర్తిని మెచ్చి రీ విధిన్. 571

ఆరోపయిత్వా ధర్మాత్మా పూరయామాస తద్ధనుః॥ {1.67.16}
తద్బభంజ ధను ర్మధ్యే నరశ్రేష్ఠో మహాయశాః।
తస్య శబ్దో మహా నాసీ న్నిర్ఘాతసమనిఃస్వనః॥ {1.67.17}
భూమికంపశ్చ సుమహాన్ పర్వతస్యేవ దీర్యతః॥ {1.6718}

❈ అమోఘమైన శివధనుస్సును పైకెత్తిన రఘురాముని చూచిన సభ్యులు ఆశ్చర్యపడి "ఇనకులోద్భవుడైన ఈ రఘురాముడు ధైర్యంగా శివచాపమును సమీపించినాడు. దివ్యమైన ఆ చాపమును దర్శించినాడు. చేతితో దాని మధ్యభాగాన్ని పట్టుకొన్నాడు. వీరాధివీరుడై ధనుస్సును పైకెత్తినాడు. ఇతడే ఆ ధనుస్సును వంచగలడు. దానికి నారిని సమకూర్చగలడు. ధనుష్టంకారం చేయగలవాడు కూడా ఇతడే" అని దశరథరాముని మెచ్చుకొనసాగినారు. అప్పుడు అయోధ్యారాముడు అందఱినీ సంభ్రమాశ్చర్యములకు గుఱిచేస్తూ శివధనుస్సును ఎక్కుపెట్టినాడు. ఆ ధనుస్సు యొక్క శక్తిని పరీక్షిస్తూ వింటినారిని పట్టి లాగినాడు. తత్క్షణమే ఆ శివధనుస్సు రెండు ముక్కలుగా విఱిగి నేలపై పడినది. ధనుస్సు విఱిగినప్పుడు పిడుగుపాటు వంటి శబ్దముతో దశదిశలు నిండినవి. భూకంపములు ఏర్పడినవి.

చం. ఇనకులజుండు రాముడు మహేశుని చాపముఁ జేరినాడు, దా
నిని బరికించినాడు, కరనీరజ మెత్తుచుఁ బట్టినాడు, వీ
రుని వలె నెత్తినాడు; గుణరోచులఁ గోటిని వంచి, మేటి నా
రిని వెసఁ జుట్టి, దాని సవరించు గుణాత్ము డితండె చూడుడీ. 572

మ. అనుచున్ సభ్యులు మెచ్చ, రాఘవుడు శౌర్యమ్మున్ బ్రదర్శించుచున్
ఘన కోదండము నెక్కు పెట్టుచుఁ బరీక్షాదృష్టిఁ దాకన్ గుణ
మ్మును; చాప మ్మది రెండుగా విఱిగె, సంపూర్ణమ్ముగా నిండె భీ
షణ నిర్ఘాత రవమ్ముతో దశదిశల్, జన్మించె భూకంపముల్. 573

భూమికంపశ్చ సుమహాన్ పర్వతస్యేవ దీర్యతః।
నిపేతుశ్చ నరాస్సర్వే తేన శబ్దేన మోహితాః॥ {1.67.18}

వర్జయిత్వా మునివరం రాజానం తౌ చ రాఘవౌ।
ప్రత్యాశ్వస్తే జనే తస్మిన్ రాజా విగత సాధ్వసః॥ {1.67.19}

❊ శివధనుర్భంగ సమయంలో ఏర్పడిన ఘోరమైన శబ్దమునకు పర్వతాలు బ్రద్దలైనాయి. భయంకరమైన ఆ శబ్దమును వినినప్పటికిని విశ్వానికి మిత్రుడైన విశ్వామిత్ర మహర్షి, జనకమహారాజు, రామలక్ష్మణులు మాత్రము యథాస్థితిలోనే ఉండగా ఇతర రాజులు సభ్యులు మిగిలినవారు అందఱూ నేలపై వ్రాలి మూర్ఛపోయినారు. కొన్ని క్షణముల తరువాత రాజులకు సభ్యులకు మూర్ఛ తొలగిపోయినది. రాముడు శివకార్ముకమును ఎక్కుపెట్ట గలడో లేడో? సీతకు భర్త అవుతాడో లేదో అనే భయం జనకమహారాజుకు తొలగిపోయింది.

ఉ. శైలవిదారకృచ్చటులశబ్దము ఘోరముగా వినంబడన్,
లీలగ నిల్చియుండిరటఁ బ్రీతిగ రాముడు, లక్ష్మణుండు, లో
కాలకు మిత్రుడౌ మునియు, క్ష్మాపతియౌ జనకుండు; భీతులై
వ్రాలిరి నేలపై నితరరాజులు సభ్యులు మూర్ఛనందుచున్. 574

తే.గీ. అంతటన్ మూర్ఛ తొలగె వారందఱికటఁ,
గార్ముకము రాము డెక్కిడ గలడొ లేడొ
యవనిజాతకు భర్తగా నగునొ కాడొ
యనెడి భీతియుఁ దొలగె నా జనకపతికి. 575

ప్రత్యాశ్వస్తే జనే తస్మిన్ రాజా విగతసాధ్వసః। {1.67.19}
ఉవాచ ప్రాంజలి ర్వాక్యం వాక్యజ్ఞో మునిపుంగవమ్।
భగవన్ దృష్టవీర్యో మే రామో దశరథాత్మజః॥ {1.67.20}
అత్యద్భుత మచింత్యం చ న తర్కిత మిదం మయా। {1.67.21}

❊ శివధనుస్సును ఎక్కుపెట్టిన రఘురాముని పరాక్రమమును చూచి పరమానందమును పొందినవాడై, వాక్యకోవిదుడైన జనకమహారాజు కౌశికుని చూచి వినయంగా నమస్కరించి "ఓ విశ్వామిత్ర మహర్షీ! ఈ రాముని యొక్క గొప్పవీర్యమును శౌర్యమును పరిపూర్ణముగా చూచినాను. ఇతని పరాక్రమము

అత్యద్భుతమైనది. దశరథరాముని శౌర్యము ఇంత గొప్పది అని నేను ముందుగా ఊహించలేకపోయినాను. ఈ రాకుమారుడు శివధనుస్సును ఎక్కుపెట్టినందున ఊహించని ఫలితము నాకు లభించినది. ఈ రాఘవుడు జగన్మోహనంగా ఈ పరీక్షలో విజయాన్ని సాధించినాడు" అని అయోధ్యారాముని ప్రశంసించసాగినాడు.

చం. జనకవిభుండు రామకృతి సంతస మందుచు, మౌనిఁ జూచుచున్
వినయముతో నమస్కృతులఁ బేర్మి నొనర్చుచు, వాక్యకోవిదుం
డన నిటు వల్కెఁ "గౌశిక! మహాత్మ! మునీశ్వర! చూచినాడ రా
ముని ఘనవీర్యశౌర్యపరిపూర్ణమహాద్భుతకార్యసంగతిన్. 576

తే.గీ. అరయ రాముని వీర్య మత్యద్భుతమ్ము
దశరథాత్మజు శౌర్య మతర్కితమ్ము
శివుని ధనువు నెక్కిడుట యచింత్యఫలము
మునివరేణ్య! యియ్యది జగన్మోహనమ్ము. 577

జనకానాం కులే కీర్తి మాహరిష్యతి మే సుతా॥ {1.67.21}
సీతా భర్తార మాసాద్య రామం దశరథాత్మజమ్।
మమ సత్యా ప్రతిజ్ఞా చ వీర్యశుల్కేతి కౌశిక॥ {1.67.22}
సీతా ప్రాణై ర్బహుమతా దేయా రామాయ మే సుతా।
భవతోఽనుమతే బ్రహ్మన్ శీఘ్రం గచ్ఛంతు మంత్రిణః॥ {1.67.23}
మమ కౌశిక భద్రం తే అయోధ్యాం త్వరితా రథైః।
రాజానం ప్రశ్రితై ర్వాక్యై రానయంతు పురం మమ॥ {1.67.24}

❋ "ఓ విశ్వామిత్ర మహర్షీ! నా ప్రతిజ్ఞ నెఱవేఱబోతూ ఉంది. ఇప్పుడు నాకు చాలా సంతోషంగా ఉన్నది. వీర్యశుల్కయైన నా కుమార్తె సీతకు తగిన భర్త ఈ రఘురాముడే. సీతారాముల కల్యాణంతో ఇక మా జనకవంశము సత్కీర్తిని పొందుతుంది అనుటలో ఎటువంటి సందేహమూ లేదు. ఈ రఘురాముని ధర్మపత్నిగా మా సీత పూర్తిగా సంతోషమును పొందగలదు. అయోనిజ,

సుగుణాలరాశి, నా ప్రాణ సమానురాలు భూజాత అగు సీతను సూర్యవంశ సంజాతుడు వీరాధివీరుడు అగు రామునికి ఇచ్చి వివాహం చేస్తాను. మీ అనుమతితో ఈ రాముని తండ్రియైన దశరథమహారాజును ఈ మిథిలానగరానికి తీసికొనివచ్చుటకు నా మంత్రులను ఇప్పుడే పంపగలను " అని జనకమహారాజు కౌశికునికి విన్నవించుకొన్నాడు.

ఉ. "నాదు ప్రతిజ్ఞ సత్యమయి నాకిడె హర్షము, వీర్యశుల్కయౌ
నాదు కుమార్తెకున్ దగిన నాథుడుగా విలసిల్లు రాముడే,
వాదము లేక మా జనకవంశము కీర్తి గడించు, నింక స
మ్మోదము నందు సీత పరిపూర్ణముగా రఘురాముపత్నిగా. 578

ఉ. సీత నయోనిజన్ గుణవిశిష్టను గన్యను మత్సుతన్ క్షమా
జాతను బ్రాణతుల్యను బ్రశస్తను వీరుడు సూర్యవంశ సం
జాతుడు నైన రాముని కొసంగగ నౌ నిక మీ యనుజ్ఞతో
నీతని తండ్రి చెంత కిదె యిప్పుడె పంపెద మంత్రివర్యులన్" 579


ప్రదానం వీర్యశుల్కాయాః కథయంతు చ సర్వశః॥ {1.67.24}
మునిగుప్తౌ చ కాకుత్స్థౌ కథయంతు నృపాయ వై।
ప్రీయమాణం తు రాజాన మానయంతు సుశీఘ్రగాః॥ {1.67.25}
కౌశికశ్చ తథేత్యాహ రాజా చాభాష్య మంత్రిణః॥ {1.67.26}
అయోధ్యాం ప్రేషయామాస ధర్మాత్మా కృతశాసనాన్।
యథావృత్తం సమాఖ్యాతు మానేతుం చ నృపం తదా॥ {1.67.27}

❋ కల్యాణోత్సవం సందర్భంగా రఘురాముని తండ్రియగు దశరథుని మిథిలకు పిలిపించదలచిన జనకుడు అందులకు విశ్వామిత్రుని అనుమతిని కోరినాడు. కౌశికుడు అంగీకరించినాడు. వెంటనే జనకుడు మంత్రులను చూచి "ఓ అమాత్యులారా! అయోధ్యకు వెళ్ళండి. తన పరాక్రమంతో రాముడు సాధించిన మహత్కార్యమును గుఱించి వివరించండి. స్నేహపూర్వకంగా మాట్లాడండి. మా క్షేమసమాచారమును తెలియజేయండి. శివధనుర్భంగమును గూర్చి

విశదీకరించండి అయోనిజయైన సీత వీర్యశుల్క అని తెలపండి. సీతారాముల కల్యాణయోగమును గుఱించి చెప్పి నా విన్నపాన్ని వివరించి అయోధ్యాధిపతియగు దశరథచక్రవర్తిని మీతో వెంటబెట్టుకొని రండి" అని ఆదేశించినాడు.

మ. అని యా గాధిజు సమ్మతిన్ జనకు డత్యాసక్తితో మంత్రులన్
గనుచున్ బల్కె "నయోధ్య కేగుడు, మహత్కార్యమ్ము సాధించినా
డని యీ రాముని శౌర్యమున్ దెలిపి, స్నేహమ్మొప్పు వాక్యమ్ములన్
గొని తెం డా యినవంశజున్ దశరథున్ గూర్మిల్ పిసాళింపగన్" 580

ఉ. "తెల్పు డనామయస్థితిని, దివ్య మహేశ్వర చాప భంగమున్
దెల్పుడు, వీర్యశుల్క యని తెల్పు డయోనిజఁ గూర్చి పూర్తిగాఁ,
దెల్పుడు నా ప్రతిజ్ఞలను, దెల్పుడు రామవివాహయోగమున్,
దెల్పుడు నాదు విన్నపముఁ, దెల్పుచుఁ దోడ్కొనిరండు భూపతిన్" 581



68. దశరథుడు సపరివారంగా మిథిలకు బయలుదేరుటకు నిశ్చయించుకొనుట

జనకేన సమాదిష్టా దూతా స్తే క్లాంతవాహనాః।
త్రిరాత్ర ముషితా మార్గే తేఽయోధ్యాం ప్రావిశన్ పురీమ్॥ {1.68.1}
దదృశు ర్దేవ సంకాశం వృద్ధం దశరథం నృపమ్॥ {1.68.2}
బద్ధాంజలిపుటా స్సర్వే దూతా విగత సాధ్వసాః।
రాజానం ప్రయతా వాక్య మబ్రువన్ మధురాక్షరమ్॥ {1.68.3}
మైథిలో జనకో రాజా సాగ్నిహోత్రపురస్కృతమ్। {1.68.4}

❋ *“ఓ మంత్రులారా! అయోధ్యకు వెళ్ళి శ్రీరాముని తండ్రియైన దశరథమహారాజునకు జరిగిన విషయమును పూర్తిగా వివరించి నా ఆహ్వానమును విన్నవించి ఒప్పించి మిథిలకు తీసికొనిరావలసినది” అని జనకుడు ఆదేశింపగా వెంటనే బయలుదేరిన ఆ అమాత్యులు మూడురోజులపాటు ప్రయాణించి అయోధ్యను చేరుకొన్నారు. ఇంద్రునితో సమానమైన తేజస్సు గలవాడగు వృద్ధ దశరథ చక్రవర్తిని చూచి వినయంగా అంజలి ఘటించారు. విజయీభవ అంటూ శుభవాక్యములను పలికి “ఓ ఇనకులాగ్రణీ! కోసలాధిపా! మిథిలాధిపతియైన జనకుడు మమ్ము మీవద్దకు పంపినాడు. దయచేసి మా విన్నపాన్ని ఆలకించండి” అని తమ రాక గురించి చెప్పసాగినారు.*

చం. జనకుని యాజ్ఞతోఁ ద్రిదివసమ్ముల దూతలు చేరినా రయో
ధ్యను, బురిలోని కేగి జనకాధిపు దంపగ వచ్చినా మటం,
చినకులనాథుడౌ దశరథేశుని సౌధముఁ జేరి, వృద్ధరా
జును సురనాథతేజుని విశుద్ధునిఁ జూచిరి సంతసమ్మునన్. 582

ఉ. ఆ నృపుఁ జూచి దూతలు జయమ్ము శుభమ్మని పల్కి, “భాస్కర
ధ్యానపరాయణా! దశరథాధిప! పావన! కోసలాధిపా!
మానవనాథ! పంపె మము మాన్యుడు మా జనకాధిపుం డిటుల్,
మానుడు లాలకింపుడు నమస్కృతు” లంచు వచించి రీక్రియన్. 583

మైథిలో జనకో రాజా సాగ్నిహోత్రపురస్కృతమ్।
కుశలం చావ్యయం చైవ సోపాధ్యాయపురోహితమ్॥ {1.68.4}
ముహు ర్ముహు ర్మధురయా స్నేహసంయుక్తయా గిరా।
జనక స్త్వాం మహారాజ పృచ్ఛతే సపురస్సరమ్॥ {1.68.5}
పృష్ట్వా కుశల మవ్యగ్రం వైదేహో మిథిలాధిపః।
కౌశికానుమతే వాక్యం భవంత మిద మబ్రవీత్॥ {1.68.6}

❈ "ఓ కోసలాధిపా! మా ప్రభువైన జనకమహారాజు మీకు, మీ ఋత్విజులకు, అగ్నులకు, ఉపాధ్యాయులకు, ఆప్తులకు కుశలమే కదా అని అడుగమనినాడు. మీ శ్రేయస్సును సదా కోరుకొనే మా విదేహరాజు మమ్ము మీ చెంతకు పంపినాడు. విశ్వామిత్ర మహర్షి అనుమతితోనే మమ్ము మీ చెంతకు పంపినాడు. తన మాటగా మీతో ఇలా మాట్లాడమనినాడు.

ఉ. ఈ యెడ "మీకు, ఋత్విజుల, కెన్నగ నగ్నుల, కాప్తులౌ నుపా
ధ్యాయులకున్, బురోహితుల కందఱకున్ గుశలమ్మె"? యంచు మీ
శ్రేయముఁ గోరు మా ప్రభువు ప్రీతిగఁ దా నడుగంగఁ బంపినా
డాయత మైత్రితో దశరథాధిప! మమ్ముల నీదు చెంతకున్. 584

తే.గీ. మాన్యవిభుడు విదేహ రాజన్యు డెంచి
పూజనీయ విశ్వామిత్ర మునివరేణ్యు
సమ్మతిన్ గొని పంపించె మమ్ము, మిమ్ముఁ
జేరి తనమాటగా నిట్లు చెప్పు డనియె. 585

పూర్వం ప్రతిజ్ఞా విదితా వీర్యశుల్కా మమాత్మజా।
రాజానశ్చ కృతామర్షాః నిర్వీర్యా విముఖీకృతాః॥ {1.68.7}
సేయం మమ సుతా రాజన్ విశ్వామిత్రపురస్సరైః।
యదృచ్ఛయాఽఽగతై ర్వీరై ర్నిర్జితా తవ పుత్రకైః॥ {1.68.8}

❈ ఓ కోసలాధిపా! నా కుమార్తె సీత భూజాత. అయోనిజ. మహాగుణవంతురాలు. వీర్యశుల్క. అందువలన శివచాపమును ఎక్కుపెట్టగల

మహావీరుడైన రాజకుమారునికి సీతను ఇచ్చి వివాహం చేస్తానని నేను ప్రతిజ్ఞ చేసినాను. ఎంతోమంది రాజులు ఆశగా వచ్చినారే కాని శివధనుస్సును పైకెత్తలేక నాపై కోపగించుకొని వెళ్లిపోయినారు. విశ్వామిత్ర మహర్షి మీ కుమారులైన రామలక్ష్మణులను తనతోపాటు మా మిథిలకు తీసికొని వచ్చినాడు. మీ పెద్దకుమారుడైన రాముడు ఎటువంటి సందేహమూ లేనివాడై అవలీలగా శివధనుస్సును ఎక్కుపెట్టినాడు. తన పరాక్రమంతో నా పుత్రికయైన సీతను గెలుచుకొన్నాడు. మీ రాముడు మా సీతకు వరుడై విరాజిల్లగలడు.

ఉ. సీతను మత్సుతన్ గుణవిశిష్ట నయోనిజ వీర్యశుల్క భూ
జాతను వీర్యవంతునికి జాయగ నీయఁ బ్రతిజ్ఞఁ జేసితిన్,
ఖ్యాతి గడించినట్టి నృపు లాశగ వచ్చిరి, శైవచాపమున్
జేతుల నెత్తలేక క్రుధఁ జెందుచు నేగిరి కోసలాధిపా!" 586

మ. జననాథా! భవదాత్మజుల్ ఘనులు విశ్వామిత్రరాజర్షి తో
డ్కొనిరా వచ్చిరి, రామచంద్రు డెద సంకోచమ్ము లేకుండ నీ
శుని చాపమ్మును జూచి యెక్కిడుచుఁ దా శోభిల్లుచున్ వీర్యశు
ల్కను మత్పుత్రిని గెల్చినాడు, వరుడై రాజిల్ల మా సీతకున్. 587

తచ్చ రాజన్ ధను ర్దివ్యం మధ్యే భగ్నం మహాత్మనా।
రామేణ హి మహారాజ! మహత్యాం జనసంసది॥ {1.68.9}
అస్మై దేయా మయా సీతా వీర్యశుల్కా మహాత్మనే।
ప్రతిజ్ఞాం కర్తు మిచ్ఛామి తదనుజ్ఞాతు మర్హసి॥ {1.68.10}
సోపాధ్యాయో మహారాజ పురోహిత పురస్సరః।
శీఘ్ర మాగచ్ఛ భద్రం తే ద్రష్టు మర్హసి రాఘవౌ॥ {1.68.11}

❊ ఓ దశరథ చక్రవర్తీ! రఘురాముడు శివధనుస్సును చూచినాడు. దానిని భక్తితో స్పృశించినాడు. తన మహిమ కారణంగా పట్టుకొని సులభంగా పైకెత్తినాడు. నారితో జతచేసినాడు. అల్లెత్రాటిని పట్టుకొని లాగుటకు ప్రయత్నించినాడు. అప్పుడు ఆ శివధనుస్సు ఘోరమైన శబ్దం చేస్తూ రెండు ముక్కలుగా విఱిగి క్రింద పడింది. సీతారాముల కల్యాణం జరిపించి నేను చేసిన

ప్రతిజ్ఞను నెఱవేర్చవలసిన సమయం వచ్చింది. దయతో వచ్చి వధూవరులను దీవించవలసినదిగా మిమ్ము ప్రార్థిస్తూ ఉన్నాను. నా కుమార్తెయైన సీతను రఘురామునికి ఇచ్చి వివాహం జరిపించడం నా భాగ్యం అని నేను భావిస్తూ ఉన్నాను. మీరు మీ ఉపాధ్యాయులతో భూసురోత్తములతో బంధుమిత్రులతో కలిసి సపరివారంగా మా మిథిలకు త్వరగా విచ్చేయండి. మిథిలానగర వైభవాన్ని దర్శించండి. ఈ మిథిలలో మీ పుత్రులైన రామలక్ష్మణులను కూడా చూడవచ్చును. మీకు శుభము కలుగుగాక!" అని జనకుని మాటలను దూతలు తమ మాటలద్వారా తెలియజేసినారు.

మ. ధనువున్ జూచెను, సంస్పృశించెను మహత్వమ్మొప్పఁ జేపట్టె, నా
ధనువున్ గూర్చెను నారితో, గుణముఁ జేతన్ బట్టి లాగంగఁ బూ
నెను, చాపమ్మది రెండుగా విఱిగెఁ దానే ఘోరశబ్దమ్మునన్,
బ్రణతుల్ గూర్చెద నా ప్రతిజ్ఞ నెఱవేఱన్ వచ్చి దీవింపుడీ" 588

మ. "వరుడౌ రాముని కిత్తు సీతను మహాభాగ్యమ్ముగా నెంచి, భూ
వర! కల్యాణ మొనర్తు, మీరలిక సోపాధ్యాయులై మేటి భూ
సుర మిత్రాన్వితులౌచు రండు, మిథిలన్ జూడంగనౌ రండు, శ్రీ
కరులౌ పుత్రులఁ జూడఁ గల్గుదురు వేగన్ రండు భద్రమ్మగున్. 589

ప్రీతిం చ మమ రాజేంద్ర నిర్వర్తయితు మర్హసి।
పుత్రయో రుభయో రేవ ప్రీతిం త్వమపి లప్స్యసే॥ {1.68.12}
ఏవం విదేహాధిపతి ర్మధురం వాక్య మబ్రవీత్।
విశ్వామిత్రాభ్యనుజ్ఞాత శ్శతానందమతే స్థితః॥ {1.68.13}
దూతవాక్యం తు తచ్ఛ్రుత్వా రాజా పరమహర్షితః।
వసిష్ఠం వామదేవం చ మంత్రిణోఽన్యాంశ్చ సోఽబ్రవీత్॥ {1.68.14}

❋ ఓ దశరథ మహారాజా! మీరు మిథిలకు వచ్చినచో మీ పుత్రులకు ఉత్తమయోగం కలుగగలదు అని ధర్మాత్ముడైన మా జనకమహారాజు విన్నవించమనినాడు. బ్రహ్మర్షియైన విశ్వామిత్రుని అనుమతిని స్వీకరించి, పురోహితుడైన శతానందుని వాక్కుల ననుసరించి మమ్ము మీ దగ్గఱకు

పంపినాడు అని జనకుని దూతలు మధురమంజులమైన మాటలను పలికినారు. దూతలు ఆ విధంగా మాట్లాడగా సంతోషపడిన పంక్తిరథుడు రాముని వివాహవిషయము కారణంగా మనసు ఉప్పొంగగా మంత్రులను పిలిపించినాడు. ఆ సమయంలో తన దగ్గఱకు వచ్చిన వసిష్ఠుడు, వామదేవుడు మొదలైన పెద్దలను మంత్రులను చూచి వారివద్ద దశరథుడు రామవివాహ విషయమును గుఱించి ఆనందంగా వివరించసాగినాడు.

మ. “చనుదేరన్ భవదీయ పుత్రులకు భాస్వద్యోగమౌ” నంచు మా
జనకుం డాడెను, బ్రహ్మవేత్త యగు విశ్వామిత్రు నంగీకృతిన్
గనుచున్, లోకహితమ్మొనర్చెడి శతానందోక్తులన్, ధర్మవ
ర్తను డంపెన్మము నంచుఁ బల్కి రట దూతల్ మంజువాక్యమ్ములన్.

ఉ. దూత లటుల్ వచింపఁ, బరితుష్టుడు పంక్తిరథుండు వైళమే
చేతము పొంగ మంత్రులను జీర, వసిష్ఠుడు వామదేవుడున్
బ్రీతి హితమ్ముఁ జెప్పదగు పెద్దలు మంత్రులు వచ్చి చేరగా,
భూతలనాథు డిట్లనెఁ బ్రమోదముఁ గూర్చు వివాహవాక్కులన్. 591

గుప్తః కుశికపుత్రేణ కౌసల్యానందవర్ధనః।
లక్ష్మణేన సహ భ్రాత్రా విదేహేషు వసత్యసౌ॥ {1.68.15}
దృష్టవీర్యస్తు కాకుత్స్థో జనకేన మహాత్మనా।
సంప్రదానం సుతాయాస్తు రాఘవే కర్తు మిచ్ఛతి॥ {1.68.16}
యది వో రోచతే వృత్తం జనకస్య మహాత్మనః।
పురీం గచ్ఛామహే శీఘ్రం మా భూత్ కాలస్య పర్యయః॥ {1.68.17}

❈ దశరథమహారాజు వసిష్ఠుడు మొదలైన మునులను మంత్రులను చూచి “మహాత్ములారా! నా కుమారుడైన రాముడు లక్ష్మణునితో కలిసి విశ్వామిత్రుని అనుసరించి వెళ్లి ధన్యాత్ముడైనాడు. కౌశికుని సంరక్షణలో ఉన్న రాముని పరాక్రమమును గమనించిన విదేహరాజు జనకుడు తన కుమార్తెయైన సీతను రామునికిచ్చి వివాహం చేయదలచినాడు. ఆ విషయాన్ని ఒక సందేశంగా

దూతలద్వారా తెలియబఱచినాడు. ఆ జనక మహారాజుయొక్క కోరిక ప్రశస్తమైనది అని మీకు కూడా అనిపించినట్లైతే మిథిలకు బయలుదేరేందుకు మీ సమ్మతిని వెంటనే తెలియజేయండి. మన మందరమూ మిథిలకు వెళ్లేందుకు సిద్ధమౌదాము" అని సంతోషంతో పలుకగా వారు కోసలరాజైన దశరథుని ముఖమునందు కనిపించే ఆనందమును గమనించి "ఓ రాజా! మాకు కూడా సమ్మతమే" అని సంతోషంతో పలికినారు.

మ. జతగా లక్ష్మణుడుండ మత్సుతుడు కౌసల్యాతనూజుండు సం
తతమున్ గౌశికు రక్షణన్ మెలగుచున్ ధన్యాత్ముడై యుండ, నా
తతవీర్యుం డని యెంచి రామునికిఁ జేతఃప్రీతితోఁ బుత్రికన్
సతిగాఁ గూర్ప విదేహరాజు తలచెన్ సందేశమున్ బంపెగా. 592

చం. జనకుని కోర్కి మీకునుఁ బ్రశస్తముగా నగుపించెనేని, కా
దన కిటు సమ్మతింపఁదగు, నా పురిఁ జేరగ వేగ నేగగా
మనమిక సిద్ధమౌదమని మైత్రి వచింపగఁ, గోసలేశు నా
ననమున మోదమున్ గని ఘనమ్ముగ సమ్మతిఁ దెల్పి రందఱున్. 593


మంత్రిణో బాఢ మిత్యాహు స్సహ సర్వై ర్మహర్షిభిః।
సుప్రీతశ్చాఽబ్రవీ ద్రాజా శ్వో యాత్రేతి స మంత్రిణః॥ {1.68.18}
మంత్రిణ స్తాం నరేంద్రస్య రాత్రిం పరమసత్కృతాః।
ఊషు స్తే ముదితా స్సర్వే గుణై స్సర్వై స్సమన్వితాః॥ {1.68.19}
తతో రాత్ర్యాం వ్యతీతాయాం సోపాధ్యాయ స్సబాంధవః।
రాజా దశరథో హృష్ట స్సుమంత్ర మిద మబ్రవీత్॥ {1.69.1}

❋ మనమందరమూ మిథిలకు వెళ్దాము అని దశరథ మహారాజు పలుకగా అందులకు వసిష్ఠాది మునులు మంత్రివరులు సమ్మతించినారు. సంతోషించిన కోసలాధిపుడు "రేపటిరోజున మనము మిథిలకు వెళ్లుటకు సిద్ధంకండి" అని చెప్పి తన మందిరమునకు వెళ్లినాడు. వారంతా సంతోషంగా అచ్చటనే రాత్రి నిద్రించినారు. మిథిలలో ఉన్న తన కుమారులను చూడవలెనను తపనతో

దశరథుడు వేకువనే నిద్రలేచినాడు. మిథిలకు వెళ్లాలన్న ఆలోచనతో ఆనందిస్తూ దశరథుడు సుమంత్రుని చూచి ఇలా అన్నాడు.

ఉ. అందఱు మంత్రివర్యులు మహర్షులు నెమ్మది సమ్మతింప, నా
నందముతో నయోధ్యకధినాథుడు వారలఁ జూచి, “రేపు పో
వందగురీతి సిద్ధముగ వర్తిలు” డంచు వచించి యేగ, వా
రందఱు రాత్రి యచ్చటనె హాయిగఁ గూర్కిరి ప్రీతచిత్తులై. 594

తే.గీ. రాత్రి గడవగా, దశరథ రాజవరుడు
తన కుమారులఁ గనఁ గోరు తపనతోడ
మిథిలకున్ జేరెడి తలంపు మించుచుండ
హర్ష మమర సుమంత్రుతో ననియె నిటుల. 595



69. జనక దశరథ సమాగమము

అద్య సర్వే ధనాధ్యక్షాః ధన మాదాయ పుష్కలమ్।
వ్రజం త్వగ్రే సువిహితా నానారత్నసమన్వితాః॥ {1.69.2}
చతురంగబలం చాపి శీఘ్రం నిర్యాతు సర్వశః। {1.693}
వసిష్ఠో వామదేవశ్చ జాబాలి రథ కాశ్యపః।
మార్కణ్డేయః సుదీర్ఘాయుః ఋషిః కాత్యాయన స్తథా॥ {1.69.4}
ఏతే ద్విజాః ప్రయాం త్వగ్రే స్యందనం యోజయస్వ మే।
యథా కాలాత్యయో న స్యా ద్దూతా హి త్వరయంతి మామ్॥ {1.69.5}

❊ "ఓ మంత్రివర్యా! సుమంత్రా! మన అయోధ్యానగరమునుండి మిథిలకు బయలుదేరునప్పుడు పుష్కలంగా ధనమును రత్నములను తీసికొని ముందుగా ధనాధ్యక్షులు వెళ్లవలెను. ప్రసిద్ధికెక్కిన రథ గజ తురగ పద దళములు చతురంగ బలములుగా వెళ్లవలెను. వరుసగా వసిష్ఠ మహర్షి వామదేవుడు కాత్యాయనుడు కాశ్యపుడు మార్కండేయుడు జాబాలి అనెడి ద్విజోత్తములు ముందు వెళ్లవలెను. దూతలు త్వరపెడుతూ ఉన్నారు కావున ఆలస్యం లేకుండా త్వరగా బయలుదేరండి" అని దశరథ చక్రవర్తి పలికినాడు. ఆ మాటయే రాజాజ్ఞ కాగా అందఱూ బయలుదేరినారు.

సీ. ధనముల రత్నాల ఘనముగాఁ గొని ధనా
ధ్యక్షులు ముందుగా నరుగవలయు
రథగజతురగముల్ ప్రథిత పదమ్ములన్
జతురంగ బలములు చనగవలయు
వరుస వసిష్ఠుడు వామదేవుండును
గాత్యాయనుండును గాశ్యపుండు
ఘనుడు మార్కండేయు డనఘుండు జాబాలి
యను ద్విజుల్ ముందు తా మరుగవలయు

తే.గీ. రండు, దూతలు త్వరపెట్టుచుండి రిపుడె,
యాలసింపగఁ దగదు ప్రయాణ మగుడు
వైళమే యంచు దశరథ పార్థివుండు
పలుక రాజాజ్ఞగా నది పరిఢవిల్లె. 596

వచనాత్తు నరేంద్రస్య సా సేనా చతురంగిణీ।
రాజాన మృషిభి స్సార్ధం వ్రజంతం పృష్ఠతోఽన్వగాత్॥ {1.69.6}
గత్వా చతురహం మార్గం విదేహా నభ్యుపేయివాన్।
రాజా తు జనకః శ్రీమాన్ శ్రుత్వా పూజా మకల్పయత్॥ {1.69.7}
స్వాగతం తే మహారాజ దిష్ట్యా ప్రాప్తోఽసి రాఘవ॥ {1.69.9}
పుత్రయో రుభయోః ప్రీతిం లప్స్యసే వీర్యనిర్జితామ్। {1.69.10}

❋ దశరథ చక్రవర్తి వసిష్ఠాది ద్విజోత్తములతో కూడి అయోధ్యనుండి బయలుదేరినాడు. రథగజతురగ పదాది చతురంగ బలములు రక్షణకై రాజు వెంట కదలినవి. అందఱూ నాలుగురోజుల ప్రయాణం తరువాత విదేహదేశమును సమధికోత్సాహంతో చేరుకొన్నారు. ఇనకులేశుడైన దశరథ మహారాజు మిథిలకు వచ్చినాడనే వార్త నందుకొన్న జనకుడు వృద్ధరాజైన దశరథుని సన్నిధికి చేరుకొని అంజలి ఘటించాడు. "ఓ కోసలాధిపా! మీకు స్వాగతము. మీ రాక మాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. పరమపావనులైన మీ కుమారుల వివాహము మాకు పుణ్యప్రదము భాగ్యప్రదము అని నేను భావిస్తూ ఉన్నాను" అని వినయంగా విన్నవించుకొన్నాడు.

మ. నరపాలుండు ద్విజాళి తోడుతఁ బ్రయాణమ్మొ చనన్, వెన్క స
త్వర మేగెన్ జతురంగ సైన్యబలముల్ భద్రమ్ము చేకూర్పగా,
సరిగా నాల్గు దినమ్ములే గడువఁ బ్రస్థానమ్మునన్, జేరి రం
దఱు సంతృప్తవిదేహదేశము మహోత్సాహమ్ముతోఁ బ్రీతితో. 597

చం. ఇనకులనాథుడౌ దశరథేశుడు వచ్చిన వార్త నంది, యా
జనకుడు వృద్ధభూధవుని సన్నిధిఁ జేరి, వినమ్రుడౌచు ని

ట్లనె "నరనాథ! స్వాగతము హర్షముఁ గూర్చెను మీదురాక, పా
వనులగు మీ కుమారుల వివాహము పుణ్యతమమ్ము భాగ్యమున్" 598

దిష్ట్యా ప్రాప్తో మహాతేజా వసిష్ఠో భగవా నృషిః॥ {1.69.10}
సహ సర్వై ర్ద్విజ శ్రేష్ఠై ర్దేవై రివ శతక్రతుః।
దిష్ట్యా మే నిర్జితా విఘ్నా దిష్ట్యా మే పూజితం కులమ్॥ {1.69.11}
రాఘవై స్సహ సంబంధా ద్వీర్యశ్రేష్ఠై ర్మహాత్మభిః।
శ్వః ప్రభాతే నరేంద్రేంద్ర నిర్వర్తయితు మర్హసి॥ {1.69.13}
యజ్ఞస్యాంతే నరశ్రేష్ఠ వివాహ మృషిసమ్మతమ్। {1.69.14}

❀ జనక మహారాజు కోసలరాజునకు స్వాగతం పలికి "ఓ దశరథ మహారాజా! దేవతలతో కూడియున్న ఇంద్రుడు వచ్చినట్లుగా భూసురోత్తములతో కూడి ఈ వసిష్ఠమహర్షి మీతోపాటు ఈ మిథిలకు వచ్చినాడు. పూజ్యుడైన ఈ మునీశ్వరుడు మీతోపాటు వచ్చినందువలన మాకు ఎంతో ఆనందంగా ఉన్నది. వీరి రాకతో విఘ్నములన్నీ తొలగిపోయినవి. మా కులము అభ్యున్నతిని పొందినది. రఘువీరుని వివాహబంధము మాకు ఒక దివ్యబంధమును సమకూర్చగలదు. రేపటి ఉదయమున మేము చేయుచున్న యజ్ఞము పరిసమాప్తము కాగలదు. రఘురామునికి తండ్రియైన మీరు మునీంద్రుల సమ్మతితో వివాహమును జరిపించండి" అని విన్నవించుకొన్నాడు. అప్పుడు ప్రసన్నమనస్కుడైన ఆ అయోధ్యాధిపతి మిథిలాధిపతిని చూచి మృదుమధుర వాక్కులతో ఇలా మాట్లాడనారంభించినాడు.

చం. "త్రిదశులఁ గూడి శక్రు దరుదెంచిన రీతి ద్విజోత్తమాళితో
నిదె యరుదెంచెఁ బూజ్యుడు ఋషీశ్వరు డార్యుడునౌ వసిష్ఠు, డిం
పొదవగ, విఘ్నముల్ తొలగె, నున్నతి నందెను మా కులమ్ము, శ్రీ
ప్రదులగు రాఘవాఢ్యుల వివాహము లయ్యెడి దివ్యబంధముల్" 599

ఉ. "రేపటి సుప్రభాతమున శ్రీకరయజ్ఞసమాప్తి యయ్యెడిన్,
భూపవరేణ్య! మోదమునఁ బూజ్యమునీంద్రులు సమ్మతింప, స

ల్లాపములన్ వివాహమును దండ్రిగ సల్పు" డనంగ నా యయో
ధ్యాపతి పల్కె నిట్లు మిథిలాధిపుఁ జూచి ప్రసన్నచిత్తుడై" **600**

ప్రతిగ్రహో దాతృవశః శ్రుత మేత న్మయా పురా॥ {1.69.14}
యథా వక్ష్యసి ధర్మజ్ఞ తత్కరిష్యామహే వయమ్। {1.69.15}
తత స్సర్వే మునిగణాః పరస్పరసమాగమే॥ {1.69.16}
హర్షేణ మహతా యుక్తా స్తాం నిశా మవసన్ సుఖమ్।
రాజా చ రాఘవౌ పుత్రౌ నిశామ్య పరిహర్షితః॥ {1.69.17}
ఉవాస పరమప్రీతో జనకేన సుపూజితః। {1.69.18}

❋ "ఓ జనకమహారాజా! దానం స్వీకరించేవాడు దాతయొక్క వశంలో ఉండి ఆ దాత ఇష్టప్రకారం మెలగుతాడు. మీరు కన్యాదాతలు. నేను స్వీకరించేవాడిని. కాబట్టి నేను మీ మాటయే గొప్పదని భావించి మిమ్ము అనుసరిస్తూ మీకు సంతోషాన్ని కలిగిస్తూ ఉండగలను" అని దశరథుడు ఎంతో విజ్ఞతతో పలికినాడు. దశరథుని సూక్తులను విని జనకుడు ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని పొందినాడు. అయోధ్య నుండి వచ్చిన మునులు, మిథిలలో ఉండిన మునులు కలిసికొన్నారు. అందఱూ కలిసి అక్కడనే ఆనాటి రాత్రిని సంతోషంగా గడిపినారు. పంక్తిరథుడు అక్కడ తన కుమారులైన రామలక్ష్మణులను చూచి పులకించినాడు. జనకుడు చేసిన సన్మానమును సంతోషంగా స్వీకరించినాడు.

ఉ. "దాతృవశమ్మునన్ మెలగు దానముఁ గైకొనువాడు, గాన మీ
చేతము పొంగ మీ నుడి విశిష్ట మటంచు సమాచరించుచున్
బ్రీతినిఁ గూర్చువాడ" నని విజ్ఞతఁ బంక్తిరథుండు పల్కగా,
నాతని సూక్తులన్ జనకు డందెను విస్మయముం బ్రమోదమున్. **601**

ఉ. మౌనివరుల్ పరస్పర సమాగమ మందిరి, హర్షమంది తా
మా నిశి నచ్చటన్ గడపి, రాదటఁ బంక్తిరథుండు పుత్రులన్
గానగనయ్యె నెంతయు సుఖమ్మున దేహము పుల్కరింప, స
న్మానము నందె నా జనకనాథునిచేతఁ బ్రహృష్టచిత్తుడై. **602**

70. వసిష్ఠుడు ఇక్ష్వాకువంశమును వర్ణించుట

భ్రాతా మమ మహాతేజా యవీయా నతిధార్మికః।
కుశధ్వజ ఇతి ఖ్యాతః పురీ మధ్యవస చ్ఛుభామ్॥ {1.70.2}
వార్యాఫలకపర్యంతాం పిబ న్నిక్షుమతీం నదీమ్।
సాంకాశ్యాం పుణ్యసంకాశాం విమాన మివ పుష్పకమ్॥ {1.70.3}
త మహం ద్రష్టు మిచ్ఛామి యజ్ఞగోప్తా స మే మతః।
ప్రీతిం సోఽపి మహాతేజా ఇమాం భోక్తా మయా సహ॥ {1.70.4}

❊ జనకమహారాజు యజ్ఞకార్యములను నిర్వహిస్తూ, వివాహశోభతో విరాజిల్లే కుమార్తెలను చూస్తూ సంతోషించినాడు. ధన్యుడనైనాను అని మురిసిపోతూ రాత్రిని గడపినాడు. ఉదయాన్నే నిద్ర లేచి పూర్వసంధ్యాకాల పూజలను పూర్తిచేసి మునివరులను పురోహితులను పిలిపించినాడు. వచ్చినవారిని చూచి "ఓ పురోహితులారా! నాతమ్ముడైన కుశధ్వజుడు నయవిశారదుడు. సౌమ్యుడు. పావనమైన పుష్పక విమానం వలె ప్రకాశించే సాంకాశ్యము అనే పట్టణమును పరిపాలిస్తూ ఉన్నాడు ఇక్షుమతీ నదీజలముల కారణంగా సాంకాశ్యనగర ప్రజలు హాయిగా జీవించుచున్నారు. శూరుడైన కుశధ్వజుడు దుర్గసంరక్షణ చేయగల గొప్ప భుజబలము గలవాడు. నా యాగమును సంరక్షించువాడు. సీతారాముల కల్యాణమును చూడదగినవాడు. నా తమ్ముడైన కుశధ్వజుని నేను ఇప్పుడు చూడవలెనని కోరుకొనుచున్నాను. కావున మీరు వెళ్లి కుశధ్వజుని త్వరగా నా దగ్గఱకు తీసికొని రండి" అని జనకుడు నిండుమనస్సుతో పలికినాడు.

చం. జనకుడు యజ్ఞకార్యములఁ జక్కగఁ జేసి, వివాహశోభతోఁ
దనరెడి బిడ్డలం గనుచు, ధన్యుడ నైతి నటంచునెంచి, రా
త్రిని గడపెన్, బ్రభాతమునఁ బ్రీతినిఁ గాల్యము లాచరించి, స
న్మునులఁ బురోహితుం బిలిచి పూర్ణమనమ్మునఁ బల్కె నిట్టులన్. 603

సీ. నా తమ్ము డెన్నగా నయకోవిదుండు కు
శధ్వజుం డనువాడు సౌమ్యగుణుడు
పావనోదీర్ణపుష్పక విమానము వోలెఁ
బుణ్యతేజస్ఫురత్పూజ్యమగుచు
వరలెడి సాంకాశ్య పట్టణ మ్మేలుచు
నిక్షుమతీ జల తృప్తు డగుచు

దోః(ప్రభావస్ఫూర్తి దుర్గసంరక్షణన్
గావించు శూరుడై ఘనత నుండు
తే.గీ. నాదు యాగమ్ము రక్షించినాడు బుధుడు
సుగతి నుద్వాహవిధిఁజూడఁ దగిన యాప్తు
డతనిఁ జూడంగ మనమున నాశ కలిగెఁ
బిలుచుకొనిరండు నా తమ్ము వేగముగను.” 604

శాసనాత్తు నరేంద్రస్య ప్రయయు శ్రీఘ్రవాజిభిః।
సమానేతుం నరవ్యాఘ్రం విష్ణు మింద్రాజ్ఞయా యథా॥ {1.70.5}
ఆజ్ఞయాఽథ నరేంద్రస్య ఆజగామ కుశధ్వజః।
స దదర్శ మహాత్మానం జనకం ధర్మవత్సలమ్॥
సోఽభివాద్య శతానందం రాజానం చాపి ధార్మికమ్।
రాజ్యార్హం పరమం దివ్య మాసనం చాధ్యరోహత॥ {1.70.7}

❋ దేవేంద్రుని ఆజ్ఞతో అతని తమ్ముడైన ఉపేంద్రుని వద్దకు వెళ్లినట్లు, మునులు జనకమహారాజు ఆజ్ఞతో అతని తమ్ముడైన కుశధ్వజుని వద్దకు వెళ్లినారు. జనకుని ఆకాంక్షను తెలిపినారు. ఆ కుశధ్వజ మహారాజు వెంటనే జనకుని చేరుకొని సంతోషించినాడు. కుశధ్వజుడు ముందుగా పురోహితుడగు శతానందునికి ఆ తరువాత అన్నయైన జనకమహారాజునకు నమస్కరించి ఉచితాసనంలో కూర్చున్నాడు. రాజులిరువురు పరస్పరం క్షేమవార్తలను గురించి మాట్లాడుకొనినారు. ఆ తరువాత వారు సుదామనుడు అనే మంత్రిసత్తమునితో ఇలా అన్నారు.

చం. ఘనుడగు శక్రు నాజ్ఞఁ గొని కంజదళాక్షుని చేరినట్లుగా,
జనకుని యాజ్ఞ నా మునులు సాగిరి వైళమ, తత్కుశధ్వజున్
గనుఁగొని ప్రీతితో జనకకాంక్షనుఁ దెల్పిరి, తన్నృపాలకుం
దనఘుడు నేగుదెంచి తనయన్నను జూచెఁ బ్రమోద మందుచున్. 605

ఉ. పొందుగ నా కుశధ్వజుడు ముందు ప్రణామ మొనర్చె నా శతా
నందుని, కంత నా జనకనాథునికిం బ్రణమిల్లి, యాసనం

బందునఁ గూరుచుండెను, ధరాధిపు లిర్వురు క్షేమవార్త లా
నందముఁ గూర్పగాఁ, బలికినారు సుదామనుఁ జూచి యిట్టులన్. 606

గచ్ఛ మంత్రిపతే శీఘ్ర మైక్ష్వాకు మమితప్రభమ్।
ఆత్మజై స్సహ దుర్ధర్ష మానయస్వ సమంత్రిణమ్॥ {1.70.9}
అయోధ్యాధిపతే వీర వైదేహో మిథిలాధిపః।
స త్వాం ద్రష్టుం వ్యవసిత స్సోపాధ్యాయపురోహితమ్॥ {1.70.11}
మంత్రిశ్రేష్ఠవచ శ్శ్రుత్వా రాజా సర్షిగణ స్తదా
సబంధు రగమ త్తత్ర జనకో యత్ర వర్తతే॥ {1.70.12}

❊ జనకుడు కుశధ్వజుడు ఇరువురూ సుదామనుని చూచి "ఓ మంత్రిసత్తమా! నీవు కోసలేశుని దగ్గఱకు వెళ్లుము. ఇక్ష్వాకుకులోద్భవుడగు ఆ దశరథమహారాజు మన మిథిలకు వచ్చియున్నాడు. ఆ పంక్తిరథుని పుత్రమిత్రబంధుపురోహిత సహితంగా సగౌరవంగా ఇచ్చటికి తీసికొనిరమ్ము" అని ఆదేశించినారు. ఆ సుదామనుడు ఎంతో సంతోషంతో దశరథచక్రవర్తిని సమీపించి నమస్కరించి "ఓ మహారాజా! మా రాజు జనకుడు మిమ్ము చూడదలచి సపరివారంగా రండి అని ఆహ్వానం పంపినాడు. మీకు స్వాగతము" అని పలుకగా ఆ అయోధ్యాధిపతి ప్రసన్నమనస్కుడై సపరివారంగా మిథిలాధిపతి వద్దకు వచ్చినాడు.

ఉ. "శ్రీకరుడా! సుదామనుడ! చేరుము పంక్తిరథేశు చెంతకున్,
బ్రాకటధర్మవర్తనుడు పార్థివవంద్యుడు కోసలేశు డి
క్ష్వాకుకులోద్భవుండు శుభకామనతో నరుదెంచె, నాతనిన్
గైకొనిరమ్ము పుత్రహితకారిపురోహితమంత్రియుక్తునిన్" 607

చం. అన విని మంత్రిసత్తముడు హర్షము నందుచు నేగి, కోసలే
శునిఁ గని మ్రొక్కి యిట్లనియె "చూడగగోరుచు నున్నవాడు మా
జనకుడు మిమ్ము, మీ హితుల, స్వాగత మార్య" యనంగ, నాతడున్
జనకునిఁ జేరవచ్చె మదిఁ జాల ప్రసన్నత నంది ప్రీతిమై. 608

స రాజా మంత్రి సహిత స్సోపాధ్యాయ స్సబాంధవః।
వాక్యం వాక్యవిదాం శ్రేష్ఠో వైదేహ మిద మబ్రవీత్॥ {1.70.13}

విదితం తే మహారాజ ఇక్ష్వాకుకులదైవతమ్।
వక్తా సర్వేషు కృత్యేషు వసిష్ఠో భగవా నృషిః॥ {1.70.14}
విశ్వామిత్రాభ్యనుజ్ఞాత స్సహ సర్వై ర్మహర్షిభిః।
ఏష వక్ష్యతి ధర్మాత్మా వసిష్ఠో మే యథాక్రమమ్॥ {1.70.15}

❊ ధీమంతుడు ప్రశస్తుడు తేజోవంతుడు అగు కోసలరాజు దశరథుడు ఉపాధ్యాయులతో బంధువులతో మంత్రులతో కూడి జనకుని వద్దకు వచ్చి "ఓ మహాత్మా! మా శ్రేయోభిలాషియైన వసిష్ఠుడు ముందుగా మాట్లాడగలడు. ఈ బ్రహ్మర్షి మా ఇక్ష్వాకువంశమునకు ఆరాధ్యదైవము. సముచితరీతి మాట్లాడగల వక్త. విశ్వామిత్ర మహర్షి అనుమతితో నా వంశవృక్షమును వివరింపగలడు" అని పలికినాడు.

ఉ. ధీయుతుడున్ బ్రశస్తుడు సుతేజుడు కోసలభూవిభుం డుపా
ధ్యాయులతోడ బంధుసచివాదులతోడను గూడివచ్చి, తే
జోయుతుడైన తజ్జనకుఁ జూచుచుఁ బల్కె నిటుల్ మహాత్మ! మా
శ్రేయము గోరువాడగు వసిష్ఠుడు ముందుగ మాటలాడెడిన్. 609

తే.గీ. తలప నిక్ష్వాకుకులదైవత మ్మితండు
యుక్తరీతి సంభాషించు వక్త యితడు
మునివరుడగు విశ్వామిత్రు ననుమతిఁగొని
విమలమౌ నాదు వంశక్రమమును దెలుపు. 610

అవ్యక్తప్రభవో బ్రహ్మా శాశ్వతో నిత్య అవ్యయః॥ {1.70.17}
తస్మా న్మరీచిః సంజజ్ఞే మరీచేః కాశ్యప స్సుతః।
వివస్వాన్ కాశ్యపా జ్జజ్ఞే మను ర్వైవస్వతః స్మృతః॥ {1.70.18}
మనుః ప్రజాపతిః పూర్వ మిక్ష్వాకుస్తు మనోః సుతః।
త మిక్ష్వాకు మయోధ్యాయాం రాజానం విద్ధి పూర్వకమ్॥ {1.70.19}
ఇక్ష్వాకోస్తు సుతః శ్రీమాన్ కుక్షి రిత్యేవ విశ్రుతః।
కుక్షే రథాత్మజః శ్రీమాన్ వికుక్షి రుపపద్యత॥ {1.70.20}
వికుక్షేస్తు మహాతేజా బాణః పుత్రః ప్రతాపవాన్।
బాణస్య తు మహాతేజా అనరణ్యః ప్రతాపవాన్॥ {1.70.21}

❀ దశరథ చక్రవర్తి తన సమక్షంలో ఉన్న జనకుడు కుశధ్వజుడు మొదలైన రాజులను చూచి, తన వంశవృక్షమును గుఱించి కులగురువైన వసిష్ఠుడు విశదీకరించగలడు అని పలికిన తరువాత, బ్రహ్మర్షి యైన వసిష్ఠుడు దశరథుని వంశవృక్షాన్ని ఇలా వివరించసాగినాడు. "మొట్టమొదట అజుడు శాశ్వతుడు స్వయంభువు అవ్యయుడు సృష్టికర్త అగు బ్రహ్మదేవుడు విరాజిల్లుచుండగా ఆ బ్రహ్మకు మరీచి జన్మించినాడు. ఆ తరువాత క్రమంగా మరీచికి కాశ్యపుడు, కాశ్యపునికి వివస్వంతుడు, వివస్వంతునికి ప్రజాపతియైన మనువు, మనువునకు అయోధ్యాధిపతియైన ఇక్ష్వాకుడు, ఇక్ష్వాకునికి కుక్షి, కుక్షికి వికుక్షి, వికుక్షికి బాణుడు, బాణునికి అనరణ్యుడు కుమారులుగా జన్మించినారు.

తే.గీ. అనుచ దశరథభూపతి యచట నున్న
రాజవర్యుల వీక్షించి రక్తిఁ బలుక,
నెమ్మి నిక్ష్వాకు వంశక్రమమ్ముఁ గూర్చి
నుడివె బ్రహ్మర్షియౌ వసిష్ఠుడు హితోక్తి. 611

సీ. అజుడు, శాశ్వతుడు, స్వయంభువుగా నవ్య
యుడుగ స్రష్టగ బ్రహ్మ యొప్పుచుండ
నా బ్రహ్మకు మరీచి యవతరించగఁ గాశ్య
పుడు మరీచికిఁ బుట్టెఁ బుత్రుడుగను
గాశ్యపుసుతుడుగాఁ గలిగె వివస్వంతు
డతని సుతుడు ప్రజాపతి మనువనఁ
గలిగె, నాతనికి నిక్ష్వాకు నామకు డయో
ధ్యాధినాథుడు గల్గి యవని నేలె
తే.గీ. నట్టి యిక్ష్వాకు నృపతికిఁ బుట్టెఁ గుక్షి
కుక్షి కాత్మజు డగుచు వికుక్షి పుట్టె
బాణు డా వికుక్షికిఁ బుట్టె వరసుతుడుగ
నతని కనరణ్యుడు జనించె నాత్మజుడుగ. 612

అనరణ్యాత్ పృథు ర్జజ్ఞే త్రిశంకుస్తు పృథో స్సుతః।
త్రిశంకో రభవత్ పుత్రో దుందుమారో మహాయశాః॥ {1.70.22}

యువనాశ్వ సుత స్త్వాసీత్ మాంధాతా పృథివీపతిః।
మాంధాతుస్తు సుతః శ్రీమాన్ సుసంధి రుదపద్యత॥ {1.70.23}
సుసంధే రపి పుత్రౌ ద్వౌ ధ్రువసంధిః ప్రసేనజిత్।
యశస్వీ ధ్రువసంధేస్తు భరతో నామ నామతః।
భరతాత్తు మహాతేజా అసితో నామ జాతవాన్॥ {1.70.24}

❊ అనరణ్యునకు పృథువు, పృథువునకు త్రిశంకుడు, త్రిశంకునికి దుందుమారుడు పుట్టినారు. యువనాశ్వుడు అను మరొక పేరుగల ఆ దుందుమారునికి మాంధాత, మాంధాతకు సుసంధి కలిగినారు. సుసంధికి ధ్రువసంధి ప్రసన్నజిత్తు అనెడి కుమారులు పుట్టినారు. ధ్రువసంధికి భరతుడు, భరతునికి అసితుడు జన్మించినారు. శూరులు, శశిబిందుపాలకులు అగు హైహయులు, తాలజంఘులు యుద్ధమున అసితుని ఓడించినారు.

సీ. అనరణ్యునకుఁ బృథు వాత్మజుం డతనికిఁ
గలిగెఁ ద్రిశంకుండు ఘనయశుండు
కలిగె నాతనికి నఖండుడు దుందుమా
రుడు, యువనాశ్వుడున్ రూఢి నతడె
తనయు డాతనికి మాంధాత యాతనికి సు
సంధి జన్మించెను సౌమ్యగుణుడు
సజ్జనులౌ ధ్రువసంధి ప్రసన్నజి
త్తులు సుసంధికి సుతుల్ కలిగినారు
తే.గీ. తుష్టి ధ్రువసంధికిన్ భరతుండు పుట్టె
భరతునికి గల్గె నసితుడు భద్రమూర్తి
అసితు గెలిచిరి శూరులు హైహయులును
దాలజంఘులు శశిబిందుపాలకులును. 613

తాంస్తు స ప్రతియుద్ధ్యన్ వై యుద్ధే రాజా ప్రవాసితః।
హిమవంత ముపాగమ్య భృగుప్రస్రవణేఽవసత్॥ {1.70.26}

అసితోఽల్పబలో రాజా మంత్రిభిః సహితస్తదా।
ద్వే చాస్య భార్యే గర్భిణ్యౌ బభూవతు రితి శ్రుతమ్॥ {1.70.27}
ఏకా గర్భవినాశాయ సపత్న్యై సగరం దదౌ। {1.70.28}
చ్యవనం తు నమస్కృత్య రాజపుత్రీ పతివ్రతా।
పతిశోకాతురా తస్మాత్ పుత్రం దేవీ వ్యజాయత॥ {1.70.33}
సపత్న్యా తు గర స్తస్యై దత్తో గర్భ జిఘాంసయా।
సహ తేన గరేణైవ జాతస్స సగరోఽభవత్॥ {1.70.34}

❋ అసితుడు అపజయమును పొందినవాడై హిమాద్రికి చేరినాడు. అచ్చట భృగుప్రశ్రవణ గిరియందు తన ఇద్దఱు భార్యలతో కలిసి నివసించసాగినాడు. రాజైన అసితుని చెంత మంత్రులు కూడా ఉండినారు. ఇద్దరు రాణులు గర్భమును ధరించినారు. వారిలో కాళింది అనెడి రాణి అసూయగలదై తన సవతికి గరళముతో కూడిన ఆహారపదార్థమును తినిపించినది. ఆ రాణులిరువురూ అచ్చటనే ఉన్న చ్యవనమహర్షిని భక్తితో పూజించినారు. విషాహారమును భుజించిన రాణి చ్యవనుని చూచి "ఓ మహర్షీ! నాకు గొప్పకుమారుడు కలుగునట్లు దీవించండి" అని వేడుకొనగా ఆ మహర్షి ఆ సాధ్విని చూచి "అమ్మా! నీకు గరళముతో కూడినవాడు తేజోవంతుడు అగు కుమారుడు జన్మించగలడు" అని ఆశీర్వదించినాడు. అందువలన ఆమెకు గరముతో కూడినవాడు పుత్రుడుగా పుట్టినాడు. ఆ కారణముచే అతనికి సగరుడు అను పేరు రూఢిలోనికి వచ్చినది.

తే.గీ. అసితు డపజయ మంది హిమాద్రిఁ జేరి
నెమ్మి వర భృగుప్రస్రవణమ్ము నందు
మంత్రియుతుడుగ వసియించి మాన్యుడగుచు
మెలగె పత్నీద్వయమ్ముతో మేలునంద. 614

తే.గీ. రక్తి పత్నీద్వయమ్ము గర్భము ధరింపఁ
దరుణి కాళింది సవతికి గరళ మిడియె
నిర్వురున్ భక్తి చ్యవన మునీశుఁ జేరి
కొలిచినారలు శుభములఁ గోరినారు. 615

తే.గీ. గరళమును గొన్న సతి పుత్రవరునిఁ గోరి
చ్యవను భార్గవుఁ బ్రార్థింప "సాధ్వి! నీకుఁ

గలుగు వీరుండు తేజస్వి గరయుతుండు"
ననగ సగరుండు జనియించె నా తరుణికి. 616

సగరస్యాఽసమంజస్తు అసమంజా త్తథాంశుమాన్।
దిలీపోఽంశుమతః పుత్రో దిలీపస్య భగీరథః॥ {1.70.35}
భగీరథాత్ కకుత్స్థశ్చ కకుత్స్థస్య రఘు స్సుతః।
రఘోస్తు పుత్ర స్తేజస్వీ ప్రవృద్ధః పురుషాదకః॥ {1.70.36}
కల్మాషపాదో హ్యభవ త్తస్మాత్ జాతస్తు శఙ్ఖణః।
సుదర్శనః శంఖణస్య అగ్నివర్ణ స్సుదర్శనాత్॥ {1.70.37}
శీఘ్రగ స్త్వగ్నివర్ణస్య శీఘ్రగస్య మరు స్సుతః। {1.70.38}

❃ సగరచక్రవర్తికి అసమంజసుడు జన్మించినాడు. ఆ అసమంజసునికి అంశుమంతుడు, అంశుమంతునికి దిలీపుడు, దిలీపునికి భగీరథుడు, భగీరథునికి కకుత్స్థుడు, కకుత్స్థునికి రఘుమహారాజు, రఘువునకు పురుషాదుడు కల్మాషపాదుడు అగు ప్రవృద్ధుడు, ప్రవృద్ధునికి శంఖణుడు, శంఖణునికి సుదర్శనుడు, సుదర్శనునికి అగ్నివర్ణుడు, అగ్నివర్ణునికి శీఘ్రగుడు క్రమముగా జన్మించినారు.

సీ. ఆ సగరాఖ్యున కసమంజసుడు పుట్టె
నంశుమంతుడు పుట్టె నతనికంత
ఘనుడు దిలీపుడు కలిగె నాతనికి భ
గీరథుండు జనించెఁ గీర్తనీయు
డాతనికి కకుత్స్థ దతనికి రఘుమహా
రాజు జన్మించె నా రాజవరున
కును బుట్టెను బ్రవృద్ధ దను నామమున పురు
షాదుడు కల్మాషపాదు డగుచు
తే.గీ. జనన మొందె నాతనికిని శంఖణుండు
తనయుడయ్యె నాతనికి సుదర్శనుండు

నుడువ నతనికి నగ్నివర్ణుడు జనించె
శీఘ్రగుడు పుట్టె నతనికి శిష్టవరుడు. 617

శీఘ్రగ స్త్వగ్నివర్ణస్య శీఘ్రగస్య మరు స్సుతః।
మరోః ప్రశుశ్రుక స్త్వాసీ దంబరీషః ప్రశుశ్రుకాత్॥ {1.70.38}
అంబరీషస్య పుత్రోఽభూ న్నహుషః పృథివీపతిః।
నహుషస్య యయాతి స్తు నాభాగస్తు యయాతిజః॥ {1.70.39}
నాభాగస్య బభూవాజోఽజా ద్దశరథోఽభవత్।
అస్మా ద్దశరథా జ్జాతౌ భ్రాతరౌ రామలక్ష్మణౌ॥ {1.70.40}

❈ శీఘ్రగునికి మరువు జన్మించినాడు. మరువునకు ప్రశుశ్రుడు, ప్రశుశ్రునికి అంబరీషుడు, అంబరీషునికి నహుషుడు, నహుషునికి యయాతి, యయాతికి నాభాగుడు, నాభాగునికి అజుడు క్రమంగా పుట్టినారు. ఆ అజునికి ఈ దశరథ మహారాజు జన్మించినాడు. ఈ దశరథుని కుమారులే ఈ రామలక్ష్మణులు.

తే.గీ. మరువు గలిగె శీఘ్రగునికి, మహి నతనికిఁ
గలిగెను ప్రశుశ్రుకుడు, హితకరు డతనికి
నంబరీషుడు జనియించె, నతనికి నహు
షుడు జనించె, నతని కొమరుడు యయాతి. 618

తే.గీ. ఆ యయాతికి నాభాగు డవతరించె
నజుడు నాభాగునికిఁ బుట్టె నాత్మజుడుగ
నజుని కీ దశరథనృపు డవతరించె
రాముడును లక్ష్మణుండు నీ రాజుసుతులు. 619

ఆదివంశవిశుద్ధానాం రాజ్ఞాం పరమధర్మిణామ్।
ఇక్ష్వాకుకులజాతానాం వీరాణాం సత్యవాదినామ్॥ {1.70.41}

రామలక్ష్మణయో రర్థే త్వత్సుతే వరయే నృప।
సదృశాభ్యాం నరశ్రేష్ఠ సదృశే దాతు మర్హసి॥ {1.70.42}

❊ ఓ మిథిలాధిపతీ! ఈ రామలక్ష్మణుల వంశములోని మొదటి రాజునుండి అందఱూ విశుద్ధచరిత్రులు. పరమధర్మపరులు. భద్రాత్ములు. ఇక్ష్వాకు కులమున జన్మించిన ఈ రఘువీరులు సత్యవాదులు. సాధువులచే నుతింపబడినవారు. ఈ రామలక్ష్మణులు యోగ్యులు. సీత ఊర్మిళ అనెడి నీ కుమార్తెలను క్రమంగా వివాహమాడుటకు అన్నివిధములా తగినవారు. దశరథ చక్రవర్తి కుమారులైన ఈ ఇరువురు వీరులు. శూరులు. బుధులు. నీతిపరులు. కాబట్టి నీ కుమార్తెలను వీరికిచ్చి వివాహం జరిపించండి అని నేను మిమ్ములను కోరుచున్నాను. పరిపూర్ణమనస్కుడవై ఈ రెండు కల్యాణములను జరిపించేందుకు నీ సమ్మతిని తెలియజేయి. ఓ విదేహరాజా! నీకు శుభం కలుగును గాక!" అని బ్రహ్మర్షియైన వసిష్ఠుడు రాజర్షియైన జనకునితో పలికినాడు.

సీ. ఆదివంశవిశుద్ధు లైనట్టివారును
పరమధర్మపరులు భద్రమతులు
నిక్ష్వాకుకులజాతు లీ రఘువీరులు
సత్యవాదులు సాధుజనవినుతులు
నీ రామలక్ష్మణు లెన్నగా యోగ్యులు
నీదు పుత్రికలకు నిశ్చయముగఁ
దగినట్టి వార లీ దాశరథులు వీర
వరులు శూరులు నీతిపరులు బుధులు
తే.గీ. కాన వీరికి నీ పుత్రికల నొసంగి
కూర్మి నుద్వాహ మొనరింపఁ గోరుచుంటిఁ
బూర్ణమనమునఁ గల్యాణములనుఁ జేయ
సమ్మతింపుము జనకరాజర్షి! శుభము. 620

71. జనకుడు తన నిమివంశమును వివరించుట

ఏవం బ్రువాణం జనకః ప్రత్యువాచ కృతాంజలిః।
శ్రోతు మర్హసి భద్రం తే కులం నః పరికీర్తితమ్॥ {1.71.1}
ప్రదానే హి మునిశ్రేష్ఠ కులం నిరవశేషతః।
వక్తవ్యం కులజాతేన తన్నిబోధ మహామునే॥ {1.71.2}

❋ దాశరథి యైన శ్రీరాముని వంశవృక్షమును గుఱించి వసిష్ఠ మహర్షి ఎంతో ప్రీతితో జనకునికి విశదీకరింపగా, జనకమహారాజు అచ్చట ఉన్న దశరథుడు మొదలైనవారికి తన వంశక్రమమును గుఱించి వివరింపదలచినాడు. "ఓ పెద్దలారా! కన్యాదాన సమయమున కన్యకయొక్క తండ్రి తన కులముయొక్క గొప్పదనమును గుఱించి, సత్కీర్తి గడించిన తన పూర్వీకుల గుఱించి తప్పనిసరిగా తెలియజేయాలి" అని అంటూ మిథిలాధిపతి తన వంశవృక్షమును గుఱించి ఇలా విశదీకరించసాగినాడు.

తే.గీ. ప్రీతి నిటుల వసిష్ఠుడు విశదముగను
రామవంశక్రమ మ్మనురక్తిఁ దెలుపఁ,
దనదు వంశక్రమమ్మును విను డటంచు
జనకభూపతి వివరింపసాగె నపుడు. 621

తే.గీ. కన్యకను దాన మిచ్చెడి కాలమందు
సత్కులోద్భవుడైనట్టి జనకు డెపుడు
వినుతి కెక్కిన పూర్వీఋలను గుఱించి
తెలుపఁ దగునని జనకుడు పలికె నిటుల. 622

రాజాఽభూ త్త్రిషు లోకేషు విశ్రుత స్స్వేన కర్మణా।
నిమిః పరమధర్మాత్మా సర్వసత్త్వవతాం వరః॥ {1.71.3}
తస్య పుత్రో మిథి ర్నామ మిథిలా యేన నిర్మితా।
ప్రథమో జనకో నామ జనకాద ప్యుదావసుః॥ {1.71.4}

ఉదావసోస్తు ధర్మాత్మా జాతో వై నందివర్ధనః।
నందివర్ధనపుత్రస్తు సుకేతు ర్నామ నామతః॥ {1.71.5}
సుకేతో రపి ధర్మాత్మా దేవరాతో మహాబలః।
దేవరాతస్య రాజర్షే ర్బృహద్రథ ఇతి స్మృతః॥ {1.71.6}

❋ "ఓ వసిష్ఠ మహర్షీ! మా వంశమునకు మూలపురుషుడు నిమి చక్రవర్తి. తన పుణ్యకర్మలచేత ముల్లోకములలో సత్కీర్తి నందినవాడు, సుగుణవంతుడు, సత్యధర్మరతుడు, సత్వసంపన్నుడు, ధీమంతుడు అగు ఆ నిమి చక్రవర్తికి మిథి అను కుమారుడు జన్మించినాడు. గొప్ప నగరముగా ప్రసిద్ధి వహించిన ఈ మిథిలానగరము ఆ మిథి చక్రవర్తి చేతనే నిర్మింపబడినది. జనక రాజులలో మొదటివాడుగా ఆ మిథి కీర్తినందినాడు. ఆ మిథి చక్రవర్తికి ఉదావసుడు, ఉదావసునికి నందివర్ధనుడు, నందివర్ధనునికి సుకేతుడు, సుకేతునికి దేవరాతుడు, దేవరాతునికి బృహద్రథుడు క్రమంగా జన్మించినారు.

సీ. తన పుణ్యకర్మల ఘనత ముల్లోకాల
సత్కీర్తిఁ గన్న ప్రశస్తగుణుడు
సత్యధర్మరతుండు సత్వసంపన్నుండు
నిమి చక్రవర్తి ధీనియతి నుండె
నతని పుత్రుడు మిథి యాతడే నిర్మించె
మిథిలాపురమ్మును బ్రథితముగను
బ్రథమ జనకుడుగఁ బ్రథితు డతనికి ను
దావసుడు జనించె ధర్మమూర్తి
తే.గీ. యాతనికి నందివర్ధను డవతరించె
నతని కాత్మజుడు సుకేతు డనెడివాడు
దేవరాతు డాతని సుతుడై వరలగ
నతనికిన్ బృహద్రథనృపు డవతరించె. 623

బృహద్రథస్య శూరోఽభూ న్మహావీరః ప్రతాపవాన్।
మహావీరస్య ధృతిమాన్ సుధృతిః సత్యవిక్రమః॥ {1.71.7}
సుధృతే రపి ధర్మాత్మా దృష్టకేతు స్సుధార్మికః।
దృష్టకేతోస్తు రాజర్షే ర్హర్యశ్వ ఇతి విశ్రుతః॥ {1.71.8}
హర్యశ్వస్య మరుః పుత్రో మరోః పుత్రః ప్రతింధకః।
ప్రతింధకస్య ధర్మాత్మా రాజా కీర్తిరథ స్సుతః॥ {1.71.9}
పుత్రః కీర్తిరథస్యాపి దేవమీఢ ఇతి స్మృతః।
దేవమీఢస్య విబుధో విబుధస్య మహీధ్రకః॥ {1.71.10}
మహీధ్రక సుతో రాజా కీర్తిరాతో మహాబలః। {1.71.11}

❈ "ఓ వసిష్ఠ మహర్షీ! ఆ బృహద్రథ మహారాజునకు కుమారుడుగా మహావీరుడు జన్మించినాడు. మహావీరునికి సుధృతి, సుధృతికి దృష్టకేతువు, దృష్టకేతువునకు హర్యశ్వుడు, హర్యశ్వునికి మరువు, మరువునకు ప్రతింధకుడు, ప్రతింధకునికి కీర్తిరథుడు, కీర్తిరథునికి దేవమీఢుడు, దేవమీఢునికి విబుధుడు, విబుధునికి మహీధ్రకుడు, మహీధ్రకునికి కీర్తిరాతుడు క్రమంగా జన్మించినారు.

సీ. ఆబృహద్రథునికి నాత్మజుడుగ మహా
వీరుడు జన్మించె శూరవరుడు
సుధృతి యానృపునకు సుతుడయ్యె దృష్టకే
తువు పుట్టె నతనికిఁ దుష్టిఁగూర్ప
నతనికి హర్యశ్వు డను పుత్రు డుదయించె
నతని కయ్యెను మరు వాత్మజుడుగఁ
గొమరుడయ్యెఁ బ్రతింధకుం డా మరువునకు
రక్తిఁ గలిగెఁ గీర్తిరథు డతనికి
తే.గీ. నతనికిన్ దేవమీఢుడన్ సుతుడు కలిగె
దేవమీఢుని సుతు డెన్నగా విబుధుడు

సుతుడు కలిగె మహీధ్రకు డతని కెన్న
నతనికిన్ కీర్తిరాతుడు సుతవరుండు. 624

కీర్తిరాతస్య రాజర్షేః మహారోమా వ్యజాయత॥ {1.71.11}
మహారోమ్ణస్తు ధర్మాత్మా స్వర్ణరోమా వ్యజాయత।
స్వర్ణరోమ్ణస్తు రాజర్షేః హ్రస్వరోమా వ్యజాయత॥ {1.71.12}
తస్య పుత్రద్వయం జజ్ఞే ధర్మజ్ఞస్య మహాత్మనః।
జ్యేష్ఠోఽహ మనుజో భ్రాతా మమ వీరః కుశధ్వజః॥ {1.71.13}
మాం తు జ్యేష్ఠం పితా రాజ్యే సోఽభిషిచ్య నరాధిపః।
కుశధ్వజం సమావేశ్య భారం మయి వనం గతః॥ {1.71.14}
వృద్ధే పితరి స్వర్యాతే ధర్మేణ ధుర మావహమ్।
భ్రాతరం దేవసంకాశం స్నేహాత్ పశ్యన్ కుశధ్వజమ్॥ {1.71.15}

❀ ఓ వసిష్ఠ మహర్షీ! రాజశ్రేష్ఠుడైన కీర్తిరాతునికి మహారోముడు, మహారోమునికి స్వర్ణరోముడు, స్వర్ణరోమునికి హ్రస్వరోముడు క్రమముగా జన్మించినారు. ఆ హ్రస్వరోమునికి నేను, ఈ కుశధ్వజుడు మేమిరువురము జన్మించినాము. మా తండ్రి వనవాసము చేయుటకు వెళ్లుచూ ఇద్దరు కుమారులలో పెద్దవాడినైన నన్ను యోగ్యునిగా తలచి రాజుగా నిలిపి తమ్ముని యోగక్షేమములను గమనించవలసినదిగా ఆదేశించినాడు. తండ్రిమాట ననుసరించి నేను నా తమ్ముని బాగోగులను గమనించుచుంటిని. కొంతకాలమునకు వృద్ధుడైన నా తండ్రి హ్రస్వరోముడు స్వర్గస్థుడైనాడు.

తే.గీ. అతని సుతుడు మహారోము డనెడివాడు
స్వర్ణరోము డా నృపునికి జననమందె
హ్రస్వరోముడు జనియించె నతని కేను
నీ కుశధ్వజుడును జనియించినాము. 625

మ. వనవాస మ్మొనరింపఁ దండ్రి చనుచున్, భావించుచున్ యోగ్యతన్,
నను జ్యేష్ఠుండని రాజుగా నిలిపి, యీ నా తమ్ము సంక్షేమమున్

గనుమంచున్ హితవాక్యమున్ బలికె; రాగమ్మొప్ప నీ సోదరున్
గనుచుంటిన్, గడువృద్ధుడౌటఁ బిత స్వర్గమ్మేగెఁ బుణ్యాత్ముడై. 626

కస్యచి త్త్వథ కాలస్య సాంకాశ్యా దగమత్ పురాత్।
సుధన్వా వీర్యవాన్ రాజా మిథిలా మవరోధకః॥ {1.71.16}
స చ మే ప్రేషయామాస శైవం ధను రనుత్తమమ్।
సీతా కన్యా చ పద్మాక్షీ మహ్యం వై దీయతా మితి॥ {1.71.17}
తస్యాఽప్రదానాత్ బ్రహ్మర్షే యుద్ధ మాసీ న్మయా సహ।
స హతోఽభిముఖో రాజా సుధన్వా తు మయా రణే॥ {1.71.18}

❊ ఓ వసిష్ఠ మహర్షీ! నేను మిథిలానగరాన్ని పరిపాలిస్తూ ఉండగా సాంకాశ్యపట్టణమునకు రాజైన సుధన్వుడు మిథిలను జయించాలనే కోరికతో మాపై తన పరాక్రమాన్ని ప్రదర్శించినాడు. శివధనుస్సును, సీతాకుమారిని తనకు ఇవ్వవలసినదిగా నన్ను అడిగినాడు. మా సీతను వివాహమాడగోరినాడు. అప్పుడు నేను సుధన్వునితో యుద్ధము చేసినాను. ఆ దుష్టుని వధించినాను. అందఱూ మెచ్చుకొనే విధంగా నా తమ్ముడైన ఈ కుశధ్వజుని ఆ సాంకాశ్య నగరమునకు రాజుగా పట్టాభిషేకం చేసినాను. ఈ కుశధ్వజుడు సాంకాశ్యరాజుగా సంతోషంగా చక్కగా పరిపాలన చేస్తూ గొప్ప వైభవమును, కీర్తిని పొందినాడు.

మ. జనపాలుండుగ నుండ నే మిథిలలో సాంకాశ్యభూపుండు దు
ష్టుని లీలన్ మిథిలావరోధకుడునై శూరత్వమున్ జూపి పా
వనమౌ శైవధనుస్సుఁ గోరె, సతిగా వాంఛించె మా సీత నా
తని దుష్టాత్ము సుధన్వుఁ జంపితిని యుద్ధమ్మందు వీరోద్ధతిన్. 627

మ. స్తవనీయంబుగ నీ కుశధ్వజునిఁ దత్సాంకాశ్యదేశానఁ బ్రా
భవ మొప్పారగ రాజుగా నిలిపితిన్, బట్టాభిషేకమ్ము వై
భవరీతిన్ జరిపించినాడ, నృపుడై వర్ధిల్లి, యీతండు నీ
భువిఁ గీర్తిన్ గనె, మత్సహోదరుడు సమ్మోదమ్ముఁ జేకూర్చుచున్. 628

దదామి పరమ ప్రీతో వధ్వౌ తే మునిపుంగవ। {1.71.20}
సీతాం రామాయ భద్రం తే ఊర్మిళాం లక్ష్మణాయ చ।
వీర్యశుల్కాం మమ సుతాం సీతాం సురసుతోపమామ్॥ {1.71.21}
ద్వితీయా మూర్మిళాం చైవ త్రిర్దదామి న సంశయః।
రామలక్ష్మణయో రాజన్ గోదానం కారయస్వ హ॥ {1.71.22}
పితృకార్యం చ భద్రం తే తతో వైవాహికం కురు। {1.71.23}

❊ ఓ వసిష్ఠ మహర్షీ! సాటిలేని మేటి రాజకుమారులని ఈ రామలక్ష్మణులను నేను మెచ్చుకొంటున్నాను. నా ఇద్దరు కుమార్తెలను క్రమంగా ఈ ఇద్దరు రఘువీరులకు ఇచ్చెదను. సీతాకుమారిని ఈ రఘురామునికి ఇచ్చెదను. ఊర్మిళాకుమారిని ఈ లక్ష్మణునికి ఇచ్చెదను అనిచెప్పి కోసలాధిపతిని చూచి "ఓ దశరథమహారాజా! రామలక్ష్మణులచేత గోదానమును, పితృకార్యములను చేయించండి. వివాహవ్రతకార్యములను ప్రారంభించండి. ఈ కల్యాణము వలన మీకు, మాకు ఇరువురుకీ సకలసౌభాగ్యములు కలుగగలవు. భద్రము చేకూరగలదు.

ఉ. మెచ్చెద రామలక్ష్మణుల మేటి నృపాలకుమారులంచు, నే
నిచ్చెద నాదు కన్యకల నీ రఘువర్యులకున్ మునీశ్వరా!
యిచ్చెద సీతయన్ దుహిత నీ రఘురామునికిన్ ముదమ్ముతో
నిచ్చెద లక్ష్మణాహ్వయున కీ డనుచున్ సుకుమారి నూర్మిళన్. 629

మ. శ్రితులన్ బ్రోచెడి రామలక్ష్మణులచేఁ జేయించి గోదానమున్,
బితృకార్యమ్ముల వారు చేయునటులన్ వీక్షించి, వైవాహిక
వ్రతమున్ జేయుము కోసలేశ్వర! బృహద్భద్రమ్ము సంధిల్లు, సం
తత సౌభాగ్యము మీకు మాకుఁ గలుగున్, దథ్యమ్ము కల్యాణమౌ. 630

మఘా హ్యద్య మహాబాహో తృతీయే దివసే ప్రభో॥ {1.71.23}
ఫల్గున్యా ముత్తరే రాజన్ తస్మిన్ వైవాహికం కురు।
రామలక్ష్మణయో రాజన్ దానం కార్యం సుఖోదయమ్॥ {1.71.24}

త ముక్తవంతం వైదేహం విశ్వామిత్రో మహామునిః।
ఉవాచ వచనం వీరం వసిష్ఠసహితో నృపమ్॥ {1.72.1}
అచింత్యా న్యప్రమేయాని కులాని నరపుంగవ।
ఇక్ష్వాకూణాం విదేహానాం నైషాం తుల్యోఽస్తి కశ్చన॥ {1.72.2}

❊ "ఓ దశరథమహారాజా! ఈరోజు ఉన్న నక్షత్రము మఖానక్షత్రము. నేటికి మూడవరోజున శుభప్రదమైన ఉత్తరఫల్గునీ నక్షత్రము ఉంటుంది. కాబట్టి ఆరోజున వివాహములను జరిపించడం శ్రేయస్కరము. వివాహములకు ముందు చేయదగిన దానములను ఇప్పించే ఏర్పాట్లు చేయండి" అని జనకమహారాజు పలికినాడు. అందులకు సంతోషించిన విశ్వామిత్ర మహర్షి వసిష్ఠ మహర్షితో కూడినవాడై జనకుని చూచి "ఓ మిథిలాధిపతీ! మీ విదేహవంశము, దశరథుని ఇక్ష్వాకువంశము రెండునూ పరస్పరము తగినవంశములు. ధర్మము నాచరిస్తూ సత్కీర్తి నంది ఎంతో ప్రసిద్ధి చెందినవి అని ఇరువంశములగురించి వివరింపసాగినాడు.

ఉ. ఇప్పుడు వెల్గు తార మఖ, యెన్నగ మూడవనాడు నింగిలో
నొప్పు శుభ మ్మొసంగఁగల యుత్తరఫల్గుని తార, కాన మీ
రప్పుడు రామలక్ష్మణుల కద్భుతరీతి వివాహకార్యముల్
తప్పక చేయనౌ, తగిన దానము లీయగఁ జేయుమా నృపా! 631

మ. జనకుం డట్లు వచింప సంతసిలి, విశ్వామిత్ర మౌనీంద్రు డి
ట్లనె బ్రహ్మర్షి వసిష్ఠుతోఁ గలసి, రాజా! రెండు వంశమ్ములున్
గన నిక్ష్వాకు విదేహ నామముల విఖ్యాతిన్ విరాజిల్లెడిన్
ఘనకీర్తిన్ సదృశమ్ములై వరలు మాన్యశ్రేష్ఠధర్మమ్ములన్. 632



72. దశరథుడు నాందీశ్రాద్ధాదులను నిర్వహించుట

సదృశో ధర్మసంబంధః సదృశో రూపసంపదా।
రామలక్ష్మణయో రాజన్ సీతా చోర్మిళయా సహ॥ {1.72.3}
వక్తవ్యం చ నరశ్రేష్ఠ శ్రూయతాం వచనం మమ।
భ్రాతా యవీయాన్ ధర్మజ్ఞ ఏష రాజా కుశధ్వజః॥ {1.72.4}
అస్య ధర్మాత్మనో రాజన్ రూపేణాఽప్రతిమం భువి।
సుతాద్వయం నరశ్రేష్ఠ పత్న్యర్థం వరయామహే॥ {1.72.5}
భరతస్య కుమారస్య శత్రుఘ్నస్య చ ధీమతః।
వరయామ స్సుతే రాజన్ తయో రర్థే మహాత్మనోః॥ {1.72.6}

❋ "ఓ మిథిలాధిపతీ! రూపమునందు గుణమునందు ఈ రాముడు సీతకు తగినవాడు. ఇదేవిధంగా సీత కూడా ఈ రామునికి తగినటువంటిది. ఈ లక్ష్మణుడు ఊర్మిళకు తగినవాడు. ఇదేవిధంగా ఊర్మిళ కూడా లక్ష్మణునికి తగినటువంటిది. ఈ కల్యాణములు ఇరువంశములనూ వర్ధిల్లజేయగలవు. మఱియొకమాట కూడా చెప్పుచున్నాను వినుము. నీ తమ్ముడైన ఈ కుశధ్వజుని కుమార్తెలగు మాండవి శ్రుతకీర్తి అను కన్యలను దశరథపుత్రులే అయిన భరతునికి శత్రుఘ్నునికి ఇచ్చి తగినరీతి వివాహములను జరిపించండి.

మ. తగు నీ రాముడు సీతకున్ బతిగ, నేతద్రీతి నా సీతయున్
దగు నీ రామునికిం బ్రజేశ! సతిగాఁ దాద్రూప్యభావమ్ములన్
దగు నీ లక్ష్మణు డూర్మిళాతరుణికిన్, దథ్యమ్ము సౌమిత్రికిన్
దగు నా యూర్మిళ, వంశవర్ధనము లేతద్రూపకల్యాణముల్. 633

తే.గీ. వినుము మఱియొక్క మాటను విభుడ! నీకు
తమ్ముడైన కుశధ్వజు తనయలైన
మాండవీశ్రుతకీర్తుల మహితరీతి
భరతశత్రుఘ్నులకు నిమ్ము పత్నులుగను. 634

పుత్రా దశరథస్యేమే రూపయౌవనశాలినః।
లోకపాలోపమా స్సర్వే దేవతుల్యపరాక్రమాః॥ {1.72.7}
ఉభయో రపి రాజేంద్ర సంబంధే నానుబధ్యతామ్।
ఇక్ష్వాకోః కుల మవ్యగ్రం భవతః పుణ్యకర్మణః॥ {1.72.8}

❊ ఓ విదేహభూపా! ఈ దశరథకుమారులు రూపమును యౌవనమును కలవారు. విజ్ఞులు. చాలా గొప్ప శూరులు. దిక్పాలకులతో సమానమైనవారు. దేవతుల్య పరాక్రములు. వీరికి మీ కుమార్తెల నిచ్చి వివాహములు జరిపించుట ఎంతో సమంజసము. ఈ కల్యాణములను జరిపించినట్లైతే మీకు శ్రేయస్సు కలుగుతుంది. కీర్తి, సంపదలు సమకూరుతాయి. ఇక్ష్వాకువంశము పరమపావనమైనది. మీ నిమివంశము దివ్యగుణ విరాజితమైనది. మీ ఇరు వంశముల కల్యాణబంధము అందఱికీ శుభమును కలిగిస్తుంది.

ఉ. వీరలు రూపయౌవనులు, విజ్ఞులు, పంక్తిరథాత్మజుల్, మహా
శూరులు, లోకపాలసమశోభితులున్, సురతుల్యవిక్రముల్,
కోరి వివాహముల్ జరుపఁ గూడును శ్రేయము, కీర్తిసంపదల్
చేరు విదేహభూప! యని చెప్పెను గౌశికు డుత్సహించుచున్. 635

తే.గీ. పరమపావనమెన్న నిక్ష్వాకుకులము
దివ్యగుణభాసురము భవదీయ వంశ
ముభయవంశాల బంధమ్ము శుభముఁ గూర్చు
ననియె గౌశికు డాదట జనకుఁ గనుచు. 636

విశ్వామిత్ర వచః శ్రుత్వా వసిష్ఠస్య మతే తదా।
జనకః ప్రాంజలి ర్వాక్య మువాచ మునిపుంగవౌ॥ {1.72.9}
కులం ధన్య మిదం మన్యే యేషాం నో మునిపుంగవౌ।
సదృశం కులసంబంధం యదాజ్ఞాపయథః స్వయమ్॥ {1.72.10}
ఏవం భవతు భద్రం వః కుశధ్వజసుతే ఇమే।
పత్న్యౌ భజేతాం సహితౌ శత్రుఘ్నభరతా వుభౌ॥ {1.72.11}

ఏకాహ్నే రాజపుత్రీణాం చతసృణాం మహామునే।
పాణీన్ గృహ్ణంతు చత్వారో రాజపుత్రా మహాబలాః॥ {1.72.12}

❈ విశ్వామిత్ర మహర్షి అట్లు పలుకగా వినిన జనకమహారాజు వసిష్ఠమహర్షి అనుమతితో ఇట్లనెను. "ఓ బ్రహ్మర్షులారా! మీరు శుభకరంగా మాట్లాడటంతో నా వంశము పవిత్రమైనది. ఈ నాలుగు వివాహములు అన్నివిధాలా తగినట్టివి అని నేను నమ్ముచున్నాను. సీత ఊర్మిళ మాండవి శ్రుతకీర్తి అను వధువులకు క్రమంగా రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు భర్తలుగా అయ్యేట్లుగా అందఱూ 'శుభమ్!' అని పలుకుతూ ఒకేరోజున నాలుగు వివాహములను జరిపించండి. ఓ మునీశ్వరులారా! దయతో మీరు మీ విధులను సంపూర్ణంగా నిర్వహించవలసినదిగా ప్రార్థిస్తూ ఉన్నాను అని విన్నవించుకొనినాడు.

మ. జనకుం డామిథిలాధిపుండు ముని విశ్వామిత్రు వాక్యమ్ములన్
విని, బ్రహ్మర్షి వశిష్ఠ సమ్మతిని, సంప్రీతిన్ వచించెన్ "శుభ"
మ్మని "బ్రహ్మర్షులు మీరు పల్కగ మదీయంబైన వంశమ్ము పా
వనమయ్యెన్ సదృశమ్ములై తనరు నుద్వాహమ్ము లత్యంతమున్. 637

చం. నలుగురు రాజపుత్రులు గుణమ్ముల రాజిలుచున్ గ్రమమ్ముగా
నలుగురు రాజపుత్రికల నాథులుగాగ, శుభమ్ము నందఱున్
బలుక, నొకేదినమ్మున వివాహము లన్నియుఁ బూర్తికాగ, నిం
పలర మునీశులార! తమ పాత్రను సత్కృప నిర్వహింపుడీ. 638

ఉత్తరే దివసే బ్రహ్మన్ ఫల్గునీభ్యాం మనీషిణః।
వైవాహికం ప్రశంసంతి భగో యత్ర ప్రజాపతిః॥ {1.72.13}
ఏవ ముక్త్వా వచ స్సౌమ్యం ప్రత్యుత్థాయ కృతాంజలిః।
ఉభౌ మునివరౌ రాజా జనకో వాక్య మబ్రవీత్॥ {1.72.14}
పరో ధర్మః కృతో మహ్యం శిష్యోఽస్మి భవతోః సదా।
ఇమా న్యాసనముఖ్యాని ఆసాతాం మునిపుంగవౌ॥ {1.72.15}

❊ *"ఓ బ్రహ్మర్షులారా! సంతానమును ప్రసాదించగల ప్రజాపతియగు భగుడు దేవతగా ఉన్న నక్షత్రము ఉత్తరఫల్గునీ నక్షత్రము. ఆ నక్షత్రంలో జరిపించే వివాహం అత్యుత్తమమైనదని విజ్ఞులు చెబుతూ ఉంటారు. మీరు అనఘులు. మునీశ్వరులు. కన్యాదానం చేసే భాగ్యాన్ని నాకు కలిగించినారు. నేను మీకు శిష్యుడను. ఈ ఆసనములలో కూర్చొనండి. వివాహసత్కర్మలను యథావిధిగా నిర్వహించండి" అని అంటూ జనకమహారాజు తన ఆశలు ఫలించాలని కోరుకొంటూ గౌరవపురస్సరంగా వారికి నమస్కరించినాడు.*

తే.గీ. సంతతి నొసంగునట్టి ప్రజాపతియగు
భగుడు దేవతగాగల భవ్యమైన
తార యుత్తరఫల్గుని, దానియందుఁ
బెండ్లి యుత్తమ మందురు విజ్ఞులెల్ల. 639

మ. అనఘుల్ మీరలు సన్మునీంద్రు లిదె కన్యాదానసద్ధర్మమున్
ఘనతన్ జేసెడి భాగ్యమిచ్చితిరి నాకై, మీకు శిష్యుండ నా
సనముల్ గైకొనుడీ, యథోచితముగా సత్కర్మముల్ చేయుడీ,
యనుచున్ మన్ననఁ జూపి మ్రొక్కె జనకుం డాశాఫలప్రాయుడై. 640

యథా దశరథస్యేయం తథాఽయోధ్యా పురీ మమ।
ప్రభుత్వే నాస్తి సందేహో యథార్హం కర్తు మర్హథ॥ {1.72.16}
తథా బ్రువతివైదేహే జనకే రఘునందనః।
రాజా దశరథో హృష్టః ప్రత్యువాచ మహీపతిమ్॥ {1.72.17}
యువా మసంఖ్యేయ గుణౌ భ్రాతరౌ మిథిలేశ్వరౌ।
ఋషయో రాజసంఘాశ్చ భవద్భ్యా మభిపూజితాః॥ {1.72.18}
స్వస్తి ప్రాప్నుహి భద్రం తే గమిష్యామి స్వమాలయమ్॥
శ్రాద్ధకర్మాణి సర్వాణి విధాస్యామీతి చాబ్రవీత్॥ {1.72.19}

❊ *"ఓ మునీశ్వరులారా! ఈ వైవాహిక సంబంధముల కారణంగా మిథిలానగరముపై దశరథునికి అధికారము కలదు. అట్లే నాకునూ*

అయోధ్యానగరముపై అధికారము కలదు. కావున ఇప్పుడు ఉభయదేశములకు ప్రభువులు మీరే" అని జనకుడు ఆ బ్రహ్మర్షులను చూస్తూ పలికినాడు. అప్పుడు దశరథుడు జనకుని జూచి "ఓ మిథిలాధిపా! నీవు, నీ తమ్ముడగు కుశధ్వజుడు ఇరువురునూ గొప్ప గుణవంతులు. విజ్ఞులు. సుమనస్కులు. మీరు మునులను రాజులను సదా భక్తితో సేవిస్తూ ఉంటారు. అందులకు నాకు చాలా సంతోషంగా ఉన్నది. నేను నాందీశ్రాద్ధాది కార్యక్రమములను జరిపించవలసియున్నది. కావున మీరు సమ్మతించినచో ఇచ్చటినుండి బయలుదేరెదను" అని పలికెను.

తే.గీ. మిథిల యను నీ పురము దశరథునికెట్లొ
యట్లె యగు నాకు నా యయోధ్యాపురమ్ము,
నుభయ దేశమ్ములకు మీరె ప్రభువు లనుచు
జనకు డనియె బ్రహ్మర్షులఁ గనుచు నంత. 641

మ. పలికెన్ బంక్తిరథుండు రాజుఁ గని భూపా! నీవు నీ తమ్ముడున్
విలసత్కీర్తిగుణోన్నతుల్ బుధులు సంప్రీతాత్ములున్, సన్మునీం
ద్రుల రాజన్యులఁ భక్తిఁ గొల్చెదరు, సంతోషించితిన్, శ్రాద్ధక
ర్మలఁ నెల్లన్ జరిపింప నింక వడి మీరల్ సమ్మతిన్ దెల్పుడీ" 642

త మాపృష్ట్వా నరపతిం రాజా దశరథ స్తదా।
మునీంద్రౌ తౌ పురస్కృత్య జగామాఽఽశు మహాయశాః॥ {1.72.20}
స గత్వా నిలయం రాజా శ్రాద్ధం కృత్వా విధానతః।
ప్రభాతే కాల్య ముత్థాయ చక్రే గోదాన ముత్తమమ్॥ {1.72.21}
గవాం శతసహస్రాణి బ్రాహ్మణేభ్యో నరాధిపః।
ఏకైకశో దదౌ రాజా పుత్రా నుద్దిశ్య ధర్మతః॥ {1.72.22}

❈ నాందీశ్రాద్ధకర్మలను చేయుటకు దశరథుడు వెళ్లగోరగా జనకుడు తన సమ్మతిని తెలిపినాడు. కోసలేశుడు మహర్షులతోకలిసి తన విడిదికి చేరుకొని నాందిని శ్రాద్ధక్రియలను పూర్తిచేసి వేకువనే మేల్కొన్నాడు. వినయవివేకసంపన్నులైన విప్రోత్తములకు గోవులను దానం చేసినాడు. చెంగు చెంగున దూకే లేగదూడలతో కూడియున్నట్టివి, బంగారు తొడుగులతో

అలంకరింపబడిన కొమ్ములు గలవి, పాలు సమృద్ధిగా యీయగలిగినవి, ఉత్సాహంగా ఉండెడివి, అందమైనవి అగు నాలుగు లక్షల ఆవులను నూతన వరులుగా ఉన్న తన నలుగురు కుమారుల పేరు చెప్పి సంతోషంగా దానం చేసినాడు.

చం. జనకుడు వల్లె యంచనఁ బ్రజాపతి యాజి మహర్షివర్యులన్
గొని నిలయమ్ముఁ జేరె, సమకూర్చెను నాందిని, శ్రద్ధఁ గాల్యమం
దున వెస మేలుకాంచెఁ, బరితుష్టి నొనర్చెను ధేనుదానమున్
వినయవివేకవంతులగు విప్రవరేణ్యుల కాదరమ్మునన్. 643

ఉ. చెంగున దూకు లేగలును జెంగట నుండి తురంగలింపగా,
బంగరు కొమ్ములన్ దనరి, పాలు సమృద్ధిగ నీయగల్గుచున్
రంగుగ నుండు గోవులను రాజవరుండిడె నాల్గులక్షలన్
ముంగిట నున్న విప్రులకుఁ బుత్రుల పేర వివాహవేళలో. 644

స సుతైః కృత గోదానై ర్వృతస్తు నృపతి స్తదా।
లోకపాలై రివాభాతి వృతః సౌమ్యః ప్రజాపతిః॥ {1.72.25}
యస్మింస్తు దివసే రాజా చక్రే గోదాన ముత్తమమ్।
తస్మింస్తు దివసే శూరో యుధాజిత్ సముపేయివాన్॥ {1.73.1}
పుత్రః కేకయరాజస్య సాక్షా ద్భరతమాతులః।
దృష్ట్వా పృష్ట్వా చ కుశలం రాజాన మిద మబ్రవీత్॥ {1.73.2}

❋ దశరథమహారాజు ధనమును, గోధనమును విప్రులకు ఇస్తూ పాలు పిండుకొనేందుకు కంచుపాత్రలను కూడా దానంచేసినాడు. ఆ సమయంలో పుత్రులతో కూడియున్న దశరథుడు లోకపాలురతో కూడియున్న బ్రహ్మ వలె ప్రకాశించినాడు. ఏ రోజున కోసలేశుడు గోదానం చేసినాడో అదే రోజున అల్లుడైన భరతుని చూచేందుకు కేకయదేశ రాజకుమారుడు భరతుని మేనమామ అగు యుధాజిత్తు మిథిలకు వచ్చినాడు. నాందిని శ్రాద్ధక్రియలను గొప్పగా

నిర్వహించిన దశరథుని చూచి యుధాజిత్తు ఎంతగానో ప్రశంసిస్తూ ఇలా అన్నాడు.

తే.గీ. పాలు పిండుకొనం గాంస్యపాత్రల నిడె
ఘనముగా ధనమ్ము నిడె గోధనముతోడ;
భవ్య గోదానమున లోకపాలసహితు
డైన లోకేశువలె వెల్గె నాజి యపుడు. 645

తే.గీ. ఏ దినమ్మున గోదాన మిచ్చె నాజి
యా దినమ్మునె భరతు నల్లునిఁ గనఁ
జేరె మిథిల యుధాజిత్తు వీరవరుడు
కేకయాధిపపుత్రుండు శ్రీకరముగ. 646

కం. నాందీ శ్రాద్ధాదుల నటఁ
బొందికగాఁ జేసినట్టి భూపతిఁ గనుచున్
వందనము లనుచు హర్షము
నంది యుధాజిత్తు పలికె నాజిఁ బొగడుచున్. 647



73. రామ లక్ష్మణ భరత శత్రుఘ్నుల వివాహమహోత్సవ ఘట్టము

కేకయాధిపతీ రాజా స్నేహాత్ కుశల మబ్రవీత్।
యేషాం కుశలకామోఽసి తేషాం సంప్రత్యనామయమ్॥ {1.73.3}
స్వస్రీయం మమ రాజేంద్ర ద్రష్టుకామో మహీపతిః।
తదర్థ ముపయాతోఽహ మయోధ్యాం రఘునందన॥ {1.73.4}
శ్రుత్వా త్వహ మయోధ్యాయాం వివాహార్థం తవాత్మజాన్।
మిథిలా ముపయాతాంస్తు త్వయా సహ మహీపతే॥ {1.73.5}
త్వరయాఽభ్యుపయాతోఽహం ద్రష్టుకామః స్వసు స్సుతమ్।

❊ యుధాజిత్తు దశరథుని చూచి "ఓ మహారాజా! మా కేకయదేశరాజు మీ యోగక్షేమములను గురించి అడిగినారు. మీరు కూడా మా యోగక్షేమములనే కోరుకొంటూ ఉంటారు. మీరు క్షేమమే కదా! మా మేనల్లుడైన భరతుని చూడదలచి నేను ముందుగా అయోధ్యకు వెళ్లినాను. భరతునితో మీ రందరూ ఈ విదేహనగరం చేరినట్లుగా తెలిసికొని నేను కూడా ఇచ్చటికి వచ్చినాను". ఈవిధంగా పలికిన యుధాజిత్తును చూచి దశరథుడు ఎంతగానో సంతోషించినవాడై కుశలప్రశ్నలు వేసి ఆత్మీయునిగా భావిస్తూ గౌరవపురస్సరంగా అతనికి అతిథిసత్కారములను చేసినాడు.

ఉ. కేకయరాజు మిమ్మడిగె, క్షేమమె మీకును? మీరు సర్వదా
మాకుశలమ్మె కోరుదురు, మాకును క్షేమమె; మేనయల్లునిన్
రాకొమరున్ గనన్ దలచి రాజవరేణ్య! యయోధ్య కేగితిన్,
జేకొని వాని మీరిటకుఁ జేరితిరంచు విదేహ వచ్చితిన్. 648

కం. అతిథి యుధాజిత్తును గని
కుతుకమ్మున దశరథుండు కుశల మడుగుచున్,
హితుడని పూజార్హుండని
యతిగౌరవమొప్ప నతని కాతిథ్యమిడెన్. 649

తత స్తా ముషితో రాత్రిం సహ పుత్రై ర్మహాత్మభిః॥ {1.73.7}
ప్రభాతే పున రుత్థాయ కృత్వా కర్మాణి కర్మవిత్।
ఋషీం స్తదా పురస్కృత్య యజ్ఞవాట ముపాగమత్॥ {1.73.8}
యుక్తే ముహూర్తే విజయే సర్వాభరణభూషితైః।
భ్రాతృభిః సహితో రామః కృతకౌతుకమంగళః॥ {1.73.9}
వసిష్ఠం పురతః కృత్వా మహర్షీ నపరానపి। {1.73.10}
(పితుః సమీప మాశ్రిత్య తస్థౌ భ్రాతృభి రావృతః)

❊ యుధాజిత్తునకు ఆతిథ్యమిచ్చి దశరథుడు తన కుమారులను చూస్తూ, ప్రీతితో వారి మాటలను వింటూ ఆ రాత్రిని గడిపినాడు. వేకువనే మేల్కొని విధ్యుక్త సత్కర్మల నాచరించినాడు. మునివర్యులు ముందుండగా ఆ దశరథమహారాజు సంతోషంగా ఉత్సాహంగా కల్యాణ యజ్ఞవేదిక దగ్గఱకు చేరుకొన్నాడు. పెండ్లికుమారులైన రామలక్ష్మణభరతశత్రుఘ్నులు అన్ని ఆభరణాలను ధరించి వివాహ వ్రత దీక్షా కంకణబద్ధహస్తులై జయమును కలిగించే శుభముహూర్తంలో కల్యాణవేదికను చేరుకొనేందుకు సిద్ధమయ్యారు. తనతోకూడి నడుస్తూ తరిస్తూ ఉన్న తమ్ములతో శ్రీ రఘురాముడు వినయగుణాభిరాముడై దీక్షాకంకణధారిగా విరాజిల్లుతూ వశిష్ఠుడు, విశ్వామిత్రుడు మొదలైన మునిముఖ్యులు ముందు నడుస్తూ ఉండగా కల్యాణవేదిక చెంత ఉన్న తండ్రి వద్దకు చేరుకొన్నాడు.

**మ. వినుతిన్ గాంచిన పుత్రులన్ గనుచు, సంప్రీతిన్ దదీయోక్తులన్
వినుచున్, బంక్తిరథుండు రాత్రి గడిపెన్ వేద్కన్, బ్రభాతమ్మునం
దున మేల్కాంచి, సుకర్మలన్ దనరి, సంతోషమ్మునన్ యజ్ఞవా
టిని జేరన్ మునివర్యులంగొని చనెన్ ఠీవిన్ మహోత్సాహియై. 650**

**చం. జయమిడు సన్ముహూర్తమున సర్వవిభూషణరాశిఁ దాల్చి, చి
న్మయులగు తమ్ము లాదరమునన్ దరిఁ జేరి తరించుచుండగా,
రయమున వచ్చె కంకణవిరాజితుడై రఘురామమూర్తి శ్రీ
మయుడు వసిష్ఠముఖ్యమునిమాన్యపురస్కృతుడై విధేయుడై. 651**

వసిష్ఠో భగవా నేత్య వైదేహ మిద మబ్రవీత్॥ {1.73.10}
రాజా దశరథో రాజన్ కృతకౌతుకమంగలైః।
పుత్రై ర్నరవరశ్రేష్ఠ దాతార మభికాంక్షతే॥ {1.73.11}
దాతృప్రతిగ్రహీతృభ్యాం సర్వార్థాః ప్రభవంతి హి।
స్వధర్మం ప్రతిపద్యస్వ కృత్వా వైవాహ్య ముత్తమమ్॥ {1.73.12}
ఇత్యుక్తః పరమోదారో వసిష్ఠేన మహాత్మనా।
ప్రత్యువాచ మహాతేజా వాక్యం పరమధర్మవిత్॥ {1.73.13}

❋ పెండ్లికుమారులుగా అలంకరింపబడిన రామలక్ష్మణభరతశత్రుఘ్నులు కల్యాణ వేదిక చెంత ఉన్న తమ తండ్రి దశరథమహారాజును చేరి నమస్కరింపగా వసిష్ఠమహర్షి జనకుని చేరి " ఓ మిథిలాధిపా! విదేహభూపతీ! కోసలాధిపుడు తన నలుగురు కుమారులతో కూడినవాడై నీ కొఱకు వేచియున్నాడు. నీవు కన్యాదానము చేయు దాతవు. నీ కొఱకు దశరథుడు ఎదురుచూస్తూ ఉన్నాడు. దానము చేయు దాతకు, ఆ దానమును స్వీకరించే ప్రతిగ్రహీతకు ఇరువురికీ సమస్త లాభాలూ చేకూఱుతాయి. నీవు సంతోషంగా వెంటనే నలుగురు కన్యలను దానం చేయి. ఈ కన్యాదానము వలన నీకు ఎంతో గొప్పకీర్తి కలుగుతుంది అని కర్తవ్యాన్ని నిర్దేశించినాడు. అప్పుడు జనకమహారాజు ఇలా మాట్లాడసాగినాడు.

చం. నలుగురు పుత్రు లంతటఁ బ్రణామముఁ జేయుచుఁ దండ్రిఁ జేరగా,
నలఘుడు తద్వసిష్ఠుడు మహాత్ము విదేహనృపాలుఁ జేరి, యిం
పలర వచించె నిట్లు "మిథిలాధిప! వీర విదేహపార్థివా!
నిలిచెను గోసలాధిపుడు నీకయి, వేచె సుపుత్రయుక్తుడై". 652

ఉ. దాతగనున్న నిన్ దలచి తాను నిరీక్షణ నిల్చె నాజియే,
దాతకుఁ దద్గ్రహీతకును దప్పక చేకుఱు సర్వలాభముల్,
చేతము పొంగఁ గన్యకల శీఘ్రమె దానము చేయుమయ్య! నీ
కాతత కీర్తి కల్గు" నన నా జనకప్రభువంత నిట్లనెన్. 653

కః స్థితః ప్రతిహారో మే కస్యాऽఽజ్ఞా సంప్రతీక్ష్యతే।
స్వగృహే కో విచారోऽస్తి యథా రాజ్య మిదం తవ॥ {1.73.14}
కృతకౌతుకసర్వస్వాః వేదిమూల ముపాగతాః।
మమ కన్యా మునిశ్రేష్ఠ దీప్తా వహ్నే రివార్చిషః॥ {1.73.15}

❋ "ఓ వసిష్ఠ మహర్షీ! ఇప్పుడు ఇచ్చట మీరు చేయదలచిన పనులకు అడ్డు చెప్పే వాడు ఎవడునూ లేడు. ఇలా చేయండి అని మీకు ఆజ్ఞలను ఇవ్వగలవాడు కూడా ఎవడునూ లేడు. మమ్ములను నడిపించే పెద్దలు మీరే. ఈ ఇల్లు మీదే, ఈ రాజ్యము మీదే అని భావిస్తూ ఎటువంటి సంకోచమూ లేకుండా కల్యాణ విధులను నిర్వహించవలసినదిగా మిమ్ము వేడుకొంటూ ఉన్నాను. నా కుమార్తెలైన సీత ఊర్మిళ మాండవి శ్రుతకీర్తి అనెడి నలుగురు పెండ్లికుమార్తెలుగా అలంకరింపబడినారు. మేలైన ఆభరణములను ధరించి వివాహవ్రత దీక్షాకంకణబద్ధహస్తలై విరాజిల్లువారై, అగ్నిశిఖలతో సమానంగా తేజరిల్లువారై కల్యాణయజ్ఞవేదిక దగ్గఱకు వచ్చియున్నారు. చూడండి అని అనగా వసిష్ఠుడు వారిని వాత్సల్యభావంతో చూస్తూ సంతోషించినాడు.

చం. అరయగ నడ్డు చెప్పు ప్రతిహారి యెవండిట? మీకు నాజ్ఞలన్
స్థిరముగ నీయగల్గు నృపతిన్ గననౌనె వసిష్ఠ సంయమీ
శ్వర! నడిపింప మమ్ముల విచార మదేల? గృహమ్ము మీదిగా
వరుస వివాహకార్యముల వర్తిలుడయ్య స్వరాజ్యభావనన్. 654

చం. కలితవిభూషణవ్రతతిఁ గౌతుక నామక సూత్రబంధన
మ్ముల నలరారుచుండి పరిపూర్ణకృశానుశిఖాసమానలై
వెలుగుచు వచ్చినారలిదె వేది సమీపముఁ జేరఁ, జూడు మీ
నలుగురు నాదు పుత్రికలనంగ వసిష్ఠుడు చూడ వారలన్. 655

సజ్జోऽహం త్వత్ప్రతీక్షోऽస్మి వేద్యా మస్యాం ప్రతిష్ఠితః।
అవిఘ్నం కురుతాం రాజా కిమర్థ మవలంబతే॥ {1.73.16}
తద్వాక్యం జనకేనోక్తం శ్రుత్వా దశరథ స్తదా।

ప్రవేశయామాస సుతాన్ సర్వా నృషిగణా నపి॥ {1.73.17}
తతో రాజా విదేహానాం వసిష్ఠ మిద మబ్రవీత్।
కారయస్వ ఋషే సర్వ మృషిభిః సహ ధార్మిక॥ {1.73.18}
రామస్య లోకరామస్య క్రియాం వైవాహికీం విభో। {1.73.19}

❋ మిథిలాధిపతి కోసలాధిపతిని చూచి "ఓ దశరథా! నిర్మలాత్మా! నేను కల్యాణ యజ్ఞవేదిక చెంత సిద్ధముగా ఉండి నీ కొఱకు వేచిచూచుచున్నాను. ఆలస్యం చేయకుండా నిర్విఘ్నంగా కల్యాణములను జరిపించండి. అని విన్నవించినాడు. జనకుని మాటలను విని దశరథుడు అందఱినీ దగ్గఱకు పిలిపించుకొన్నాడు. పెండ్లికుమారులైన రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు దగ్గరకు రాగా జనకుడు వసిష్ఠుని చూచి విశుద్ధమనస్కుడవగు ఓబ్రహ్మర్షీ! ఇక శ్రీరాముని వివాహమును జరిపించవచ్చును" అని భక్తిప్రపత్తులతో తెలియజేసినాడు.

తే.గీ. నేను సిద్ధమ్ము దశరథా! నిర్మలాత్మ!
వేచియున్నాను నీకయి వేదిచెంత
వేడ్కఁ గల్యాణములను నిర్విఘ్నముగను
జరుపు మాలసింపకయని జనకుడనియె. 656

చం. అని జనకుండనన్ దశరథాధిపు డందఱఁ బిల్వఁ బంప, వ
చ్చిన వరకోసలాత్మజులఁ జేరిన యా జనకుండటన్ వసి
ష్ఠునిఁ గని "యింక మీరలు విశుద్ధమనస్కులు రామచంద్రునిన్
గనుచు వివాహమున్ జరుపగాఁ దగు"నంచు వచించె భక్తిమై. 657

తథే త్యుక్త్వా తు జనకం వసిష్ఠో భగవాన్ ఋషిః॥ {1.73.19}
విశ్వామిత్రం పురస్కృత్య శతానందం చ ధార్మికమ్।
ప్రపామధ్యే తు విధివ ద్వేదిం కృత్వా మహాతపాః॥ {1.73.20}
అలంచకార తాం వేదిం గంధపుష్పై స్సమంతతః।
సువర్ణపాలికాభిశ్చ ఛిద్రకుంభైశ్చ సాంకురైః॥ {1.73.21}
అంకురాఢ్యై శ్శరావైశ్చ ధూపపాత్రై స్సధూపకైః।

శంఖపాత్రైః స్రువైః స్రుగ్భిః పాత్రై రర్ఘ్యాదిపూరితైః॥ {1.73.22}
లాజపూర్ణైశ్చ పాత్రీభి రక్షతై రభిసంస్కృతైః।

❊ శ్రీరాముని కల్యాణమును జరిపించండి అని జనకుడు పలుకగా ఆ మాటలను వినిన వసిష్ఠ మహర్షి "ఓ మిథిలాధిపా అలాగే చేస్తాను" అని అంటూ విశ్వామిత్రుని వైపు చూచి ఆ మహర్షి అనుమతిని తీసికొన్నాడు. పురోహితుడగు శతానందుడు ముందుండగా చలువపందిళ్ల క్రింద కల్యాణయజ్ఞవేదికను సిద్ధం చేసి త్రికరణశుద్ధిగా గంధపుష్పాదులతో ఆ వేదికను అలంకరించినాడు. స్వర్ణపాలికలతో(బంగారు శరావలతో), నవధాన్యముల మొలకలను గలిగి, రంధ్రములు గలిగి ఉన్న కడవలతో, అంకురములతో విరాజిల్లే మూకుళ్లతో, పొగను నలుదిక్కులా వ్యాపింపజేయుచున్న ధూపపాత్రలతో, శంఖపాత్రలతో, యజ్ఞమున ఉపయోగించెడి స్రుక్కులతో, స్రువములతో, అర్ఘ్యజలములతో నిండిన పాత్రలతో, లాజపాత్రలతో, దివ్యమైన అక్షతలతో, సమసంఖ్యలో ఉన్న దర్భలతో యజ్ఞవేదికయొక్క నాలుగు దిక్కులను బ్రహ్మర్షి వసిష్ఠుడు చక్కగా అలంకరించినాడు.

మ. జనకుం డట్లనగా వసిష్ఠముని విశ్వామిత్రమౌనీశు నా
ననమున్ జూచి యనుజ్ఞఁ గైకొని శతానందుండు ముందుండగా
మనసా వాక్కులచే సుకర్మలఁ బ్రపామధ్యమ్మునన్ దివ్యవే
దిని నిర్మించె, నలంకరించె వరవేదిన్ గంధపుష్పాదులన్. 658

సీ. స్వర్ణపాలికలతో భవ్యాంకురాంచిత
చ్ఛిద్రకుంభముల భాసిల్లునట్లు
నంకురాఢ్యములతో నందమ్ముగా కని
పించు మూకుళ్లతో వెలుగునట్లు
ధూపమ్ము వ్యాపించు ధూపపాత్రలతోడ
శుభశంఖపాత్రల స్రుక్స్రువముల
నర్ఘ్యజలమ్ముల నలరారు పాత్రలన్
లాజపాత్రలతో సలక్షణముగ

తే.గీ. దనర, దివ్యాక్షతల సమదర్భల నటఁ
జలువపందిరి మధ్యలో నిలిపినట్టి
యజ్ఞవేదికి నల్దిశలందలంక
రణమొనర్చె వసిష్ఠుండు ప్రజ్ఞ మెఱయ. 659

దర్భై స్సమై స్సమాస్తీర్య విధివ న్మంత్రపూర్వకమ్॥ {1.73.23}
అగ్ని మాదాయ వేద్యాం తు విధిమంత్రపురస్కృతమ్।
జుహోవాఽగ్నౌ మహాతేజా వసిష్ఠో భగవా నృషిః॥ {1.73.24}
తత స్సీతాం సమానీయ సర్వాభరణ భూషితామ్।
సమక్ష మగ్నే స్సంస్థాప్య రాఘవాభిముఖే తదా॥ {1.73.25}
అబ్రవీ జ్జనకో రాజా కౌసల్యానందవర్ధనమ్।
ఇయం సీతా మమ సుతా సహధర్మచరీ తవ॥ {1.73.26}
ప్రతీచ్ఛ చైనాం భద్రం తే పాణిం గృహ్ణీష్వ పాణినా।
పతివ్రతా మహాభాగా ఛాయేవాఽనుగతా సదా॥ {1.73.27}
ఇత్యుక్త్వా ప్రాక్షిప ద్రాజా మంత్రపూతం జలం తదా। {1.73.28}

❊ కల్యాణ యజ్ఞవేదికను పూర్తిగ అలంకరించిన తరువాత బ్రహ్మర్షియగు వసిష్ఠుడు వేదమంత్రములను సుస్వరయుక్తంగా ఆలపిస్తూ, శాస్త్రోక్తప్రకారంగా వివాహవ్రత కార్యక్రమాలను సుస్థిరయోగభావనతో నిర్వహిస్తూ పవిత్ర యజ్ఞవేది యందు అగ్నిని ప్రతిష్ఠించినాడు. కల్యాణ మహోత్సవ సందర్భంగా బ్రాహ్మణోత్తములు మంగళకరమైన సూక్తులను పలుకుచుండగా ఆ వసిష్ఠ మహర్షి వ్రతదీక్షాబద్ధుడై మహాహోమాన్ని ప్రారంభించినాడు. అటువంటి శుభతరుణంలో సర్వాభరణ విభూషిత, ఉర్వీసుత, వీర్యశుల్క, ఉత్తమకన్యామణి, పున్నమి నాటి చంద్రబింబం వంటి మనోహరమైన ముఖంతో విరాజిల్లునట్టిది అగు సీతాకుమారిని ఆమె జనకుడైన జనకమహారాజు అందఱూ మెచ్చుకొంటూ ఉండగా కల్యాణ వేదిక చెంతకు తీసికొని వచ్చి, యజ్ఞవేదికలో ఉన్న అగ్నిసమక్షంలో రఘురామమూర్తికి ఎదురుగా నిలిపినాడు. పెండ్లికుమారుడుగా ఉన్న శ్రీరాముని చూచి "ఓ రామా! ఈ సీత నా కుమార్తె. ఇకపై ఈమె నీ సహధర్మచారిణిగా విరాజిల్లగలదు. ఈ సాధ్వి యొక్క చేతిని నీ

చేతితో గ్రహింపుము. ఈమెను నీ ధర్మపత్నిగా స్వీకరించుము. నీడ వలె ఈమె నిన్ను అనుసరించగలదు. నీకు శ్రేయస్సును కలిగించగలదు " అని పలుకుతూ జనకమహారాజు సంతోషంగా తన చేతినుండి నీటిని ధారగా క్రిందికి వదలుతూ కన్యాదానం చేసినాడు.

మ. స్వర సంగీత పవిత్ర మంత్రములతో, శాస్త్రోక్తకార్యమ్ములన్
స్థిరయోగమ్మునఁ జేసి, యగ్నినిఁ బ్రతిష్ఠించెన్ మహావేదియం,
దురుదీక్షన్ గురువౌ వసిష్ఠుడు మహాహోమమ్ముఁ జేసెన్, వధూ
వర కల్యాణమహోత్సవమ్మున ద్విజుల్ భద్రోక్తులన్ బల్కగా. 660

కం. సర్వాభరణ విభూషిత,
నుర్వీసుత, వీర్యశుల్క , నుత్తమకన్యన్,
బర్వేందుముఖిని, సీతను
సర్వులు మెచ్చంగఁ దెచ్చె జనకుండటకున్. 661

తే.గీ. అటుల సీతను గొనివచ్చి యా జనకుడు
మహితమైన తదగ్నిసమక్షమందు
రాఘవాభిముఖమ్ముగ రాగమొప్ప
నిలిపి రామునిఁ గనుగొని పలికె నిటుల. 662

ఉ. "ఈయమ సీత, నాదు సుత, యిప్పుడు నీ సహధర్మచారిణీ
స్థాయి వెలుంగుఁ, గైకొనుము సాధ్వీకరమ్మును నీ కరమ్ముచే,
శ్రేయముఁ గూర్ప నిన్ననుసరించును ఛాయ యనంగ"నంచుఁ, దాఁ
దోయము ధారగా విడిచెఁ దుష్టిని దజ్జనకుండు ప్రేముడిన్. 663

సాధు సాధ్వితి దేవానా మృషీణాం వదతాం తదా॥ {1.73.28}
దేవదుందుభినిర్ఘోషః పుష్పవర్షో మహా నభూత్।
ఏవం దత్త్వా తదా సీతాం మంత్రోదకపురస్కృతామ్॥ {1.73.29}

అబ్రవీ జ్జనకో రాజా హర్షేణాఽభిపరిప్లుతః।
లక్ష్మణాఽఽగచ్ఛ భద్రం తే ఊర్మిళా ముద్యతాం మయా॥ {1.73.30}
ప్రతీచ్ఛ పాణిం గృహ్ణీష్వ మా భూత్ కాలస్య పర్యయః।

❋ "శ్రీరామా! సీత చేతిని నీ చేతితో గ్రహించుము" అని అంటూ జనకుడు మంత్రజలమును ధారగా క్రిందికి వదులుతూ కన్యాదానం చేయగా, దేవతలు మునులు సాధు సాధు అని పలుకుచుండగా దేవదుందుభులు మ్రోగినవి. పుష్పవర్షము కురిసినది. ఆ విధంగా రామునికి సీతాకుమారిని ఇచ్చి జనకమహారాజు లక్ష్మణుని పిలిచి "నాయనా! ఆలస్యం చేయకుండా మంగళకరమైన ఈ ఊర్మిళ చేతిని నీ చేతితో గ్రహింపుము" అని ఆ సౌమిత్రిని దీవించినాడు.

తే.గీ. మంత్రజలమును జనకుండు మహిని విడువ,
నమరమునివరుల్ సాధువాక్యములఁ బలుక,
దేవదుందుభుల్ మ్రోగెను దివ్యముగను,
బుష్పవర్షమ్ము కురిసెను బూర్ణముగను. 664

తే.గీ. శ్రీయుతుడు రామమూర్తికి సీత నొసగి
ప్రీతి లక్ష్మణుఁ బిలిచి యూర్మిళ నొసగుచు
"స్వీకరింపుమ వైళమ శ్రీకరమ్ముఁ
గరము" నని పల్కె నా జనకప్రభుండు. 665

త మేవ ముక్త్వా జనకో భరతం చాభ్యభాషత॥ {1.73.31}
గృహాణ పాణిం మాణ్డవ్యాః పాణినా రఘునందన।
శత్రుఘ్నం చాపి ధర్మాత్మా అబ్రవీ జ్జనకేశ్వరః॥ {1.73.32}
శ్రుతకీర్త్యా మహాబాహో పాణిం గృహ్ణీష్వ పాణినా। {1.73.33}

❋ "ఊర్మిళ చేతిని నీ చేతితో గ్రహించుము" అని లక్ష్మణునితో చెప్పిన జనకమహారాజు ఆ తరువాత భరతునికి మాండవిని ఇచ్చుట హితకరము అని తలచి "నాయనా! భరతా! ఈ మాండవి చేతిని నీ చేతితో గ్రహింపుము" అని

సంతోషంగా పలికినాడు. పిమ్మట శత్రుఘ్నుని పిలిచి "నాయనా! శత్రుఘ్నా! ఈ శ్రుతకీర్తి చేతిని నీ చేతితో గ్రహింపుము" అని తెలిపినాడు. ఆ సౌమిత్రి అలాగే అని పాణిగ్రహణము చేయదలచినాడు.

తే.గీ. వరుస రఘునందనుండగు భరతుఁ బిలిచి
సుతను మాండవి నొసగంగ హితమటంచు
నామెఁ గైకొనఁ బాణిగ్రహణముఁ జేయు
మనుచు ముదమున వచియించె జనకవిభుడు. 666

తే.గీ. అంత శత్రుఘ్నుఁ బిలుచుచు నా జనకుడు
వత్స! యీమెకుఁ దగినట్టి వరుడవనుచుఁ,
గన్య శ్రుతకీర్తిఁ జూపగాఁ గని యతండు
వల్లె యని శ్రుతకీర్తిఁ జేపట్టనెంచె. 667

సర్వే భవంతః సౌమ్యాశ్చ సర్వే సుచరితవ్రతాః॥ {1.73.33}
పత్నీభి స్సంతు కాకుత్స్థా మా భూత్ కాలస్య పర్యయః।
జనకస్య వచః శ్రుత్వా పాణీన్ పాణిభి రస్పృశన్॥ {1.73.34}
చత్వారస్తే చతస్ృణాం వసిష్ఠస్య మతే స్థితాః।
అగ్నిం ప్రదక్షిణీకృత్య వేదిం రాజాన మేవ చ॥ {1.73.35}
ఋషీంశ్చైవ మహాత్మాన స్సభార్యా రఘుసత్తమాః।
యథోక్తేన తదా చక్రు ర్వివాహం విధిపూర్వకమ్॥ {1.73.36}

❊ పెండ్లికుమారులైన రామలక్ష్మణభరతశత్రుఘ్నులు సౌమ్యులు, సచ్చరిత్ర గలవారు. వధూమణులతో కూడియున్న వారిని ఆ జనకమహారాజు శుభకామనలతో దీవించినాడు. వసిష్ఠ మహర్షి వధూవరులను ప్రశంసించి దీవెనలను అందజేస్తూ పాణిగ్రహణము చేయుటకు అనుమతించినాడు. అంతట రాఘవోత్తములైన ఆ నలుగురు తమ ధర్మపత్నుల చేతులను స్పృశించి పాణిగ్రహణ కార్యక్రమమును పూర్తిచేసినారు. వరులు నలుగురూ వధువుల చేతులను పట్టుకొని అగ్నిదేవుని స్మరించి యజ్ఞవేదికకు ప్రదక్షిణపూర్వక

నమస్కారములను చేసినారు. మునీశ్వరులకు, రాజశ్రేష్ఠులకు కూడా భక్తితో నమస్కరించినారు. శాస్త్రోక్తరీత్యా వివాహవిధులను శ్రద్ధాసక్తులతో ఉత్తమరీతిలో పూర్తిచేసినారు.

చం. తలపగ సౌమ్యులై, సుచరితవ్రతులై, క్రమమొప్పగా సతీ
కలితులునై వసింప శుభకామనలన్ జనకుండు వారికిన్
దెలుప, వసిష్ఠమౌని వినుతించి యనుజ్ఞ నొసంగి దీవెనల్
పలుకగఁ, బాణులన్ సతులపాణులఁ నిల్పిరి రాఘవోత్తముల్. 668

చం. వరులు వధూకరాబ్జములఁ బట్టుచుఁ దాము ప్రదక్షిణమ్ముఁ జే
సిరి జ్వలనున్ దలంచి విలసిల్లుచు, మ్రొక్కిరి వేదికిన్, మునీ
శ్వరులకు, రాజముఖ్యులకు, శాస్త్రవిధిన్ గడు శ్రద్ధతోడ భా
స్వరమతులై వివాహవిధి సత్కృతి సత్కృతిఁ జేసి రయ్యెడన్. 669

పుష్పవృష్టి ర్మహత్యాసీ దంతరిక్షాత్ సుభాస్వరా।
దివ్యదుందుభినిర్ఘోషై ర్గీతవాదిత్రనిస్వనైః॥ {1.73.37}
ననృతు శ్చాప్సరస్సంఘా గంధర్వాశ్చ జగుః కలమ్।
వివాహే రఘుముఖ్యానాం తదద్భుత మదృశ్యత॥ {1.73.38}
ఈదృశే వర్తమానే తు తూర్యోద్ఘుష్టనినాదితే।
త్రి రగ్నిం తే పరిక్రమ్య ఊహు ర్భార్యా మహౌజసః॥ {1.73.39}
అథోపకార్యాం జగ్ము స్తే సభార్యా రఘునందనాః।
రాజా ప్యనుయయౌ పశ్యన్ సర్షిసంఘ స్సబాంధవః॥ {1.73.40}

❋ రామలక్ష్మణభరతశత్రుఘ్నుల పాణిగ్రహణ మహోత్సవములు జరిగిన శుభసమయంలో ఆనందదాయకంగా ఆకాశం నుండి పుష్పవర్షం కురిసింది. మనోహరంగా అంతరిక్షంలో దేవదుందుభులు మ్రోగినవి. అప్సరసలు మొదలగు దివ్యాంగన లందఱూ సంతోషంగా నాట్యం చేసినారు. గంధర్వులు మనోజ్ఞంగా మంగళకర గీతములను గానం చేసినారు. ఆ నాలుగు కల్యాణములు అద్భుతంగా విరాజిల్లినవి. పెండ్లికుమారులైన ఆ రఘువీరులు

నలుగురు యజ్ఞవేదికలో విరాజిల్లే అగ్నిదేవునికి మూడుసార్లు ప్రదక్షిణం చేసినారు. తూర్యనాదాలు మంగళకరంగా శ్రావ్యంగా మ్రోగుతూ ఉండగా, సుస్వర మంత్రములను పఠించే విప్రోత్తములకు నమస్కరించి రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు నలుగురూ క్రమంగా సీత ఊర్మిళ మాండవి శ్రుతకీర్తి అనెడి నలుగురు కన్యకామణులను తమ పత్నులుగా వరించినారు. ఆవిధంగా కల్యాణ మహోత్సవములు పూర్తియైన తరువాత రఘునందనులు నలుగురూ సంతోషంగా సతీసమేతంగా తమ విడిదికి చేరుకొన్నారు. ఋషులు, బంధువులు వెంటరాగా దశరథమహారాజు వధూవరులను అనుసరిస్తూ విడిదికి చేరుకొన్నాడు.

మ. కురిసెన్ బూవులవాన, దుందుభుల నిర్ఘోషమ్ము శ్రావ్యమ్ముగా
మొరసెన్ నిండుగ నంతరిక్షమున, నామోదించి నృత్యమ్ముఁ జే
సిరి దివ్యాంగనలెల్ల, గీతములు రాజిల్లంగ గానమ్ముఁ జే
సిరి గంధర్వులు, చూడ నద్భుతముగాఁ జెల్వొందెఁ గల్యాణముల్.

ఉ. శ్రీ రఘుపుంగవుల్ జ్వలనుఁ జేరి ప్రదక్షిణ మాచరించి ము
మ్మా,రటఁ దూర్యనాదములు మంగళరీతుల మ్రోగుచుండగాఁ,
జేరి సుమంత్రముల్ పలుకు శిష్టుల మ్రొక్కి, వివాహవేదికన్
వారిజనేత్రలన్ దమకుఁ బత్నులుగా గ్రహియించి రాదటన్. 671

తే.గీ. తుష్టి నందుచు భార్యలతోడఁ జనిరి
వేడ్క రఘునందనుల్ తమ విడిదిఁ జేరఁ,
బ్రీతి ఋషులును బంధువుల్ వెంట రాగ
నాజిభూపతి వారల ననుసరించె. 672

❋ ఈ రాముడే కదా క్రూరరాక్షసి యగు తాటకను చంపిన ధైర్యమూర్తి. ఈ రాముడే కదా విశ్వామిత్రమునియొక్క యాగమును అవలీలగా రక్షించిన బాలమూర్తి. ఈ రాముడే కదా అహల్యకు శాపవిమోచనమును కలిగించిన పుణ్యమూర్తి. ఈ రాముడే కదా శివధనుస్సును ఎక్కుపెట్టిన జగదేకవీరమూర్తి.

ధరణీకుమారి రాజకుమారి అగు మన సీతాకుమారి యొక్క పాణిని గ్రహించి వివాహమాడిన పరమపురుషమూర్తి ఈ రాముడే కదా! అని కల్యాణరాముని చూచి తిలకించి పులకించిన మిథిలానగర ప్రజలు శ్రీరాముని మహిమలను గుఱించి తమ మనస్సులలో పరిపరివిధాలుగా భావించి, కీర్తించి శుభపరంపరలను పొందినారు.

సీ. ఈ రాముడే కదా క్రూరరాక్షసియగు
తాటకన్ జంపిన ధైర్యమూర్తి
యీ రాముడే కదా ఋషివర్యుయాగమున్
లీల రక్షించిన బాలమూర్తి
యీ రాముడే కదా యిల నహల్యాశాప
మును దొలగించిన పుణ్యమూర్తి
యీ రాముడే కదా యీశుచాపము నెక్కు
పెట్టిన జగదేకవీరమూర్తి
తే.గీ. ధరణిఁ జనియించినట్టి సీతాకుమారి
పాణి గ్రహియించినటువంటి పరమమూర్తి
యనుచు మిథిలాపురప్రజ లా రఘువరుఁ
జూచి తిలకించి పులకించి శుభముఁగనిరి. 673

❋ ఈ శ్రీరాముని కన్నతల్లి కౌసల్య తన పూర్వజన్మలలో ఎటువంటి తపస్సు చేసినదో కదా! రాముని కుమారునిగా పొందిన దశరథ ప్రభువు ఎటువంటి యజ్ఞం చేసినాడో కదా! రాముని భర్తగాపొందిన మా సీతమ్మ ఎటువంటి వ్రతం చేసినదోకదా! అందఱిచే సేవల నందుకొనే రామునిచేత సేవలనందుకొనే విశ్వామిత్రుడు ఎటువంటి పుణ్యము చేసినాడో కదా! సదా శ్రీరాముని దర్శన భాగ్యాన్ని పొందే అయోధ్యాపురప్రజలు ఎటువంటి నోములను నోచినారో కదా! అని అనుకొంటూ మిథిలానగరప్రజలు రాముని తిలకించి పులకించిపోతూ ఉన్నారు.

సీ. తల్లియౌ కౌసల్య తపమేమి చేసెనో
పుత్రుడౌ రాముని ముద్దులంద
ప్రభువు దశరథుండు క్రతువేమి చేసెనో
తనయుడై రాముడు జననమంద
వసుధాసుతగ సీత వ్రతమేమి చేసెనో
రాముని విభునిగా రక్తి నంద
ముని గాధిపుత్రు డే పుణ్యమ్ము చేసెనో
సేవింపదగు రాము సేవలంద
తే.గీ. నెన్ని నోముల నోచిరో యెవరి కెఱుక
ప్రజలయోధ్యలో రామదర్శనము నంద
ననుచు మిథిలాపురప్రజ లా రఘువరుఁ
జూచి తిలకించి పులకించి శుభముఁగనిరి. **674**

❉ శ్రీ సీతారాముల కల్యాణంలో తలంబ్రాలు వేడుక జరిగే సందర్భంలో, ముత్యాల తలంబ్రాలు క్రమంగా సీతమ్మ దోసిటిలో ఉన్నప్పుడు అరుణకాంతులతో పద్మరాగములవలె, రామయ్య శిరస్సునకు పైభాగాన ఉన్నప్పుడు శ్వేతకాంతులతో మల్లెలవలె, నీలమేఘచ్ఛాయలో ఉన్న శ్రీరాముని శరీరంపై జాలువారుతూ ఉన్నప్పుడు నీలి కాంతులతో ఇంద్రనీలమణులవలె ప్రకాశించినవి. ఆ ముత్యాల తలంబ్రాలు సకల శుభములను కలిగిస్తూ అందఱినీ కాపాడును గాక!

★ఉ. జానకి చేతిముత్యములు సాంద్రత రాజిలె పద్మరాగముల్
గా, నవి రామశీర్షమునఁ గాంతులతో విలసిల్లి మల్లెలై,
కానగఁ బెండ్లిలో వరుని గాత్రముపై బడి యింద్రనీలముల్
గా నగుపించెగా; నవియె కమ్ర శుభమ్ముల గూర్చి ప్రోచుతన్. **675**

★(ఈ పద్యము ఆదిశంకరాచార్యుల "జానక్యాః కమలామలాంజలిపుటే....." అను శ్లోకమునకు స్వేచ్ఛానువాదము)

74. దశరథుడు వధూవర సపరివారంగా అయోధ్యకు బయలుదేఱుట, దారిలో పరశురాముడు ఎదురగుట

అథ రాత్ర్యాం వ్యతీతాయాం విశ్వామిత్రో మహామునిః।
ఆపృష్ట్వా తౌ చ రాజానౌ జగా మోత్తరపర్వతమ్॥ {1.74.1}
విశ్వామిత్రే గతే రాజా వైదేహం మిథిలాధిపమ్।
ఆపృష్ట్వాఽథ జగామాఽఽశు రాజా దశరథః పురీమ్॥ {1.74.2}
గచ్ఛంతం తం తు రాజాన మన్వగచ్ఛ న్నరాధిపః।
అథ రాజా విదేహానాం దదౌ కన్యాధనం బహు॥ {1.74.3}

❋ శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవములు పూర్తికాగా మఱునాటి ఉదయమున విశ్వామిత్ర మహర్షి జనకమహారాజు వద్ద, దశరథమహారాజు వద్ద సెలవు తీసికొని వారికి వీడ్కోలు పలికి తపస్సు చేసికొనుటకు హిమాలయ పర్వతము వద్దకు వెళ్లినాడు. జనకునికి దశరథునికి వీడ్కోలు పలికి కౌశికుడు వెళ్లిపోయిన తరువాత దశరథుడు కూడా జనకునికి వీడ్కోలు పలికి అయోధ్యకు బయలుదేరుటకు సంకల్పించినాడు. దశరథుని, అల్లుండ్రను కుమార్తెలను అయోధ్యకు సాగనంపుతూ జనకుడు వారితోపాటు సంతోషంగా కన్యాధనమును కూడా పంపించినాడు.

తే.గీ. రామకల్యాణకార్యమ్ము రసహితముగ
గడవ మఱునాటి రేపటఁ గౌశికుండు
జనకదశరథులఁ గని వీడ్కొనుచు నంత
నరిగెఁ దప మొనరింప హిమాద్రి కడకు. 676

మ. జనకున్ గోసలభూపు వీడ్కొనుచు విశ్వామిత్రు డట్లేగ, నా
జనకున్ వీడ్కొని కోసలేశుడు చనన్ సంకల్పమున్ జేయఁ దా
నును వారందఱ సాగనంపుచును సంతుష్టిన్ సుకన్యాధన
మ్మును బంపెన్ జనకుండు పుత్రికలతో మోదించు నల్లుండ్రతో. 677

గవాం శతసహస్రాణి బహూని మిథిలేశ్వరః।
కంబళానాం చ ముఖ్యానాం క్షౌమకోట్యంబరాణి చ॥ {1.74.4}
హస్త్యశ్వరథపాదాతం దివ్యరూపం స్వలంకృతమ్।
దదౌ కన్యాపితా తాసాం దాసీదాస మనుత్తమమ్॥ {1.74.5}
హిరణ్యస్య సువర్ణస్య ముక్తానాం విద్రుమస్య చ।
దదౌ పరమసంహృష్టః కన్యాధన మనుత్తమమ్॥ {1.74.6}
దత్త్వా బహుధనం రాజా సమనుజ్ఞాప్య పార్థివమ్।
ప్రవివేశ స్వనిలయం మిథిలాం మిథిలేశ్వరః॥ {1.74.7}

❋ విదేహ దేశాధిపతియైన జనకమహారాజు సీత ఊర్మిళ మాండవి శ్రుతకీర్తి వధూమణులను అత్తవారింటికి పంపుతూ ఆదరాభిమానములతో ఎంతో ఘనంగా కన్యాధనాన్ని పంపించినాడు. లక్షలాది గోవులను, మేలైన పట్టువస్త్రములను, కంబళములను, రథ గజ తురగ పదాది సేనలను, దాదులను, దివ్యమైన రూపాన్ని కలిగియుండి, విలువైన ఆభరణములను ధరించియున్నవారగు దాసీజనములను బంగారమును వెండిని జాతిరత్నములను పగడాలను ముత్యాలను కన్యాధనంగా పంపినాడు. ఆ మిథిలా నగరాధిపతి ఆవిధంగా కుమార్తెలను అల్లుండ్రను సాగనంపి, కుమార్తెలు తనకు దూరమైతూ ఉండడంతో మనసులో దిగులుపడుతూ వెనుదిరిగినవాడై తన అంతఃపురానికి చేరుకొన్నాడు.

సీ. గోవుల లక్షలకొలదిగా నిచ్చెను
పట్టువస్త్రములఁ గంబళముల నిడెఁ
బ్రఖ్యాతి నలరెడి రథగజతురగప
దాది సేనల నిడె నాదరముగ
దివ్యరూపమ్ముల దివ్యభూషణముల
నలరు దాసీజనముల నొసంగె
స్వర్ణమ్ము రజతమ్ము జాతిరత్నమ్ములఁ
బగడాల ముత్యాల వరుస నొసగె

తే.గీ. నెమ్మి నీరీతిఁ గన్యాధనమ్ము నిడుచు
జనకభూపతి యందఱ సాగనంపి
పుత్రికలు దూరమగుటచేఁ బొగులు మదిని
మరలుచున్ జేరెఁ దన యంతిపురమునకును. 678

రాజా ప్యయోధ్యాధిపతి స్సహ పుత్రై ర్మహాత్మభిః।
ఋషీన్ సర్వాన్ పురస్కృత్య జగామ సబలానుగః॥ {1.74.8}
గచ్ఛంతం తు నరవ్యాఘ్రం సర్షిసంఘం సరాఘవమ్।
ఘోరాః స్మ పక్షిణో వాచో వ్యాహరంతి తత స్తతః॥ {1.74.9}
భౌమా శ్చైవ మృగాః సర్వే గచ్ఛంతి స్మ ప్రదక్షిణమ్।
తాన్ దృష్ట్వా రాజశార్దూలో వసిష్ఠం పర్యపృచ్ఛత॥ {1.74.10}

❋ పుత్రరత్నాలైన రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులతో కలిసి కోసలాధిపతియైన దశరథమహారాజు మునులతోను, సేనాబలములతోను కూడినవాడై మిథిలానగరమును వీడి అయోధ్య చేరుటకు తన ప్రయాణమును కొనసాగించినాడు. కుమారులతో మునులతో కలిసి ముందుకు సాగుచున్న కోసలేశుని చుట్టూ ఉన్న వాతావరణంలో అకస్మాత్తుగా భయంకరమైన మార్పులు ఏర్పడినవి. అశుభాన్ని సూచిస్తూ పక్షుల కూతలు అనంతంగా కర్ణకఠోరంగా వినపడసాగినవి. మృగములు భూమిపైన ఉన్నచోటనే ఉండి ప్రదక్షిణం చేయుచున్నట్లు తిరుగసాగినవి. ఆ పరిస్థితిని చూచిన దశరథుడు కీడు కలుగగలదని సందేహిస్తూ, కులగురువైన వసిష్ఠుని పిలిచినాడు. తన సందేహమును గుఱించి వివరించ దలచినాడు.

తే.గీ. కొమరులన్ గూడి ముదమునఁ గోసలపతి
మునులు బలములుఁ దోడురాన్ ఘనతరముగ
మిథిల వీడుచు నెల్లెడ మేలటంచుఁ
గదలినా డయోధ్యాపురగామి యగుచు. 679

చం. మునుల సుతాదులన్ గలసి ముందున కేగెడి కోసలేశ్వరుం
దనఘుడు తా వినెన్ బహువిహంగరుతమ్ముల, వాని సంజ్ఞలన్
గనెను, వెసన్ ప్రదక్షిణముగాఁ దిరుగాడు మృగమ్ములన్ గనెన్,
మనమున సంశయమ్మొదవ మాన్యునిఁ జేరె వసిష్ఠసంయమిన్. 680

అసౌమ్యాః పక్షిణో ఘోరా మృగాశ్చాపి ప్రదక్షిణాః।
కిమిదం హృదయోత్కంపి మనో మమ విషీదతి॥ {1.74.11}
రాజ్ఞో దశరథ స్యైతత్ శ్రుత్వా వాక్యం మహా నృషిః।
ఉవాచ మధురాం వాణీం శ్రూయతా మస్య యత్ఫలమ్॥ {1.74.12}
ఉపస్థితం భయం ఘోరం దివ్యం పక్షిముఖా చ్చ్యుతమ్।
మృగాః ప్రశమయం త్యేతే సంతాప స్త్యజ్యతా మయమ్॥ {1.74.13}

❉ "ఓ వసిష్ఠ మహర్షీ! దయతో నా సందేహమును తీర్చండి. పక్షులు ఈ విధంగా అరుస్తూ నా మనస్సులో కలతను రేపుతున్నవి. మృగాలు ఈ విధంగా ప్రదక్షిణంగా తిరుగుతూ భీతిని కలిగిస్తూ ఉన్నవి. ఈ పక్షుల జంతువుల వింతప్రవర్తనకు కారణం ఏమై ఉంటుందో తెలియజేయండి" అని దశరథుడు దీనంగా అడుగగా శకునశాస్త్ర రహస్యములను ఎఱిగినవాడైన ఆ బ్రహ్మర్షి కోసలేశునికి ధైర్యం చెబుతూ "ఓ దశరథా! ఈ పక్షుల అరపులు రాబోయే దుర్దశ గుఱించి సూచిస్తూ ఉన్నవి. ఐతే ఈ మృగములు ప్రదక్షిణంగా తిరుగుతూ ఉండడ మనేది శుభ శకునము. కాబట్టి భయపడవలసిన పని లేనే లేదు. మనకు జయము శుభము కలుగగలవు" అని అభయవాక్కులను పలికినాడు.

ఉ. ధీర! వసిష్ఠమౌనివర! తీర్చుము సందియమున్, ఖగమ్ము లీ
తీరునఁ గూయుచున్ వెఱపు ద్రిప్పె నెడంద, మృగమ్ములన్నియున్
జేరెఁ బ్రదక్షిణమ్ములను జేయుచు భీతిని గూర్చెఁ, గారణ
మ్మారసి తెల్పుమయ్య యని యాజి వినమ్రత వేడె దీనుడై. 681

చం. దశరథు దీనవాక్కు విని ధైర్యముఁ గూర్చుచు మౌని, రాజ! దు
ర్దశలనుఁ దెల్పు నీ ఖగ విరావము, లెన్న మృగప్రదక్షిణల్

కుశలముఁ గూర్చునట్టివని కూరిమితోడ భయమ్ముఁ దీర్చి స
దృశము లభించునంచు నభయమ్మిడె, శాస్త్రరహస్యవేత్తయై. 682

తేషాం సంవదతాం తత్ర వాయుః ప్రాదుర్బభూవ హ।
కంపయన్ పృథివీం సర్వాం పాతయంశ్చ ద్రుమాన్ శుభాన్॥ {1.74.14}
తమసా సంవృత స్సూర్య స్సర్వా న ప్రబభు ర్దిశః।
భస్మనా చావృతం సర్వం సంమూఢ మివ తద్బలమ్॥ {1.74.15}
వసిష్ఠ శ్చర్షయ శ్చాన్యే రాజా చ ససుతః తదా।
ససంజ్ఞా ఇవ తత్రాసన్ సర్వ మన్య ద్విచేతనమ్॥ {1.74.16}
తస్మిం స్తమసి ఘోరే తు భస్మఛన్నేవ సా చమూః। {1.74.17}

❄ శకునశాస్త్రము నెఱిగిన వశిష్ఠుడు దశరథునికి ధైర్యము చెప్పి అభయమునిచ్చిన ఆ సమయమున సూర్యుని కప్పివేయుచూ అంతటా చీకటి వ్యాపించినది. దిక్కులు దిగంతములు కళావిహీనములుగా మారిపోయినవి. ధూళి చెలరేగి కన్నులలో పడసాగినది. కోసలేశుడైన దశరథుడు, బ్రహ్మర్షి వసిష్ఠుడు, రఘువీరులైన రామ లక్ష్మణ భరత శత్రుఘ్నులు నిర్భయులై ఉండగా ఇతరులు మరియు సైన్యము తేజస్సును కోల్పోయి మూర్ఛలో మునిగిపోయిరి.

ఉ. వారటు పల్కుచుండఁ గనవచ్చెఁ దమస్సు దినేశుఁ గప్పుచున్
మార రుచుల్ దిగంతములు గ్రమ్మనపుడె, ధూళియు రేగి కన్నులన్
జేరెను, గోసలేశుడు వసిష్ఠుడు మౌనులు రాఘవాఢ్యులున్
ధీరత నుండఁ, దద్బలము తేజము వీడి మునింగె మూర్ఛలో. 683

దదర్శ భీమసంకాశం జటామణ్డలధారిణమ్॥ {1.74.17}
భార్గవం జామదగ్న్యం తం రాజరాజవిమర్దనమ్।
కైలాస మివ దుర్ధర్షం కాలాగ్ని మివ దుస్సహమ్॥ {1.74.18}
జ్వలంత మివ తేజోభి ర్దుర్నిరీక్ష్యం పృథగ్జనైః।
స్కంధే చాసజ్య పరశుం ధను ర్విద్యుద్గణోపమమ్॥ {1.74.19}

ప్రగృహ్య శరముఖ్యం చ త్రిపురఘ్నం యథా శివమ్।
తం దృష్ట్వా భీమసంకాశం జ్వలంత మివ పావకమ్॥ {1.74.20}
వసిష్ఠప్రముఖా విప్రా జపహోమపరాయణాః।
సంగతా మునయ స్సర్వే సంజజల్పు రథో మిథః॥ {1.74.21}

❋ అకస్మాత్తుగా భయంకరమైన వాతావరణం ఏర్పడగా భీమరూపుడు జటామండల విరాజితుడు భృగువంశ సంజాతుడు క్షత్రియులను వరుసగా సంహరించినవాడు ప్రళయ కాలాగ్నితుల్యుడు కైలాసపర్వతం వలె దుర్ధర్షుడు త్రిపురాసురులను సంహరించిన శివుని తేజస్సును గలిగి గొప్ప శరమును చేపట్టిన పురుషశ్రేష్ఠుడు అగు జామదగ్న్యుడు గండ్రగొడ్డలిని భుజమున ధరించి మెఱపుతీగెతో సమానమైన విల్లును ధరించి భయంకరమైన తేజస్సును గలిగి అందఱికీ భీతిని కలిగిస్తూ అగ్ని వలె జ్వలిస్తూ అచ్చట ప్రత్యక్షమైనాడు. అతనిని చూచిన పెద్దలు వసిష్ఠాది మునులు పరస్పరం ఆ పరశురాముని గుఱించి మెల్లగా ఇలా మాట్లాడసాగినారు.

సీ. భీమరూపుండు జటామండలయుతుండు
భార్గవుండును నరపాలయముడు
కాలాగ్నితుల్యుండు కైలాసపర్వత
తుల్యదుర్ధర్షుండు ద్యుతియుతుండు
త్రిపురఘ్నుడగు శివు తేజమ్ముతో శర
ముఖ్యమ్ము నందిన పురుషవరుడు
భుజమునఁ బరశువున్ బొలుపార ధరియించి
విద్యుత్సమానమౌ విల్లుఁ దాల్చి
తే.గీ. భీమసంకాశుడై మహాభీతినిడుచు
నగ్నివలెఁ బ్రజ్వరిల్లి ప్రత్యక్షమైన
జామదగ్న్యునిఁ గనుగొని సకలమునులు
కూడి మెల్లగా మాటాడుకొనిరి యిటుల. 684

కచ్చి త్పితృవధామర్షీ క్షత్రం నోత్సాదయిష్యతి।
పూర్వం క్షత్రవధం కృత్వా గతమన్యు ర్గతజ్వరః॥ {1.74.22}
క్షత్ర స్యోత్సాదనం భూయో న ఖల్వస్య చికీర్షితమ్।
ఏవ ముక్త్వాఽర్ఘ్య మాదాయ భార్గవం భీమదర్శనమ్॥ {1.74.23}
ఋషయో రామ రామేతి వచో మధుర మబ్రువన్।
ప్రతిగృహ్య తు తాం పూజా మృషిదత్తాం ప్రతాపవాన్॥ {1.74.24}
రామం దాశరథిం రామో జామదగ్న్యోఽభ్యభాషత। {1.74.25}

❋ "జమదగ్ని కుమారుడైన ఈ పరశురాముడు తన తండ్రిని ఒక రాజు వధించినాడని కోపించి ఉగ్రుడై ఈ భూమిపై ఒక్క రాజును కూడా బ్రతకనీయను అని పట్టుబట్టి తన పరాక్రమంతో పూర్వము ఎంతోమంది రాజులను నాశనం చేసినాడు. క్షత్రియ సమూహంపై ఈ భార్గవునికి ఇంకా కోపము తొలగిపోలేదేమో? ఇప్పుడు ఇలా క్రోధమూర్తిగా కనిపిస్తూ ఉన్నాడు" అని ఋషివరులు మెల్లగా మాట్లాడుకొంటూ "ఓ పరశురామా! ఇదుగో అర్ఘ్యమును స్వీకరించండి" అని వేడుకొనగా ఆ భార్గవరాముడు అర్ఘ్యమును తీసికొని మునుల పూజలను స్వీకరించి, కోపము ఉప్పొంగగా భయంకరమైన రూపం గలవాడై ఇనకులసంజాతుడైన దాశరథిని చూచి ఇలా మాట్లాడ నారంభించినాడు.

మ. తన జనకున్ వధింపఁ బరితాపమునందిన భార్గవుండు రా
జును బ్రతుకంగనీయ నని శూరత నాశ మొనర్చె రాజులన్
గనుగొని పూర్వ, మాతనికి క్షత్రియవర్గము పైనఁ గ్రోధ మిం
కనుఁ దొలగంగలేదొ? యిటు కన్పడె నిప్పుడు క్రోధమూర్తియై. 685

చం. అనుచును జామదగ్న్యునికి నర్ఘ్యము నీయగ రామ! రామ! యం
చును ఋషు లెల్లరున్ బలుకఁ, జూచిన భార్గవరాము డర్ఘ్యమున్
గొని మునిపూజలన్ గొనియుఁ, గోపము పొంగగ భీమమూర్తియై
యినకులజాతు దాశరథి నెంచి వచింపగఁ బూనె నీ విధిన్. 686

75. వైష్ణవధనుస్సును ఎక్కుపెట్టుమని పరశురాముడు శ్రీరాముని ప్రేరేపించుట

రామ దాశరథే రామ వీర్యం తే శ్రూయతేఽద్భుతమ్।
ధనుషో భేదనం చైవ నిఖిలేన మయా శ్రుతమ్॥ {1.75.1}
తదద్భుత మచింత్యం చ భేదనం ధనుష స్త్వయా।
తచ్ఛృత్వాఽహ మనుప్రాప్తో ధను ర్గృహ్యాఽపరం శుభమ్॥ {1.75.2}
తదిదం ఘోరసంకాశం జామదగ్న్యం మహద్ధనుః।
పూరయస్వ శరేణైవ స్వబలం దర్శయస్వ చ॥ {1.75.3}
తదహం తే బలం దృష్ట్వా ధనుషోఽస్య ప్రపూరణే।
ద్వంద్వయుద్ధం ప్రదాస్యామి వీర్యశ్లాఘ్యస్య రాఘవ॥ {1.75.4}

❋ ఓ దశరథరామా! శివుని పేరుతో ప్రసిద్ధిని పొందిన వింటిని నీవు అవలీలగా విఱిచినావని నేను వింటిని. విష్ణువు పేర ప్రసిద్ధి చెందిన ఈ ధనుస్సును చూడుము. ఈ విష్ణుచాపమును ఎక్కుపెట్టుము. నీ వీరత్వాన్ని చూపించుము. నన్ను ఎదిరించి నిలబడుము. అద్భుతము అనర్ఘము ఐన శివుని కార్ముకమును త్రుంచిన ఓ రఘురామా! నా తండ్రినుండి నాకు సంక్రమించిన ఈ శరాసనమును తీసికొని నీవు ఎక్కుపెట్టినచో నీ బలపరాక్రమములను నేను గుర్తించెదను. విష్ణువుయొక్క ఈ కోదండమును నీవు ఎక్కుపెట్టినచో నేను నీతో ద్వంద్వయుద్ధము చేయగలను అని పరశురాముడు రఘురామునితో పలికెను.

ఉ. వింటిని రామ! మా హరుని పేర విరాజిలుచుండినట్టి యా
వింటిని లీలగా విఱిచి వీరుడవైతి వటంచుఁ, నేడు నీ
వింటినిఁ జూడు, మచ్యుతుని వింటిని, వైష్ణవచాప మిద్ది, యీ
వింటిని లీల నెక్కిడుమ, వీరతఁ నన్ దరియించి నిల్వుమా! 687

చం. అనితరసాధ్య మద్భుత మనర్ఘము శైవధనుస్సు, దాని ద్రుం
చిన రఘురామ! యెక్కిడుమ చేకొని వైష్ణవచాపమున్, భవ

ఘ్ఘనతర బాహువిక్రమముఁ గాంచెద, దీనిని నా కొసంగె మ
జ్జనకుడు, దీని నెక్కిడినఁ జాలును జేసెద ద్వంద్వయుద్ధమున్. 688

తస్య తద్వచనం శ్రుత్వా రాజా దశరథ స్తథా।
విషణ్ణవదనో దీనః ప్రాంజలి ర్వాక్య మబ్రవీత్॥ {1.75.5}
క్షత్రరోషాత్ ప్రశాంత స్త్వం బ్రాహ్మణ శ్చ మహాయశాః।
బాలానాం మమ పుత్రాణా మభయం దాతు మర్హసి॥ {1.75.6}
భార్గవాణాం కులే జాతః స్వాధ్యాయవ్రతశాలినామ్।
సహస్రాక్షే ప్రతిజ్ఞాయ శస్త్రం నిక్షిప్తవా నసి॥ {1.75.7}

❋ "ఈ విష్ణుచాపమును ఎక్కుపెట్టినచో నీతో ద్వంద్వయుద్ధము చేసెదను" అని అంటూ పరశురాముడు రఘురాముని సమీపించుచుండగా భార్గవరాముని క్రోధోక్తులను వినిన దశరథుడు 'తాము ఇక క్షేమముగా ఉండుట కల్ల' అని సందేహిస్తూ చింతిస్తూ "ఓ భార్గవరామా! నీవు పూర్వము సామ మార్గమును వదలివేసి క్షత్రియసమూహములను వధించినావు. ఆ తరువాత నియమవంతుడవై తపస్సు చేసికొనుచూ ఉంటివి కదా! నా పుత్రులైన రామ లక్ష్మణులు బాలకులు. ఈ ప్రళయకాల భయంకర రూపాన్ని విడిచిపెట్టి శాంతమూర్తివై మమ్ము దయతో చూడుము. "ఇకపై ధర్మమార్గమునే ఆచరిస్తాను. యుద్ధమును చేయను" అని సురపాలకుడైన ఇంద్రుని ముందు ప్రతిజ్ఞ చేసి ఆయుధములను పరిత్యజించినావు కదా! ఓ బ్రాహ్మణోత్తమా! ఇప్పుడు మాకు అభయము నిమ్ము అని వేడుకొనసాగినాడు.

ఉ. రామునిఁ జేరు నా పరశురామునిఁ జూచుచుఁ, దద్రుషోక్తులన్
క్షేమము సందియ మ్మనుచుఁ జింతిలి, పంక్తిరథేశు డిట్లనెన్
"సామము వీడి క్షత్రియులఁ జంపితి వప్పుడు, శాంతమూర్తివై
నేమము తోడనున్న ధరణీసుర! నే డభయ మ్మొసంగుమా! 689

ఉ. బాలురు నాదు పుత్రకులు భద్రముఁ గూర్పుము భార్గవాగ్రణీ!
కాలుని రూపమున్ విడిచి కాంచుము సత్కృప, మేటి ధర్మమున్

బాలనఁ జేసితీవు, సురపాలకు ముందు ప్రతిజ్ఞఁ జేసితీ
వాలముఁ జేయనంచు భవదాయుధముల్ విడితీవు సంయమీ! 690

స త్వం ధర్మపరో భూత్వా కాశ్యపాయ వసుంధరామ్।
దత్త్వా వన ముపాగమ్య మహేంద్రకృతకేతనః॥ {1.75.8}
మమ సర్వవినాశాయ సంప్రాప్త స్త్వం మహామునే।
న చైకస్మిన్ హతే రామే సర్వే జీవామహే వయమ్॥ {1.75.9}
బ్రువ త్యేవం దశరథే జామదగ్న్యః ప్రతాపవాన్।
అనాదృత్యైవ తద్వాక్యం రామమే వాభ్యభాషత॥ {1.75.10}

❈ "ఓ పరశురామా! రాజుల నెందఱినో వధించి ఆ రాజుల రాజ్యములను గ్రహించి వసుంధరను కాశ్యపమహర్షికి సమర్పించినావు. తపస్సు చేయుటకు మహేంద్రగిరికి వెళ్లినావు. నీవు తపస్సు చేయుటచే ఆ పర్వతము ధన్యతను పొందినది. శాంతగుణం కలవాడవై తపస్సు చేసెడి నీవు నా కుమారులైన రామలక్ష్మణులను అంతంచేయుటకు ఇప్పుడు ఇలా ఇచ్చటికి వచ్చినావా? ఒకవేళ నా రాముడు మరణించినట్లైతే ఇక మా బ్రతుకు కూడా ఒక బ్రతుకు ఔతుందా? అమంగళము ప్రతిహతమగునుగాక!" అని అంటూ కోసలేశుడు విలపిస్తూ ఉండగా ఆ జామదగ్న్యుడు దశరథుని మాటలను లెక్కపెట్టకుండా విద్వేషంతో కూడినవాడై రఘురాముని చూస్తూ ఇలా అన్నాడు.

చం. నరపతులన్ వధించి, జననాథుల రాజ్యము సంగ్రహించి, నీ
విరవుగ మౌని కాశ్యపుని కిచ్చితివయ్య వసుంధరన్, మహ
త్తరనగమౌ మహేంద్రగిరి ధన్యత నందఁ దపమ్ముఁ జేయగా
నరిగిన నీవు, నా సుతుల నంతముఁ జేయగ వచ్చితే యిటుల్. 691

తే.గీ. రాము డొక్కండు హతుడైన రణమునందు
పాపము శమించుగాక! మా బ్రతుకు బ్రతుకె?
యనుచు దశరథ భూజాని వనరుచుండ
వినక భార్గవు డిట్లనె ద్వేషమొప్ప. 692

ఇమే ద్వే ధనుషీ శ్రేష్ఠే దివ్యే లోకాభివిశ్రుతే।
దృఢే బలవతీ ముఖ్యే సుకృతే విశ్వకర్మణా॥ {1.75.11}
అతిసృష్టం సురై రేకం త్ర్యంబకాయ యుయుత్సవే।
త్రిపురఘ్నం నరశ్రేష్ఠ భగ్నం కాకుత్స్థ యత్త్వయా॥ {1.75.12}

❋ "ఓ రఘురామా! శివచాపము, విష్ణుచాపము అనెడి రెండు ధనుస్సులు ఈ విశ్వమున ప్రసిద్ధిచెందినటువంటివి. ప్రముఖమైనవి. దృఢమైనవి. గొప్ప కీర్తిని గడించినట్టివి. వజ్రముతో సమానమైనవి. పూర్వము విశ్వకర్మచే సృజింపబడినట్టివి. వాటిలో ఒకదానిని పరమశివుడు తీసికొనగా రెండవదానిని విష్ణు భగవానుడు స్వీకరించినాడు. మహాదేవుడు ఆ ధనుస్సును చేపట్టి త్రిపురాసురులను కూల్చినాడు. నీవు ఆ శివధనుస్సును ఎక్కుపెట్టుచూ వింతగా విఱిచివేసినావు అని పరశురాముడు దశరథరామునితో పలుకసాగినాడు.

మ. శివచాపమ్మును విష్ణుచాపమును వాసిన్ గాంచె, నీ రెండు సం
స్తవనీయంబులు ముఖ్యముల్ దృఢములున్ సత్కీర్తిమంతమ్ములున్
బవితుల్యంబులు, విశ్వకర్మ సృజియింపన్ వానిలోఁ ద్ర్యంబకుం
డవలీలన్ గొనె నొక్కదాని, హరి యన్యంబున్ గొనెన్ రాఘవా! 693

తే.గీ. చాపమును గొని రణమున జయము నందెఁ
ద్రిపురములఁ గూల్చు తఱి మహాదేవమూర్తి
ఘనతరమ్మగు నా శివధనువు నెత్తి
విఱిచినాడవు రఘురామ! వింతగాను. 694

తదిదం వైష్ణవం రామ ధనుః పరమభాస్వరమ్।
సమానసారం కాకుత్స్థ రౌద్రేణ ధనుషా త్విదమ్॥ {1.75.13}
తదా తు దేవతా స్సర్వాః పృచ్ఛంతి స్మ పితామహమ్।
శితికణ్ఠస్య విష్ణోశ్చ బలాబలనిరీక్షయా॥ {1.75.14}
అభిప్రాయం తు విజ్ఞాయ దేవతానాం పితామహః।
విరోధం జనయామాస తయో స్సత్యవతాం వరః॥ {1.75.15}

విరోధే చ మహా ద్యుద్ధ మభవ ద్రోమహర్షణమ్।
శితికణ్ఠస్య విష్ణోశ్చ పరస్పరజిగీషుణోః॥ {1.75.16}
తదా తు జృంభితం శైవం ధను ర్భీమపరాక్రమమ్।
హుంకారేణ మహాదేవః స్తంభితోఽథ త్రిలోచనః॥ {1.75.17}

❋ "ఓ రఘువీరా! ఇదియే విష్ణుచాపము. దీనిని తీసికొనుము. ఇది శివచాపముతో సమానమైన బలమును గలిగియున్నట్టిది. హరిహరుల చాపముల బలాబలములను తెలిసికొనదలచిన దేవతలు పూర్వము బ్రహ్మదేవుని సమీపించినారు. దేవతల మనసులోని భావమును తెలిసికొన్న విరించి హరిహరులకు విరోధమును కల్పించినాడు. అప్పుడు వృషధ్వజుడైన శివుడు గరుడధ్వజుడైన విష్ణువు ఒకరినొకరు జయించవలెనను కోరికతో యుద్ధమును ప్రారంభించినారు. ఆ యుద్ధంలో విష్ణుభగవానుని హుంకారమునకు శివధనుస్సు తన తేజస్సును కోల్పోయినది" అని పరశురాముడు దశరథరామునికి విశదీకరించసాగినాడు.

తే.గీ. విష్ణుచాప మ్మిదియె రఘువీర! కనుము,
సతము శివచాపతుల్యమ్ము సత్త్వయుతము
హరిహరుల చాపముల సార మరయ సురలు
పూర్వము విరించిఁ జేరిరి మోదమొప్ప. 695

చం. అమరుల మానస మ్మెఱిగి యబ్జజు డేర్పరుపన్ విరోధమున్,
సమరముఁ జేయనెంచిరి వృషధ్వజుడున్ గరుడధ్వజుండు, వి
భ్రమ సమరమ్ము సల్పిరి పరస్పరమున్ విజిగీషులై, ప్రశ
స్తమగు మహేశుచాపము నిజద్యుతిఁ గోల్పడె శార్ఙ్గి హుంకృతిన్. 696

దేవై స్తదా సమాగమ్య సర్షిసంఘై స్సచారణైః।
యాచితౌ ప్రశమం తత్ర జగ్మతు స్తౌ సురోత్తమౌ॥ {1.75.18}
జృంభితం తద్ధను ర్దృష్ట్వా శైవం విష్ణుపరాక్రమైః।
అధికం మేనిరే విష్ణుం దేవా స్సర్షిగణా స్తదా॥ {1.75.19}

ధనూ రుద్రస్తు సంక్రుద్ధో విదేహేషు మహాయశాః।
దేవరాతస్య రాజర్షే ర్దదౌ హస్తే ససాయకమ్॥ {1.75.20}

❈ "ఓ రఘురామా! శివధనుస్సు ఆ విధంగా జడముగా మారగా శివుడు జడీభూతుడైనాడు. అప్పుడు దేవతలు ఋషులు హరిహరులను శాంతింపజేసినారు. రెండు చాపములలో విష్ణుచాపమే మహత్తరమైనదని దేవతలు విష్ణువును మెచ్చుకొంటూ కొనియాడుచుండగా ముక్కంటి కోపమును పొంది తన ధనుస్సును బాణములను విదేహరాజులలో ఒకడైన దేవరాతుడు అను రాజునకు ఇచ్చినాడు. ఆ నాటినుండి మిథిలానగర ప్రభువులగు జనకులు ఆ శివధనుస్సును పూజించుచున్నారు" అని పరశురాముడు దశరథరామునికి రెండు ధనుస్సుల గుఱించి విశదీకరించసాగినాడు.

చం. అజగవ మట్లు ఘ్రాన్పడగఁ ద్ర్యంబకుడున్ జడుడయ్యె, నంతటన్
స్వజనులఁ గూడి నిర్జరులు శాంతులఁ జేసిరి విష్ణురుద్రులన్,
నిజముగ విష్ణుచాపమె గణింప మహత్తరమంచు దేవతల్
భజనల విష్ణు మెచ్చుకొన, వర్ధిలెఁ గోపము రుద్రుమోమునన్. 697

తే.గీ. త్ర్యంబకుడు క్రోధమూర్తియై తన ధనువును
దివ్యబాణయుతమ్ముగ దేవరాతు
డను విదేహరాజున కిచ్చె నంత దానిఁ
గొలువసాగెను మిథిలేశకులజనమ్ము. 698

ఇదం చ వైష్ణవం రామ ధనుః పరపురంజయమ్।
ఋచీకే భార్గవే ప్రాదా ద్విష్ణుః స న్యాస ముత్తమమ్॥ {1.75.21}
ఋచీక స్తు మహాతేజాః పుత్రస్యాఽప్రతికర్మణః।
పితు ర్మమ దదౌ దివ్యం జమదగ్నే ర్మహాత్మనః॥ {1.75.22}
న్యస్తశస్త్రే పితరి మే తపోబలసమన్వితే।
అర్జునో విదధే మృత్యుం ప్రాకృతాం బుద్ధి మాస్థితః॥ {1.75.23}
వధ మప్రతిరూపం తు పితుః శ్రుత్వా సుదారుణమ్।

క్షత్ర ముత్సాదయన్ రోషా జ్జాతం జాత మనేకశః॥ {1.75.24}
పృథివీం చాఖిలాం ప్రాప్య కాశ్యపాయ మహాత్మనే। {1.75.25}

❊ ఓ రఘురామా! ఈ విష్ణుచాపము శత్రువులను అవలీలగా జయించగలిగిన గొప్ప ఆయుధము. విష్ణుభగవానుడు దీనిని భృగువంశమునకు చెందిన ఋచీకునికి ఇచ్చినాడు. అమోఘమైన ఈ విష్ణుచాపమును ఋచీకుడు తన కుమారుడగు జమదగ్నికి ఇచ్చినాడు. నా తండ్రియగు జమదగ్ని నన్ను యోగ్యునిగా భావించి దీనిని నాకు ఇచ్చినాడు. ఆయుధములను పరిత్యజించి ఉన్న నా తండ్రిని పామరబుద్ధి కలవాడైన కార్తవీర్యార్జునుడు వధించి పాపాత్ముడైనాడు. ఒక క్షత్రియుడు నిరాయుధుడైన నా తండ్రిని సంహరించినాడన్న కోపంతో కసితో నేను రాజుల సమూహములను వధించినాను. అప్పుడు గెలుచుకొన్న భూమిని భూసురోత్తముడైన కాశ్యపునికి దానముగా ఇచ్చినాను అని పరశురాముడు దశరథరామునికి విష్ణుచాపవృత్తాంతమును గుఱించి, తన జైత్రయాత్రను గుఱించి విశదీకరించసాగినాడు.

సీ. అరుల జయించెడు నాయుధశ్రేష్ఠమ్ము
విష్ణుచాప మ్మిది వీర! రామ!
వైకుంఠు డొసగె ఋచీకునకున్ భార్గ
వునికి నీ చాపమున్ ఘన మటంచు
నా ఋచీకు డొసంగె నాత్మజుండౌ జమ
దగ్నికి యోగ్యుడన్ దలపుతోడ
నా తండ్రి జమదగ్ని న్యస్తశస్త్రుండుగా
నగుపింపఁ గార్తవీర్యార్జునుండు
తే.గీ. పామరుండయి వధియించి పాపియయ్యెఁ,
జంపె నొక క్షత్రియుండు మజ్జనకు ననుచుఁ
గోపమునఁ జంపితిని రాజకోటి నెల్ల
భూమి నొసగితిన్ గాశ్యపభూసురునకు. 699


యజ్ఞస్యాఽన్తే తదా రామ దక్షిణాం పుణ్యకర్మణే॥ {1.75.25}
దత్త్వా మహేంద్రనిలయ స్తపోబలసమన్వితః।
శ్రుతవాన్ ధనుషో భేదం తతోఽహం ద్రుత మాగతః॥ {1.75.26}
తదిదం వైష్ణవం రామ పితృపైతామహం మహత్।
క్షత్రధర్మం పురస్కృత్య గృహ్ణీష్వ ధను రుత్తమమ్॥ {1.75.27}
యోజయస్వ ధనుఃశ్రేష్ఠే శరం పరపురంజయమ్।
యది శక్నోషి కాకుత్స్థ ద్వంద్వం దాస్యామి తే తతః॥ {1.7528}

❋ "ఓ ఇనకులరామా! నేను ఒక గొప్ప యజ్ఞమును చేసి, భూదానములను చేసి, భూరి దక్షిణలను సమర్పించినాను. ఆ తరువాత మహేంద్రగిరికి వెళ్లి తపస్సును చేసినాను. నీవు నీ శౌర్యముచే శివధనుస్సును విఱిచినావని విని నీ గొప్పదనమును చూడదలచి ఇచ్చటకు వచ్చినాను. ఇదిగో. ఇదియే వైష్ణవచాపము. ఇది వంశపరంపరగా నాకు సంక్రమించిన ధనుస్సు. క్షత్రియధర్మమును అనుసరించి ఈ విష్ణుచాపమును చేపట్టుము. ఇది అన్ని చాపములలో ఉత్తమమైన చాపము. ఈ వింటియొక్క నారిని సవరించుము. శరసంధానం చేయుము. నీవు అలా చేయగలిగితే నేను నీతో ద్వంద్వయుద్ధం చేయుటకు సిద్ధమయ్యెదను" అని భార్గవరాముడు దశరథరామునితో పలికినాడు.

మ. స్తవనీయంబగు యజ్ఞమున్ నెరపి, భూదానమ్ములన్ జేసి ప్రా
భవ మొప్పారగ దక్షిణాదులిడి, దివ్యంబౌ మహేంద్రాద్రిలో
నవలీలన్ దపమాచరించితిని; భవ్యంబైన శౌర్యమ్ముచే
శివచాపమ్మును ద్రుంచుటన్ వినుచు, నీ చేతల్ గనన్ వచ్చితిన్. 700

తే.గీ. ఇదియె వైష్ణవచాప మో యినకులేశ!
యెన్న వంశపరంపరన్ నన్నుఁ జేరె,
క్షత్రధర్మానుసారమ్ము గైకొను, మిది
యుర్విఁ గల చాపములలోన నుత్తమంబు. 701

తే.గీ. గుణము సవరించుమయ్య! కాకుత్స్థవర్య!
శరము సంధించు మో రామ! శౌర్యధుర్య!
సిద్ధ మయ్యెద నే ద్వంద్వయుద్ధమునకు
ననియె భార్గవరాముండు ఘనబలుండు. 702



76. శ్రీరాముడు వైష్ణవధనుస్సును ఎక్కుపెట్టుట రామబాణప్రయోగంతో పరశురాముని పుణ్యలోకములు నశించుట

శ్రుత్వా చ జామదగ్న్యస్య వాక్యం దాశరథి స్తదా।
గౌరవా ద్యంత్రితకథః పితూ రామ మథాబ్రవీత్॥ {1.76.1}
శ్రుతవా నస్మి యత్కర్మ కృతవా నసి భార్గవ।
అనురుంధ్యామహే బ్రహ్మన్ పితు రాన్నృణ్య మాస్థితః॥ {1.76.2}

❈ జమదగ్ని కుమారుడైన పరశురాముడు ఆ విధంగా మాట్లాడగా, పూర్తిగా వినిన దశరథరాముడు తన తండ్రి తన పక్కనే ఉన్న విషయాన్ని గుర్తుకు తెచ్చుకొని పరిమితంగా మాట్లాడటం భావ్యమని అనుకొంటూ, జామదగ్న్యునితో ఇలా మాట్లాడసాగినాడు. "ఓ భార్గవరామా! నీవు నీ తండ్రియైన జమదగ్ని మహర్షిని తలచుకొంటూ, తండ్రిని ఒక రాజు వధించినందువలన, క్షత్రియశత్రుశేషం ఉండరాదని భావించి కోపంతో నాలుగు దిక్కులలో ఉన్న రాజులను సంహరించి పితృఋణమును తీర్చుకొన్నావు. అందులకు నిన్ను నేను అభినందిస్తూ ఉన్నాను."

తే.గీ. జామదగ్న్యుని వాక్కుల సాంతము విని
దాశరథి జనకుని సన్నిధాన మగుటఁ
బరిమితమ్ముగ భాషింప భావ్యమనుచుఁ
బరశురామునిఁ గనుగొని పలికె నిటుల. 703

చం. తలచుచుఁ దండ్రియైన జమదగ్ని మహర్షిని, శత్రుశేష మీ
యిల నిక నుండరాదనుచు హెచ్చిన క్రోధముతోడ రాజులన్
నలుదెసఁ జంపితే పితృఋణమ్మును దీర్చుకొనంగఁ, ద్వత్కృతిన్
దెలిసి తలంచి నిన్నభినుతింతును భార్గవరామ! నెమ్మదిన్. 704

వీర్యహీన మివాశక్తం క్షత్రధర్మేణ భార్గవ।
అవజానాసి మే తేజః పశ్య మేఽద్య పరాక్రమమ్॥ {1.76.3}

ఇత్యుక్త్వా రాఘవః క్రుద్ధో భార్గవస్య శరాసనమ్।
శరం చ ప్రతిజగ్రాహ హస్తా ల్లఘుపరాక్రమః॥ {1.76.4}
ఆరోప్య సధనూ రామ శ్శరం సజ్యం చకార హ।
జామదగ్న్యం తతో రామం రామః క్రుద్ధోఽబ్రవీ ద్వచః॥
బ్రాహ్మణోఽసీతి పూజ్యో మే విశ్వామిత్రకృతేన చ।
తస్మా చ్ఛక్తో న తే రామ మోక్తుం ప్రాణహరం శరమ్॥ {1.76.6}

❊ "ఓ భార్గవరామా! ఈ విష్ణుచాపమును నేను ఎక్కుపెట్టలేనని భావిస్తూ నీవు నన్ను శక్తిహీనునిగా మాట్లాడటం తగదు. నా కీర్తిప్రతిష్ఠలను నీవు గ్రహింపలేకున్నావు. ఇదిగో నా తేజస్సును, నా పరాక్రమమును చూడుము. ఈ విష్ణుచాపమును ఇప్పుడే ఎక్కుపెట్టెదను" అని అంటూ కోపంతో దశరథరాముడు భార్గవరాముని చేతిలో ఉన్న దివ్యమైన విష్ణుచాపమును, బాణమును స్వీకరించి అవలీలగా శరసంధానం చేసినాడు. బాణమును పరశురాముని వైపు గురిపెట్టినవాడైనప్పటికినీ ఆ భార్గవరాముడు తన గురువైన విశ్వామిత్రునికి ఆత్మీయుడనియు బ్రాహ్మణుడనియు తలచి అతనిని కాపాడదలచినాడు.

చం. విమలుడ! భార్గవాఖ్య! నను వీర్యవిహీనుడ వీవటంచు న
క్రమముగఁ బల్కగాఁ దగునె? రాజిలు నాదగు కీర్తులన్ విశే
షములఁ గ్రహింపకుంటి, విదె చక్కగఁ జూడుము నేడు నా పరా
క్రమమును, దేజమున్ బరశురామ! యనెన్ బరుషోక్తులన్ గ్రుధన్. 705

మ. అని యా భార్గవ రామహస్తగతదివ్యద్విష్ణుచాపమ్ము వే
గొనియెన్ బాణము తోడ రాఘవుడు సంక్రుద్ధాత్ముడై ధర్మభా
జనుడై యెక్కిడినాడు దివ్యశరమున్ సంధించినా, డా మునీ
శుని గాధేయున కాప్తుడంచు ద్విజుడంచున్ బ్రోవ నెంచెన్ మదిన్. 706

ఇమాం పాదగతిం రామ తపో బల సమార్జితాన్।
లోకా నప్రతిమాన్ వా తే హనిష్యామి యదిచ్ఛసి॥ {1.76.7}

న హ్యాయం వైష్ణవో దివ్య శ్శరః పరపురంజయః।
మోఘః పతతి వీర్యేణ బలదర్పవినాశనః॥ {1.76.8}
వరాయుధధరం రామం ద్రష్టుం సర్షిగణా స్సురాః।
పితామహం పురస్కృత్య సమేతా స్తత్ర సంఘశః॥ {1.76.9}
గంధర్వాప్సరస శ్చైవ సిద్ధచారణకిన్నరాః।
యక్షరాక్షసనాగాశ్చ తద్ద్రష్టుం మహ దద్భుతమ్॥ {1.76.10}

❃ "ఓ పరశురామా! నీవు బ్రాహ్మణోత్తముడవని, పూజ్యుడవని, నా గురువైన విశ్వామిత్రునికి బంధువు అని భావిస్తూ ఈ శరమును నీపై ప్రయోగింపజాలకున్నాను. దీనిని నీ పాదములపై ప్రయోగింపమందువా? లేక నీవు తపస్సు చేసి సమకూర్చుకొన్న పుణ్యలోకములపై ప్రయోగించమందువా? ఈ రెంటిలో దేనిపై ప్రయోగించమందువో నీవే తెలుపుము. విష్ణుతేజస్సుతో కూడిన ఈ బాణము దివ్యమైనది. శత్రువులను అవలీలగా కూల్చగలిగినట్టిది. అలఘుబలముతో కూడినది. అమోఘమైనది. శ్రేష్ఠమైనది. ఈ బాణప్రయోగము ఎన్నడునూ నిష్ఫలము కాకూడదు" అని దశరథరాముడు పలుకుచుండగా ధనుర్ధారియగు రఘురాముని దర్శించుటకు బ్రహ్మ మొదలైన దేవతలు, రాక్షసులు, కిన్నరులు, సిద్ధులు చారణులు మొదలైనవారు అచ్చటకు చేరుకొనిరి.

చం. అరయగ బ్రాహ్మణోత్తముడ వైతివి, పూజ్యుడ వెన్న, నీవు నా
గురువగు గాధినందనుని కూరిమి బంధుడవైతి, కాన యీ
శరమును నీపయిన్ విడువఁ జాలఁ, బదమ్ములఁ గూల్పమందువా?
యరుదగు నీ తపోబలసమార్జితసీమలఁ గూల్పమందువా? 707

చం. తెలుపుము నీవు, కేశవుని దివ్యశరమ్మిది శత్రుభంజన
మ్మలఘుతర మ్మమోఘము వరాస్త్రము నిష్ఫలమౌనె? యంచుఁ దా
బలుకుచునుండ, నాయుధముఁ బట్టిన రామునిఁ జూడ వచ్చినా
రలు పరమేష్ఠిముఖ్యసురరాక్షసకిన్నరసిద్ధచారణుల్. 708

జడీకృతే తదా లోకే రామే వరధనుర్ధరే।
నిర్వీర్యో జామదగ్న్యోఽసౌ రామో రామ ముదైక్షత॥ {1.76.11}
తేజోభిహతవీర్యత్వాత్ జామదగ్న్యో జడీకృతః।
రామం కమలపత్రాక్షం మందం మంద మువాచ హ॥ {1.76.12}
కాశ్యపాయ మయా దత్తా యదా పూర్వం వసుంధరా।
విషయే మే న వస్తవ్య మితి మాం కాశ్యపోఽబ్రవీత్॥ {1.76.13}
సోఽహం గురువచః కుర్వన్ పృథివ్యాం న వసే నిశామ్।
కృతా ప్రతిజ్ఞా కాకుత్స్థ కృతా భూః కాశ్యపస్య హి॥ {1.76.14}

❈ విష్ణుచాపమును ధరించిన రఘురాముడు నూతనమైన తేజస్సుతో విరాజిల్లుచుండగా లోకమంతా నిశ్చేతనంగా మారింది. భార్గవరాముని తేజస్సు కృశించింది. ఆ సమయంలో కీర్తి క్షీణింపగా పరశురాముడు జడీభూతుడైనాడు. అప్పుడు ఆ జామదగ్న్యుడు దశరథరాముని చూచి మెల్లగా ఇలా అన్నాడు. "ఓ రఘురామా! నేను పూర్వము క్షత్రియులకు శత్రువుగా ఉండి ఈ ధరిత్రిని గెలిచినాను. పూజ్యుడైన కాశ్యపుని సేవించి ఈ వసుంధరను ఆ మహాత్మునికి సమర్పించినాను. వారి ఆజ్ఞ ననుసరించి నేను రాత్రివేళ ఈ ధాత్రిపై నివసింపరాదు. అందువలన మహేంద్రగిరిలో వసించుటకు వెళ్లగోరుచున్నాను."

ఉ. నూతనతేజ మొప్పగ ధనుర్ధరుడై రఘురాముడుండ, ని
శ్చేతన మయ్యె లోకము, కృశించెను భార్గవతేజ మెల్ల, వి
ఖ్యాతి తొలంగగా జడత నందెను భార్గవరాము, డంత ని
ర్భీతి వచించె రాముఁగని ప్రీతిగ మెల్లగ భార్గవుండిటుల్. 709

ఉ. శ్రీ రఘురామ! గెల్చితి ధరిత్రిని పూర్వము క్షత్రియారినై,
కూరిమితోడఁ గాశ్యపుని గొల్చి యొసంగితి నీ వసుంధరన్,
వారల యాజ్ఞ రాతిరి నివాసము కూడదు ధాత్రిఁ, గాన నిం
పార మహేంద్రపర్వతము నందు వసింపగ నేగ గోరెదన్. 710

తదిమాం త్వం గతిం వీర హంతుం నార్హసి రాఘవ।
మనోజవం గమిష్యామి మహేంద్రం పర్వతోత్తమమ్॥ {1.76.15}
లోకా స్త్వప్రతిమా రామ నిర్జితా స్తపసా మయా।
జహి తాన్ శరముఖ్యేన మా భూత్ కాలస్య పర్యయః॥ {1.76.16}
అక్షయం మధుహంతారం జానామి త్వాం సురేశ్వరమ్।
ధనుషోఽస్య పరామర్శాత్ స్వస్తి తేఽస్తు పరంతప॥ {1.76.17}
ఏతే సురగణా స్సర్వే నిరీక్షంతే సమాగతాః। {1.76.18}

❋ "ఓ రఘురామా! నేను మహేంద్రగిరికి వెళ్లదలచినందున నీవు నా పాదగతిని ఖండింపవద్దు. తపస్సు చేసి సమకూర్చుకొన్న నా పుణ్యలోకములను నీ బాణప్రయోగంతో వెంటనే కూల్చివేయుటకు సంకల్పించుము. రామబాణము సర్వదా అమోఘముగా విరాజిల్లగలదు. నీవు అందఱికీ శుభమును కలిగించువాడివి. నీవే మధుసూదనుడవు అని నేను ఎఱుగుదును. విష్ణుచాపమును అవలీలగా ఎక్కుపెట్టగలిగిన నీవు విష్ణుమూర్తివిగా ప్రకాశించుచున్నావు. నీకు శుభము కలుగుగాక! నీ మహిమను సందర్శించుటకై దేవతలు మొదలైనవారు కూడా వచ్చియున్నారు" అని పరశురాముడు దశరథరాముని స్తుతించ సాగినాడు.

ఉ. కావున నాదు పాదగతి ఖండితమౌనటు చేయబోకు, మా
ర్తావన! మత్తపోబలసమార్జితలోకములెల్లఁ గూలగా
భావన సేయుమయ్య! వరబాణముతో రఘురామ! వైళమే,
యీవిధి రామబాణము రహించి యమోఘముగా విరాజిలున్. 711

చం. శుభకర! రామ! నిన్ను మధుసూదను డంచు నెఱింగినాడ, నీ
విభవము చూచినాడ, ఘనవిష్ణుధనుర్వర మెక్కిడంగ, శ్రీ
ప్రభుడగు విష్ణుమూర్తిగ విరాజిలుచుంటివిగా పరంతపా!
శుభమగుగాక! నీ మహిమఁ జూడగ వచ్చిరి దేవతాదులున్. 712

ఏతే సురగణా స్సర్వే నిరీక్షంతే సమాగతాః।
త్వా మప్రతికర్మాణ మప్రతిద్వంద్వ మాహవే॥ {1.76.18}
న చేయం మమ కాకుత్స్థ వ్రీడా భవితు మర్హతి।
త్వయా త్రైలోక్యనాథేన యదహం విముఖీకృతః॥ {1.76.19}
శర మప్రతిమం రామ మోక్తు మర్హసి సువ్రత।
శరమోక్షే గమిష్యామి మహేంద్రం పర్వతోత్తమమ్॥ {1.76.20}

❋ "ఓ రఘురామా! 'నీవు ఈ భూమిపై అప్రతిముడవు. అప్రతిద్వంద్వుడవు. వీరవరుడవు' అని దేవతలు నిన్ను దర్శించుకొని సన్నుతించుచున్నారు. అంతటి మహిమాన్వితుడవైన నీతో యుద్ధమున నేను అపజయమును పొందిననూ అది కీర్తికరమై, జయమును పొందిన సంతృప్తిని కలిగిస్తుంది. ఓ దాశరథీ! నీవు కరుణాపయోనిధివి. కకుత్స్థవంశాగ్రణివి. ధరణీనాథులలో అగ్రగణ్యుడవు. సుగుణాభిరాముడవు. త్రైలోక్యనాథుడవు. నీ చేతిలో ఓడిపోయినప్పటికినీ నేను సిగ్గుపడను. తపస్సు చేసి నేను సమకూర్చుకొన్న పుణ్యలోకములను కూల్చుటకు నీవు సంధించిన శరమును ప్రయోగింపుము" అని భార్గవరాముడు దశరథరామునితో పలుకసాగెను.

తే.గీ. అప్రతిముడవు రఘురామ! యవనియందు
నప్రతిద్వంద్వవీరుడ వనుచు సురలు
నిన్నుఁ గనుగొని నుతియించుచున్నవార
లట్టి నీచేత నపజయమైన జయమె. 713

మ. కరుణన్ బ్రోచు శుభంకరా! రఘువరా! కాకుత్స్థ వీరాగ్రణీ!
ధరణీనాథకులాగ్రణీ! నరమణీ! త్రైలోక్యనాథా! గుణా
కర! నే నోడిన సిగ్గునొందను సుమా! ఖండింపగా మత్తప
స్సరణిప్రాప్తసుపుణ్యసీమల, వరాస్త్రమ్మున్ బ్రయోగింపుమా! 714

తథా బ్రువతి రామే తు జామదగ్న్యే ప్రతాపవాన్।
రామో దాశరథిః శ్రీమాన్ చిక్షేప శర ముత్తమమ్॥ {1.76.21}

స హతాన్ దృశ్య రామేణ స్వాన్ లోకాం స్తపసార్జితాన్।
జామదగ్న్యో జగామాఽఽశు మహేంద్రం పర్వతోత్తమమ్॥ {1.76.22}
తతో వితిమిరా స్సర్వా దిశ శ్చోపదిశ స్తథా।
సురా స్సర్షిగణా రామం ప్రశశంసు రుదాయుధమ్॥ {1.76.23}
రామం దాశరథిం రామో జామదగ్న్యః ప్రశస్య చ।
తతః ప్రదక్షిణం కృత్వా జగా మాత్మగతిం ప్రభుః॥ {1.76.24}

❋ "ఓ రఘూత్తమా! నీవు నా పుణ్యలోకములపై శరప్రయోగమును చేయుము. నేను ఇప్పుడే మహేంద్రగిరికి బయలుదేరెదను" అని భార్గవరాముడు పలుకగా రఘురాముడు బాణప్రయోగం చేసినాడు. పరశురాముని పుణ్యలోకములు కుప్పగా కూలిపోగా తక్షణమే ఆ విప్రోత్తముడు తన పాదగతికి ఎటువంటి కష్టమూ కలుగలేదని సంతోషపడుతూ మహేంద్రగిరిని చేరుటకు వెళ్లినాడు. వెంటనే చీకట్లు తొలగిపోగా దిక్కులు ఉపదిక్కులు వెలుగులతో నిండినవి. ఆ శుభతరుణాన విష్ణుచాపధారియైన శ్రీరాముని స్తుతిస్తూ దేవతలు మునులు మొదలైనవారందఱూ భక్తితో నమస్కరించినారు.

ఉ. "ఇప్పుడె బాణమున్ విడువు మీవు రఘూత్తమ! యేగువాడ నే
నిప్పుడె తన్మహేంద్రగిరి నెంచుచు" నంచు వచింప భార్గవుం,
డప్పుడె బాణమున్ విడిచె నా రఘురాముడు, పుణ్యలోకముల్
గుప్పగఁ గూల నా ద్విజుడు కోరి మహేంద్రగిరిన్ గనన్ జనెన్. 715

ఉ. దక్కెను బాదయుగ్మమని ధన్యత భార్గవు డేగ వైళమే,
దిక్కులు వాటితోడ నుపదిక్కులు వెల్గెఁ దమస్సు వీడగన్,
జక్కగ రామమూర్తికిఁ బ్రశంస లొనర్చిరి దేవతల్ మునుల్,
మ్రొక్కిరి విష్ణుచాపధరమూర్తికి సద్గుణకీర్తి కెల్లరున్. 716

77. దశరథుడు నూతన వధూవరులతో పరివారంతో అయోధ్య చేరుట, శ్రీ సీతారాముల ప్రేమాతిశయ వర్ణన

గతే రామే ప్రశాంతాత్మా రామో దాశరథి ర్ధనుః।
వరుణాయాఽప్రమేయాయ దదౌ హస్తే ససాయకమ్॥ {1.77.1}
అభివాద్య తతో రామో వసిష్ఠప్రముఖా నృషీన్।
పితరం విహ్వలం దృష్ట్వా ప్రోవాచ రఘునందనః॥ {1.77.2}

❊ "రఘురాముని చూచి పరశురాముడు ధన్యత్వమును పొందినాడు. దశరథరాముడు గొప్ప తేజస్సు కలవాడు శూరవరుడు అని భావించిన భార్గవరాముడు భక్తిభావంతో అతనికి ప్రదక్షిణపూర్వక నమస్కారం చేసి మహేంద్రగిరివైపు వెళ్లినాడు" అని అచ్చట ఉన్నవారందఱూ భయమును వీడి శ్రీరాముని మహిమను మనసారా కొనియాడుతూ సంతోషపడినారు. గండ్రగొడ్డలిని చేతబట్టిన భార్గవరాముడు ఆ విధంగా వెళ్లిపోగా రఘురాముడు తన చేతిలో ఉన్న విష్ణుచాపమును బాణముతోపాటుగా వరుణదేవునికి అందజేసినాడు. ప్రశాంతచిత్తుడై గురువైన వసిష్ఠుని, ఋషులబృందమును చూచినాడు. ఏమి జరుగుతుందో అని భయపడుతూ ఉండిన తన తండ్రి దశరథుని చూచి అతనిని ఓదారుస్తూ ఇలా మాట్లాడసాగినాడు.

ఉ. "రామునిఁ జూచి యా పరశురాముడు ధన్యతనందినాడు, శో
భామహితుండు శూరుడని భక్తి ప్రదక్షిణ మాచరించి యు
ద్దామగతిన్ మహేంద్రగిరిధామదిశన్ చనినా" డటంచు శ్రీ
రామమహత్వమున్ బొగడి రంజిలి రెల్లరు ముక్తభీతులై. 717

చం. పరశువు చేతఁ బట్టుకొని భార్గవరాముడు వేగ నేగగా,
వరుణుని కిచ్చెఁ జాపమును బాణయుతమ్ముగ రాఘవుండు శ్రీ
కరుడు ప్రశాంతచిత్తమున గాంచె వసిష్ఠుని మౌనిరాజి; సిం
ధురగమనుండు తద్దశరథున్ గని సాంత్వనఁ గూర్ప నిట్లనెన్. 718

జామదగ్న్యో గతో రామః ప్రయాతు చతురంగిణీ।
అయోధ్యాభిముఖీ సేనా త్వయా నాథేన పాలితా॥ {1.77.3}
రామస్య వచనం శ్రుత్వా రాజా దశరథ స్సుతమ్।
బాహుభ్యాం సంపరిష్వజ్య మూర్ధ్ని చాఘ్రాయ రాఘవమ్॥ {1.77.4}
గతో రామ ఇతి శ్రుత్వా హృష్టః ప్రముదితో నృపః।
పున ర్జాతం తదా మేనే పుత్ర మాత్మాన మేవ చ॥ {1.77.5}
చోదయామాస తాం సేనాం జగామాऽऽశు తతః పురీమ్। {1.77.6}

❋ "తండ్రీ! పరశురాముడు మహేంద్రగిరి దిశగా వెళ్లిపోయినాడు. కావున భయపడవద్దు. ఆపద కాగలదేమో అనే సందేహమును వదలిపెట్టండి. సంతోషంగా నావైపు చూడండి. చతురంగ బలములతో మన అయోధ్య దిశగా కదలండి" అని శ్రీరాముడు పలుకగా ఆ దశరథ మహారాజు రాముని ప్రేమతో కౌగలించుకొని వాత్సల్యంతో అతని శిరస్సును మూర్కొనినాడు. "భార్గవరాముడు వెళ్లిపోయినాడు" అన్న మాటను విన్న కోసలేశుడు తనకు తన రామునికి పునర్జన్మ లభించినట్లుగా సంతోషపడ్డాడు. శరీరం పులకరింపగా ఆ పంక్తిరథుడు "ఇప్పుడు నాకు సంతోషంగా ఉన్నది. ఈరోజు సుదినము" అని అనుకొంటూ సైన్యముతోను, పరివారంతోను అయోధ్య చేరుటకు మరల తన ప్రయాణాన్ని ప్రారంభించినాడు.

మ. చనియెన్ భార్గవు డద్రిఁ జేర, జనకా! సంతాపమున్ వీడుమా.
కనుమా నా దెస మోదమొప్పఁ, జతురంగశ్రేణితో నీ వయో
ధ్యను జేరన్ జననౌను నిర్భయమునన్ దండ్రీ! యనన్ రాజు తాఁ
గనుచున్ రామునిఁ గౌగలించుకొని యాఘ్రాణించెఁ దచ్ఛీర్షమున్. 719

మ. "చనియెన్ భార్గవు డన్నమాట" వినుచున్ సంతోషమున్ బొందుచున్,
జనియింపన్ బులకాంకురమ్ములు, "పునర్జన్మంబు ప్రాప్తించె నా
కును నా రాముని" కంచుఁ, "సంతసము చేకూరెన్ సుపర్వమ్ము నే"
డని యయ్యాజి కడంగెఁ బ్రీతిగ నయోధ్యన్ జేర సైన్యమ్ముతో. 720

పతాకాధ్వజినీం రమ్యాం తూర్యోద్ఘుష్టనినాదితామ్॥ {1.77.6}
సిక్తరాజపథాం రమ్యాం ప్రకీర్ణకుసుమోత్కరామ్।
రాజప్రవేశసుముఖైః పౌరై ర్మంగళవాదిభిః॥ {1.77.7}
సంపూర్ణాం ప్రావిశ ద్రాజా జనౌఘై స్సమలంకృతామ్। {1.77.8}

❋ మిథిలనుండి బయలుదేరిన దశరథుడు సపరివారంగా అయోధ్యను సమీపించినాడు. ధ్వజములకు కట్టబడిన పతాకములతో, శ్రావ్యంగా వినిపించే మంగళ తూర్యనాదములతో, నీటితో తడుపబడి రమణీయంగా ఉన్న రాజమార్గములతో, అనేక వర్ణములను సుగంధమును గలిగిన పుష్పములచే అలంకరింపబడిన ప్రదేశములతో, ధన్యజీవితములను పొంది శుభకరమైన వాక్యములతో స్వాగతమును పలికెడి పౌరులతో విరాజిల్లుచున్న తన అయోధ్యానగరమును దశరథమహారాజు సపరివారముగా సంతోషంగా చేరుకొనినాడు.

సీ. శ్రీకరరమ్యపతాకాధ్వజమ్ముల
నలరెడిపురమయోధ్యాపురంబ
యూహింప శ్రావ్య తూర్యోద్ఘుష్టనాదాల
నలరెడి పురమయోధ్యాపురమ్ము
జలసిక్తపథముల లలితరూపమ్ముల
నలరెడి పురమయోధ్యాపురమ్ము
సత్కారయుక్తపుష్పోత్కర సీమల
నలరెడి పురమయోధ్యాపురమ్ము
తే.గీ. ధన్యజనపద మా యయోధ్యాపురమ్ము
తుష్టి నిడు పౌరమంగళోక్తులకు నిలయ
మట్టి తన నగరమ్ము నా యాజి చేరె
సంతసమ్మున వరవధూసహితు డగుచు. 721

పౌరైః ప్రత్యుద్గతో దూరం ద్విజైశ్చ పురవాసిభిః॥ {1.77.8}
పుత్త్రై రనుగతః శ్రీమాన్ శ్రీమద్భిశ్చ మహాయశాః।
ప్రవివేశ గృహం రాజా హిమవత్సదృశం పునః॥ {1.77.9}
ననంద సజనో రాజా గృహే కామ్యై స్సుపూజితః। {1.77.10}

❋ దశరథమహారాజు సంతోషంగా నగరానికి వస్తూ ఉన్నాడని తెలిసికొన్న పౌరులు బ్రాహ్మణులు హితులు రాజుగారు కొంత దూరంలో ఉండగానే ఎదురుగా వెళ్లి మహారాజా! స్వాగతం దయచేయండి అని పలుకుతూ ఉండగా పంక్తిరథుడు కుమారులతోనూ కోడళ్లతోనూ రాజగృహంలో ప్రవేశించినాడు. హిమవత్పర్వతంవలె విరాజిల్లుతున్న రాజగృహంలో కొడుకులతో కోడళ్లతో పరమానందంతో ఉన్నవాడై పండితుల పూజలను స్వీకరిస్తూ దశరథ మహారాజు గొప్ప వైభవంతో మహిమాన్వితుడై ప్రకాశించినాడు.

చం. ముదమున వచ్చె రాజనుచు, భూపుడు దూరమునందె యుండగా
నెదురుగ నేగి, పౌరులు మహీసురులున్ హితులెల్ల స్వాగత
మ్మిదె దయసేయుడంచు వచియింపగఁ, బంక్తిరథుండు ప్రీతితో
సదనములోని కేగెను బ్రశంసలఁ బుత్రవధూనిధానుడై. 722

మ. హిమవద్భూధర భాసమాన గృహమున్ హృష్టాత్ముడై చేరి, యా
జి మహోత్సాహముతోడ లోనికిఁ బ్రవేశించెన్ సుపుత్రుల్ వధూ
త్తమలున్ దోడుగ నుండఁ, బూజలను విద్వత్ప్రీతిఁ గైకొంచుఁ, జి
త్తమునన్ వేడుక పల్లవింపగ మహత్వమ్మొప్ప రాజిల్లుచున్. 723

కౌసల్యా చ సుమిత్రా చ కైకేయీ చ సుమధ్యమా॥ {1.77.10}
వధూప్రతిగ్రహే యుక్తా యాశ్చాఽన్యా రాజయోషితః।
తత స్సీతాం మహాభాగా మూర్మిళాం చ యశస్వినీమ్॥ {1.77.11}
కుశధ్వజసుతే చోభే జగృహుః నృపపత్నయః। {1.77.12}

❋ రమణీయమైన సౌందర్యంతో విరాజిల్లే క్రొత్తకోడండ్రను మహారాణులు కౌసల్య సుమిత్ర కైకేయి ప్రీతితో చూచినారు. మనోహరంగా మాట్లాడుతూ

మనసారా వారికి స్వాగతం పలికినారు. అంతఃపుర మంతా నూతన వధూరత్నాల నిలయంగా కనిపించింది. సౌభాగ్యవతులైన సీతను ఊర్మిళను మాండవిని శ్రుతకీర్తిని స్వాగతిస్తూ ముప్పురు రాణులు మనసు ఉప్పొంగగా వారికి మంగళకరమైన అనేక సేవలను అందజేసినారు.

మ. రమణీయాకృతులన్ విరాజిలు వధూరత్నమ్ములన్ గాంచుచున్,
గమనీయోక్తుల రాణులై మెలగు నా కౌసల్య, కైకేయి శ్రీ
రమణీయాంగన, యా సుమిత్ర మనసారన్ స్వాగతింపంగఁ జి
త్రముగా నంతిపురమ్ము నూతనవధూరూపమ్ముగాఁ దోచెడిన్. 724

తే.గీ. వరుస రాణులు సౌభాగ్యవతిని సీత
నూర్మిళను యశస్వినిని గుణోత్తమలగు
మాండవీశ్రుతకీర్తుల మంగళకర
రీతులన్ స్వాగతించిరి ప్రీతిఁ గనుచు. 725

మంగళాలాపనై శ్చైవ శోభితాః క్షౌమవాససః॥ {1.77.12}
దేవతాయతనా న్యాశు సర్వా స్తాః ప్రత్యపూజయన్।
అభివాద్యాఽభివాదాంశ్చ సర్వా రాజసుతా స్తదా॥ {1.77.13}
రేమిరే ముదితా స్సర్వా భర్తృభి స్సహితా రహః। {1.77.14}

❋ క్రొత్త కోడండ్రైన సీత ఊర్మిళ మాండవి శ్రుతకీర్తి పట్టువస్త్రాలను కట్టుకొని, పవిత్రమైన మంగళద్రవ్యములను చేతబట్టుకొని, పూజామందిరములో ప్రవేశించి గృహదేవతలను భక్తిప్రపత్తులతో పూజించినారు. పూజ్యులైన పెద్దలను సమీపించి, వారి పాదములను స్పృశించి, శ్రద్ధాసక్తులతో వందనములను సమర్పిస్తూ ఆ పెద్దల శుభాశీస్సులను అందుకొన్నారు. ఉత్తమ ఫలితములను ప్రసాదించగల శుభకరమైన కార్యములను నిత్యమూ ఆచరిస్తూ ఆ నలుగురు రాజపుత్రికలు తమ తమ భర్తలతో కలిసి సుఖసంతోషములతో కాలము గడుపసాగినారు.

తే.గీ. ధన్యతను గూర్చు పట్టువస్త్రాలఁ గట్టి
పూతమంగళద్రవ్యాలఁ జేతఁ బట్టి
రా వధూమణుల్ దేవతాయతనమందు
మించి గృహదేవతలను బూజించి రపుడు. 726

చం. తలచుచు వందనీయులను, దత్పదమంటుచు భక్తిభావనన్,
బలుకుచు వందనమ్ముల, శుభమ్మను దీవెనలందినారు; స
త్ఫలముల నంద నిత్యము శుభప్రియ కార్యము లాచరించుచున్
నలుగురు రాజపుత్రికలు నాథులఁ గూడిరి ప్రీతచిత్తలై. 727

కుమారాశ్చ మహాత్మానో వీర్యేణాఽప్రతిమా భువి॥ {1.77.14}
కృతదారాః కృతాస్త్రాశ్చ సధనా స్ససుహృజ్జనాః।
శుశ్రూషమాణాః పితరం వర్తయంతి నరర్షభాః॥ {1.77.15}

❋ రాముడు లక్ష్మణుడు భరతుడు శత్రుఘ్నుడు నలుగురూ పెద్దలయొక్క శుభాశీస్సుల నందుకొన్నవారై తమ తమ పత్నులతో కలిసి సుఖసంతోషాలతో కాలక్షేపం చేయసాగినారు. మహితాత్ములు అఖండబలోన్నతులు అసమాన వీర్యసంపన్నులు అస్త్రవేత్తలు గుణవిరాజితులు అగు ఆ నలుగురు రాజపుత్రులు హితులతో మిత్రులతో కూడినవారై ఆనందంగా మెలగసాగినారు. తమ తమ భార్యలను ప్రేమతో చూచుకొంటూ సంతోషంగా ఉంటూ ధర్మబద్ధమైన కోరికలతో కూడినవారుగా ప్రవర్తిస్తూ, నూతనమైన వినోదములతో విహారములతో కాలక్షేపం చేస్తూ, గురువుల యెడల వినయవిధేయతలతో కూడినవారై మాతాపితరుల సేవ చేస్తూ శుభప్రదమైన జీవితమును గడుపసాగినారు.

చం. నలుగురు రాజపుత్రులును నవ్యశుభోక్తుల నంది, పత్నులన్
గలసి సుఖింపసాగిరి, యఖండరమోన్నతులై మహాత్ములై
విలసిత వీర్యవంతులయి విశ్వమునందున సాటిలేనివా
రలయి కృతాస్త్రులై గుణవిరాజితులై హితమిత్రయుక్తులై. 728

చం. సతులను బ్రేమతోఁ గనుచు, సంతస మందుచు, ధర్మకాంక్ష స
న్నుతిఁ గను రీతి వర్తిలుచు, నూత్నవినోదవిహారరూపస
త్కృతులను జేయ నెంచుచు విధేయులునౌచు మెలంగువారలై
పితరులసేవఁ జేయుదురు పృథ్వి శుభమ్ముల నంద నల్వురున్. 729

కస్యచి త్వథ కాలస్య రాజా దశరథ స్సుతమ్।
భరతం కైకయీపుత్ర మబ్రవీ ద్రఘునందనః॥ {1.77.16}
అయం కేకయరాజస్య పుత్రో వసతి పుత్రక।
త్వాం నేతు మాగతో వీర యుధాజి న్మాతుల స్తవ॥ {1.77.17}
శ్రుత్వా దశరథ స్యైత ద్భరతః కైకయీసుతః।
గమనాయాఽభిచక్రామ శత్రుఘ్నసహిత స్తదా॥ {1.77.18}
ఆపృచ్ఛ్య పితరం శూరో రామం చాక్లిష్టకారిణమ్।
మాతౄశ్చాపి నరశ్రేష్ఠః శత్రుఘ్నసహితో యయౌ॥ {1.77.19}

❋ రామలక్ష్మణభరతశత్రుఘ్నులు క్రమంగా సీత ఊర్మిళ మాండవి శ్రుతకీర్తిలతో కలిసి దాంపత్యజీవితాన్ని గడుపుతూ ఉండినారు. కొంతకాలం తరువాత దశరథమహారాజు భరతుని పిలిచి "నాయనా! నీ మేనమామ యుధాజిత్తు నిన్ను కేకయదేశమునకు తీసికొని వెళ్ళుటకు చాలారోజులక్రితమే వచ్చియున్నాడు. కావున నీవు నీ మేనమామతో బయలుదేరవలయును" అని పలికినాడు. భరతుడు "అలాగే తండ్రిగారూ!" అని అంటూ శత్రుఘ్నునితో కూడినవాడై సంతోషంగా తల్లితండ్రులకు, శ్రీరామునికి మ్రొక్కి, వీడ్కోలు పలికి, యుధాజిత్తు వెంట కేకయదేశమునకు బయలుదేరినాడు.

చం. సరగునఁ గాల మేగగఁ బ్రసన్నమనంబున నాజి పల్కె నా
భరతునిఁ జూచి "పుత్రవర! వచ్చెను బూర్వమె మేనమామ సం
బరమున నిన్నుఁ గైకొని శుభమ్మని కేకయదేశమేగ, స
త్వరము చనందగున్ గద యుధాజిదభీష్టము సిద్ధిఁ బొందగన్". 730

మ. అనుచున్ బంక్తిరథుండు పల్క, భరతుం "డట్లే" యటంచున్, వెసన్
జనగా నెంచెను మేనమామ పిలువన్ సంతుష్టుడై; తండ్రికిన్,
ఘనుడౌ రాముని, కెల్లఁ దల్లులకు వీకన్ మ్రొక్కి వీడ్కోలులన్
జనియెన్ గేకయదేశగామి యగుచున్ శత్రుఘ్నయుక్తుండునై. 731

గతే తు భరతే రామో లక్ష్మణశ్చ మహాబలః।
పితరం దేవసంకాశం పూజయామాసతు స్తదా॥ {1.77.20}
పితు రాజ్ఞాం పురస్కృత్య పౌరకార్యాణి సర్వశః।
చకార రామో ధర్మాత్మా ప్రియాణి చ హితాని చ॥ {1.77.21}
మాతృభ్యో మాతృకార్యాణి కృత్వా పరమయంత్రితః।
గురూణాం గురుకార్యాణి కాలే కాలేఽన్వవైక్షత॥ {1.77.22}

❊ భరతశత్రుఘ్నులు యుధాజిత్తు వెంట కేకయదేశమునకు వెళ్లిపోగా దేవతలతో సమానమైన తేజస్సు గలవాడైన తమ తండ్రి దశరథమహారాజును మహాత్ములైన రామలక్ష్మణులు భక్తితో సేవింపసాగినారు. సౌజన్యమనస్కుడు పౌరుల హితమును కోరువాడు అగు శ్రీరాముడు తండ్రిగారికి రాచకార్యములలో తనవంతు సహకారమును అందజేసేవాడు. ఆ రఘురాముడు ఎల్లప్పుడూ ధర్మమార్గమును అనుసరిస్తూ, ప్రజలకు ప్రియమైన హితకరమైన పనులను చేస్తూ, తండ్రి ఆజ్ఞను పాటిస్తూ, తల్లులకు తగినటువంటి సేవచేస్తూ, గురువర్యుల యొక్క పనులను కూడా ఇష్టంగా పూర్తిచేసేవాడు.

మ. చనగా వారలు, రామలక్ష్మణులు భాస్వద్దేవసంకాశుఁ దం
డ్రిని సేవించుచు నుండినారు మది సంప్రీతిన్ బుధోత్తంసులై;
ఘనుడౌ రాముడు పౌరకార్యముల వేడ్కన్ జేయుచున్ దండ్రి యా
జ్ఞను బాలించుచు నుండెఁ బౌరహితుడై సౌజన్యశీలుండునై. 732

చం. అనిశము ధర్మ మెంచుచుఁ, బ్రజావళికిన్ బ్రియమాచరించుచున్,
జనకుని యాజ్ఞఁ జేయుచుఁ, బ్రశస్తముగాఁ దన తల్లు లందఱిన్

మనమున నెంచి సేవల సమంచితరీతులఁ గొల్చువాడునై,
ఘన గురువర్య కార్యములఁ గాంక్ష నొనర్చెడి రాము డాదటన్. 733

ఏవం దశరథః ప్రీతో బ్రాహ్మణా నైగమా స్తథా।
రామస్య శీలవృత్తేన సర్వే విషయవాసినః॥ {1.77.23}
తేషా మతియశా లోకే రామ స్సత్యపరాక్రమః।
స్వయంభూ రివ భూతానాం బభూవ గుణవత్తరః॥ {1.77.24}
రామస్తు సీతయా సార్ధం విజహార బహూ నృతూన్।
మనస్వీ తద్గత స్తస్యా నిత్యం హృది సమర్పితః॥ {1.77.25}

❃ రాముడు సుగుణాభిరాముడు అని గుర్తించినవారైన తండ్రి దశరథమహారాజు, తల్లులు కౌసల్య సుమిత్ర కైకేయి, గురువులు వసిష్ఠుడు మొదలైనవారు అయోధ్యలోని పౌరులు అందఱునూ "ఈ రాముడు అందఱినీ అనురాగంతో చూచే బ్రహ్మదేవుని వంటి వాడు. అందఱికీ ఆత్మీయుడు" అని రఘురాముని మెచ్చుకొనసాగినారు. శ్రీరాముడు తన భార్య సుగుణాలరాశి, సౌందర్యరాశి, పవిత్రచరిత్ర అని గుర్తించి ఆ సీతాదేవితో ఎన్నో వసంతాలు సంతోషంగా గడిపినాడు. మైథిలి తనకు అన్ని విధాలా తగినటువంటి ఇల్లాలు, యోగ్యురాలు అని తెలిసికొని రాముడు ఆ సీతాదేవికి తన మనస్సును సమర్పించినాడు.

తే.గీ. అవనిఁ దల్లులు తండ్రి మహాత్ములైన
గురులు పౌరులు రాముని గుణముల గని
బ్రహ్మ వలెఁ జూచు నెల్లఱ రక్తి ననుచు
నందఱును మెచ్చి రా రాము నాప్తు డనుచు. 734

ఉ. అన్నులమిన్న సాధ్వి మహితాత్మ గుణోన్నత పూత యంచుఁ దా
నెన్నుచు సీతతో ఋతువు లెన్నిటినో గడి పెన్ రఘూద్వహుం,
డన్ని విధమ్ములన్ దగినదంచును, బ్రేమఁ గనంగ యోగ్యయౌ
నన్న తలంపుతో, హృది సమర్పణఁ జేసె మనస్వి సీతకై. 735

ప్రియా తు సీతా రామస్య దారాః పితృకృతా ఇతి।
గుణా ద్రూపగుణా చ్చాపి ప్రీతి ర్భూయోఽభ్యవర్ధత॥ {1.77.26}
తస్యాశ్చ భర్తా ద్విగుణం హృదయే పరివర్తతే।
అంతర్గాత మపి వ్యక్తం మాఖ్యాతి హృదయం హృదా॥ {1.77.27}

❋ తండ్రియైన దశరథమహారాజు గుణవంతురాలైన సీతను నా ధర్మపత్నిగా ఆమోదించి వివాహము జరిపించినాడు అని శ్రీరాముడు మైథిలిని ప్రీతితో చూడసాగినాడు. ఉత్తమ గుణరూపసంపదలనే సొమ్ములుగా గలిగియున్న కారణంగా శ్రీరామునికి వైదేహిపై ప్రీతి ఇంకా ఎక్కువ కాసాగినది. నిర్మలచిత్తయైన సీత నాథుడు తనపై చూపే ప్రేమకు రెండురెట్లుగా ప్రేమను పంచుతూ శ్రీరామునియెడల ప్రీతితో మెలగసాగినది. భర్తయైన శ్రీరాముని హృదయంలో తాను కొలువు తీరినది. పతివ్రతా గుణములతో ఉన్న సీత హృదయము శ్రీరాముని హృదయము ఏకమైపోగా ఆ దంపతులు సుఖసంతోషములతో కాలక్షేపము చేయసాగిరి.

ఉ. సమ్మతితోడ తండ్రి విలసద్గుణరాశినిఁ గూర్చెఁ బత్నిగా
నెమ్మదినంచు సీతను గణించుచుఁ బ్రేముడిఁ జూడసాగె రా
గమ్మున రామమూర్తి, వరకమ్రగుణమ్ములు రూపసంపదల్
సొమ్ములుగా వెలుంగు సతిఁ జూడగ రాముని ప్రీతి వర్ధిలెన్. 736

ఉ. నిర్మలచిత్త సీత ద్విగుణీకృత రాగసమర్పణాదులన్
ధర్మపథానువర్తియగు నాథుని నిర్మల చిత్తసీమలో
నర్మిలి నుండె, నాథుహృదయమ్ము స్వచిత్తము నేకమయ్యెనా,
శర్మదయై మెలంగె ననిశమ్ముఁ బతివ్రతయై ప్రశస్తయై. 737

తస్య భూయో విశేషేణ మైథిలీ జనకాత్మజా।
దేవతాభి స్సమా రూపే సీతా శ్రీ రివ రూపిణీ॥ {1.77.28}

❋ పతివ్రతా శిరోమణియగు సీత తన భర్త యెడల ప్రణయము ప్రీతి భయము భక్తి సిగ్గు మొదలగు సుగుణములను కలిగి మెలగుతూ ఉండినది. సీతాదేవి

శ్రీరాముని మనసులోని భావములను పూర్ణముగా తెలిసికొని ప్రవర్తిస్తూ ఉండగా శ్రీరాముడు కూడా సీతాదేవి మనసులోని భావములను తెలిసికొని మెలగసాగినాడు. గుణమునందు రూపమునందు శీలమునందు వారు ఒకరికొకరు తగినవారై ఏకచిత్తులై వ్యవహరింపసాగినారు. సీతాదేవి దేవతలయొక్క తేజస్సుతో ప్రకాశిస్తూ, మనోజ్ఞమైన రూపం కలిగి లక్ష్మీకళతో ప్రకాశిస్తూ, సుగుణాల కుప్పగా భాసిల్లుతూ, మనోనాథుడైన శ్రీరామునియొక్క పదపద్మములను సేవిస్తూ, ప్రేమానురాగములను కురిపిస్తూ పరమానందదాయినియై నాథునితో కూడి విరాజిల్లసాగినది.

చం. ప్రణయము ప్రీతియున్ భయము భక్తియు సిగ్గుఁ దలిర్ప సీత రా
ముని మదిలోని భావములఁ బూర్ణముగా నెఱుగంగ, రాముడున్
గనుగొనసాగె సీతమదిఁ గల్గెడి భావములన్, బరస్పర
మ్మును గుణరూపశీలములఁ బూర్ణత నందిరి యిర్వురున్ దమిన్. 738

తే.గీ. దేవతలఁ బోలు దివ్యమౌ తేజ మొప్పఁ
గ్రమరూపమ్మునన్ లక్ష్మికళయు నొప్ప
రామపదములఁ బ్రేమానురాగ మొప్ప
నాథుఁ గూడె జానకి సుగుణాల కుప్ప. 739

తయా స రాజర్షిసుతోఽభిరామయా
సమేయివా నుత్తమరాజకన్యయా।
అతీవ రామ శ్శుశుభేఽతికామయా
విభు శ్శ్రియా విష్ణు రివామరేశ్వరః॥ {1.77.29}

❋ రాజర్షియగు జనకమహారాజుయొక్క కుమార్తె, శాంతస్వరూప, గొప్ప గుణములు కలది, విమలతత్వముగలది, వివేకముగలది, విశుద్ధమనస్క, భూపుత్రి అగు సీతాదేవితో కలిసి శ్రీరాముడు విభవాభిరాముడై సంతోషంగా కాలమును గడిపినాడు. లక్ష్మీదేవితో కలిసి విష్ణుమూర్తి ఆనందంగా కాలక్షేపం చేసినట్లుగా సీతాదేవితో కలిసి రఘురాముడు ఆనందంగా కాలక్షేపము చేయసాగినాడు.

ఉ. రాముడు సీత నా జనకరాజకుమారిని, శాంతరూప, ను
ద్దామ గుణోన్నతన్, విమలతత్త్వవివేకను, రాణ్మునీశజన్,
భూమిసుతన్, విశుద్ధను, విభూతిని గూడి చరించె, లక్ష్మితో
శ్రీమహితుండు విష్ణువు చరించినరీతి, ననన్యమైత్రిమై. 740

ఫలశ్రుతి

❋ క్షేమమును కలిగించే ఈ సీతారామకల్యాణము అనే పద్యకావ్యమును ఎవరు శ్రద్ధతో చదువుతారో, ఆసక్తితో వింటారో, భక్తితో చూస్తారో అట్టివారిని రామచంద్రస్వామి కృప ఒక కవచమై ఎల్లప్పుడూ రక్షిస్తూ ఉండగలదు.

కం. క్షేమము నిడు నీ సీతా
రాములకల్యాణగాథ రక్తిఁ జదివినన్,
బ్రేమగ వినినన్, గనినన్
రాముని కృప కవచమగుచు రక్షించు సదా. 741





రమణీయమ్మిది వేదసమ్మితము శ్రీరామాయణం బర్హమున్
విమలంబున్ ఘనపుణ్యదాయకము భావింపంగఁ బాపఘ్నమున్
సుమతిన్ దీనిఁ బఠించువాడు వసియించున్ బుత్రపౌత్రాది వ
ర్గముతో, ధాత్రి సుఖించుఁ, దా నమరలోకమ్ముందు నంత్యమ్మునన్.

ప్రశంసా పద్యములు

'శతావధాని' శ్రీ కొండపి మురళీకృష్ణ గారు, నెల్లూరు

సీ. పద్యమా ధారావిభాసిత సుకుమార
సుందర పదబంధ శోభితమ్ము,
వ్యాఖ్యానమా నవ్య భావనా పరిపూర్ణ
తాత్పర్య బోధా విధాన పథము,
గాత్రమా సుస్వర కమనీయ రాగవత్
శ్రావ్య మంజుల మనోరంజకమ్ము,
గాథయా లోకైక కల్యాణ కారక
జానకీరామ కల్యాణ గాథ,
తే.గీ. యెంత పుణ్యభాగ్యమ్మొ యింకెంత ప్రతిభ
రాజశేఖర! కవివరా! రమ్యఫణితి
నాథగాథ రచించి గానమ్ము చేసి
యందఁ జేయుచుంటివి రసానంద ఫలము.

ఉ. ప్రాకట దివ్యగాథ రఘురాముని పావన సచ్చరిత్ర వా
ల్మీకి వచించె, తత్పదవరేణ్యపథమ్మును వీడకుండ, శో
భాకర పద్యరీతి ననువాద మొనర్చుచునుంటివయ్య! య
స్తోక విశేష పుణ్యఫల శోభను పొందుచు రాజశేఖరా!

'శతావధాని' శ్రీ నారాయణం బాలసుబ్రహ్మణ్యం గారు, అద్దంకి

తే.గీ. కోట వంశాబ్ధి చంద్ర! సద్గుణ విశిష్ట!
రాజశేఖరా! హితవరా! రామ గాథ
వ్రాయ బూనినవారెల్ల వంద్యులయ్య!
ముక్తి సోపానమది మీకు మోకరింతు.

'అవధాని శేఖర' శ్రీ మైలవరపు మురళీకృష్ణ గారు, వేంకటగిరి

ఉ. సారవచోవిలాసగుణసాంద్రకవిత్వము రంగరించి, వి
స్తారముగా రచించితివి చక్కని కావ్యము బాలకాండమున్!
శ్రీరఘురామమూర్తి విరచించి శుభావళి ధన్యతన్ గొనన్
గూరిమి బ్రోచుగాత మిము కోట కులాగ్రణి! రాజశేఖరా!

'చిత్రకవితాసమ్రాట్' శ్రీ చింతా రామకృష్ణారావు గారు, హైదరాబాదు

కం. శ్రీరాముని కరుణను గని
యారాముని పెండ్లి కథ సమంచితరీతిన్
ధీమతి వ్రాసెడి మిమ్ముల
నా రాముడు కాచు సతము హాయి నొసఁగుచున్.

'సమస్యా పృచ్ఛక చక్రవర్తి' శ్రీ కంది శంకరయ్య గారు, వరంగల్

కం. శ్రీసీతా కల్యాణో
ద్భాస రసాంచిత మనోజ్ఞ భావావిష్కా
రాసమ కావ్యకరణ చి
చ్ఛ్రీసహితా! కోట రాజశేఖర! జయమౌ.

'పద్యభారతి' శ్రీ చదలవాడ లక్ష్మీనరసింహారావు గారు, ఒంగోలు

సీ. ఎవ్వారి కల్యాణ మీజాతి సంస్కృతీ
ప్రతిబింబశోభిత ప్రథితిఁ గాంచె!
ఏజంట పరిణయ మింటింటి వేడుకై
జాతిపర్వమ్ముగా ఖ్యాతికెక్కె!
ఏవధూవర వివాహేందురత్నాక్షతల్
విశ్వసుశ్రేయమై వినుతినొందె!
ఏ దివ్యవేదిక నెసగిన మంత్రముల్
శుభదాయకోద్వాహ సూక్తులయ్యె!
తే.గీ. అదియె జానకీరామ కల్యాణవాణి
పూజ్య వాల్మీకి ఋషివరప్రోక్తవాణి
రాజశేఖర సుకవీంద్రు రమ్యవాణి
పద్యభారతి మెచ్చిన భవ్యవాణి!

'పరమార్థకవి' శ్రీ వెలుదండ సత్యనారాయణ గారు, హైదరాబాద్

తే.గీ. సంప్రదాయంబు ప్రక్కకుఁ జనగనీక
శబ్ద సౌందర్య మిసుమంత జారనీక
కోట రాజశేఖరు పద్యకోటి యుందు
రామకల్యాణ కావ్య నిర్మాణమందు.

'ఆంధ్ర రామాయణ కర్త' శ్రీ బృందావన రావు గారు, నెల్లూరు

ఉ. శ్రీరఘురామమూర్తి విధుశేఖరు చాపము ద్రుంచి, మైథిలీ
నీరజనేత్రి బెండ్లియగు నిర్మలగాథను భవ్యకావ్య సం
భారముగా రచించి యొక పావన గాన సురూపకమ్ముగా
గూరిచి విందొసంగితివి కోటి నమస్సులు రాజశేఖరా!

'ఆంధ్ర రామాయణ కర్త' శ్రీ కంభమెట్టు గోపాలకృష్ణ గారు, *Hyd*.

తే.గీ. కోట రాజశేఖర వర్య! గురువరేణ్య!
రమ్య మధురస భరితమౌ రామకథను
నోట బలుకుచు వీణను మీటినటుల
కరము - గళములు కలిపిన ఘనులు మీరు.

'ఆంధ్ర రామాయణ కర్త' శ్రీ పోచిరాజు కామేశ్వరరావు గారు, రాయపూర్

కం. రామాంకిత పద్యమ్ములు
రామాంకిత కావ్యరచన రమ్యతమములౌ
రామాంకితహృదయా! శ్రీ
రామాయణకర్త! మీకు రక్షగ నమరున్.

'ఆంధ్ర రామాయణ కర్త' శ్రీ గోపాలుని మధుసూదనరావు గారు, *Hyd*.

కం. రామాయణ కావ్యంబున
శ్రీమహితము బాలకాండ శ్రేయమ్ము నిడున్,
రామావతారఘట్టము
రాముని కల్యాణము శుభరాసులఁ గూర్చున్.

శ్రీ రాయప్రోలు సీతారామ శర్మ గారు, భీమవరం

తే.గీ. కోటవారల కోటలో కోట్లజనము
ద్యుమణికులమణి గుణమణిద్యోతితుడగు
రామకల్యాణ వాద్యాల శ్రవణశోభ
లెప్పుడెపుడంచు నాసక్తి నెదురు చూచె.

'భక్తకవి' శ్రీ రామకృష్ణ పరమహంస గారు, బెంగుళూరు

తే.గీ. రామచరితము నెందరో రమ్యసరళి
వ్రాసినారలు సద్భక్తి వాసితముగ
వారి సరసన మీరును జేరినారు
బాలకాండము బంగారు బాట గాగ.

'గురుప్రపూర్ణ' డా. చీమకుర్తి వేంకటేశ్వర రావు గారు, నెల్లూరు

ఆ.వె. కోటవారి మాట నాటి రాముని బాట
పూట పూట చవుల మేటి యయ్యె
పుట్టఁ బుట్టినట్టి పూజ్యుని చిత్తంబు
గట్టుమీదఁ బెట్టి గుట్టు విప్పె.

శ్రీ మాగంటి శ్రీరామమూర్తి గారు, ఒంగోలు

ఉ. రాముని గొల్చినట్టి కవిరాజుల ముచ్చ్వర రామదాసువో?
రాముడు కోర భాగవతరాజముఁ జెప్పిన పోతరాజువో?
రాముని కీర్తనావళిని రక్తి రచించిన త్యాగరాజువో?
రామవివాహ కావ్యమును వ్రాసిన సత్కవి! రాజశేఖరా!

శ్రీ తంగిరాల వేంకట నరసింహ కుమార్ గారు, నెల్లూరు

ఉ. విందు పఠింపగా నుత కవీంద్రుడు భక్తుడు రాజశేఖరుం
డందము మీర వ్రాసిన మహత్తర రామ వివాహ సత్కథన్
సుందర గాయకాగ్రణులు స్తుత్యులు పాడగ నేడు కర్ణముల్
పొందె పసందు విందు బహు పుణ్యఫలంబిది పద్యభారతీ!

శ్రీ గంగాపురం యజ్ఞభగవాన్ గారు, హైదరాబాదు

కం. మూలము నందలి భావ
శ్రీలవి చెడకుండ రాజ శేఖరులు కళన్
మాలలుగానల్లిరి, పది
కాలమ్ములు నిలుచు రామగాథ తెలుఁగునన్.

శ్రీ పేరిశెట్ల శివకుమార్ గారు, నెల్లూరు

సీ. కవి రాజశేఖరు కమనీయ కావ్యమం
దేదువందల సంఖ్య నెలమి మించె!
అవధానవర్యుని యసమాన గ్రంథమ్ము
కల్యాణమంటప గడప జేరె!
ఆచార్య దేవుని యక్షరాక్షతలన్ని
శ్రీరాము గొలువంగ సిద్ధమయ్యె!
పండితాఖ్యుని దివ్య ప్రవచన ధారయు
భూమిజా పదమంటి పూతమయ్యె!
తే.గీ. తల్లిదండ్రుల నోములు పల్లవించి
పూర్వజన్మల పుణ్యంబు ప్రోగునొంది
ధర్మపత్ని సౌభాగ్యంబు ధన్యత గన
రామకల్యాణ కావ్యము రక్తి నమరె.

శ్రీ పేరి సూర్యనారాయణ (అప్పాజీ) గారు, కాకినాడ

శ్లో. రామాయణ కథాకావ్యం రాజశేఖర ధీకృతమ్ |
బహ్వాస్వాదన సుయోగ్యం పరం భాగ్యం వరం మమ ||

శ్రీ వడ్లమాను మురళీమోహన్ గారు, పుల్లలచెరువు

ఆ.వె. కలము చేత బట్టి కావ్యంబు రచియించి
పద్యమాలపించి హృద్యముగను
రామకథను దెల్పు రాజశేఖర వర్య!
ప్రణతి ప్రణతి మీకు ప్రణతి ప్రణతి!

శ్రీ శనగల చంద్రశేఖర్ గారు, పేరేచెర్ల, గుంటూరు

కం. శ్రీరామ కథామృతఝరి
కారణ జన్ములగు వారి కంఠమునందే
పారును గంగాజలముగ
చేరును రాముని గొలిచెడి జీవుల దరికిన్.

శ్రీ శ్రీపాద సుబ్రహ్మణ్యం గారు, హైదరాబాదు

తే.గీ. తెలుగు వాల్మీకి వచ్చెను తెలిసికొనుడు
రామకథను తెలుపగను రమ్యముగను
పూర్వజన్మ సుకర్మల పుణ్యమేమొ
రాజశేఖర కవి కృతి రక్తి నమరె.

శ్రీ యనమండ్రం అశ్వత్థ నారాయణ గారు, అనంతపురం

కం. శ్రీసీతారామ పదా
వాస సుఖము నాశ్రయించి భక్తిన్ వల్మీ
కాసుస్థిత మకరందము
దాసాళికి బంచితీవు ధన్యుడ వయ్యా!

డా. కావలిపాటి నరసరాజు గారు, హైదరాబాదు

తే.గీ. అక్షరాక్షరంబున తేనె లంటి యుండె
కారణంబేమొ తెలియగ కోరుచుంటి!
తపము జేసెనొ? వాగ్దేవి తనయు డితడొ?
తేనెలంటి టంకింపగ పూనునేమొ?

శ్రీ మునిమడుగు నాగరాజ శాస్త్రి గారు, హైదరాబాదు

ఆ.వె. గంగ పొంగె మౌని కరుణాంతరంగమై
రామగాథలోన రక్తి కట్టి,
గంగ పొంగె సుకవి కావ్యతరంగమై
మాదు భాగ్యమనగ మధువులొలికి.

శ్రీ వారణాసి కృష్ణమూర్తి గారు, హైదరాబాదు

ఆ.వె. రాజశేఖర కవిరాజశేఖర! రస
రమ్యవర్ణనలను రామగాథ
పద్య సప్తశతము పంచి మించిన మీకు
శిరము వంచి నుతులు కరమొనర్తు!

శ్రీ పుప్పాల జగన్మోహనరావు (ధరణి) గారు, జయపురం, ఒరిస్సా

కం. కమ్మని కావ్యపు గాథల
సొమ్మగు కలమున గళమున సొంపులమరగా
నిమ్ముల వీనుల నమృతము
జిమ్మగ విరియించు రాజశేఖర! ప్రణతుల్.

శ్రీ వడుగూరు వేంకట విజయ (వీత్రయ) శర్మ గారు, పార్వతీపురం

తే.గీ. రాజశేఖర విరచిత రామచరిత
కలము గళమున తనదైన కామితమిడి
ప్రభుత మెరయంగ ప్రజ్ఞతో పరిఢవిల్ల
మాటిమాటికి వినగ నా మనసు మురిసె.

'అవధాని' శ్రీ ధూపాటి రామాచార్య గారు, విజయవాడ

ఉ. రామకృపావరంబున సరాగము లాడుచు నాటపాటగా
రామకథామృతంబు మధురామృతధారను నింపి వ్రాయుచున్
ఆమని నింపుచుంటిరి విహాయసమంటగ సద్యశంబు, శ్రీ
రాముడు దీవెనంబులిడ రాజిలుమా కవి రాజశేఖరా!

శ్రీ గుండా వేంకట సుబ్బ సహదేవుడు గారు, కడప

కం. శ్రీరాముని దయచేతను
మీ రామాయణ మను కృతి మేదిని వెలయున్
పారాయణఁ జేయు జనుల
ప్రారబ్ధము తొలగి పుణ్యఫలములు గలుగున్.

శ్రీ పింగళి పూర్ణచంద్రరావు, ఒంగోలు

ఆ.వె. రాజశేఖరకవి! రామకల్యాణంబు
రామచంద్రు కృపను వ్రాసినావు.
పలికినావు భక్తిరాగసరాగాల
బాలకాండ నెల్ల, భద్ర మగుత.

శ్రీ అస్కని రాజు గారు, నాగర్ కర్నూలు

కం. అక్కడ మునిరాజు లిరువు
రిక్కడ కవిరాజశేఖరేంద్రవరులు మీ
రొక్కరె, వారి తలంపుల
మిక్కిలి రమ్యముగఁ జెప్పఁ మీకె సులభమౌ.
(మునిరాజులు - వాల్మీకిముని, నారదముని)

శ్రీ ఆచార్య లక్ష్మణ పెద్దింటి, యానాం

తే.గీ. ఏడువందల పద్యాల నింపుగాను
నక్షతారోపణకు నట్లు హర్షమిడగ
జానకి వివాహ ఘడియలు సంతసమిడ
రాజశేఖరకవి వ్రాసె రామగాథ.

శ్రీ వైద్యం ఆంజనేయులు. హైదరాబాద్

కం. నవ్యత సీతారాముల
కావ్యమ్మును వ్రాసి సతము గానముఁ జేయన్
శ్రావ్యము మీ కంఠధ్వని
భావ్యంబగు పాఠకులకు భద్రము కలుగున్.

శ్రీ అయ్యగారి కోదండరావు గారు, రాజమండ్రి


సీ. ప్రాజ్ఞునివర్యులౌ వాల్మీకి వ్యాసుల
భక్తిభావముతోడ ప్రస్తుతించి
రామాయణార్థమ్ము రమణీయచాతురి
ప్రకటింపగానెంచి ప్రస్ఫుటముగ
పద్యరత్నములందు బాలకాండమ్మును
రసరమ్య భావాల రంగరించి
తేటితేనియలొల్కు తేటతెన్గు నుడుల
అనువదించితివీవె యద్భుతముగ
తే.గీ. మహిత కోట వంశాన్వయ మాన్యతిలక!
రాజశేఖరనామాఖ్య ప్రాజ్ఞవినుత!
పద్యభారతీక్షేత్రాన వజ్రమీవు
అందుకొనుమయ్య మేమిడు వందనములు.

కవిపరిచయం

నామధేయము	: **కోట రాజశేఖర్**
జననం	: 03-11-1956
తల్లి	: శ్రీమతి కోట సక్కుబాయమ్మ
తండ్రి	: శ్రీ కోట సారంగపాణి
జన్మస్థలము	: అల్లూరు గ్రామం, నెల్లూరు జిల్లా
ప్రాథమిక విద్య	: సుబ్బయ్య బడి, అల్లూరు
ఉన్నత విద్య	: రామకృష్ణా హైయర్ సెకండరీ స్కూలు, అల్లూరు
సంస్కృతం ఎంట్రన్స్	: వేదసంస్కృత కళాశాల, నెల్లూరు
2ఏ విద్వాన్	: శ్రీ మలయాళ స్వామి ఓరియంటల్ కళాశాల, ప్రొద్దుటూరు
యం.ఏ (సంస్కృతము)	: ఆంధ్రా యూనివర్శిటీ, విశాఖపట్నం
వృత్తి	: (1979 - 1984) తెలుగు పండిట్, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు, నెల్లూరు : (1984 - 2014) సంస్కతోపన్యాసకులు, రామకృష్ణా జూనియర్ కళాశాల, అల్లూరు
సహధర్మచారిణి	: విద్వాన్ శ్రీమతి గిరిజాకుమారి
జ్యేష్ఠపుత్రుడు	: చి॥ రూపానంద కుమార్, USA కోడలు : శ్రీమతి ప్రియదర్శిని మనుమడు : చి॥ శివాంశ్
కనిష్ఠపుత్రుడు	: చి॥ సారంగపాణి, USA కోడలు : శ్రీమతి సౌమ్య మనుమరాలు : చి॥ దార్విశ్రీ మనుమడు : చి॥ రిషిక్

ప్రవృత్తి	:	పద్యరచన, అష్టావధానములు చేయుట, తిరుమల తిరుపతి దేవస్థానముల పక్షాన ధార్మిక ఉపన్యాసములు
నిర్వహించిన బాధ్యతలు	:	ఆస్థానపండితులు, మారుతీ ఆశ్రమము, అల్లూరు అధ్యక్షులు, సంస్కృత భారతి, నెల్లూరు జనపదము ఆకాశవాణి, దూరదర్శన్, 'మా'టీవీలలో ప్రసంగములు
రచనలు	:	1. శ్రీ పోలేరమ్మ స్తుతిమాలిక 2. రోజుకోపద్యం శంకరాభరణం (పద్యకదంబం) 3. రోజుకోపద్యం శంకరాభరణం (పద్యపంచశతి) 4. శాశ్వత దిన దర్శిక (1900 నుండి 2300 వరకు) 5. వివేకానంద వాణి 6. తెలుగు పద్య వైభవము
పురస్కారములు	:	ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు (ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము వారిచే 2013 లో); తిరుపతిలో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలలో అవధానిగా సన్మానం
బిరుదము	:	'అవధాని శేఖర' బిరుదము - కళాదీప్తి, నెల్లూరు వారిచే (2017 లో)
సత్కారము	:	ఆస్థానపండితుడుగా సత్కారము, పుష్పకిరీట సన్మానము శ్రీసత్యానందాశ్రమము, ఇనమడుగు వారిచే(2020 లో)
చరవాణి	:	9966236604
ఇమెయిల్	:	rsekhar.kota@gmail.com





శ్రీ కోట రాజశేఖర్ గారి తల్లిదండ్రులు

కీ.శే. కోట సారంగపాణి - కీ.శే. కోట సక్కుబాయమ్మ



సహధర్మచారిణి శ్రీమతి కోట గిరిజాకుమారితో శ్రీ కోట రాజశేఖర్



చిక్కని తేనె ఫుల్లసరసీజమునుండి స్రవించినట్లు, నీ
చక్కని శైలి పద్యముల సాగగ, పావన రామగాథపై
మక్కువ పొంగిపోవ రసమంజుల కావ్యము వ్రాసినావు–

– ప్రముఖ అవధానకవి
నరాల రామారెడ్డి



శ్రీమద్రామాయణం బాలకాండలోని బుల్లిబుల్లి శ్లోకాలను ఆంధ్రపద్యీకరించడంలో తత్తద్భావానుగుణంగా విభిన్నచ్ఛందస్సులను స్వీకరించి శ్లోకాలను కలుపుకొంటూ (అవసరమైన తావుల) పద్యరచన చేశాడు చిరంజీవి కోట రాజశేఖర్......
సరళ సహజ శైలీమాధుర్యంతో ఈ కావ్యరచనలో తాను ఆశించినంత మేర కృతకృత్యుడయ్యాడు.

- డా॥ సూరం శ్రీనివాసులు



సుప్రసన్న కవిత్వ శోభిత ప్రతిభావిభూషిత భావుక బుద్ధిబలుఁడు
శ్రీరామచంద్ర పాదారవింద మరందసేవనానంద సంభావితమతి
నిత్య వాఙ్మయోపాసనా నిష్ఠితుండు కోట రాజశేఖర కవీట్కుంజరుండు.

– పంచసహస్రావధాని
డా॥ మేడసాని మోహన్



“చరితం రఘునాథస్య శతకోటిప్రవిస్తరమ్”

రామకార్యంలో ఉడతాభక్తి అన్నట్లుగా శ్రీ సీతారామకల్యాణము (శ్రీమద్రామాయణము–బాలకాండము–పద్యసప్తశతి) గ్రంథముద్రణ కొఱకు ధనమును సమర్పించుకొనగలగడం నా భాగ్యవిశేషం.

– భాగవత ఉపన్యాసకులు
అడవికొలను వేంకట్ (వేంకటేశ్వర్లు), USA